# మనసులో మాట

KANCHARLA

నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం..

సంచలన తెలుగు దిన పత్రిక

ప్రచురణ : విశాఖపట్నం -పబ్లిషర్ : కంచర్ల ఉపేంద్ర -సంపుటి : 1 -సంచిక : 315-బుధవారం-15 జూలై 2026-ఎడిటర్ : కంచర్ల అచ్యుతరావు- పేజీలు :8+16-వెల రూ.7/-

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం,తూర్పగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణ,గుంటురు,ప్రకాశం,తిరుపతి,నెల్లూరు,కర్నూలు,కడప,హైదరాబాద్







## భారత్‌లోకి అమెరికా మాజీ సైనికులు!



- మరోసారి అక్రమ చొరబాట్ల కలకలం
- యూపీ సరిహద్దులో మాజీ నేవీ అధికారి అరెస్ట్
- మయన్మార్ మిలిటెంట్లతో సంబంధాలు
- నేపాల్ సరిహద్దు దాటేందుకు యత్నిస్తుండగా అరెస్ట్

3

## బంగ్లాదేశ్‌కు షేక్ హసీనా రాకపై ఉత్కంఠ



- స్వదేశానికి వస్తే చట్టపరమైన చర్యలు తప్పవని బంగ్లాదేశ్ మంత్రి వ్యాఖ్య
- అరెస్టు, జైలు శిక్షకు సిద్ధమేనని షేక్ హసీనా ప్రకటన
- కోర్టు తీర్పు మేరకే తదుపరి చర్యలు ఉంటాయని స్పష్టం

4

## ఇరాన్ సైనిక సామర్థ్యం పూర్తిగా ధ్వంసం



- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన
- హర్మూజ్ నౌకలపై రక్షణకు 20 శాతం టోల్ బాదుడు

యూఎస్ కాంగ్రెస్‌కు అధికారిక సమాచారం

4

## ఓటర్ల జాబితా సవరణ గడువు పొడిగింపు

- కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం
- జులై 24 వరకు అవకాశం కల్పించిన ఈసీ
- రాజకీయ పార్టీల విజ్ఞప్తులతో కదిలిన ఈసీ
- క్షేత్రస్థాయి పరిస్థితుల ఆధారంగా కీలక ఉత్తర్వులు
- మంగళవారంతోతో ముగియాల్సిన సర్
- సాంకేతిక కారణాల వల్ల గడువు పెంచిన అధికారులు

3



## ప్రభుత్వ నిర్లక్ష్యమే మత్స్యకారుల ప్రాణాలు బలిగొంది



బాధిత కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున పరిహారం, కొత్త బోటు ఇవ్వాలి

బాధితులకు న్యాయం జరిగే వరకు వైయస్ఆర్‌సీపీ అండగా ఉంటుంది

మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి

ప్రమాదం జరిగిన వెంటనే స్పందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.

త్రిసభ్య కమిటీ నివేదిక ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చే ప్రయత్నమే

2



# రూ.35,313 కోట్లతో 36 ప్రాజెక్టులు పూర్తి

రాబోయే మూడేళ్లలో రూ.35,313 కోట్లతో 36 ప్రాధాన్య ప్రాజెక్టులు పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు లక్ష్యం

ప్రతి ప్రాజెక్టుకు ప్రారంభ, పూర్తి తేదీలతో సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు ఆదేశం

పోలవరం పునరావాసాన్ని వేగవంతం చేసి డిసెంబరులోపు పూర్తి చేయాలని సీఎం సూచన

పోలవరం తొలి దశ పూర్తికాగానే రెండో దశ పనులు ప్రారంభిస్తామని స్పష్టం

ఈ నెల 18లోపు పోలవరం పెండింగ్ నిధులపై నివేదిక సమర్పించాలని అధికారులకు ఆదేశాలు

**అమరావతి, జూలై 14 (మనసులో మాట):**

'ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే మూడేళ్లలో 36 ప్రాధాన్య ప్రాజెక్టులు పూర్తిచేస్తాం. ఇందుకు రూ.35,313 కోట్లు ఖర్చుచేసేలా ప్రణాళిక రూపొందించాం. ఈ ప్రణాళికను మరింత సూక్ష్మంగా తయారుచేయండి. ఏ ప్రాజెక్టు ఏ తేదీకి పూర్తి చేసి ప్రారంభిస్తామో ఆ తేదీలతో సమగ్ర ప్రణాళిక తయారుచేసి తీసుకురండి. మళ్లీ సమగ్రంగా సమీక్షిద్దాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. 'సాస్కి, ప్రపంచబ్యాంకు నిధులు, ఇతర నిధులతో ఆర్థికశాఖ, జలవనరులశాఖ కలిసి సిద్ధం చేసిన ఈ ప్రణాళికను మరింత పకడ్బందీగా రూపొందించాలి. ప్రారంభ తేదీ నిర్ణయించి, లక్ష్యం నిర్దేశించుకుని వేగంగా పనులు పూర్తిచేయాలి' అన్నారు. పోలవరంలో సోమవారం ఆయన సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. జలవనరులశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి శశిభూషణ్, ఈఎన్‌సీ నరసింహమూర్తి, పునరావాస కమిషనర్ ప్రశాంతి ఆయా అంశాలపై సీఎంకు ప్రజంటేషన్ ఇచ్చారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, ఆర్థికశాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్‌లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. వివరాలు ఇవీ..పోలవరంలో పునరావాసం పూర్తిచేసేందుకు నెలకు రూ.300 కోట్లు ఖర్చుచేసేలా ప్రణాళిక

మిగతా 2వ పేజీలో..

ఎత్తిపోతల పథకాల నిర్వహణకు రూ.5,583 కోట్ల ప్రణాళిక.. త్వరలో టెండర్లకు గ్రీన్ సిగ్నల్



## నెలవారీ ఆర్థిక నివేదికతో దేశంలోనే సరికొత్త పరిపాలనా విధానానికి శ్రీకారం

- డేటా ఆధారిత సుపరిపాలన, జీరో పెండెన్సీ, క్షేత్రస్థాయి పర్యవేక్షణతో స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనే ప్రభుత్వ ధ్యేయం
- రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారధి

3



2

## అప్పలరాజుపై చర్యలు తీసుకోవాలి.. యాదవుల ఆందోళన

- పలాసలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుకు వ్యతిరేకంగా యాదవుల భారీ ర్యాలీ
- గొర్రెల కాపరి దానయ్య కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్

# 4,196 ఎకరాల్లో ప్రైవేటు పారిశ్రామిక పార్కులు



3

- ఏర్పాటుకు 8 సంస్థలకు ప్రభుత్వ అనుమతి
- రూ.1,720 కోట్లతో మౌలిక సదుపాయాలు
- పరిశ్రమలకు భూములు అందుబాటులో ఉంచడమే లక్ష్యం

**అమరావతి, జూలై 14 (మనసులో మాట):**

రాష్ట్రంలో 8 చోట్ల ప్రైవేటు పారిశ్రామిక పార్కులు ఏర్పాటవుతున్నాయి. వీటి ద్వారా పరిశ్రమల ఏర్పాటుకు 4,196.55 ఎకరాల భూమి అందుబాటులోకి రానుంది. ఈ పార్కుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.1,720.88 కోట్లు వెచ్చించనున్నారు. రాష్ట్రంలో ప్రైవేటు పారిశ్రామిక పార్కులను ప్రోత్సహించేందుకు వీలుగా ఏపీ ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్క్స్, మిగతా 3వ పేజీలో..



## విద్యుత్ వినియోగదారులకు తీపికబురు

- రూ.940 కోట్లు ట్రూడౌన్
- వరుసగా రెండో ఏడాదీ తగ్గనున్న ఛార్జీలు
- ఏపీఈఆర్‌సీలో పిటిషన్ దాఖలు చేసిన డిస్కంలు

2



# రూ.35,313 కోట్లతో 36 ప్రాజెక్టులు పూర్తి

(మొదటి పేజీ తరువాయి)



రూపొందించామని ప్రశాంతి చెప్పారు. డిసెంబరుకల్లా పునరావాసం పూర్తిచేయాలని సీఎం నిర్దేశించగా 2027 మార్చి వరకు సమయం కోరారు. పోలవరం తొలిదశ పూర్తవ్వగానే రెండోదశ పనులు ప్రారంభిస్తామని సీఎం అన్నారు. ఈ నెల 18న ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వస్తున్నారని, ఆ లోపు తొలిదశకు కావాల్సిన పెండింగ్ నిధులపై తమకు నివేదిక ఇవ్వాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఆ ప్రతిపాదనలు పోలవరం అథారిటీకి ఇచ్చి తనకూ పంపాలన్నారు. పోలవరంలో టూరిజం ప్రణాళికపై జపాన్ కంపెనీ ఇచ్చిన ప్రజంటేషన్ చూశారు. అమరావతిలో మంగళవారం ఈ అంశాన్ని సమీక్షిద్దామన్నారు. వెలిగొండ పనులు ఆగస్టు నెలాఖరుకు పూర్తి కావాలన్నారు.

నీటిపారుదల కార్పొరేషన్ కింద రాష్ట్రంలో ఉన్న ఎత్తిపోతల పథకాలను దారిలో పెట్టి నిర్వహించేందుకు రూ.5,583 కోట్లు ఖర్చవుతుందని అధికారులు పేర్కొన్నారు. అంచనాలు సవరిస్తున్నామని ఆర్థికశాఖ అధికారులు తెలిపారు. త్వరలో టెండర్లు పిలవాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో ఎం కాడ్వామ్ పథకం కింద పెద్దగడ్డ ప్రాజెక్టు కింద నాలుగు క్లస్టర్లు, పార్వతీపురం మన్యం జిల్లాలో చేసే పనుల్ని సీరియస్‌గా తీసుకోవాలని, ఆరునెలల్లో పూర్తిచేయాలని సీఎం ఆదేశించారు.

**ఉపాధి హామీ కింద రూ.2,500 కోట్ల రికార్డు ఖర్చు**

ఉపాధి హామీ కింద ఈ మూడు నెలల్లో రూ.2,500 కోట్లు ఖర్చుచేశామని ఆర్థికశాఖ కార్యదర్శి రోనాల్డ్ చెప్పారు. దేశంలోనే ఇది రికార్డు స్థాయిలో ఖర్చని పేర్కొన్నారు. రూ.13వేల కోట్లు ఈ ఏడాది తీసుకురావాలనేది లక్ష్యంగా చెప్పారు. జలధారపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సమావేశంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, పార్థసారథి, ఎమ్మెల్యేలు పితాని సత్యనారాయణ, బాలరాజు, సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్సీ వరప్రసాద్, చీఫ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

# కల్పిత ప్రచారాలతో ప్రజలను మభ్యపెడుతున్నారు

**తిరుపతి, మనసులో మాట:**

రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న అసలు సమస్యలను పక్కనపెట్టి, అమరావతి అభివృద్ధి పేరుతో అవాస్తవ ప్రచారాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి విమర్శించారు. అమరావతిలో "మినీ అమెజాన్" నిర్మిస్తున్నట్లు వస్తున్న ప్రచారాలపై ఆయన వ్యంగ్యంగా స్పందించారు. ప్రజలకు ఉపాధి, అభివృద్ధి, సంక్షేమంపై స్పష్టమైన కార్యాచరణ చూపాల్సిన ప్రభుత్వం, ఊహాజనిత ప్రాజెక్టులతో ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోందని అన్నారు. తిరుపతిలో మీడియాతో మాట్లాడిన ఆయన, రాష్ట్ర ప్రజల అవసరాలపై దృష్టి పెట్టాలని ప్రభుత్వానికి సూచించారు.

భూమన కరుణాకర రెడ్డి ఏమన్నారంటే..

**అమరావతిలో మినీ అమెజాన్ అంటూ తప్పుడు ప్రచారమా?**

అమరావతిలో ఐదు ఎకరాల్లో 20 వేలకుపైగా చెట్లు, 400 రకాల మొక్కలు, కృత్రిమ సెలయేళ్లు, పొగమంచు వాతావరణం, జీవవైవిధ్య అభివృద్ధి వంటి అంశాలతో "మినీ అమెజాన్" ఏర్పాటు చేస్తున్నట్లు ప్రచారం చేయడం ఆశ్చర్యకరమన్నారు. అంతే కాకుండా అక్కడ ఉష్ణోగ్రతను నాలుగు డిగ్రీలు తగ్గిస్తామని చెప్పడం కూడా ప్రచార ఆర్భాటమేనని వ్యాఖ్యానించారు. ఇలాంటి ప్రచారాలు చేస్తుంటే అమరావతిలో ఏడు ఎకరాల్లో పసిఫిక్ మహాసముద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలని, టైటానిక్ నౌకను తీసుకురావాలని, హిమాలయ పర్వతాలను కూడా నిర్మించాలని వ్యంగ్యంగా అన్నారు. ఇంద్రుని అమరావతిని మించిన అమరావతిని నిర్మిస్తున్నామని కూడా ప్రకటించవచ్చని ఎద్దేవా చేశారు.

**ప్రజల సమస్యలు వదిలి ప్రచారాలేనా?**

రాష్ట్రంలో అత్యధికంగా దిగువ, మధ్యతరగతి ప్రజలు జీవిస్తున్నారని, వారి జీవన సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం కల్పిత ప్రచారాలతో కాలం గడుపుతోందని విమర్శించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలు, సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి పెట్టాల్సింది పోయి ప్రచారానికే పరిమితమవుతోందన్నారు. రాష్ట్రంలోని అన్ని విమానాశ్రయాల్లో బార్లు తెరిచిన ప్రభుత్వం సచివాలయంలో ఉద్యోగులకు కూడా ప్రత్యేక బార్ ఏర్పాటు చేయవచ్చని, హైకోర్టు సమీపంలో కూడా బార్ ఏర్పాటు చేయాలని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ మొత్తాన్ని ఎయిర్ కండీషనింగ్ చేస్తామని కూడా అధికార అనుకూల పత్రికల ద్వారా ప్రజలను నమ్మించే ప్రయత్నం చేయవచ్చని ఎద్దేవా చేశారు. ప్రచారాలకు బదులుగా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని భూమన కరుణాకర రెడ్డి సూచించారు. ప్రజలకు వాస్తవ ప్రయోజనం చేకూర్చే నిర్ణయాలు తీసుకోవడం ద్వారానే ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు.

# అప్పలరాజుపై చర్యలు తీసుకోవాలి.. యాదవుల ఆందోళన

**పలాస:జూలై 14 (మనసులో మాట):**

శ్రీకాకుళం జిల్లా పలాసలో వైకాపా నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుకు వ్యతిరేకంగా యాదవులు ఆందోళనకు దిగారు. పట్టణంలోని శ్రీనివాస లాడ్జి కూడలి నుంచి మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. గొర్రెల కాపరి దానయ్య కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అప్పలరాజు కుమారుడు ఆరవ్ వర్మ నిర్లక్ష్యంగా బైక్ నడపటంతో గొర్రెలకాపరి దానయ్య మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే ఈ ప్రమాదంపై సాక్ష్యాలను అప్పలరాజు తారుమారు చేశారని.. ఆయన్ను శిక్షించాలని యాదవులు డిమాండ్ చేశారు. ఈ కేసు నుంచి తన కుమారుడిని తప్పించేందుకు సీదిరి అప్పలరాజు పన్నిన పన్నాగం బెడిసికొట్టింది. నేరానికి పాల్పడిన తన కుమారుడి స్థానంలో అప్పటికప్పుడు మరొకరిని ప్రవేశపెట్టి వ్యవస్థలు, వ్యక్తులను మేనేజ్ చేసినా ఆ గుట్టు రట్టైంది. నేరాన్ని కప్పిపుచ్చడం, పోలీసుల్ని తప్పుదారి పట్టించడం, నిందితుడ్ని ఘటనా స్థలం నుంచి ఆగమేఘాలపై తప్పించడం, సాక్ష్యాధారాలు మాయం చేయడానికి యత్నించడం, తన అనుచరులను రంగంలోకి దించి బాధితుడి కుటుంబంతో రాజీకి ప్రయత్నించడం.. ఇలా మొత్తం కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వమంతా నడిపించి విషయం బయటకు రాకుండా తొక్కిపెట్టాలని చూసినా ఫలించలేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో సీదిరి అప్పలరాజు తన కుమారుడు ఆరవ్ వర్మను సోమవారం పోలీసుల ఎదుట లొంగిపోయేలా చేశారు. బీఎన్ఎస్‌లోని పలు సెక్షన్ల కింద ఆరవ్‌పై కేసు నమోదుచేశారు. నేరాన్ని కప్పిపుచ్చేందుకు కుట్ర పన్నిన సీదిరి అప్పలరాజుపై మాత్రం కేసు పెట్టలేదు. ఈ నేపథ్యంలో యాదవులు ర్యాలీ నిర్వహించి ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



# విద్యుత్ వినియోగదారులకు తీపికబురు

- **రూ.940 కోట్లు ట్రూడౌన్**
- **వరుసగా రెండో ఏడాదీ తగ్గనున్న ఛార్జీలు**
- **ఏపీఈఆర్‌సీలో పిటిషన్ దాఖలు చేసిన డిస్కంలు**



విద్యుత్ వినియోగదారులకు కూటమి ప్రభుత్వం తీపికబురు చెప్పబోతోంది. వరుసగా రెండో ఏడాదీ వినియోగదారులకు విద్యుత్ ఛార్జీలు తగ్గనున్నాయి. 202526 ఆర్థిక సంవత్సరానికి రూ.940.07 కోట్లు ట్రూడౌన్ చేయబోతోంది. విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఎదుట పిటిషన్లు దాఖలుచేశాయి. వాటిని పరిశీలించి అనుమతించిన ఖర్చులు పోను.. ట్రూడౌన్ కింద వినియోగదారుల బిల్లులో ఎంత తగ్గించాలనే దానిపై కమిషన్ నిర్ణయం తీసుకోనుంది. 202425లో డిస్కంలు రూ.924 కోట్లు ట్రూడౌన్ చేశాయి. విద్యుత్ వినియోగదారులపై అదనపు ఛార్జీల భారం వేయబోమని ఎన్నికల సమయంలో కూటమి హామీ ఇచ్చింది. అందుకు అనుగుణంగా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో విద్యుత్ వినియోగదారులపై అదనపు ఛార్జీలు వేయకుండా జాగ్రత్తలు తీసుకుంది. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో ట్రూఅప్, ఇంధన సర్‌ఛార్జి, విద్యుత్ సుంకం పేర్లతో రూ.32,166 కోట్ల భారం వినియోగదారులపై వేసింది.

**ట్రూడౌన్ లెక్కలు ఇవి**

202526లో మూడు డిస్కంలు 70,884.71 మిలియన్ యూనిట్ల (ఎంయూ) విద్యుత్ విక్రయించాయి. యూనిట్ విద్యుత్ కొనుగోలుకు ఏపీఈఆర్‌సీ అనుమతించిన మొత్తం కంటే.. అధిక ధరకు విద్యుత్ కొనడంతో ఇంధన సర్దుబాటు ఛార్జీల (ఎఫ్‌పీపీసీఏ) కింద రూ.1,918.32 కోట్లు వినియోగదారుల నుంచి వసూలు చేయాల్సి ఉంటుందని డిస్కంలు లెక్కలు తేల్చాయి. ప్రతినెలా వినియోగదారుల నుంచి యూనిట్‌కు 40 పైసల చొప్పున ఎఫ్‌పీపీసీఏ కింద డిస్కంలు విద్యుత్ బిల్లులో కలిపి వసూలుచేశాయి. ఇలా వసూలు చేసిన మొత్తం రూ.2,800.28 కోట్లు. వినియోగదారుల నుంచి ఇప్పటికే వసూలు చేసిన రూ.2,800.28 కోట్లలో.. ఎఫ్‌పీపీసీఏ కింద సర్దుబాటు చేయాల్సిన మొత్తం రూ.1,918.32 కోట్లు పోను మిగులు రూ.881.96 కోట్లుగా డిస్కంలు పిటిషన్‌లో పేర్కొన్నాయి. ఈ మొత్తానికి క్యారీయింగ్ కాస్ట్ కింద అదనంగా చూపిన మొత్తం రూ.58.11 కోట్లు కలిపి ట్రూడౌన్ కింద రూ.940.07 కోట్లు సర్దుబాటు చేయాలని డిస్కంలు కమిషన్‌కు సమర్పించిన లెక్కల్లో పేర్కొన్నాయి. బహిరంగ మార్కెట్ కొనుగోళ్ల నియంత్రణ: వినియోగదారులపై ట్రూఅప్ ఛార్జీల భారాన్ని తగ్గించేందుకు బహిరంగ మార్కెట్ కొనుగోళ్లను ప్రభుత్వం నియంత్రించింది. దీంతోపాటు యూనిట్ విద్యుత్ కొనుగోలుకు చేసే సగటు వ్యయాన్ని తగ్గించింది. విద్యుత్ కేంద్రాల అంతర్గత సామర్థ్యాన్ని పెంచి.. ఉత్పత్తి పెంచింది. దీంతో అధికధరకు బహిరంగ మార్కెట్ నుంచి కొనుగోళ్లు తగ్గాయి.

అంతర్గత సామర్థ్యం పెంపు: కృష్ణపట్నం థర్మల్ విద్యుత్ కేంద్రంలోని మూడు యూనిట్ల (ఒక్కొక్కటి 800 మెగావాట్లు) పనితీరు మెరుగుపరిచారు. 202324లో సగటు విద్యుత్ కొనుగోలు వ్యయం యూనిట్‌కు రూ.5.42 చొప్పున ఉంది. దీన్ని 202526లో రూ.4.90కు తగ్గించారు.

రూ.20,288 కోట్లు ప్రభుత్వమే భరించింది

డిస్కంలు దాఖలు చేసిన పిటిషన్ ఆధారంగా 201924 మధ్య కాలానికి ట్రూఅప్ కింద రూ.4,498 కోట్ల వసూలుకు కమిషన్ అనుమతించింది. ఈ మొత్తాన్ని వినియోగదారులపై భారం వేయకుండా.. ప్రభుత్వమే భరించింది. 202627కు డిస్కంలు దాఖలుచేసిన వార్షిక ఆదాయ అవసరాల నివేదిక(ఏఆర్ఆర్)లో రెవెన్యూ లోటు కింద చూపిన రూ.15,790 కోట్లు ప్రభుత్వమే భరించింది.





# తముటు గ్రామానికి మంజూరైన రోడ్డు,వంతెన పనులు వెంటనే ప్రారంభించాలి

- **గిరిజన గ్రామస్తుల ఆవేదన**

**అనంతగిరి,జులై 14 మనసులో మాట**

అల్లూరి జిల్లా అనంతగిరి మండలం పినకోట గ్రామ పంచాయతీ పరిధిలో తముటు గ్రామానికి మంజూరైన రహదారి, వంతెన (బ్రిడ్జి) నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నో ఏళ్లుగా సరైన రహదారి, వంతెన లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రహదారి, వంతెన నిర్మాణానికి ఆమోదం తెలిపినప్పటికీ, ఇప్పటివరకు సంబంధిత అధికారులు పనులు ప్రారంభించకపోవడంపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. నిత్యావసర సరుకుల రవాణా, అత్యవసర వైద్య సేవలు, విద్యార్థుల రాకపోకలు అన్నీ ఇదే మార్గంపై ఆధారపడుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో వాగును దాటడం అత్యంత ప్రమాదకరంగా మారుతుందని, ప్రతి ప్రయాణం ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని సాగించాల్సిన పరిస్థితి నెలకొంటోందని గ్రామస్తులు వాపోయారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆసుపత్రికి తరలించడం కూడా కష్టసాధ్యంగా మారుతోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తమ గోడును ఆలకించి వెంటనే రహదారి, వంతెన పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. అలాగే



అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్పందించి సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేసి పనులు ప్రారంభించేలా చూడాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో గ్రామ మహిళలు, పెద్దలు, యువకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యమే మత్స్యకారుల ప్రాణాలు బలిగొంది

- **బాధిత కుటుంబాలకు రూ.1 కోటి చొప్పన పరిహారం, కొత్త బోటు ఇవ్వాలి**
- **బాధితులకు న్యాయం జరిగే వరకు వైయస్ఆర్‌సీపీ అండగా ఉంటుంది**
- **మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి**
- **ప్రమాదం జరిగిన వెంటనే స్పందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.**
- **త్రిసభ్య కమిటీ నివేదిక ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చే ప్రయత్నమే.**
- **ప్రమాద స్థలానికి సమీపంలోనే కోస్ట్‌గార్డ్, మెరైన్ పోలీసు వ్యవస్థ ఉన్నా సమర్థవంతమైన రక్షణ చర్యలు చేపట్టలేదు.**
- **బాధిత కుటుంబాలకు రూ.1 కోటి చొప్పన పరిహారం ఇవ్వాలి.**
- **ప్రమాదంలో నష్టపోయిన బోటుకు బదులుగా కొత్త బోటు అందించాలి.**
- **ప్రభుత్వం తన బాధ్యతను అంగీకరించి బాధిత కుటుంబాలకు క్షమాపణ చెప్పాలి.**
- **భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా అత్యవసర స్పందన వ్యవస్థను బలోపేతం చేయాలి.**
- **వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి ఎన్నో చారిత్రక నిర్ణయాలు తీసుకుంది.**
- **బాధితులకు న్యాయం జరిగే వరకు వైయస్ఆర్‌సీపీ పోరాటం కొనసాగుతుంది.**

**విశాఖ, మనసులో మాట:**

విశాఖ బోటు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మత్స్యకారుల కుటుంబాలను పరామర్శించిన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి, ఈ దుర్ఘటనలో ప్రభుత్వ స్పందన తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే సమర్థవంతమైన సహాయక చర్యలు చేపట్టి ఉంటే మరింత మంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉండేదని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చేందుకే త్రిసభ్య కమిటీ నివేదికను ఉపయోగిస్తున్నారని ఆరోపిస్తూ, బాధిత కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.1 కోటి చొప్పున పరిహారం, ప్రమాదంలో నష్టపోయిన బోటుకు బదులుగా కొత్త బోటును ప్రభుత్వం వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు పూర్తి న్యాయం జరిగే వరకు వైయస్ఆర్‌సీపీ అండగా ఉంటుందని, వారి తరఫున నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన అనంతరం వైయస్ జగన్ మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

**సమయానికి స్పందించి ఉంటే ప్రాణాలు దక్కేవి**

ప్రమాదానికి గురైన బోటు తీరం నుంచి కేవలం 10 నాటికల్ మైళ్ల దూరంలోనే ఉండగా, రక్షణ చర్యల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకోవడం అత్యంత బాధాకరమని వైయస్ జగన్ అన్నారు. కుటుంబ సభ్యులు ఫిషరీస్ శాఖ, మెరైన్ పోలీసు, జిల్లా యంత్రాంగానికి వరుసగా సమాచారం అందించినప్పటికీ, ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోలేదన్నారు. సమన్వయంతో సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి ఉంటే మరింత మంది ప్రాణాలు దక్కేవని పేర్కొన్నారు.



**వాస్తవాలను దాచే ప్రయత్నమే కమిటీ నివేదిక**

ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ నివేదికలో బాధిత కుటుంబాలకు సమాచారం ఆలస్యంగా అందిందని పేర్కొనడంపై వైయస్ జగన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అసలు ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చేందుకు నివేదికను ఉపయోగిస్తున్నారని విమర్శించారు. జరిగిన తప్పును అంగీకరించి బాధ్యత తీసుకోవాల్సింది పోయి వాస్తవాలను వక్రీకరించడం బాధ్యతాయుత పాలన కాదన్నారు.

**బాధిత కుటుంబాలకు పూర్తి న్యాయం చేయాలి**

ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఈ దుర్ఘటన మరింత విషాదంగా మారిందని పేర్కొన్న వైయస్ జగన్, ప్రాణాలు కోల్పోయిన ఆరుగురు మత్స్యకారుల కుటుంబాలతో పాటు ప్రాణాలతో బయటపడిన మత్స్యకారుడికి కూడా కలిపి మొత్తం ఏడుగురికి ఒక్కో కుటుంబానికి రూ.1 కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో నష్టపోయిన బోటుకు బదులుగా కొత్త బోటును ప్రభుత్వం అందించాలని కోరారు.

**మత్స్యకారుల పట్ల వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వ చిత్తశుద్ధి**

తమ ప్రభుత్వ హయాంలో మత్స్యకారుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చామని వైయస్ జగన్ గుర్తు చేశారు. మత్స్యకారుల మరణాలపై ఎక్స్‌గ్రేషియాను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడంతో పాటు, విదేశాల్లో చిక్కుకున్న మత్స్యకారులను స్వదేశానికి తీసుకురావడం, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టడం, విశాఖ ఫిషింగ్ హార్బర్ అగ్నిప్రమాద బాధితులకు వెంటనే పరిహారం అందించడం వంటి అనేక సంక్షేమ చర్యలు చేపట్టామని వివరించారు.

**ప్రతి రంగంలోనూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు**

రాష్ట్రంలో విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమం వంటి అన్ని రంగాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వైయస్ జగన్ పేర్కొన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందడం లేదని, ఆరోగ్యశ్రీ నిర్వీర్యమైందని, రైతులకు గిట్టుబాటు ధరలు, ఉచిత పంటల బీమా లేక ఇబ్బందులు పెరిగాయని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో కూడా ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.

**బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం**

బోటు ప్రమాద బాధిత కుటుంబాలకు పూర్తి న్యాయం జరిగే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వారి పక్షాన పోరాటం కొనసాగిస్తుందని వైయస్ జగన్ స్పష్టం చేశారు. ప్రభుత్వం తన బాధ్యతను అంగీకరించి తగిన పరిహారం, జీవనాధార సహాయం అందించడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు అండగా వైయస్ఆర్‌సీపీ ఎల్లప్పుడూ ఉంటుందని, న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని హామీ ఇచ్చారు.

# నెలవారీ ఆర్థిక నివేదికతో దేశంలోనే సరికొత్త పరిపాలనా విధానానికి శ్రీకారం

- •డేటా ఆధారిత సుపరిపాలన, జీరో పెండెన్సీ, క్షేత్రస్థాయి పర్యవేక్షణతో స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనే ప్రభుత్వ ధ్యేయం
- రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారథి




**అమరావతి, జులై 14:**

రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రం ఇప్పటి వరకు అమలు చేయని సరికొత్త పరిపాలనా విధానానికి నాంది పలికిందని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారథి తెలిపారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా ఆర్థిక నివేదికలు వార్షిక ప్రాతిపదికన మాత్రమే రూపొందించే ఆనవాయితీ ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు ప్రతి నెలా "నెలవారీ ఆర్థిక నివేదిక (Monthly Economic Report)" రూపొందించే వినూత్న విధానాన్ని ప్రారంభించడం చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు.

సోమవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ నెలవారీ ఆర్థిక నివేదిక ద్వారా రాష్ట్రంలోని అన్ని శాఖల పనితీరు, ఆదాయవ్యయాలు, అభివృద్ధి సూచికలు, సంక్షేమ కార్యక్రమాల అమలు, లక్ష్యాల పురోగతి, ప్రజలకు అందుతున్న సేవల ప్రభావం వంటి అంశాలను సమగ్రంగా సమీక్షించే అవకాశం లభిస్తుందని వివరించారు. ఇది కేవలం ఒక నివేదిక మాత్రమే కాకుండా, ప్రభుత్వ పరిపాలనకు దిశానిర్దేశం చేసే ప్రామాణిక పత్రంగా నిలుస్తుందని తెలిపారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు తన అపారమైన పరిపాలనా అనుభవాన్ని, ఆర్థిక అవగాహనను, భవిష్యత్ దృష్టిని సమన్వయం చేసి ఈ విధానానికి రూపకల్పన చేశారని మంత్రి కొనియాడారు. రాష్ట్ర పరిపాలనను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా, ఫలితాల ఆధారంగా తీర్చిదిద్దేందుకు ఈ నివేదిక కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు.

ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, సమస్యలను వేగంగా పరిష్కరించడం, ప్రభుత్వ యంత్రాంగాన్ని మరింత చురుకుగా మార్చడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఇందుకోసం రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (RTGS) వద్ద అందుబాటులో ఉన్న ప్రత్యక్ష సమాచారాన్ని, కృత్రిమ మేధస్సు (AI) సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించి డేటా ఆధారిత పరిపాలన (Data Driven Governance) అమలు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు, మంత్రులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ప్రజల సమస్యలను రియల్ టైమ్‌లో గుర్తించి, వెంటనే పరిష్కరించే విధంగా ప్రతి శాఖ పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించినట్లు వెల్లడించారు.

గత ఐదేళ్లలో రాష్ట్రం ఎదుర్కొన్న ఆర్థిక సంక్షోభం నుంచి కేవలం రెండేళ్ల వ్యవధిలోనే రాష్ట్రాన్ని గాడిలో పెట్టగలిగిన ఘనత ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడి పరిపాలనా దక్షత, ఆర్థిక క్రమశిక్షణ, దూరదృష్టికే చెందుతుందని మంత్రి పేర్కొన్నారు. ఈ రెండేళ్లలో రాష్ట్రం ఆర్థిక, పారిశ్రామిక, వ్యవసాయ, మౌలిక సదుపాయాలు, సంక్షేమం వంటి అన్ని రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించిందని తెలిపారు.

స్వర్ణాంధ్ర2047 లక్ష్యాలను సాధించేందుకు రాష్ట్రం ప్రతి సంవత్సరం కనీసం 15 శాతం ఆర్థిక వృద్ధి (Growth Rate) నమోదు చేయడంతో పాటు, 20 నుంచి 25 శాతం వరకు ఆదాయ వృద్ధి (Revenue Growth) సాధించేలా అన్ని శాఖలు లక్ష్య బద్ధంగా పనిచేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని మంత్రి తెలిపారు. ప్రతి నెలా నెలవారీ ఆర్థిక నివేదిక ఆధారంగా శాఖల పురోగతిని సమీక్షించి, తదుపరి నెల లక్ష్యాలను నిర్ణయిస్తూ పరిపాలనను ఫలితాల దిశగా నడిపించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేసినట్లు చెప్పారు.

ఈ విధానాల ద్వారా నిరుద్యోగ సమస్యను గణనీయంగా తగ్గించడం, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడం, పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేయడం, ప్రజల ఆదాయాలను పెంచడం, జీవన ప్రమాణాలను మెరుగుపరచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. ప్రత్యేకంగా PGRS (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ)లో "జీరో పెండెన్సీ" ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టంగా ఆదేశించారని మంత్రి వెల్లడించారు. ప్రజావేదికలు, ప్రజా దర్బార్లు, జిల్లా పర్యటనల సందర్భంగా ప్రజల నుంచి అందుతున్న ప్రతి వినతిని మానవీయ దృక్పథంతో పరిశీలించి, ఎలాంటి పెండింగ్ లేకుండా వేగంగా పరిష్కరించాలని సూచించినట్లు తెలిపారు.

గత ప్రభుత్వ పాలనలో పరిపాలనా నిర్లక్ష్యం, కక్షపూరిత వైఖరి, ముఖ్యంగా రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యల కారణంగా వేలాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న విషయాన్ని ముఖ్యమంత్రి సమావేశంలో ప్రస్తావించినట్లు మంత్రి తెలిపారు. ప్రజల సమస్యలను కేవలం కార్యాలయ విధులుగా కాకుండా, బాధిత కుటుంబాల జీవన పరిస్థితులను అర్థం చేసుకుంటూ మానవీయ కోణంలో పరిష్కరించాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశించినట్లు వెల్లడించారు.

ప్రజలకు ఇబ్బందులు కలిగించే పాత చట్టాలు, కాలానుగుణంగా అనవసరంగా మారిన నిబంధనలను సమీక్షించి, అవసరమైతే వాటిలో సవరణలు చేయడానికైనా, కొత్త చట్టాలను తీసుకురావడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేసినట్లు మంత్రి తెలిపారు. ప్రజా ప్రయోజనమే ప్రభుత్వ నిర్ణయాలకు కేంద్రబిందువుగా ఉండాలని పేర్కొన్నారని వివరించారు. పరిపాలన ప్రజలకు మరింత చేరువ కావాలంటే ఉన్నతాధికారులు, శాఖల కార్యదర్శులు, జిల్లా అధికారులు, మంత్రులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. కార్యాలయాల్లో మాత్రమే పరిమితమయ్యే పరిపాలనకు బదులుగా ప్రజల మధ్యకు వెళ్లి ప్రత్యక్షంగా సమస్యలను తెలుసుకోవడం ద్వారా వాస్తవ పరిస్థితులు అర్థమవుతాయని, భవిష్యత్ విధాన నిర్ణయాలకు అది బలమైన ఆధారంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నట్లు మంత్రి వివరించారు. అధికారులు నిర్వహించే క్షేత్రస్థాయి పర్యటనలు, తనిఖీలు, పరిశీలనల వివరాలను సాంకేతిక పరిజ్ఞానం ద్వారా, అవసరమైతే AI ఆధారిత వ్యవస్థల ద్వారా RTGSలో నమోదు చేయాలని కూడా ముఖ్యమంత్రి సూచించినట్లు తెలిపారు. సుపరిపాలన, ఆర్థిక క్రమశిక్షణ, సమర్థవంతమైన నిర్వహణ ఫలితంగానే గత రెండేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై ఒక్క రూపాయి అదనపు విద్యుత్ భారం కూడా మోపకుండా విద్యుత్ రంగాన్ని సమర్థంగా నిర్వహించగలిగిందని మంత్రి పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజలపై అనవసర భారాలు పడకుండా ఆర్థిక నియంత్రణతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. అదేవిధంగా, గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆర్థిక వృద్ధిరేటు కేంద్ర ప్రభుత్వం నమోదుచేసిన వృద్ధిరేటు కంటే తక్కువగా ఉండేదని, అయితే ప్రస్తుత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వృద్ధిరేటు జాతీయ సగటును మించి నమోదవుతున్న విషయం సమావేశంలో ప్రత్యేకంగా చర్చించబడిందని మంత్రి వెల్లడించారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో తాగునీరు, సాగునీరు, ప్రజారోగ్యం తదితర రంగాల్లో సవాళ్లు ఎదురయ్యే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని అన్ని శాఖలు ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి సూచించినట్లు తెలిపారు. ప్రకృతి పరిస్థితులను కారణంగా చూపకుండా, ప్రతి సవాల్‌ను శాస్త్రీయ విధానాలతో, సమన్వయంతో అధిగమించేందుకు అధికారులు వినూత్న ఆలోచనలు చేయాలని, ప్రభుత్వానికి కార్యాచరణ సూచనలు సమర్పించాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు చెప్పారు. రానున్న మూడేళ్లు రాష్ట్ర భవిష్యత్తును నిర్దేశించే అత్యంత కీలక కాలమని పేర్కొంటూ, ప్రతి మంత్రి, ప్రతి అధికారి ఫలితాల ఆధారంగా పనిచేసి స్వర్ణాంధ్ర2047 లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి మార్గనిర్దేశం చేశారని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు.

ప్రజాకేంద్రిత పరిపాలన, డేటా ఆధారిత నిర్ణయాలు, పారదర్శక వ్యవస్థలు, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, జీరో పెండెన్సీ, క్షేత్రస్థాయి పర్యవేక్షణ వంటి సంస్కరణల ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ఉత్తమ పరిపాలన అందించే రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ సంకల్పమని మంత్రి స్పష్టం చేశారు.

# 4,196 ఎకరాల్లో ప్రైవేటు పారిశ్రామిక పార్కులు

(మొదటి పేజీ తరువాయి)

ప్లగ్ అండ్ ప్లే ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పాలసీని ప్రభుత్వం తీసుకొచ్చింది. పరిశ్రమలను వేగంగా ఏర్పాటు చేసేందుకు వీలుగా భూములను అందుబాటులో ఉంచే లక్ష్యంతో ప్రైవేటు పారిశ్రామిక పార్కులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. 10 నుంచి 1,000 ఎకరాల్లో వీటిని ఏర్పాటు చేసేందుకు వీలుగా ప్రభుత్వం నిబంధనలు రూపొందించింది.

**ఎనిమిది ప్రైవేటు పార్కుల ఏర్పాటు**

కేవలం ప్రభుత్వమే భూములను సేకరించి.. పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేసే బదులు ప్రైవేటు భాగస్వామ్యాన్ని అనుమతించడం వల్ల మౌలిక సదుపాయాలను వేగ□ంగా కల్పించవచ్చన్నది ప్రభుత్వ ఆలోచన. రాష్ట్రానికి వచ్చే పరిశ్రమలకు అవసరమైన భూముల కేటాయింపు కోసం కనీసం లక్ష ఎకరాల భూ బ్యాంక్ నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఏపీఐఐసీ వద్ద సుమారు 40 వేల ఎకరాలు మాత్రమే ఉన్నాయి. రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎంతోకొంత భూములు అందుబాటులో ఉన్నా.. కోస్తా జిల్లాల పరిధిలో పరిశ్రమల ఏర్పాటుకు భూములు దొరకడమే కష్టంగా ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రైవేటు భూముల యజమానుల్ని పార్కుల ఏర్పాటుకు ప్రోత్సహించడం ద్వారా కోస్తా జిల్లాల్లోనూ పరిశ్రమల ఏర్పాటుకు భూములను అందుబాటులోకి తేవాలన్నది ప్రభుత్వ యోచన.

**కనీసం 3.5 లక్షల ఎకరాలు అవసరం**

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వివిధ సంస్థలు ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. వాటికి అవసరమైన భూములను కేటాయించడంపై అధికారులు శాస్త్రీయంగా విశ్లేషించి.. ఏ సంస్థకు ఎంత మేర భూమి అవసరమో అంచనా వేస్తున్నారు.

రాయలసీమలో ప్రభుత్వం అనుమతించిన పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు కనీసం 2.5 లక్షల ఎకరాలు అవసరం. ఇందుకు ప్రభుత్వ, డీకేటీ, ప్రైవేటు భూములను సేకరిస్తున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్న సంస్థల కోసం మరో లక్ష ఎకరాల వరకు అవసరమని అంచనా.



# ఓటర్ల జాబితా సవరణ గడువు పొడిగింపు

- కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం
- జులై 24 వరకు అవకాశం కల్పించిన ఈసీ
- రాజకీయ పార్టీల విజ్ఞప్తులతో కదిలిన ఈసీ
- క్షేత్రస్థాయి పరిస్థితుల ఆధారంగా కీలక ఉత్తర్వులు
- మంగళవారంతోతో ముగియాల్సిన సర్
- సాంకేతిక కారణాల వల్ల గడువు పెంచిన అధికారులు



**ఆంధ్రప్రదేశ్, మనసులో మాట**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఓటర్లకు కేంద్ర ఎన్నికల సంఘం ఒక అద్భుతమైన సువార్త అందించింది. రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) గడువును పొడిగిస్తూ ఎన్నికల కమిషన్ అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకుంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలనే లక్ష్యంతో, ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నిర్ణయంతో ఓటర్లలో సరికొత్త ఆశలు చిగురించాయి.

రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులను మరియు వివిధ రాజకీయ పార్టీల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే కేంద్ర ఎన్నికల సంఘం ఈ నిర్ణయానికి వచ్చింది. ఓటర్ల వివరాల నమోదు, సవరణలు ఇంకా చాలా చోట్ల అసంపూర్తిగానే ఉన్నాయని రాజకీయ పార్టీలు ఈసీ దృష్టికి తీసుకెళ్లాయి. వాటన్నింటినీ నిశితంగా పరిశీలించిన ఎన్నికల కమిషన్, ఓటర్ల నమోదు ప్రక్రియను మరింత పారదర్శకంగా పూర్తి చేసేందుకు వీలుగా తాజా ఉత్తర్వులను జారీ చేసింది.

ముందుగా ప్రకటించిన అధికారిక షెడ్యూల్ ప్రకారం.. ఈ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ నేటితో (జులై 14) ముగియాల్సి ఉంది. అయితే రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో ఓటర్ల సవరణ పనులు ఇంకా సగం కూడా పూర్తి కాలేదు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్, సాంకేతిక మరియు పరిపాలనాపరమైన ఇబ్బందులను బేరీజు వేసుకున్న అధికారులు.. ప్రక్రియను మధ్యలోనే ముగిస్తే అర్హులైన పౌరులు నష్టపోతారని భావించి గడువును పొడిగించడం విశేషం.

గడువు పొడిగించడానికి గల ప్రధాన కారణాలలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీలో జరిగిన ఆలస్యం ఒకటని తెలుస్తోంది. రాష్ట్రంలోని అనేక గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో ఓటర్లకు ఇప్పటివరకు కనీసం ఎన్యుమరేషన్ ఫారాలు కూడా అందలేదని ఫిర్యాదులు వచ్చాయి. ఫారాలు చేతికి అందకపోవడంతో ఓటర్లు తమ వివరాలను నమోదు చేసుకోలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ పంపిణీ వ్యవస్థను సరిదిద్ది అందరికీ ఫారాలు అందేలా చూడటం కోసమే ఈ అదనపు సమయం ఉపయోగపడనుంది.

కొన్ని ప్రాంతాలలో ఓటర్లు ఎంతో ఉత్సాహంతో ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తిగా నింపి సిద్ధంగా ఉంచుకున్నప్పటికీ, వాటిని సేకరించడంలో బూత్ లెవెల్ అధికారులు (బీఎల్ఓలు) తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అధికారులు వాటిని సకాలంలో సేకరించకపోవడంతో గడువు ముగిసిపోతుందేమోనని సామాన్య ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ లోపాలను సరిదిద్ది, నిండిన ఫారాలన్నింటినీ సేకరించడానికి ఈ పది రోజుల గడువు ఎంతో సహాయపడనుంది. ఓటర్ల నుంచి సేకరించిన భౌతిక వివరాలను కంప్యూటర్లలో నమోదు చేసే (డిజిటలైజేషన్) ప్రక్రియలో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. సర్వర్ల వేగం మందగించడం, సాంకేతిక అడ్డంకులు ఎదురుకావడంతో సేకరించిన లక్షలాది దరఖాస్తులను ఆన్‌లైన్ సిస్టమ్‌లోకి ఎక్కించడం అధికారులకు పెద్ద సవాలుగా మారింది. ఈ డిజిటల్ ప్రక్రియ పూర్తి కావడానికి మరింత సమయం అవసరమని క్షేత్రస్థాయి సిబ్బంది ఇచ్చిన నివేదికల ఆధారంగానే ఎన్నికల సంఘం సానుకూలంగా స్పందించింది. ఈ వ్యవస్థాగత మరియు సాంకేతిక ఇబ్బందుల వల్ల రాష్ట్రంలో లక్షలాది మంది అర్హులైన పౌరులు తమ ప్రాథమిక ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఓటు లేకపోతే ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతుక నొక్కినట్లే అవుతుందని వారు వాదించారు. అందుకే తక్షణమే ఎన్నికల సంఘం జోక్యం చేసుకుని ఎస్ఐఆర్ గడువును పొడిగించాలని గట్టిగా డిమాండ్ చేశారు. దీనిపై ఈసీ స్పందించి నిర్ణయం తీసుకోవడంపై అన్ని వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం తీసుకున్న తాజా నిర్ణయం ప్రకారం, ఓటర్లు తమ వివరాల సవరణకు ఈ నెల (జులై) 24వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునే వారు, తమ వివరాలలో తప్పులను సరిదిద్దుకోవాలనుకునే వారు, అలాగే చిరునామా మార్పులు చేసుకోవాలనుకునే వారందరికీ ఈ 10 రోజుల గడువు ఒక గొప్ప అవకాశంగా మారింది. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును భద్రపరుచుకోవాలని రాష్ట్ర ఎన్నికల అధికారులు కోరారు.

## భారత్‌లోకి అమెరికా మాజీ సైనికులు!

**మనసులో మాట**

భారతదేశంలోకి అమెరికా మాజీ సైనికులు ఎలాంటి పత్రాలు లేకుండా అక్రమంగా చొరబడుతుండటం ఇప్పుడు దేశ భద్రతా వర్గాలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. భారత్ నుంచి నేపాల్ దేశంలోకి దొంగచాటుగా ప్రవేశించడానికి ప్రయత్నిస్తున్న ఒక అమెరికా మాజీ నేవీ అధికారిని ఉత్తర్ ప్రదేశ్‌లోని మహారాజ్‌గంజ్ జిల్లా సరిహద్దులో 'సహస్త్ర సీమా బల్' (ఎస్ఎస్‌బీ) బలగాలు వ్యూహాత్మకంగా అడ్డుకుని అరెస్ట్ చేశాయి. విదేశీయులకు సంబంధించిన ఎలాంటి గుర్తింపు కార్డులు లేదా ప్రయాణ పత్రాలు (పాస్‌పోర్ట్, వీసా) లేకుండా అతడు అనుమానాస్పదంగా యూపీ సరిహద్దుల్లో తిరుగుతుండటంతో బలగాలు తనిఖీలు చేపట్టాయి. భద్రతా బలగాల తనిఖీల్లో పట్టుబడిన ఆ విదేశీయుడిని అమెరికాలోని కాలిఫోర్నియా ప్రాంతానికి చెందిన జోర్డాన్ బ్రౌన్‌గా అధికారులు గుర్తించారు. సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద ఎస్ఎస్‌బీ జవాన్లు అతడిని ఆపి నిలదీయగా.. బ్రౌన్ అక్కడి నుంచి తప్పించుకుని పారిపోవడానికి తీవ్రంగా ప్రయత్నించినట్లు పోలీసులు వెల్లడించారు. అయితే అలర్ట్ అయిన జవాన్లు అతడిని చుట్టుముట్టి బంధించారు. అనంతరం అతడిని స్థానిక పోలీసులకు అప్పగించగా.. సరైన పత్రాలు లేకుండా దేశంలో తిరుగుతున్నందుకు ఇమిగ్రేషన్ చట్టాల కింద కేసు నమోదు చేసి లోతుగా విచారణ ప్రారంభించారు.

పోలీసులు, నిఘా వర్గాల ప్రాథమిక విచారణలో జోర్డాన్ బ్రౌన్ తన నేపథ్యానికి సంబంధించి పలు ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. తాను కాలిఫోర్నియా యూనివర్సిటీలో ఉన్నత చదువులు చదువుకున్నానని, ఆ తర్వాత దాదాపు ఆరేళ్ల పాటు అమెరికా సైన్యంలో (నేవీ) పనిచేసినట్లు ఒప్పుకున్నాడు. గత 2025 నవంబర్ నెలలో తాను విమానంలో కాకుండా సముద్ర మార్గం ద్వారా దొంగచాటుగా భారత్‌లోకి ప్రవేశించినట్లు అధికారులు కనుగొన్నారు. దేశంలోకి వచ్చినప్పటి నుంచి అతడు గోవాలో శాశ్వతంగా నివసిస్తున్నాడని, ఈ మధ్య కాలంలో బెంగళూరు, లఖ్‌నవూ, గోరఖ్‌పూర్ వంటి కీలక నగరాలకు కూడా వెళ్లి వచ్చినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి.

అయితే, విచారణ సాగుతున్న కొద్దీ జోర్డాన్ బ్రౌన్ అధికారుల ప్రశ్నలకు పొంతనలేని, పరస్పర విరుద్ధమైన సమాధానాలు చెబుతూ గందరగోళానికి గురిచేస్తున్నాడు. మూడేళ్ల క్రితం తనకు ఉత్తరాఖండ్‌కు చెందిన ఒక భారతీయ మహిళతో పరిచయం ఏర్పడిందని, 2024 అక్టోబర్‌లో తామిద్దరం పెళ్లి చేసుకున్నామని చెప్పాడు. కానీ, అదే సమయంలో తాను ఇటలీ పర్యటనలో ఉన్నానని చెప్పడం అనుమానాలకు తావిచ్చింది. ఆ తర్వాత తాను టూరిస్ట్ వీసాపై థాయ్‌లాండ్ వెళ్లానని, అక్కడ పాస్‌పోర్టు పోవడంతో సముద్ర మార్గంలో భారత్ వచ్చానని అన్నాడు. ఇప్పుడు గోవాలో పరిచయమైన ఒక నేపాల్ వ్యక్తిని కలవడానికి సరిహద్దు దాటుతున్నానని, తన అసలు పాస్‌పోర్ట్ బెంగళూరులోని ఒక స్నేహితుడి దగ్గర ఉందని చెప్పడంతో అధికారులు అతడి మాటలను నమ్మడం లేదు.

జోర్డాన్ బ్రౌన్ అరెస్ట్ వ్యవహారం కేవలం ఒక సాధారణ చొరబాటు కేసు కాకపోవచ్చని నిఘా సంస్థలు భావిస్తున్నాయి. ఎందుకంటే, ఇటీవల పొరుగు దేశమైన మయన్మార్‌లోని మిలిటెంట్లకు అత్యాధునిక యుద్ధతంత్రాలలో ఉగ్రశిక్షణ ఇస్తున్న అమెరికా మాజీ సైనికుడు మాథ్యూ వాన్‌డైక్‌తో పాటు ఐదుగురు ఉక్రెయిన్ పౌరులను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అరెస్ట్ చేసింది. ఈ నేపథ్యంలోనే బ్రౌన్ అరెస్ట్ ప్రాధాన్యత సంతరించుకుంది. అమెరికాకు చెందిన మాజీ సైనికులు టూరిస్ట్ వీసాల పేరుతో భారత్‌కు వచ్చి, ఇక్కడి నుంచి మిజోరాం సరిహద్దు ద్వారా మయన్మార్‌లోకి చొరబడి అక్కడి ఉగ్రవాద, తిరుగుబాటు ముఠాలతో చేతులు కలుపుతున్నట్లు దర్యాప్తులో తేలింది.

విదేశీ కిరాయి సైనికులు ఇతరులకు ఆయుధాలు, డ్రోన్లను చేరవేయడానికి భారత భూభాగాన్ని ఒక సురక్షితమైన రవాణా మార్గంగా (ట్రాన్సిట్ రూట్) వాడుకుంటున్నారా? అనే అనుమానాలకు అవుననే సమాధానాలు లభిస్తున్నాయి. కొన్నాళ్ల క్రితం కోల్‌కతాలో పట్టుబడిన మాథ్యూ వాన్‌డైక్ బృందం ఐరోపా దేశాల నుంచి అత్యాధునిక డ్రోన్లను తీసుకొచ్చి, ఈశాన్య భారత సరిహద్దుల గుండా మయన్మార్‌లోని తిరుగుబాటు ముఠాలకు స్మగ్లింగ్ చేసినట్లు పక్కా సమాచారం అందింది. ఇలా డ్రోన్లను దొంగరవాణా చేయడం, వాటిని అసెంబ్లింగ్ చేయడం, ఎలక్ట్రానిక్ యుద్ధరీతుల్లో మయన్మార్ ముఠాలకు శిక్షణ ఇవ్వడమే ఈ అంతర్జాతీయ ముఠాల పని అని రష్యా కూడా గతంలో తీవ్ర ఆరోపణలు చేసింది.

భారతదేశ భద్రతా నిబంధనల ప్రకారం విదేశీయులు ఎవరైనా సరే మిజోరాం వంటి సున్నితమైన ఈశాన్య సరిహద్దు రాష్ట్రాల్లో ప్రయాణించాలంటే ఖచ్చితంగా కేంద్ర ప్రభుత్వం జారీ చేసే 'రక్షిత ప్రాంత పర్మిట్' (ప్రొటెక్టెడ్ ఏరియా పర్మిట్ PAP) కలిగి ఉండాలి. కానీ, ఇప్పుడు అరెస్టయిన అమెరికా మాజీ సైనికులు మరియు విదేశీయులు ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించారు. స్థానిక శక్తుల సహాయంతో రహస్యంగా ఈశాన్య భారతం నుంచి మయన్మార్‌లోకి ప్రవేశిస్తూ సరిహద్దు భద్రతకు పెద్ద సవాలుగా మారారు. ఇంతకీ ఈ వ్యవహారంలో కీలక సూత్రధారిగా ఉన్న మాథ్యూ వాన్‌డైక్ సాదాసీదా వ్యక్తి కాదు. 'సన్స్ ఆఫ్ లిబర్టీ ఇంటర్నేషనల్' అనే అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ ముసుగులో అతడు ఒక కిరాయి సైన్యాల ముఠాను నడుపుతున్నాడు. గతంలో లిబియా అంతర్యుద్ధం జరిగిన సమయంలో అక్కడి పాలకుడు గడాఫీకి వ్యతిరేకంగా స్వయంగా తుపాకీ పట్టి పోరాడటం ద్వారా ప్రపంచవ్యాప్తంగా వార్తల్లోకెక్కాడు. ఆ తర్వాత సిరియా అంతర్యుద్ధంలోనూ పాల్గొని అక్కడి తిరుగుబాటుదారులకు శిక్షణ ఇచ్చాడు. మోటార్ సైకిల్‌పై ఉత్తర ఆఫ్రికా, పశ్చిమాసియా దేశాల్లో విస్తృతంగా పర్యటించిన చరిత్ర ఇతనికి ఉంది.



# మన కాలపు మనస్సాక్షి

మలయాళ కవిత్వాన్ని ఒక విశాల నదిగా ఊహిస్తే, సచ్చిదానందన్ సుదూర మానవ అనుభవాల నుంచి సంద్రాల నుంచి ఆ నదిలో కలిసే ప్రవాహంలా కనిపిస్తాడు. చరిత్రలోని చేదు, ప్రవాసాల ధూళి, అనేక భాషల మాధుర్యం...

మలయాళ కవిత్వాన్ని ఒక విశాల నదిగా ఊహిస్తే, సచ్చిదానందన్ సుదూర మానవ అనుభవాల నుంచి సంద్రాల నుంచి ఆ నదిలో కలిసే ప్రవాహంలా కనిపిస్తాడు. చరిత్రలోని చేదు, ప్రవాసాల ధూళి, అనేక భాషల మాధుర్యం, మానవత్వపు అశాంత స్వప్నాలను వెంట తెచ్చుకునే కవితా ప్రవాహం అది. ఆయన కవిత్వ హృదయంలో మానవ స్వేచ్ఛ పట్ల అచంచలమైన నిబద్ధత ధ్వనిస్తుంది. రాజకీయ, సామాజిక, మత, భాషా, సాంస్కృతికాల్లో ఏ రూపంలో వచ్చిన అణచివేతనైనా ఆయన కవిత్వం ప్రశ్నిస్తుంది, ప్రతిఘటిస్తుంది. అయితే ఆ ప్రతిఘటన కేవలం నినాదంగా ఉండదు. కవిత్వంగా రూపాంతరం చెందుతుంది. మౌన నైతిక శక్తితో, లోతైన మానవీయతతో పాఠకుని మనసు తాకుతుంది.సచ్చిదానందన్ ఊహాజగత్తులో ప్రకృతిది కేంద్రస్థానం. చెట్లు, నదులు, పక్షులు, వర్షాలు, విత్తనాలు, ఋతువులు ఆయన కవితల్లో అలంకార వస్తువులు కావు. జీవంతో నిండిన రూపాలు. అవి మనుషులతో సంభాషిస్తాయి. వారి విధుల్లో భాగస్వాములవుతాయి. ఆయన కవిత్వంలో ప్రకృతి భూమితో విడిపోయిన మన బంధాన్ని గుర్తుచేసే జీవశక్తి.

రవీంద్రనాథ్ ఠాగూర్ మానవ ఆత్మ వికాసంలో అనంతాన్ని అన్వేషించాడు. పాబ్లో నెరూడా సంఘర్షణలో చరిత్రను, ఆకలిలో విప్లవాన్ని కనుగొన్నాడు. ఆక్టావియో పాజ్ భాషా-ఏకాంతాల చిక్కుముడుల్లో దాగి ఉన్న ఆత్మను వెతికాడు. సచ్చిదానందన్ ఈ మూడు సంప్రదాయాలతో సంభాషిస్తూనే తన దైన ప్రత్యేక స్వరం నిలబెట్టుకున్నాడు.

సచ్చిదానందన్ కవిత్వ చూపు భూమి వైపు, ఎడారులు దాటుతున్న శరణార్థుల వైపు, కనిపించని భారాలు మోస్తున్న కార్మికుల వైపు, దురాశ ఫలితంగా ముప్పులో ఉన్న అడవుల వైపు, యుద్ధ ఛాయల కింద చిక్కిన పిల్లల వైపు చూస్తుంది. నెరూడాలాగే అన్యాయాల పట్ల కవిత్వం మౌనంగా ఉండకూడదని సచ్చిదానందన్‌కు తెలుసు. అయితే ఆయన మంద్ర స్వరంలోని శక్తిని ఎంచుకుంటాడు. సచ్చిదానందన్ కవిత్వంలో ప్రతిఘటన బిగించిన పిడికిలి కాదు, తెరిచి ఉన్న గాయం. ఆయన అరిచి ఒప్పించడు, నిశ్శబ్దాన్నే మాట్లాడిస్తాడు.సచ్చిదానందన్ కవిత్వ ప్రత్యేకత 'నైతికతను' శ్రద్ధగా మలచడంలో ఉంది. ప్రతి జీవికి వినిపించే హక్కు ఉందన్న భావంతో రాస్తాడు. ఆయన కవితల్లో పక్షులు ప్రకృతి అలంకారాలు కావు, అవి స్వేచ్ఛ గల పౌరులు. చాలామంది కవులు ప్రపంచం గురించి రాస్తారు. సచ్చిదానందన్ ప్రపంచాన్ని వింటాడు. అదే ఆయనను ప్రత్యేకంగా నిలబెడుతుంది. నేటి ప్రపంచం ఒక మహా విమానాశ్రయంలా కనిపిస్తే దానినుండి లక్షలాది మంది ప్రయాణిస్తున్నారు. కానీ చాలా కొద్దిమంది మాత్రమే నిజంగా గమ్యాన్ని చేరుకుంటున్నారు. దేశాలు తమ చుట్టూ కంచెలు కట్టుకుంటున్నాయి. మతాలేమో గోడల్ని నిర్మిస్తున్నాయి. మార్కెట్లు ప్రతిదాన్నీ వస్తువుగా మారుస్తున్నాయి. ఈ గందరగోళాల నడుమ సచ్చిదానందన్ కవిత్వం రాజకీయాల సరిహద్దుల్ని దాటి పలకరిస్తుంది పలవరిస్తుంది. కేరళ నుంచి పాలస్తీనాకు, లాటిన్ అమెరికా నుంచి ఆఫ్రికాకు, ఒక గ్రామీణ దారి నుంచి ప్రపంచ సంక్షోభాల వరకూ ప్రయాణిస్తూ మానవ గౌరవం అవిభాజ్యమన్న సందేశాన్ని మోస్తుంది. ఆయన కవితలు బాధకు జాతీయత ఉండదని గుర్తుచేస్తాయి. అందుకే అవి భాషల సరిహద్దులను దాటి ప్రతిధ్వనిస్తాయి.

ఆయన కవిత్వమంతటా లోతైన పర్యావరణ చైతన్యం ప్రవహిస్తుంది. ప్రపంచంలో పర్యావరణ విపత్తు ముఖ్యమైన ప్రమాదంగా దేశాలు గుర్తించకముందే ప్రకృతి విధ్వంసమంటే మానవ విధ్వంసమే అని ఆయన గ్రహించాడు. ఆయన కవిత్వంలో ఒక చెట్టు నరికివేత కేవలం పర్యావరణ సంఘటన కాదు. భూమి మనిషి చరిత్రలో ఒక అధ్యాయం చెరిపివేయడమే. ఆ సున్నితత్వమే ఆయన కవిత్వానికి అరుదైన నైతిక స్పృహను స్పర్శను అందిస్తుంది. ఆయన మనిషిని ప్రకృతి నుంచి వేరుగా చూడడు, ప్రకృతిలో భాగంగానే చూస్తాడు. మానవ నాగరికతలో భాగంగా పక్షులు, నదులు, అడవులు, మన చుట్టూ నిశ్శబ్దంగా జీవించే అనేక జీవులతో మనం మరచిపోయిన బంధాన్ని పునరుద్ధరించడంలోనే మనిషి మనుగడ వుందని ఆయన కవితలు సూచిస్తాయి. ఆయన రచనల్లో- చెట్లు జ్ఞాపకాల భాండాగారాలు. నదులు కాలంలో ప్రవహించే జీవిత చరిత్రలు.

స్థానికతకూ విశ్వజనీనతకూ మధ్య, వేర్లకూ వృక్షానికీ మధ్య, సాంస్కృతిక అస్తిత్వానికీ ప్రపంచ చైతన్యానికీ మధ్య నిరంతర సంభాషణ జరిపిన అరుదైన భారతీయ రచయితల్లో ఆయన ఒకరు. ఆయన కవిత్వం- విభజనలతో నిండిపోతున్న ఈ కాలంలో ఆతిథ్యంగా నిలుస్తుంది, గోడలు కడుతున్న చోట కిటికీలు తెరుస్తుంది, ఎడారులు విస్తరిస్తున్న చోట చెట్లను నాటుతుంది, పంజరాలు పెరుగుతున్న చోట పక్షులను విడుదల చేస్తుంది- బహుశా ఇదే కె. సచ్చిదానందన్ రచనల శాశ్వత ప్రాసంగికత. గడిచిపోయిన ప్రతి కాలం రాతి, ఉక్కులపై రాతల్ని, స్మారకాలను నిర్మిస్తుంది. కానీ కొద్ది కాలాల్లోని సృజనకారులే సజీవమైన మనస్సాక్షిని సృష్టిస్తారు. తమ భాషకే కాకుండా తమ కాలపు మనస్సాక్షిగా ఎదుగుతారు. అలాంటి అరుదైన మనస్సాక్షులలో కె. సచ్చిదానందన్ ఒకరు. సాహిత్యానికి నిజమైన మాతృభూమి దేశమో భాషో కాదని, మానవ హృదయమే నని నిరంతరం మనకు బోధిస్తున్న కవి సచ్చిదానందన్.

డాక్టర్ కంచర్ల
అచ్యుతరావు
ఎడిటర్, మనసులో మాట దినపత్రిక



# బంగ్లాదేశ్‌కు షేక్ హసీనా రాకపై ఉత్కంఠ

- స్వదేశానికి వస్తే చట్టపరమైన చర్యలు తప్పవని బంగ్లాదేశ్ మంత్రి వ్యాఖ్య
- అరెస్టు, జైలు శిక్షకు సిద్ధమేనని షేక్ హసీనా ప్రకటన
- కోర్టు తీర్పు మేరకే తదుపరి చర్యలు ఉంటాయని స్పష్టం
- చట్టం ముందు అందరూ సమానమేనని మంత్రి షామా ఒబైద్ వ్యాఖ్య
- హసీనా భవిష్యత్తుపై న్యాయవ్యవస్థే తుది నిర్ణయం తీసుకుంటుందని వెల్లడి
- రాజకీయ సందేశం కోసమే హసీనా వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శ



మనసులో మాట

బంగ్లాదేశ్ రాజకీయాల్లో మరోసారి తీవ్ర ఉత్కంఠ రేపుతూ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా స్వదేశానికి తిరిగి వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఈ పరిణామంపై బంగ్లాదేశ్ ప్రస్తుత ప్రభుత్వం అత్యంత ఘాటుగా స్పందించింది. షేక్ హసీనా గనుక తిరిగి బంగ్లాదేశ్‌లో అడుగుపెడితే ఆమెను వెంటనే అరెస్ట్ చేసి జైలుకు తరలిస్తామని ఆ దేశ విదేశాంగ శాఖ సహాయ మంత్రి షామా ఒబైద్ ఇస్లాం చాలా స్పష్టంగా ప్రకటించారు. ఆమె ఎక్కడ లొంగిపోయినా సరే, దేశ సరిహద్దుల్లోకి రాగానే చట్టపరమైన నిబంధనల ప్రకారం తక్షణమే అరెస్ట్ ప్రక్రియ అమలవుతుందని వెల్లడించారు.

మాజీ ప్రధాని షేక్ హసీనా లొంగిపోవడానికి సిద్ధపడితే, ప్రస్తుతం దేశంలో అమలులో ఉన్న సాధారణ చట్టాల ప్రకారమే తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి షామా ఒబైద్ వివరించారు. చట్టం ఎవరికైనా ఒకేలా ఉంటుందని, తన పని తాను చేసుకుపోతుందని అన్నారు. హసీనా ఇప్పటికే కోర్టు ద్వారా దోషిగా తేలిన వ్యక్తి అని గుర్తుచేసిన ఆయన.. ఈ విషయంలో ప్రభుత్వం ప్రత్యేకంగా విచారించాల్సిన లేదా మినహాయింపులు ఇవ్వాల్సిన అవసరమేమీ లేదని తేల్చి చెప్పారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారు ఎవరైనా సరే శిక్ష అనుభవించాల్సిందేనని స్పష్టం చేశారు.

షేక్ హసీనా ఒకవేళ పొరుగు దేశమైన భారత్‌లో ఉన్న బంగ్లాదేశ్ రాయబార కార్యాలయంలో లొంగిపోయినా, లేదా నేరుగా బంగ్లాదేశ్ వచ్చి కోర్టులో లొంగిపోయినా సరే.. ముందుగా ఆమె జైలు గడప తొక్కాల్సిందేనని విదేశాంగ సహాయ మంత్రి స్పష్టం చేశారు. ఆమె దేశానికి తిరిగి వచ్చిన తర్వాత చట్టపరమైన విచారణ ఏ విధంగా సాగాలి, తదుపరి చర్యలు ఎలా ఉండాలనే అత్యంత కీలకమైన అంశాలను పూర్తిగా దేశ న్యాయవ్యవస్థే నిర్ణయిస్తుందని చెప్పారు. ఇందులో ప్రభుత్వ జోక్యం ఏమీ ఉండబోదని వివరించారు.

షేక్ హసీనాను తిరిగి దేశానికి రప్పించే చట్టపరమైన ప్రక్రియ గత తాత్కాలిక ప్రభుత్వ హయాంలోనే మొదలైందని, ప్రస్తుతం అధికారంలో ఉన్న బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) నేతృత్వంలోని ప్రభుత్వం కూడా అదే పంథాను కొనసాగిస్తోందని మంత్రి తెలిపారు. విదేశాల్లో తల దాచుకుంటూ తాను త్వరలోనే బంగ్లాదేశ్‌కు తిరిగి వస్తానంటూ హసీనా చేస్తున్న ప్రకటనలు కేవలం రాజకీయ సంకేతాల కోసమేనని ఆయన అభిప్రాయపడ్డారు. దేశం విడిచి పారిపోయిన లేదా అజ్ఞాతంలో ఉన్న అవామీ లీగ్ నాయకులు, కార్యకర్తల్లో తిరిగి ధైర్యం నింపేందుకే ఆమె ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని, లొంగిపోవడం ఆమె అసలు ఉద్దేశం కాకపోవచ్చని విమర్శించారు.

బంగ్లాదేశ్‌లో 2024 జులై నెలలో ప్రభుత్వ ఉద్యోగాల రిజర్వేషన్లకు వ్యతిరేకంగా విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టిన సంగతి తెలిసిందే. ఆ నిరసనలు క్రమంగా తీవ్రరూపం దాల్చి, చివరకు హసీనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమంగా మారాయి. ఆగ్రహించిన ఆందోళనకారులు ఏకంగా ప్రధానమంత్రి అధికారిక నివాసాన్ని ముట్టడించడంతో.. 2024 ఆగస్టు 5న షేక్ హసీనా తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ప్రాణభయంతో ఆమె హుటాహుటిన ఢాకా నగరాన్ని విడిచి భారత్‌కు చేరుకున్నారు. అప్పటి నుంచి ఆమె దిల్లీలోని ఒక సురక్షిత, రహస్య ప్రదేశంలో నివసిస్తున్నారు.

విద్యార్థుల నిరసనలను ఉక్కుపాదంతో అణచివేసే క్రమంలో మానవత్వానికి వ్యతిరేకంగా కఠిన నేరాలకు, హింసకు పాల్పడ్డారనే ఆరోపణలపై హసీనాపై బంగ్లాదేశ్‌లో అనేక కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత ఏర్పాటైన యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం ఈ ఘోరాలపై ప్రత్యేక న్యాయ విచారణకు ఆదేశించింది. దీనిపై విచారణ జరిపిన బంగ్లాదేశ్ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్ (ఐసీటీ) గతేడాది హసీనాకు మరణశిక్ష విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. అయితే, ఈ తీర్పుతో పాటు తనపై వచ్చిన ఆరోపణలన్నీ పూర్తిగా రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగమేనని షేక్ హసీనా మొదటి నుంచి కొట్టిపారేస్తున్నారు.

ఇదిలా ఉండగా, ఇటీవల ఒక అంతర్జాతీయ వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో షేక్ హసీనా ఎంతో భావోద్వేగంగా మాట్లాడారు. తాను త్వరలోనే బంగ్లాదేశ్‌కు వెళ్లే ఆలోచనలో ఉన్నానని స్పష్టం చేశారు. స్వదేశానికి తిరిగి వెళ్లి కోర్టు ముందు లొంగిపోయేందుకు తనకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. రాజకీయాల కోసం తాను అరెస్టు కావడానికైనా, లేదా చావడానికైనా సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. ఒకవేళ తనకు మరణం సంభవించాల్సి వస్తే, అది పరాయి దేశంలో కాకుండా తన కన్న సొంత గడ్డపైనే జరగాలని కోరుకుంటున్నట్లు హసీనా ఆవేదన వ్యక్తం చేశారు.

కోర్టు తీర్పు వెలువడినప్పటి నుంచి షేక్ హసీనాను తమకు అప్పగించాలంటూ బంగ్లాదేశ్ ప్రభుత్వం భారత అధికార వర్గాలకు నిరంతరం లేఖలు రాస్తోంది. ఇప్పటికే పలుమార్లు అధికారిక లేఖలు పంపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే హసీనా ఒక కీలక నిర్ణయానికి వచ్చారు. భారత ప్రభుత్వానికి తన వల్ల ఎలాంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతోనే తాను స్వదేశానికి వెళ్లాలని నిశ్చయించుకున్నట్లు తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్ నెలలోనే తనతో పాటు అవామీ లీగ్ పార్టీకి చెందిన కీలక సీనియర్ నాయకులంతా కలిసి బంగ్లాదేశ్‌కు వెళ్లి అక్కడి న్యాయస్థానాల ముందు లొంగిపోవాలని ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నట్లు షేక్ హసీనా వెల్లడించారు.

# అయోధ్య విరాళాల చోరీ కేసు.. నేడు సిట్ ఫైనల్ రిపోర్ట్..?

దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన అయోధ్య రామమందిర విరాళాల చోరీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తన నివేదికను బుధవారం(జూలై15)న రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించే అవకాశం ఉంది. ముగ్గురు సభ్యులతో కూడిన సిట్ విరాళాల చోరీని దర్యాప్తు చేసింది. సిట్‌కు ఇచ్చిన అదనపు 15 రోజుల గడువు జూలై 15తో ముగియనుంది. దీంతో ఈ నివేదికను యూపీ అదనపు ప్రధాన కార్యదర్శి(హోం) సంజయ్ ప్రసాద్‌కు సమర్పించే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే, దర్యాప్తులో మరిన్ని అంశాలను పూర్తి చేసేందుకు సిట్ మరింత సమయం కోరుతుందా లేదా అనే దానిపై ఇంకా స్పష్టత లేదు. ఈ దర్యాప్తులో భాగంగా ఆర్థిక లావాదేవీలు, బ్యాంకు ఖాతాలు, సీసీటీవీ ఫుటేజ్, ఎలక్ట్రానిక్ ఆధారాలు, పత్రాలు, సాక్షులు, నిందితుల వాంగ్మూలాన్ని సిట్ పరిశీలించింది. ఈ నివేదికలో దోపిడీకి పాల్పడిన వ్యక్తులనే కాకుండా, పరిపాలనా లోపాలు, పర్యవేక్షణ వైఫల్యాలు, బాధ్యులైన అధికారుల్ని గుర్తించే అవకాశం ఉంది. విరాళాల సేకరణ, భద్రపరిచే విధానం, నగదు లెక్కింపు, బ్యాంకులో జమ, ఆడిట్, పర్యవేక్ష వ్యవస్థల్లో సంస్కరణలను సూచించే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే ఈ కేసులో అక్రమంగా మళ్లించిన నిధుల ఆనవాళ్లు గుర్తించేందుకు అయోధ్య పోలీసులు ఇన్‌కమ్ ట్యాక్స్(ఐటీ) డిపార్ట్మెంట్ సహాయం కోరారు. ఇప్పటివరకు అరెస్టయిన 8 మంది నిందితులు, వారి కుటుంబ సభ్యులకు సంబంధించిన దాదాపు 50



బ్యాంక్ ఖాతా లావాదేవీలను 2022 నుంచి పరిశీలిస్తారు. దోచుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నిధుల్ని బంధువుల ఖాతాల ద్వారా బదిలీ చేశారా? స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుటు పెట్టారా? స్థిరాస్తులు కొనుగోలు చేశారా? ఇతర ఆర్థిక సాధనాల్లో పెట్టుబడి పెట్టారా? అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ దర్యాప్తులో మరికొందరు వ్యక్తుల ప్రమేయం ఉంటే వారి అరెస్టులు, ఆస్తుల స్వాధీనం వంటి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# ఇరాన్ సైనిక సామర్థ్యం పూర్తిగా ధ్వంసం

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన
- హర్మూజ్ నౌకలపై రక్షణకు 20 శాతం టోల్ బాదుడు
- యూఎస్ కాంగ్రెస్‌కు అధికారిక సమాచారం
- జూలై 7 నుంచే మళ్లీ యుద్ధ రంగంలోకి దిగినట్లు లేఖ
- శాంతి ఒప్పందాన్ని ఉల్లంఘించిన ఇరాన్
- దౌత్య ప్రయత్నాలను పక్కనబెట్టి నౌకలపై దాడులు
- వాణిజ్య నౌకలపై 20 శాతం టోల్ రక్షణ పన్ను
- ఓవల్ ఆఫీస్ నుంచి ట్రంప్ హెచ్చరికలు



పశ్చిమాసియ, మనసులో మాట

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మరింత ముదిరాయి. ఇరాన్‌కు సంబంధించిన సైనిక సామర్థ్యాన్ని తాము పూర్తిగా ధ్వంసం చేశామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. హర్మూజ్ జలసంధి ప్రాంతంలో ఇరాన్ ఉనికి లేకుండా చేసేందుకు, వారి సైనిక శక్తిని పూర్తిగా నిర్వీర్యం చేసే దిశగా అమెరికా బలగాలు భీకర దాడులు కొనసాగిస్తున్నాయని ఆయన వెల్లడించారు. శత్రుదేశం కోలుకోలేని విధంగా అమెరికా సైన్యం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోందని, ఇరాన్ దాడుల ఆటకట్టించేందుకు తాము వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ట్రంప్ స్పష్టం చేశారు.

ఇరాన్ దేశంపై తాము తిరిగి సైనిక చర్యలను ప్రారంభించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారికంగా యూఎస్ కాంగ్రెస్‌కు తెలియజేశారు. ఈ మేరకు కాంగ్రెస్‌కు ఒక లేఖ పంపిన ఆయన, జూలై 7 నుంచే ఇరాన్‌పై దాడులను పునరుద్ధరించినట్లు స్పష్టం చేశారు. హర్మూజ్ జలసంధి గుండా వెళ్తున్న అంతర్జాతీయ నౌకలపై ఇరాన్ వరుస దాడులకు తెగబడటంతో, అంతర్జాతీయ నిబంధనల ప్రకారం నౌకల రక్షణ కోసం తాము ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ట్రంప్ ఆ లేఖలో విడమరిచి చెప్పారు.

ఇటీవల కాలంలో అమెరికా, ఇరాన్ దేశాల మధ్య దౌత్యపరమైన చర్చలు జరిగి ఒక శాంతి ఒప్పందం కుదిరినప్పటికీ.. ఇరాన్ దాన్ని ఏమాత్రం గౌరవించలేదని ట్రంప్ ఆరోపించారు. ఒప్పందం కుదిరిన కొద్ది రోజులకే ఇరాన్ దాన్ని ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించిందన్నారు. తాము ఎంతో చిత్తశుద్ధితో శాంతి కోసం ప్రయత్నించినప్పటికీ, గతవారమే ఇరాన్ ఏకంగా మూడు అంతర్జాతీయ నౌకలపై దాడులు చేసిందని మండిపడ్డారు. ఒప్పందంలో తమకు నచ్చని అంశాలు ఉన్నాయనే నెపంతో వారు దాన్ని రద్దు చేసుకున్నారని, ఇటువంటి పిచ్చి చేష్టలను తాము ఎంతమాత్రం సహించబోమని ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే ఇతర దేశాల వాణిజ్య నౌకల నుంచి భారీగా 20 శాతం టోల్ పన్ను వసూల్ చేయనున్నట్లు ట్రంప్ కుండబద్ధలు కొట్టారు. ఇరాన్ ముతాల దాడుల నుంచి అంతర్జాతీయ వాణిజ్య నౌకలకు అమెరికా సైన్యం పూర్తి రక్షణ కల్పిస్తోందని, ఇందుకు గాను తమకు భారీగా ఆర్థిక ఖర్చులు అవుతున్నాయని వివరించారు. ప్రపంచంలోనే అత్యంత సంపన్నమైన ఈ ప్రాంతానికి తాము ఉచితంగా రక్షణ కల్పించలేమని, రక్షణ కోసం అమెరికా పెడుతున్న ఖర్చులను ఆయా దేశాల నుంచే తిరిగి వసూల్ చేసుకుంటామని ఆయన తేల్చిచెప్పారు.

వైట్‌హౌస్‌లోని ఓవల్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడిన ట్రంప్, ఇరాన్‌పై ఈ రాత్రి మరింత భీకరమైన దాడులు చేయబోతున్నట్లు హెచ్చరించారు. ఇప్పటికే ఆ దేశాన్ని అన్ని రంగాల్లోనూ దెబ్బతీశామని, వారి ఆర్థిక వనరులను కట్టడి చేశామని చెప్పారు. ఇందులో భాగంగా ఇరాన్ ఓడరేవులపై తాము మళ్లీ పూర్తి స్థాయిలో దిగ్బంధనం విధిస్తున్నట్లు ప్రకటించారు. అయితే ఈ దిగ్బంధనం కేవలం ఇరాన్ నౌకలకే పరిమితమని, హర్మూజ్ జలసంధిలో ఇతర దేశాల వాణిజ్య నౌకల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు, ఆటంకాలు ఉండబోవని ఆయన హామీ ఇచ్చారు.

చమురు అవసరాల కోసం అమెరికా ఎవరిపైనా ఆధారపడటం లేదని, ముఖ్యంగా గల్ఫ్ దేశాల చమురు తమకు అస్సలు అవసరం లేదని ట్రంప్ స్పష్టం చేశారు. ప్రపంచంలోనే అత్యధిక చమురు నిల్వలు ప్రస్తుతం అమెరికా వద్దే ఉన్నాయని ఆయన గర్వంగా ప్రకటించారు. ఒకవేళ వెనెజువెలా నిల్వలను కూడా కలిపితే.. ప్రపంచ చమురు సరఫరాలో 50 శాతానికి పైగా వాటా తమ పరిధిలోనే ఉంటుందన్నారు. తమ స్వంత అవసరాల కోసం కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్థిరత్వం కోసం మరియు మిత్రదేశాల ప్రయోజనాల కోసమే తాము ఈ ప్రాంతంలో జోక్యం చేసుకుంటున్నామని వివరించారు.

పశ్చిమాసియాలో తమకు అత్యంత నమ్మకమైన మిత్ర దేశాలైన ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ (యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్)ల భద్రతను కాపాడేందుకే అమెరికా ఈ సైనిక చర్యలకు పూనుకుందని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ దూకుడు కారణంగా ఈ దేశాల ఉనికికి, ఆర్థిక ప్రయోజనాలకు ముప్పు వాటిల్లకుండా అమెరికా సైన్యం ఒక కవచంలా నిలబడుతుందని చెప్పారు. మిత్రపక్షాల రక్షణ బాధ్యతను తాము ఎంతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని, ఈ ప్రాంతంలో శాంతిభద్రతలను కాపాడటంలో అమెరికా పాత్ర ఎల్లప్పుడూ అగ్రగామిగానే ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

అమెరికా జరిపిన మెరుపు దాడుల్లో ఇరాన్ సైన్యానికి చెందిన టాప్ కమాండర్లలో అత్యధిక మంది అంతమొందించబడ్డారని ట్రంప్ సంచలన విషయాలు వెల్లడించారు. ఇరాన్ అగ్రనేత అలీ ఖమేనీ ఇప్పటికే చనిపోయాడని, సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ కూడా 90 శాతం చనిపోయినట్లేనని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఇరాన్ వద్ద ఎలాంటి నౌకాదళం గానీ, వైమానిక దళం గానీ మిగలలేదని.. అంతా సర్వనాశనమైందని చెప్పారు. వారి గగనతల రక్షణ వ్యవస్థలను సైతం అమెరికా క్షిపణులు పూర్తిగా ధ్వంసం చేశాయని, అత్యున్నత నాయకత్వం మొత్తం హతమవడంతో ఇరాన్ సైన్యం ఇప్పుడు నాయకుడు లేని నౌకలా మారిందని ట్రంప్ విశ్లేషించారు.

మనసులో మాట

# అణు ముప్పును తప్పించిన ప్రధాని మోడీ!

- 2022లో ఉక్రెయిన్‌పై అణు దాడిని మోడీనే అడ్డుకున్నారు.
- పుతిన్ మోడీ మాటకు విలువనిస్తారు.
- భారత్, చైనా నాయకుల మాటకు రష్యా ప్రాధాన్యం.
- సంచలన వ్యాఖ్యలు చేసిన పోలాండ్ మంత్రి.



రష్యాఉక్రెయిన్ యుద్ధంలో భారత ప్రధాని నరేంద్రమోడీ కీలక పాత్ర పోషించాలని పోలాండ్ ఉప విదేశాంగ మంత్రి వ్లాడిస్లావ్ టియోఫిల్ బార్టోషెవ్స్కీ సంచలన వ్యాఖ్యలు చేశారు. 2022లో ఉక్రెయిన్‌పై వ్యూహాత్మక అణ్వాయుధాలను ప్రయోగించకుండా పుతిన్‌ను మోడీ అడ్డుకున్నారని చెప్పారు. మోడీ జోక్యంతోనే అణు యుద్ధంగా మారలేదని వెల్లడించారు. ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రపంచంలో కొద్ది మంది నేతల మాటలే వింటారని, అందులో ప్రధాని మోడీ ఒకరని అన్నారు. భారత్‌రష్యాల మధ్య దశాబ్దాల స్నేహ సంబంధాలు ఉన్నాయని, శాంతి చర్చల్లో భారత్ ప్రత్యేక స్థానం సంపాదించుకుందని ఆయన తెలిపారు. ప్రధాని మోడీ ప్రపంచవ్యాప్తంగా గౌరవం పొందిన నేత అని, ఆయన అభిప్రాయాలను పుతిన్ సీరియస్‌గా పరిగణిస్తారని పోలాండ్ మంత్రి అన్నారు. భారత్‌తో పాటు చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ కూడా పుతిన్‌తో మాట్లాడగలితే నాయకుడని తెలిపారు. రష్యా శత్రువులుగా భావించని దేశాల నుంచి వచ్చే సూచనల్ని పుతిన్ ప్రాధాన్యం ఇస్తారని ఆయన అభిప్రాయపడ్డారు. గతంలో రష్యా నుంచి భారత్ ముడి చమురు కొనుగోలు చేయడాన్ని విమర్శించిన విషయాన్ని మంత్రి గుర్తు చేసుకున్నారు. అయితే తక్కువ ధరల కారణంగా భారత్ ఈ నిర్ణయం తీసుకుందని ఇప్పుడు అర్థమైందని, ఈ అంశంపై భారత్‌పోలాండ్ మధ్య విభేదాలు తగ్గాయని అన్నారు. ఇటీవల సెయింట్ పీటర్స్ బర్గ్ అంతర్జాతీయ ఆర్థిక వేదికపై పుతిన్ మోడీని కొనియాడారు. ఆయనపై ఒత్తిడి తీసుకురావడం ఎవరి వల్ల సాధ్యం కాదని అన్నారు.

# ప్రధాని మోడీపై మరోసారి బేర్ గ్రిల్స్ ప్రశంసల జల్లు!

- మోడీ ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన నాయకుడు
- మరోసారి ప్రధాని మోడీపై బేర్ గ్రిల్స్ ప్రశంసలు
- 2019లో ''మ్యాన్ వర్సెస్ వైల్డ్''లో మోడీతో సాహసయాత్ర



బ్రిటిష్ అడ్వెంచరర్, ప్రముఖ టెలివిజన్ వ్యాఖ్యాత బేర్ గ్రిల్స్ మరోసారి ప్రధాని మోడీపై ప్రశంసలు కురిపించారు. ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన నాయకుల్లో మోడీ ఒకరు అంటూ సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ప్రస్తుతం వైరల్‌గా మారింది. మాజీ అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా, బ్రిటన్ యువరాజు ప్రిన్స్ విలియంతో పాటు ప్రధాని మోడీతో కలిసి దిగిన ఫొటోలను పంచుకున్న బేర్ గ్రిల్స్.. నిజమైన గొప్ప నాయకులు ఎప్పుడూ గట్టిగా మాట్లాడేవారు కాదని వ్యాఖ్యానించారు. బేర్ గ్రిల్స్ తన పోస్ట్‌లో.. ''ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన నాయకుల్లో కొందరిని కలిశాను. కానీ నిజంగా గొప్ప నాయకులు ఎప్పుడూ పెద్దగా హడావుడి చేయరు.'' అని రాశారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశమయ్యాయి.

''మ్యాన్ వర్సెస్ వైల్డ్''లో మోడీతో సాహసయాత్ర 2019లో ఉత్తరాఖండ్‌లోని జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్‌లో చిత్రీకరించిన 'మ్యాన్ వర్సెస్ వైల్డ్' ప్రత్యేక ఎపిసోడ్‌లో ప్రధాని మోడీ, బేర్ గ్రిల్స్ కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అడవుల్లో ట్రెక్కింగ్ చేయడం, భారీ వర్షంలో ప్రయాణించడం, గడ్డి, వెదురు సహాయంతో తాత్కాలిక తెప్ప తయారు చేయడం వంటి సాహస కార్యక్రమాలు చేపట్టారు. అదే సమయంలో పర్యావరణ పరిరక్షణ అవసరంపై ఇద్దరూ చర్చించారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ.. యువకుడిగా హిమాలయాల్లో గడిపిన రోజులు తన జీవితాన్ని పూర్తిగా మార్చాయని, ప్రకృతితో తనకు ప్రత్యేక అనుబంధాన్ని ఏర్పరిచాయని చెప్పారు. మనిషి ప్రకృతిని శత్రువుగా కాకుండా మిత్రుడిగా భావించాలని.. మనిషి ప్రకృతికి సహకరిస్తే.. ప్రకృతి కూడా మనిషికి సహకరిస్తుంది.'' అని పేర్కొన్నారు.

ఇక అడవిలో ప్రయాణించే సమయంలో పులుల నుంచి రక్షణ కోసం బేర్ గ్రిల్స్ ఒక తాత్కాలిక ఈటె తయారు చేశారు. అయితే దానిని ఆయుధంగా ఉపయోగించేందుకు ప్రధాని మోడీ నిరాకరించారు. ''నా పెంపకం ఏ ప్రాణినైనా చంపడానికి అనుమతించదు. కానీ మీరు పట్టుకోమంటున్నారు కాబట్టి దీన్ని చేతిలో ఉంచుకుంటాను.'' అంటూ మోడీ చెప్పిన మాటలు అప్పట్లో ట్రెండింగ్‌గా మారాయి. ఈ కార్యక్రమంలో ప్రధాని మోడీ స్వచ్ఛ భారత్ అభియాన్ గురించి కూడా ప్రస్తావించారు. వ్యక్తిగత పరిశుభ్రత భారతీయ సంస్కృతిలో భాగమని.. అదే విధంగా సమాజ పరిశుభ్రతపై కూడా ప్రతి ఒక్కరిలో బాధ్యత పెరగాల్సిన అవసరం ఉందని చెప్పారు.

కార్యక్రమం ప్రసారమైన తర్వాత.. బేర్ గ్రిల్స్‌కు హిందీ రాకపోయినా మోడీతో ఎలా మాట్లాడారనే సందేహం పలువురిలో వ్యక్తమైంది. దీనిపై తర్వాత 'మన్ కీ బాత్' కార్యక్రమంలో స్పందించిన ప్రధాని మోడీ.. షూటింగ్ మొత్తం సమయంలో ఇద్దరూ రియల్ టైమ్ ట్రాన్స్‌లేషన్ ఇయర్‌పీస్ టెక్నాలజీని ఉపయోగించినట్లు వెల్లడించారు.

**గతంలోనూ మోడీపై ప్రశంసలు**

'మ్యాన్ వర్సెస్ వైల్డ్' కార్యక్రమం తర్వాత కూడా బేర్ గ్రిల్స్ పలు సందర్భాల్లో ప్రధాని మోడీని ప్రశంసించారు. ఆయనను ''గొప్ప క్రీడాస్ఫూర్తి కలిగిన వ్యక్తి'', ''అసాధారణ ప్రపంచ నాయకుడు'' అంటూ అభివర్ణించారు.

# పర్షియన్ గల్ఫ్‌లో ఉద్రిక్తతలు: చిక్కుకున్న భారత నౌకలు!

అమెరికాఇరాన్‌ల మధ్య మళ్లీ యుద్ధ వాతావరణం నెలకొనడంతో వ్యూహాత్మక హర్మూజ్ జలసంధిలో నౌకల రవాణాకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో భారత జెండాతో ఉన్న 7 నౌకలు, అందులోని 148 మంది భారతీయ సిబ్బంది పర్షియన్ గల్ఫ్‌లోనే చిక్కుకుపోయినట్లు తాజాగా కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అలాగే, భారత్‌కు వస్తున్న ఎరువులు, ఇతర సరుకులతో కూడిన మరో 11 విదేశీ నౌకలను సురక్షితంగా తరలించేందుకు (ఎవాక్యుయేషన్) ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలిసింది. ప్రస్తుతం గల్ఫ్ రీజియన్‌లో చిక్కుకున్న భారతీయ నావికులను రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం భారత నౌకాదళంతో (ఇండియన్ నేవీ) నిరంతరం సమన్వయం చేసుకుంటున్నట్లు సమాచారం.



**మిస్సైల్ దాడుల్లో భారతీయుడి మృతి..**

ఇటీవల ఇరాన్‌అమెరికాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం రద్దయ్యాక గల్ఫ్ ప్రాంతంలో దాడులు ముదిరాయి. హర్మూజ్ జలసంధి గుండా వెళ్తున్న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (UAE) కు చెందిన 'మొంబాసా', 'అల్ బహియా' అనే రెండు ఆయిల్ ట్యాంకర్లపై మిస్సైల్ దాడులు జరిగాయి. ఈ ప్రమాదంలో ఒక భారతీయ నావికుడు మరణించగా, ఆరుగురు గాయపడ్డారు. తమ హెచ్చరికలను బేఖాతరు చేయడం వల్లే ఈ దాడులు చేసినట్లు ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (IRGC) ప్రకటించింది. తాజా ఘటనతో కలిపి ఈ ఏడాది ఫిబ్రవరి 28 నుంచి మొదలైన ఈ పశ్చిమాసియా ఘర్షణల్లో ఇప్పటివరకు ప్రాణాలు కోల్పోయిన భారతీయ నావికుల సంఖ్య 14కు చేరినట్లు జాతీయ మీడియా స్పష్టం చేస్తోంది.

**మార్గాల వివాదం..**

**పట్టుబడుతున్న అమెరికా, ఇరాన్**

హర్మూజ్ జలసంధిని దాటడానికి రెండు మార్గాలు ఉన్నాయి. ఒమన్ సరిహద్దుల గుండా వెళ్లే దక్షిణ మార్గాన్ని అమెరికా, అంతర్జాతీయ నౌకాయాన సంస్థ (IMO) సమర్థిస్తుండగా, తమ జలాల గుండా వెళ్లే ఉత్తర మార్గాన్నే వాడాలని ఇరాన్ పట్టుబడుతోంది. ఇరాన్ దాడుల భయంతో దక్షిణ మార్గంలో నౌకల రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. కొన్ని నౌకలు తమ లొకేషన్ ట్రాకర్లను (ట్రాన్స్‌పాండర్లు) నిలిపివేసి రహస్యంగా ప్రయాణిస్తున్నట్లు సమాచారం.

**భద్రతా ఛార్జీలపై ట్రంప్ ప్రకటన**

ఇరాన్ ఈ జలసంధిని మూసివేస్తామని హెచ్చరించడంతో, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. హర్మూజ్ జలసంధి ఎప్పటికీ తెరిచే ఉంటుందని, దానికి అమెరికా సైన్యమే సంరక్షకుడిగా ఉంటుందని స్పష్టం చేశారు. అయితే, ఈ మార్గం గుండా వెళ్లే అన్ని రకాల సరుకు రవాణాపై 20 శాతం భద్రతా రుసుము (ఛార్జీ) వసూలు చేస్తామని ట్రంప్ ప్రకటించడం అంతర్జాతీయంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ ప్రతిపాదనను అంతర్జాతీయ నౌకాయాన సంస్థ (IMO) తో పాటు ఇరాన్ కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

# వంశధార కాలువ గండి పడడంపై మంత్రి అచ్చెన్నాయుడు ఆగ్రహం!

- యుద్ధప్రాతిపదికన పూడ్చివేత పనులు చేపట్టాలని ఆదేశం
- ఇలాంటివి పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

**టెక్కలి, జులై 14 (మనసులో మాట) :**



శ్రీకాకుళం జిల్లా రైతాంగానికి ప్రధాన సాగునీటి వనరు అయిన వంశధార ప్రధాన ఎడమ కాలువకు గండి పడిన ఘటనపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రైతులు సాగు పనుల్లో నిమగ్నమైన తరుణంలో సారవకోట మండలం గుమ్మపాడు గ్రామం అక్కివలస పరిధిలో అధికారుల నిర్లక్ష్యం వల్ల కాలువకు గండి పడటం ఏమాత్రం సమర్థనీయం కాదని ఆయన స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా వ్యవహరించే అధికారులపై ప్రభుత్వం ఏమాత్రం ఉపేక్ష చూపబోదని తేల్చిచెప్పారు.

**యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలి**

కాలువకు పడిన గండిని తక్షణమే యుద్ధప్రాతిపదికన పూడ్చివేసి, సాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా పునరుద్ధరించాలని సంబంధిత ఇరిగేషన్ ఇంజినీర్లను మంత్రి ఆదేశించారు. పనులు పూర్తయ్యే వరకు ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలోనే ఉండి ప్రత్యక్ష పర్యవేక్షణ చేపట్టాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో ప్రతి నీటి చుక్క రైతుల పొలాలకు చేరేలా ఇరిగేషన్ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. కాలువల నిర్వహణ, బలహీన ప్రాంతాల గుర్తింపు, ముందస్తు మరమ్మతులు, నిరంతర తనిఖీలు చేపట్టడంలో అధికారులు విఫలం కావడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, ఇకపై నిరంతర నిఘా తప్పనిసరని మంత్రి స్పష్టం చేశారు.

**నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు..**

ప్రధాన కాలువలతో పాటు శాఖ కాలువలు, చెరువుల గట్లు, నీటి నిల్వ నిర్మాణాలన్నింటినీ ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ముందస్తు రక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. రైతుల ప్రయోజనాలే ఈ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం, సాగునీటి నిర్వహణలో అలసత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోం అని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

# జగన్ రెడ్డి విలువలతో కూడిన మాటలు మాట్లాడాలి

- కాశీబుగ్గ ఘటనలో మంత్రి అప్పలరాజుని వెనకేసుకురావడం సిగ్గుచేటు
- నేరాలను, ప్రమాదాలను ప్రోత్సహించే విధంగా జగన్ రెడ్డి మాటలు
- మత్స్యకారులకు తెలుగుదేశం పార్టీ అండదండలు
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**విజయనగరం, జులై 14 ( మనసులో మాట జిల్లా ప్రతినిధి) :**

మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి విలువలతో కూడిన మాటలు మాట్లాడాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ బోటు గల్లంతులో అదృశ్యమైన వారి కుటుంబాలను పరామర్శకు వచ్చి ప్రభుత్వంపై విమర్శలు చేయటం జగన్ రెడ్డికే చెల్లుబాటు అయిందన్నారు. జగన్ రెడ్డికి అధికారంలో ఉన్నప్పుడు మత్స్యకారులు, వారి సమస్యలు ఏనాడు గుర్తుకు రాలేదని... కేవలం రాజకీయ లబ్ధికోసమే జగన్‌కు ఇప్పుడు మత్స్యకారులు గుర్తుకు రావడం సిగ్గుచేటని మంత్రి విమర్శించారు. అబద్ధాలు ఆడడం జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య అని, బోటు గల్లంతైన విషయం తెలిసిన వెంటనే ప్రభుత్వం రక్షణ చర్యలు చేపట్టడంతో పాటు నాలుగు రోజులు పాటు హెలీకాప్టర్లు, మెరైన్ బోట్లతో సిబ్బంది విస్తృతమైన గాలింపు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రమాదంలో సురక్షితంగా ఉన్న చిన్నాను వెనువెంటనే కాపాడి వైద్య సేవలందించామని, చిన్నా సూచన మేరకు బోటు గల్లంతైన ప్రాంతం తెలుసుకుని మిగిలిన వారికోసం జల్లెడ పట్టినా వారి ఆచూకి లభించకపోవడం దురదృష్టకరమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం మాటల రూపంలో కాకుండా చేతలతో బాధిత కుటుంబాలకు తక్షణమే రు.10లక్షలు అందించిందని.. అదే గత వైసీపీ ప్రభుత్వంలో ఎందరో బాధితులకు పరిహారం ప్రకటించి ఎగ్గొట్టిన ఘనత కూడా జగన్ రెడ్డికే దక్కుతుందని మంత్రి విమర్శించారు. ప్రభుత్వం తరపున ఇద్దరు మంత్రులు బాధిత కుటుంబాలను పరామర్శించడంతోపాటు ఎమ్మెల్యేలు, ఇన్చార్జిలు వారికి ఆసరాగా నిలిచిన విషయాన్ని కూడా తప్పుదోవ పట్టిస్తూ విమర్శలు చేయటం బాధాకరమన్నారు. మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉందన్నారు. కాశీబుగ్గ ప్రమాద సంఘటన సైతం రాజకీయం చేయడం జగన్‌కు సిగ్గుమాలిన చర్య అని.. అక్కడ ప్రమాదం యాదృచ్ఛికమే అయినప్పటికీ ప్రమాదాన్ని తారుమారు చేసి మాజీ మంత్రి సిదిరి అప్పలరాజు తన కుమారుడు అరవ్ కోసం మరో అమాయకుడిని బలి చేయడం సరికాదని మంత్రి పేర్కొన్నారు. అలాగే చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని మాజీ మంత్రి కేసు తారుమారు చేయడాన్ని స్థానిక ప్రజలందరూ గుర్తించడం జరిగిందన్నారు.

# విషాదంలోనూ రాజకీయమేనా..!

**(మనసులో మాట ప్రత్యేక ప్రతినిధి)**

రాష్ట్రంలో విషాదకర సంఘటనలు జరిగినప్పుడు వాటిని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం అధికార, ప్రతిపక్షాలకు అలవాటుగా మారిపోయింది.తాజాగా చోటు చేసుకున్న బోటు ప్రమాదం విషయంలో కూడా పార్టీలు ఇంచుమించు ఇదే ధోరణిని అవలంబించడం దురదృష్టకరం.కూటమి ప్రభుత్వం సరే.. బోటు ప్రమాదం జరిగిన తర్వాత కాస్త అటు ఇటుగా ఆలస్యం జరిగినా స్పందించి గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం ప్రయత్నాలు చేసింది.అలాగే ప్రమాదం నుంచి బయటపడిన మత్స్యకారుడు చిన్నా వైద్య సహాయం కోసం ఏర్పాట్లు చేసింది.మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడంలో కూడా ప్రభుత్వం తనవంతు చర్యలు తీసుకోండి ఈ సహాయం ఇప్పటికీ తక్కువే అనిపించవచ్చేమో గాని రానున్న రోజుల్లో మరింత సాయం అందించేదో లేదో ఈలోగా ప్రతిపక్ష వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రంగంలోకి దిగిపోయి ఈ విషాద ఘటనను రాజకీయ ప్రయోజనం కోసం వాడుకునే ప్రయత్నాన్ని విస్తృతంగా చేసింది..చేస్తోంది! ప్రభుత్వం తన పని తాను చేస్తుండగానే వైసిపి నాయకులు విమర్శల దాడి ప్రారంభించారు.ఈరోజంటే జగన్ విశాఖ వచ్చి హడావిడి చేశారు గాని వైసిపి నాయకులు ఒకరి తర్వాత విశాఖపట్నం వచ్చి హడావిడి చేస్తూనే ఉన్నారు.ఇప్పటికే జగన్మోహన్ రెడ్డి ఆసుపత్రిలో కోలుకుంటున్న చిన్నాని ఫోన్లో పరార్శించారు..ఈరోజు ప్రత్యక్షంగా వచ్చారు.ఇలా రావడం తప్పు కాదు కాని ఇప్పటికే ఆందోళనలో..ఆవేదనతో ఉన్న మత్సకార కుటుంబాలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడడం విమర్శలకు గురైంది. ఈ విషయంలో స్వయంగా మత్స్యకారులే వైసిపి తీరుపై విరుచుకుపడుతున్నారు. వారి ఆవేదనలో అర్థం లేకపోలేదు. ఐదేళ్లు అధికారంలో ఉన్న జగన్మత్సకారుల్ని ఏనాడూ పట్టించుకోలేదు.అప్పట్లో రైతుభరోసా..వాహనమిత్ర వంటి పథకాలను అమలు చేసిన జగన్ ప్రభుత్వం మత్స్యకార భరోసా విషయంలో మొహం చాటేసింది. జగన్ ఐదేళ్ళ పాలనలో ఇలాగే అరవై మూడు మంది మత్స్యకారులు గల్లంతయితే ఒక్క కుటుంబానికి కూడా సాయం అందలేదు సరి కదా మరణ ధృవీకరణ సర్టిఫికెట్లు కూడా సకాలంలో అందలేదన్న విమర్శ ఉంది. ఓటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 63 మంది మత్స్యకారులకు కుటుంబానికి ఐదు లక్షలు రూపాయల చొప్పున బీమా సొమ్ము అందింది. ఇకపోతే.. 2023లో విశాఖ హార్బర్లో అగ్ని ప్రమాదం జరిగి సుమారు 45 మరబోట్లు పూర్తిగా,మరో 15 పడవలు పాక్షికంగా కాలిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు 50 కోట్ల రూపాయల మేరకు నష్టం జరిగినా జగన్ ప్రభుత్వం పెద్దగా సాయం అందించలేదని విమర్శలు ఉన్నాయి. అప్పట్లోనే చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ మత్స్యకారులకు వ్యక్తిగతంగా సహాయం అందించారు. అంతేకాదు.. అప్పట్లో మత్స్యకారుల చెరువులు, రిజర్వాయర్లను ఒక జీవో ద్వారా సొంత మనుషులకు కట్టబెట్టే ప్రయత్నాన్ని జగన్ సర్కార్ చేసిందని విమర్శలు ఉన్నాయి.ఇప్పుడు ఆ జీవో రద్దయింది.వైసీపీ ప్రభుత్వం హయాంలోనే ఆక్వా రంగం పూర్తిగా దెబ్బ తినేసింది. ఆనాడు మత్స్యకారులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిన జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు విశాఖపట్నం వచ్చి మత్స్యకార కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సానుభూతి పొందడమే కాకుండా కూటమి ప్రభుత్వాన్ని అస్థిర పరిచే ప్రయత్నాలు చేస్తుందన్న విమర్శలు పెద్ద ఎత్తున మొదలయ్యాయి.




# భగ్గుమన్న చమురు

పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా మార్కెట్లు ఒడుదొడుకులను ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో దేశీయ మార్కెట్లు మంగళవారం నష్టాల్లో ప్రారంభమయ్యాయి. హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతల తో చమురు మంటలు భగ్గుమంటున్నాయి. దాంతో సూచీలపై ప్రతికూల ప్రభావం పడింది. హర్మూజ్‌ను దిగ్బంధిస్తున్నాం.. టోల్ వసూలు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో మరోసారి చమురు ధరలు భారీగా పెరిగాయి. నెలరోజుల గరిష్ఠానికి చేరాయి. బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ ఒక బ్యారెల్‌కు రెండు శాతం పెరిగి 85 డాలర్లకు చేరింది. యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ క్రూడ్ రెండు శాతం పెరిగి 80 డాలర్లకు పెరిగింది. గత సెషన్‌లో 9.6 శాతం పెరిగింది. 2020 మే తర్వాత ఒకేరోజు ఈ స్థాయి పెరుగుదల నమోదైంది. ఈ పరిణామాల నేపథ్యంలో.. ఉదయం 9.39 గంటల సమయంలో సెన్సెక్స్ 412 పాయింట్లు పడిపోయి, 77,203 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 107 పాయింట్లు నష్టపోయి, 24,103 వద్ద కదలాడుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 42 పైసలు పడిపోయి, 96.10కి కుంగింది. నిఫ్టీ సూచీలో హిందాల్కో, సిప్లా, భారతీ ఎయిర్‌టెల్, నెస్లె, టీసీఎస్ షేర్లు లాభాల్లో ఉండగా.. శ్రీరామ్ ఫైనాన్స్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎంఅండ్ఎం షేర్లు నష్టపోతున్నాయి. ఇక, సోమవారం అమెరికా మార్కెట్లు నష్టపోగా.. ఆసియా మార్కెట్లు అదే బాటలో ఉన్నాయి.

# పాత vs కొత్త ట్యాక్స్: ఏది బెస్ట్?




ఆదాయపు పన్ను దాఖలు చేసే సీజన్ వచ్చిందంటే చాలా మంది పన్ను చెల్లింపుదారుల ముందు కొచ్చే పెద్ద సందేహం.. పాత ట్యాక్స్ విధానం ఎంచుకోవాలా? లేక కొత్త ట్యాక్స్ విధానం తీసుకోవాలా? ఈసారి మాత్రం ఎక్కువ మంది ఉద్యోగులకు కొత్త ట్యాక్స్ విధానమే లాభదాయకంగా ఉండొచ్చని తాజా విశ్లేషణలు చెబుతున్నాయి. అయితే భారీ మొత్తంలో పన్ను మినహాయింపులు క్లెయిమ్ చేసే వారికి పాత విధానం ఇంకా ప్రయోజనకరంగా ఉండే అవకాశముందని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం కొత్త ట్యాక్స్ విధానమే డిఫాల్ట్‌గా అమల్లో ఉంది. పన్ను చెల్లింపుదారులు ప్రత్యేకంగా పాత విధానాన్ని ఎంపిక చేయకపోతే వారి ఆదాయపు పన్ను రిటర్న్ కొత్త విధానం ప్రకారమే ప్రాసెస్ అవుతుంది. అందువల్ల రిటర్న్ దాఖలు చేసే ముందు రెండు విధానాల్లో పన్ను లెక్కలు వేసుకుని నిర్ణయం తీసుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. గ్రాంట్ థార్న్టన్ భారత్ 202526 ఆర్థిక సంవత్సరానికి చేసిన విశ్లేషణ ప్రకారం.. 60 ఏళ్లలోపు జీతభత్యాలు తీసుకునే వ్యక్తి పాత విధానంలో సెక్షన్ 80C కింద రూ.1.5 లక్షలు, సెక్షన్ 80D కింద రూ.25 వేల ఆరోగ్య బీమా, రూ.2 లక్షల HRA, రూ.50 వేల స్టాండర్డ్ డిడక్షన్ కలిపి మొత్తం రూ.4.25 లక్షల డిడక్షన్లు క్లెయిమ్ చేసినా, రూ.25 లక్షల వార్షిక ఆదాయంపై పన్ను సుమారు రూ.4,52,400 చెల్లించాల్సి ఉంటుంది. అదే కొత్త ట్యాక్స్ విధానంలో రూ.75 వేల స్టాండర్డ్ డిడక్షన్‌తో పన్ను రూ.3,19,800 మాత్రమే ఉంటుంది. అంటే దాదాపు రూ.1,32,600 వరకు ఆదా అవుతుంది. ఇదే విధంగా రూ.50 లక్షల వార్షిక ఆదాయం ఉన్నవారికి కూడా కొత్త విధానంలో దాదాపు రూ.1.32 లక్షల వరకు పన్ను ఆదా అవుతుందని చెబుతున్నారు. రూ.75 లక్షలు, రూ.1 కోటి ఆదాయం ఉన్నవారికి 10 శాతం సర్‌చార్జ్ వర్తించినప్పటికీ కొత్త ట్యాక్స్ విధానంలో సుమారు రూ.1.46 లక్షల వరకు ఆదా అవుతుందని ఈ నివేదిక పేర్కొంది.

అయితే పాత ట్యాక్స్ విధానం పూర్తిగా ఉపయోగం లేకుండా పోయిందని భావించాల్సిన అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా సెక్షన్ 24(b) కింద హోమ్ లోన్ వడ్డీపై రూ.2 లక్షల వరకు మినహాయింపు, మెట్రో నగరాల్లో అధిక HRA, 80CCD(1B) కింద NPSలో అదనపు పెట్టుబడులు, సీనియర్ సిటిజన్ తల్లిదండ్రుల ఆరోగ్య బీమాపై అధిక 80D డిడక్షన్లు వంటి ప్రయోజనాలు పొందే వారికి పాత విధానం ఇంకా లాభదాయకంగా ఉండే అవకాశం ఉందని వెల్లడించారు. మొత్తం డిడక్షన్లు రూ.8 లక్షలకు పైగా ఉంటే రెండు విధానాలను తప్పనిసరిగా పోల్చి చూసి నిర్ణయం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. "పాత, కొత్త ట్యాక్స్ విధానాల్లో ఏది ఎంచుకోవాలన్నది అందరికీ ఒకేలా ఉండదు. కొత్త విధానం తక్కువ పన్ను రేట్లు, సులభమైన విధానాన్ని అందిస్తున్నప్పటికీ, ఎక్కువ డిడక్షన్లు, మినహాయింపులు పొందే వారికి పాత విధానం మెరుగైన ఫలితాలు ఇవ్వొచ్చు. కాబట్టి కేవలం పన్ను రేట్లను చూసి కాకుండా, వ్యక్తిగత ఆదాయం, డిడక్షన్లు, మినహాయింపుల ఆధారంగా పన్ను లెక్కలు వేసుకుని నిర్ణయం తీసుకోవాలి" అని నిపుణులు సూచిస్తున్నారు. జీతభత్యాలు పొందే ఉద్యోగులకు ప్రతి ఏడాది ట్యాక్స్ విధానాన్ని మార్చుకునే అవకాశం ఉంటుంది. కంపెనీ TDS కొత్త విధానం ప్రకారం కట్ చేసినా, ఐటీఆర్ దాఖలు చేసే సమయంలో పాత విధానాన్ని ఎంచుకుని అదనంగా చెల్లించిన పన్నును రీఫండ్ రూపంలో పొందే అవకాశం ఉంటుంది. అయితే వ్యాపార లేదా వృత్తి ఆదాయం ఉన్న వారు మాత్రం ట్యాక్స్ విధానం ఎంపికలో మరింత జాగ్రత్తగా ఉండాల్సి ఉంటుందని చెబుతున్నారు. నిపుణుల సూచన ప్రకారం.. ఐటీఆర్ ఫైల్ చేసే ముందు ఆదాయపు పన్ను శాఖ అందుబాటులో ఉంచిన ట్యాక్స్ కాలిక్యులేటర్ ద్వారా రెండు విధానాల్లో పన్ను లెక్కలు వేసుకోవాలన్నారు. డిడక్షన్లు తక్కువగా ఉంటే కొత్త విధానం ఎక్కువ ప్రయోజనం ఇవ్వొచ్చని, భారీ డిడక్షన్లు ఉంటే రెండు విధానాలను పోల్చి చూసి తమకు ఏది లాభదాయకమో నిర్ణయం తీసుకోవడం ఉత్తమమని సూచిస్తున్నారు.



# వన్‌ప్లస్‌కు పశ్చిమ మార్కెట్ల గుడ్‌బై!

ఒకప్పుడు "ఫ్లాగ్‌షిప్ కిల్లర్" గా మార్కెట్లోకి అడుగుపెట్టి, సగం ధరకే ప్రీమియం ఫీచర్లను అందిస్తూ గ్లోబల్ మొబైల్ రంగంలో సంచలనం సృష్టించిన ప్రముఖ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ 'వన్‌ప్లస్' తన సుదీర్ఘ ప్రయాణాన్ని ముగించే దిశగా అడుగులు వేస్తోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. వన్‌ప్లస్ బ్రాండ్ అమెరికా, యూరప్ మార్కెట్ల నుండి మొబైల్ విక్రయాలను పూర్తిగా నిలిపివేయడానికి సిద్ధమవుతోంది. జర్మనీకి చెందిన ప్రముఖ మీడియా సంస్థ 'విన్‌ఫ్యూచర్' కథనం ప్రకారం.. వన్‌ప్లస్, దాని మాతృ సంస్థ 'ఒప్పో'తమ వ్యాపార వ్యూహంలో భాగంగా ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన రెండు పశ్చిమ దేశాల మార్కెట్ల నుండి వన్‌ప్లస్ బ్రాండ్ పూర్తిగా నిష్క్రమించబోతోంది. ఇప్పటికే దీనికి సంబంధించి రహస్య ప్రెస్ మీటింగ్‌లు కూడా పూర్తయ్యాయని, అయితే ఈ నిర్ణయం వెనుక గల ఖచ్చితమైన కారణాలను వెల్లడించడానికి కంపెనీ ప్రతినిధులు నిరాకరించినట్లు సమాచారం.

**భారత్, చైనా మార్కెట్లలో యథాతదం**

ఈ నిష్క్రమణ వార్తల్లో భారత్, చైనా మార్కెట్ల ప్రస్తావన ఎక్కడా రాలేదు. ఒప్పో(Oppo) గొడుగు కింద వన్‌ప్లస్ బ్రాండ్ కేవలం ఒక సబ్‌ప్రొడక్ట్ లైన్‌గా మాత్రమే ఈ రెండు దేశాల్లో కొనసాగే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. అంటే తక్కువ బడ్జెట్ ఫోన్లు, టాబ్లెట్‌ల విక్రయాలకే పరిమితం కానుందని సమాచారం. నిజానికి వన్‌ప్లస్ బ్రాండ్ ఇప్పటికీ మనుగడ సాగించడానికి ప్రధాన కారణం భారతదేశమే. వన్‌ప్లస్ గ్లోబల్ సేల్స్‌లో సగానికి పైగా వాటా భారత్ నుంచే వస్తోంది. ముఖ్యంగా ఇక్కడి మిడ్‌రేంజ్ మార్కెట్లో వన్‌ప్లస్ 'నార్డ్' (Nord) సిరీస్ ఫోన్లకు విపరీతమైన డిమాండ్ ఉంది.

**పాత ఫోన్ల యూజర్ల పరిస్థితి ఏంటి?**

అయితే, ఇప్పటికే వన్‌ప్లస్ ఫోన్లు వాడుతున్న కస్టమర్ల విషయంలో కంపెనీ సానుకూలంగా స్పందించింది. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న మరియు ఇప్పటికే విక్రయించిన డివైజ్‌లకు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌లు, ఆఫ్టర్‌సేల్స్ సర్వీస్ యథావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేసింది. కాకపోతే.. ఇకపై కొత్త ఫోన్ల లాంచ్ ఉండదు, కొత్త స్టాక్ రాదు, ఎలాంటి మార్కెటింగ్ ప్రచారాలు జరగవు. ప్రస్తుతం అమెరికా, యూరప్‌లలో మిగిలి ఉన్న స్టాక్‌ను రాబోయే కొద్ది వారాల్లో విక్రయించి క్లియర్ చేయనున్నారు. ఇప్పటికే జర్మనీ, ఫ్రాన్స్, స్పెయిన్ దేశాల్లోని వన్‌ప్లస్ ఆన్‌లైన్ స్టోర్స్ దాదాపు ఖాళీ అయ్యాయి.

యూరప్ మార్కెట్లో వన్‌ప్లస్ వదిలిన స్థానాన్ని ఒప్పో భర్తీ చేయాలని చూస్తోంది. కానీ, ఒప్పో ఫోన్ల ధరలు వన్‌ప్లస్ కంటే చాలా ఎక్కువ. ఒక వాల్యూఫర్‌మనీ బ్రాండ్ స్థానాన్ని ప్రీమియం బ్రాండ్‌తో భర్తీ చేయాలనుకోవడం పెద్ద మైనస్ అని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఒప్పో నుండి దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నప్పటికీ.. ఇటీవల విడుదలైన 'వన్‌ప్లస్ 15' (OnePlus 15) పాశ్చాత్య దేశాలలో ఈ బ్రాండ్ నుండి వచ్చిన చివరి ఫ్లాగ్‌షిప్ ఫోన్‌గా మిగిలిపోనుంది.

# క్రెడిట్ కార్డులతో ఎల్ఐసీ ప్రీమియంల బంద్!




ప్రముఖ ప్రభుత్వరంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(LIC) తమ పాలసీదారులకు ఊహించని షాక్ ఇచ్చింది. తన అధికారిక వెబ్‌సైట్ అంటే కస్టమర్ పోర్టల్, మొబైల్ యాప్‌లో క్రెడిట్ కార్డ్ (Credit Card) ద్వారా ప్రీమియం చెల్లించే ఆప్షన్‌ను పూర్తిగా నిలిపివేసింది. గత 15 రోజుల క్రితమే గుట్టుచప్పుడు కాకుండా ఈ నిర్ణయం అమలులోకి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఎల్ఐసీ అధికారిక వేదికలపై కేవలం నెట్ బ్యాంకింగ్, డెబిట్ కార్డ్, యూపీఐ (UPI) ఆప్షన్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

**ఎందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు?**

సాధారణంగా గూగుల్ పే, ఫోన్ పే వంటి ఇతర థర్డ్ పార్టీ ప్లాట్‌ఫామ్‌లలో క్రెడిట్ కార్డుతో ఎల్ఐసీ ప్రీమియం చెల్లిస్తే కస్టమర్లపై అదనపు రుసుములు పడేవి. కానీ, ఎల్ఐసీ అధికారిక యాప్‌లో క్రెడిట్ కార్డుతో చెల్లించినప్పుడు ఆ కార్డ్ గేట్‌వే ఛార్జీలను వినియోగదారుల తరఫున ఎల్ఐసీనే భరించేది. అయితే, ఇటీవల కాలంలో క్రెడిట్ కార్డుల ద్వారా ప్రీమియం చెల్లించే వారి సంఖ్య భారీగా పెరిగింది. దీనివల్ల బ్యాంకులు, పేమెంట్ గేట్‌వేలకు ఎల్ఐసీ చెల్లించాల్సిన ఫీజుల భారం కోట్లాది రూపాయలకు చేరింది. ఈ అదనపు ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడానికే ఎల్ఐసీ తన పోర్టల్ నుండి క్రెడిట్ కార్డ్ చెల్లింపుల ఆప్షన్‌ను శాశ్వతంగా తొలగించినట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

**ఇప్పుడు చెల్లింపులు ఎలా?**

ఒకవేళ ఖచ్చితంగా క్రెడిట్ కార్డునే ఉపయోగించి ఎల్ఐసీ ప్రీమియం చెల్లించాలనుకుంటే, ఈ క్రింది ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవచ్చు. గూగుల్ పే (Google Pay), ఫోన్ పే (PhonePe), పేటీఎం (Paytm), అమెజాన్ పే (Amazon Pay) వంటి యాప్స్ ద్వారా క్రెడిట్ కార్డు ఉపయోగించి ప్రీమియం చెల్లించవచ్చు. అయితే, ఈ యాప్స్ ద్వారా చెల్లించేటప్పుడు వర్తించే ట్రాన్సాక్షన్, కన్వీనియన్స్ ఫీజుల భారాన్ని వినియోగదారులే స్వయంగా భరించాల్సి ఉంటుంది. ఎలాంటి అదనపు రుసుములు (Extra Charges) లేకుండా ఉచితంగా ప్రీమియం చెల్లించాలనుకుంటే ఎల్ఐసీ అధికారిక యాప్‌లో UPI, డెబిట్ కార్డ్, నెట్ బ్యాంకింగ్ మార్గాలను ఎంచుకోవాల్సి ఉంటుంది.

## కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డ్ యూజర్ల అసంతృప్తి

యాక్సిస్ బ్యాంక్ (Axis Bank), ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ (IDFC First Bank) వంటి సంస్థలతో కలిసి ఎల్ఐసీ జారీ చేసిన కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డులకు కూడా ఈ కొత్త నిబంధన వర్తిస్తుంది. ఇతర ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ప్రీమియం చెల్లించినప్పుడు రివార్డు పాయింట్లు లభించినప్పటికీ, గేట్‌వే ఛార్జీల భారం పడటంతో ఈ కో-బ్రాండెడ్ కార్డుల వల్ల అసలు ప్రయోజనం ఏముందని పాలసీదారులు సామాజిక మాధ్యమాల్లో పెదవి విరుస్తున్నారు.

# ధ్రువ స్పేస్‌కు ₹60 కోట్లు

**హైదరాబాద్:**

భారత అంతరిక్ష రంగం అభివృద్ధికి ప్రత్యేకించిన 'అంతరిక్ష వెంచర్ క్యాపిటల్ ఫండ్' నుంచి పెట్టుబడులు అందుకున్న దేశీయ తొలి సంస్థగా హైదరాబాద్‌కు చెందిన ధ్రువ స్పేస్ నిలిచింది. ఈ సంస్థకు రూ.60 కోట్లు లభించాయి. భారత ప్రభుత్వానికి చెందిన ఇన్‌స్పేస్ ఆధ్వర్యంలోని అంతరిక్ష వెంచర్ వద్ద రూ.1,000 కోట్లు ఉండగా, సిడ్బీ పూర్తి అనుబంధ సంస్థ సిడ్బీ వెంచర్ క్యాపిటల్ లిమిటెడ్ ఈ మొత్తాన్ని నిర్వహిస్తోంది. స్వదేశీ ఉపగ్రహాల తయారీ సామర్థ్యాలను బలోపేతం చేసుకోవడం, సరికొత్త ఉత్పత్తుల ఆవిష్కరణను వేగవంతం చేయడం, మౌలిక వసతులను అంతర్జాతీయ స్థాయికి విస్తరించేందుకు ఈ నిధులు వినియోగిస్తామని ధ్రువస్పేస్ సహ వ్యవస్థాపకుడు, సీఎఫ్ఓ చైతన్య దొర సూరపరెడ్డి పేర్కొన్నారు.

సిడ్బీ వెంచర్ క్యాపిటల్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ అరూప్ కుమార్ స్పందిస్తూ.. ఆవిష్కరణలు, తయారీ సామర్థ్యం, అంతరిక్ష ప్రయోగాల నిర్వహణ, వాణిజ్య విస్తరణను ఒకే చోట అందించే సంస్థలే రేపటి తరం అంతరిక్ష దిగ్గజాలుగా వృద్ధి చెందుతాయన్నారు. తమ తొలి పెట్టుబడి ఆ నమ్మకాన్ని ప్రతిబింబిస్తోందని తెలిపారు.

# మార్కెట్ అంచనాలను మించిన హెచ్‌సీఎల్ టెక్!

- వార్షికాదాయ వృద్ధి 1-4 శాతంగా అంచనా
- ఒక్కో షేరుకు రూ.12 మధ్యంతర డివిడెండ్
- సంస్థ ఉద్యోగుల సంఖ్యలో 3,292 తగ్గుదల
- క్యూ1 లాభంలో 20% వృద్ధి
- రూ.4,624 కోట్లుగా నమోదు
- రూ.34,579 కోట్లకు ఆదాయం




**న్యూఢిల్లీ:**

దేశీయ ఐటీ సేవల సంస్థ హెచ్‌సీఎల్ టెక్ ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాలను మించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (202627)లో జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి (క్యూ1) కంపెనీ రూ.4,624 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం (202526)లో ఇదే కాలానికి నమోదైన రూ.3,843 కోట్ల లాభంతో పోలిస్తే 20 శాతం వృద్ధి కనబరిచింది. ఈ క్యూ1లో కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 14 శాతం పెరిగి రూ.34,579 కోట్లకు చేరుకుంది. ఈ ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఆదాయ వృద్ధి అంచనాను గతంలో ప్రకటించిన 14 శాతంగా కొనసాగిస్తున్నట్లు సంస్థ వెల్లడించింది. కాగా, వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.12 మధ్యంతర డివిడెండ్ చెల్లించనున్నట్లు హెచ్‌సీఎల్ టెక్ బోర్డు ప్రకటించింది. డివిడెండ్‌కు అర్హులైన వాటాదారుల ఎంపికకు రికార్డు తేదీని ఈ నెల 17గా నిర్ణయించిన కంపెనీ.. 27న చెల్లింపులు చేపట్టనున్నట్లు తెలిపింది. మరిన్ని ముఖ్యాంశాలు.. ఏప్రిల్‌జూన్ త్రైమాసికంలో సంస్థ.. జర్మనీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ నుంచి 114 కోట్ల డాలర్ల విలువైన మెగా ఏఐ డీల్‌తో సహా మొత్తం 240 కోట్ల డాలర్ల విలువైన కొత్త ఆర్డర్లను దక్కించుకుంది. సంస్థ చరిత్రలో ఇవే అత్యధిక క్యూ1 ఆర్డర్లని హెచ్‌సీఎల్ టెక్ సీఈఓ, ఎండీ సీ విజయ్ కుమార్ తెలిపారు. అడ్వాన్స్‌డ్ ఏఐ సేవల ద్వారా సంస్థకు గడిచిన మూడు నెలల్లో 17.1 కోట్ల డాలర్ల ఆదాయం సమకూరింది. ఈ విషయంలో త్రైమాసిక ప్రాతిపదికన 10.6 శాతం, వార్షిక ప్రాతిపదికన ఏకంగా 62.1 శాతం వృద్ధిని నమోదు చేసింది. జూన్ త్రైమాసికంలో హెచ్‌సీఎల్ టెక్ మొత్తం ఉద్యోగుల సంఖ్య 3,292 తగ్గి 2,23,889కి పరిమితమైంది. మూడు నెలల్లో కంపెనీ సిబ్బంది ఈ స్థాయిలో తగ్గడం గడిచిన రెండేళ్లలో ఇదే మొదటిసారి. గత త్రైమాసికంలో 1,059 మంది ఫ్రెషర్లను ఉద్యోగంలో చేర్చుకున్నట్లు సంస్థ తెలిపింది. కాగా, ఉద్యోగుల వలసల (అట్రిషన్) రేటు 12.7 శాతానికి పెరిగింది.

**రూ.3,500 కోట్లతో ఏఐ డేటా సెంటర్ల ఏర్పాటు**

దేశంలో 50 మెగావాట్ల వరకు సామర్థ్యంతో ఏఐ డేటా సెంటర్ల ఏర్పాటు కోసం రూ.3,500 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు బోర్డు ఆమోదం తెలిపిందని హెచ్‌సీఎల్ టెక్ సోమవారం ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా వెల్లడించింది. డేటా సెంటర్ల ఏర్పాటు కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్న కొత్త అనుబంధ విభాగాల ద్వారా ఈ పెట్టుబడులు పెట్టనున్నట్లు సంస్థ తెలిపింది. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల నుంచి ఏఐ ఆధారిత సేవలు, పరిష్కారాలకు గిరాకీ పెరుగుతున్న తరుణంలో ఈ విభాగం పూర్తి స్థాయి వ్యాపార అవకాశాలను చేజిక్కించుకునేందుకు ఫుల్ స్టాక్ ఏఐ మార్కెట్లోకి ప్రవేశిస్తున్నట్లు కంపెనీ ప్రకటించింది.

# తగ్గిన బంగారం ధరలు..

మంగళవారం బంగారం ధరలు మరింత తగ్గాయి. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై 110 రూపాయలు.. 22 క్యారెట్ల బంగారంపై 100 రూపాయలు.. 18 క్యారెట్ల బంగారంపై 80 రూపాయలు తగ్గింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం.. ఉదయం 10 గంటల ప్రాంతంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,42,800 రూపాయల వద్ద.. 22 క్యారెట్ల బంగారం ధర 1,30,900 రూపాయల వద్ద.. 18 క్యారెట్ల బంగారం ధర 1,07,100 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది.



# సీఎస్‌కే కొత్త కోచ్ రేసులో ముగ్గురు..
# భారత్ నుంచి ఇద్దరు క్రికెట్ దిగ్గజాలు!

- సీఎస్‌కే కొత్త కోచ్ రేసులో ముగ్గురు.. భారత్ నుంచి ఇద్దరు క్రికెట్ దిగ్గజాలు!
- 18 ఏళ్ల అనుబంధానికి స్టీఫెన్ ఫ్లెమింగ్ ముగింపు
- సీఎస్‌కే కొత్త కోచ్ రేసులో ముగ్గురు పేర్లు
- చెన్నై యాజమాన్యం ఎవరిని ఎంపిక చేస్తుందో



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) చరిత్రలో అత్యంత విజయవంతమైన కోచ్‌లలో ఒకరిగా గుర్తింపు పొందిన స్టీఫెన్ ఫ్లెమింగ్.. చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)తో తన 18 ఏళ్ల అనుబంధానికి ముగింపు పలికాడు. 2008లో ఐపీఎల్ ప్రారంభ సీజన్‌లో సీఎస్‌కే తరఫున ఆటగాడిగా బరిలోకి దిగిన ఫ్లెమింగ్.. 2009 నుంచి హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టి ఫ్రాంచైజీని విజయాల బాటలో నడిపించాడు. ఫ్లెమింగ్ మార్గదర్శకత్వంలో సీఎస్‌కే ఐదు ఐపీఎల్ టైటిళ్లు, రెండు చాంపియన్స్ లీగ్ టీ20 ట్రోఫీలను గెలుచుకుంది. అంతేకాదు 10 ఐపీఎల్ ఫైనల్స్, 12 సార్లు ప్లేఆఫ్స్‌కు చేరి లీగ్‌లో అత్యంత స్థిరమైన జట్టుగా నిలిచింది. దాదాపు రెండు దశాబ్దాల పాటు సీఎస్‌కే విజయాల వెనుక ప్రధాన శక్తిగా ఫ్లెమింగ్ నిలిచాడు.

**స్వయంగా తప్పుకున్న ఫ్లెమింగ్:**
అయితే గత మూడు సీజన్లుగా సీఎస్‌కే ఆశించిన స్థాయిలో రాణించలేదు. 2023లో టైటిల్ గెలిచిన తర్వాత 2024లో ఐదో స్థానం, 2025లో పదో స్థానం, 2026లో ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలోనే న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ స్టీఫెన్ ఫ్లెమింగ్ జట్టు నుంచి స్వయంగా తప్పుకున్నాడు. పరస్పర అంగీకారంతోనే వైదొలిగినట్లు ఫ్లెమింగ్ సహా చెన్నై యాజమాన్యం కూడా తెలిపింది. ఫ్లెమింగ్ వైదొలగడంతో ఇప్పుడు అతడి స్థానాన్ని భర్తీ చేసే కోచ్ ఎవరు అనే చర్చ సోషల్ మీడియాలో మొదలైంది. సీఎస్‌కే కొత్త కోచ్ రేసులో ముగ్గురు పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. అందులో ఇద్దరు భారత దిగ్గజాల పేర్లు ఉన్నాయి.

**రాహుల్ ద్రవిడ్:**
టీమిండియాకు 2024 టీ20 ప్రపంచ కప్‌ను అందించిన మాజీ హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ సీఎస్‌కేకు ప్రధాన ఎంపికగా కనిపిస్తున్నాడు. ప్రస్తుతం ఏ జట్టుకూ కోచ్‌గా వ్యవహరించని ద్రవిడ్‌కు ఎంతో అనుభవం ఉంది. 2018లో భారత అండర్19 జట్టును ప్రపంచ ఛాంపియన్‌గా నిలబెట్టిన ఆయన.. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు కూడా కోచ్‌గా పనిచేశాడు. ద్రవిడ్ ప్రశాంత స్వభావం, యువ ఆటగాళ్లను తీర్చిదిద్దే నైపుణ్యం సీఎస్‌కే సంస్కృతికి బాగా సరిపోతాయని క్రికెట్ వర్గాలు అంటున్నాయి. మంచి అవకాశం వస్తే మళ్లీ కోచింగ్ బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు ద్రవిడ్ ఇటీవలే వెల్లడించాడు.

**మార్క్ బౌచర్:**
దక్షిణాఫ్రికా మాజీ వికెట్ కీపర్‌బ్యాటర్ మార్క్ బౌచర్ కూడా సీఎస్‌కే పరిశీలనలో ఉన్న మరో బలమైన అభ్యర్థి. 2019 నుంచి 2022 వరకు దక్షిణాఫ్రికా జాతీయ జట్టుకు హెడ్ కోచ్‌గా పనిచేసిన బౌచర్.. ఆ తర్వాత ముంబై ఇండియన్స్‌కు కూడా కోచ్‌గా సేవలందించాడు. అతని నాయకత్వంలో ముంబై 2023 సీజన్‌లో ప్లేఆఫ్స్‌కు చేరింది. అంతకుముందు దక్షిణాఫ్రికా దేశవాళీ జట్టు 'టైటాన్స్'ను నడిపించిన అనుభవం కూడా బౌచర్‌కు ఉంది. అంతర్జాతీయ, ఫ్రాంచైజీ క్రికెట్‌లో అతని అనుభవం సీఎస్‌కేకు ఉపయోగపడే అవకాశం ఉంది.

**ఎంఎస్ ధోనీ:**
చెన్నై అభిమానులు ఎక్కువగా కోరుకునే పేరు ఎంఎస్ ధోనీ. ప్రస్తుతం అధికారికంగా ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ప్రకటించకపోయినా.. 2026 సీజన్‌లో కాలి కండరాల గాయం కారణంగా ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. ఇటీవలే 45 ఏళ్లు పూర్తి చేసుకున్న ధోనీ.. త్వరలో ఆటకు వీడ్కోలు పలికే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే సీఎస్‌కే హెడ్ కోచ్‌గా ధోనీ బాధ్యతలు చేపట్టే అవకాశం కూడా ఉందని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జట్టుతో అతనికి ఉన్న అనుబంధం, ఆటగాళ్లపై ప్రభావం, వ్యూహాత్మక ఆలోచనలు సీఎస్‌కేను మళ్లీ విజయాల బాటలో నడిపించగలవు.

**సీఎస్‌కే ముందు పెద్ద సవాలు:**
స్టీఫెన్ ఫ్లెమింగ్ వంటి దిగ్గజ కోచ్ స్థానాన్ని భర్తీ చేయడం అంత తేలికైన విషయం కాదు. కొత్త కోచ్ జట్టును మళ్లీ టైటిల్ పోరులో నిలబెట్టడమే కాకుండా.. ఆధునిక టీ20 క్రికెట్‌కు తగ్గట్టుగా సీఎస్‌కే ఆటతీరును మార్చాల్సిన బాధ్యత కూడా ఉంటుంది. కోచ్ రేసులో ప్రస్తుతం రాహుల్ ద్రవిడ్, మార్క్ బౌచర్, ఎంఎస్ ధోనీ పేర్లు బలంగా వినిపిస్తున్నా.. చివరికి చెన్నై యాజమాన్యం ఎవరిని ఎంపిక చేస్తుందో అనేది ఆసక్తికరంగా మారింది.



## రీఎంట్రీ మ్యాచ్‌లో రికార్డుల వర్షం..
# చరిత్ర సృష్టించిన బుమ్రా..

భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా వన్డే క్రికెట్‌లో ఘనంగా రీఎంట్రీ ఇచ్చాడు. 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్ తర్వాత 968 రోజుల విరామం అనంతరం ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి వన్డేలో బరిలోకి దిగిన బుమ్రా, రీఎంట్రీ మ్యాచ్‌లోనే రెండు అరుదైన రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరుగుతున్న తొలి వన్డేలో టాస్ గెలిచిన ఇంగ్లండ్ బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి స్పెల్‌లో నాలుగు ఓవర్లు వేసిన బుమ్రాకు వికెట్ దక్కలేదు. అయితే పవర్‌ప్లే అనంతరం రెండో స్పెల్‌లో తొలి బంతికే ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్‌ను ఔట్ చేసి తన సత్తా చాటాడు. రోహిత్ శర్మ ఫస్ట్ స్లిప్‌లో అద్భుత క్యాచ్ అందుకోవడంతో బుమ్రా ఖాతాలో కీలక వికెట్ చేరింది.. ఈ వికెట్‌తో బుమ్రా.. ఇంగ్లండ్ గడ్డపై వన్డేల్లో 31 వికెట్లు పూర్తి చేసి కొత్త చరిత్ర సృష్టించాడు. దీంతో ఇంగ్లండ్‌లో అత్యధిక వన్డే వికెట్లు తీసిన భారత బౌలర్‌గా నిలిచాడు. ఈ జాబితాలో ఇప్పటివరకు రవీంద్ర జడేజా 30 వికెట్లతో అగ్రస్థానంలో ఉండగా, బుమ్రా అతడిని అధిగమించాడు. భువనేశ్వర్ కుమార్ (28), మదన్ లాల్ (27), మహ్మద్ షమీ (26) తదుపరి స్థానాల్లో ఉన్నారు. అంతేకాకుండా హ్యారీ బ్రూక్ వికెట్ బుమ్రా వన్డే కెరీర్‌లో 150వ వికెట్ కావడం మరో విశేషం. దీంతో వన్డేల్లో 150 వికెట్లు పూర్తి చేసిన భారత బౌలర్ల జాబితాలో చోటు దక్కించుకున్నాడు. కేవలం 4,605 బంతుల్లోనే ఈ ఘనత సాధించిన బుమ్రా, అత్యంత వేగంగా 150 వన్డే వికెట్లు తీసిన భారత బౌలర్ల జాబితాలో మహ్మద్ షమీ (4,070 బంతులు), కుల్దీప్ యాదవ్ (4,513 బంతులు) తర్వాత మూడో స్థానంలో నిలిచాడు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే, ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్నాడు. అయితే భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కూడా తాము ముందుగా బౌలింగ్ చేయాలనే ఆలోచనతోనే ఉన్నామని వెల్లడించాడు. టీ20 సిరీస్ అనంతరం జట్టులో మంచి వాతావరణం ఉందని, అందరూ బాగా సన్నద్ధమయ్యారని గిల్ తెలిపాడు. బుమ్రా రీఎంట్రీతో భారత బౌలింగ్ దళానికి మరింత బలం చేకూరిందని అభిమానులు భావిస్తున్నారు.



## ఫ్లెమింగ్ ఔట్..CSK కోసం
# రంగంలోకి ద్రావిడ్ ?

చెన్నై సూపర్ కింగ్స్ హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన కోచ్ పదవికి రాజీనామా చేస్తూ, చెన్నై సూపర్ కింగ్స్ జట్టుతో బంధం తెంపుకున్నారు. దాదాపు 18 సంవత్సరాలుగా ఆ జట్టుకు సేవలు అందించిన స్టీఫెన్ ఫ్లెమింగ్... 2008లో ప్లేయర్ గా కూడా ఆడారు. అనంతరం హెడ్ కోచ్ బాధ్యతలు తీసుకున్నారు. వరుస సీజన్లలో చెన్నై ప్రదర్శన సరిగ్గా లేకపోవడంతో, స్టీఫెన్ ఫ్లెమింగ్ తప్పుకున్నట్లు సమాచారం.

**స్టీఫెన్ ఫ్లెమింగ్ స్థానంలో ఎవరంటే ?**
చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు దూరమైన స్టీఫెన్ ఫ్లెమింగ్ స్థానంలో కొత్త హెడ్ కోచ్ కోసం ప్రయత్నాలు మొదలు పెట్టింది యాజమాన్యం. ఈ క్రమంలోనే హేమంగ్ బదానీ, బ్రెండన్ మెక్‌కల్లమ్, రవిచంద్రన్ అశ్విన్ లాంటి వాళ్ళ పేర్లు తెరపైకి వచ్చాయి. కానీ రాహుల్ ద్రావిడ్ కు కోచింగ్ బాధ్యతలు ఇవ్వాలని చెన్నై సూపర్ కింగ్స్ జట్టు నిర్ణయం తీసుకున్నట్లు నేషనల్ మీడియాలో సరికొత్త కథనం వైరల్ గా మారింది. ఈ మేరకు రాహుల్ ద్రావిడ్ తో చర్చలు కూడా జరుగుతున్నాయట.



## భారత్‌తో జరుగుతున్న తొలి వన్డేలో
# 258 పరుగులకు ఇంగ్లండ్ ఆలౌట్

ఇంగ్లండ్ పర్యటనలో భాగంగా బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరుగుతున్న తొలి వన్డేలో భారత బౌలర్లు సత్తా చాటారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆతిథ్య ఇంగ్లండ్ జట్టును 47.5 ఓవర్లలో 258 పరుగులకే ఆలౌట్ చేశారు. భారత స్పిన్నర్ అక్షర్ పటేల్ నాలుగు వికెట్లతో ఇంగ్లండ్ పతనాన్ని శాసించగా, మాజీ కెప్టెన్ జో రూట్ (76 నాటౌట్) ఒంటరి పోరాటం చేశాడు. అతనికి తోడుగా లియామ్ డాసన్ (68) అర్ధ శతకంతో రాణించాడు. దీంతో టీమిండియా ముందు 259 పరుగుల లక్ష్యం నిలిచింది. ఇన్నింగ్స్ ఆరంభంలో ఇంగ్లండ్ ఓపెనర్లు బెన్ డకెట్ (43), జాకబ్ బెథెల్ (14) తొలి వికెట్‌కు 61 పరుగులు జోడించి శుభారంభం అందించారు. అయితే, ఈ దశలో భారత బౌలర్లు పుంజుకున్నారు. కేవలం 19 పరుగుల వ్యవధిలోనే ఇంగ్లండ్ 4 కీలక వికెట్లు కోల్పోయి 80/5 స్కోరుతో కష్టాల్లో పడింది. కెప్టెన్ హ్యారీ బ్రూక్ (1), జోస్ బట్లర్ (5), సామ్ కరన్ (0) సింగిల్ డిజిట్‌కే పరిమితమై పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో క్రీజులో నిలిచిన జో రూట్, లియామ్ డాసన్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ ఏడో వికెట్‌కు 121 పరుగుల విలువైన భాగస్వామ్యం నెలకొల్పి జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించడంలో కీలక పాత్ర పోషించారు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని అక్షర్ పటేల్ విడదీశాడు. డాసన్ ఔటయ్యాక, ఇంగ్లండ్ ఇన్నింగ్స్ మళ్లీ తడబడింది. చివర్లో జోఫ్రా ఆర్చర్ (12) వేగంగా ఆడినా, అక్షర్ తన స్పిన్‌తో టెయిలెండర్లను చుట్టేశాడు. భారత బౌలర్లలో అక్షర్ పటేల్ 4 వికెట్లతో అద్భుత ప్రదర్శన చేయగా, ప్రసిద్ధ్ కృష్ణ, అరంగేట్ర బౌలర్ గుర్నూర్ బ్రార్ చెరో 2 వికెట్లు తీశారు.





# మనదే లార్డ్స్

క్రికెట్ మక్కాగా పేరున్న లార్డ్స్‌లో, ఇంగ్లాండ్ లాంటి మేటి జట్టుతో భారత మహిళలకు టెస్టు మ్యాచ్. ఇటీవలే టీ20 ప్రపంచకప్‌లో పేలవ ప్రదర్శన చేసిన హర్మన్‌ప్రీత్ సేన పెద్దగా అంచనాల్లేకుండా ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగింది. మైదానంలోకి దిగాక కసితో కదిలిన అమ్మాయిలు.. ఫేవరెట్‌గా మ్యాచ్‌లో అడుగుపెట్టిన ఆతిథ్య జట్టుకు పెద్ద షాకే ఇచ్చారు. తొలి ఇన్నింగ్స్‌లో క్రాంతి గౌడ్ అయిదు వికెట్ల ప్రదర్శన.. రెండో ఇన్నింగ్స్‌లో యాస్తిక భాటియా అద్భుత శతకం.. రెండు ఇన్నింగ్స్‌ల్లో స్మృతి మంధాన సూపర్ అర్ధశతకాలు.. ఇంకా మిగతా అమ్మాయిల కృషీ తోడై లార్డ్స్‌లో భారత్ ఏకంగా 270 పరుగుల భారీ విజయాన్నందుకుని చరిత్ర సృష్టించింది. లాంఛనం పూర్తయింది. ఇంగ్లాండ్‌తో లార్డ్స్‌లో ఏకైక టెస్టులో మూడో రోజే విజయాన్ని ఖాయం చేసుకున్న భారత మహిళల జట్టు.. నాలుగో రోజు ప్రత్యర్థిని చుట్టేసి 270 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఏడు వికెట్లు తీసిన పేసర్ క్రాంతి గౌడ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. 457 పరుగుల భారీ ఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 130/6తో ఆఖరి రోజైన సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లాండ్.. మరో 56 పరుగులు జోడించి 186 పరుగులకే ఆలౌటైంది. అమీ జోన్స్ (54) ఓవర్‌నైట్ వ్యక్తిగత స్కోరుకు కేవలం రెండు పరుగులే జత చేసి ఔటైయింది. ఒక పరుగుతో బ్యాటింగ్ కొనసాగించిన ఎకిల్‌స్టోన్ (50) పోరాడింది. ఇసీ వాంగ్ (33 బంతుల్లో 1), లారెన్ ఫైలర్ (22 బంతుల్లో 4 నాటౌట్)తో కలిసి భారత విజయాన్ని ఆలస్యం చేసింది. వాంగ్, లారెన్ బెల్ (0) వికెట్లను దీప్తి శర్మ పడగొట్టడంతో ఇంగ్లాండ్ 159/9తో ఓటమికి అడుగు దూరంలో నిలిచింది. అర్ధసెంచరీ తర్వాత ఎకిల్‌స్టోన్‌ను స్నేహ్ రాణా (4/42) బౌల్డ్ చేసి ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌కు తెరదించింది. స్నేహ్‌తో పాటు సయాలి (2/24), క్రాంతి గౌడ్ (2/54), దీప్తి శర్మ (2/36) విజయంలో కీలకపాత్ర పోషించారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 285, ఇంగ్లాండ్ 170 పరుగులు చేశాయి.

మనసులో మాట

# అలా ఏ నాయికనీ విమర్శించొద్దు!



అందం.. అభినయంతో మెప్పించినా.. ప్రతిభావంతురాలైన నటిగా పేరు తెచ్చుకున్నా కానీ గత చిత్రాల విషయంలో విజయానికి అడుగు దూరంలోనే నిలిచిపోయారు నటి భాగ్యశ్రీ బోర్సే. ఇప్పుడామె 'లెనిన్' చిత్రంతో విజయాన్ని రుచి చూశారు. అఖిల్ అక్కినేని కథానాయకుడిగా నటించిన ఈ చిత్రం ఇటీవల విడుదలైన నేపథ్యంలో సోమవారం 'ఈనాడు సినిమా'తో ముచ్చటించారు భాగ్యశ్రీ.

అందుకే ఆ రోజు కన్నీళ్లు ఆగలేదు..

''తొలి విజయం ఎప్పుడూ మనసుకు దగ్గరగా ఉంటుంది. నేనీ పరిశ్రమలో స్థిరపడాలని వచ్చా. దాని కోసం నేను మరింత బాగా కష్టపడేలా ప్రోత్సాహాన్నిచ్చేది.. స్ఫూర్తినిచ్చేది సక్సెసే. అందుకే 'లెనిన్'తో నాకొచ్చిన ఈ తొలి విజయం చాలా ప్రత్యేకం. అందుకే ఆ రోజు వేదికపై భావోద్వేగానికి గురయ్యా. దీని తర్వాత నాకు మళ్లీ మరో విజయం దక్కొచ్చు. కానీ, నేను మళ్లీ ఇలా ఏడవకపోవచ్చు (నవ్వుతూ). తొలి విజయాన్ని అందుకున్నప్పుడు పొందినంత స్వచ్ఛమైన ఆనందం మళ్లీ కలగకపోవచ్చు. ఈ ప్రయాణంలో వ్యక్తిగతంగా నేను తెలుసుకుంది ఒకటే. ఈ పరిశ్రమలో జయాపజయాలు సహజం. కొన్నిసార్లు విజయం దక్కుతుంది. కొన్నిసార్లు పరాజయాలు పలకరిస్తాయి. ఫలితమేదైనా..పరిస్థితులు ఎలాంటివైనా ధైర్యంగా అనుకున్నది చేసుకుపోవడమే నాకు చిన్నప్పటి నుంచీ అలవాటు''.

అమ్మానాన్నలకి అదే నిజమైన విజయం

''జయాపజయాల విషయంలో మా అమ్మానాన్న ఆలోచనలు వేరుగా ఉంటాయి. ఓ నటిగా నా విషయంలో వాళ్లెప్పుడూ చాలా గర్వపడుతుంటారు. వాళ్లకి సక్సెస్ అంటే నేను నా పాత్రకి పరిపూర్ణంగా న్యాయం చేయడమే. వాళ్లు సినిమా చూడటానికి వెళ్లినప్పుడు తెరపై భాగ్యశ్రీ కనిపించకూడదు. ఓ కుమారి, ఓ మహాలక్ష్మి, భారతి.. ఇలా ఆ పాత్రలే కనిపించాలనుకుంటారు. అదే వాళ్లకి నిజమైన సక్సెస్. సమాజం దృష్టిలో విజయం అంటే అది ఆ సినిమా సాధించే వసూళ్లు. కానీ, నేను, మా ఫ్యామిలీ దానికిచ్చే నిర్వచనం తెరపై భాగ్యశ్రీని చూశామన్న ఫీల్ కలగకూడదు. అలాగే ఒక్క తప్పునీ ఎత్తి చూపించలేని రీతిలో నా నటన ఉండాలి. అదే నాకు అసలైన సక్సెస్. ఒకవేళ రేపెవరైనా నాతో.. 'నువ్వు ఈ సీన్ ఇంకా బాగా చేయాల్సింది, ఫలానా సీన్‌లో ఓ యాక్టర్‌గా నువ్వు నాకు నచ్చలేదు.. నీ నటనతో కనెక్ట్ అవ్వలేకపోయా' అని చెప్తే అప్పుడు నటిగా ఫెయిలయ్యానని ఒప్పుకుంటా. ఆ తప్పుని నా మీద వేసుకుంటా. అంతే కానీ, బాక్సాఫీస్ నంబర్స్ సరిగా రాలేదని... 'ఇది నీ ఫెయిల్యూర్' అని చెప్పడం, హీరోయిన్స్‌ని తప్పుపట్టడం సరికాదని నేను నమ్ముతా''

నా విషయంలోనూ అలాంటి మాటలే..

''అగ్రతారలు అమితాబ్ బచ్చన్ కావొచ్చు.. ప్రస్తుతం నేను కలిసి పని చేస్తున్న నా సహ నటుడు శివ కార్తికేయన్ కావొచ్చు.. వాళ్లంతా తమ సినీ ప్రయాణంలో కష్ట కాలాన్ని దాటొచ్చిన వాళ్లే. వాళ్లందరికీ ఫ్లాప్స్ వచ్చాయి. కింద పడ్డారు. ఒకానొక సమయంలో జనాలు 'అమితాబ్ పని అయిపోయింద'నీ అన్నారు. కానీ, ఆయన 'కౌన్ బనేగా కరోడ్‌పతి'తో మళ్లీ స్టార్ట్ చేసి.. జీవితంలో అన్నింటిని తిరిగి సాధించారు. ఈ పరిశ్రమలో నాకు నా సీనియర్స్ చెప్పిందొకటే. 'సక్సెస్ ఎంత ఫాస్ట్‌గా వస్తే.. నీ రన్ అంత షార్ట్‌గా ఉంటుంది. విజయం ఎంత ఆలస్యంగా వస్తే.. నీ కెరీర్ అంత సుదీర్ఘంగా సాగుతుంది'. నేను దీన్నే నమ్ముతా. ఓ నటిగా ప్రతి సినిమాకీ ప్రాణం పెట్టే పని చేయాలనుకుంటా. అలా ఉండగలిగినప్పుడే ఈ పరిశ్రమలో సుదీర్ఘ ప్రయాణం చేయగలను అనుకుంటున్నా. వరుసగా రెండు మూడు పరాజయాలు ఎదురవగానే 'ఐరెన్ లెగ్', 'అన్ లక్కీ' అనే మాటలు వినిపిస్తుండటం సహజం. 'కాంత', 'ఆంధ్ర కింగ్ తాలూకా' చిత్రాల తర్వాత నేనూ అలాంటి మాటలు విన్నా. కానీ, అలా ఏ నాయికనీ విమర్శించడం సరికాదు. ఎందుకంటే ఎడిటింగ్‌లో ఆఖరి నిర్ణయం మనది కాదు. కథ విషయంలో తుది నిర్ణయం మనదవ్వదు. ఆఖరికి స్టోరీ మారుతుందా? లేదా? అనేదీ స్పష్టత ఉండదు. ప్రేక్షకులకి ఇవ్వన్నీ తెలియాలి. ఒకవేళ రేపటిరోజున ఎడిటింగ్ రూమ్‌లో దర్శకుడు, నిర్మాత, హీరోతో పాటు నేనూ ఉంటే అలాంటి విమర్శల్ని సమానంగా తీసుకుంటా''.

ఆ దేవుడి దయతో..

''నేను ఏ కథనైనా ఓ సగటు ప్రేక్షకుడిలా వినడానికే ఇష్టపడతా. ఈ కథని ఓ ప్రేక్షకుడైతే ఎలా స్వీకరిస్తాడు.. అది వాళ్ల మనసుల్ని తాకేలా ఉందా? లేదా? అలాగే ఓ ప్రేక్షకుడిలా ఇది నా మనసుకు దగ్గరైందా? లేదా? అనేదానిపై తొలుత దృష్టిపెడతా. దాని తర్వాత ఆ పాత్ర ఎలా ఉంది.. అది సినిమాకి ఎంత ముఖ్యం.. ఆ పాత్ర లేకపోతే సినిమా ఉందా? లేదా? అనే అంశాల్ని గమనిస్తా. ఇవన్నీ చక్కగా కుదిరి.. ఆ కథ మనసుకు నచ్చిందంటే మరో ఆలోచన లేకుండా రంగంలోకి దిగిపోతా. నిజానికి 'లెనిన్' కథని తొలుత నాకే వినిపించారు.



## మార్పునకు నాంది ఈ విజయం!

సమంత ప్రధాన పాత్రధారిగా రూపొందిన 'మా ఇంటి బంగారం' ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల వసూళ్ల మైలురాయిని అందుకుని అరుదైన ఘనతని సొంతం చేసుకుంది. భారతదేశంలోనే అత్యధిక వసూళ్లని సాధించిన మహిళా ప్రధానమైన చిత్రాల్లో 'మా ఇంటి బంగారం' ఆరో స్థానాన్ని దక్కించుకుందని సినీ వర్గాలు తెలిపాయి. నందినీరెడ్డి దర్శకత్వంలో సమంత ప్రధాన పాత్రధారిగా నటిస్తూనే, తన భర్త రాజ్ నిడిమోరు, హిమాంక్‌రెడ్డి దువ్వూరుతో కలిసి నిర్మించిన చిత్రమిది. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో విడుదలైంది. హాస్యం, యాక్షన్ మేళవింపుగా రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకుల మెప్పు పొందింది. రూ.100 కోట్ల మైలురాయిని చేరుకోవడంపై ఆనందం వ్యక్తం చేస్తూ ఇన్‌స్టాలో ఓ పోస్ట్‌ని పంచుకున్నారు సమంత. ''ఈ చిత్రం గురించి ప్రేక్షకులు మాట్లాడుకుంటున్నారా? మేం చేస్తున్న ప్రచారం వాళ్లకు చేరువవుతోందా? అసలు ఈ సినిమా అంటూ ఒకటి ఉందని వాళ్లకి తెలుసా? అని విడుదలకు ముందు తీవ్రంగా ఆలోచించడం నాకు బాగా గుర్తుంది. అప్పుడే నా స్నేహితుడు ఒక ప్రదర్శనకారుడికి ఫోన్ చేసి మాట్లాడాడు. ఆ సంభాషణని నేనూ వింటున్నానని అతనికి తెలియదు. ఈ సినిమా గురించి మీరేం అనుకుంటున్నారని అడగ్గానే ఏమాత్రం సంకోచించకుండా 'ఒక హీరోయిన్ సినిమాని ఎవరైనా ఎందుకు చూస్తారు? ఆమె ఒక పెద్ద హీరో సినిమాలో నటిస్తే పర్వాలేదు. ఎందుకంటే గ్లామర్ వల్లే ఆమె ప్రేక్షకులకు తెలుసు. కానీ ఒక నాయికా ప్రధానమైన పాత్రలో ఎవరు చూస్తారు?' అన్నారు. ఎవరైనా ఒక సాహసం చేయడానికి సిద్ధపడినప్పుడే నిజమైన మార్పు వస్తుందని అనుకుంటున్నా. చాలాసార్లు ఆ సాహసాలు ఫలించవు. కానీ అప్పుడప్పుడు, అవి ఫలిస్తాయి. మా విషయంలోనూ అది ఫలించింది. ఇది గొప్ప మార్పునకు నాంది అవుతుందని ఆశిస్తున్నా. తదుపరి ఏ ప్రదర్శనకారుడికైనా ఫోన్ చేసి మహిళా ప్రధాన చిత్రం గురించి అడిగితే సమాధానం వెంటనే 'కాదు...' అని రాకూడదని నేను ఆశిస్తున్నా'' అంటూ ఆ పోస్ట్‌లో రాసుకొచ్చారు. సినిమా విజయోత్సాహంలో ఉన్న ఆమె త్వరలోనే పండంటి బిడ్డకు స్వాగతం పలకనున్నారు. 'మా ఇంటి బంగారం' సినిమా రూ.100 కోట్ల వసూళ్లు సాధించడంపై పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు ఆమెకు శుభాకాంక్షలు చెప్పారు.





## కొత్త ఇంట్లోకి అడుగుపెట్టిన శృతి హాసన్..

ప్రముఖ హీరోయిన్ శృతి హాసన్ తన జీవితంలో మరో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. చెన్నైలో నిర్మించిన తన కొత్త ఇంట్లోకి ఇటీవల ఆమె గృహప్రవేశం చేశారు. కుటుంబ సభ్యులు, సన్నిహిత బంధువుల సమక్షంలో సంప్రదాయ పద్ధతిలో ఈ హౌస్‌వార్మింగ్ పూజా కార్యక్రమం నిర్వహించారు. నిజానికి గతంలో ఈ ముద్దుగుమ్మ ముంబైలో ఉండే వారు. ప్రస్తుతం అక్కడి నుంచి చెన్నైకి షిఫ్ట్ అయ్యి కొత్త ఇంట్లోకి అడుగుపెట్టారు. హౌస్‌వార్మింగ్ కార్యక్రమం సందర్భంగా ఇంటిని పూలతో అందంగా అలంకరించి, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ప్రస్తుతం శృతి హాసన్ కొత్త ఇంట్లో జరిగిన గృహప్రవేశ వేడుకకు సంబంధించిన కొన్ని ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోల్లో సంప్రదాయ దుస్తుల్లో కనిపించిన శృతి చాలా సంతోషంగా, ప్రశాంతంగా కనిపించారు. ఈ సందర్భంగా ఆమె అభిమానులు కంగ్రాట్స్ తెలియజేస్తూ సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు. హీరో కమల్ హాసన్ కుమార్తెగా సినీ రంగంలో అడుగుపెట్టిన శృతి, ప్రస్తుతం దక్షిణాది, బాలీవుడ్ చిత్రాల్లో బిజీగా ఉన్నారు. నటిగా మాత్రమే కాకుండా గాయనిగా, సంగీత దర్శకురాలిగా కూడా ఆమె తన ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. శృతి హాసన్ చెన్నైకి షిఫ్ట్‌కి కావడం వెనక తన సింగింగ్ కెరీర్‌పై పూర్తి స్థాయిలో ఫోకస్ చేయడానికే అని అంటున్నారు.

## విజయ్ సేతుపతి 'ట్రైన్' వచ్చేస్తోంది.. రిలీజ్ ఆగస్టులోనే

'మక్కల్ సెల్వన్' విజయ్ సేతుపతి కథానాయకుడిగా, ప్రముఖ దర్శకుడు మిస్కిన్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'ట్రైన్'. ఈ చిత్రాన్ని 2026 ఆగస్టులో థియేటర్లలో విడుదల చేయనున్నట్లు ప్రముఖ నిర్మాత కలైపులి ఎస్. థాను అధికారికంగా ప్రకటించారు. చెన్నైలో ఇటీవల జరిగిన టీజర్ లాంచ్ కార్యక్రమంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. ఇటీవల విడుదలైన 43 సెకన్ల నిడివి గల టీజర్, చిత్రంపై అంచనాలను భారీగా పెంచింది. వేగంగా దూసుకెళ్తున్న 'బ్లూ మౌంటెన్ ఎక్స్‌ప్రెస్' రైలును కొంతమంది సాయుధులు తమ అధీనంలోకి తీసుకోవడం, ఆపదలో ఉన్న ప్రయాణికులను కాపాడేందుకు విజయ్ సేతుపతి చేసే వీరోచిత పోరాటం వంటి ఉత్కంఠభరిత సన్నివేశాలతో టీజర్‌ను ఆకట్టుకునేలా రూపొందించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత మాట్లాడుతూ, "ఈ సినిమాను ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తాం" అని పేర్కొనగా, దర్శకుడు మిస్కిన్ సరదాగా జోక్యం చేసుకుంటూ కచ్చితమైన తేదీని ప్రకటించాలని కోరారు. ఆగస్టు 14న మరో సినిమా ఉందంటూ ఆయన చమత్కరించడంతో సభలో నవ్వులు పూశాయి. ఈ చిత్రానికి కథ అందించడమే కాకుండా, మిస్కిన్ స్వయంగా సంగీతాన్ని సమకూర్చడం విశేషం. ఈ కథను ప్రత్యేకంగా విజయ్ సేతుపతి కోసమే సిద్ధం చేశానని, ఆయన తరహా నటనను కమల్ హాసన్, అమీర్ ఖాన్ వంటి దిగ్గజ నటులు సైతం ప్రదర్శించలేరని మిస్కిన్ ప్రశంసల వర్షం కురిపించారు. 2023లో ప్రారంభమైన ఈ చిత్రంలో శ్రుతి హాసన్, నాజర్, యుగి సేతు, నరైన్, కేఎస్ రవికుమార్, సంపత్ రాజ్



వంటి భారీ తారాగణం నటిస్తోంది. ఇందులో నరైన్ పోలీస్ అధికారిగా కనిపిస్తుండటంతో, ఇది మిస్కిన్ గత చిత్రం 'అంజాదే'కు కొనసాగింపు కావచ్చని, తద్వారా 'మిస్కిన్ సినిమాటిక్ యూనివర్స్'కు అంకురార్పణ జరుగుతోందని సినీ వర్గాల్లో ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఆగస్టులో చిత్ర విడుదల తేదీని త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు.

CHIEF EDITOR BY KANCHARLA ATCHUTA RAOPUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/A2169. PRINTED BY CHAITANYAVARADHI PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 08914540746

మనసులో మాట
KANCHARLA
ఉత్తరాంధ్ర
విశాఖపట్నం | విజయనగరం | అనకాపల్లి
శ్రీకాకుళం | అల్లూరి జిల్లా (పాడేరు) | పార్వతీపురం
బుధవారం 15 జూన్ 2026 పేజీలు 16

## జనాభా పెరుగుదలకు ప్రజల్లో అవగాహన పెంపొందించాలి





04



### పెద్ద బిడ్డ రోడ్డు మాటేమిటి 4 కోట్ల 45 లక్షలు

## ఏమైనట్లు

- పనులు ప్రారంభించి 8 ఏళ్ళు అయినా పూర్తికాని రహదారి
- అర్ధాంతరంగా ఆగిపోయిన రహదారి పనులు
- ఇది అధికారుల లోపమా గుత్తేదారుల నిర్లక్ష్యమా
- తక్షణమే పనులు ప్రారంభించాలని స్థానిక గిరిజనులు డిమాండ్

02



### జెడ్పీ ఛైర్‌పర్సన్ చిన్నశ్రీనుకు మాతృవియోగం...

# వైయస్ జగన్ సంతాపం...

**విజయనగరం, జులై 15 (మనసులో మాట జిల్లా ప్రతినిధి) :**

ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్పర్సన్, విజయనగరం జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, భీమిలి వైసీపీ ఇంచార్జ్ మజ్జి శ్రీనివాసరావు (చిన్నశ్రీను) కు మాతృవియోగం జరిగింది. ఆయన మాతృమూర్తి మజ్జి కృష్ణవేణి(83) మంగళవారం పరమపదించారు. ఆత్మీయుల సందర్శనార్థం ఆమె భౌతికకాయాన్ని ప్రదీప్ నగర్ లోని చిన్నశ్రీను నివాసంలో ఉంచారు. బుధవారం ఉదయం 8 గంటలకు అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

**మాజీ సీఎం వైఎస్ జగన్ సంతాపం..**

చిన్నశ్రీను మాతృమూర్తి స్వర్గస్తులైన సమాచారం తెలుసుకున్న మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ జాతీయ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కృష్ణవేణమ్మ మరణ వార్త తనను ఎంతో కలచివేసిందని వైయస్ జగన్ పేర్కొన్నారు. కుటుంబానికి

..మిగతా11లో



02

### నర్సీపట్నంలో వైసీపీకి గట్టి దెబ్బ..

భారీగా టీడీపీలో చేరిన 35 కుటుంబాలు

## గిరిజన పిల్లలు విద్యాభివృద్ధే లక్ష్యం...

### మాతృభూమి సేవా సంఘం



02




### సైబర్ సెక్యూరిటీపై న్యాయ అవగాహన శిబిరం

05

# గరివిడి మండలంలో గొర్రెల పెంపకదారుల సహకార సంఘాల ఎన్నికలు ప్రశాంతం..





**చీపురుపల్లి/గరివిడి జూలై 14, (మనసులో మాట) :**

మండలంలోని వివిధ ప్రాథమిక గొర్రెల పెంపకదారుల సహకార సంఘాల ఎన్నికలు మంగళవారం ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిశాయి. అన్ని సంఘాల్లో సభ్యులు ప్రజాస్వామ్య పద్ధతిలో తమ ప్రతినిధులను ఎన్నుకోగా, ఎన్నికల ప్రక్రియను అధికారులు సజావుగా నిర్వహించారు.

గరివిడి మండలంలోని విజయరాంపురం, ఎం. దుగ్గివలస, కొండలక్ష్మీపురం, కోనూరు, శివరాం గ్రామాల ప్రాథమిక గొర్రెల పెంపకదారుల సహకార సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించబడ్డాయి. విజయరాంపురంలోని శ్రీ పైడిమాంబ గొర్రెల పెంపకదారుల సహకార సంఘం అధ్యక్షునిగా పాశి రాము ఎన్నికయ్యారు. ఎం. దుగ్గివలసలోని శ్రీ రామకృష్ణ గొర్రెల పెంపకదారుల సహకార సంఘం అధ్యక్షునిగా బొట్టా రాము ఎన్నికయ్యారు. కొండలక్ష్మీపురంలోని శ్రీ భగీరథమ్మ గొర్రెల పెంపకదారుల సహకార సంఘంకు వైగాల రాము ఎన్నిక కాగా, కోనూరులోని శ్రీ అసిరి తల్లి గొర్రెల పెంపకదారుల సహకార సంఘంకు దుఖ సత్యం అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. శివరాంలోని శ్రీ సాయి కృష్ణ గొర్రెల పెంపకదారుల సహకార సంఘానికి కోండ్రు కృష్ణ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు వివిధ ప్రాంతాలకు చెందిన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు డాక్టర్ కె. దినేష్, డాక్టర్ గోవర్ధన్ సాగర్, డాక్టర్ హైమావతి, జూనియర్ వెటర్నరీ అధికారి టి. నారాయణరావు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించినట్లు కొండపల్లి ఇన్‌చార్జి వెటర్నరీ అధికారి డాక్టర్ సేనపతి సతీష్ తెలిపారు. ఎన్నికైన అధ్యక్షులకు అధికారులు, సభ్యులు అభినందనలు తెలియజేశారు.

# నర్సీపట్నంలో వైసీపీకి గట్టి దెబ్బ..

## భారీగా టీడీపీలో చేరిన 35 కుటుంబాలు





**నర్సీపట్నం: జూలై 14 (మనసులో మాట)**

నర్సీపట్నంలో ప్రతిపక్ష వైసీపీకి గట్టి దెబ్బ తగిలింది. అధికార టీడీపీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వైసీపీకి చెందిన 35 కుటుంబాలు మంగళవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. 28వ వార్డు అయ్యన్న కాలనీకి చెందిన మాజీ వాలంటీర్ కుండ్రపు దమయంతి ఆధ్వర్యంలో మాజీ వాలంటీర్ అడ్లబోయిన సత్యవేణితో పాటు 30 కుటుంబాల మహిళలు, అలాగే శివపురానికి చెందిన తాటికొండ ఫణికుమార్ ఆధ్వర్యంలో మరో 5 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి టీడీపీ టౌన్ అధ్యక్షులు చింతకాయల రాజేష్ పసుపు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా పార్టీలో చేరిన మాజీ వాలంటీర్ దమయంతి మాట్లాడుతూ.. టీడీపీ సిద్ధాంతాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలు నచ్చి పార్టీలోకి రావడం జరిగిందన్నారు. నర్సీపట్నంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న సృష్టి క్షేత్రాన్ని వైసీపీ నాయకులు అడ్డుకోవడంపై ఆమె తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే కేవలం అభివృద్ధిని అడ్డుకోవడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. ఈ చేరికల కార్యక్రమంలో 28వ వార్డు మాజీ కౌన్సిలర్ డబ్బిరి శ్రీకాంత్, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి లాలం మురళీకృష్ణ, 28వ వార్డు టీడీపీ నాయకులు గాలి రమణ, బీజా రామ్ కుమార్, కొడవటి గోపి, కొవ్వాడ సంపత్, కుండ్రపు చిన్న, పసుపులేటి జ్యోతి, చెరుకూరి చంటమ్మ, పలువురు కాలనీ మహిళలు, యువత పాల్గొన్నారు.

# సాంకేతికతతో నేరాలను ఛేధించే నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి







- **అర్థ సంవత్సర నేర సమీక్షా సమావేశంలో విశాఖ రేంజ్ ఐజిపి గోపినాథ్ జట్టి**

**విజయనగరం, జులై 14 (మనసులో మాట జిల్లా ప్రతినిధి) :**

జిల్లాలో వివిధ పోలీసు స్టేషనుల్లో పని చేస్తున్న పోలీసు అధికారులు, ఇతర శాఖల అధికారులతో అర్ధ సంవత్సర నేర సమీక్షా సమావేశాన్ని విజయనగరం జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి విశాఖపట్నం రేంజ్ ఐజిపి గోపీనాథ్ జట్టి ముఖ్య అతిధి గాను, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి శ్రీమతి ఎం.బబిత, జిల్లా కలెక్టరు ఎస్.రామసుందర రెడ్డి అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విశాఖపట్నం రేంజ్ ఐజి గోపీనాథ్ జట్టి మాట్లాడుతూ నేరాలు జరిగే తీరు రాబోయే 5 నుండి 10 సం.ల్లో పూర్తిగా మారిపోతుందన్నారు. ప్రస్తుతం నమోదవుతున్న నేరాల స్థానంలో సాంకేతికత ఆధారిత సైబరు, సోషల్ మీడియా నేరాలే 60శాతం ఉంటాయన్నారు. కేసులను దర్యాప్తు చేసే పోలీసు అధికారులు తమ వ్యక్తిగత, వృత్తి నైపుణ్యాలను మెరుగుపర్చుకొని, పని చేయాల్సిన అవశ్యకత పెరుగుతుందన్నారు. నేరస్థులు టెక్నాలజీని వినియోగించుకొని నేరాలకు పాల్పడే అవకాశాలు హెచ్చుగా ఉంటాయన్నారు. ఆ తరహా నేరాలను ఛేధించేందుకు దర్యాప్తు అధికారులు కూడా నూతన చట్టాల పట్ల అవగాహనతోపాటు, సాంకేతికత నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలన్నారు. భవిష్యత్తుకు తగిన విధంగా వృత్తి నైపుణ్యాలను మెరుగుపర్చుకోకుంటే ప్రజల్లో నిరాశ వచ్చే అవకాశం ఉంటుందన్నారు. కావున, పోలీసు అధికారులు భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని, ఆలోచనలు చేయాలని, వ్యక్తిగత శ్రద్ధతో వృత్తి నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలన్నారు.

# గిరిజన పిల్లలు విద్యాభివృద్ధే లక్ష్యం...మాతృభూమి సేవా సంఘం

**పార్వతీపురం మనసులో మాట జిల్లా ప్రతినిధి జూలై 14:**

మంగళవారం నాడు సాలూరు మండలం కొత్తవలస పంచాయతీ గొందివలస ఎగువ దాగరవలస బడి పిల్లలుకు పుస్తకాలు పెన్నులు జమాట్రి సామాగ్రి పంపిణీ చేసినట్టు లు మాతృభూమి సేవా సంఘం అధ్యక్షాకార్యదర్శులు కటారి ఈశ్వర్ రావు,హరి మహేష్ తెలిపారు. వీరితోపాటు ఆదివాసీ పరిరక్షణ సమితి సభ్యులు గిరిజ పాల్గొన్నారు ఈ సందర్భంగా



ఆమె మాట్లాడుతూ ఈ గిరిజన ప్రాంతం పిల్లలు చదువులు వారి పరిస్థితులు తెలిసి వెంటనే స్పందించిన మాతృభూమి సేవా సంఘం ద్వారా గిరిజన పిల్లలు చదువు కోసం పుస్తకాలు పెన్నులు జమాట్రి సామాగ్రి అందించడం అభినందనీయం అన్నారు అనంతరం మాతృభూమి సేవా సంఘం సాలూరు నియోజకవర్గం అధ్యక్షులు కటారి ఈశ్వర్ రావు మాట్లాడుతూ గిరిజన ప్రాంతం పిల్లలు విద్యభివృధికి మా సంఘం సహాయం చేయడానికి సిద్ధంగా ఉంది అన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయలు ఇందిర, బంగారాజు స్వచ్చంద సంస్థ ప్రతినిధులు అప్పారావు గ్రామస్తులు తదితరులు పాల్గున్నారు

# పెద్ద బిడ్డ రోడ్డు మాటేమిటి 4 కోట్ల 45 లక్షలు ఏమైనట్లు?









**అనంతగిరి జులై 14 మనసులో మాట**

అల్లూరి జిల్లా అనంతగిరి మండలం నిమ్మలపాడు రోడ్డు నుండి గుమ్మ గ్రామం వరకు తారు రోడ్డు నిర్మాణం కొరకు నాబార్డ్ నిధులతో 4 కోట్ల 45 లక్షలు నిధులు మంజూరు కాగా అప్పటి టిడిపి ఆయంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రివర్యులు మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభించిన రోడ్డు పనులు సుమారు 8 సంవత్సరాలు అవుతున్నప్పటికీ ఇప్పటివరకు రోడ్డు రోడ్డు నిర్మాణపు పనులు పూర్తి కాలేదని నిర్మాణపు పనులు అర్థం పరంగా ఆగిపోవడంతో అరుకు నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు రేగబోయిన స్వామి అనంతగిరి మండల హ్యూమన్ రైట్స్ డిపెండర్ బిడ్డ సింహాచలం తీవ్ర విమర్శనాలు చేశారు గిరిజన మారుమూల గ్రామాలకు పట్టుకొమ్ము వంటి రహదారులు అర్థం తరంగా ఆగిపోవడం 4 కోట్ల 45 లక్షలు మాటేమిటని ప్రశ్నిస్తున్నారు గతంలో టిడిపి ప్రభుత్వం శంకుస్థాపన చేసిన రోడ్డు పనులు శంకుస్థాపన బోర్డులో అప్పటి ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప చింతకాయల అయ్యన్నపాత్రుడు గంట శ్రీనివాసరావు పి జి వి ఆర్ నాయుడు (గణబాబు ) లాలం భవాని భాస్కర్ పార్లమెంట్ సభ్యులు కొత్తపల్లి గీత టి సుబ్బరామిరెడ్డి విజయసాయిరెడ్డి పేర్లు బోర్డులో కనిపిస్తున్నాయి తప్ప రోడ్డు పని పూర్తి అయిన దాఖలాలు కనిపించడం లేదని విమర్శించారు ఇప్పటికైనా చెరుకు మడత జంక్షన్ నుండి కంటేపురం గ్రామం వరకు సుమారు 2 కిలోమీటర్ల దూరం రోడ్డు నిర్మాణపు పనులు పూర్తి చేయకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు ఈ రోడ్డు పనుల కొరకు మే 27 న అనంతగిరిలో అల్లూరి జిల్లా కలెక్టర్ నిశాంతి టి వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ జి ఆర్ ఎస్ కార్యక్రమంలో ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు కూటమి ప్రభుత్వ స్పందించకపోవడం సంబంధిత అధికారుల లోపమా గుత్తేదారుల నిర్లక్ష్యమా అర్థం కాని పరిస్థితిలో ఉన్నామని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు ప్రభుత్వ పాలకులు జిల్లా అధికారులు తక్షణమే స్పందించి రోడ్డు నిర్మాణపు పనులు పునార ప్రారంభించాలని స్థానిక గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు

# వంశధార కాలువ గండి పడడంపై మంత్రి అచ్చెన్నాయుడు ఆగ్రహం!

- యుద్ధప్రాతిపదికన పూడ్చివేత పనులు చేపట్టాలని ఆదేశం
- ఇలాంటివి పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

**టెక్కలి, జులై 14 (మనసులో మాట) :**

శ్రీకాకుళం జిల్లా రైతాంగానికి ప్రధాన సాగునీటి వనరు అయిన వంశధార ప్రధాన ఎడమ కాలువకు గండి పడిన ఘటనపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రైతులు సాగు పనుల్లో నిమగ్నమైన తరుణంలో సారవకోట మండలం గుమ్మపాడు గ్రామం అక్కివలస పరిధిలో అధికారుల నిర్లక్ష్యం వల్ల కాలువకు గండి పడటం ఏమాత్రం సమర్థనీయం కాదని ఆయన స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా వ్యవహరించే అధికారులపై ప్రభుత్వం ఏమాత్రం ఉపేక్ష చూపబోదని తేల్చిచెప్పారు.


యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలి

కాలువకు పడిన గండిని తక్షణమే యుద్ధ ప్రాతిపదికన పూడ్చివేసి, సాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా పునరుద్ధరించాలని సంబంధిత ఇరిగేషన్ ఇంజినీర్లను మంత్రి ఆదేశించారు. పనులు పూర్తయ్యే వరకు ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలోనే ఉండి ప్రత్యక్ష పర్యవేక్షణ చేపట్టాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో ప్రతి నీటి చుక్క రైతుల పొలాలకు చేరేలా ఇరిగేషన్ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. కాలువల నిర్వహణ, బలహీన ప్రాంతాల గుర్తింపు, ముందస్తు మరమ్మతులు, నిరంతర తనిఖీలు చేపట్టడంలో అధికారులు విఫలం కావడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, ఇకపై నిరంతర నిఘా తప్పనిసరని మంత్రి స్పష్టం చేశారు.

**నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు..**

ప్రధాన కాలువలతో పాటు శాఖ కాలువలు, చెరువుల గట్లు, నీటి నిల్వ నిర్మాణాలన్నింటినీ ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ముందస్తు రక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. రైతుల ప్రయోజనాలే ఈ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం, సాగునీటి నిర్వహణలో అలసత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోం అని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

## టీడీపీ పట్టణ అధ్యక్షులు చింతకాయల రాజేష్‌ను కలిసిన సిటీ క్లబ్ నూతన కార్యవర్గం

**నర్సీపట్నం ,జూలై 14 (మనసులో మాట)**

నర్సీపట్నం: తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు చింతకాయల రాజేష్‌ను నర్సీపట్నం సిటీ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులను చింతకాయల రాజేష్ ఆత్మీయంగా పలకరించి, ప్రత్యేకంగా అభినందించారు. ఆదివారం జరిగిన సిటీ క్లబ్ ఎన్నికల్లో



నూతన అధ్యక్షుడిగా పిట్ల రాజేశ్వరరావు, కార్యదర్శిగా పోతల భాస్కరరావు, కోశాధికారిగా పెదిరెడ్ల కిరణ్ ఎన్నికయ్యారు. వీరితో పాటు సభ్యులుగా ఎన్నికైన ఆర్.వి.పి. సత్యనారాయణ, కుప్పిలి శ్రీనివాసరావు, ధనిమిరెడ్డి శ్రీనుబాబు, పోలిపర్తి అప్పలనాయుడు, కలిగట్ల బాబూరావు, లంక చిన్న, కట్టమూరి నరేష్ కుమార్, రుత్తల అప్పలనాయుడు తదితరులు ఈరోజు రాజేష్‌ను కలిసి కొద్దిసేపు ముచ్చటించారు. సిటీ క్లబ్ అభివృద్ధికి, సమాజహిత కార్యక్రమాలకు నూతన కార్యవర్గం సమష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా చింతకాయల రాజేష్ వారికి సూచించారు.

# హెచ్పీసీఎల్ యాజమాన్య బాధ్యతారాహిత్య ధోరణి.....

- స్థానిక ప్రజల మండిపాటు......
- కర్మాగార చిమ్నీ నుంచి అధిక మంటలు
- భయభ్రాంతులకు గురైన స్థానిక ప్రజలు
- ప్రజలను అప్రమత్తం చేయలేని పరిస్థితిలో హెచ్పిసిఎల్ అధికారులు.
- లాభాలు మీకా.... కాలుష్యం మా కా!
- పారిశ్రామిక ప్రాంత వాసుల ఆవేదన

**మల్కాపురం: జూలై 14:( మనసులో మాట)**

పశ్చిమ నియోజకవర్గం పారిశ్రామిక ప్రాంతం మల్కాపురం ,శ్రీహరిపురం, గాజువాక ,తదితర ప్రాంతాల ప్రజలు సోమవారం రాత్రి 9 గంటల సమయంలో ఒక్కసారి ఉలిక్కిపడ్డారు.

వివరాల్లోకి వెళ్తే సోమవారం రాత్రి 9 గంటల సమయంలో హెచ్పీసీఎల్ కర్మాగారం లో కొండ వెనుక ప్రాంతాల్లో ఉన్న చిమ్ని ( ఫ్లేయర్, బ్రోయర్లో) మంటలు ఉవ్వెత్తున ఎగసి పడటంతో స్థానిక ప్రజలు ఒక్కసారిగా ఆందోళనకు గురి అయ్యారు అదేవిధంగా ద్విచక్ర వాహనదారులు ,పాదాచారులు ఈ కర్మాగారం నుంచి వస్తున్న మంటలను చూస్తూ కొంతసేపు భయాందోళనకు గురి అయ్యారు. సుమారు 30 నిమిషాల తర్వాత ఈ మంటలు సద్దుమనగడంతో



ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. 1997 సంవత్సరం ఈ కర్మాగారంలో జరిగిన అతి భారీ పేలుడును ఒక్కసారిగా స్థానిక ప్రజలు గుర్తు చేసుకున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఈ కర్మాగారంలో ఏ ప్రమాదం జరిగినా స్థానిక ప్రజలు భయాందోళనలకు గురికావడం తరచూ జరుగుతూ ఉంది.

**ప్రజలను అప్రమత్తం చేయడంలో విఫలం.......**

హెచ్పీసీఎల్ కర్మాగార యాజమాన్యం కేవలం తమ లాభాల కోసమే పరితపిస్తున్నారే తప్ప ప్రజల ఆరోగ్యాలను ఏమాత్రం పట్టించుకోకపోవడంపై స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. లాభాలు మీకా కాలుష్యం మాకా అన్నట్లు స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. అయితే ఇలాంటి ప్రమాదాలు సంభవించేటప్పుడు చుట్టుపక్కల స్థానిక ప్రజలను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత కర్మాగార యాజమాన్యానికి ఉన్నప్పటికీ ఆ దిశగా యాజమాన్యాలు వ్యవహరించకపోవడంపై పలువురు ప్రజా సంఘ నాయకులు యాజమాన్యం తీరుపై మండిపడుతున్నారు.

**స్థానిక పోలీసులపై ప్రశంసలు......**

సోమవారం రాత్రి 9 గంటల సమయంలో హెచ్పీసీఎల్ కర్మాగారం ఫ్లేయర్ లోంచి వచ్చిన అధిక శాతం మంటలను గుర్తించిన స్థానిక మల్కాపురం పోలీస్ స్టేషన్ శాంతి భద్రతల సీఐ నరసింహారావు చొరవ తీసుకొని తన సిబ్బందితో ఈ ప్రాంతంలో ప్రతి చోటా పర్యటిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తూ కర్మాగారంలో ఎటువంటి ప్రమాదము జరగలేదంటూ ఎవరు ఎటువంటి ఆందోళన చెందవద్దంటూ వీధి వీధి ప్రజలకు అవగాహన కల్పించడంతో స్థానిక ప్రజలు కు కొంత ఊరట కలిగింది. దీంతో మల్కాపురం పోలీసులను స్థానికులు అభినందిస్తున్నారు.

సూచిక: 2015 సంవత్సరంలో కర్మాగార విస్తరణ పై హెచ్పీసీఎల్ యాజమాన్యం" ప్రజా అభిప్రాయ సేకరణ లో" ఇచ్చిన హామీల విఫలంపై ప్రత్యేక కథనం వచ్చే

## స్వర్గీయ గుండ అప్పల సూర్యనారాయణ విగ్రహంపై ఎమ్మెల్యే శంకర్ స్పష్టీకరణ



**శ్రీకాకుళం, జిల్లా ప్రతినిధి, జులై 14 , మనసులో మాట...**

శ్రీకాకుళం నియోజకవర్గంలో మాజీ మంత్రి స్వర్గీయ గుండ అప్పల సూర్యనారాయణ విగ్రహాన్ని అత్యంత గౌరవ మర్యాదలతో మరియు ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో ప్రతిష్టించామని ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. గుండ అప్పల సూర్యనారాయణ అందించిన సేవలు చిరస్మరణీయమని, ఆయన పార్టీకి మరియు నియోజకవర్గానికి చేసిన సేవలను ఎప్పటికీ మరువలేమని ఎమ్మెల్యే శంకర్ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. పార్టీ పరంగా అప్పల సూర్యనారాయణ కి ఘనంగా సంతాప సభను నిర్వహించామని, ఆ సభకు జిల్లా పార్టీ అధ్యక్షులు మరియు నియోజకవర్గంలోని ప్రజలందరూ హాజరయ్యారని వివరించారు. ఈ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం గురించి వివరిస్తూ, ఈ విషయాన్ని గౌరవ రాష్ట్ర, కేంద్ర మంత్రులు మరియు జిల్లా కలెక్టర్ తో చర్చించి, అందరూ అంగీకరించిన నిర్ణీత స్థలంలోనే విగ్రహాన్ని ప్రతిష్టించామని ఆయన తెలిపారు. తాను తెలుగుదేశం పార్టీ తరపున మరియు కూటమి ప్రభుత్వం తరపున నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నానని, పార్టీ క్రమశిక్షణను పాటిస్తూనే ఈ కార్యక్రమాన్ని బాధ్యతాయుతంగా చేపట్టామని ఆయన పేర్కొన్నారు.

అయితే, ఈ విగ్రహ ఏర్పాటు విషయంలో కొంతమంది కావాలనే గందరగోళం సృష్టిస్తూ, పార్టీ పేరును వాడుకుని నియోజకవర్గంలో అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యే గొండు శంకర్ ఆరోపించారు. ఇలాంటి పనులు చేసే వ్యక్తులు దొంగలని, వారు పెయిడ్ ఆర్టిస్టులని మరియు పార్టీకి ద్రోహులని ఆయన ఘాటుగా విమర్శించారు. అసలైన తెలుగుదేశం పార్టీ అభిమానులు మరియు గుండ అప్పల సూర్యనారాయణ ని గౌరవించే వారు, ఎటువంటి అల్లర్లకు తావివ్వకుండా కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించు కోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

త్వరలోనే నియోజకవర్గ అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యేకంగా ప్రెస్ మీట్ ఏర్పాటు చేస్తామని, అందులో ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో చేపట్టిన పనుల గురించి పూర్తిస్థాయిలో వివరణ ఇస్తామని ఎమ్మెల్యే తెలిపారు.. విగ్రహ ఏర్పాటులో తనదే పూర్తి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.

## గొలుగొండ గురుకులంలో మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

**గొలుగొండ, జూలై 14, (మనసులో మాట) :**

గొలుగొండ మండల కేంద్రంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి ఎస్సీ కేటగిరీలో మిగిలిన సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం. కోటేశ్వరరావు తెలిపారు.

ఖాళీలు ఉన్న తరగతులు సీట్లు ఈ విధంగా ఉన్నాయి.

5వ తరగతి - 48 సీట్లు 6వ తరగతి - 20 సీట్లు
9వ తరగతి - 8 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు.

జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం - 4 సీట్లు కు ఆసక్తి కలిగిన విద్యార్థులు పాఠశాల కార్యాలయ పని వేళల్లో నేరుగా సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యార్థితో పాటు తల్లిదండ్రుల ఆధార్ కార్డుల ప్రతులు టీసీ స్టడీ సర్టిఫికెట్ కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, విద్యార్థి ఫోటోలు తీసుకురావాలని తెలిపారు. అన్ని ధ్రువపత్రాలు వెంటనే అందుబాటులో లేకపోయినా ప్రస్తుతం ఉన్న పత్రాలతో ప్రవేశం పొందిన అనంతరం మిగిలినవి సమర్పించవచ్చని పేర్కొన్నారు. గురుకులంలో ప్రవేశం పొందిన విద్యార్థులు ఇంటర్మీడియెట్ వరకు నిరంతర విద్యను అభ్యసించే అవకాశంతో పాటు ప్రతిభ ఆధారంగా ఐ ఐ టి,నీట్ వంటి పోటీ పరీక్షలకు ప్రత్యేక కేంద్రాల్లో ఉచిత శిక్షణ పొందే అవకాశం కూడా ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. పేద అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## తెరవే ఆధ్వర్యంలో సమరయోధుడు గరిమెళ్ళ జయంతి

**శ్రీకాకుళం, జిల్లా ప్రతినిధి, జులై 14, మనసులో మాట..**



శ్రీకాకుళం నగరంలోని కొత్త బ్రిడ్జి రోడ్ లో గల "గరిమెళ్ళ సత్యన్నారాయణ" విగ్రహం వద్ద గరిమెళ్ళ 133 వ జయంతి వేడుకలను మంగళవారం తెలుగు రచయితల వేదిక(తెరవే) ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ "మాకొద్దీ తెల్లదొరతనమూ దేవా" అనే పాటతో గరిమెళ్ళ ఈ ఆంగ్లేయుల గుండెల్లో వణుకు పుట్టించారని , స్వాతంత్ర్య సమరంలో కీలక భూమికను పోషించారనిబికొనియాడారు. జాతీయ కవితా సార్వభౌముని గా, ప్రజా పాటల త్యాగయ్య గా ఎనలేని గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. వావిలపల్లి రాజారావు గరిమెళ్ళ పై కవితను చదివి వినిపించారు. పలువురు తెరవే కవులు గరిమెళ్ళ సిక్కోలు వాసి కావటం గర్వకారణమని ఆయన సేవానిరతిని శ్లాఘించారు. ఈ కార్యక్రమంలో మంగిపూడి శ్రీనివాసరావు, పూడి జనార్దనరావు, భోగెల ఉమామహేశ్వర రావు, నిక్కు అప్పన్న, కిమ్మి సంతోష్ కుమార్, కొప్పల సూర్యనారాయణ, తలగాన లింగరాజు, బసవ జగన్నాథరావు, తాళ్లూరు విజయలక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ నిర్మాణానికి దాతల విరాళాలు

**వి. మాడుగుల, జూలై 14 (మనసులో మాట)**



అనకాపల్లి జిల్లా వి మాడుగుల మండలం ఎం.కోడూరు గ్రామ దేవత శ్రీ మోదకొండమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ నిర్మాణానికి భక్తులు ఉదారంగా విరాళాలు అందజేశారు. పాడేరు గ్రామానికి చెందిన కామిరెడ్డి జైపాల్ రెడ్డి-లక్ష్మీకుమారి దంపతులు రూ.10,000, ఎం.కోడూరు గ్రామానికి చెందిన బొడ్డు అప్పారావు కుమారుడు రమణ రూ.5,000లను మంగళవారం ఆలయ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి సంజీవ రావు ఆధ్వర్యంలో అర్చకులు శ్రీనివాస శర్మకు మంగళవారం అందించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దాతలను వారి సేవాభావాన్ని అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల సహకారంతో పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గ్రూప్2 ప్రిలిమ్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**శ్రీకాకుళం, జిల్లా ప్రతినిధి, జులై 14, మనసులో మాట:**

ఏపీపీఎస్సీ గ్రూప్2 (ప్రిలిమ్స్)2026 పరీక్షలకు సిద్ధమవుతున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన బీసీ, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల అభ్యర్థుల నుండి ఉచిత శిక్షణ కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు, సాధికారిత అధికారి ఐ.అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో సాధించిన మార్కుల మెరిట్ ప్రాతిపదికన మొత్తం 100 మంది అభ్యర్థులను ఈ శిక్షణకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన వారికి రెండు నెలల పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైపెండ్, ఉచిత స్టడీ మెటీరియల్‌ను అందజేస్తామని, శ్రీకాకుళం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తామని వివరించారు.

అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు 10వ తరగతి, డిగ్రీ మార్కుల జాబితాలు, కుల ధ్రువీకరణ పత్రం, తెల్ల రేషన్ కార్డు (వార్షిక ఆదాయం రూ. లక్ష లోపు ఉన్నవారు), ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ ప్రతులు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలను జతచేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు ఈ నెల 14/07/2026 నుండి తమ దరఖాస్తులను శ్రీకాకుళం వాంటే కాలనీ (80 అడుగుల రోడ్డు) లోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో లేదా ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో నేరుగా అందజేయవచ్చన్నారు. ఇతర వివరాల కొరకు 8332852106, 7382975679, 9295653489 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు జనసైనికులు సిద్ధం కావాలి

- **జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ సూర్యచంద్ర పిలుపు**

**నర్సీపట్నం రూరల్, జూలై 14, (మనసులో మాట) :**



రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన శ్రేణులు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర పిలుపునిచ్చారు. మంగళవారం నర్సీపట్నంలో పార్టీ ముఖ్య నాయకులతో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి భాగస్వామ్య పక్షాల నాయకులతో సమన్వయంగా పనిచేస్తూ విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. పార్టీ ప్రకటించిన త్రిశూల వ్యూహాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని, స్థానిక పరిస్థితులను బట్టి బలం ఉన్న ప్రాంతాల్లో పొత్తు ధర్మాన్ని పాటిస్తూ ఎన్నికల బరిలో నిలవాలని అన్నారు. యువత, మహిళల అభిప్రాయాలు, స్థానిక ప్రజల అవసరాలను తెలుసుకుని వాటికి అనుగుణంగా పార్టీ కార్యక్రమాలను రూపొందించాలని సూచించారు. ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రజలకు చేరువ కావాలని సూచించారు. అలాగే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లి ప్రజలకు వివరించాలని, పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జనసేన జిల్లా ఉపాధ్యక్షులు పూడి చక్రవర్తి, జిల్లా కార్యదర్శులు అల్లాడ సురేష్, పంచాడ హరినాథ్, గొలుగొండ మండల అధ్యక్షుడు గండెం దొరబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జీవీఎంసీ అనకాపల్లి జోన్ కార్యాలయాన్ని సందర్శించిన సహచట్టం కమిషనర్ నాయుడు...

**అనకాపల్లి రూరల్, జూలై 14 (మనసులో మాట):**



రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్ పిఎస్ నాయుడు అనకాపల్లి జోన్ కార్యాలయాన్ని సందర్శించారు. రైట్ టు ఇన్ఫర్మేషన్ ఆక్ట్ (ఆర్టిఐ)కమిషనర్ అనకాపల్లి జిల్లా పర్యటనలో భాగంగా పలు కార్యాలయాలు సందర్శించారు. ముఖ్యంగా జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కార్యాలయంలో ఆర్టిఐకి సంబంధించి రికార్డ్స్ ,సిటిజన్ చార్టర్, బోర్డులు మరియు 4. 1 బి అన్ని నిబంధనలకు అనుగుణంగా అమలు చేస్తున్నారా లేదా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్టి ఐ ద్వారా వచ్చిన దరఖాస్తులకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఇన్ టైం లోనే క్లియర్ చేయమని జోనల్ కమిషనర్ డి లక్ష్మి తులసికు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి మూడో శుక్రవారం ఆర్టిఐ కి సంబంధించి జోనల్ కార్యాలయంలో ఒక ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఆర్టిఐ దరఖాస్తులు క్లియర్ చేయమని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ తులసి దగ్గరుండి అన్ని రికార్డులను కమిషనర్ కు అందుబాటులో ఉంచారు. జోనల్ కార్యాలయంలో సహచట్టం నిబంధనల మేరకు రికార్డులు సక్రమంగా నిర్వహించడం పట్ల కమిషనర్ నాయుడు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిపిఓ సిఎస్ ప్రవీణ్ కుమార్, సూపరింటెండెంట్ పి అప్పల నాయుడు,రెవెన్యూ ఇన్స్పెక్టర్ పరదేశి నాయుడు, ఈ ఈ శేఖర్, యూనియన్ నాయకులు అందే శ్రీనివాసరావు వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జనాభా పెరుగుదలకు ప్రజల్లో అవగాహన పెంపొందించాలి







- **జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.అనిత**

**శ్రీకాకుళం, జిల్లా ప్రతినిధి, జులై 14, మనసులో మాట:**

జూలై 11 నుండి జూలై 18 వరకు ప్రచారంలో భాగంగా ప్రపంచ జనాభా దినోత్సవంను పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వారి కార్యాలయం నుండి స్థానిక ఏడు రోడ్ల కూడలి వరకు కుటుంబ సంక్షేమం దేశ సౌభాగ్యం అనే నినాదంతో వైద్య ఆరోగ్యశాఖ అధికారి వారి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, డా. కె. అనిత మాట్లాడుతూ ప్రపంచ జనాభాలో రెండవ స్థానంలో ఉండే వాళ్లమనీ కాలక్రమేణా జనాభా తగ్గుముఖం పడుతుందని అందుకు కారణం ప్రజల్లో పని వత్తిడి, సకాలంలో వివాహం జరగకపోవడం, ఆర్థికంగా స్థిరపడిన తరువాత వివాహం చేసుకుందామనే ఆలోచనలు వల్ల అని తెలిపారు. పదేళ్లకు ఒకసారి జరిగే జనాభా లెక్కల ప్రకారం 100 మందిలో 11 శాతం పిల్లలుంటే ఇప్పుడు ఆ శాతం గణనీయంగా తగ్గిందని దానిని పెంచే విధంగా ప్రభుత్వం వివిధ పథకాలను ప్రజల్లోకి తీసుకువచ్చి జనాభా పెరుగుదలకు కృషి చేస్తుందని, అందువలన శిశు మరణాలు జరగకుండా చూడాలని, గర్భిణీ స్త్రీలకు సరియైన సమయంలో వైద్యంతో పాటు మంచి పౌష్టికాహారం అందించాలని సూచించారు. ప్రజల్లో జనాభా నియంత్రణ, కుటుంబ సంక్షేమం,మహిళల ఆరోగ్యం, మాతాశిశు సంక్షేమం, విద్య మరియు సమాన అవకాశాలపై అవగాహన కల్పించే ప్రభుత్వం, ఇప్పుడు సంపదతో పాటు పిల్లలను కనమని, తద్వారా దేశం జనాభా పెంచడం కోసం అధిక ప్రాధాన్యత ఇస్తుందని అందుకు ప్రధాన కారణం దేశ జనాభా తగ్గుముఖం పట్టడమే అని అన్నారు.

ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సభలో వక్తలు మాట్లాడుతూ, జనాభా పెరుగుదలకు ప్రజలను చైతన్య పరుస్తూ, కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఆరోగ్య సవాళ్లను అధిగమించి శిశు మరణాల సంఖ్య తగ్గించాలని తెలిపారు.

అలాగే మహిళల సాధికారత, బాలికల విద్య, ఆరోగ్య సేవల విస్తరణ, కుటుంబ సంక్షేమ కార్యక్రమాల అమలు ద్వారా సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని వివరించారు. ప్రతి కుటుంబం బాధ్యతాయుతమైన నిర్ణయాలతో ఆరోగ్యకరమైన, అభివృద్ధి చెందిన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా (లక్కీ డిప్) ద్వారా ఎంపిక కాబడిన వారికి నగదు ప్రోత్సాహకాలుగా ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్న కుటుంబాలకు (లక్కీ డిప్)

# ప్రపంచ సైకాలజిస్టుల దినోత్సవం సందర్భంగా ఏడుగురికి ఘన సన్మానం

**శ్రీకాకుళం, జిల్లా ప్రతినిధి, జులై 14 , మనసులో మాట:**





ప్రపంచ సైకాలజిస్టుల అభినందన దినోత్సవాన్ని పురస్కరించుకొని అడ్వాన్స్డ్ సైకాలజికల్ సర్వీసెస్ అసోసియేషన్ ఇండియా మరియు జె సి ఐ మెయిన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని విద్యాధరి బి.ఎడ్ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ ఆఫ్ సైకో ఎనాలసిస్ అయినా సిగ్మాండ్ ఫ్రాయిడ్ కు పూలదండ వేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది, ఈ కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపకులు జామి భీమశంకర్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజానికి , ప్రజలకు, విద్యార్థులకు, తల్లిదండ్రులకు , అలాగే గవర్నమెంట్ స్కూళ్లలోనూ, ప్రైవేట్ స్కూళ్లలోనూ, కాలేజీల్లోనూ సైకాలజిస్ట్ లు అవసరం ఎంతైనా ఉందని తెలియజేశారు ,వాళ్ళ సేవలను ప్రభుత్వం గుర్తించాలని తెలియజేశారు, జె సి ఐ జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి తమ్మినేని ఉషారాణి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చెడు వ్యసనాలకు బానిస కాకుండా అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో ఏ పి ఏ ఐ జిల్లా అధ్యక్షులు దూబ సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఆలోచనలపై అదుపు సాధించగలిగితే విజయం సాధ్యమవుతుందని తెలియజేశారు, అలాగే వ్యక్తి జీవితంలోను, వృత్తి జీవితంలోనూ క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని ఆయన అన్నారు, అలాగే జిల్లా కార్యదర్శి డాక్టర్ బుడుమూరు సూర్యారావు మాట్లాడుతూ సమాజంలో మానసిక ఆరోగ్యం పై అవగాహన పెంపొందించడంలో సైకాలజిస్ట్ ల పాత్ర ఎంతో కీలకమని, అలాగే వివిధ పాఠశాలల్లో కళాశాలలో ప్రభుత్వ మరియు ప్రైవేటు సంస్థలలో అర్హత కలిగిన సైకాలజిస్ట్ల సేవలను మరింత విస్తృతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. ఈ సందర్భంగా మానసిక ఆరోగ్య రంగంలో విశిష్ట సేవలందిస్తున్న ఏడుగురు సైకాలజిస్టులు అయిన కౌన్సిలర్ దుబా సురేష్ , డాక్టర్ బుడుమూరు సూర్యారావు, కౌన్సిలర్ ధర్మాన జోగారావు, డాక్టర్ పొన్నాడ రాజశేఖర్, కౌన్సిలర్ శ్రీమతి పంచాది సూర్య ప్రభ, కౌన్సిలర్ మురళి, కౌన్సిలర్ పసగాడ సూర్యనారాయణ, జె సి ఐ మరియు విద్యాధరి బిఈడి కాలేజ్ వ్యవస్థాపకులు, అధ్యక్షులు ఘనంగా సన్మానం చేయడం జరిగింది, కార్యక్రమంలో విద్యార్థుల చేత మానసిక ఆరోగ్యం పై ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ చక్రవర్తి, కళాశాల కరస్పాండెంట్ బరాటం లక్ష్మణ్ , కళాశాల లెక్చరర్ రమేష్, చాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

# వృద్ధులకు వరంగా ఉచిత నేత్ర వైద్య శిబిరం

- చినదొడ్డిగల్లులో 120 మందికి కంటి పరీక్షలు.. 20 మందిని ఉచిత శస్త్రచికిత్స కోసం విశాఖకు తరలింపు

**నక్కపల్లి, జూలై 14 (మనసులో మాట):**



మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మంగళవారం నిర్వహించిన ఈ శిబిరంలో 120 మంది కంటి రోగులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వేంపాడు పీఏసీఎస్ చైర్‌పర్సన్ వెలగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత నేత్ర వైద్య సేవలను ముఖ్యంగా వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మానవ జీవితంలో కంటి ప్రాముఖ్యతను వివరించిన ఆయన అవసరమైన వారికి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్య సేవలు అందించిన డాక్టర్ జాక్సన్ మాట్లాడుతూ రోగులకు కంటి చూపు స్థాయిని బట్టి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, కళ్లజోళ్లు అందజేసినట్లు చెప్పారు. పరీక్షల అనంతరం 20 మందికి కంటి శస్త్రచికిత్స అవసరమని గుర్తించి వారిని విశాఖపట్నంలోని శంకర్ ఫౌండేషన్‌కు ఉచిత ఆపరేషన్ కోసం తరలించినట్లు తెలిపారు. ఈ శిబిరానికి కొత్తూరు, రమణయ్యపేట, రేబాక, గుల్లిపాడు తదితర గ్రామాల నుంచి కూడా రోగులు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో నేత్రాలయ ప్రాథమిక కంటి పరీక్షా కేంద్రం సీనియర్ ఆప్తోమెట్రిస్ట్ ఎన్. చిన్నారావు, నాయకులు మాకిరెడ్డి నాగు, వెలగా విజయ్‌కుమార్, దాడిశెట్టి కిరణ్, కె. కిషోర్, పంపనబోయిన శ్రీను, శరణపు ఆదిబాబు, కిల్లాడ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# మోడీ సంకల్పాన్ని, అంబేద్కర్ ఆశయాలను ప్రజలలోకితీసుకువెళ్లాలి....

- అనకాపల్లి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి బొడ్డేడ....
- దళిత మోర్చా జిల్లా పదాధికారుల సమావేశం....

**అనకాపల్లి రూరల్, జూలై 14 (మనసులో మాట):**



ప్రధాని నరేంద్ర మోడీ సంకల్పాన్ని అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అనకాపల్లి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి, దళిత మోర్చా జిల్లా ఇన్చార్జ్ బొడ్డేడ నాగేశ్వరరావు కోరారు. అనకాపల్లి జిల్లా బీజేపీ కార్యాలయంలో దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు గోటివాడ సామ్రాట్ కుమార్ అధ్యక్షతన జిల్లా పదాధికారుల సమావేశం నిర్వహించారు. సామ్రాట్ కుమార్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ రాష్ట్ర బిజెపి పార్టీ అధ్యక్షులు పివిఎన్ మాధవ్, దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతాల సురేష్ ఆదేశాల మేరకు, అనకాపల్లి జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు ద్వారపు రెడ్డిపరమేశ్వరరావు సహకారంతో జిల్లా అంతా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి బొడ్డేడ నాగేశ్వరావు పాల్గొని మాట్లాడుతూ అంబేద్కర్, మోదీ ప్రతిభా పురస్కార్ - 2026 కార్యక్రమాన్నివిజయవంతం చేయడానికి జిల్లా కన్వీనర్లను పార్టీ అధిష్ఠానం నియమించిందన్నారు. అనకాపల్లి జిల్లాకు కన్వీనరుగా కచ్చా శ్రీను, కో కన్వీనర్ గా తోమండ్రు అప్పారావునియమితులయ్యారని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సేవా సంకల్పాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తూ, ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి, ప్రోత్సహించే ఈ మహత్తర కార్యక్రమాన్నివిజయవంతం చేయడంలో అందరూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈకార్యక్రమంలో జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ కొణతాల సాయి రామ్ ప్రసాద్, జిల్లా దళిత మోర్చా ఉపాధ్యక్షులు భూపతి అప్పారావు, ఉరివిటి పోలమ్మ, మణికంఠ గోవిందరావు, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏరియా ఆసుపత్రిని సందర్శించిన డిసిహెచ్ఎస్

**పాలకొండ, జులై14,మనసులో మాట :**



పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రి నీ సందర్శించిన జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయాధికారి డా జి. నాగ భూషణ రావు రోగులకు అందిస్తున్న డైట్ ను పరిశీలించారు. భోజనాలు ఎలా ఉన్నాయ్ అని రోగులను అడిగి తెలుసుకున్నారు. డైట్ కాంట్రాక్టర్ తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. డైట్ ను రోజువారీగా పరిశీలిస చెయ్యాలని నర్సింగ్ సూపరింటెండెంట్ దుర్గాభవాని,హెడ్ నర్సులు, విజయ కుమారి, యాదవేశ్వరి, శైలజ, నాగ రత్నం కు డైట్ కు సంబంధించిన అన్ని మీరే చూసుకోవాలని ఆదేశించించారు. ఆయన తో పాటు మెడికల్ సూపరింటెండెంట్ డా కడియం చిరంజీవి , ఆర్ యం ఓ డా కె. రవి కుమార్ లు ఆయన వెంట వున్నారు.పాత బడిన భవనాలు తొలగించాలని సూపరింటెండెంట్ కి ఆదేశించారు.పునర్నిర్మాణం జరుగుతున్న భావనాలు, శాస్త్ర చికిత్స గదులు, విభాగాలు పరిశీలించారు. ఏపీ ఎస్ ఎం ఐ డి ఎస్ ఈ ఈ కి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు జారీచేశారు. ఆయనతో పాటు పలువురు వైద్యులు పాల్గొన్నారు.

# సైబర్ సెక్యూరిటీపై న్యాయ అవగాహన శిబిరం

**విజయనగరం, జులై 14 (మనసులో మాట జిల్లా ప్రతినిధి) :**



స్థానిక మహారాజ కాలేజీ అఫ్ ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాల నివారణ, ఆన్‌లైన్ భద్రత, డిజిటల్ లావాదేవీలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం న్యాయ అవగాహన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ కమ్ సీనియర్ సివిల్ జడ్జ్ డా. ఎ. కృష్ణ ప్రసాద్ సైబర్ మోసాలు, ఫిషింగ్, నకిలీ లింకులు, ఓటీపీ మోసాలు, సోషల్ మీడియా భద్రత, వ్యక్తిగత సమాచార పరిరక్షణ, బలమైన పాస్‌వర్డ్‌ల వినియోగం, ఆన్‌లైన్ మోసాల నుండి రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ 1930కు ఫిర్యాదు చేయాలని, అధికారిక సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయవచ్చని వివరించారు. విద్యార్థులు సోషల్ మీడియాలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అనుమానాస్పద సందేశాలు, లింకులు యాప్‌ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# కాలభైరవుడికి కాలరాత్రి అమావాస్య మహాభిషేకం

**గాజువాక(మనసులోమాట )జులై 14**



జీవీఎంసీ పరిధి 65వ వార్డు వాంబే కాలనీ శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో కాలభైరవ స్వామికి శ్రీ స్వర్ణాకర్షణ భైరవ అమావాస్య సందర్భంగా మహాభిషేకం ప్రత్యేక హోమాలు పూజలు ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ దొడ్డి రమణ నేతృత్వంలో జరిపించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఈరోజు శ్రీ స్వర్ణాకర్షణ భైరవ అమావాస్య 250 సంవత్సరాలకు ఒక్కసారి అధికమాసంలో వచ్చే అమావాస్యను శ్రీ స్వర్ణాకర్షణ భైరవ కల భైరవ కాలరాత్రి అమావాస్య అంటారు. పితృదేవతలకు అత్యంత ప్రీతిపదమైన అమావాస్య కాలభైరవుడికి అభిషేకం హోమంలు చేయడం జరిగిందని దీని వల్ల మన పితృదేవులకు మన కుటుంబ సభ్యులకు సుఖ సంతోషాలు ఆయురారోగ్యాలు , కలుగుతాయని స్వామివారిని కొలిస్తే కోరిన కోరికలు తీరుతాయని దృఢ సంకల్పంతో స్వామిని పూజిచేసి స్వామివారి కృపకు పాత్రులు అవుతారని అన్నారు. గాజువాక ప్రాంతంలో కాలభైరవ దేవస్థానం నిర్మించడం ఎంతో శుభదాయకమని కొనియాడారు పరిసర ప్రాంత ప్రజలందరూ స్వామివారిని దర్శించుకుని వారి కోరిన కోరికలు తీర్చుకోవలసిందిగా ప్రజలను అభ్యర్థించారు. పూజా కార్యక్రమం రాఘవేంద్ర శర్మ సారిధ్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలోపెంటకోట రాజు, పాండురంగ జయరాజ్, హరికృష్ణ, బి. వెంకటేష్, జ్యోతి, ఆదిలక్ష్మి, పద్మ, చిట్టమ్మ, వరలక్ష్మి , రామ ఆలయ కమిటీ సభ్యులు కాలనీ భక్తులందరూ పాల్గొన్నారు.

## ఖురిగాం ఆసుపత్రిలో అడుగడుగునా లోపాలే

- ప్రాణాలమీదకు తెస్తున్న అత్యవసర విభాగం తీరు
- పాముకాటు బాధితురాలు అరగంట నిరీక్షణ..
- స్టాఫ్ నర్స్ అందుబాటులో లేదని గ్రామస్థుల ఆరోపణ
- విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి..



**పాతపట్నం, జూలై 14 మనసులో మాట:**

పాతపట్నం నియోజకవర్గం కొత్తూరు మండలం ఖురిగాం ప్రభుత్వ ఆసుపత్రి లో అత్యవసర వైద్య సేవల నిర్వహణపై గ్రామస్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాముకాటుకు గురైన ఓ మహిళను చికిత్స నిమిత్తం ఖురిగాం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చినా, సుమారు అరగంట పాటు ఒక్క స్టాఫ్ నర్స్ కూడా అందుబాటులో లేకపో వడంతో బాధితురాలు చికిత్స కోసం నిరీక్షించాల్సి వచ్చిందని గ్రామస్థులు ఆరోపించారు.పాముకాటు వంటి ప్రా ణాపాయ పరిస్థితుల్లో ప్రతి నిమిషం కీలకమైనదని, అలాంటి సమయంలో వైద్య సిబ్బంది లేకపోవడం ప్రభుత్వ వైద్య వ్యవస్థలోని లోపాలను బయ టపెడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర సేవలు అందాల్సిన ఆసుపత్రిలో సిబ్బంది అం దుబాటులో లేకపోతే రోగుల ప్రాణాల కు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.ఈ ఘటనపై స్పందించిన గ్రామస్థులు, ఖురిగాం ప్రభుత్వ ఆసు పత్రి పనితీరుపై సమగ్ర విచారణ జరి పించాలని, అత్యవసర సమయాల్లో వైద్యులు, స్టాఫ్ నర్సులు తప్పనిసరిగా విధుల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు వెంటనే దృష్టి సారించి, ఆసుపత్రి పరిస్థితులను పరిశీలించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.అదే విధంగా, గ్రామస్థులతో కలిసి ఐటీడీపీ అధ్యక్షుడు శేపాన విక్రమ్ కూడా ఖురిగాం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలను మెరుగుప రచాలని, ప్రజలకు నాణ్యమైన అత్యవ సర వైద్యం అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి .

## ఫీజు బకాయిలు చెల్లించి గిరిజన విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

**పార్వతీపురం జిల్లా ప్రతినిధి, జూలై-14, మనసులో మాట:**



విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్క రించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా అఖిల భారత విద్యా ర్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) పార్వతీపురం మన్యం జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగ ళవారం పార్వతీపురంలో కలెక్టర్ కార్యాల యం ఎదుట భారీ విద్యార్థి ర్యాలీ,ఆందోళన జిల్లా కార్యదర్శి రవి నాయకత్వం లో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహిం చారు.అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏ ఐ ఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్య క్షులు గుజ్జల వలరాజు మాట్లాడుతూ.... రాష్ట్రంలో విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వం వాటి పరిష్కారంపై నిర్లక్ష్యంగా వ్యవహరి స్తూ ప్రకటనలకు మాత్రమే పరిమితమైం దని విమర్శించారు. విద్యా శాఖ మంత్రి అధి కారంలోకి వచ్చిన 100 రోజుల్లో బకాయిలు విడుదల చేస్తాం, 77,జీవో రద్దు చేస్తాం, రాష్ట్రంలో ప్రతి ఒక్క విద్యార్థి కి చదువుకునే అవకాశం కల్పిస్తామన్న విద్యాశాఖ మంత్రి నేటికీ రెండు సంవత్సరాలు అవుతున్న ఏ ఒక్క సమస్యను పరిష్కరించకుండా సూపర్ సిక్స్ విజన్ చంద్రబాబు, డబల్ ఇంజన్ సర్కార్ అంటూ రెండేళ్లలో విద్యార్థులకు చేసిందేమీ లేదని, ఆగ్రహం వ్యక్తం చేశారు, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో నిత్యావసర వస్తు వుల ధరలు పెరిగిన నేపథ్యంలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు మెస్ ఛార్జీలను రోజుకు రూ.100కు పెంచాలని కోరారు. పేద విద్యార్థుల ఉన్నత విద్యకు అడ్డంకిగా మారిన జీఓ నెం.77ను వెంటనే రద్దు చేయాలని,గిరిజన సంక్షేమ ఆశ్రమ పా ఠశాలల్లో తరగతుల కుదింపును ఉపసంహ రించుకోవాలని,రాష్ట్రవ్యాప్తంగా మూతపడిన 4,500 ప్రభుత్వ పాఠశాలలను పునఃప్రారం భించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా నాడునేడు కార్యక్రమంలో నిలి చిపోయిన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఎస్ఎంఏం పోస్టు లను వెంటనే భర్తీ చేయాలని, ప్రభుత్వ హాస్ట ళ్లలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు, స్వచ్ఛమైన తాగునీరు, నాణ్యమైన భోజనం, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, అవసరమైన సిబ్బందిని అందుబాటులో ఉంచాలని కోరారు. గిరిజన విద్యార్థులు మరణం పై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

## నెట్ జీరో అండ్ హెల్తీ క్యాంపస్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి

- జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారిత అధికారి కె. శ్రీనివాసరావు

**విజయనగరం, జూలై 14 (మనసులో మాట జిల్లా ప్రతినిధి) :**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న నెట్ జీరో అండ్ హెల్తీ క్యాంపస్ కార్యక్రమాన్ని జిల్లాలోని గిరిజన సంక్షేమ విద్యాసంస్థల్లో సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా గిరిజన సంక్షేమ, సాధి కారిత అధికారి కె. శ్రీనివాసరావు నోడల్ అధికారులను ఆదేశించారు. మంగళవా రం జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారిత అధికారి కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లాలోని 6 ఆశ్రమ పాఠశాలలు, 2 కళాశాల వసతి గృహాలకు చెందిన నోడల్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోలార్ విద్యుత్ వినియోగం, గ్రీన్ క్యాంపస్‌ల అభివృద్ధి, మొక్కల పెంపకం, కిచెన్, హెర్బల్ గార్డెన్ల ఏర్పాటు, వర్షపు నీటి సం రక్షణ, వ్యర్థాల నిర్వహణ, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యాల మెరుగుదల వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎంజీఎన్ఆర్ఇజీఎస్/ వీబీజీరామ్ (జి) మార్గదర్శకాల మేరకు ప్లాంటేషన్, నీటి సంరక్షణ పనులను చేపట్టి, సంబంధిత రికార్డులు, ఫోటోలు, నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతీ విద్యాసంస్థలో గ్రీన్ కమిటీస్ , ఎకో క్లబ్స్ ఏర్పాటు చేసి విద్యార్థుల్లో పర్యావరణ పరి రక్షణపై అవగాహన పెంపొందించాలని సూచించారు.

## రైతులకు వరి పంట సాగుపై శిక్షణ : భానులత

**శృంగవరపుకోట, జూలై 14: (మనసులో మాట )**



కొత్తవలస మండలంలోని గనిసెట్టిపా లెం రైతు సేవ కేంద్రం పరిధిలో వ్యవ సాయ సాంకేతిక నిర్వహణ సంస్థ (ఆత్మ) మరియు వ్యవసాయ శాఖ సంయుక్తంగా వ్యవసాయ సహాయ సంచాలకులు బి భానులత అధ్యక్షతన రైతులకు వరిపంట సాగు పై శిక్షణ అందించారు , ఈ కార్య క్రమంలో పాల్గొన్న ఆత్మ డిప్యూటీ డైరె క్టర్ మహారాజన్ మాట్లాడుతూ రైతులు వీలైనంత వరకు వరి విత్తనాలను సొంతంగా కట్టుకోవాలని, నారుమడి సిద్ధం చేసుకోవటానికి ముందే మొలకశా తం కట్టుకొని, మొలకశాతం బాగుంటే విత్తనశుద్ధి చేసి నారుమడి తయారు చేసుకోవాలని తెలిపారు, అలాగే ఈ కా ర్యక్రమంలో పాల్గొన్న ప్రధాన శాస్త్రవేత్త , ఏరువాక కేంద్రం విజయనగరం డా లక్ష్మణ్ మాట్లాడుతూ రానున్న కాలంలో ఎల్ నినో ప్రభావాన్ని రైతులు కొన్ని పద్ధ తుల మార్పులతో ఎదుర్కోవచ్చు అని, నాట్లువేసే పద్ధతి కాకుండా వెద పద్ధతి లో వరి పండించటం మేలైన పద్ధతి అని, అలాగే ఎరువుల వినియోగం కూడా తగ్గించాలి అని, వెదపద్ధతిలో కలుపు నివారణ కోసం 48 గంటలలోపు పెం డిమిథలిన్ ఒక లీటర్ ఒక ఎకరానికి, 2 నుంచి 5 రోజుల లోపు అయితే పైరీజో సల్ఫ్యూరఇతైల్ (సాథీ) 100 గ్రాములు ఎకరానికి, 12 నుంచి 15 రోజుల లోపు కౌన్సిల్ ఆక్టివ్ 90 ml , 15 రోజుల పైన దాటిన అయిన అన్నిరకాల కలుపు నివా రణకు బిస్పైర్బాక్ సోడియం 80 100 ఎం ల్ ఎకరానికి పిచికారీ చేసి కలుపును సమర్థవంతంగా నియంత్రించవచ్చు ఆయన తెలిపారు, ఏడిఏ భానులత మాట్లాడుతూ రైతులందరికీ కావలసిన విత్తనాలు మరియు ఎరువులు అన్నిరైతు సేవ కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి తెలిపారు, ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కే వి రామ్ ప్రసాద్ , ఏఈఓ గణేష్, గ్రామ ఉద్యాన సహాయ కులు రవి ప్రకాశ్ , జ్యోతి , ఏంపిఈఓ కుమారి, వ్యవసాయ సహాయకుడు దు ర్గారావు , ప్రకృతి వ్యవసాయ మండల కో ఆర్డినేటర్ సన్యాసమ్మ, సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు

## బీచ్ షాక్స్ నిలిపివేసి జీవో 362 రద్దు చేయాలని డిమాండ్

**విశాఖపట్నం, మనసులోమాట , జూలై 14:**





రాష్ట్రంలోని విశాఖ బీచ్ తో పాటు పలు బీచ్ లలో బీచ్ షాక్స్ పేరుతో కూటమి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న మద్యం అమ్మ కాలను నిలిపివేసి, జీవో నెంబర్ 362ను రద్దు చేయాలని మహిళా సంఘాల ఐక్యవే దిక నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమా వేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా సంఘాలతో పాటు, ప్రజా, దళిత బహుజన, యువజన సంఘాల, విద్యార్థి, కార్మిక నేతలు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పిఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం లక్ష్మి మాట్లాడుతూ బీచ్ లో మద్యం అమ్మకాల వల్ల బీచ్ సంద ర్శకులకు ఇబ్బందిగా ఉంటుందన్నారు. బీచ్ లో యువతీ యువకులు కూర్చుని పెగ్గు వేసుకుంటే తప్పు ఏంటని బాధ్యత రాహితంగా శాసన సభాపతి అయ్యన్నపా త్రుడు మాట్లాడుతున్నారన్నారు. నీటిపై కేసినో అవసరమంటున్నారని దుయ్య బట్టారు. ఐద్వా నాయకురాలు పద్మ మా ట్లాడుతూ విశాఖ నగరాన్ని ముఖ్యంగా బీచ్ ను మత్తులో ఉంచడానికి ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతుందని మం డిపడ్డారు. దశల వారి ఉద్యమంతో ప్రభు త్వానికి తగిన గుణపాఠం చెప్తామన్నారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యు నేత ఏ.విమల మాట్లాడు తూ గతంలో లవ్ ఫెస్టివల్ ను, అందాల పోటీలను ఆపగలిగామని, అదేవిధంగా దీనిని అడ్డుకుంటామన్నారు. సి ఎం ఎస్ నాయకురాలు లలిత మాట్లాడుతూ ఏ పార్టీ అధికారంలో ఉంటే వారే మద్యం కాంట్రాక్టర్లుగా ఉంటున్నారని తెలిపారు. విద్య, ఆరోగ్యం ప్రజలకు అందివ్వలేని ప్రభుత్వం, మద్యం మాత్రం సమృద్ధిగా అందిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయవాది గిరిధర్ మాట్లాడుతూ రాష్ట్రం లో సగానికి పైగా మద్యం షాపులు నిబంధ నలకు వ్యతిరేకంగానే నడుస్తున్నాయన్నా రు. కార్యక్రమంలో భీమ్ సేన వార్ ప్రధాన కార్యదర్శి డా. వసంత రాజేంద్రప్రసాద్, జన విజ్ఞాన వేదిక మురళీధర్, డిహెచ్పీఎస్ రాంబాబు, భీమ్ సేన ఉపాధ్యక్షుడు వి.వి. దుర్గారావు, నిర్మల, రోహిణి, సిఐటియు, ఏఐటియుసి, ఎస్ఎఫ్ఐ ,డివైఎఫ్ఐ, ఎం ఎంఎస్ఎస్, తదితర సంఘాల నేతలు పాల్గొన్నారు.

# విశాఖ జూ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక....

- పోస్టుల భర్తీ, సీఎస్ఆర్ నిధులతో మెరుగైన వసతుల కల్పన.
- పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేలా ప్రభుత్వానికి సమగ్ర నివేదిక:
- అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు





**నర్సీపట్నం రూరల్/ విశాఖపట్నం, జులై 14, ( మనసులో మాట) :**

విశాఖపట్నం జంతు ప్రదర్శనశాల అభివృద్ధి, వన్యప్రాణుల సంరక్షణపై ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు స్పష్టమైన ప్రణాళికను వివరించారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా పర్యావరణం, జంతు సంరక్షణ కోసం శాసనసభ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. వన్యప్రాణి, పర్యావరణ పరిరక్షణ కమిటీ చైర్మన్ హోదాలో ఆయన 12 మంది సభ్యుల బృందంతో కలిసి మంగళవారం విశాఖ జూను ఆయన పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి సంవత్సరం లక్షలాది మంది పర్యాటకులు వచ్చే విశాఖపట్నం, తిరుపతి జూ పార్కులను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్ది, సందర్శకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తమ లక్ష్యమని స్పీకర్ స్పష్టం చేశారు. విశాఖ జూలో సుమారు 600 ఎకరాల విస్తీర్ణంలో 1400లకు పైగా పక్షులు, జంతువులు ఉన్నప్పటికీ వాటికి వైద్యం అందించడానికి కేవలం ఒక డాక్టర్, ఒక హెల్పర్ మాత్రమే ఉండటంపై స్పీకర్ ఆందోళన వ్యక్తం చేశారు. వన్యప్రాణులకు మెరుగైన వైద్యం అందించేందుకు ఈ ఖాళీలను తక్షణమే భర్తీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే రోజుకు మూడు నుంచి నాలుగు వేల మంది సందర్శకులు వస్తున్నప్పటికీ, వారికి సరిపడా మరుగుదొడ్లు, తాగునీరు, క్యాంటీన్ వంటి కనీస సౌకర్యాలు లేవని కమిటీ గుర్తించిందని తెలిపారు. పిల్లల వినోదం కోసం సాయంత్రం వేళల్లో ప్రత్యేక కార్యక్రమాలు, టాయ్ ట్రైన్ లాంటి సదుపాయాలు తీసుకురావాలని అధికారులకు సూచించారు. జూ పార్క్ నిర్వహణకు ఏటా సుమారు పది కోట్ల రూపాయలు అవసరం కాగా, ప్రస్తుతం 7.5 నుంచి 8 కోట్ల రూపాయల ఆదాయం మాత్రమే వస్తోందని స్పీకర్ వివరించారు. ఈ ఆర్థిక లోటును అధిగమించేందుకు విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లోని పరిశ్రమల నుంచి కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల కింద 3 నుంచి 4 కోట్లు సేకరించాలని కలెక్టర్‌కు సూచించారు. స్థానిక ఎంపీలు, రాజ్యసభ సభ్యుల నిధులు, జాతీయ బ్యాంకుల సహకారాన్ని కూడా అభివృద్ధి కోసం వినియోగించుకుంటామన్నారు. ప్రభుత్వం సింగపూర్ బృందంతో చర్చలు జరుపుతూ కైలాసగిరితో పాటు జూను ఒక సుందరమైన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. అధికారుల సూచనలు, మీడియా సలహాలు స్వీకరించి జంతు సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వానికి ఒక సమగ్ర నివేదిక అందజేస్తామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడించారు.

# సెల్ టవర్ నిర్మాణానికి గొయ్యి తీసి వదిలేసారు....



**కోటవురట్ల (మనసులో మాట) జులై 14:**

మండలంలో గొట్టివాడ శివారు అణుకు గిరిజన గ్రామంలో బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ నిర్మాణం కోసం రెండు నెలల కిందట గొయ్యి తీసి వదిలివేశారు.ఈ ఏడాది జనవరి నెలలో గ్రామంలో పర్యటించిన హోం మంత్రి వంగలపూడి అనిత గిరిజనుల కోరిక మేరకు సెల్ టవర్ మంజూరుకు హామీ ఇచ్చారు.ఆమె ఇచ్చిన హామీ మేరకు గ్రామానికి బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ మంజూరు అయింది.సిబ్బంది వచ్చి గొయ్యి తీసి వెళ్లిపోయారు. తర్వాత దాని విషయమై ఎవరు పట్టించుకోలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు గోతిలో నీళ్లు చేరాయి. పిల్లలు అదే ప్రాంతంలో రోజు ఆడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే సెల్ టవర్ నిర్మాణాన్ని చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# రైతు సంక్షేమమే ధ్యేయం కొత్తూరులో ఎరువుల పంపిణీ ప్రారంభం

- కొత్తూరులో ఎరువుల పంపిణీ కార్యక్రమంలో లోతుగెడ్డ తులసీ వరప్రసాద్ రావు..



**పాతపట్నం, జులై 14 మనసులో మాట :**

రైతుల అభ్యున్నతి, వ్యవసాయాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని లోతుగెడ్డ తులసీ వరప్రసాద్ రావు అన్నారు. పాతపట్నం నియోజకవర్గం కొత్తూరు మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఎరువుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు ఎరువులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతే దేశానికి వెన్నెముక అని, రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రైతులకు సకాలంలో నాణ్యమైన ఎరువులు అందించడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తి పెరిగి, రైతులు ఆర్థికంగా మరింత బలోపేతం అవుతారని తెలిపారు. పంటల సాగులో రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోందని చెప్పారు.వ్యవసాయంలో ఎరువుల వినియోగం కీలకమని పేర్కొన్న ఆయన, శాస్త్రీయ పద్ధతుల్లో సరైన మోతాదులో ఎరువులు వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా పంటల నాణ్యతతో పాటు రైతుల ఆదాయం కూడా పెరుగుతుందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు, సాగునీటి సౌకర్యాల కల్పనతో పాటు రైతుల సంక్షేమానికి పలు అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చుకోవాలని కోరారు.కార్యక్రమంలో రైతులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.రైతుల అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు లోతుగెడ్డలక్ష్మీనారాయణ నాయుడు, పడాల వెంకటకృష్ణ, లోతుగెడ్డ జనార్ధనరావు తదితరులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు

# అసత్య ఆరోపణలపై మహిళకు చట్టపర చర్యలు కోరుతూ ఫిర్యాదు

**నర్సీపట్నం: జులై 14 (మనసులో మాట )**



తనపై ఒక మహిళ చేసిన అసత్య, నిరాధార ఆరోపణలపై సమగ్ర విచారణ నిర్వహించి, వాస్తవాలను వెలికితీసి, తప్పుడు ఆరోపణలు చేసిన మహిళపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ సీనియర్ నాయకులు, వివేకానంద విద్యాసంస్థల చైర్మన్ అప్పన ఎన్. ఎస్. జి. దొరబాబు నర్సీపట్నం టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గఫూర్ ఖాన్ కి సోమవారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన ప్రతిష్టను దెబ్బతీసే ఉద్దేశంతో కొందరు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వాటిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి నిజానిజాలు వెలికితీయాలని కోరారు. చట్టంపై తనకు పూర్తి నమ్మకం ఉందని, వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆయన తెలిపారు.

ఈ ఫిర్యాదును స్వీకరించిన టౌన్ సీఐ ఫిర్యాదుపై చట్టపరంగా విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు..

# రెండు లీటర్ల హాషీష్ (లిక్విడ్ గంజాయి) స్వాధీనం





- ఐదుగురు అరెస్ట్..
- రూ 33 లక్షల విలువ గల సొత్తు స్వాధీనం
- నర్సీపట్నం డిఎస్పి శ్రీనివాసరావు వెల్లడి

**నర్సీపట్నం రూరల్, జులై 14, (మనసులో మాట) :**

నర్సీపట్నం రూరల్ పోలీస్ సర్కిల్ పరిధిలోని గొలుగొండ మండలం ఏటి గైరంపేట వద్ద రెండు లీటర్ల హాషీష్ ( లిక్విడ్ గంజాయి ) తో పాటు, రెండు కిలోల ఎండు గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకొని ఐదుగురిని అరెస్టు చేశారు. మంగళవారం నర్సీపట్నం డిఎస్పి పి శ్రీనివాసరావు విలేకరులకు వివరాలను వెల్లడించారు. ముందుగా అందిన సమాచారం మేరకు నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్ రేవతమ్మ, గొలుగొండ, కృష్ణదేవిపేట ఎస్సైలు పి రామారావు, రిషికేశ్వర రావు, తమ సిబ్బందితో ఏటి గైరంపేట గ్రామ శివారులో మాటువేసి, మూడు మోటార్ సైకిళ్ల పై వస్తున్న ఐదుగురు వ్యక్తులు తమ చేతి సంచిలోని మాదక ద్రవ్యాలను ఒక వాహనం నుండి మరొక వాహనం కు మార్చే సమయంలో పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రెండు లీటర్ల హాషీష్, రెండు కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకొని వారిని అరెస్టు చేశారన్నారు. ఈ కేసులో అల్లూరి జిల్లా చింతపల్లి మండలం గిల్లెల బంధ గ్రామానికి చెందిన వెచ్చంగి కోటేశ్వరరావు (20), కొయ్యూరు మండలం కొండసంత గ్రామానికి చెందిన కర్రి ధారబాబు (37), అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం ఏటి గైరంపేట కు చెందిన గూనూరు వెంకు నాయుడు (32), కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం కాండ్రకోట గ్రామానికి చెందిన బోడుం సాయి (23), ఆర్ బి కొత్తూరు గ్రామానికి చెందిన కాదా సంతోష్ కుమార్ (19) లను అరెస్టు చేసి వారి వద్ద నుండి హాషీష్, గంజాయితో పాటు మూడు మోటార్ సైకిళ్ళు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ సుమారు రూ. 33 లక్షలు ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కేసులో నిందితులకు మత్తు పదార్థాలు విక్రయించిన ఆంధ్రా ఒరిస్సా బోర్డర్ లోని మునుపల్లి గ్రామానికి చెందిన బచ్చల మోహన్ అనే వ్యక్తికి పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయన్నారు. పట్టుబడిన వారిపై ఎన్ డి పి ఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డి.ఎస్.పి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సమావేశంలో రూరల్ సీఐ ఎల్ రేవతమ్మ, గొలుగొండ, కృష్ణ దేవి పేట, నర్సీపట్నం రూరల్ ఎస్సైలు రామారావు, రిషికేశ్వరరావు, రాజారావు, సిబ్బంది పాల్గొన్నారు.

## విశాఖలో రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలని లోక్‌సత్తా డిమాండ్




**విశాఖపట్నం, జూలై 14, మనసులోమాట :**

విశాఖ కేంద్రంగా జూన్ నుంచి దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు మొదలవ్వడంతో రాష్ట్ర ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని, దక్షిణ కోస్తా రైల్వే జోన్ కేంద్రమైన విశాఖలో రైల్వే రిక్రూట్మెంట్ బోర్డుని వెంటనే ఏర్పాటు చెయ్యాలని ఏపీ లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ని కోరారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి లోక్ సత్తా రాసిన లేఖను మంగళవారం ఎమ్.వీ.పీ ఉషోదయ కార్యాలయంలో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా భీశెట్టి మాట్లాడుతూ విశాఖలో ఆర్ ఆర్ బీ ఏర్పాటు ద్వారా రాష్ట్రంలోని లోని నిరుద్యోగులకి ఊరట కలుగుతుందన్నారు. అనేక నైపుణ్యాలు కలిగిన యువత ఉత్తరాంధ్రలో ఉన్నారని వీరందరికీ రైల్వే ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయని లోక్ సత్తా అభిప్రాయ పడుతుందని తెలిపారు. దేశ వ్యాప్తంగా జోన్ ప్రధాన కార్యాలయం ఉండే చోటే రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు కార్యాలయం ఉందన్నారు. అయితే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆర్ ఆర్ బీ ని అమరావతిలో పెట్టమని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడం బాధ కలిగించిందని, కేంద్రం అనవసరంగా అమరావతిలో ఆర్ ఆర్ బీ ని పెట్టి రాష్ట్ర ప్రజలను కన్ఫ్యూజ్ చెయ్యవద్దని తెలిపారు. జోన్ ప్రధాన కార్యాలయం ఉండే చోట 128 మంది గెజిటెడ్ అధికారులు, 11వందల మంది నాన్ గెజిటెడ్ అధికారులు ఉంటారని నోటిఫికేషన్ విడుదల సమయంలో అభ్యర్థులకు కావలసిన సహాయ సహకారం అందిస్తారన్నారు. విశాఖలో కాకుండా ఆర్ ఆర్ బీ అమరావతిలో పెడితే ఉత్తరాంధ్ర ప్రజలకి చంద్రబాబు నాయుడు అన్యాయం చేసిన వారుగా మిగిలిపోతారని కాబట్టి ఉత్తరాంధ్ర లోని ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు చంద్రబాబు నాయుడు పై వత్తిడి తేవాలని భీశెట్టి కోరారు. సమావేశంలో లోక్ సత్తా విశాఖ నాయకులు రెడ్డి మురళీధర రావు, మాతృభూమి సేవా సంస్థ ప్రతినిధి ఇప్పలవలస గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

## చీడికాడలో పొలం పిలుస్తుంది కార్యక్రమం

**చీడికాడ, జూలై 14, (మనసులో మాట)**



ఖరీఫ్ 2026 సంవత్సరానికి సంబంధించి పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని ఈ 14 నుండి 14 వారాలు పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వయించడానికి ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగినదని మండల వ్యవసాయ అధికారి కృష్ణవేణి తెలిపారు మండలంలో చీడికాడ జి కొత్తపల్లి గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమానికి చీడికాడ వెటర్నరీ డాక్టర్ రాఘవమ్మ కెవికె కొండెంపూడి ఎస్ఎంఎస్ బాబు హాజరవడం జరిగింది. రైతులకు ఏపీ ఏ ఎం ఎస్ యాప్ ద్వారా ఎరువుల సరఫరా గురించి వివరించడం జరిగింది.ఎల్ నినో ప్రభావం వలన ఉన్న వర్షాభావ పరిస్థితులపై చర్చించి ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించడం జరిగినది .

ఈ ఖరీఫ్ సీజనుకు ప్రతి ఒక్క రైతు కూడా వారు సాగు చేస్తున్న పంటలను ఈ పంట యాప్ లో నమోదు చేసుకోవాలని, దీని ద్వారా వ్యవసాయ సంబంధిత పథకాలకు అర్హత ఉంటుందని చేయడమైనది. వెటర్నరీ డాక్టర్ గ పశుగ్రాస పంటల సాగులో రైతులు పాటించవలసిన ముఖ్య విషయాలు మన ప్రాంతానికి అనువైన పశుగ్రాస పంటల గురించి మరియు సమగ్ర పశు పోషణ గురించి వివరించడం జరిగినది.* కెవికె కొండెంపూడి ఎస్ఎంఎస్ మాట్లాడుతూ ఆధునిక యంత్ర పరికరాల వినియోగంపై రైతులకు వివరించడం జరిగినది. రైతులందరూ తమకున్న విస్తీర్ణంలో కొంత భాగం లో ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబించాలని సూచించారు ఈ కార్యక్రమంలో కోనాం రిజర్వాయర్ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ గండి ముసలి నాయుడు పాల్గొన్నారు

# దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ చేతుల పంపిణీ

- **గోడ పత్రికను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ఎస్. రామ సుందర్ రెడ్డి**



**విజయనగరం, జూలై 14 (మనసులో మాట జిల్లా ప్రతినిధి) :**

జిల్లాలో దివ్యాంగులకు చేయూతనిచ్చేందుకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, రోటరీ క్లబ్ సంయుక్తంగా 'ఎల్ ఎన్ ఫోర్ హ్యాండ్' ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నాయి. ఈ కార్యక్రమం ద్వారా అవసరమైన వారికి ఉచితంగా కృత్రిమ చేతులను పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు రూపొందించిన గోడ పత్రికను జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. సేవే లక్ష్యంగా సాగుతున్న ఈ కార్యక్రమంలో ముఖ్యంగా మోచేతి వరకు చేతులు లేని వారికి ఉచితంగా కృత్రిమ చేతులను అందజేస్తారు. ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోదలచిన అర్హులైన దివ్యాంగులు విజయనగరంలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ లేదా రోటరీ క్లబ్ కార్యాలయాలను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల శాఖ ఏడి చంద్రకళ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కంది వెంకట రమణ, సెక్రటరీ కె. సత్యం, రోటరీ క్లబ్ ప్రతినిధులు డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, సెక్రటరీ నిర్మల్ కుమార్ జైన్, హేమ కుమార్, మండా కె. రవి, జి. శివకుమార్, రెడ్ క్రాస్ ప్రతినిధులు ఎం. రాము, పి. దుర్గాప్రసాద్, రోటరీ క్లబ్ సభ్యులు బి. చందు, డాక్టర్ సంతోష్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు. మరిన్ని వివరాల కోసం 9949750552, 9493092700, 08922272700, 9182615056, 9849653053, 8459179307 నంబర్లలో సంప్రదించవచ్చని వారు సూచించారు.

## ఇక నుండి బీచ్ రోడ్డులో రోడ్డు పక్కన 'నో పార్కింగ్'....

- **ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు - డీసీపీ హెచ్చర**



**విశాఖపట్నం, జూలై 14, మనసులోమాట:**

నగరంలోని బీచ్ రోడ్డులో కురుపాం జంక్షన్ నుంచి రోప్వే రోడ్డు వరకు వాహనాల అస్తవ్యస్త పార్కింగ్ కారణంగా రోజురోజుకూ ట్రాఫిక్ సమస్యలు తీవ్రమవుతున్న నేపథ్యంలో నగర ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలకు శ్రీకారం చుట్టారు. బీచ్ రోడ్డులోని హోటళ్లు, రెస్టారెంట్లు, వాణిజ్య సంస్థల ఎదుట వినియోగదారులు రోడ్డు పైనే వాహనాలను నిలిపివేయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని గుర్తించిన అధికారులు సంబంధిత యాజమాన్యాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) ఎ. నరసింహామూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ద్వారకా సర్కిల్ సీఐ ప్రభాకరరావు, ఎంవీపీ ట్రాఫిక్ ఎస్ఐ రామమూర్తి పాల్గొని ట్రాఫిక్ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ అధికారులు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రతి హోటల్, రెస్టారెంట్, వాణిజ్య సంస్థ తమ ప్రాంగణంలోని పార్కింగ్ స్థలాన్ని పూర్తి స్థాయిలో వినియోగించాల్సిందేనని స్పష్టం చేశారు. వినియోగదారుల వాహనాలను రోడ్డుపై కాకుండా సంస్థల సొంత పార్కింగ్ ప్రాంతాల్లోనే నిలిపేలా ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలని సూచించారు. అవసరమైతే వాలెట్ పార్కింగ్ సదుపాయం కల్పించడం, పార్కింగ్ మార్గనిర్దేశం చేసే సిబ్బందిని నియమించడం, రోడ్డుపై పార్కింగ్ నిషేధం, పార్కింగ్ ప్రాంగణంలో మాత్రమే అనే హెచ్చరిక బోర్డులను స్పష్టంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, భద్రతా సిబ్బంది నియామకం ద్వారా పార్కింగ్ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. అలా కాకుండా రోడ్డుపై వాహనాల పార్కింగ్ కారణంగా ట్రాఫిక్‌కు ఆటంకం ఏర్పడితే సంబంధిత హోటల్, రెస్టారెంట్ లేదా వాణిజ్య సంస్థ యాజమాన్యానికే బాధ్యత ఉంటుందని అదనపు డీసీపీ ఎ. నరసింహమూర్తి ఈ మేరకు స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనలను పట్టించుకోకుండా వ్యవహరించే సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే జరిమానాలు, ఇతర చర్యలు కూడా చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో పాల్గొన్న అన్ని సంస్థల ప్రతినిధులు ట్రాఫిక్ పోలీసుల సూచనలను పూర్తిగా అమలు చేస్తామని, బీచ్ రోడ్డులో ట్రాఫిక్ సజావుగా సాగేలా పోలీసు శాఖకు సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## నర్సీపట్నం ఎన్ డి ఏ కూటమిలో జనసేనకు తీవ్ర అన్యాయం జరుగుతుంది

- **నర్సీపట్నం జనసేన నాయకుల ఆవేదన**



**నర్సీపట్నం, జూలై 14, (మనసులో మాట) :**

అనకాపల్లి జిల్లా నర్సీపట్నం కూటమిలో జనసేనకు తీవ్ర అన్యాయం జరుగుతుందని నియోజకవర్గానికి సంబంధించిన పలువురు నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం జోగినాధుని పాలెంలోని జనసేన పార్టీ కార్యాలయంలో నాయకులు మాట్లాడుతూ...

జనసేన నాయకులు ఎవరైతే చురుకుగా కార్యక్రమాలలో పాల్గొంటున్నారో వారిపై ఏదో రకమయిన ఒత్తిడి తీసుకువచ్చి జనసేనను నర్సీపట్నంలో నిర్వీర్యం చేయడానికి కూటమి నాయకులే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. జనసేన నాయకుడు అప్పన దొరబాబు మీద సోమవారం నర్సీపట్నం పోలీస్ స్టేషన్ లో సత్య దూరమైన కేసు పెట్టడం జరిగిందని, పోలీసులు కనీసం విచారణ చేయకుండా ,ఎటువంటి సాక్ష్యాలు లేకుండా దొరబాబుపై కేసు పెట్టడాన్ని నర్సీపట్నం జనసేన తీవ్రంగా ఖండిస్తున్నారు. ఎవరైతే దొరబాబు మీద ఫిర్యాదు చేశారో సదరు మహిళకు, దొరబాబుకు మధ్య ఎటువంటి ఆర్థిక లావాదేవీలు జరగలేదని, కూటమి నాయకుల ఒత్తిడితోనే పోలీసులు దొరబాబుపై ఎఫ్ ఐ ఆర్ నమోదు చేశారని నర్సీపట్నం జనసేన పార్టీ భావిస్తున్నారు. దీనిపై స్పందించి తగు న్యాయం చేయవలసిందిగా ఇప్పటికే దొరబాబు జనసేన పార్టీ అధిష్ఠానానికి విన్నవించడం జరిగిందన్నారు. ఎలక్షన్లో కూటమి గెలుపు కోసం తాము ఎంతో కృషి చేశామని, ఎలక్షన్ తరువాత జనసేన నాయకులను కూటమి పెద్దలు పట్టించుకోలేదని జనసేన నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ షెడ్యూల్ సవరింపు.....

- జులై 24 వరకు ఇంటింటి సర్వే
- జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్. రాంసుందర్ రెడ్డి



విజయనగరం, జులై 14 (మనసులో మాట జిల్లా ప్రతినిధి) :

భారత ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం షెడ్యూల్‌ను సవరించినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్. రాంసుందర్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి విజ్ఞప్తి మేరకు ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం బూత్ లెవల్ అధికారులు ఇంటింటి సర్వే కార్యక్రమం జులై 24, 2026 వరకు కొనసాగుతుందని, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, పునర్వ్యవస్థీకరణను జులై 24 నాటికి పూర్తి చేయాలని సూచించిందన్నారు. ముసాయిదా ఓటరు జాబితా జులై 31న ప్రచురితమవుతుందని, తదుపరి జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరిస్తారని, వాటి పరిష్కారం సెప్టెంబర్ 28 నాటికి పూర్తిచేసి, అక్టోబర్ 3, 2026న తుది ఓటరు జాబితా ప్రచురితమవుతుందని కలెక్టర్ వివరించారు. జిల్లాలోని అర్హులైన ప్రతీ ఓటరు ఇంటింటి సర్వే సమయంలో బీఎల్‌ఓలకు పూర్తి సహకారం అందించాలని, వివరాలను సక్రమంగా నమోదు చేయించుకోవాలని కలెక్టర్ కోరారు. ఎన్నికల ప్రక్రియలో ప్రజలు, రాజకీయ పార్టీలు, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి, ఓటరు జాబితా ఖచ్చితత్వాన్ని నిర్ధారించాలని ఆయన పిలుపునిచ్చారు.

జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ డిజిటలైజేషన్ శతశాతం పూర్తి

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో విజయనగరం జిల్లా మరో కీలక మైలురాయిని చేరుకుందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్. రామసుందర్ రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం 4.00 గంటల నాటికి జిల్లాలోని 1,847 మంది బూత్ స్థాయి అధికారులు (BLOలు) తమ పరిధిలోని 15,78,949 మంది ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాల (EFs) పంపిణీని శతశాతం (100%) పూర్తి చేయడంతో పాటు, అందిన అన్ని ఫారాల డిజిటలైజేషన్‌ను కూడా 100 శాతం పూర్తి చేశారని వెల్లడించారు. జిల్లాలోని అన్ని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు పూర్తి స్థాయిలో ఈ లక్ష్యాన్ని సాధించడం విశేషమన్నారు.

నియోజకవర్గాల వారీగా వివరాలు:
రాజాం - 2,29,880 ఈఎఫ్‌లు పంపిణీ, 100% డిజిటలైజేషన్
బొబ్బిలి - 2,33,621 ఈఎఫ్‌లు, 100% డిజిటలైజేషన్
చీపురుపల్లి - 2,07,471 ఈఎఫ్‌లు, 100% డిజిటలైజేషన్
గజపతినగరం - 2,07,402 ఈఎఫ్‌లు, 100% డిజిటలైజేషన్
నెల్లిమర్ల - 2,14,418 ఈఎఫ్‌లు, 100% డిజిటలైజేషన్
విజయనగరం - 2,61,300 ఈఎఫ్‌లు, 100% డిజిటలైజేషన్
శృంగవరపుకోట - 2,24,857 ఈఎఫ్‌లు, 100% డిజిటలైజేషన్

జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడంలో కృషి చేసిన అన్ని ఎన్నికల అధికారులు, ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, బీఎల్‌వోలు, సూపర్వైజర్లు మరియు సంబంధిత సిబ్బందిని జిల్లా కలెక్టర్ అభినందించారు. ఓటరు జాబితా నాణ్యతను మరింత మెరుగుపరచడంలో ప్రతి ఒక్కరి సహకారం ఎంతో విలువైనదని, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం తదుపరి ప్రక్రియలను కూడా అదే నిబద్ధతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

# క్రమశిక్షణతోనే విద్యార్థుల పురోగతి

- ప్రార్థనా సమయానికే పాఠశాలకు ఎంఈఓ సుకుమార్
- మధ్యాహ్న భోజనం, మరుగుదొడ్ల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి



చీడికాడ, జులై 14, (మనసులో మాట)

మండలంలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాల అడివి అగ్రహారాన్ని మండల విద్యాశాఖ అధికారి ఎస్. సుకుమార్ మంగళవారం ప్రార్థన సమయానికి సందర్శించారు. ప్రార్థనా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యార్థులతో మాట్లాడి క్రమశిక్షణ, విద్యా పురోగతికి సంబంధించిన పలు అంశాలను వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, నిరంతర అభ్యాసంతో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థుల పురోగతికి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, నిర్ణీత సమయానికి పాఠశాలకు హాజరై నాణ్యమైన బోధన అందించాలని పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను పరిశీలించిన ఎంఈఓ.. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందించాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని ఆయాకు సూచించారు. పాఠశాల పరిసరాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో నాగులపల్లి వాసి చిన్నారావు మృతి



మునగపాక, జులై 14, మనసులో మాట

మునగపాక మండలం, నాగులపల్లి గ్రామం,పొట్టి బీటీ సెంటర్, దాడి వారి వీధికి చెందిన మారిశెట్టి చిన్నారావు (26,సంవత్సరాలు) చిన్న వయస్సులోనే కుటుంబ బాధ్యత ను తీసుకుని 10 ఏళ్లుగా తన వృత్తి అయిన ఎలక్ట్రీషియన్ లోనే కాక,తన పలకరింపు,మాటలు,చేష్టలతో అందరినీ నవ్విస్తూ ప్రతీ ఇంట్లో కుటుంబం సభ్యునిగా అందరి గుండెల్లో మంచి పేరు సంపాదించుకున్నారు. శనివారం లంకెలపాలెం నుండి అనకాపల్లి వస్తున్న సమయంలో స్కూటీ అదుపు తప్పి తలకి తీవ్రగాయం అవడంతో అపస్మారక స్థితి లోకి వెళ్లిపోయి నిన్న సాయంత్రం బ్రెయిన్ డెడ్ కి గురి కావడం జరిగింది.. బ్రతినంతకాలం 10 మందిని నవ్విస్తూ,సాయం చేసిన చిన్నారావు మరణాంతరం కూడా అవయవ దానాలు చేసి 10 మందికి జీవితాన్ని ఇచ్చి చిరంజీవి అయ్యాడు. కుటుంబ సభ్యులు,బంధువులు,గ్రామస్థులు,స్నేహితులు అందరూ తన హఠాత్మరణాన్ని జీర్ణించుకోలేక శోకసంద్రంలో మునిగిపోయారు.. బుధవారం ఉదయం 7 గంటలకు అంతిమ యాత్ర జరగనున్నది.

# ఆరికివలస పాఠశాలను ఎంఈఓ ఆకస్మిక తనిఖీ.....



టెక్కలి, జులై 14 (మనసులో మాట) :

టెక్కలి నియోజకవర్గం సంతబొమ్మాళి మండలం పరిధిలో గల ఆరికివలస ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖాధికారి జె. చిన్నవాడు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా ఆయన పాఠశాల మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కింద కూర్చొని సహపంక్తి భోజనం చేసి, భోజన నాణ్యత పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. భోజనానంతరం, ఆయన తరగతుల వారీగా విద్యార్థుల విద్యా సామర్థ్యాలను ,వారి అభ్యసన నైపుణ్యాలను పరిశీలించారు. పాఠశాల సమగ్ర పనితీరు, విద్యా బోధన , మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ చాలా బాగుందని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లఖినాన వెంకటరమణ, ఉపాధ్యాయిని టి.హరిప్రియ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# లక్షల వ్యయం వృథా వాడ్రాపల్లి ఎత్తిపోతల పథకం నిరుపయోగం





మునగపాక, జులై 14, మనసులో మాట

మండలంలో వాడ్రాపల్లి పారిపల్లమ్మ ఎత్తిపోతల పథకం ద్వారా వాడ్రాపల్లి ఆవనుండి రైతులకు సమృద్ధి జలాలను పంటలకు అందించేందుకు 2001వ సంవత్సరంలో అప్పటి పరవాడ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సహకారంతో 36 లక్షల రూపాయలతో శ్రీ పారిపెల్లమ్మ ఎత్తిపోతల పథకాన్ని రూపొందించారు. సుమారు 333 ఎకరాలకు 300 మంది రైతులకు ప్రయోజనం చేకూర్చే ఈ పథకాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. అయితే ప్రారంభం నుండి కొన్ని ఏళ్లుగా సమృద్ధి జలాలను వాడ్రాపల్లి ఆవనుండి నుండి ఎత్తిపోతల పథకం ద్వారా వ్యవసాయ భూములకు సాగునీరు అందించేవారు. ఈ పథకం ద్వారా వ్యవసాయ భూములు సస్యశ్యామలంగా సమృద్ధిగా పంటలు పండి రైతులకు ఎంతగానో ప్రయోజనం చేకూరేది. అప్పట్లో శ్రీ పారిపెల్లమ్మ ఎత్తిపోతల పథకం చైర్మన్గా అప్పటి గ్రామ సర్పంచ్ కాండ్రేగుల సూకరాజు, కార్యదర్శిగా ఎల్లపు సూర్య అప్పారావును నియమించారు. కొద్దికాలం సజావుగానే పథకం రైతులకు ఎంతగానో ఉపయోగపడింది. అయితే ఇటీవల కాలంలో ఈ ఎత్తిపోతల పథకాన్ని పూర్తిగా పట్టించుకోకపోవడం వల్ల వృధాగా పడి ఉంది. మధ్యలో కొద్దిగా డబ్బు మంజూరు కావడంతో ఎత్తిపోతల పథకం బిల్డింగ్ కు రంగులు వేసి మమ అనిపించారు. ఈ పథకం పై పూర్తిగా నిర్లక్ష్యపు నీడలు ఆవరించుకోవడంతో మూలన పడి మోటార్లు మరమ్మత్తులకు గురవుతున్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆయన ఎత్తిపోతల పథకం పై దృష్టి సాధించి ఈ ఎత్తిపోతల పథకం ద్వారా సమృద్ధిగా నీటి జలాలను పంటలకు సాగు జరిగే విధంగా కృషి చేయాలని పలు రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

# నగర సుందరీకరణకు ఎమ్మెల్యే అదితి గజపతి పరిశీలన





విజయనగరం టౌన్, జులై 14 (మనసులో మాట) :

నగరంలోని వివిధ ప్రధాన కూడళ్ళ సుందరీకరణ నిమిత్తం స్థానిక శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. కమిషనర్ బాలస్వామి, ఇతర అధికారులు, సిబ్బందితో కలిసి నగరంలోని వై జంక్షన్, మయూరి జంక్షన్, ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్, ట్రాన్సిట్ స్టేషన్, వెంకటలక్ష్మి జంక్షన్, ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం నగర ప్రగతిపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఈఈ ప్రసాదు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, డిఈలు, ఏఈలు పాల్గొన్నారు.

# మానవ అక్రమ రవాణా నిర్మూలన మనందరి బాధ్యత



**యలమంచిలి టౌన్, జూలై 14, మనసులో మాట,**

సమాజంలో ప్రతి ఒక్కరూ భాగస్వాము లైనప్పుడే మనుషుల అక్రమ రవాణాను సమూలంగా నివారించవచ్చని వెలుగు పథకం సహాయ నిర్వాహకురాలు జి.ఈ. రాణి,ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ శిక్షణా సమన్వయకర్త అంబర్ సింగ్ పిలుపునిచ్చారు. పట్టణంలో మంగళవారం గ్రామ సమాఖ్య సహాయకులకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణా కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఉద్యోగాలు, సినిమాల్లో అవకాశాల పేరుతో మాయమాటలు చెప్పి మహిళలను అక్రమ రవాణా చేస్తున్నారని, దీనిపై గ్రామ స్థాయి నుండి ప్రజలను, విద్యార్థులను అప్రమత్తం చేయాలని రాణి సూచించారు. అంతర్జాల వినియోగం పెరగడంతో అక్రమ రవాణా ఎక్కువైందని, తమ సంస్థ ద్వారా ఇప్పటి వరకు ముప్పై మూడు వేల మందికి పైగా బాధితులను కాపాడామని అంబర్ సింగ్ తెలిపారు. ఈ శిక్షణలో బాలల రక్షణ, అనైతిక రవాణా నిరోధక చట్టాలతో పాటు ఉచిత సహాయ సేవలైన 1098, 100, 181, 1930 తదితర వివరాలను సిబ్బందికి వివరించారు. శిక్షణ పొందిన సిబ్బంది తమ గ్రామాలకు వెళ్లి స్వయం సహాయక సంఘాలకు అవగాహన కల్పించాలని, పాఠశాలల్లో విద్యార్థుల నిఘా బృందాలను ఏర్పాటు చేసి నేరాలను అరికట్టాలని అధికారులు ఆదేశించారు.

# బదిలీ అయిన ఉబర్ సర్వేయర్ కు ఘనసత్కారం

**ఎస్. రాయవరం, జూలై 14, (మనసులో మాట):**



ఎస్.రాయవరం మండల సర్వేయర్ గా పనిచేస్తూ, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ గా ప్రమోషన్ పైఅనకాపల్లి బదిలీ అయిన ఏ ఎస్ వి ఎన్ మూర్తిని మండల తాహసిల్దార్ కార్యాలయం సిబ్బంది మంగళవారం ఘనంగా సత్కరించారు. ఇంచార్జ్ తాహసిల్దార్ ఎం వి ఎస్ నేరజ ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది మూర్తిని సాలువతో సత్కరించి, జ్ఞాపకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ సూరి, మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడు నూకరాజు, సర్వేయర్ల సంఘం అధ్యక్షులు నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం

**అరకులోయ, ఎస్సై టీ మల్లేశ్వర రావు:**



అరకులోయ, జూలై 14 (మనసులో మాట): అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహిళల భద్రతపై మంగళవారంఅరకులోయ ఎస్సై టి మల్లేశ్వరరావు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూమహిళలు రోడ్డు ప్రమాదాల నివారణకు మరియు గంజాయి నివారణ కోసంవిద్యార్థులతో సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.అంతేకాకుండా సైబర్ నేరాలు, బాల్య వివాహాలు ఆన్లైన్ మోసాల జోలికి పోవద్దని మంచి చదువులు చదువుకొని తల్లితండ్రులకు గ్రామానికి కళాశాలకు మరి ముఖ్యంగా సమాజానికి మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది మరియు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# చట్టం తెలుసుకుంటేనే హక్కులకు రక్షణ'

- ఏపీఆర్ఎస్ బాలికల పాఠశాలలో సీనియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడు అవగాహన
- విద్యార్థినులతో మమేకమై న్యాయవ్యవస్థపై చైతన్యం.. ప్రశ్నలకు ఓపికగా సమాధానాలు.. ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచన



**అచ్యుతాపురం- రూరల్ జూలై 14 మనసులో మాట**

"చట్టాలపై అవగాహన ప్రతి విద్యార్థికి అవసరం. హక్కులను తెలుసుకున్నప్పుడే సమాజంలో ధైర్యంగా, బాధ్యతాయుతంగా జీవించగలుగుతారు" అని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడు అన్నారు. అచ్యుతాపురంలోని రెసిడెన్షియల్ స్కూల్ (ఏపీఆర్ఎస్) బాలికల పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థినులతో ఆత్మీయంగా మమేకమయ్యారు. ముందుగా పాఠశాలలోని వసతి గృహాలు, తాగునీరు, పరిశుభ్రత, ఆహార నాణ్యత, ఆరోగ్య సౌకర్యాలపై విద్యార్థినులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను శ్రద్ధగా విని, అవసరమైన సూచనలు చేశారు. అనంతరం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో న్యాయవ్యవస్థ పనితీరు, లోక్ అదాలత్‌ల ప్రాధాన్యం, రాజ్యాంగం కల్పించిన హక్కులు, సమానత్వం, సకాలంలో న్యాయం పొందే విధానం, ఉచిత న్యాయ సహాయం పొందేందుకు అనుసరించాల్సిన ప్రక్రియ గురించి విద్యార్థినులకు సరళమైన భాషలో వివరించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులను న్యాయవ్యవస్థకు సంబంధించిన పలు ప్రశ్నలు అడిగి వారి ఆలోచనా సామర్థ్యాన్ని పరీక్షించారు. విద్యార్థినులు అడిగిన సందేహాలకు సన్యాసినాయుడు ఎంతో ఓపికగా, సులభంగా సమాధానాలు చెప్పి వారిలో చట్టాలపై ఆసక్తిని పెంపొందించారు. ఆయన ప్రసంగం విద్యార్థినులకు స్ఫూర్తినిస్తూ, న్యాయ అవగాహనతో కూడిన బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలనే ఆత్మవిశ్వాసాన్ని నింపింది. "కలలు కనండి... వాటిని నిజం చేసుకునేందుకు కష్టపడండి. విద్యతో పాటు విలువలు, చట్టాలపై అవగాహన ఉంటేనే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలుగుతారు" అని ఆయన విద్యార్థినులకు సూచించారు. సీనియర్ సివిల్ జడ్జి విద్యార్థినులతో కలిసిమెలిసి మాట్లాడిన తీరు, ప్రతి ప్రశ్నకు ఓర్పుతో సమాధానం ఇచ్చిన విధానం, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. న్యాయ సేవలను ప్రజలకు చేరువ చేయడంలో ఆయన చూపుతున్న చొరవ ప్రశంసనీయమని పలువురు అభిప్రాయపడ్డారు.

# వ్యక్తిగత విభేదాలతో రేకులు షెడ్డు ధ్వంసం.. బాధితుడు ఆందోళన...

**ఎస్.రాయవరం, జూలై 14, (మనసులో మాట):**





ఎస్ రాయవరం మండలం జంగులూరు గ్రామంలో తన సొంత స్థలంలో నిర్మించుకున్న రేకుల షెడ్డు స్థానిక టిడిపి నాయకుడు,మాజీ సర్పంచ్ భర్త వజ్రపు శంకరరావు అక్రమంగా ధ్వంసం చేశారని గ్రామానికి చెందిన బాధితులు వజ్రపు లక్ష్మీ, వజ్రపు బాబ్జి లు తెలిపారు . నాకు చెందిన సొంత స్థలంలో రేకుల షెడ్డు నిర్మించుకున్నానని, టిడిపి నేత శంకర్రావు తో తనకు ఉన్న వ్యక్తిగత విభేదాలు కారణంగా అక్రమంగా తన షెడ్డును జెసిబి తో ధ్వంసం చేయించారని, తనను తన అనుచరులతో బెదిరించారని ఆయన తెలిపారు. కేవలం రేకుల షెడ్డు నిర్మించుకున్నప్పుడు పంచాయతీ అనుమతి తీసుకోలేదంటూ స్థానిక పంచాయతీ కార్యదర్శిచే రెండు సార్లు నోటీసులు ఇప్పించారని ఆయన అన్నారు. తాను పక్కా నిర్మాణం చేపట్టనందున పంచాయతీ అనుమతి కోరలేదని,కేవలం తనపై ఉన్న వ్యక్తి గత విభేదాల కారణంగా కక్ష సాధింపుతో శంకర్రావు తన షెడ్డుధ్వంసం చేయించారని దీనిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు బాబ్జి విజ్ఞప్తి చేశారు.

# తముటు రోడ్డు వంతెన పనులు ప్రారంభించాలి : గిరిజనుల ఆవేదన







**అనంతగిరి,జూలై 14 మనసులో మాట**

అల్లూరి జిల్లా అనంతగిరి మండలం పినకోట గ్రామ పంచాయతీ పరిధిలో తముటు గ్రామానికి మంజూరైన రహదారి, వంతెన (బ్రిడ్జి) నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నో ఏళ్లుగా సరైన రహదారి, వంతెన లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రహదారి, వంతెన నిర్మాణానికి ఆమోదం తెలిపినప్పటికీ, ఇప్పటివరకు సంబంధిత అధికారులు పనులు ప్రారంభించకపోవడంపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. నిత్యావసర సరుకుల రవాణా, అత్యవసర వైద్య సేవలు, విద్యార్థుల రాకపోకలు అన్నీ ఇదే మార్గంపై ఆధారపడుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో వాగును దాటడం అత్యంత ప్రమాదకరంగా మారుతుందని, ప్రతి ప్రయాణం ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని సాగించాల్సిన పరిస్థితి నెలకొంటోందని గ్రామస్తులు వాపోయారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆసుపత్రికి తరలించడం కూడా కష్టసాధ్యంగా మారుతోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తమ గోడును ఆలకించి వెంటనే రహదారి, వంతెన పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్పందించి సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేసి పనులు ప్రారంభించేలా చూడాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో గ్రామ మహిళలు, పెద్దలు, యువకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

# పెదపాటి కల్యాణికి చిరుసత్కారం చేసిన హోం మినిస్టర్...

- హోం మినిస్టర్ వంగలపూడి అనిత కు కృతజ్ఞతలు తెలిపిన టిడిపి పార్లమెంట్ కమిటీ సెక్రటరీ పెదపాటి కళ్యాణి..

**అనకాపల్లి టౌన్ జూలై 14 మనసులో మాట**



టిడిపి పార్లమెంట్ సెక్రటరీ పెదపాటి కళ్యాణి కి రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత శాలువ కప్పి చిరు సత్కారం చేశారు. స్థానిక,జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం కు సోమవారం . ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత విచ్చేశారు . ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. కార్యాలయం ఎదుట ఉన్న స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులతో సమావేశమై పార్టీ పటిష్టత కోసం అనంతరం తిరిగి ఆమె ఎస్పీ కార్యాలయానికి వెళ్తున్నప్పుడు ఆమెకు నాయకులతోపాటు కళ్యాణి కలిశారు. హోం మినిస్టర్ ని సత్కరించబోయారు. ఆ సమయంలో హోమ్ మినిస్టర్ అనిత నేనే మీకు సత్కారం చేయాలంటూ తాను శాలువాతో కళ్యాణిని సత్కరించారు. ఈ సందర్భంగా కళ్యాణి ఆమెకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు,ఏపి హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు,మాజీ ఎం ఎల్ ఏ ఏపీ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ,ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, ప్రధాన కార్యదర్శి లాలం కాసినాయుడు,డిసిఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ,టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొణతాల రత్నకుమారి,జిల్లా పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆలోచనల అదుపుతో విజయం సైకాలజిస్ట్ రాజేశ్వరరావు సందేశం

**విశాఖపట్నం, మనసులోమాట, జూలై 14:**





ఆలోచనలపై అదుపు సాధించగలిగితే జీవితంలో విజయం సాధ్యమవుతుందని ఏయూ సైకాలజీ డిపార్ట్మెంట్ ఫ్యాకల్టీ డాక్టర్ జి.రాజేశ్వరరావు తెలిపారు. అడ్వాన్స్డ్ సైకాలజికల్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ద్వారకా నగర్ లోని బీవీకే కాలేజీలో సైకాలజిస్టుల ప్రశంసా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిధిగా హాజరైన రాజేశ్వరరావు మాట్లాడుతూ వ్యక్తిగత జీవితంలోనూ, వృత్తి జీవితంలోనూ క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని తెలిపారు. విద్యార్థులు ఉపాధ్యాయులు అందించే సూచనలను పాటిస్తే విజయం ఖాయమన్నారు. కళాశాల ప్రిన్సిపల్ రత్నశేఖర్ మాట్లాడుతూ ప్రశంస దినోత్సవ వేడుకలకు తమ కళాశాలను వేదికగా ఎంచుకోవడం ఆనందదాయకమన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులకు సైకాలజిస్టుల సేవలు ఎంత అవసరమని తెలిపారు. ట్రైనర్ ఎస్ వీ ఆర్ నాయుడు మాట్లాడుతూ ఏపీపీఏ ఇండియా ఆధ్వర్యంలో రాష్ట్రంలో పలు చోట్ల ఒకే రోజు కార్యక్రమాలు నిర్వహించడం వారి టీమ్ వర్క్ కి నిదర్శనమని తెలిపారు. ఏపీపిఏ ఇండియా జిల్లా కమిటీ అధ్యక్షురాలు డాక్టర్ జయ మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల వారికి సైకాలజిస్టుల సేవల ఆవశ్యకత పెరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ కార్యదర్శి దుర్గాప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ రాజా, కమిటీ సభ్యులు ఇందుమతి, రమణ సిమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# జెడ్పీ ఛైర్‌పర్సన్ చిన్నశ్రీనుకు మాతృవియోగం... వైయస్ జగన్ సంతాపం...









**విజయనగరం, జులై 15 (మనసులో మాట జిల్లా ప్రతినిధి):**

ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్పర్సన్, విజయనగరం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, భీమిలి వైసీపీ ఇంచార్జ్ మజ్జి శ్రీనివాసరావు (చిన్నశ్రీను) కు మాతృవియోగం జరిగింది. ఆయన మాతృమూర్తి మజ్జి కృష్ణవేణి(83) మంగళవారం పరమపదించారు.ఆత్మీయుల సందర్శనార్థం ఆమె భౌతికకాయాన్ని ప్రదీప్ నగర్ లోని చిన్నశ్రీను నివాసంలో ఉంచారు. బుధవారం ఉదయం 8 గంటలకు అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

**మాజీ సీఎం వైఎస్ జగన్ సంతాపం..**

చిన్నశ్రీను మాతృమూర్తి స్వర్గస్తులైన సమాచారం తెలుసుకున్న మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ జాతీయ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కృష్ణవేణమ్మ మరణ వార్త తనను ఎంతో కలచివేసిందని వైయస్ జగన్ పేర్కొన్నారు. కుటుంబానికి అండగా నిలుస్తూ, విలువలతో కూడిన జీవితం గడిపిన ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించారు. ఈ విషాద సమయంలో మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ తీరని దుఃఖాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుణ్ణి ప్రార్థించారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని వైయస్ జగన్ ఆకాంక్షించారు. కాగా కృష్ణవేణమ్మ శాసన మండలి విపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కు బంధువు కావడంతో వారి కుటుంబంలో కూడా తీవ్ర విషాదం నెలకొంది.

**ప్రముఖులు పరామర్శ :**

చిన్న శ్రీను మాతృ వియోగం సమాచారం తెలుసుకున్న ఆత్మీయులు, అభిమానులు, కుటుంబ సభ్యులు వేల సంఖ్యలో ప్రదీప్ నగర్ లోని వారి నివాసానికి చేరుకున్నారు. కృష్ణవేణమ్మ భౌతికకాయన్ని సందర్శించి అశ్రునివాళులర్పించారు. చిన్నశ్రీనుకు తమ ప్రగాఢ సంతాపంను తెలియచేశారు. మాజీ శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి, మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, రీజనల్ కోఆర్డినేటర్ గుడివాడ అమర్నాథ్, విశాఖ జిల్లా అధ్యక్షులు కేకే రాజు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, ఇందుకూరి రఘురాజు, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ లక్ష్మీ, మాజీ ఎమ్మెల్యేలు శంభంగి చిన్న అప్పలనాయుడు, బొత్స అప్పలనరసయ్య, ధర్మశ్రీ, చింతలపూడి వెంకట రమణయ్య, అలజంగి జోగారావు, తలై భద్రయ్య శోభ హైమావతి, విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర, భాగ్యలక్ష్మి, మాజీ జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతి రాణి, నియోజకవర్గ సమన్వయకర్తలు తలై రాజేష్, మల్ల అప్పారావు, తిప్పల దేవన్ రెడ్డి, ఉత్తరాంధ్ర జిల్లాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, తదితరులు హాజరై పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. చిన్న శ్రీను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఈ తీరని లోటును భరించే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తూ తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

# విజయనగరంలో విచ్చలవిడి పశు సంచారం నిషేధం : కమిషనర్ బాలస్వామి





**విజయనగరం టౌన్, జులై 14 (మనసులో మాట) :**

నగరంలో విచ్చలవిడి పశు సంచారాన్ని నిషేధిస్తున్నట్లు కమిషనర్ బాలస్వామి తెలిపారు. ఆయన ఆదేశాలతో ప్రజారోగ్య సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా నగరంలోని వివిధ ప్రాంతాలలో ప్రధాన రహదారులపై విచ్చలవిడిగా సంచరిస్తున్న పశువులను స్వాధీనం చేసుకున్నారు. వాటిలో కొన్నింటిని పశు యజమానులు వచ్చి విడిపించుకోగా మిగిలినవి గుజ్జింగివలసలో ఉన్న గోశాలకు తరలించారు. ఈ సందర్భంగా కమిషనర్ బాలస్వామి మాట్లాడుతూ ఇక నుండి నగరంలో విచ్చలవిడి పశు సంచారాన్ని ఉపేక్షించబోమని చెప్పారు. పశు యజమానులకు ఈ విషయమై అనేకసార్లు అవగాహన కల్పించినప్పటికీ పశువులను రహదారులపై విడిచిపెడుతున్నారన్నారు. దీనిని తీవ్రంగా పరిగణించిన తాము పోలీసు శాఖ సమన్వయంతో పశువులను స్వాధీనం చేసుకుని గోశాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రజలకు, ప్రజా రవాణాకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ అనేక ప్రమాదాలకు పశు సంచారం కారణంగా నిలుస్తోందన్నారు. అందువల్ల రహదారులపై సంచరించే పశువులను స్వాధీనం చేసుకొని అపరాధ రుసుములను వసూలు చేసి పశు యజమానులు అప్పగిస్తున్నామన్నారు.

# రామనాయుడు స్టూడియో సమీపంలో మహిళ ఆత్మహత్యాయత్నం..

**విశాఖపట్నం, జులై 14, , మనసులోమాట :**



రామనాయుడు స్టూడియో సమీపంలో మహిళ ఆత్మహత్యాయత్నం. సంఘటన స్థానికంగా కలకలం సృష్టిస్తుంది. మధురవాడ, స్థానిక బాలాజీ నగర్ నివాసి జక్క లావణ్య మంగళవారం ఉదయం రామనాయుడు స్టూడియో రహదారి వద్దకు స్కూటీతో చేరుకుంది. స్కూటీపై వచ్చిన ఆమె, వెంట తెచ్చుకున్న రెండు లీటర్ల పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పు అంటించుకుంది. దీంతో ఆమె 50 శాతం ఖాళీ గాయాల పాలవ్వడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని అంబులెన్స్ లో చికిత్స నిమిత్తం కెజిహెచ్ కు తరలించారు. మానసిక సమస్యల వల్లే ఆమె ఈ ఘాతుకానికి పాల్పడినట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మహిళల భద్రతపై అవగాహన ప్రోగ్రామ్

- అరకులోయ, ఎస్సై టీ మల్లేశ్వర రావు

**అరకులోయ, జూలై 14 (మనసులో మాట):**



అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహిళల భద్రతపై మంగళవారంఅరకులోయ ఎస్సై టి మల్లేశ్వరరావు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూమహిళలు రోడ్డు ప్రమాదాల నివారణకు మరియు గంజాయి నివారణ కోసంవిద్యార్థులతోసమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా సైబర్ నేరాలు, పాల్యా వివాహాలు ఆన్లైన్ మోసాల జోలికి పోవద్దని మంచి చదువులు చదువుకొని తల్లిదండ్రులకు గ్రామానికి కళాశాలకు మరి ముఖ్యంగా సమాజానికి మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది మరియు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్ ఐ ఆర్ ఓటర్ వెరిఫికేషన్ పై ఆడారి మంజు రివ్యూ

- బిఎల్వోలతో మాట్లాడుతున్న టిడిపి నేతలు



**మునగపాక, జులై 14, మనసులో మాట**

ఆంధ్రప్రదేశ్ రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మరియు ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరావు మరియు మాజీ పార్లమెంటు సభ్యులు పప్పల చలపతిరావు ఆదేశాల మేరకు వాడ్రా పల్లిసచివాలయం , ఎస్ ఐ ఆర్ ఓటర్ వెరిఫికేషన్ పైన జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆడారి మంజు రివ్యూ తీసుకోవడం జరిగింది. ఈ రివ్యూలో బిఎల్వోలు కి ఎస్ ఆర్ ఓటర్ వెరిఫికేషన్ వందకు వంద శాతం ఓటర్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆడారి మంజు, వాడ్రపల్లి మాజీ సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మల్ల వరాహ నర్సింగ్ రావు, మండల తెలుగుదేశం అధ్యక్షుడు మల్ల శేషు, మల్ల జోగారావు బి ఎల్ ఓ లు మరియు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## తెలంగాణ తరహా ఈఎండిలు లేకుండా టెండర్ వర్కులు అప్పగించాలి..

**విశాఖపట్నం, మనసులోమాట , జులై 14:**



తెలంగాణ తరహా ఈఎండిలు లేకుండా ఏపీలో కూడా టెండర్ వర్కులు అప్పగించాలని జిల్లా సగర సంఘం అధ్యక్షులు చిన్న అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గత 45 ఏళ్లుగా టిడిపి, బిజెపి తదితర రాజకీయ పార్టీలో పని చేశామని, ఓటర్ గా వాడుకోవడమే తప్ప, తమను గుర్తించడం లేదని వాపోయారు. కనీసం తమకు నామినేటెడ్ పోస్టులు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెల్లారి గానే పనులకు పోయే సగరలు, పనులు లేకపోతే పస్తులతోనే ఉంటున్నారని తెలిపారు. సగరలు రాజకీయంగా ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని వివరించారు. అందుచేతనే ఒడిశాలో అక్కడి ప్రభుత్వం సగరులను ఎస్సీలో చేర్చి ప్రాధాన్యతనిచ్చిందని పేర్కొన్నారు. కాబట్టి సగరులను ఎస్సీ ఎస్టీ జాబితాలో చేర్చి రిజర్వేషన్ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు.

## ఎం.డి.ఎం బియ్యం ను పరిశీలించిన సివిల్ సప్లై అధికారుల

**ఎస్ .రాయవరం, జూలై 14, (మనసులో మాట):**



పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం పథకం సంబంధించిన బియ్యం ను జిల్లా పౌరసరఫరాల అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని ధర్మవరం అగ్రహారం ,ఎస్. రాయవరం గ్రామాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ పి.జయంతి ఆధ్వర్యంలో బృందం బియ్యం పరిశీలించి పాఠశాల సిబ్బందికి పలు సూచనలు చేశారు .ఈ సందర్భంగా జిల్లా మేనేజర్ మాట్లాడుతూ ...రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం నాణ్యమైన పోషకాలతో కూడిన బియ్యం ను పాఠశాలలకు సరఫరా చేయడం జరుగుతుందని అన్నారు. ఇటీవల జూన్ నెలలో విడుదల చేసిన బియ్యం సక్రమంగా ఉన్నాయని,ఏప్రిల్ నెల స్టాక్ లో ఉండిపోయిన బియ్యం లో పెంకు పురుగులు ఉండడం గుర్తించామన్నారు. ఎలమంచిలి రాంబిల్లి ,అచ్చుతాపురం, ఎస్. రాయవరం మండలాలలో పాఠశాలల్లో తనిఖీ చేయగా రెండు పాఠశాలలో కనిపించిన వాటిని మార్చడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి2 కర్రీ శ్రీరామ్మూర్తి, సివిల్ సప్లై అసిస్టెంట్ మేనేజర్లు జి .రమణ, విక్రాంత్ ,నక్కపల్లి సివిల్ సప్లై గోడౌన్ ఇంచార్జ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి, మంత్రులు బాధ్యతగా వ్యవహరించలేదు..

- వెంటనే స్పందించి ఉంటే గల్లంతైన మత్స్యకారులు ప్రాణాలు దక్కేవి.. బాధిత కుటుంబాలను పరామర్శించిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి





**విశాఖపట్నం, మనసులోమాట , జులై 14:**

ముఖ్యమంత్రి, సహా మంత్రులు బాధ్యతగా వ్యవహరించ లేదని, వెంటనే అధికారులు స్పందించి ఉంటే గల్లంతైన మత్స్యకారులు ప్రాణాలతో బయటపడేవారని వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం విశాఖ చేరుకున్న ఆయన రెల్లి వీధి రోడ్డు, జబ్బార్ తోట జంక్షన్ సమీపానికి వెళ్లి, విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి చేపల వేటకు వెళ్లి సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను పరామర్శించి వారిని ఓదార్చారు. సంఘటనలో బయటపడిన మత్స్యకారుడు చిన్నాతో గల్లంతైన వారి వివరాలు జగన్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో జగన్ మాట్లాడుతూ సముద్రంలో బోటు ప్రమాదంలో చిక్కుకున్న చిన్నా, 20 గంటల పాటు మృత్యువుతో పోరాడి ప్రాణాలతో బయటపడ్డారన్నారు. ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం మానవత్వం లేకుండా వ్యవహరించిందని విమర్శించారు. జూలై 1న ఏడుగురు మత్స్యకారులు ఫిషింగ్ హార్బర్ నుంచి వేటకు వెళ్లారని, జూలై 4న తీరానికి 10 మైళ్ల దూరంలో బోటు ప్రమాదానికి గురై మునిగిపోయిందన్నారు. ప్రమాదానికి కొద్దిసేపటి ముందు చిన్నా తన మేనల్లుడు గురునాథంకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారని తెలిపారు. ఒక మత్స్యకారుడు బోటుతో పాటు మునిగిపోగా, మిగిలిన ఆరుగురు కలిసి ఈదుతూ ప్రాణాల కోసం పోరాడారన్నారు. రాత్రి 7 గంటలకు ఫిషరీస్ అధికారులకు ప్రమాద సమాచారం ఇచ్చినా స్పందన లేదని ఆరోపించారు. రాత్రి 10:30 గంటలకు కలెక్టర్, మెరైన్ సీఐకి సమాచారం పంపినా తక్షణ చర్యలు తీసుకోలేదని చెప్పారు.

విశాఖలో నేవీ, కోస్ట్ గార్డ్ ఉన్నప్పటికీ వెంటనే స్పందించి ఉంటే ప్రాణాలు కాపాడేవారన్నారు. చైనా బోటు చిన్నాను రక్షించిందని తెలిపారు. త్రిసభ్య కమిటీ నివేదికలో ఉదయం 5 గంటలకు సమాచారం వచ్చిందని పేర్కొనడం తప్పుదారి పట్టించడమేనని విమర్శించారు. హోంమంత్రి వీడియో కాల్‌కే పరిమితమయ్యారని, ఫిషరీస్ మంత్రి, స్థానిక ప్రజా ప్రతినిధులు బాధితులను కలవలేదని విమర్శించారు.

ప్రభుత్వం ఇచ్చిన రూ.10 లక్షల పరిహారంలో రూ.5 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచేనని ప్రచారం చేసుకోవడం సరికాదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో మత్స్యకారుల మరణ పరిహారాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని గుర్తుచేశారు. మరణించిన ఆరుగురు మత్స్యకారుల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.1 కోటి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బోటు కోల్పోయిన చిన్నాకు కూడా రూ.1 కోటి పరిహారం, కొత్త బోటు ఇవ్వాలని కోరారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. 2023లో ఫిషింగ్ హార్బర్ అగ్నిప్రమాదంలో 49 బోట్లకు రూ.7.49 కోట్లు, 400 కలాశీలకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం చేశామని తెలిపారు. పాకిస్థాన్‌లో నిర్బంధానికి గురైన 22 మంది, బంగ్లాదేశ్‌లో చిక్కుకున్న 9 మంది మత్స్యకారులను స్వదేశానికి తీసుకొచ్చామని గుర్తు చేశారు. వైసీపీ హయాంలో 10 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణాన్ని ప్రారంభించామన్నారు.

ప్రస్తుతం ఫిషింగ్ హార్బర్లలో అవినీతి జరుగుతోందని ఆరోపించారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుటుంబాన్ని రాజకీయంగా వేధిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, గోరుముద్ద వంటి సంక్షేమ పథకాలు దెబ్బతిన్నాయన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదని, చంద్రబాబు "సూపర్ సిక్స్"ను "సూపర్ సెవెన్ మోసాలుగా" మార్చారని విమర్శించారు. మత్స్యకార కుటుంబాలకు న్యాయం జరిగే వరకు వైసీపీ పోరాడుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జగన్ తో పాటు మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, వైసిపి ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, వరుదు కళ్యాణి, మాజీ మంత్రి అమర్నాథ్, తదితర నేతలు పాల్గొన్నారు.

## బీఎల్‌ఓల ఇంటింటి సర్వే గడువు జూలై 24 వరకు పొడిగింపు...

- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్





**శ్రీకాకుళం, జిల్లా ప్రతినిధి, జులై 14, మనసులో మాట:**

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం బూత్ స్థాయి అధికారుల ఇంటింటి సర్వే గడువును జూన్ 15 నుంచి జూలై 24 వరకు పొడిగించామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం ఆయన జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తో కలసి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించి, సవరించిన ప్రత్యేక సంక్షిప్త సవరణ షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణను జూలై 24 లోగా పూర్తి చేయాలని, జూలై 31న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ప్రచురణ జరుగుతుందని పేర్కొన్నారు. ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణకు అవకాశం ఉంటుందని, సెప్టెంబర్ 28 లోగా వాటి పరిష్కారాన్ని పూర్తి చేసి, అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితాను అధికారికంగా ప్రచురిస్తామని వెల్లడించారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం, శ్రీకాకుళం, ఆముదాలవలస, ఎచ్చెర్ల, నరసన్నపేట నియోజకవర్గాల పరిధిలో జరిగిన ఓటర్ల దరఖాస్తుల కంప్యూటరీకరణ ప్రక్రియపై కలెక్టర్ తాజా సమీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,358 పోలింగ్ కేంద్రాల పరిధిలో 18,97,405 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు అత్యంత వేగంగా 17,30,748 ఓటర్ల దరఖాస్తుల (91.22 శాతం) కంప్యూటరీకరణ ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని వెల్లడించారు. ఇందులో భాగంగా బూత్ స్థాయి అధికారుల ద్వారా 17,30,561 (91.21 శాతం) ఓటర్ల వివరాలు క్షేత్రస్థాయిలో ధృవీకరించబడ్డాయని, 7,28,172 మంది ఓటర్లను స్వయం ధృవీకరణ కింద, 9,22,993 మంది ఓటర్లను కుటుంబ సభ్యుల (సంతతి) వివరాల ఆధారంగా అనుసంధానం చేయడం జరిగిందని తెలిపారు. ఇంకా అనుసంధానం కావాల్సిన 79,396 (4.18 శాతం) మంది ఓటర్ల ప్రక్రియను, మిగిలిన ఇతర సాంకేతిక లోపాలను యుద్ధప్రాతిపదికన సవరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సవరించిన ఈ షెడ్యూల్ సమాచారాన్ని క్షేత్రస్థాయి వరకు విస్తృతంగా ప్రచారం చేయాలని, రాజకీయ పార్టీలు పూర్తి స్థాయిలో సహకరించాలని పిలుపునిచ్చారు. తప్పులు ఉంటే సరిదిద్దుకునేందుకు పొడిగించిన సమయం మంచి అవకాశమని కలెక్టర్ అన్నారు.

# కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాల కోసం జులై 30న చలో కలెక్టరేట్

**విశాఖపట్నం, మనసులోమాట , జూలై 14:**



కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు తక్కువ లేకుండా చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్ ఈఎస్ఐ సెలవులు వంటి కార్మిక చట్టాలు అమలు చేయాలని, కార్మికులకు నష్టం చేసే 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలనే డిమాండ్లతో ఈ నెల 30న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ ఆఫీస్ ల వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నాలు జరగనున్నట్టు సీఐటీయూ నేతలు తెలిపారు. ఈ మేరకు పోస్టర్లను మంగళవారం జగదాంబ జంక్షన్, సిఐటియూ కార్యాలయంలో ఆవిష్కరించిన అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కే ఎస్ వి కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు బి జగన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఐదు సంవత్సరాలకి ఒకసారి కనీస వేతనాలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవోలను సవరిస్తుందన్నారు. కాని రాష్ట్రంలో 2007 నుండి కనీస వేతనాల జీవోలను సవరించలేదని, దీనివలన షాపింగ్ మాల్స్, పెట్రోల్ బంక్స్, హాస్పిటల్స్, విద్యా సంస్థలు, చిన్న పరిశ్రమలు 8 వేల నుండి 12 వేల రూపాయలను మాత్రమే డ్రైవర్లు, సెక్యూరిటీ గార్డులకు చెల్లిస్తున్నారని వివరించారు. ఈ 20 ఏళ్ల కాలంలో నిత్యవసర వస్తువుల ధరలు, ఇంటి అద్దెలు పిల్లల స్కూల్ ఫీజులు, వైద్య ఖర్చులు రవాణా చార్జీలు విపరీతంగా పెరిగాయన్నారు. అయినా కార్మికుల జీతాలు మాత్రం పెరగలేదన్నారు. ఎనిమిది గంటల పని దినం సక్రమంగా ఎక్కడ అమలు కావడం లేదని కార్మికులు రోజుకు కనీసం 12 గంటల పైబడి పని చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. అత్యధిక మందికి పిఎఫ్ ఈఎస్ఐ వారాంతపు సెలవులు వంటి కనీస కార్మిక చట్టాలు కూడా అమలు కావడం లేదన్నారు. షాపింగ్ మాల్స్ లో ఖాళీ సమయంలో స్టూల్స్ వేసి కార్మికులు కూర్చోవచ్చని రాష్ట్ర హైకోర్టులు తీర్పు ఇచ్చినా, అవి ఎక్కడ అమలు కావడం లేదన్నారు. పక్క రాష్ట్రమైన తెలంగాణలో ప్రస్తుతం కార్మికులకు ఇస్తున్న జీతం పై 20 శాతం, కర్ణాటకలో 60 శాతం పెంపుదల చేశారన్నారు. ఇక్కడ కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ జూలై 30న జిల్లా కలెక్టర్ కి సామూహిక వినతి పత్రం అందజేయమన్నామని, కాబట్టి చలో కలెక్టరేట్ కు కార్మికుల పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎం సుబ్బారావు, మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి వెంకట్రావు, షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్ యూనియన్ నాయకులు వై రాజు, హెచ్పీసీఎల్ షిప్యార్డ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు పి పైడ్రాజు, కే వెంటారావు పాల్గొన్నారు.

# అనుమతులు లేని అక్రమ కట్టడాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించం : కమిషనర్ బాలస్వామి

**విజయనగరం, జూలై 14 (మనసులో మాట జిల్లా ప్రతినిధి) :**





నగరపరిధిలో అనుమతులు లేని అక్రమ కట్టడాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని కమిషనర్ బాలస్వామి స్పష్టం చేశారు. ఆయన ఆదేశాలతో ప్రణాళిక అధికారులు, సిబ్బంది స్థానిక ఎన్.సి.ఎస్ థియేటర్ ఎదురుగా పెద్ద చెరువుకు ఆనుకుని చేపట్టిన అక్రమ నిర్మాణాలను, తాత్కాలిక ఏర్పాట్లను మంగళవారం కూల్చివేశారు. జెసిబిల సహాయంతో అనుమతి లేని కట్టడాలను తొలగించి వేయడంతో పాటు తాత్కాలిక షెడ్లను కూల్చివేశారు. ఈ సందర్భంగా కమిషనర్ బాలస్వామి మాట్లాడుతూ నగర క్రమబద్ధీకరణ చర్యలలో భాగంగా ప్రతీ నిర్మాణానికి పట్టణ ప్రణాళిక అధికారుల అనుమతులు తప్పనిసరి అని అన్నారు. అలా కాకుండా అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడితే తక్షణమే అట్టి నిర్మాణాలను కూల్చివేస్తామని చెప్పారు. అక్రమ కట్టడాలు నిర్మించేవారు ఎంతటి వారైనా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఫుట్ పాత్ లు, కాలువలపై కూడా ఎటువంటి నిర్మాణాలు, తాత్కాలిక ఏర్పాట్లు చేపట్టరాదని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి, టి పి ఓ అప్పలరాజు, టిపిఎస్ అనిత, ప్రణాళిక సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

# మెగా రక్తదాన శిబిరంలో 35 మంది స్వచ్ఛందంగా రక్తదానం







**గంట్యాడ, జూలై 14 (మనసులో మాట):**

అవయవ దాత గండి పల్లవి జయంతోత్సవాలలో భాగంగా మంగళవారం గంట్యాడలో మెగా రక్తదాన శిబిరం ఎంపీడీవో ఆర్ వి రమణమూర్తి పర్యవేక్షణలో జరిగింది. 35 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్, జనవిజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఎంపీడీవో ఆర్ వి రమణ మూర్తి ప్రారంభించారు. సేకరించిన రక్తాన్ని అవసరమైన రోగులకు వినియోగించేందుకు విజయనగరం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ కు తరలించారు. మెగా రక్తదాన శిబిరంలో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసిన దాతలకు గండి పల్లవి తల్లిదండ్రులు గండి వెంకటరమణ, దేవి కృతజ్ఞతలు తెలిపారు. గంట్యాడ తహసీల్దార్ సత్యనారాయణమూర్తి మొట్టమొదటి రక్తదాతగా రక్తదానం చేసి సేవాభావాన్ని చాటిచెప్పారు. అలాగే మండలంలోని సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ గ్రామ పంచాయతీల నుంచి స్వచ్ఛందంగా వచ్చిన ప్రజలు పాల్గొని రక్తదానం చేశారు.ఈ కార్యక్రమంలో ఎం.పీ.డి.ఓ శ్రీ ఆర్.వి. రమణమూర్తి, తహసీల్దార్ శ్రీ సత్యనారాయణమూర్తి, గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షులు శ్రీ అబ్దుల్ రఫ్, జనవిజ్ఞాన వేదిక పూర్వ అధ్యక్షులు శ్రీ రాజగోపాల్, జిల్లా గ్రంథాలయ సేవా సంఘం కమిటీ కన్వీనర్ శ్రీ బి. రామభద్ర రాజు తదితరులు పాల్గొని రక్తదాతలను అభినందించారు.ఈ సందర్భంగా గంట్యాడ ఎంపీడీవో ఆర్.వి రమణ మూర్తి మాట్లాడుతూ, సమాజంలో అత్యవసర పరిస్థితుల్లో రక్త కొరతను నివారించేందుకు ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు. అనంతరం రక్తదాన శిబిరంలో రక్తదానం చేసిన దాతలు అందరికీ శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

# వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది....

**ఎస్. రాయవరం, జూలై 14, (మనసులో మాట):**



మండలంలోని పెట్టుగోళ్లపల్లి , దార్లపూడి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం వ్యవసాయశాఖ అధ్వర్యంలో నిర్వహించారు. వరి నారు మడి లను పరిశీలించారు.వరి పంటలో నారు మడి యాజమాన్యం గురించి వివరించారు. విత్తిన 10 రోజుల తర్వాత,నారులో 160 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను లేదా లీటరు నీటికి మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ లేదా క్లోర్‌పైరిఫాస్ 2.0 మి.లీ కలిపి పిచికారీ చేయాలన్నారు.విత్తిన 10 రోజుల తర్వాత మరియు విత్తిన 17 రోజుల తర్వాత లేదా నాట్లు వేయడానికి 7 రోజుల ముందు, నారులో 160 గ్రాముల కార్బోఫ్యూరాన్ గుళికలను తక్కువ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. జింక్ లోపాన్ని పర్యవేక్షించాలని, లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలనితెలిపారు. కౌలు రైతులకు పంట సాగుదారు హక్కు పత్రాలు పొందవలసినదిగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సౌజన్య, రైతు సేవా కేంద్రం సిబ్బంది సుగంధి, రాకేష్, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# నేడు టీడీపీ మండల పార్టీ సమావేశం :కోళ్ల వెంకట రమణ

**శృంగవరపుకోట, జూలై 14: (మనుసులో మాట)**



కొత్తవలస మండల టిడిపి అధ్యక్షుడు కోళ్ళ వెంకటరమణ(శ్రీను) అధ్యక్షతన కొత్తవలస నుండి విశాఖపట్నం వెళ్ళే రహదారి ప్రక్కన దేశపాత్రుని పాలెం జంక్షన్ దగ్గరలో ఉన్న సహస్ర ఫంక్షన్ హాల్ లో ఉదయం గం 10.00 లకు జరుగును అని,మండల టిడిపి సమావేశం నకు మండల పరిధిలోని క్లస్టర్ ఇంచార్జిలు యూనిట్ ఇంచార్జ్ లు బూత్ కమిటీ కన్వీనర్లు గ్రామ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పార్టీలో వివిధ విభాగాల్లో ఉన్న నాయకులు కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని మిక్కిలి వినయపూర్వకంగా కోరుచున్నాను.

# కోటబొమ్మాళి ఇంచార్జ్ ఎం.పీ.డీ.వో గా "కిల్లారి"

**టెక్కలి, జూలై 14 (మనసులో మాట) :**



కోటబొమ్మాళి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా (ఎఫ్.ఎ.సి) కార్యాలయ ఏ.వో కిల్లారి నారాయణరావు తాజాగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన కుప్పిలి ఫణీంద్ర కుమార్ పార్వతీపురం డి. డి. ఓ గా పదోన్నతి పై వెళ్లారు. ఫణీంద్ర కుమార్ నుంచి నారాయణరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫణీంద్ర కుమార్ కు అందించిన సహాయ సహకారాలే తనకు కూడా కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు, అధికారులు, ప్రజలు, ప్రజా ప్రతినిధులు అందించాలని, తద్వారా మండల అభివృద్ధికి దోహద పడాలని నారాయణరావు కోరారు.

## పోలీస్ కమిషనరేట్ పీజీఆర్ఎస్ కు 125 ఫిర్యాదులు

**విశాఖపట్నం , జూలై 14 , మనసులోమాట:**



నగర ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలకు వేగంగా పరిష్కారం చూపే లక్ష్యంతో జరిగిన పి జి ఆర్ ఎస్ కు సోమవారం సాయంత్రం వరకు 125 ఫిర్యాదులు అందాయి. పోలీసు కమిషనరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత భాగ్చి పాల్గొని ఫిర్యాదులను స్వీకరించారు. నగరంలోని అన్ని సబ్‌డివిజన్ల ఏసీపీలు, సిఐలు, ఎస్సైలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమంలో పాల్గొనగా ఫిర్యాదులపై సిపి సమీక్ష నిర్వహించారు. ఫిర్యాదుదారులు సమర్పించిన వినతిపత్రాలను ఒక్కొక్కటిగా పరిశీలించిన పోలీసు కమిషనర్, బాధితులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చించి, ప్రతి ఫిర్యాదును చట్టపరంగా విచారించి తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు న్యాయం జరిగేలా ఆలస్యం లేకుండా ఫిర్యాదులను పరిష్కరించాలని, ప్రతి కేసులో పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ వారం పీజీఆర్ఎస్‌లో అందిన ఫిర్యాదుల్లో కుటుంబ కలహాలు, భార్యాభర్తల మధ్య వివాదాలు, భూ తగాదాలు, మోసాలకు సంబంధించిన కేసులు, అలాగే సివిల్ వివాదాలకు సంబంధించిన అంశాలే అధికంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రజలు నేరుగా పోలీసు కమిషనర్‌ను కలిసి తమ సమస్యలను వివరించే అవకాశం కల్పిస్తున్న ఈ వేదికకు స్పందన పెరుగుతోందని, ఫిర్యాదుల పరిష్కారానికి పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

## కౌలు రైతులకు ఎరువుల కొరత రానివ్వద్దు



- **జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్**

**శ్రీకాకుళం/సరుబుజ్జిలి, జిల్లా ప్రతినిధి, జులై 14, మనసులో మాట,:**

జిల్లాలో సాగు పనులు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో రైతులకు ఎరువుల కొరత రానివ్వబోమని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ స్పష్టం చేశారు. మంగళవారం సరుబుజ్జిలి మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. మండలంలోని పాలవలస రైతు సేవా కేంద్రం, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం, కొత్తకోటలోని ఎరువుల గోడౌన్, సరుబుజ్జిలిలోని 'మన గ్రోమోర్' సెంటర్లతో పాటు మతలబుపేట గ్రామాల్లో ఎరువుల పంపిణీ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సంఘాల్లో నిల్వ ఉన్న యూరియా, డీఏపీ తదితర ఎరువుల రికార్డులను, స్టాక్ రిజిస్టర్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎరువుల కొనుగోలుకు వచ్చిన స్థానిక రైతులతో జేసీ నేరుగా మాట్లాడి ఎరువుల లభ్యత, పంపిణీ జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. అనంతరం పంపిణీ కేంద్రాల సిబ్బందితో మాట్లాడుతూ.. సబ్సిడీ ఎరువుల విక్రయాల కోసం ఉపయోగిస్తున్న 'ఏపీ ఏఐఎంఎస్ 2.0', 'ఐఎఫ్ఎమ్ఎస్' మొబైల్ యాప్‌ల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ యాప్‌ల నిర్వహణలో ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులు, సర్వర్ సమస్యలపై సిబ్బందిని అడిగి వాటి పరిష్కారానికి సూచనలు చేశారు. భూమిని వాస్తవంగా సాగు చేస్తున్న కౌలు రైతులకు కూడా ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. ఇందుకోసం సాగుదారుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ డేటాబేస్‌లో అప్‌డేట్ చేయాలని, ఈపంట నమోదు ఆధారంగా పారదర్శకంగా పంపిణీ సాగాలని జేసీ ఆదేశించారు. ఎరువుల విక్రయాల్లో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా, నిర్దేశిత నిబంధనల ప్రకారమే పంపిణీ జరగాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో జాయింట్ కలెక్టర్ వెంట మండల డెప్యూటీ తహసీల్దార్, మండల వ్యవసాయ అధికారి, స్థానిక రెవెన్యూ సిబ్బంది, వ్యవసాయ శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

## వినియోగదారుల హక్కుల ఉల్లంఘనపై కఠిన చర్యలు

- **జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**
- **కల్తీలు, నకిలీ వస్తువుల విక్రయాలపై తనిఖీలు ముమ్మరం చేయాలి**

**శ్రీకాకుళం, జిల్లా ప్రతినిధి, జులై 14 , మనసులో మాట:**



వినియోగదారుల హక్కుల పరిరక్షణకు, నకిలీలు, కల్తీల నియంత్రణకు జిల్లాలో అధికారులు సమన్వయంతో కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా వినియోగదారుల రక్షణ మండలి (డిసిపిసి) సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్ చైర్‌పర్సన్‌గా వ్యవహరించగా, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, పౌరసరఫరాలు, లీగల్ మెట్రాలజీ, ఆహార భద్రతా విభాగాలు, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వినియోగదారులను తప్పుదోవ పట్టించే మోసపూరిత ప్రకటనలపై, ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు వస్తువులు విక్రయించే వ్యాపారులపై నిరంతరం నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా హోటళ్లు, మాల్స్, సినిమా థియేటర్లలో అధిక ధరలకు విక్రయాలు జరిపితే కఠిన జరిమానాలు విధించాలన్నారు. అలాగే గడువు తేదీ దాటిన ఆహార పదార్థాల విక్రయాలపై ఉక్కు పాదం మోపాలని, కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా గడిచిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై, అమలు చేసిన అంశాలపై చర్చించారు. ఆహార పదార్థాల కల్తీని అరికట్టేందుకు రెవెన్యూ, పోలీస్, ఆహార భద్రతా అధికారులతో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వినియోగదారుల రక్షణ చట్టం2019 పై గ్రామీణ ప్రాంత ప్రజలకు, విద్యార్థులకు విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించాలని, పెట్రోల్ బంకులు, కిరాణా దుకాణాలలో లీగల్ మెట్రాలజీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టి కొలతల్లో మోసాలు జరగకుండా చూడాలని, కేసుల వివరాలను సభ్యులకి చేరవేయాలని అన్నారు. జిల్లా సరఫరాల అధికారి సూర్య ప్రకాశరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో వినియోగదారుల సేవా సంస్థల సమాఖ్య శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు బగాది రామమోహనరావు, శ్రీకాకుళం కన్స్యూమర్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్ అధ్యక్షుడు బమ్మిడి నరేంద్ర కుమార్, శ్రీకాకుళం ఆసరా అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గంజి ఆర్. ఎజ్రా, నందిగాం మండల కన్స్యూమర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు లఖినాన వెంకటాచలం, పలాస మండల కన్స్యూమర్ వెల్ఫేర్ ప్రోగ్రామ్స్ సెక్రటరీ ఉప్పాడ రమేష్, హిరమండలం మండల కన్స్యూమర్ కౌన్సిల్ ప్రతినిధి అందవరపు వెంకట సురేష్, ఆమదాలవలస మండల ప్రగతి యువజన సేవా సంఘం తాళాబత్తుల ధనుంజయరావు, పలాస మండల జిల్లా గ్రామీణ వినియోగదారుల సంఘం అధ్యక్షుడు డి. ఉమామహేశ్వరరావు, వజ్రపుకొత్తూరు మండల కన్స్యూమర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు కంసు నిర్మల, పలాస మండల కన్స్యూమర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డి. జనార్దనరావు, డిప్యూటీ కమిషనర్ ఆర్టీఓ పి.వి. గంగాధర్, వైద్య ఆరోగ్య శాఖ పీఓ ఆర్‌బీఎస్‌కే ఎన్‌సీడీ కె. సూర్యప్రకాష్ రావు, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ పి. చిన్నమ్మడు, సహాయ ఆహార నియంత్రణ అధికారి ఈ.ఎల్. నారాయణ, ఏపీఎస్ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సిహెచ్.ఏ. నారాయణ, గ్రామీణ నీటి సరఫరా శాఖ డీఈఈ పి. లలితా కుమారి, వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ ఎ.ఎన్.వి. ప్రసాద్, సీనియర్ న్యాయవాది అన్నెపు భువనేశ్వర్ హాజరయ్యారు.

## పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జీవన ఎరువుల వినియోగంపై అవగాహన

**హుకుంపేట జులై 14 మనసులో మాట**



మండలంలోని గూడా పంచాయతీలో మంగళవారం "పొలం పిలుస్తోంది" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యేరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా. ఉమామహేశ్వరరావు వరి పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులతో మాట్లాడారు. జీవన ఎరువుల వినియోగం, వాటి ప్రయోజనాలు, నేల సారాన్ని పెంపొందించడంలో వాటి పాత్రను రైతులకు వివరించారు. అలాగే వరి నాటే సరైన విధానం, పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అధిక దిగుబడులు సాధించేందుకు అనుసరించాల్సిన శాస్త్రీయ పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె. సుధాకర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) వైస్ చైర్మన్ జ్ఞానప్రకాశ్, వ్యవసాయ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు. రైతులు అడిగిన సందేహాలకు శాస్త్రవేత్తలు సమాధానాలు ఇచ్చి పంట నిర్వహణపై సూచనలు అందించారు.

## అడ్డు అదుపు లేకుండా బుడ్డిగ కొండమ్మ భూ కబ్జాలు...

- **అక్రమ నిర్మాణదారులపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని: ఆదివాసి గిరిజన సంఘం డిమాండ్**
- **రెవిన్యూ శాఖ ప్రోత్సాహంతోనే అక్రమ నిర్మాణాలు -ఆదివాసి గిరిజన సంఘం డిమాండ్**





**హుకుంపేట, జులై 14, మనసులో మాట**

హుకుంపేట మండలంలో రెవెన్యూ అధికారుల అండదండలతోనే గిరిజనేతరురాలు కాకినాడ విజయ మొదమాంబ అలియాస్ బుడ్డిగ కొండమ్మ భూ ఆక్రమణలకు పాల్పడుతోందని ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి టి. కృష్ణారావు, నాయకులు వి. లక్ష్మణరావు, పి. లింగమూర్తి ఆరోపించారు. వారు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ, బుడ్డిగ కొండమ్మ ఇప్పటికే అనేక ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టి, విచ్చలవిడిగా క్రయవిక్రయాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. రెవెన్యూ కార్యాలయానికి ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 75 ప్రభుత్వ భూమిలో బోర్డు ఏర్పాటు చేసి ఆక్రమణకు పాల్పడుతున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. స్వయం ఉపాధి కోసం గిరిజనులకు చిన్న స్థలం ఇవ్వడానికి అనేక కారణాలు చెప్పే అధికారులు, గిరిజనేతరులకు ఏ ప్రాతిపదికన ప్రభుత్వ భూములను బహూకరించి రిజిస్ట్రేషన్లు చేశారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో రెవెన్యూ అధికారుల మౌనం అనుమానాలకు తావిస్తోందని, అక్రమ నిర్మాణదారులతో కుమ్మక్కయ్యారనే ఆరోపణలు వ్యక్తం చేశారు. ఈ ఘటనపై జిల్లా స్థాయి అధికారులు సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులైన రెవెన్యూ అధికారులతో పాటు అక్రమ నిర్మాణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# జగన్ రెడ్డి విలువలతో కూడిన మాటలు మాట్లాడాలి

- కాశీబుగ్గ ఘటనలో మంత్రి అప్పలరాజుని వెనకేసుకురావడం సిగ్గు చేటు
- నేరాలను, ప్రమాదాలను ప్రోత్సహించే విధంగా జగన్ రెడ్డి మాటలు
- మత్స్యకారులకు తెలుగుదేశం పార్టీ అండదండలు
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**విజయనగరం, జులై 14 (మనసులో మాట జిల్లా ప్రతినిధి) :**

మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి విలువల తో కూడిన మాటలు మాట్లాడాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాం ధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ బోటు గల్లం తులో అదృశ్యమైన వారి కుటుంబాలను పరామర్శకు వచ్చి ప్రభుత్వంపై విమర్శలు చేయటం జగన్ రెడ్డికే చెల్లుబాటు అయింద న్నారు. జగన్ రెడ్డికి అధికారంలో ఉన్నప్పు డు మత్స్యకారులు, వారి సమస్యలు ఏనాడు గుర్తుకు రాలేదని... కేవలం రాజకీయ లబ్ధికోసమే జగన్‌కు ఇప్పుడు మత్స్యకారు లు గుర్తుకు రావడం సిగ్గుచేటని మంత్రి విమర్శించారు. అబద్ధాలు ఆడడం జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య అని, బోటు గల్లంతైన విషయం తెలిసిన వెంటనే ప్రభుత్వం రక్షణ చర్యలు చేపట్టడంతో పాటు నాలుగు రోజులు పాటు హెలికాప్టర్లు, మెరైన్ బోట్లతో సిబ్బంది విస్తృతమైన గాలింపు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రమాదంలో సురక్షితంగా ఉన్న చిన్నాను వెనువెంటనే కాపాడి వైద్య సేవలందించామని, చిన్నా సూచన మేరకు బోటు గల్లంతైన ప్రాంతం తెలుసుకుని మిగిలిన వారికోసం జల్లెడ పట్టినా వారి ఆచూకి లభించకపోవడం దురదృష్టకరమని మంత్రి కొండపల్లి శ్రీ నివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం మాటల రూపంలో కాకుండా చేతలతో బాధిత కుటుంబాలకు తక్షణమే రు.10లక్షలు అందించిందని.. అదే గత వైసీపీ ప్రభుత్వంలో ఎందరో బాధితులకు పరిహారం ప్రకటించి ఎగ్గొట్టిన ఘనత కూడా జగన్ రెడ్డికే దక్కుతుందని మంత్రి విమర్శించారు. ప్రభుత్వం తరఫున ఇద్దరు మంత్రులు బాధిత కుటుంబాలను పరామ ర్శించడంతోపాటు ఎమ్మెల్యేలు, ఇన్చార్జిలు వారికి ఆసరాగా నిలిచిన విషయాన్ని కూడా తప్పుదోవ పట్టిస్తూ విమర్శలు చేయటం బా ధాకరమన్నారు. మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉందన్నా రు. కాశీబుగ్గ ప్రమాద సంఘటన సైతం రాజకీయం చేయడం జగన్‌కు సిగ్గుమాలిన చర్య అని.. అక్కడ ప్రమాదం యాదృచ్ఛిక మే అయినప్పటికీ ప్రమాదాన్ని తారుమారు చేసి మాజీ మంత్రి సిదిరి అప్పలరాజు తన కుమారుడు అరవ్ కోసం మరో అమాయకు డిని బలి చేయడం సరికాదని మంత్రి పేర్కొ న్నారు. అలాగే చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని మాజీ మంత్రి కేసు తారుమారు చేయడాన్ని స్థానిక ప్రజలందరూ గుర్తించడం జరిగింద న్నారు. జగన్ రెడ్డి మాటలు ప్రమాదాలను, నేరాలను ప్రోత్సహించే విధంగా ఉన్నాయ న్నారు. ఒక బాధ్యత కలిగిన ప్రజా ప్రతినిధి అటువంటి మాటలు మాట్లాడటం సరికా దని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హితవు పలికారు.

# 23 మంది రైతులకు రూ.14 లక్షల పంట రుణాల పంపిణీ



**హుకుంపేట, జూలై 14: మనసులో మాట**

హుకుంపేట మండలంలోని 23 మంది రైతులకు మొత్తం రూ.14 లక్షల పంట రుణాలను అందజేసినట్లు పీఏసీఎస్ ఛైర్మన్ తాంగుల మోహన్, డీసీసీబీ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు, పీ ఏసీఎస్ కార్యదర్శి అప్పలనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులు సకాలంలో పంట రుణాలను వినియోగించి ఖరీఫ్ సాగును విజయవంతంగా చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం సహకార బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీతో రైతులకు పంట రుణాలు అందిస్తున్న దని పేర్కొన్నారు. రైతులు వ్యవసాయ అవసరాల కోసం మాత్రమే రుణాలను వినియోగించి, సకాలంలో తిరిగి చె ల్లించడం ద్వారా భవిష్యత్తులో మరిన్ని ఆర్థిక ప్రయోజనాలు పొందవచ్చని వివరించారు. సహకార సంఘాలు రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటాయని, అర్హులైన ప్రతి రైతు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్ర మంలో రైతులు, సహకార సంఘం ప్రతినిధులు, బ్యాంకు సిబ్బంది పాల్గొ న్నారు.

# పెట్టుబడి పేరుతో రూ.22 లక్షల మోసం దొరబాబుపై చీటింగ్ కేసు నమోదు

**నర్సీపట్నం: జూలై 14 (మనసులో మాట)**

పెట్టుబడి పేరుతో రూ.22 లక్షలు తీసుకుని తిరిగి ఇవ్వకుండా మోసం చేశారని, డబ్బులు అడిగినందుకు బెదిరింపులకు పా ల్పడ్డారని వచ్చిన ఫిర్యాదు మేరకు నర్సీ పట్నంకు చెందిన జనసేన నాయకుడు ఎన్ఎస్‌జీ దొరబాబుపై నర్సీపట్నం టౌన్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు.బేరా కామాక్షి కల్పన డీఎస్పీ పి. శ్రీనివాస్‌కు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపిన వివరాల ప్రకారం.. తన భర్త బేరా శేష 2011లో వివేకానంద జూనియర్, డిగ్రీ కళాశాలలో భాగస్వామిగా మొదట రూ.12 లక్షలు, అనంతరం మరో రూ.10 లక్షలు పెట్టుబడిగా ఇచ్చారని, మొత్తం రూ.22 లక్షలు పెట్టుబడి పెట్టి నప్పటికీ భర్త మరణించిన తర్వాత ఇప్ప టివరకు ఆ డబ్బులు తమ కుటుంబానికి తిరిగి ఇవ్వలేదని పేర్కొన్నారు. డబ్బులు కోరిన ప్రతిసారీ దొరబాబు ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేస్తూ, అవమానకరంగా మాట్లాడటంతో పాటు, "మళ్లీ డబ్బులు అడిగితే చంపేస్తాం.. ఎక్క డికైనా వెళ్లి చెప్పుకో.. మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు అంటూ బెదిరించారని ఫిర్యాదులో ఆరోపించారు. ఈ బెదిరిం పుల కారణంగా తనకు, తన పిల్లలకు ప్రాణహాని ఉందని ఆమె పేర్కొన్నారు. అంతేకాకుండా, ఒక రోజు రాత్రి సమయంలో తనను బైక్‌తో ఢీకొట్టేం దుకు ప్రయత్నించారని, అప్రమత్తంగా ఉండటంతో ప్రమాదం నుంచి తప్పించు కున్నానని తెలిపారు. ఈ ఘటన తర్వాత తమ కుటుంబ భద్రతపై తీవ్ర ఆందోళన నెలకొందని పేర్కొన్నారు. దొరబాబు ప్రస్తుతం జనసేన పార్టీ నాయ కుడిగా ఉన్నప్పటికీ, చట్టం అందరికీ సమా నమనే నమ్మకంతో ఫిర్యాదు చేస్తున్నానని కామాక్షి కల్పన తెలిపారు. తనపై బెదిరిం పులు, దాడి యత్నానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, తనకు రావాల్సిన రూ.22 లక్షల పెట్టుబడి మొత్తా న్ని ఇప్పించి, తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు. ఈ ఫిర్యాదును పరిశీలించిన నర్సీపట్నం పోలీసులు దొరబాబుపై చీటింగ్‌తో పాటు ఫి ర్యాదులో పేర్కొన్న ఆరోపణలకు సంబంధి ంచిన సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనకు సంబంధించిన అన్ని అంశాలపై విచారణ కొనసాగుతోంద ని పోలీసులు తెలిపారు.

# పంటల బీమా ను వినియోగించుకోవాలి : ఏవో శ్యాం కుమార్



**గంట్యాడ, జులై 14 (మనసులో మాట):.**

పంటల బీమా పథకాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని, మంగళవారం గంట్యాడ మండలంలోని పలు గ్రామా లలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో గంట్యాడ మండల వ్యవసాయ అధికారి బి శ్యాం కుమార్ రైతులకు సూచించారు. గంట్యాడ మం డలంలోని రామవరం, నరవ గ్రామాల లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని గంట్యాడ మండల వ్యవసాయ అధికారి బి శ్యాం కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ఈ సందర్భంగా సంబంధిత రైతు సేవ కేంద్రాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు పలు విషయాలపై ఏవో శ్యాం కుమార్ అవగాహన కల్పిం చారు. రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. పంటల బీమా పథకానికి సంబంధించి రైతులు ఆగస్టు 15వ తేదీలోగా భీమా ప్రీమియం చెల్లించి పంటల బీమా లో పేర్లు నమోదు చేసుకోవాలని ఏవో శ్యామ్ కుమార్ సూచించారు. సూచించారు.

# తిమ్మాపురం లో మంచినీటికి కటకట



**ఎస్.రాయవరం, జూలై 14, (మనసులో మాట ):**

ఎస్ రాయవరం మండలం తిమ్మాపు రం మేజర్ పంచాయతీలో గత వారం రోజులుగా మంచినీటి సరఫరా నిలిచిపో వడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కోవాల్సి వస్తుంది. సాంకేతిక లోపం కారణంగా తిమ్మాపురం గ్రామంలోని మంచినీటి ట్యాంక్ లకు నీటిసరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఐదు రోజులకు ఒకసారి మాత్రమేసరఫరా చేసే మంచినీరు గత 10 రోజులుగా నిలిచిపోవడంతో గ్రామస్తులు బావులు, వ్యవసాయ మోటార్లపై ఆధారపడవలసి ఉంటుంది. ఆర్వో ప్లాంట్ లువద్ద మంచి నీటి కోసం వేచి ఉండక తప్పలేదు. ఆర్డబ్ల్యూఎస్ అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబా టులో లేరు. మంచినీటి సరఫరాను పు నఃద్ధరించేందుకు సాంకేతిక లోపాలను సరిచేయాలని తిమ్మాపురం గ్రామస్తులు కోరుతున్నారు.

# టెక్కలి డివిజన్లో 4630 ఎకరాల్లో పశు గ్రాసం పండించడమే లక్ష్యం

- పశుగ్రాస వారోత్సవాలను సందర్శించిన ఉప సంచాలకులు



**టెక్కలి, జులై 14 (మనసులో మాట) :**

202627 సంవత్సరానికి సంబంధించి టెక్కలి డివిజన్ లోని 14 మండలాల్లో 2027 మార్చికి 4630 ఎకరాలలో పశుగ్రాసాలను వేయించే లక్ష్యంతో వె ళ్తున్నామని పశుసంవర్థక శాఖ టెక్కలి ఉపసంచాలకులు డాక్టర్ చందక నర సింహులు అన్నారు. పశుగ్రాస వారోత్స వాలు ఆఖరి రోజు అయిన సందర్భంగా కోటబొమ్మాళి మండలం మెండపేట గ్రామంలో గల పశుగ్రాస క్షేత్రాలను మంగళవారం ఆయన సందర్శించా రు. ఇందులో గడచిన జూన్ నెల వరకు 1109 ఎకరాలలో పశుగ్రాసాలను వేయాల్సి ఉండగా.. 1159 ఎకరాలలో పశుగ్రాసాలను వేయించడం జరిగిం దని తెలిపారు. ఈ కార్యక్రమమునకు నిమ్మాడ పశువైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్ కుమార్, టెక్కలి సహాయ సంచాలకులు డా.బి. వెంకటరమణ , కొల్లిపాడు పశువైద్యాధికారి డా.గౌతమ్ ,మెండ మాధవ, రెడ్డి నవ్య మొదలగు పాడి రైతులు పాల్గొన్నారు.

# నేటి నుంచి వారాహి మాతా నవరాత్రి ఉత్సవాలు



గాజువాక (మనసులోమాట )జూలై 14

శ్రీ వెంకటేశ్వర వైదిక సంస్థాపనమ్ ఆధ్వర్యంలో వడ్లపూడి ఈసేవ మైదానంలో బుధవారం నుంచి వారాహి అమ్మవారి నవరాత్రి ప్రయుక్త అంబికా పంచాయతన యాగ మహోత్సవాలు నిర్వహించనున్నారు.ఈ మేరకు యాగ నిర్వాహకులు,ఆగమ వైదిక స్మార్త పండితులు జె. వెంకట హరీష్ శర్మ,బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు,వార్డు మాజీ కార్పొరేటర్ బొండా జగన్ లు ఏర్పాట్లను పరిశీలించారు.24 వ తేదీ వరకు ఈ వేడుకలు జరుగుతాయని,లోక కళ్యాణార్థం చేపట్టే ఈ మహోత్సవంలో భక్తులంతా పాల్గొని వారాహి మాత అనుగ్రహాన్ని పొందాలని కోరారు.తొమ్మిది రోజులూ సామూహిక కుంకుమ పూజలు,హోమం ,కళ్యాణం వంటి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.కార్యక్రమంలో కృష్ణారెడ్డి,రూపాదేవి తదితరులు పాల్గొన్నారు.

# ఏటికొప్పాకలో 'పొలం పిలుస్తోంది

యలమంచిలి టౌన్ జూలై 14, మనసులో మాట,



మండలంలోని ఏటికొప్పాక,బయ్యవరం గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంనిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మోహనరావు మాట్లాడుతూ..రైతు సోదరులందరూ ఈ సంవత్సరం వాతావరణ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని ఎక్కువ పంటకాల పరిమితి రకాలైనటువంటి పంటలు వేసుకోవాలని సూచించారు. వాటికి అవసరమైన విత్తనాలు, అన్ని రకాల వరి విత్తనములు వ్యవసాయ శాఖ,రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎరువుల విషయంలో ముఖ్యంగా యూరియా కొరత లేదన్నారు. అన్నిరైతు సేవా కేంద్రాలతో పాటుగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లక్కవరం, డీలర్ల వద్ద 124 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని, రైతు సోదరులు ఆధార్ నెంబర్ ను ఉపయోగించి ఏపీ ఎఐఎంఎస్ యాప్ ద్వారా ఎరువులు తీసుకోగలరని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు సూర్యారావు, పెంటయ్య, నానాజీ, ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది, గ్రామ సహాయకులు మధు, కుమార్ పాల్గొన్నారు.

# జైల్లో ఖైదీల బెయిల్ ప్రభుత్వ వకీలు





ఎలమంచిలి టౌన్, జూలై 14, మనసులో మాట,

సబ్ జైల్లో ఉన్న ఖైదీలకు బెయిల్ అవసరమైనప్పుడు ప్రభుత్వ వకీలను ఏర్పాటు చేస్తామని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఆర్ సన్యాసినాయుడు అన్నారు. సోమవారం నాడు ఎలమంచిలి సబ్ జైల్ ను సందర్శించి ఆయన ముద్దాయిల యొక్క సమస్యలను కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎవరికైనా ఉచిత న్యాయ సహాయము కావాలంటే వారికి ప్రభుత్వ వకీలను కేటాయించి బెయిలు పెట్టిస్తామని చెప్పారు. ఎవరికైనా ఆరోగ్యం బాగోకపోయిన జైల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నా చెప్పండి అని వివరాల అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమములో సబ్ జైల్ సూపరిడెంట్ కిరణ్, పానల్ లాయర్స్ పివి రమణ, టి నూకరాజు, బి హరి శంకర్ ,కోర్టు సిబ్బంది, జైలు సిబ్బంది పాల్గొన్నారు .

# ఎస్ఐఆర్ ప్రక్రియ గడువు పొడిగింపు....

- వరకు ఇంటింటి సర్వే.. అక్టోబర్ 3న తుది ఓటరు జాబితా ప్రచురణ..
- జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్...



వి మాడుగుల (మనసులో మాట )జూలై 14

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 2026సర్ ప్రక్రియకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్‌ను విడుదల చేసిందని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి విజయ క్రిష్ణన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో బీఎల్వోలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే కార్యక్రమం జూలై 24 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను కూడా జూలై 24లోపు పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ, జరుగుతుందని వెల్లడించారు. అదే రోజు నుంచి ఆగస్టు 30 వరకు ఓటర్ల నుంచి క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరిస్తారని చెప్పారు. అనంతరం వాటి విచారణ, పరిష్కార ప్రక్రియను సెప్టెంబర్ 28 వరకు పూర్తి చేసి, అక్టోబర్ 3న తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు వివరించారు. జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 2026 (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన సవరించిన షెడ్యూల్ ప్రకారం వేగవంతంగా పూర్తి చేయడానికి ఎన్నికల అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లినప్పుడు ఓటర్లు పూర్తి సహకారం అందించి అవసరమైన వివరాలు, పత్రాలను సమర్పించాలని కోరారు. కాగా ప్రజలందరూ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ సవరించిన షెడ్యూల్‌ను గమనించి, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు లేదా కొత్త ఓటరు నమోదు కొరకు నిర్దేశిత గడువు లోగా తమ దరఖాస్తులను సమర్పించి ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతం కావడానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# ఆదివాసీలకు రక్షణ చట్టం1ఆఫ్70 అమలుచేయాలి: వాబయోగి

పాలకొండ, జూలై 14,మనసులో మాట:



ఆదివాసీలకు రక్షణ కవచమైన 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షులువాబయోగిడిమాండ్‌చేశారు. మంగళవారం పాలకొండ లో డాక్టర్ సి.ఎల్.నాయుడు కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో వాబయోగి మాట్లాడుతూ, సుప్రీం కోర్టులో 1 ఆఫ్ 70 చట్టానికి వ్యతిరేకంగా గిరిజనేతరులు వేసిన కేసులో ప్రభుత్వం వెంటనే ఇంప్లీడ్ పిటిషన్ వేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలకు వెన్నుముక లాంటి 1ఆఫ్ 70 యాక్ట్ ను నిర్వీర్యం చేయరాదని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆ సమావేశంలో, మన్యం జిల్లా అధ్యక్షులు బిడ్డిక శ్రీను మాట్లాడుతూ1/ 70 చట్టానికి వ్యతిరేకంగా గిరిజనేతరులు సుప్రీంకోర్టు లో వేసిన కేసుపై రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని ఆ కేసులో రాష్ట్ర ప్రభుత్వ స్వయంగా ఇంప్లీడ్ పిటిషన్ వేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి బిడ్డక శ్రీను డిమాండ్ చేశారు. జీవో నెంబర్3 నిర్వీర్యం చేసినట్లు,1/70 చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి ఈ రాష్ట్ర ప్రభుత్వం ఆలోచనలు చేసిన పక్షంలో మరో శ్రీకాకుళం సాయుధ పోరాటానికి సిద్ధమని ఈ ప్రభుత్వానికి హెచ్చరిస్తున్నామని శ్రీను అన్నారు. ఆదివాసీ జేఏసీ కార్యదర్శి బిడ్డక ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ వన్ ఆఫ్ సెవెంటీ యాక్ట్ అమలు చేయాలని లేదంటే గిరిజనులు తీవ్ర స్థాయిలో నష్టపోతారని బ్రతుకు లేకుండా పోతారని అన్నారు

# పర్యావరణ పరిరక్షణతోనే దైవత్వం సాకారం : జిల్లా కలెక్టర్ ప్రభాకర రెడ్డి

- శ్రీ కోటదుర్గ అమ్మవారి ఆలయంలో వినూత్నంగా శ్రీ వనదుర్గ బంతి-చామంతి మహోత్సవం
- భక్తులకు ప్రసాదంగా పూజించిన మొక్కల పంపిణీ
- ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి





పాలకొండ,జూలై 14, మనసులో మాట :

ఆధ్యాత్మికతకు పర్యావరణ పరిరక్షణను జోడిస్తూ శ్రీ కోటదుర్గ అమ్మవారి దేవస్థానంలో "శ్రీ వనదుర్గ (బంతిచామంతి) మహోత్సవం" భక్తుల్లో సామాజిక బాధ్యతతో కూడిన ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించనుందని జిల్లా కలెక్టర్‌డా.ఎన్.ప్రభాకర రెడ్డి తెలిపారు. మంగళవారం పాలకొండ శాసనసభ్యులు నిమ్మక జయకృష్ణతో కలిసి ఈ మహోత్సవ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా, వినూత్నంగా జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆలయ ప్రాంగణంలో బంతి, చామంతి తదితర పుష్ప మొక్కల నడుమ అమ్మవారిని "వనదుర్గ" స్వరూపంగా ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రకృతిని ఆరాధించే భారతీయ సంస్కృతిని మరింత బలపరిచే విధంగా ఈ మహోత్సవాన్ని రూపుదిద్దామని పేర్కొన్నారు."పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, చెట్లను, మొక్కలను సంరక్షించడం అంటే భవిష్యత్ తరాలకు జీవనాధారాన్ని అందించడం అన్నారు. ప్రకృతి పరిరక్షణలో భాగస్వాములైనప్పుడే నిజమైన దైవత్వాన్ని అనుభవించగలమని కలెక్టర్ తెలిపారు.

**ప్రసాదంగా పూజించిన మొక్కల పంపిణీ**

ఈ మహోత్సవంలో ప్రత్యేకతగా అమ్మవారికి పూజించిన బంతి, చామంతి మొక్కలను భక్తులకు తీర్థప్రసాదంగా అందజేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆధ్యాత్మికతతో పాటు పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. అలాగే, ఆలయానికి విచ్చేసే ప్రతి భక్తుడు తమకు సాధ్యమైనంత వరకు ఒక మొక్కను లేదా ఒక నారును తీసుకువచ్చి ఈ మహోత్సవంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబం ఒక మొక్కను నాటి సంరక్షిస్తే పచ్చదనంతో కూడిన సమాజ నిర్మాణానికి తోడ్పడినవారవుతారని అన్నారు. అంతకుముందు అమ్మవారిని కలెక్టర్ దర్శించుకోగా, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అర్చకులు అందించారు. శాసనసభ్యులు నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ సాధారణంగా బంతి, చామంతి మొక్కలను ఇంటి ముందర వేసుకోవడం ద్వారా అందంతో పాటు దోమలు దరిచేరవన్నారు. గ్రామీణ ప్రాంతాలలో రోడ్ల ఇరువైపులా మొక్కలు నాటడం ఎంతో అవసరమని వివరించారు. ఇది వాతావరణాన్ని చల్లబరచడానికి, మంచి గాలిని అందించడానికి పర్యావరణాన్ని అందంగా తీర్చిదిద్దడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

# మనసులో మాట

KANCHARLA నిజమే మా ఇజం.. ఐదే మా ఐర్మాణం.. సంచలన తెలుగు దిన పత్రిక

## కోస్తాంధ్ర

రాజమహేంద్రవరం | కాకినాడ | కోనసీమ
అమలాపురం | తణుకు | ఏలూరు | భీమవరం

బుధవారం 15 జూలై 2026 | పేజీలు 16


## సాగునీటి సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు



4

# కార్మికులకు ఆధునిక వైద్య సేవలు

కార్మిక సంక్షేమంలో మరో ముందడుగు..



- రాజమహేంద్రవరంలో రూ.75 కోట్లతో 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రి ప్రారంభం
- కార్మికుల ఆరోగ్యానికి పెద్దపీట..
- 50 నుంచి 100 పడకలకు విస్తరణ.. అత్యాధునిక వైద్య సదుపాయాలు
- కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ వర్చువల్‌గా ప్రారంభోత్సవం
- అవసరమైతే వైద్యుల సంఖ్య పెంపునకు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం
- మంత్రి వాసంశెట్టి సుభాష్



**రాజమహేంద్రవరం (మనసులో మాట) జూలై 14**

రాజమహేంద్రవరంలోని ఈఎస్ఐ ఆసుపత్రిని 50 పడకల నుంచి 100 పడకల అత్యాధునిక ఆసుపత్రిగా అభివృద్ధి చేయడం కార్మికులకు ఎంతో ఉపయోగపడే ముందడుగని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు.మంగళ వారం సాయంత్రం ఆసుపత్రిలోని వివిధ విభాగాలను అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రం లోని హైదరాబాద్ సనత్‌నగర్ ఈఎస్ఐ హాస్పిటల్ నూతన ఓపీడీ బ్లాక్‌ను కేంద్ర కార్మిక, ఉపాధి, యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ మంగళవారం ప్రారంభించారు. అనంతరం అదే వేదిక నుంచి దేశవ్యాప్తంగా నిర్మించిన ఆరు ఈఎస్ఐ భవనాలలో భాగంగా రాజమహేంద్రవరం ..మిగతా 2లో

## సర్ గడువు జూలై 24 వరకు పొడిగింపు..




2

- ప్రత్యేక విస్తృత సవరణ గడువు పొడిగింపును
- పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా పరిధిలో 99.75 శాతం డిజిటలైజేషన్ పూర్తి
- జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం (మనసులో మాట) జూలై 14**

జిల్లాలో ప్రత్యేక విస్తృత సవరణ (స్పెషల్ ఇంటెన్షవ్ రెవిషన్ -సర్ ) కార్యక్రమానికి సంబంధించి భారత ఎన్నికల సంఘం సవరించినజూలై 24 వరకు కాలపరిమితి నీ పెంచుతూ షెడ్యూల్‌ను విడుదల చేసిందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మంగళ వారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా ..మిగతా 2లో



## డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను పరామర్శించిన మంత్రి కందుల దుర్గేష్

- సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాక్షేత్రంలోకి వస్తారని ఆకాంక్ష

7

## అంగన్వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన సేవలను అందించండి

- అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు ఆటపాటల ద్వారా విద్యను నేర్పండి
- ప్రతి మాసం మూడో వారంలో ప్రతి అంగన్వాడీ
- అంగన్వాడీల పనితీరుపై ప్రత్యేక దృష్టి సారించాలి
- జిల్లాకలెక్టర్ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

2





# సర్ గడువు జూలై 24 వరకు పొడిగింపు..

**(మొదటిపేజీ తరువాయి)**

బీఎల్‌వోలు ఇంటింటి సందర్శన కార్యక్రమాన్ని జూలై 24, 2026 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, పునఃఅమరికను జూలై 24 నాటికి పూర్తి చేయాలని, ముసాయిదా ఓటరు జాబితాను జూలై 31న ప్రచురిస్తామని తెలిపారు. జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించబడతాయని, వాటి పరిష్కారం సెప్టెంబర్ 28 నాటికి పూర్తి చేసి, అక్టోబర్ 3, 2026న తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు కీర్తి చేకూరి తెలిపారు. ఎన్నికల సంఘం కల్పించిన అదనపు గడువును అధికారులు, బీఎల్‌వోలు సమర్థవంతంగా వినియోగించుకుని తూర్పు గోదావరి జిల్లాలో ఎటువంటి తప్పిదాలు లేని, పారదర్శకమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. సవరించిన షెడ్యూల్‌పై విస్తృత ప్రచారం నిర్వహించాలని, రాజకీయ పార్టీలకు కూడా లిఖిత పూర్వకంగా సమాచారం అందించాలని ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రత్యేక విస్తృత సవరణ కార్యక్రమంలో జిల్లా పురోగతి సంతృప్తికరంగా ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.జిల్లాలోని 18,46,723 మంది ఓటర్లకు సంబంధించిన ఎన్యూమరేషన్ ఫారాలు 100 శాతం పంపిణీ పూర్తికాగా, 16,74,681 ఎన్యూమరేషన్ ఫారాలు డిజిటైజ్ చేయడం ద్వారా 90.68 శాతం, ఇప్పటికే ఉన్న ఏ ఎస్ డి డి డేటాతో కలిపి మొత్తం 99.75 శాతం డిజిటైజేషన్ పూర్తయిందని తెలిపారు. మిగిలిన ప్రక్రియను కూడా నిర్ణీత గడువులో పూర్తి చేసి జిల్లాలో తప్పులేని ఓటరు జాబితాను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## గోపులంకలో ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్థులు

**తాళ్లరేవు (మనసులో మాట), జూలై 14:**

మండల పరిధిలోని గోవలంక, పిల్లంక ఇసుక ర్యాంపులనుంచి యదేచ్ఛగా ఇసుకను గౌతమి గోదావరి ఏటిగట్టుపై తరలిస్తున్న లారీలను స్థానికులు మంగళవారం రాత్రి అడ్డుకున్నారు. ఇరుకుగా ఉండే ఈ రహదారిలో అధిక సంఖ్యలో లారీలు వేగంగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక గ్రామాలైన గోపులంక, గోపాలపురం, పిల్లంక గ్రామాలకు చెందిన ప్రజలు రహదారిపై ఆందోళనకు దిగారు. లారీలను నిలిపివేసి నినాదాలు చేసారు. నిత్యం అనేక లారీలు వేగంగా సంచరిస్తుండడంతో రహదారిపై వెళ్లాలంటేనే భయమేస్తుందని వాపోతున్నారు. అధికారులు, పోలీసులు మామూళ్ల మత్తులో జోగుతూ పట్టించుకోవడంలేదని, లారీల కారణంగా ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక లారీలను నియంత్రించాలని కోరుతున్నారు.



# కార్మికులకు ఆధునిక వైద్య సేవలు

**(మొదటిపేజీ తరువాయి)**



ఇ ఎస్ ఐ భవనాన్ని కూడా ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ, నూతన ఆసుపత్రి ద్వారా రాజమహేంద్రవరం, పరిసర ప్రాంతాల కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలో సుమారు రూ.75 కోట్ల వ్యయంతో నిర్మించిన 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రి నూతన భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కార్మికుల ఆరోగ్యం, భద్రత, సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమం కోసం అనేక సంస్కరణలు అమలు చేస్తున్నాయన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా యాజమాన్యాలు అన్ని రకాల భద్రతా చర్యలు చేపట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. నూతన కార్మిక చట్టాల అమలుతో ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున అవసరమైన మేరకు వైద్యుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ వర్చువల్‌గా మాట్లాడుతూ, వికసిత్ భారత్ లక్ష్య సాధనలో కార్మికులు, యువత కీలక శక్తులని పేర్కొన్నారు. దేశ నిర్మాణంలో కార్మికుల పాత్ర అమూల్యమని, వారి సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈఎస్ఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన వైద్య సదుపాయాల ద్వారా దేశవ్యాప్తంగా 50 లక్షలకు పైగా కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ప్రయోజనం పొందనున్నారని తెలిపారు. సామాజిక భద్రత, మెరుగైన ఉపాధి అవకాశాలు, నాణ్యమైన వైద్య సేవలు అందించడం కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. మహిళల ఉపాధి భాగస్వామ్యం పెరుగుతోందని, వారికి సమాన పనికి సమాన వేతనం కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ఈఎస్ఐసీ జోనల్ మెడికల్ కమిషనర్ డాక్టర్ అషిత్ ముల్లిక్ మాట్లాడుతూ, సుమారు రూ.70 కోట్ల వ్యయంతో 13,376 చదరపు మీటర్ల విస్తీర్ణంలో గ్రౌండ్‌తో పాటు రెండు అంతస్తుల్లో ఆసుపత్రి భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. 26 ప్రత్యేక ఔట్ పేషెంట్ విభాగాలు, మూడు ఆధునిక మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు, అత్యవసర ఆపరేషన్ థియేటర్, సమగ్ర ఐసీయూ, శస్త్రచికిత్సల ముందు, అనంతర వార్డులతో కూడిన అత్యాధునిక వైద్య సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో మృతి చెందిన కార్మికుల కుటుంబ సభ్యులకు మంజూరైన నెలవారీ పెన్షన్ మంజూరు పత్రాలను మంత్రి సుభాష్ అందజేసి, వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీస్ డైరెక్టర్ వి. ఆంజనేయులు, ఈఎస్ఐసీ రీజనల్ డైరెక్టర్ ఎం. రామారావు, నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ కోటేశ్వరరావు, ఈఎస్ఐసీ జాయింట్ డైరెక్టర్ ప్రణవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన సేవలను అందించండి

**కాకినాడ (మనసులో మాట) జూలై 14**



అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు చిన్నారులకు నాణ్యమైన సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఐసిడిఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశపు మందిరం నందు మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ కు చెందిన సిడిపిఒలతో అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలపై జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రియ తో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు.అంగన్వాడి కేంద్రాల ద్వారా చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, అంగన్వాడి కేంద్రాల, అంగన్వాడి కేంద్రాల్లో తాగునీరు మరుగుదొడ్ల నిర్వహణ,పాజిటివ్ పబ్లిక్ పర్సెక్షన్, చిన్నారులకు ఆటపాటలతో వివిధ కృత్యాలు నేర్పించడం, సీడీపీవోల పరిధిలోని అంగన్వాడి కేంద్రాలు తనిఖీ వంటి అంశాలపై జిల్లా కలెక్టర్ ఐసీడీఎస్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 1986 అంగన్వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన సేవలను అందించాలనే లక్ష్యంతో సిడిపిఓ లు ప్రత్యేక శ్రద్ధ తో పనిచేయాలన్నారు. 05 పిల్లలకు పోషకాహారం ను అందించడం ద్వారా వారిలో బరువు,ఎత్తు పెరుగుదల (గ్రోత్) కు సంబంధించి ప్రతి నెల బరువు,ఎత్తు ను చెక్ చేయాలన్నారు.అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు అందుతున్న సేవలను మరింత పటిష్టం చేయాలని,ముఖ్యంగా పౌష్టికాహార పంపిణీలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహార నాణ్యతపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని, అంగన్వాడి కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్ల వంటి కనీస సౌకర్యాల నిర్వహణలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. చిన్నారులకు అందిస్తున్న పాలు, గుడ్లు, బాలామృతం ఇతర పౌష్టిక ఆహారం చిన్నారులందరికీ సకాలంలో అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యాభ్యాసం, వారిలో సృజనాత్మకతను పెంపొందించే కృత్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో ప్రతి మాసంలో మూడవ వారం తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి అంగన్వాడీ కేంద్రానికి వచ్చి పిల్లలకు అందిస్తున్న సేవలపై వారికి వివరించాలని, దీనితోపాటు చిన్నారుల పెరుగుదలకు వారి తల్లిదండ్రులు తీసుకోవలసిన అంశాలపై కూడా వివరించాలన్నారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా చిన్నారులు అందిస్తున్న సేవలపై లబ్ధిదారులలో సానుకూల దృక్పథాన్ని పెంపొందించే విధంగా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.సీడీపీఓ లు తమ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తూ, క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ఐసీడీఎస్ పీడీ సీహెచ్.లక్ష్మి, ఐసీడీఎస్ ప్రాజెక్టుల సీడీపి ఓ లు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పూజ్య గురువులు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావు జన్మదినోత్సవం

- (జులై 14)సందర్భంగా...

**కాకినాడ (మనసులో మాట) జులై 14**

బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు తెలుగు సమాజంలో ఎనలేని గౌరవ ప్రతిష్టలు కలిగిన గొప్ప ప్రవచనకర్త. సనాతన ధర్మాన్ని, భారతీయ సంస్కృతిని సామాన్యులకు సైతం అర్థమయ్యేలా చేర్చడంలో ఆయన చేస్తున్న కృషి అసాధారణమైనది. మానవ ధర్మం మీద ఆసక్తితో అష్టాదశ పురాణములను అధ్యయనము చేసి, తనదైన శైలిలో సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో ప్రవచనాలను అందిస్తూ, భక్త జన మనసులను దోచుకుని ఏ ప్రవచనం చెబుతున్నా ఆ భగవత్ తత్వంలో మునిగిపోయిన తాదాత్మ్యత చాగంటి వారిలో కనిపిస్తుంటుంది. అసాధారణ ధారణాశక్తి, మందాకినీ ప్రవాహం వంటి వాక్కు. విద్యకు పరమావధి అయిన వినమ్రత, శిశుహృదయాన్ని తెలియజేసే నిష్కల్మష దరహాసం, ధర్మమునందు అనురక్తి ఇలా ఎన్నో సుగుణాల సమాహారం ఒక తేజోమయ రూపంగా ఆయనలో ప్రవేశించి మన మనస్సులను ఆయన వైపు ఆకర్షిస్తుండవచ్చు. వీటన్నింటినీ మించిన కారణం కూడా ఒకటుందనిపిస్తుంది. అది చాగంటి వాగింద్రియానికి మన శ్రోత్రేంద్రియానికీ లభించిన ఈశ్వరకటాక్షం. ఇవాళ సినిమా హీరోలలో అగ్రహీరోలకు ఏమాత్రం తీసిపోని పేరుప్రఖ్యాతులు కలిగిన ప్రవచనకారుడు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావు. గత పదిహేనేళ్లలో ఆయన సాధించిన ప్రతిష్ఠ మరే ఇతర ఆధ్యాత్మిక వేత్తలకు దక్కలేదు అనేది నిస్సందేహం. అఖండ ప్రజ్ఞావంతుడు, పండితుడు, వేదమూర్తి చాగంటి. ఆయన ఎంతటి ఖ్యాతి గడించారు.

**బాల్యం :** చాగంటి కోటేశ్వరరావు ఒక ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త. అతను తూర్పు గోదావరి జిల్లా కాకినాడ వాస్తవ్యులు. ఆయన తండ్రి చాగంటి సుందర శివరావు, తల్లి సుశీలమ్మ. 1959 జూలై 14వ తేదిన జన్మించారు. చాగంటి కి ఆరేడేళ్ల వయసులోనే తండ్రి గతించారు. ఆయనకు ముగ్గురు తోబుట్టువులు.ఒక అక్క, ఒక చెల్లెలు, ఒక తమ్ముడు ఉన్నారు. తల్లి కష్టపడి నలుగురు పిల్లలను పెంచి పెద్ద చేసారు. వారికి ఆస్తిపాస్తులు లేవు. కడు పేద కుటుంబం. సంసారానికి తాను మాత్రమే పెద్ద దిక్కు అని తెల్సుకున్న చాగంటి అహోరాత్రాలు కష్టపడి విద్యను అభ్యసించారు. పాఠశాల స్థాయినుంచి యూనివర్సిటీ స్థాయివరకు గోల్డ్ మెడలిస్టుగా ఎదిగారు.కోటేశ్వరరావు సతీమణి సుబ్రహ్మణ్యేశ్వరి. వీరికి ఇద్దరు పిల్లలు అతను ధారణ శక్తి, జ్ఞాపకశక్తి చెప్పుకోదగ్గవి. మానవ ధర్మం మీద ఆసక్తితో అష్టాదశ పురాణములను అధ్యయనము చేసి, తనదైన శైలిలో సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో ప్రవచనాలను అందిస్తూ, భక్త జన మనసులను దోచుకున్నారు. ఉపన్యాస చక్రవర్తి, శారదా జ్ఞాన పుత్ర, ఇత్యాది బిరుదులను అందుకున్నారు.

**ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో మేనేజర్ గా**

చాగంటి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో మేనేజర్ గాపనిచేసారు .ఆయన భార్య వ్యవసాయ శాఖ లో ఉన్నతాధికారిణి. చాగంటి ఆఫీసుకు సాధారణంగా సెలవు పెట్టరు. ఒక్కసారి కూడా లేట్ పెర్మిషన్స్ తీసుకోరు. ప్రవచనాలకు అతను పారితోషికం తీసుకోరు. తన విద్యను రాజులకు అమ్ముకోని వారిలో అప్పట్లో బమ్మెర పోతన తరవాత చాగంటి వారే అని చెప్పాలి.ఎక్కడికైనా బయట నగరాలకు వెళ్లి ప్రవచనాలు ఇవ్వాల్సివస్తే అతను తన సొంత డబ్బుతో టికెట్ కొనుక్కుని ప్రయాణం చేస్తారు తప్ప నిర్వాహకుల నుంచి డబ్బు తీసుకోడు . ఇంతవరకు అతనుకు కారు లేదు. ఆఫీసుకు కూడా మోటార్ సైకిల్ మీద వెళ్తారు.

**ధారణాశక్తి :**

అతను ధారణాశక్తి గొప్పది. ఒకసారి శంకరుల సౌందర్యలహరి తిరగేస్తే అది మొత్తం అతను మదిలో నిలిచిపోతుంది. ఎక్కడ ఏ పేజీలో ఏమున్నదో చెప్పగలరు.

**కుటుంబ బాధ్యతలు:**

అతను ఉద్యోగంలో చేరాక తోబుట్టువుల బాధ్యతను స్వీకరించారు. అక్క, చెల్లెలు, తమ్ముడుకు తానే తన సంపాదనతో వివాహాలు చేశారు. కుటుంబం కోసం తన కష్టార్జితాన్ని మొత్తం ధారపోశాడు. అప్పుడప్పుడు కాకినాడలో అయ్యప్ప దేవాలయంలో సాయంత్రం కూర్చుని భక్తులముందు భారత భాగవత ప్రవచనాలు ఇచ్చేవారు. ఏనాడూ డబ్బు పుచ్చుకునే వాడు కాదు. అతను స్వరలాలిత్యం, ధారణ, విజ్ఞానం, విశదీకరణ భక్తులను ఆకర్షించాయి. అభిమానులు పెరిగారు. చాగంటి వేదవేదాంగాలు, పురాణాలు, ఉపనిషత్తులు అవపోసన పట్టారని చాలామంది పొరపడతారు. కానీ అవన్నీ ఆయనకు పూర్వజన్మ సుకృతంగా లభించినవి అని, ఇది వారికి భగవంతుడు ఇచ్చిన వరం అని చెప్పాలి. ఎందుకంటే ఎంత సాధన చేసిన ఇలాంటి విషయాలు ఎక్కువకాలం గుర్తుండవు. కానీ చాగంటి లాంటి వరప్రసాదితులకు మాత్రమే ఇది సాధ్యం.

**పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో**

ఎక్కడో ఒకచోట చాగంటి ని కలిశారు. మీ గురించి ఎంతో విన్నాను. మీ ఆధ్యాత్మిక పరిజ్ఞానం అసాధారణం. మీ ప్రవచనాలు నాకు బాగా నచ్చాయి. ముఖ్యంగా మీ పాండితీప్రకర్ష అమోఘం. ఇప్పుడు నేను మంచి స్థితిలో ఉన్నాను. ఏమైనా అడగండి. చేసిపెడతాను అన్నారు. పీవీ.చాగంటి నవ్వేసి మీకూ, నాకు ఇవ్వాల్సింది ఆ పరమాత్మే తప్ప మరెవరూ కారు. మీ సహృదయానికి కృతజ్ఞతలు. నాకేమీ ఆశలు లేవు.అని నమస్కరించి బయటకు వెళ్లిపోయారు.

**బయట ప్రాంతాల్లో:**

అతను బయట ప్రాంతాల్లో ప్రవచనాలు ఇవ్వడం వారి అమ్మగారు 1998 లో స్వర్గస్తులు అయ్యాక ప్రారంభించారు. ఎందుకంటే చాగంటి వంశంలో గత ఆరు తరాలుగా ఆ సరస్వతి కటాక్షం ఎవరో ఒక్కరికే వస్తున్నది. ఈ తరంలో ఆ శారదాకృప నలుగురు పిల్లలలో చాగంటి కోటేశ్వర రావుపై ప్రసరించింది. ఆ మాత దయను తృణీకరించలేక తనకు తెలిసిన జ్ఞానాన్ని లోకానికి పంచుతున్నారు చాగంటి.

**ప్రవచనాలు:**

చాగంటి కోటేశ్వర రావు ప్రసంగించిన ప్రవచనాలు సంపూర్ణ రామాయణము, ఇవి బాల కాండ నుండి పట్టాభి షేకము వరకు చెప్పబడ్డాయి. శివ పురాణములోని భక్తుల కథలు, మార్కండేయ చరిత్ర, నంది కథ, జ్యోతిర్లింగ వర్ణన, లింగావిర్భావము, రమణ మహర్షి జీవితము మొదలైన అనేక విషయాలు చోటు చేసుకున్నాయి. విరాట పర్వము అనే ప్రవచనంలో భారతము లోని అజ్ఞాత వాస పర్వము వివరించబడింది. భాగవతము అనే ప్రవచనంలో భాగవతుల కథలు, కృష్ణావతారం యొక్క పూర్తి కథ చోటు చేసుకుంది. భాగవత ప్రవచనాలలో ప్రథమముగా శ్రీకృష్ణ నిర్యాణం,



పాండవుల మహాప్రస్థాన కథ చోటు చేసుకున్నాయి. సౌందర్య లహరి ఉపన్యాసాలు ఆదిశంకరాచార్య విరచిత సౌందర్యలహరికి వివరణ ఉంది. శిరిడీ సాయి బాబా కథ చోటు చేసుకుంది. ఇంకా రుక్మిణీ కల్యాణం, కనకధారాస్తోత్రం, గోమాత విశిష్టత, భజగోవిందం, గురుచరిత్ర, కపిల తీర్థం, శ్రీరాముని విశిష్టత, తిరుమల విశిష్టత, హనుమజ్జయంతి, హనుమద్వైభవం, సుందరకాండ, భక్తి, సామాజిక కర్తవ్యం, శంకరాచార్య జీవితం, శంకర షట్పది, సుబ్రహ్మణ్య జననం మొదలైన ప్రవచనాలు చేసారు కోటేశ్వర రావు. అతను తన వాక్పటిమతో హృద్యమైన ప్రవచనములను చేసి ప్రముఖుల నుండి ప్రశంసలు అందుకున్నారు.

**అద్భుతమైన వాగ్ధాటి, జ్ఞాపకశక్తి**

చాగంటి ప్రవచనాల శైలి చాలా విలక్షణమైనది. ఎలాంటి కాగితాలు, పుస్తకాలు ముందర పెట్టుకోకుండా రామాయణ, మహాభారత, భాగవతాది గ్రంథాలలోని వేల శ్లోకాలను, వాటి అర్థాలను, ఘట్టాలను నోటిపాఠంగా చెబుతుంటే వినేవారు మంత్రముగ్ధులవుతారు.ఆయన గంభీరమైన కంఠస్వరం, స్పష్టమైన ఉచ్చారణ వినేవారిని ఆ కాలంలోకి తీసుకెళ్తాయి.

**ధర్మాన్ని నిత్యజీవితానికి ముడిపెట్టడం**

పురాణ కాలం నాటి విషయాలను కేవలం కథలుగానే కాకుండా, ప్రస్తుత సమాజానికి అవి ఎలా ఉపయోగపడతాయో ఆయన వివరిస్తారు. తల్లిదండ్రులను ఎలా గౌరవించాలి? భార్యాభర్తల బంధం ఎలా ఉండాలి? సమాజంలో ఒక వ్యక్తి బాధ్యత ఏమిటి? వంటి నిత్యజీవిత అంశాలను పురాణ పాత్రల ద్వారా విడమర్చి చెబుతూ, ఎంతోమంది యువతను సన్మార్గంలో పెట్టారు.

**నిస్వార్థ సేవ:**

చాగంటి గొప్పతనంలో అత్యంత కీలకమైనది ఆయన నిస్వార్థత. ఆయన తన ప్రవచనాలను ఎప్పుడూ ఒక వ్యాపారంగా మార్చుకోలేదు. ప్రవచనాలు చెప్పినందుకు ఆయన ఎలాంటి పారితోషికం (డబ్బు) ఆశించరు, తీసుకోరు.ధర్మ ప్రచారం కోసమే తన జీవితాన్ని అంకితం చేశారు.

**సేవా కార్యక్రమాలు:**

కేవలం మాటలతోనే కాకుండా చేతల్లోనూ ఆయన తన ధర్మాన్ని చూపిస్తారు. గోసంరక్షణ (ఆవులను కాపాడటం), పేద విద్యార్థులకు విద్యాదానం, ఆకలితో ఉన్నవారికి అన్నదానం వంటి అనేక సామాజిక, సేవా కార్యక్రమాలను ఆయన తన ప్రవచనాల ద్వారా వచ్చే విరాళాలతో (ట్రస్ట్ ద్వారా) నిర్వహిస్తున్నారు.

**ప్రభుత్వ సలహాదారుగా:**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యార్థులు నైతిక విలువల ప్రభుత్వ సలహాదారుగా ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావుని నియమించారు. కేబినెట్ ర్యాంక్‌తో రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు.చాగంటి కోటేశ్వరరావుతో ప్రత్యేకంగా పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు పుస్తకాలు తయారు చేయించి పంపిణీ చేయుచున్నారు.

## అందుకున్న పురస్కారాలు...

శారదా జ్ఞాన పుత్ర
వాచస్పతి పురస్కారం
పిన్నమనేని పురస్కారం లాంటి విశిష్ట పురస్కారాలు ఎన్నో అందుకున్నారు.

అచ్చమైన, స్వచ్ఛమైన తెలుగులో మాట్లాడే వారే కరువైపోతున్నారు. అలాంటిది స్వచ్ఛమైన భాషలో, నిబద్ధతో మాట్లాడ గల దిట్ట చాగంటి . వీరికి భాష పై ఉన్న పట్టు అపారం. విషయంతో పాటు నిక్షిప్త, నిగూఢార్థాలు తెలిసుకున్నవారు, వీరికి వాక్ సుద్ధి ఉంది. వీరు ప్రసంగించి నప్పుడు జనాలు మంత్ర ముగ్ధులు అవటం ఖాయం పండితులు, పామరులు అందరూ హర్షిస్తారు.విషయాన్ని అంత సూటిగా, సరళముగా జనముందుంచుతారు. ఆలోచింప చేయిస్తారు. ఇది అసామాన్యమైన విషయం.చాగంటి కోటేశ్వర రావు కేవలం ఒక ప్రవచనకర్త మాత్రమే కాదు. తెలుగు నాట సనాతన ధర్మానికి, నైతిక విలువలకి నిలువెత్తు రూపం. ఆధునిక కాలంలోనూ మన సంస్కృతిని, సంప్రదాయాలను తర్వాతి తరాలకు అందిస్తున్న గొప్ప మార్గదర్శి.పాశ్చాత్య సంస్కృతి వైపు పరుగులు పెడుతున్న తెలుగు సమాజానికి, మన మూలాలను గుర్తు చేస్తూ, సనాతన ధర్మం వైపు నడిపిస్తున్న ఒక గొప్ప దిక్సూచి



## వాడపల్లి వెంకన్న ఆలయ అన్నదాన పథకానికి రూ, లక్ష విరాళం

**కొత్తపేట (మనసులో మాట )జూలై 14**

కోనసీమ తిరుమల గా బాసిల్లుతున్న వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే నిత్యన్నదానపథకానికి అమలాపురం చెందిన నిరిగినీడి వెంకన్న నాయుడు, ఈశ్వరమ్మ దంపతులు రూ,1,01,116 డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు కు అందజేశారు దాతలకు స్వామివారి ప్రత్యేక దర్శనం చేయించి తీర్థప్రసాదాలు, వేదా ఆశీర్వచనం, స్వామి చిత్రపటాన్ని అందజేశారు.



## చేతులు కట్టుకోవద్దు... కాళ్లు పట్టుకోవద్దు

- **పెద్దాపురంలో వినూత్న ఫ్లెక్సీ..**

**పెద్దాపురం (మనసులో మాట) జూలై 14;**

రెవెన్యూ కార్యాలయానికి వచ్చే ప్రజలు చేతులు కట్టుకోవద్దు... కాళ్లు పట్టుకోవద్దు అంటూ పెద్దాపురం రెవెన్యూ కార్యాలయం వద్ద ఏర్పాటు చేయబడిన ఒక ఫ్లెక్సీ ప్రజలను ఆశ్చర్య చకితులు చేస్తోంది. ఇటీవల పెద్దాపురం తహశీల్దార్ గా బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ శ్రీనివాస్ రెవెన్యూ కార్యాలయ గోడ పై ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ పెద్దాపురం డివిజన్లో హాట్ టాపిక్ గా మారింది. ఈ కార్యాలయం మన అందరిదీ, ఇక్కడ అధికారులను మీరు కలిసే సమయంలో.... చెప్పులు విడవకండి, చేతులు కొట్టుకొని ఒంగి నిలుచోవద్దు, కన్నీళ్లు పెట్టుకోకండి, కాళ్లు పట్టుకోకండి, ఆత్మగౌరవంతో మీ సమస్యలను స్పష్టంగా వివరించండి..అంటూ ... ఏర్పాటు చేయటం పట్ల సర్వత్ర హర్షం వ్యక్తం అవుతుంది. కార్యాలయానికి వచ్చే ప్రజలకు తహశీల్దార్ శ్రీనివాస్ చేసిన విజ్ఞప్తి ప్రజల హృదయాల్లో సరికొత్త ఆలోచనలకు నాంది పలికింది. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా ప్రజల పట్ల అధికారులు ఇలా వ్యవహరిస్తే సమాజం మంచి పురోగతి సాధిస్తుంది.



# సాగునీటి సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

- **రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలి : జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్**

**అమలాపురం(మనసులోమాట) జూలై 14,**



జిల్లాలో సాగునీటి సమస్యల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించినా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ, నీటిపారుదల శాఖ అధికారులు, కాంట్రాక్టర్లతో కలిసి నియోజకవర్గ, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో సాగునీటి పంపిణీకి సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన, ఉప కాలువల్లో నీటి ప్రవాహం, నీటి ఒత్తిడి, దిగువ ప్రాంతాలకు సాగునీటి సరఫరా పరిస్థితిని నిరంతరం పరిశీలించాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో నీటి ఒత్తిడి తగ్గడం, లోతట్టు ప్రాంతాలకు నీరు సక్రమంగా చేరకపోవడం వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. కాలువల్లో ఎలాంటి అవరోధాలు లేకుండా నీటి ప్రవాహం కొనసాగేందుకు అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, పొలాలకు అవసరమైన మేరకు సాగునీరు అందేలా కాలువల నిర్వహణను మెరుగుపరచాలని తెలిపారు. రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సూచించారు.

దిగువ ప్రాంత రైతులకు కూడా సమానంగా సాగునీరు అందేలా నీటి పంపిణీ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని, రాబోయే రెండు రోజుల్లో నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు పరస్పర సమన్వయంతో కాలువల్లో పూడిక పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే జిల్లాలో నూతనంగా నిర్మించిన వంతెనల వద్ద పేరుకుపోయిన పూడికను తొలగించేందుకు వ్యవసాయ, నీటిపారుదల, జాతీయ రహదారుల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గోదావరి డెల్టా దిగువ ప్రాంతాలైన కె. గంగవరం, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లో సాగునీరు సక్రమంగా అందకపోవడంతో ఖరీఫ్ పంటలకు నష్టం వాటిల్లే పరిస్థితి ఉందని రైతులు పలువురు వినతులు అందజేశారని కలెక్టర్ తెలిపారు. ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన కుర్రపు డెక్కలు, తూములు తదితర అవరోధాలను తొలగిస్తే నీటి ప్రవాహం వేగవంతమై లోతట్టు ప్రాంతాలకు సాగునీరు సమృద్ధిగా చేరుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ, నీటిపారుదల, వ్యవసాయ శాఖల అధికారులు, ఏఈలు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.



## సమాజ సేవ సంకల్పంతోనే టీబీఆర్ సైనిక్ స్కూల్

- **డిఫెన్స్ పరిజ్ఞానాన్ని విద్యార్థులకు అందిస్తున్నాం**
- **విద్యతో పాటు సైన్యంలోకి విద్యార్థులకు శిక్షణ**
- **17 మంది అగ్నివీర్ కు ఎంపిక**
- **టీబీఆర్ సైనిక్ స్కూల్ అధినేత భోగేశ్వర రావు**

**తాడేపల్లిగూడెం (మనసులో మాట జూలై 14 :**

డిఫెన్స్ విభాగంలో తాను చేసిన సేవలను సమాజానికి అందించాలని సంకల్పంతో టీబీఆర్ విద్యా సంస్థను స్థాపించినట్లు ఆ సంస్థ చైర్మన్ తనబుద్ధి భోగేశ్వర రావు తెలిపారు. మంగళవారం పెంటపాడు మండలం అలంపురం టీబీఆర్ సైనిక్ స్కూల్ ఆవరణలో ఆయన విలేకరుల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భోగేశ్వర రావు మాట్లాడుతూ ఇటీవల జరిగిన అగ్నివీర్ పరీక్షకు టీబీఆర్ జూనియర్ కళాశాల నుంచి 20 మంది విద్యార్థులు హాజరు కాగా 17 మంది ఎంపికైనట్లు వివరించారు. గతంలో 12 మంది అగ్ని వీర్ కు ఎంపిక కాగా, ముగ్గురు సైన్యంలోకి వెళ్లినట్లు తెలిపారు. విద్య ద్వారానే పేదరికాన్ని జయించవచ్చని, విద్య ఉపాధికి మార్గం చూపుతుందన్నారు. తమ విద్యాసంస్థలు విద్యతో సైనిక శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా నేషనల్ డిఫెన్స్ అకాడమీ ద్వారా ఆఫీసర్ స్థాయి ఉద్యోగాలకు తర్ఫీదు ఇస్తున్నామన్నారు. ఐఐటి స్థాయి ఉపాధ్యాయులచే విద్యార్థులకు డిఫెన్స్ లో శిక్షణ అందిస్తున్నామన్నారు. ఆఫీసర్లకు అవసరమైన నైపుణ్యాలు, లక్షణాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సైన్యంలో ఉండే సానుకూల, విజయవంత వాతావరణమే తమ పాఠశాలను విద్యార్థులకు అందిస్తున్నట్లు తెలిపారు. సైన్యంతో పాటు విద్యార్థులు ఏ రంగంలోకి వెళ్లిన నిలదొక్కుకునే విధంగా శిక్షణ విద్య బోధన చేస్తున్నామన్నారు. మిలిటరీ అంటే సాధారణంగా భయం ఉంటుందని, అటువంటి భయం అవసరం లేదన్నారు. ధైర్యంగా సైన్యంలోకి చేరవచ్చని పిలుపునిచ్చారు. విద్యార్థులను ఆయన అభినందించారు. అనంతరం విద్యార్థులు తమ ఆకాంక్షలను మీడియాతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సాయి కృష్ణ, పరిపాలన అధికారి నాగరాజు పాల్గొన్నారు.

## ఎండీఎంను సమర్థంగా నిర్వహించాలి

**తాడేపల్లిగూడెం (మనసులో మాట) జూలై 14 :**

మధ్యాహ్న భోజన పథకాన్ని రుచి, నాణ్యతలో రాజీ లేకుండా సమర్థంగా నిర్వహించాలని ఎంఈవో2 టివి రామకృష్ణ సూచించారు. మంగళవారం పెంటపాడు మండలం అలంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, విద్యార్థుల అభిప్రాయాన్ని సేకరించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం, మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాలలను సందర్శిస్తున్నట్లు తెలిపారు. ఇంటి భోజనానికి బదులుగా పాఠశాల భోజనాన్ని విద్యార్థులకు అలవాటు చేస్తున్నామన్నారు. తద్వారా ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంలో అందిస్తున్న పోషకాహారం విద్యార్థులకు చేరుతుందన్నారు. ఎండీఎం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు జోగేశ్వరరావు, స్టాఫ్ సెక్రటరీ కనకారావు ఎండీఎం సిబ్బంది గొర్రెల వెంకటేశ్వరరావు, శ్రీదేవి పాల్గొన్నారు.



# దూరంగా ఉన్నా ప్రజల చెంతనే

- సమస్య ఏదైనా స్పందన తక్షణం
- తాళ్లపాలెం అండర్ బ్రిడ్జిలో నిలిచిన నీటి సమస్యపై
- ముంబయి నుంచే స్పందించిన మంత్రి కందుల దుర్గేష్
- రంగంలోకి దిగిన అధికార యంత్రాంగం
- ముంబయి నుండి తాళ్లపాలెం పరిస్థితిని వీడియో కాల్ లో సమీక్షించి
- యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టడంపై సర్వత్రా హర్షం



**నిడదవోలు (మనసులో మాట) జులై 14**

నిడదవోలు మండలం తాళ్లపాలెం వద్ద ఉన్న అండర్ బ్రిడ్జిలోకి పరిసర ప్రాంతాల చేలు, కాలువ నుండి భారీగా నీరు చేరడంతో తాడేపల్లిగూడెం వెళ్లే మార్గంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.ఈ నేపథ్యంలో ముంబయి పర్యటనలో ఉన్న మంత్రి కందుల దుర్గేష్ కి ఈ విషయంపై సమాచారం అందిన వెంటనే సత్వరమే స్పందించి వీడియో కాల్ లో అక్కడి నుంచే పరిస్థితిని సమీక్షించారు. తక్షణమే క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యను పరిష్కరించాల్సింది గా తన కార్యాలయ సిబ్బందిని, జిల్లా అధికార యంత్రాంగాన్ని, కూటమి నాయకులను ఆదేశించారు.ఈ సందర్భంగా అక్కడ నెలకొన్న పరిస్థితులను మంత్రి దుర్గేష్ స్వయంగా వీడియో కాల్ ద్వారా వీక్షించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. రెండు మూడు రోజులుగా ఈ సమస్యపై చర్చిస్తున్నామని, రాబోయే రోజుల్లో ప్రజలకు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు సత్వర చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.మంత్రి దుర్గేష్ ఆదేశాల మేరకు ఆయన వ్యక్తిగత సిబ్బందితో పాటు ఇరిగేషన్ ఈఈ, నిడదవోలు ఎంపీడీవో ఆంజనేయ శర్మ, తహశీల్దార్ నాయక్ లు, కూటమి నాయకులు తక్షణమే తాళ్లపాలెం గ్రామానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా చేల నుండి నీరు వంతెన క్రిందికి చేరి నిలిచిపోతుండటంతో ఇప్పటికే ఒకట్రెండు పర్యాయాలు తొలగించినప్పటికీ సమస్య పునరావృత మైందని మంత్రికి తెలిపారు. ఈ నేపథ్యంలో మంత్రి దుర్గేష్ ఆదేశాలతో అధికార యంత్రాంగం వంతెన క్రింద నిలిచిన నీటిని తొలగించేందుకు, రాకపోకలను పునరుద్ధరించేందుకు క్షేత్రస్థాయిలో అవసరమైన చర్యలు చేపట్టి పరిస్థితిని చక్కదిద్దారు. మంత్రి దుర్గేష్ ముంబయి పర్యటనలో ఉన్నప్పటికీ సాంకేతికతను ఉపయోగించుకుని స్థానిక సమస్యపై తక్షణమే స్పందించి పరిష్కరించిన తీరు పట్ల తాళ్లపాలెం గ్రామ ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం జై కూటమి అని నినదించారు.





# తనయుడు పుట్టినరోజు సందర్భంగా పేదలకు అన్నసంతర్పణ

**కాకినాడ (మనసులో మాట) జులై 14**

కాకినాడ 49వ డివిజన్ కూటమి నాయకురాలు బండి భోగేశ్వరి తనయుడు బండి నీహార్ అక్షయ్ పుట్టినరోజు సందర్భంగా రాజీవ్ గృహకల్పలో ఉన్న అన్న క్యాంటీన్ నందు పేదలకు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూ , సుపరిపాలనతో ముందుకు దూసుకుపోతున్న కూటమి ప్రభుత్వం దేశంలోనే అగ్రస్థానంలో నిలుస్తుందని అన్నారు. అలాగే మన జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకుని కూటమి ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉంటూ సుపరిపాలనను అందించాలని కోరారు. పేదవాడికి కడుపు నింపుతున్న అన్నా క్యాంటీన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమంది పేద ప్రజలు ప్రతిరోజు ముఖ్యమంత్రి ని తలుచుకుంటూ పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం చేయడం చాలా సంతోషకరమని అన్నారు ఈ కార్యక్రమంలో నాని , బండి సుజాత , దారపు శిరీష , గొల్లపల్లి కుమారి , సబ్బే దీప్తి తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయంగా నాపై బురద జల్లడానికే ఆరోపణలు

- తప్పు చేయలేదు భయపడను న్యాయ పోరాటం చేస్తా
- జగనన్న కాలనీలో పన్నుల పేరుతో అక్రమ వసూళ్లు బయట పెడతాననే తప్పుడు కేసులు
- ఏలేశ్వరంలో జరుగుతున్న అవినీతి,అక్రమాలను ఇకపై ఎండగడతా
- రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు పైలా సుభాష్ చంద్రబోస్



**ఏలేశ్వరం (మనసులో మాట) జులై 14**

తనపై రాజకీయ బురద జల్లడానికే తప్పుడు ఆరోపణలు చేస్తూ అక్రమ కేసులు పెడుతున్నారని,సోమవారం కాకినాడలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో అసత్య ప్రచారాలు చేసారని ఏలేశ్వరం మున్సిపాలిటీ కి చెందిన రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు పైలా సుభాష్ చంద్రబోస్ ఆరోపించారు.మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలో పన్నుల పేరుతో కొంతమంది నాయకులు చేస్తున్న అక్రమ వసూళ్ల వ్యవహారం బయటపడు తుందనే ఉద్దేశంతోనే తనపై తప్పుడు కేసులు పెట్టారని ఆరోపించారు. తన వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని,సమాచార హక్కు చట్టం ద్వారా అన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయని,న్యాయం జరుగుతుందని తెలిపారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని, ఎవరికి భయపడేది లేదని స్పష్టం చేశారు.
తనపై వచ్చిన ఆరోపణల పై న్యాయ పోరాటం చేస్తానని తెలిపారు. ఇకపై ఏలేశ్వరం మున్సిపాలిటీ లో జరుగుతున్న అవినీతి,అక్రమాలను ఆధారాలతో ప్రజల ముందుకు తీసుకొస్తానని పైలా సుభాష్ చంద్రబోస్ అన్నారు.

# సిపిఎం మాజీ కార్పొరేటర్ గోళ్ళమూడి నాగేశ్వరరావు ప్రథమ వర్ధంతి నివాళి

**కాకినాడ (మనసులో మాట) జులై 14**



కాకినాడ నగర పాలక సంస్థ లో సిపిఎం తరపున కార్పొరేటర్ గా పనిచేసిన గోళ్ళమూడి నాగేశ్వరరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఉదయం సుందరయ్య భవన్ లో ఘనంగా నివాళులు అర్పించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు జి. బేబీరాణి, నగర కమిటీ సభ్యులు కె. సత్తిరాజు లు ముందుగా గోళ్ళమూడి చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు.ఈ సందర్భంగా సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ తెనాలి లో జన్మించిన గోళ్ళమూడి నాగేశ్వరరావు వృత్తి రీత్యా ఉపాధ్యాయుడు కావడం వల్ల తూర్పుగోదావరి జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పనిచేసి విద్యార్థుల మనస్సుల్లో చెరగని ముద్ర వేసారన్నారు.ఒకవైపు ఉపాధ్యాయ సంఘం యుటిఎఫ్ లో పనిచేస్తూ మరొక వైపు జన విజ్ఞాన వేదిక లో క్రియాశీలక పాత్ర పోషించారని కొనియాడారు. రిటైర్డ్ అయిన తరువాత కాకినాడ నగర పాలక సంస్థ లో 49 వ డివిజన్ కార్పొరేటర్ గా సేవలందించి ప్రజల మన్ననలు పొందారన్నారు. అదేవిధంగా సుందరయ్య భవన్ నిర్మాణ కమిటీ కన్వీనర్ గా కృషి చేసారని తెలిపారు.కె. సత్తిరాజు మాట్లాడుతూ కమ్యూనిస్టు కుటుంబంలో జన్మించిన గోళ్ళమూడి పార్టీ సిద్ధాంతాలను, తీర్మానాలను అనుసరించడం, తన అభిప్రాయాలను సూటిగా చెప్పడం, యువతను ప్రోత్సాహం చించడం జరిగిందన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అక్షర గోదావరి ఉద్యమంలో కో ఆర్డినేటర్ గా విశేషమైన కృషి చేసారని కొనియాడారు. జన విజ్ఞాన వేదిక ప్రారంభించిన రాష్ట్ర బృందం లో గోళ్ళమూడి నాగేశ్వరరావు ఒకరిని తెలిపారు.సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు సిహెచ్. రాజ్ కుమార్ ఈ సందర్భంగా అంతర్జాతీయ,జాతీయ రాజకీయ పరిణామాలు వివరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కె. ఎస్. శ్రీనివాస్, నగర కమిటీ సభ్యులు మలక వెంకటరమణ, నాగాబత్తుల సూర్యానారాయణ లతో పాటు చంద్రమళ్ళ పద్మ, టి. రాణి, ఎం. హరనాథ్, కె. చిట్టిబాబు, జి. ప్రసాద్, అనపర్తి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు. మేడిశెట్టి వెంకటరమణ వందన సమర్పణ చేశారు.

# పుష్కరాల ఏర్పాట్లపై ఎస్పీ జేసితో కలిసి క్షేత్రస్థాయిలో విస్తృత పరిశీలన

- **పుష్కర్ నగర్లు, పార్కింగ్ స్థలాల ఏర్పాటుకు ముందస్తు కార్యాచరణ**
- **జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి**

**రాజమహేంద్రవరం (మనసులో మాట) జులై 14**

రానున్న గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లపై క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు.మంగళ వారం కొవ్వూరు డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలను జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, కొవ్వూరు ఆర్డీవో కె ఆనందరావు, పుష్కర్ డిప్యూటీ కలెక్టర్ మనోజ్ రెడ్డి, ఏ ఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్, డీఎస్పీ డి. దేవకుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు కలిసి సందర్శించి పరిస్థితులను పరిశీలించారు.ఈ సందర్భంగా దొమ్మేరు శివారులోని ప్రైవేట్ భూములు, దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే, గ్రీన్ ఫీల్డ్ టోల్ గేట్, దేవరపల్లి డైమండ్ జంక్షన్, ప్రక్కిలంక ఘాట్, పైడిమట్ట గ్రామం, తాళ్లపూడి, కుమారదేవం తదితర ప్రాంతాల్లో పుష్కర్ నగర్లు, వాహన పార్కింగ్ స్థలాలు, ట్రాఫిక్ మళ్లింపు మార్గాలు, భక్తుల రాకపోకలకు అనువైన ప్రాంతాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు.

జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ పుష్కరాల సమయం లో లక్షలాది మంది భక్తులు జిల్లాకు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి ఏర్పాటును ముందస్తుగా శాస్త్రీయంగా ప్రణాళికాబద్ధం గా రూపొందిస్తున్నామని తెలిపారు. భక్తులకు తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సేవలు, తాత్కాలిక వసతి, మరుగుదొడ్లు, రవాణా, పార్కింగ్, భద్రత వంటి అన్ని సౌకర్యాలు సమర్థవంతంగా అందుబాటులో ఉండేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పుష్కర్ నగర్ల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను ఎంపిక చేసే సమయంలో వరద ముప్పు, భద్రత, రవాణా సౌలభ్యం, అత్యవసర సేవలు చేరుకునే అవకాశం వంటి అంశాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో ప్రతి పనిని నిర్ణీత గడువులో పూర్తి చేసి, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం పుష్కర స్నాన ఘట్టాలను సందర్శించిన అధికారులు ఘాట్ల వద్ద నీటి లోతు, ప్రవాహ పరిస్థితులు, భద్రతా ప్రమాణాలు, ఘాట్ల విస్తరణ అవసరం, బ్యారికేడింగ్, హెచ్చరిక బోర్డులు, లైటింగ్ తదితర అంశాలను పరిశీలించారు. స్థానిక ప్రజలు, మత్స్యకారులు, గ్రామ పెద్దల నుంచి గత పుష్కరాల అనుభవాలు, నీటి మట్టం మార్పులు, ప్రమాదకర ప్రాంతాలపై సమగ్ర వివరాలు





సేకరించి వాటి ఆధారంగా కార్యాచరణ చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఘాట్ల వద్ద తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, మరుగుదొడ్లు వంటి మౌలిక సదు పాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధంగా వైద్య, అగ్నిమాపక, రెవెన్యూ, పోలీసు శాఖల సమన్వయ ప్రణాళిక సిద్ధం చేయాలి.రద్దీ అధికంగా ఉండే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ట్రాఫిక్ మళ్లింపు ప్రణాళిక రూపొందించాలి. స్థానిక సంస్థలు, గ్రామస్థుల సహకారంతో అవసరమైన సమాచారం సేకరించి కార్యాచరణను మరింత సమర్థవంతం గా రూపొందించా లన్నారు.

### భక్తుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం

**జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్**

జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ మాట్లాడుతూ పుష్కరాల సందర్భంగా భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్ వ్యవస్థ, అత్యవసర స్పందన బృందాలు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, డ్రోన్ నిఘా, పోలీసు బందోబస్తు తదితర అంశాలపై ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి ఘాట్ వద్ద భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అన్ని శాఖలతో సమన్వయంగా పనిచేస్తామని చెప్పారు.

### జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ సూచనలు

జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ అధికారులకు పలు సూచనలు చేశారు. పుష్కర్ నగర్ల ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ, ప్రైవేట్ భూములను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి. పార్కింగ్ స్థలాలకు స్పష్టమైన ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు ఏర్పాటు చేయాలి. ఈ పరిశీలనలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ, పోలీసు, రోడ్లుభవనాలు, పంచాయతీరాజ్, జాతీయ రహదారుల శాఖ, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖలు, ఇతర సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## జూలై 17వ తేదిన రాజమహేంద్రవరం మోడల్ కెరీర్ సెంటర్లో జాబ్ మేళా

- **నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు**
- **జిల్లా ఉపాధి అధికారి: సి హెచ్ శిరీష**

**రాజమహేంద్రవరం (మనసులో మాట) జులై 14**



తూర్పు గోదావరి జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాజమండ్రి అర్బన్ నియోజకవర్గంలోని ఉపాధి కార్యాలయం ప్రాంగణంలో జూలై 17వ తేదీ (శుక్రవారం) ఉదయం 9 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సిహెచ్. శిరీష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో ప్రముఖ టీ వి ఎస్ లూకాస్ , జోయాలుక్కాస్ జ్యువలరీ కంపెనీలలో పలు పోస్టల భర్తీకొరకు ఇంటర్వ్యూలు నిర్వహించబడనున్నాయని ఆయన తెలిపారు. ఇంటర్ నుండి ఏదైనా డిగ్రీ పూర్తి చేసి అనుభవం ఉన్న లేదా ఆశక్తి గల 19 నుండి 40 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులని వివరించారు.

ఎంపికైన వారికి తక్షణమే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు నేరుగాemployment.ap.gov.in లింక్ ద్వారా తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ అయి, రెజ్యూమే, ఆధార్ సంబంధిత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో సిద్ధంగా మేళాకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9533221189 నంబర్‌ను సంప్రదించవచ్చని జిల్లా ఉపాధి అధికారి సిహెచ్ శిరీష తెలిపారు.

## ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పారా లీగల్

- **వాలంటీర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం**

**రాజమహేంద్రవరం (మనసులో మాట) జులై 14**

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూఢిల్లీ రూపొందించిన పారా లీగల్ వాలంటీర్స్ (పి ఎల్ వి ) పథకం కింద ఒక సంవత్సరం కాలపరిమితికి (నియామకం తేదీ నుంచి) పారా లీగల్ వాలంటీర్లుగా పనిచేయ డానికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నివాసుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు (ఇంచార్జి) జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు ,జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎల్. వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు మెట్రిక్యులేషన్ లేదా దానికి సమానమైన విద్యార్హత కలిగి ఉండాలి. అలాగే 18 సంవత్సరాలు పూర్తి చేసి ఉండాలి. అభ్యర్థుల ఎంపిక మౌఖిక ఇంటర్వ్యూ ద్వారా నిర్వహించబడుతుంది. దరఖాస్తులను సమర్పించడానికి చివరి తేదీ 18 ఆగస్టు 2026. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, రాజమహేంద్రవరం లో 50 నుంచి 100 మంది వరకు, అలాగే అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రపురం, రాజోలు, తుని, ఆలమూరు, ముమ్మిడివరం, కొత్తపేట, అనపర్తి, ప్రత్తిపాడు, రంపచోడవరం, అడ్డతీగల మండల న్యాయ సేవాధికార కమిటీల పరిధిలో ప్రతి మండలానికి 25 నుంచి 50 మంది వరకు పారా లీగల్ వాలంటీర్లను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

దరఖాస్తు ఫారాలు పూర్తి వివరాల కోసం సమీపంలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ లేదా సంబంధిత మండల న్యాయ సేవాధికార కమిటీల అధ్యక్షులు కార్యదర్శులను సంప్రదించాలని సూచించారు.

## పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలి..

- **అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి వారి ఆలయంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పూజలు**

**అయినవిల్లి(మనసులోమాట) జూలై 14:**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, అయినవిల్లి మండలంలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన స్వయంభూ శ్రీ సిద్ధి వినాయక దేవస్థానంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలనిని పీ గన్నవరం ఎమ్మెల్యే శ్రీ గిడ్డి సత్యనారాయణ

ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళ వారం విఘ్నేశ్వర స్వామి వారి ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు అనంతరం సోమవారం దర్శించుకుని పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ స్వామివారికి 101 కొబ్బరికాయల మొక్కు సమర్పించి, లక్ష్మీ గణపతి హోమంలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకొని ప్రజా సేవలోకి తిరిగి రావాలని స్వామివారిని వేడుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.అనంతరం దేవస్థానం నిధులతో నిర్మిస్తున్న అన్నపూర్ణ నిలయం



(అన్న ప్రసాద భవనం) నిర్మాణ పనులను, అలాగే గోదావరి పుష్కరాల నిధులతో నిర్మిస్తున్న శ్రీ అన్నపూర్ణా సమేత శ్రీ విశ్వేశ్వర స్వామి, శ్రీ కేశవ స్వామి, శ్రీ కాలభైరవ స్వామి ఆలయాల నిర్మాణ పురోగతిని ఎమ్మెల్యే పరిశీలించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, అర్చకులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, జనసేన, తెలుగుదేశం, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను పరామర్శించిన మంత్రి కందుల దుర్గేష్

- సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాక్షేత్రంలోకి వస్తారని ఆకాంక్ష

**నిడదవోలు (మనసులోమాట) జూలై14**

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ మంగళవారం ముంబయిలో పరామర్శించారు. ఇటీవల కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని ముంబయిలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రిలో కోలుకుంటున్న డిప్యూటీ సీఎంను మంత్రి దుర్గేష్ స్వయంగా కలిసి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. జనసేనాని కుడి భుజానికి జరిగిన శస్త్రచికిత్స విజయవంతం కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. జనసేనాని పవన్ కళ్యాణ్ చాలా వేగంగా కోలుకుంటున్నారని, ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో త్వరలోనే మళ్లీ ప్రజాక్షేత్రంలోకి వస్తారని ఆకాంక్షించారు. వైద్యుల సూచనల మేరకు ఆయనకు ప్రస్తుతం తగిన విశ్రాంతి అవసరమని, ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరినట్లు మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న సమయంలోనూ నిరంతరం ప్రజాసేవ గురించే తపించడం జనసేనాని పవన్ కళ్యాణ్ పట్టుదలకు నిదర్శనమని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ క్షేత్రస్థాయి బలోపేతానికి, ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన అందించిన దిశానిర్దేశం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, డిప్యూటీ సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లోనూ ఆయన పార్టీ నిర్మాణంపై చూపిస్తున్న అంకితభావాన్ని మంత్రి దుర్గేష్ కొనియాడారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను కలిసిన వారిలో మంత్రి దుర్గేష్ తో పాటు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ (ఏపీఎంఎస్ఐడీసీ), చిల్లపల్లి శ్రీనివాస్ ఉన్నారు.



# అస్సాగో పరిశ్రమను పూర్తిగా తరలించాలి

- ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దు
- బీఎస్పీ నేత జుత్తుక నాగేశ్వరరావు



**జగ్గంపేట, (మనసులో మాట) జూలై 14:**

గోకవరం మండలం గుమ్మలదొడ్డి గ్రామంలో అస్సాగో ఇథనాల్ పరిశ్రమ విస్తరణపై నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సభ ప్రజల ఆగ్రహంతో ఉత్కంఠభరితంగా మారింది. బాధిత గ్రామాల ప్రజలు, ప్రజా సంఘాల ప్రతినిధులు ముక్తకంఠంతో పరిశ్రమ విస్తరణను వ్యతిరేకిస్తూ "అస్సాగో వద్దు... ప్రాణాలే ముద్దు" అంటూ నినాదాలతో సభను హోరెత్తించారు.అనంతరం సభను బహిష్కరించి భారీ ర్యాలీగా నిరసన వ్యక్తం చేశారు.ఈ ఘటనపై జగ్గంపేట నియోజకవర్గ బహుజన్ సమాజ్ పార్టీ ఇన్‌చార్జ్ జుత్తుక నాగేశ్వరరావు జగ్గంపేటలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే అస్సాగో పరిశ్రమ కారణంగా గుమ్మలదొడ్డి, వెదురుపాక, అచ్చుతాపురం, బాబాజీపేట గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోయి తాగునీరు, సాగునీటి సమస్యలు తీవ్రరూపం దాల్చాయని, గాలి, నేల, శబ్ద కాలుష్యంతో పాటు భరించలేని దుర్వాసన కారణంగా ప్రజలు అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇలాంటి పరిస్థితుల్లో రోజుకు రెండు నుంచి మూడు లక్షల లీటర్ల ఆల్కహాల్ ఉత్పత్తి సామర్థ్యంతో మరో యూనిట్ ఏర్పాటు చేయాలని ప్రయత్నించడం, ప్రజల జీవితాలతో చెలగాటమని మండిపడ్డారు.

# నాటు తుపాకీలకు బలవుతున్న విదేశీ పక్షులు

**అయినవిల్లి (మనసులో మాట) జూలై 14:**



ఖరీఫ్ సీజన్లో రైతులు పంట చేలు దమ్ము చేసే సమయంలో నైజీరియా దేశాల నుండి కోనసీమ ప్రాంతానికి పక్షులు వలస వస్తాయి. ఇవి దమ్ము చేసే చేలల్లో ఉండే నత్తలను ఆహారముగా తీసుకోవడానికి గుంపులు గుంపులుగా వరిచేలల్లోకి చేరుతాయి ఇదే క్రమంలో పక్షులను వేటాడే వేటగాళ్లు నాటు తుపాకులతో పక్షులను వేటాడి మాంసప్రియులకు అమ్ముకుంటున్నారు. ఈ నాటు తుపాకీ లో ఇనుప గోళీలు పటాస్ కలిపి గన్ లోకిలోడ్ చేసి పక్షుల గుంపు పై గురిపెట్టగా గన్ లో ఉన్న ఇనుప గుళ్ళు పక్షులకు తగలడంతో అవి అక్కడకక్కడే కింద పడి చనిపోతున్నాయి. మంగళవారం నేదునూరు మురుగు కాలువ వద్ద ముగ్గురు వేటగాళ్లు రెండు నాటు తుపాకులు పట్టుకుని పక్షులను వేటాడారు. ఇలా విదేశీ పక్షులను నిర్దాక్షిణ్యంగా చంపడం వలన వాటి సంతతి నశించిపోయే ప్రమాదం ఉందని పక్షుల ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై వన్య ప్రాణి సంరక్షణ అధికారులు ఇటువంటి నాటు తుపాకీతో పక్షులను వేటాడే వారిని అదుపులోకి తీసుకుని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## మస్కట్‌లో చిక్కుకున్న మహిళను సురక్షితంగా
# స్వదేశానికి రప్పించిన జిల్లా కలెక్టర్

**అమలాపురం (మనసులోమాట) జూలై14:**

తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం గ్రామానికి చెందిన కటికదల మరియమ్మ మస్కట్‌లో ఉపాధి నిమిత్తం వెళ్లి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న నేపథ్యంలో, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్ చొరవతో ఆమెను సురక్షితంగా భారతదేశానికి రప్పించారు. మరియమ్మ 2026 జనవరిలో ఉపాధి కోసం మస్కట్‌కు వెళ్లగా, అధిక పని గంటలు, తీవ్రమైన పని ఒత్తిడి కారణంగా ఆమె ఆరోగ్యం క్షీణించింది. షుగర్, కిడ్నీ సంబంధిత అనారోగ్య సమస్యలతో పాటు కాళ్లు వాపు రావడం, పాదాల నుంచి చీము కారడం వంటి పరిస్థితులతో స్వదేశానికి రావాలని కోరుకున్నారు. ఆమె కుమారుడు అమలాపురం కలెక్టరేట్‌లోని కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ (కెసిఎం)ను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కెసి ఎం అధికారులు సంబంధిత ఏజెంట్, యజమాని, ఇతర అధికారులతో సమన్వయం చేసి అవసరమైన చర్యలు చేపట్టి ఆమెను సురక్షితంగా భారతదేశానికి రప్పించారు. విదేశాలకు ఉపాధి కోసం వెళ్లే కార్మికులు ప్రభుత్వ అనుమతి పొందిన రిక్రూటింగ్ ఏజెన్సీల ద్వారానే వెళ్లాలని, విదేశాల్లో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులను లేదా కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ నోడల్ అధికారి వి.



సుబ్బారావు, సమన్వయకర్త గోళ్ళ రమేష్, రెసిలయన్స్ ఫౌండేషన్ బృందం సభ్యులు కడియాల సత్తిబాబు, షేక్ బీబీ సఫియా తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్-2026కు రాజకీయ పార్టీల సహకారం అవసరం

**ఏలూరు, జూలై 14(మనసులో మాట)**

జిల్లా కలెక్టరేటు గౌతమీ సమావేశ మందిరంలో మంగళవారం ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐర్) 2026, కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె.అభిషేక్ గౌడ కోరారు. మంగళవారం జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) 2026పై సమావేశం నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీలు అడిగిన ప్రశ్నలకు, సందేహాలకు జిల్లా జాయింటు కలెక్టరు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ మాట్లాడుతూ జూన్ 15 నుంచి జూలై 14 వరకు బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు) ఇంటింటి సర్వేని విజయవంతంగా నిర్వహించారన్నారు. ఏలూరు జిల్లాలో ప్రత్యేక విస్తృత పునశ్చరణ (ఎస్ ఐ ఆర్) 2026 సంతృప్తికరంగా జరిగి, మొదటి స్థానంలో నిలిచామన్నారు. జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలలో 16,44,193 మంది ఓటర్లను పర్యవేక్షించేందుకు 1,744 మంది బూత్ స్థాయి అధికారులు (బి ఎల్ ఓలు) ఉన్నారని అన్నారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో గణన పత్రాల (ఈఎఫ్ ల) పంపిణీ 100% పూర్తయిందని, మొత్తం 15,54,463 గణన పత్రాలు డిజిటలైజ్ చేయబడ్డాయని తెలిపారు. దీనితో మొత్తం 94.54% ఈ ఎఫ్ డిజిటలైజేషన్ సాధించబడిది అని అన్నారు. నియోజకవర్గాలు వారీగా ఈఎఫ్ డిజిటలీకరణ ఈ క్రింది విధంగా ఉందని తెలిపారు. నం. 63 దెందులూరు: 95.64%,నం. 64 ఉంగుటూరు: 95.36%, నం. 65 ఏలూరు: 95.18%, నం. 70 నూజవీడు: 95.00%,No. 67 పోలవరం: 93.87%, No. 68 చింతలపూడి : 93.70%, నం. 73 కైకలూరు: 93.22% పూర్తి చేశామని తెలిపారు.





## జూలై 18 న స్పెషల్ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోండి

- చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి అప్పారావు

**చింతలపూడి( మనసులో మాట) జూలై 14 :**



రాష్ట్ర జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జూలై 18 న చింతలపూడి మండల న్యాయ సేవ కమిటీ ఆధ్వర్యం లో చింతలపూడిలో స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు చైర్మన్&జూనియర్ సివిల్ జడ్జి ఏబీ అప్పారావు తెలిపారు.ఈ సందర్భంగా కోర్టులు పనిచేయు ప్రతిచోట చెక్ బౌన్స్ కేసులు రాజీ చేసుకొనుటకు స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారు. చింతలపూడి కోర్టు పరిధిలో ఉన్న చెక్ బౌన్స్ కేసుల్లో ఉన్న వాదులు / ప్రతివాదులు ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, చెక్ బౌన్స్ కేసులు రాజీ చేసుకుని విలువైన సమయాన్ని డబ్బును ఆదా చేసుకోవాలని కోరారు.చింతలపూడి కోర్టులో చెక్ బౌన్స్ కేసులు పెండింగ్ ఉన్నాయని చింతలపూడి బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఈ స్పెషల్ లోక్ అదాలత్ పై శ్రద్ధ తీసుకుని మీ మీ కేసులలో ఉన్న కక్షి దారులకు కౌన్సిలింగ్ ఇచ్చి ఎక్కువ మొత్తంలో చెక్ బౌన్స్ కేసులు రాజీ చేయాలని సూచించారు.

## వరద ముంపు లంక గ్రామాల గట్లను పటిష్ట పరచండి

- అద్దంకి వారి లంక గ్రామ ప్రజా ప్రతినిధి

**మండపేట (మనసులో మాట) జూలై 14**



కపిలేశ్వరపురం మండలం లోని గౌతమీ గోదావరి పరివాహక లంక గ్రామాల ఏటి గట్లు బలహీన పడి అత్యంత ప్రమాదబరితం ఉన్నాయని, ఏటి గట్లకు గ్రోయన్లు, రిటైనింగ్ వాల్స్ వేయాలని మండలం లోని అద్దంకి వారి లంక గ్రామ ప్రజా ప్రతినిధి చెల్లే డేవిడ్ రాజ్ సీఎం చంద్రబాబు నాయుడు ని కోరారు. ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ నూతన గేట్ల నిర్మాణానికి సీఎం చంద్రబాబు నాయుడు జిల్లా కి వచ్చిన సందర్భంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కపిలేశ్వరపురం,అద్దంకి వారిలంక, శ్రీ రామాపురం, కోరుమిల్లి, కోరుమిల్లి లంక, కేదార్లంక, తదితర గ్రామాల్లో వరదల సమయం లో నదీ ప్రవాహానికి గట్లు కొట్టుకు పోయి ప్రమాదం గా మారాయన్నారు. ముఖ్యం గా లంక గ్రామాలు తరచూ ముంపు నకు గురవుతున్నాయన్నారు.

## డెంగ్యూ రహిత గ్రామాలు నిర్మిద్దాం

**అయినవిల్లి (మనసులో మాట) జూలై 14:**

డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం అయినవిల్లి పీహెచ్ సిలో డాక్టర్ మంగాదేవి ఆధ్వర్యంలో డెంగ్యూ వ్యాధి నివారణకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మంగాదేవి మాట్లాడుతూ గ్రామాలు పట్టణాల్లో డెంగ్యూ వ్యాధులు ప్రబలకుండా గ్రామస్థులకు, పట్టణవాసులకు అవగాహన కల్పించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ఇంటి లోపల బయట నీరు గుంతలు లేకుండా పాడైన బకెట్లు వాటర్ ట్యాంకులపై మూతలు లేకుండా ఉండకుండా వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. దీనివలన డెంగ్యూ లార్వా వృద్ధి చెందకుండా ఉంటుందని దీంతో డెంగ్యూ లాంటి ప్రాణాంతకమైన వ్యాధులు ప్రబలకుండా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఎన్ హెచ్ ఎస్, హెల్త్ అసిస్టెంట్లు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



## అస్సాగో పరిశ్రమను తరిమికొట్టాలి.. బాధితులనుఆదుకోవాలి

- ప్రజాభిప్రాయ సేకరణలో స్థానికుల మొర
- మరోతి శివగణేష్,పాఠంశెట్టి సూర్య చంద్ర హౌస్ అరెస్టులపై ధ్వజమెత్తిన అస్సాగో బాధిత ప్రజలు
- శివ గణేష్,సూర్య చంద్రలకు అనుకూలంగా నినాదాలు

**గోకవరం (మనసులో మాట) జూలై 14:**

గోకవరం మండలం, గుమ్మళ్ళదొడ్డిలో మంగళవారం అస్సాగో బాధితులు తమ నిరసనను మరొక్కసారి వ్యక్తపరిచారు. అస్సాగో యాజమాన్యం ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే యోచనతో చేసుకున్న దరఖాస్తుపై రాజమహేంద్రవరం ఆర్డీవో శివరాముడు నేతృత్వంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో గుమ్మళ్ళదొడ్డి, బావాజీపేట, వెదురుపాక, అచ్యుతాపురం గ్రామాలకు చెందిన స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని, కంపెనీ వల్ల ఇప్పటికే తాము ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులకు తెలియజేశారు.

**కంపెనీ పార్కింగ్ స్థలంలో ఏర్పాటు పై మండిపాటు**

ప్రభుత్వ అధికారులు నిర్వహించాల్సిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహణకు ప్రభుత్వ స్థలాలు గాని, ప్రభుత్వ కార్యాలయాలు గాని లేవా అంటూ స్థానికులు మండిపడ్డారు. అస్సాగో కంపెనీకి సంబంధించిన పార్కింగ్ స్థలంలో ఈ సమావేశం ఏర్పాటు చేయడం తీవ్ర చర్చనీయాంశమైంది. అధికారులే తమ గ్రామాన్ని అస్సాగో కంపెనీకి అమ్మేశారు అనడానికి కార్యక్రమం నిర్వహణ వేదికే నిదర్శనమని స్థానిక యువత మండిపడ్డారు.

**భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి**

ఇప్పటికే నిత్యం పది లక్షల లీటర్ల వరకు నీటిని భారీ మోటార్ల సహాయంతో భూగర్భ జలాలను కంపెనీలో వినియోగిస్తున్నారని, ఫలితంగా తమ గ్రామంలో బోరు బావులు పనిచేయడం లేదని, తాగు సాగు నీటికి తీవ్ర ఎద్దడి ఏర్పడుతుందని స్థానిక రైతులు అధికారుల ముందు కన్నీటి పర్యంతమయ్యారు.

**నిత్యం 157 టన్నుల కార్బన్డయాక్సైడ్ ఏమవుతుంది**

ఇప్పటివరకు తయారవుతున్న ఇథనాల్ వల్ల ప్రతి రోజు సుమారు 157 టన్నుల కార్బన్డయాక్సైడ్ విడుదలవుతున్నట్లు కంపెనీ యాజమాన్యం ఒప్పుకుందని, కానీ ఈ కార్బన్ డయాక్సైడ్ ను పరిసర ప్రాంతాల్లోనే విడిచిపెట్టడం తీవ్ర భయాందోళనకు గురిచేస్తుందని గ్రామస్తులు అధికారులకు వివరించారు. కంపెనీని మరింత విస్తరింప చేస్తే వాయు కాలుష్యంతో పరిసర ప్రాంతం క్యాన్సర్ కారక రోగాలతో నిత్యం మరణాలు సంభవిస్తాయని విద్యావేత్తలు అభిప్రాయం పడ్డారు.

**భారీ శబ్దాలతో భయభ్రాంతులకు గురవుతున్నాము**

రాత్రి సమయంలో కంపెనీ నుండి వస్తున్న భారీ శబ్దాల వల్ల తీవ్ర భయాందోళన గురవుతున్నామని, చిన్నారులు నిద్రపోకుండా ఏడుస్తున్నారని కంపెనీ సమీపంలోని దళిత పేటకు చెందిన మహిళలు అధికారులకు తెలియజేశారు.

**పోలీసుల తీరు పై విమర్శలు**

ఒకపక్క అధికారులు ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చి, తమ అభిప్రాయాలను తెలియజేయాలని ప్రచారం చేస్తే, పోలీసులు మాత్రం దౌర్జన్యంగా జగ్గంపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మరోతి శివ గణేష్, పాఠంశెట్టి సూర్యచంద్ర, తదితరులను హౌస్ అరెస్టులు చేయడంపై గ్రామస్తులు తీవ్రస్థాయిలో పోలీసులను తప్పుపట్టారు. ప్రజాస్వామ్యంలో ఉన్న తమకు తమ సమస్యలను అధికారులకు తెలియజేసుకునే భావ ప్రకటన స్వేచ్ఛ కూడా లేకుండా పోలీసులు ప్రవర్తిస్తున్న తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. గత రెండు సంవత్సరాలుగా స్థానికులపై కేసులు పెట్టి బెదిరింపు ధరణిలో పోలీసుల వ్యవహార శైలిని గ్రామస్తులు వ్యతిరేకించారు.

**స్మశానంలో 30మంది కి ఉద్యోగాలు**

కేవలం ఒకరిద్దరి లాభాల కోసం, నాలుగు గ్రామాలను స్మశానాలుగా మార్చి, 30 మందికి ఉద్యోగాలు ఇచ్చామని గొప్పలు చెప్పడం చాలా దారుణమని స్థానికులు అధికారులకు తెలిపారు. ఐవోసీఎల్, హెచ్పిసిఎల్ ప్లాంట్లను ఆనుకొని నిత్యం నిప్పుల కొలిమితో ఉండే ఇథనాల్ ప్లాంట్ కు ఏ విధంగా అనుమతులు మంజూరు చేశారని, ఆర్డీవో శివరాముడిని స్థానికులు ప్రశ్నించారు.

**దశలవారీగా ఉద్యమం ప్రారంభం**

ఇప్పటికే ఉన్న కంపెనీ వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఈ కంపెనీని ఇక్కడి నుండి తరలించడానికి త్వరలో దశలవారీగా ఉద్యమాన్ని తిరిగి ప్రారంభిస్తామని, కంపెనీ సామర్థ్యాన్ని పెంచడానికి ఏ విధమైన అనుమతులు ఇవ్వకూడదని అధికారులకు తెలియజేశారు.

## పర్యాటక, సాంస్కృతిక రంగాల అభివృద్ధికి, యువత సాధికారతకు ప్రాధాన్యత ఇవ్వాలి

- రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ళ

**మండపేట (మనసులో మాట) జూలై 14**



రాష్ట్రంలో పర్యాటక, సాంస్కృతిక రంగాలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడంతో పాటు, యువత సాధికారతకు మరియు నైపుణ్యాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ళ జోగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. వెలగపూడిలోని అసెంబ్లీ కమిటీ హాల్ 1 లో మంగళవారం మధ్యాహ్నం యువజన పురోభివృద్ధి, పర్యాటక సాంస్కృతిక శాఖల ఉన్నతాధికారులతో రాష్ట్ర అంచనాల కమిటీ సమీక్షా సమావేశం కమిటీ చైర్మన్ వేగుళ్ళ జోగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయా శాఖల పురోగతి, నిధుల వినియోగంపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ వేగుళ్ళ జోగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర పర్యాటక రంగాన్ని మరింత బలోపేతం చేసి ఆర్థిక వనరులను పెంపొందించుకోవాలని, మన సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుతూ భావితరాలకు అందించాలని సూచించారు. అదేవిధంగా యువతలోని సృజనాత్మకతకు పదును పెట్టేలా, వారి ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేలా వినూత్న కార్యక్రమాలను రూపొందించాలని స్పష్టం చేశారు. కేటాయించిన నిధులను పూర్తి స్థాయిలో, పారదర్శకంగా వినియోగిస్తూ నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో చేరుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. భరణి, ఐఎఫ్ఎస్, యువజన పురోభివృద్ధి, పర్యాటక & సాంస్కృతిక శాఖ డిప్యూటీ సెక్రటరీ టి. వి. సావిత్రి దేవి, ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎ.ఎ.ఎల్. పద్మవతి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్. మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ మావుళ్ళమ్మ తల్లి జాతర

**మండపేట (మనసులో మాట ) జూలై 14**

మారేడుబాక గ్రామంలో వెలసిన శ్రీ మావుళ్ళమ్మ తల్లి జాతర మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా ముగిసాయి. ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయడంతో ఉత్సవాలు ప్రశాంతంగా సాగాయి. అమ్మవారిని గ్రామ పురవీధుల్లో అత్యంత వైభవంగా ఊరేగించారు. ఈ సందర్భంగా గరగల నృత్యం, తీన్మార్ డప్పుల మోతలు, సాంప్రదాయ నృత్యాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. డప్పు వాయిద్యాల హోరు మధ్య భక్తులు భక్తిభావంతో నాట్యాలు చేస్తూ తన్మయత్వానికి లోనయ్యారు. మంగళ వారం అమ్మవారికి ఉయ్యాల ఊపు సేవ నిర్వహించారు. మంగళవాయిద్యాలు, డోలు సన్నాయిల నడుమ అమ్మవారిని ఆలయానికి తీసుకువచ్చారు. గ్రామస్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ జాతరకు మారేడుబాక గ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి కూడా భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పునీతులయ్యారు.



# తుమ్మలపల్లి రమేష్ సొంత ఖర్చులతో డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహణ

- ప్రతి మంగళవారం పేదలకు అన్నదానం

**జగ్గంపేట,(మనసులో మాట) జూలై 14:**

జగ్గంపేట పట్టణంలోని పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ క్యాంటీన్ ద్వారా ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సుమారు 500 మంది నిరుపేదలు, దినసరి కూలీలు, ప్రయాణికులు అవసరమైన వారికి ఉచిత భోజనం



అందించారు.ఈ సేవా కార్యక్రమానికి అయ్యే పూర్తి వ్యయాన్ని తుమ్మలపల్లి రమేష్ తన సొంత నిధులను వెచ్చిస్తున్నారు.జనసేన పార్టీ అధ్యక్షుడు , ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని గత రెండేళ్లుగా ప్రతి మంగళవారం ఎలాంటి విరామం లేకుండా డొక్కా సీతమ్మ క్యాంటీన్ ద్వారా ఈ ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.ఈరోజు ఈ కార్యక్రమాన్ని జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు ప్రారంభించి స్వయంగా భోజనం వడ్డించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రజా సేవే లక్ష్యంగా ఇటువంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులోనూ మా నాయకులు తుమ్మలపల్లి రమేష్ కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు.

# ఉద్యాన పంటల సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతు శిక్షణా కార్యక్రమం

**జగ్గంపేట (మనసులో మాట) జులై 14 :**

కాకినాడ జిల్లా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో జగ్గంపేట మండలం గోవిందపురం మల్లిసాల గ్రామాలలో మామిడి, జీడిమామిడి మరియు ఆయిల్ పామ్ పంటలలో సమగ్ర పంట యాజమాన్య పద్ధతులపై ఒకరోజు రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్యాన శాఖ అధికారి ఎ. శ్రీవల్లి నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఐసీఏఆర్ ఎన్ఐఆర్సీఏ కృషి విజ్ఞాన కేంద్రం కలవచర్లకు చెందిన ఎన్. రఘునందన్, ఎస్ఎంఎస్ ప్లాంట్ ప్రొటెక్షన్ శాస్త్రవేత్తగా పాల్గొన్నారు. మామిడి జీడిమామిడి పంటలలో కోత అనంతర కేనోపీ నిర్వహణ, పోషక యాజమాన్యం, సమగ్ర పంట యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. నేల సారాన్ని పెంపొందించడంలో జీవ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువుల ప్రాముఖ్యతను వివరించారు. ఆయిల్ పామ్ పంటలో సమగ్ర పోషక యాజమాన్యం, ఎరువులు మరియు సూక్ష్మపోషకాలను సరైన సమయంలో వేయడం, వేసిన ఎరువులను మట్టితో



కప్పడం ద్వారా ఎరువుల వినియోగ సామర్థ్యాన్ని పెంచడం, మొక్కల సంరక్షణ చర్యలు, అలాగే ఎల్ నినో పరిస్థితుల్లో పంటలను సంరక్షించేందుకు అనుసరించాల్సిన శాస్త్రీయ విధానాలపై రైతులకు సాంకేతిక సూచనలు అందించారు.ఎల్ నినో ప్రభావాన్ని తగ్గించేందుకు ఉద్యాన పంటల్లో తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. నీటి కొరత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని డ్రిప్ సేద్యాన్ని సమర్థవంతంగా వినియోగించడం, మల్చింగ్ చేపట్టడం, నేలలో తేమను నిల్వ ఉంచడం, సేంద్రియ పదార్థాల వినియోగాన్ని పెంచడం, సమతుల్య ఎరువుల యాజమాన్యాన్ని పాటించడం, సూక్ష్మ



పోషకాలను సిఫార్సుల మేరకు వినియోగించడం, ఎండ తీవ్రతను తట్టుకునేలా మొక్కల సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. వాతావరణ సూచనలను అనుసరించి సాగు నిర్వహణ చేపట్టడం ద్వారా ఎల్ నినో ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ పైడిపాల సూరిబాబు, ముంద్రు ఎర్రబాబు, కమ్మిల వెంకటేశ్వరరావు, నాని రాజు, కానమరెడ్డి రామకృష్ణ ఎంపీటీసీ, గోవిందాపురం గ్రామ నాయకులడు కొల్లు రామకృష్ణ, గ్రామ నాయకులు ముంద్రు కృష్ణారావు, ఉద్యాన శాఖ సిబ్బంది, ఉద్యాన సహాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజాస్వామ్యం ఖూనీ

- అస్సాగో ఇథనాల్ పరిశ్రమ విస్తరణను అడ్డుకుంటాం
- పాటంశెట్టి సూర్యచంద్ర

**జగ్గంపేట (మనసులో మాట) జూలై 14**

జగ్గంపేట నియోజకవర్గంలో ప్రభుత్వ అండదండలతో స్థానిక ప్రజల ప్రాణాలను పణంగా పెడుతూ సాగుతున్న అరాచక పాలనపై తక్షణమే చర్యలు చేపట్టాలని సూర్యచంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. గోకవరం మండలం, గుమ్మళ్ళదొడ్డి గ్రామంలోని అస్సాగో ఇథనాల్ పరిశ్రమ ఉత్పత్తి సామర్థ్యాన్ని రోజుకు 2 లక్షల లీటర్ల నుండి 3 లక్షల లీటర్ల తయారీ పెంచేందుకు నేడు నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ (గ్రామసభ) కేవలం ఒక ప్రహసనంగా మారిందన్నారు.ప్రజల పక్షాన నిలబడి వారి గొంతుకను వినిపించడానికి సిద్ధమైన మమ్మల్ని పోలీసు బలగాలతో నిర్బంధించిన దుర్మార్గమైన చర్యని పాటంశెట్టి సూర్యచంద్ర తీవ్రంగా ఖండించారు.ప్రజాభిప్రాయ సేకరణ గ్రామసభలో మాట్లాడే కనీస హక్కును కూడా నిరాకరిస్తూ, పోలీసులను అడ్డుపెట్టుకుని సభను



జరపడం ఎంతవరకు సమంజసం? మేమేమీ తీవ్రవాదులం కాదు, చట్టాన్ని గౌరవించే పౌరులం. మా గొంతు నొక్కడం ద్వారా ప్రభుత్వం ఏ అరాచకాన్ని దాచాలని చూస్తోందని ప్రభుత్వాన్ని సూర్యచంద్ర ప్రశ్నించారు.

ఇప్పటికే ఉన్న పరిశ్రమ వల్ల శబ్ద, వాయు, జల కాలుష్యం తీవ్రస్థాయికి చేరింది. ఒక లీటర్ ఇథనాల్ తయారీకి ఏకంగా 5 లీటర్ల భూగర్భ జలాలు అవసరమవుతున్నాయి. అంటే నిత్యం సుమారు 15 లక్షల లీటర్ల నీటిని తోడేస్తూ ఉంటే, రాబోయే రోజుల్లో ఈ ప్రాంతంలో వ్యవసాయం నిర్వీర్యమై, తాగునీటి కటకట ఏర్పడటం ఖాయమన్నారు.నిత్యం సుమారు 225 టన్నుల కార్బన్ డై ఆక్సైడ్ ప్రమాదకరమైన కాలుష్యం గాలిలోకి విడుదలవుతుండటం వల్ల వాతావరణం కలుషితమై స్థానిక ప్రజలు తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు.నాడు ఎన్నికల ప్రచారంలో "ఈ ఫ్యాక్టరీని రద్దు చేస్తాం" అని ప్రగల్భాలు పలికిన స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ జ్యోతుల నవీన్ ఎక్కడికి వెళ్లారన్నారు, ప్రజలు ఇంతగా అల్లాడుతుంటే, తిరుపతిలో బోర్డు మీటింగ్ ఉందంటూ తప్పించుకుపోవడం వెనుక ఉన్న అసలు రహస్యం ఏమిటన్నారు.అస్సాగో యాజమాన్యం నుండి ఎన్ని కోట్లు ముట్టాయని ఈరోజు ఈ రకమైన పారిపోకడలకు పాల్పడుతున్నారని సూర్యచంద్ర ప్రశ్నించారు.



# "సర్ " పొడిగించాలంటూ వినతిపత్రం

**నిడదవోలు (మనసులో మాట) జూలై 14**

ఎస్ఐఆర్ (సర్) నెలరోజులు పాటు పొడిగించాలని సీపీఎం తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు 9 కమిటీ తరపున నిడదవోలు ఎమ్మార్వో బి. నాగరాజు నాయక్ కు కార్యాలయంలో వినతి పత్రాన్ని అందించారు ఈ సందర్భంగా ఎమ్మార్వో మాట్లాడుతూ ఏ ఒక్కరి ఓటు తొలగించమని పారదర్శంగా సర్ ప్రక్రియ జరుగుతుందని ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని అన్నారు. ఈరోజు తో సర్ ప్రక్రియ నూరు శాతం పూర్తి కాలేదు అని ప్రక్రియలో ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలు గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని నిబంధనలు సడలించాలని ఉదా! ప్రజల వద్ద నిత్యం అందుబాటులో ఉండే అత్యంత ప్రామాణిక పత్రాలైన ఆధార్ కార్డు,ఓటర్ ఐడీ, రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ వంటి వాటిని ఈ వెరిఫికేషన్ ప్రక్రియకు ప్రాతిపదికగా తీసుకోవడంలేదని. చట్ట బద్ధమైన ఈ కార్డులను కాదని ఇతర పత్రాలు అడగటం వల్ల సామాన్య ప్రజలు నిరక్షరాస్యులు తీవ్ర గందరగోళానికి ఇబ్బందులకు గురవుతున్నారని నిబంధనలు పేరుతో విద్యార్థత. పాస్పోర్ట్ కుల లేదా జనన ధ్రువీకరణ పత్రాలను అధికారులు తప్పని సరిగా కోరుతున్నారని జువ్వల రాంబాబు వినతి పత్రంలో కోరారు.

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని పాదయాత్ర

- ఎమ్మెల్యే పంతం నానాజీ సర్పవరం నుంచి పాదగయ వరకు పాదయాత్ర

**కాకినాడ (మనసులో మాట) జులై 14**

జనసేన పార్టీ అధ్యక్షుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముంబైలో భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న నేపథ్యంలో ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు, పాదయాత్ర నిర్వహించారు.ముందుగా సర్పవరం జంక్షన్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పంతం నానాజీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాకినాడ రూరల్ నియోజకవర్గం లోని వివిధ గ్రామాలు, డివిజన్లకు చెందిన జనసేన నాయకులు, జనసైనికులు,వీరమహిళలతో కలిసి ఆయన తనయుడు పంతం సందీప్ సర్పవరం నుంచి పిఠాపురంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పాదగయ వరకు పాదయాత్ర చేపట్టారు.పాదయాత్ర ముగిసిన అనంతరం పాదగయలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా పంతం సందీప్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలు కోవాలని ఆకాంక్షిస్తూ జనసైనికులు,వీరమహిళలతో కలిసి ఈ పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు.పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాసేవలో తిరిగి చురుకుగా పాల్గొనాలని ప్రార్థించినట్లు చెప్పారు.





# కోనసీమ జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 99 శాతం పూర్తి

- **కలెక్టర్ డాక్టర్ ఆర్. మహేష్ కుమార్**



**అమలాపురం(మనసులోమాట) జూలై 14 :**
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ 99 శాతం పూర్తయిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఆర్. మహేష్ కుమార్ తెలిపారు. ఓటర్ల జాబితాను సంపూర్ణంగా, పారదర్శకంగా, తప్పుల్లేకుండా రూపొందించేందుకు ఎన్నికల సంఘం చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రతి ఓటరు చురుకుగా సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

మంగళవారం అమలాపురంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులు, ఎన్నికల శాఖ అధికారులతో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కార్యక్రమం పురోగతిని కలెక్టర్ సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు.

సమీక్ష సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రామచంద్రపురం, ముమ్మిడివరం, అమలాపురం, రాజోలు, పి. గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పూర్తిగా (100 శాతం) ముగిసిందన్నారు. అలాగే కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని కొత్తపేట, రావులపాలెం, ఆలమూరు మండలాల్లో కూడా ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. అయితే ఆత్రేయపురం మండలంలో మాత్రమే ఇంకా స్వల్పంగా పని మిగిలి ఉందన్నారు. మొత్తం 54,769 మంది ఓటర్లలో 54,550 మంది వివరాల సేకరణ పూర్తయిందని, మరో 219 మంది ఓటర్ల వివరాలను నమోదు చేయాల్సి ఉందని తెలిపారు. దీంతో ఆ మండలంలో 99 శాతం ప్రక్రియ పూర్తయిందని పేర్కొన్నారు.

జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం శరవేగంగా కొనసాగుతోందని, అధికారులు, బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తున్నారని తెలిపారు. ప్రతి ఇంటికి చేరుకుని అర్హులైన ఓటర్ల వివరాలను నమోదు చేయడంతో పాటు, జాబితాలో ఉన్న లోపాలను సరిదిద్దుతున్నట్లు చెప్పారు.

ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు కల్పించడం, ఒక్క అర్హుడూ ఓటర్ల జాబితా నుంచి మినహాయింపుకు గురికాకుండా చూడడం, అర్హత లేని పేర్లను తొలగించడం ఎన్నికల సంఘం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ వివరించారు. అందుకే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు.

అందజేస్తున్న ఎన్యూమరేషన్ ఫారాలను ఓటర్లు పూర్తిగా నింపి వెంటనే తిరిగి అందజేయాలని ఆయన కోరారు. సరైన సమాచారం అందించినప్పుడే ఓటర్ల జాబితా ఖచ్చితంగా రూపొందుతుందని, తద్వారా ప్రతి అర్హుడి ఓటు హక్కు రక్షించబడుతుందని పేర్కొన్నారు.

ఓటర్ల జాబితా భద్రత, ఖచ్చితత్వం, విశ్వసనీయతను మరింత బలోపేతం చేయడానికే ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని చేపట్టినట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో జిల్లా ప్రజలందరూ భాగస్వాములు కావాలని, బీఎల్‌వోలకు సహకరించి ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు, ఇంటిటి ఫీవర్ సర్వేలు



**వి.ఆర్.పురం(మనసులోమాట) జూలై 14;**
మండలంలోని మారుమూల గిరిజన గ్రామాల్లో జ్వరాలు అధికంగా వ్యాపించి, ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో, రేఖపల్లి ప్రభుత్వ వైద్యుల ఆధ్వర్యంలో మంగళవారం గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు ఇంటింటి జ్వరాల సర్వేలను నిర్వహించారు. రేకపల్లి పీహెచ్సీ పరిధిలోని సోడే పహాడ్, దర్భలంక, సున్నంమక్కా, వెంకంపాలెం గ్రామాల్లో డాక్టర్ నీలు ఫర్, డాక్టర్ పృథ్వీ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరాలను నిర్వహించారు. వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి జ్వరాల సర్వే చేసి, కేసులను గుర్తించి వారికి ఆర్డిటి టెస్టులను చేశారు. అదేవిధంగా సీజనల్ వ్యాధులు డెంగు మలేరియా వైరల్ జ్వరాలు తదితర వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల పై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. యధావిధిగా ఉమ్మడివరం గ్రామంలో వైద్యైబిరం నిర్వహణ, ఓడోమస్ ఆయిట్మెంట్స్ డిస్ట్రిబ్యూషన్ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ భద్రకాళి, హెల్త్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాపు నేత ముద్రగడ పద్మనాభం కన్నుమూత

**కాకినాడ (మనసులో మాట) జులై 14**




వైఎస్ఆర్సిపి నాయకుడు కాపు ఉద్యమనేత మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మంగళవారం సాయంత్రం సుమారు 6:30 గంటలకు హైదరాబాదులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో తుది శ్వాస విడిచారు. గత నెల రోజులుగా ఆయన అనారోగ్యం తో హైదరాబాద్‌లోని సింధు ఆస్పత్రిలో చికిత్స పొందు తున్నారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం కన్నుమూశారు. 1953 లో తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడి లో జన్మించిన ముద్రగడ గత కొంత కాలంగా శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బందిపడుతున్నారు. ముద్రగడ పద్మనాభం ఆరు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా గెలుపొందారు.

1978లో తొలిసారి జనతా పార్టీ నుంచి ఎమ్మెల్యే గా గెలిచారు. 1989 వరకు వరుసగా 4 సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. దివంగత నేతలు ఎన్టీఆర్,మర్రి చెన్నారెడ్డి ప్రభుత్వాల్లో మంత్రిగా పని చేశారు. 2024 ఎన్నికల ముందు వైఎస్సార్ పార్టీలో చేరారు. ప్రస్తుతం ముద్రగడ పద్మనాభం తనయుడు ముద్రగడ గిరిబాబు వైఎస్ఆర్సిపి పార్టీ తరపున ప్రత్తిపాడు నియోజకవర్గ కోఆర్డినేటర్ గా పనిచేస్తున్నారు. ముద్రగడ పద్మనాభం మృతి పట్ల ప్రత్తిపాడు నియోజకవర్గం లోని వైసీపీ శ్రేణుల్లోను కిర్లంపూడి లో విషాద స్థాయిలనుకున్నాయి

# ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి బాధితురాలికి ఎల్ వో సి మంజూరు

- **జ్యోతుల నవీన్ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి చెక్కు అందజేత**

**జగ్గంపేట (మనసులో మాట) జూలై 14:**



రావులమ్మ నగర్ లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ,జగ్గంపేట మండలం అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ చేతుల మీదుగా జగ్గంపేట నియోజకవర్గం కాట్రావులపల్లి గ్రామానికి చెందిన మాదిరెడ్డి వీరబాబు కుమార్తె మాదిరెడ్డి హేమలత కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన ఎల్ వో సి ఆర్థిక సహాయ పత్రాన్ని అందజేయడం జరిగింది.హేమలత బోన్ టీబీ వ్యాధితో బాధపడుతూ అత్యవసరంగా ఆపరేషన్ చేయించుకోవాల్సి వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న కాట్రావులపల్లి గ్రామానికి చెందిన గ్రామ టిడిపి అధ్యక్షుడు ముసిరెడ్డి నాగేశ్వరావు వెంటనే స్పందించి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వద్దకు వెళ్లి విషయాన్ని తెలియజేసి సిఫారసు లేఖపై సంతకం చేయించారు. అనంతరం విజయవాడ వెళ్లి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రెండు లక్షల అరవై వేల మూడు వందల ఎనభై తొమ్మిది రూపాయల లెటర్ ఆఫ్ క్రెడిట్ మంజూరు చేయించి రాత్రికి తీసుకువచ్చారు.మంగళవారం ఆ లెటర్ ఆఫ్ క్రెడిట్ ను కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు , జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ చేతుల మీదుగా బాధితురాలి కుటుంబానికి అందజేశారు. ఈ సహాయంతో కాకినాడ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ లో హేమలతకు చికిత్స అందించనున్నారు.ఈ సందర్భంగా ముసిరెడ్డి నాగేశ్వరరావు మాట్లాడుతూ పేద ప్రజల కష్టాలను తీర్చడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఎల్లవేళలా ముందుంటారని, అవసరమైన ప్రతి ఒక్కరికీ ఇదే విధంగా సహాయం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జగ్గంపేట సొసైటీ చైర్మన్ బుర్రి సత్తిబాబు, ముసిరెడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# లింగంపత్తిలో పిచ్చికుక్క కరచిన ఏడేళ్ల బాలుడు మృతి

- **28 మంది గాయాలు**

**ఏలేశ్వరం (మనసులో మాట) జులై 14**
కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరం మండలానికి చెందిన లింగంపర్తి గ్రామం లోని సత్ర పంపు వీధిలో గత జూన్ నెల 14 వ తేదీన పిచ్చికుక్క మనుషులపైన పశువుల పైన దాడి చేసి సుమారు 28 మందిని కరిచింది. ఈ ఘటనలో బిశెట్టి లక్ష్మణ్ దుర్గ దంపతులకు ప్రథమ కుమారుడు సాయి గణేష్ (7) ను కూడ ఆ పిచ్చి కుక్క కరువగా వెంటనే ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రి లో అతనికి వ్యాక్సిన్స్ కూడా వేయించారు. గత మూడు రోజుల క్రితం ఆ బాలుడు మాట తడబడడంతో మెరుగైన వైద్యం కోసం కాకినాడ జి జి హెచ్ కు తరలించగా మంగళవారం ఆ (ఏడు సంవత్సరాల) బాలుడు సాయి గణేష్ మృతి చెందాడు. ఈ ఘటనతో లింగంపర్తి గ్రామంలో కుటుంబ సభ్యుల రోధనలతో విషాదఛాయలు అలుముకున్నాయి . అలాగే పిచ్చికుక్క కరిసిన ఒక లేగ దూడ మరణించింది. అయితే పిచ్చికుక్క కరిచిన మిగిలిన 27 మందికి అబ్జర్వేషన్ పెట్టి మెరుగైన వైద్యం అందించాలంటూ ప్రజలు కోరు కుంటున్నారు. ఏలేశ్వరం మండలంలోని పలు గ్రామాలలో విచ్చల విడిగా తిరుగుతున్న కుక్కలను పట్టుకొని ప్రజల ప్రాణాలను కాపాడాలంటూ మండలంలోని గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు



# జూలై 19 వ తేది నుండి ఏలేరు రిజర్వాయర్ ద్వారా 53 వేల ఎకరాలకు సాగునీటి విడుదల

- జిల్లాలో ఎరువుల కొరత లేదు
- జూలై నెలకు సరిపడా యూరియా పూర్తిగా సిద్దంగా ఉంది
- ఇంటింటి ఓటర్ల సర్వే గడువు జూలై 24 వరకు పొడిగింపు
- జూలై 31వ తేదిన డ్రాఫ్ట్ ప్రచురణ
- కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

**కాకినాడ (మనసులో మాట) జూలై 14:**



కాకినాడ జిల్లాలో ఖరీఫ్ పంట సాగుకు రైతులు ముమ్మరంగా సిద్ధమవుతున్న తరుణంలో, వారికి అవసరమైన సాగునీటిని అందించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ ఎమ్.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు.మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ
ఎల్ ని నో ప్రభావం వల్ల వర్షపాతం సాధారణం కంటే 25 శాతం తక్కువగా నమోదైనప్పటికీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు సాగునీటి సరఫరాకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఏలేరు రిజర్వాయర్‌లో ప్రస్తుతం ఉన్న 8.68 టీఎంసీల నీటిని గోదావరి పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా ఆగ్మెంట్ చేస్తూ,జూలై 19వ తేదీ నుండి ఏలేరు కింద ఉన్న 53 వేల ఎకరాల ఆయకట్టుకు పూర్తి స్థాయిలో సాగునీటి విడుదల ప్రారంభించ నున్నట్లు ప్రకటించారు. పీబీసీ, పిఠాపురం బ్రాంచ్ కెనాల్ కింద ఉన్న 20 వేల ఎకరాలకు ఇప్పటికే నీటి సరఫరా మొదలైందని,సామర్లకోట వద్ద ప్రస్తుతం అందుతున్న 300 క్యూసెక్స్ నీటిని మరింత పెంచి,శివారు ప్రాంతాలకు నీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.
ధవళేశ్వరం నుండి ఇప్పటికే 4,900 క్యూసెక్స్ నీటిని డ్రా చేస్తున్నందున, రాబోయే ఒకటి రెండు రోజుల్లో ఆర్‌ఆర్‌బీ ట్యాంక్ కింద ఉన్న 10 వేల ఎకరాల ఆయకట్టుకు కూడా నీరు అందుతుందని, అలాగే తిమ్మరాజు ట్యాంక్‌కు జూలై 19 నుండి 50 క్యూసెక్స్ నీటిని విడుదల చేస్తామని కలెక్టర్ వివరించారు.పంపా పరిధిలోని 8,985 ఎకరాలకు ఆగస్టు మొదటి వారంలో నీరు ఇవ్వడం జరుగుతుందని, తాండవాకు సంబంధించి త్వరలోనే పొరుగు జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి నిర్ణయం ప్రకటిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు.
జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ఎరువుల కొరత ఎక్కడా లేదని, సామాజిక మాధ్యమాల్లో వచ్చే తప్పుడు వార్తలను రైతులు నమ్మవద్దని కలెక్టర్ కోరారు.జిల్లాకు ఈ ఖరీఫ్ మొత్తానికి 57,920 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా,ఇప్పటికే 40,749 మెట్రిక్ టన్నులను సరఫరా చేశామన్నారు.
ముఖ్యంగా జూలై నెల యూరియా అవసరం 16,943 మెట్రిక్ టన్నులు కాగా, అంతకంటే అదనంగా 21,034 మెట్రిక్ టన్నులను ఇప్పటికే రైతులకు పంపిణీ చేశామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రవేశపెట్టిన 'ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్స్' (ఎఫ్‌ఎఫ్‌ఎస్) మొబైల్ యాప్ ద్వారా జిల్లాలో ఎరువుల పంపిణీ విజయవంతంగా జరుగుతోందని,యాప్ వాడకంపై అనుమానాలుంటే ఆర్‌ఎస్‌కే సిబ్బంది లేదా విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను సంప్రదించాలని సూచించారు. కౌలు రైతులకు కూడా ఎటువంటి ఇబ్బంది లేకుండా యూరియా అందజేస్తున్నామని, రైతులు ఎరువులను ఎంఆర్‌పీ ధరల కంటే ఎక్కువకు కొనుగోలు చేయవద్దని,ఎంఆర్పీ కంటే ఎక్కువ ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. అలాగే రైతులు డీఏపీకి ప్రత్యామ్నాయంగా టీఎస్‌పీ (ట్రై సూపర్ ఫాస్ఫేట్) వాడాలని కోరారు.

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ(సర్)గడువును పొడిగించినట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. జూలై 14వ తేది తో ముగియాల్సిన 'బీఎల్‌ఓల ఇంటింటి సర్వే' గడువును జూలై 24, 2026 వరకు పొడిగించడం జరిగిందన్నారు. శాశ్వతంగా వలస వెళ్లిన వారు, మరణించిన వారు, డూప్లికేట్ ఓట్లు ఉన్నట్లు బీఎల్‌ఓలు గుర్తించినప్పటికీ తాము ఇంకా అదే ప్రాంతంలో నివసిస్తున్నామని భావించే అర్హులు ఎవరైనా ఉంటే, తగిన ఆధారాలతో కూడిన ఎన్యుమరేషన్ ఫామ్‌ను బీఎల్‌ఓలకు అందజేసి తమ పేరును నమోదు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు.జూలై 31వ తేది న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందని,డ్రాఫ్ట్ పబ్లికేషన్ తర్వాత ప్రతి ఒక్కరు తమ పోలింగ్ కేంద్రంలో వారి పేరు సరిచూసుకోవాలని, పేరు లేని పక్షంలో ఏఈఆర్‌ఓ లేదా ఈఆర్‌ఓలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యంతరాల స్వీకరణ అనంతరం అక్టోబర్ 3, 2026 న ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తామని, అందులో పేరున్న వారికే ఓటు హక్కు ఉంటుందని స్పష్టం చేశారు.రైతులు సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటే మండలాధికారులతో ఏర్పాటు చేసిన రెవెన్యూ, ఇరిగేషన్,వ్యవసాయ శాఖల సమన్వయ కమిటీలను సంప్రదించాలని కలెక్టర్ ఎమ్.ఎన్. హరేంధిర ప్రసాద్ ఈ సందర్భంగా కోరారు

## మాజీ మంత్రి,కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం కన్నుమూత

1.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో జన్మించిన ముద్రగడ పద్మనాభం రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు.
2.1978లో జనతా పార్టీ తరపున తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.
3.వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ప్రజల మద్దతు పొందారు.
4.ఎన్టీఆర్, మర్రి చెన్నారెడ్డి ప్రభుత్వాల్లో మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు.
5.కాపు రిజర్వేషన్ల ఉద్యమానికి నాయకత్వం వహించి రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందారు.
6.2024 ఎన్నికలకు ముందు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.



7.శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. పలు మార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఒకసారి ఎంపీగా పని చేసిన ముద్రగడ

## చినుకు పడదు... సాగునీరు పారదు

- నీరందక ఎండిపోతున్న నారుమళ్లు
- రైతుల్లో ఆందోళన

**కాజులూరు (మనసులో మాట) జూలై 14**

ఒకవైపు వర్షాలు కురవక, మరోవైపు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నారుమళ్లు వేసి దాదాపు 30 రోజులు గడిచినా ఇప్పటికీ పొలాలకు నీరు అందకపోవడంతో నారుమళ్లు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ఖరీఫ్ సాగుపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మండలంలోని పలు గ్రామాల్లో నారుమళ్లు ఎండిపోతుండగా, కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే 10 శాతం కూడా తూర్పులు సాగలేదనీ రైతులు చెబుతున్నారు. మరో వారం రోజుల్లోనైనా సాగునీరు అందకపోతే నారుమళ్లన్నీ పూర్తిగా దె



బ్బతినే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ నారు వేయాల్సిన పరిస్థితి వస్తే అదనపు ఖర్చుతో పాటు సాగు పూర్తిగా ఆలస్యం అవుతుందని అంటున్నారు.
ప్రతి ఏడాది ఈ సమయానికి కాలువల్లో సాగునీరు ప్రవహించి వరి నాట్లు ప్రారంభమయ్యేవి. అయితే ఈసారి కాలువలకు నీరు పూర్తిస్థాయిలో విడుదల కాకపోవడంతో రైతులు ఎదురుచూపులు చూస్తున్నారు. వర్షాభావ పరిస్థితులు కూడా రైతుల ఆందోళనను మరింత పెంచుతున్నాయి.
ఇక వరి నాట్ల కోసం దూర ప్రాంతాలైన పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యవసాయ కూలీలు పనులు లేక ఖాళీగా ఉంటున్నారు. సాగునీరు రాకపోవడంతో నాట్లు ప్రారంభం కాకపోవడంతో ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారు. రైతులు కూడా కూలీలను పనిలో పెట్టుకోలేని పరిస్థితి నెలకొంది.
రైతులు, వ్యవసాయ కార్మికులు వెంటనే సాగునీరు విడుదల చేసి ఖరీఫ్ సాగును కాపాడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. సంబంధిత అధికారులు పరిస్థితిని సమీక్షించి తక్షణ చర్యలు తీసుకోవాలని, లేకపోతే రైతులకు భారీ నష్టం తప్పదని ఆందోళన వ్యక్తమవుతోంది.

## కాకినాడ గేట్ వే పోర్టు పేరును కోన గేట్ వే ఫోర్ట్ గా మార్చాలి.

- రైతుల త్యాగాలు కోన ప్రాంత ప్రజల మనోభావాలు పరిగణనలోకి తీసుకోవాలి.
- సీఎం చంద్రబాబు కు యనమల లేఖ.

**తుని (మనసులో మాట) జులై 14**

రైతుల త్యాగాలు,కోన ప్రాంత ప్రజల మనోభావాలకు అనుగుణంగా కాకినాడ గేట్‌వే
పోర్ట్ మార్పు చేయాలని తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యుడు మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ప్రభుత్వాన్ని కోరారు.
ఈమేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు లేఖ ద్వారా రిప్రజెంటేషన్ చేసిన యనమల కాకినాడ గేట్ వే పోర్ట్ పేరును కోన గేట్ వే పోర్ట్ గా మార్పు చేసి కోన ప్రాంత రైతాంగం
త్యాగానికి గుర్తింపు ఇచ్చినట్టు అవుతుందని ఆ లేఖలో పేర్కొన్నారు.కోనలో కార్యకలాపాలకు సిద్ధ పడుతున్న ఓడరేవును అరబిందో గ్రూప్ నకు చెందిన కాకినాడ గేట్ వే పోర్ట్ లిమిటెడ్ అభివృద్ధి పర్చడాన్ని
స్వాగతించిన యనమల ఈ ప్రాజెక్టు కోసం ఏపీఐఐసీ ద్వారా భూసేకరణ చట్టం 2013 కింద తొండంగి మండల పరిధిలో గల సుమారు 1600ఎకరాల భూమిని సేకరించిందని, కేఎస్ ఈజడ్ పేరుతో సమగ్ర మౌళిక సదుపాయాల ప్రాజెక్టు కోసం కోన ప్రాంతంలోపది వేల ఎకరాల వ్యవసాయ భూములను వదలుకున్నరైతాంగం గొప్ప త్యాగం చేసారని యనమల తన లేఖలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.ఓడరేవు మార్పును కోరుతున్న యనమల ఇందుకు రెండు ప్రధాన కారణాలను తన లేఖలో వ్యక్తీకరించారు.కాకినాడ గేట్ వే పోర్ట్ భౌగోళికంగా తొండంగి మండలంలోని కోన ప్రాంతంలో ఉందని పోర్ట్ కోసం తమ భూములను త్యాగం చేసిన రైతుల పేరుతో ఓడ రేవుకు నామకరణం చేయడం ఎంతైనా సముచితమని,దీనికి కోన గేట్ వే పోర్ట్ అని మార్చడం
రైతుల త్యాగానికి గుర్తింపు ఇచ్చినట్టు
అవుతుందని యనమల అభిప్రాయ పడ్డారు.తద్వారా ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ పట్ల కోన ప్రాంత ప్రజలకు యాజమాన్య భావన కల్పించినట్టు అవుతుందని దీని ద్వారా కోన రైతు గర్వాన్ని కలిగిస్తుందని యనమల పేర్కొన్నారు.
కాకినాడ సీ పోర్ట్,
కాకినాడ గేట్ వే పోర్ట్ ఒకే పోలికతో రెండు పేర్లు ఉండడం వల్ల ఈసారూప్యత ప్రజలు, వాణిజ్య సంస్థలు, లాజిస్టిక్స్ నిర్వాహకుల మధ్య గణనీయమైన గందరగోళానికి దారి తీసే పరిస్థితులు కనబడుతున్న విషయాన్ని యనమల తన లేఖ ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.కొత్త ఓడరేవుకు
కోన గేట్ వే గా మార్చడం ద్వారా ఇప్పుటికే కాకినాడ డీప్ వాటర్ పోర్ట్ నుండి దీనిని స్పష్టంగా
మార్పు చేయవచ్చని సూచించిన
యనమల రామకృష్ణుడు భవిష్యత్ లో తలెత్తే పరిపాలనా పరమైన,నిర్వహణాపరమైన సాంకేతిక అంశాలకు సందిగ్ధత
తొలగించవచ్చన్నారు.ప్రభుత్వం
లోతైన అధ్యయనం చేసి కాకినాడ గేట్ వే పోర్ట్ పేరును కోన గేట్ వే ఫోర్ట్ గా మార్చే ప్రక్రియను ప్రారంభించాలని ఆలేఖలో యనమల ప్రభుత్వాన్ని కోరారు
కోన ప్రాంత ప్రజల తరుపున ఇదే అంశంపై సీఎం దృష్టికి తీసుకెళ్తానని ప్రభుత్వ విఫ్ యనమల దివ్య తెలిపారు.

# సమస్యల పరిష్కారానికి సి.పి.యం వినతిపత్రం

**వి.ఆర్.పురం(మనసులోమాట) జూలై 14;**



మండల పరిధిలోని ములకనపల్లి, కుందులూరు గ్రామ పంచాయతీల్లో నెలకొన్న పలు ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సి.పి.యం నాయకులు ములకనపల్లి జోన్ కమిటీ ప్రతినిధులు స్థానిక ములకనపల్లి సచివాలయ సెక్రటరీకి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు రైతులు, గిరిజనుల సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. వీధిలైట్ల ఏర్పాటు, వర్షాకాలం ప్రారంభమవడంతో గ్రామాల్లో కరెంట్ లేక చీకటి అలుముకుంటోందని నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. వీధిలైట్లు లేకపోవడంతో విష పురుగులు, దోమల భయంతో గ్రామస్తులు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారని తెలిపారు. తక్షణమే అన్ని గ్రామాల్లో వీధిలైట్లు ఏర్పాటు చేసి వెలుతురు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే పారిశుధ్య పరిరక్షణ వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు అన్ని గ్రామాల్లో మురుగు కాల్వలను శుభ్రం చేయాలని, దోమల నివారణకు పారిశుధ్య పనులను ముమ్మరం చేయాలని కోరారు. తక్షణమే పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. తాగునీటి బోర్లు, బోర్ ప్లేట్ల నిర్మాణం గ్రామాల్లో ప్రజల దాహార్తిని తీర్చడానికి తాగునీటి బోర్లు బాగు చేయడంతో పాటు, వాటి చుట్టూ మురికి నీరు చేరకుండా పటిష్టమైన బోర్ ప్లేట్లు నిర్మించాలని కోరారు. అలాగే పాడైపోయిన మోటార్లను రిపేర్ చేసి పైప్‌లైన్ల ద్వారా సురక్షితమైన తాగునీటిని పునరుద్ధరించాలని కోరారు. రైతులకు విత్తనాలు, ఎరువులు ఆఫ్లైన్లోనే ఇవ్వాలి ప్రస్తుతం వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున రైతులకు వరి విత్తనాలు, ఎరువులను ఆన్‌లైన్ పద్ధతిలో కాకుండా ఆఫ్లైన్ విధానంలో నేరుగా అందించాలని డిమాండ్ చేశారు. సాంకేతిక ఇబ్బందుల వల్ల రైతులు నష్టపోకుండా ఉండేందుకు, దళారీల ప్రమేయం లేకుండా ప్రభుత్వం నేరుగా రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సకాలంలో పంపిణీ చేయాలని అన్నారు. జల్లివారిగూడెం, కుంజవారిగూడెం, టేకులూరు, కుందులూరు, తెల్లవారిగూడెం గ్రామాలకు 1 ఫేస్ లైన్ ఇచ్చి కెఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలి. అర్హులైన లబ్ధిదారులందరికీ 'ఎన్టీఆర్ భరోసా' పెన్షన్లు మంజూరు చేయడంతో పాటు కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలి.వీరపాపనకుంట, గొల్లగూడెం నుండి ములకనపల్లి వరకు నిలిచిపోయిన బి.టి. రోడ్ పనులు.కారంగూడెం జంక్షన్ నుండి ఏ.జి. కోడేరు వరకు తక్షణమే బి.టి. రోడ్ పనులు ప్రారంభించాలన్నారు. అధికారులు స్పందించి ఈ ప్రధాన సమస్యలతో పాటు పెండింగ్ రోడ్డు పనులు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు, గిరిజనుల పోడు భూముల పట్టాల సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని, లేనిపక్షంలో స్థానిక ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని సి.పి.యం నేతలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నూనె నాగేశ్వరరావు, కుంజ రాజయ్య, బంగారు ప్రసాద్, మోసం శేఖర్, కారం సుమన్, ముత్యాలరావు, జోగారావు, ముత్తయ్య, దుర్గారావు, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ డాగురే చారిటబుల్ ట్రస్టులో ఇన్సూరెన్స్ చేయించుకోండి

**కోటనందూరు (మనసులో మాట)జులై 14**



ప్రతి ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ దాగురే ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ చారిటబుల్ ట్రస్ట్ లో ఇన్సూరెన్స్ చేయించుకోవాలని మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి దొంగబాబు తెలియజేశారు. కోటనందూరులో అమావాస్య మీటింగ్ సందర్భంగా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దొంగబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్క ఫోటోగ్రాఫర్ ఈ ట్రస్ట్ లో ఇన్సూరెన్స్ చేయించడం వలన కుటుంబాలకు ఆసరాగా ఉంటుందని, ఇంతకుముందు ఇన్సూరెన్స్ చేయించుకున్న వారు 500 రూపాయలు చెల్లించి రెన్యువల్ చేయించుకోవాలని, కొత్తగా చేయించుకునేవారు 1000 రూపాయలు మరియు ఆధార్ కార్డు, పాస్పోర్ట్ సైజ్ ఫోటో సమర్పించాలని తెలియజేశారు. విజయవాడలో 1.2.3 తేదీల్లో జరిగే విజయవాడ ఫోటో ట్రేడ్ షోలో పాల్గొని ఇక్కడ ప్రదర్శించే నూతన టెక్నాలజీలో వచ్చే ప్రోడక్టు తెలుసుకోవాలని, మీకు కావాల్సిన స్టూడియో మెటీరియల్ ఫోటో అండ్ వీడియో కెమెరా లు మరియు మెటీరియల్ వగైరా అన్ని డిస్కౌంట్ లో లభిస్తాయని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సెక్రటరీ ప్రగడ సెక్రరావు తెలియజేశారు. ఈ సందర్భంగా ట్రేడ్ షో కి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జి రాజు, వంకల నాని, సి హెచ్ రామ్మోహన్, ఎల్ బాలరాజు, పి గణేష్, లెక్కల వెంకటరమణ, పి రాజేంద్రప్రసాద్, పి కాళిదాస్ తదితరులు పాల్గొన్నారు

## మాజీ మంత్రి ముద్రగడ మృతి పై పలువురు సంతాపం

**కాకినాడ (మనసులో మాట) జూలై 14**

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకే కాకుండా యావత్ ఉభయ తెలుగు రాష్ట్రల్లో తన వైపు తిప్పుకునేలా అనేకసార్లు ఉద్యమాలు చేసిన ఉద్యమ నాయకుడు ఎంతోమందికి ఉద్యోగ ఉపాధి కల్పించిన మహోన్నత వ్యక్తి మాజీ మంత్రి, మాజీ పార్లమెంటు సభ్యుడు ముద్రగడ పద్మనాభం మృతి యావత్ రాష్ట్రానికే తీరనిలోటని పలువురు రాజకీయ నాయకులు అభిప్రాయ పడ్డారు. ఏ పని తలపెట్టిన తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించు కున్న నాయకుడు ముద్రగడ పద్మనాభం అని తను అనుకున్నదే న్యాయమని దాని కోసం ఎంత దూరమైనా ఎంత త్యాగానికైనా అయిన తెగించి ముందుకెళ్లే సత్తా ఉన్న నాయకుడు ముద్రగడ పద్మనాభం అని పలువురు నాయకులు ఆయన సేవలను కొనియాడారు. చివరి దశలో కొన్ని అనివార్య కారణాల వల్ల ఆయనకు ఒక మచ్చని తెచ్చిపెట్టింది లేకుంటే రాష్ట్రంలో కాపుల్లో ముఖ్యమంత్రి హోదా చేసే అర్హత ఆయనకు ఉండేది కానీ ఆయన తీసుకున్న కొన్ని తొందరపాటు నిర్ణయాల వల్ల ఆయన రాజకీయ భవిష్యత్తుకే కాకుండా కుటుంబానికి కూడా తీరని



లోటని ఏది ఏమైనా ముద్రగడ మరణం రాష్ట్రానికి కాపు జాతికి తీరనిలోటని ఆయన అభిమానులు రాజకీయ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు

## విద్యా దాతలు ఆశయాలు మరువలేనివి భానోజీ రామర్స్ విగ్రహాన్ని ఆవిష్కరించిన పి గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి



**పి గన్నవరం జులై 14 (మనసులో మాట )**

అయినవిల్లి మండలం, విలాస గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో స్థలదాత కీర్తిశేషులు జిల్లెల్ల భానోజీ రామర్స్ మంగళవారం. విగ్రహాన్ని పి. గన్నవరం శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, విద్య పరమావధిగా భావించిన మహోన్నత వ్యక్తి జిల్లెల్ల భానోజీ రామర్స్ ఆశయాలు మరువలేనివని పేర్కొన్నారు.. "అన్ని దానాల్లో విద్యాదానం గొప్పది" అనే భావనతో, ఆ రోజుల్లోనే ఈ పాఠశాల కోసం 1.7 ఎకరాల స్థలాన్ని విరాళంగా ఇవ్వడం వారి గొప్ప దాతృత్వానికి నిదర్శనమని అన్నారు. అలాగే అమలాపురంలోని ఎస్కేబీఆర్ కళాశాల కోసం 24 ఎకరాల భూమిని కేటాయించడం వారి విద్యాసేవకు మరో గొప్ప ఉదాహరణ అని పేర్కొన్నారు.

ఈ పాఠశాలలో చదువుకున్న అనేక మంది విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకొని గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకు వచ్చారని తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కూడా విద్యనే ఆయుధంగా చేసుకొని ప్రపంచ మేధావిగా ఎదిగారని గుర్తు చేస్తూ, విద్యార్థులందరూ కష్టపడి చదివి తమ గ్రామానికి, మండలానికి, రాష్ట్రానికి, దేశానికి గొప్ప పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు.

అలాగే కీర్తిశేషులు జిల్లెల్ల భానోజీ రామర్స్ ఆరో కుమారుడు వెంకట శ్రీనివాస్ రామర్స్ తన తండ్రితో ఉన్న అనుబంధాన్ని, ఆయన చేసిన సేవలను సభలో వివరించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ప్రధానోపాధ్యాయులు, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు మరియు నిర్వాహకులకు ఎమ్మెల్యే ప్రత్యేక అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు మరియు స్థానికులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ 2026 గడువు పొడిగింపు

**ఏలూరు, జూలై , 14 (మనసులో మాట)**

ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్)2026 గడువును పెంచుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసారని జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి చెప్పారు. ఈ నెల 24వ తేదీ వరకు బి ఎల్ ఓ ల ద్వారా ఇంటింటికీ సందర్శిస్తారని, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రతిపాదనలు సమర్పిస్తారన్నారు. ఈనెల 31 వతేదీన ఓటర్ల జాబితా ముసాయిదా ప్రచురించడం జరుగుతుందని, ఈనెల 31వ తేదీ నుండి ఆగష్టు, 30వ తేదీ వరకు క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాలను స్వీకరిస్తారని, సెప్టెంబర్ 28 వతేదీ లోగా నోటీసులు జారీ, అభ్యంతరాలను పరిష్కరిస్తారని, తుది జాబితా అక్టోబర్, 3వ తేదీన



ప్రచురించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రతి బూత్ లెవెల్ అధికారి, తమ పోలింగ్ కేంద్రం పరిధిలో ప్రతి ఇంటిని సందర్శించి గణన ఫారంను ఓటర్లకు అందచేయ్యుట, డిజిటైజేషన్ మొదలైన కార్యక్రమాలు ఈనెల 24వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. జిల్లాలోని సమస్త ఓటర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు మరియు ప్రజలు ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేసేందుకు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ వెట్రిసెల్వి విజ్ఞప్తి చేశారు.

# కొబ్బరి పీచు ఆధారిత పరిశ్రమలకు ప్రోత్సాహం.

- రైతులు, మహిళా సంఘాలు, యువ పారిశ్రామికవేత్తలకు వ్యాపార అవకాశాలపై అవగాహన.
- జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్.



**అమలాపురం(మనసులోమాట) జూలై 14:**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ నెల 16,17 తేదీలలో నిర్వహించనున్న కోనసీమ క్వాయర్ కాంక్లేవ్ 2026 కార్యక్రమానికి అందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ రావిరాల మహేష్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కలెక్టర్ చాంబర్ నందు జిల్లా లైజనింగ్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 16, 17 తేదీలలో అనాతవరం వేదిక ఫంక్షన్ హాల్ లో నిర్వహించనున్న కోనసీమ క్వాయర్ కాంక్లేవ్ 2026 మీటింగ్ సంబంధించిన ఏర్పాట్లు, వర్క్ షాప్ నిర్వహణకు సంబంధించిన సన్నద్ధత ముందస్తు చర్యలపై సమావేశ మందిరంలో ఆయన జిల్లా అధికారులు బ్యాంకర్లు ఏపీఐఐసీ వాయర్ బోర్డ్ ప్రతినిధులు ఉద్యానవన మార్కెటింగ్ శాఖల అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష లో అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కేరళ నుండి క్వాయర్ పరిశ్రమలకు సంబంధించిన శాస్త్రవేత్తలను స్థానికంగా వర్క్ షాప్ కు పిలిపించి స్థానికంగా ఉన్న అవకాశాలపై ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పరి పూర్ణమైన అవగాహన కల్పిస్తామన్నారు. అదే విధంగా ప్రభుత్వ రాయితీ పథకాలు బ్యాంకర్ల రుణాల కల్పనతో సమన్వయపరిచి అన్ని విధాల ప్రోత్సహించి స్థానికంగా డ్వాక్రా సంఘం మహిళ లకు ఎం ఎస్ ఎం ఈ పథకాల ద్వారా మెరుగైన జీవనో పాదులు కల్పనకు కృషి చేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని లక్ష్యిత వర్గాల వారు సద్విని యోగపరుచుకోవాలని ఆయన కోరారు.

జిల్లాలో కొబ్బరి పంట విస్తారంగా పండుతుందని, అయితే కేవలం ముడి సరుకుగా కాకుండా, దాని నుండి విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసే పరిశ్రమలను స్థాపించడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరు గుతాయని పేర్కొన్నారు. ఉద్యానవన, మార్కెటింగ్, పరిశ్రమల శాఖల అధికారులు పరస్పరం సమన్వయం చేసుకుంటూ వర్క్ షాప్ విజయవంతానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. నూత నంగా పరిశ్రమలు స్థాపించాల నుకునే ఔత్సా హికులకు ప్రభుత్వ సబ్సిడీ పథకాలు, ముద్రా, పీఎంఈజీపీ వంటి రుణాల మంజూరులో బ్యాంకర్లు ఉదారంగా వ్యవ హరించాలన్నారు వర్క్‌షా ప్‌లోనే బ్యాంక్ స్టాళ్లను 2, ఉద్యాన శాఖ ఒకటి, క్వాయర్ బోర్డు 2 ,క్వాయర్ హస్తకళలకు సంబంధించి 2 , ఎం ఎస్ ఎం ఇ , తరపున ఒకటి విలువ ఆధారిత వస్తువుల తయారీ సంబంధించి 2 ,స్టాళ్లను వెరసి ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. ఈ సమా వేశంలో జిల్లా పరిశ్ర మల కేంద్రం జనరల్ మేనేజర్ అరుణ, ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ రాదామణి, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ కేశవ వర్మ, కాయర్ బోర్డ్ సహాయ అధికారి పవన్ కిరణ్, క్వాయర్ బోర్డు ప్రాంతీ య అధికారులు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి బి వి రమణ మార్కెటింగ్ శాఖ కే విశాలాక్షి, డిఆర్డిఏ పిడి: డి రాం బాబు, తదితరులు పాల్గొ న్నారు.

## మహిళలు వారి భద్రత కోసం ఉన్న చట్టాల పై అవగాహన కలిగి ఉండాలి



**వి.ఆర్.పురం (మనసులో-మాట) జూలై 14:**

భారతదేశంలో మహిళల భద్రత, సమానత్వం, సాధికారత కోసం రాజ్యాంగ హక్కులతో పాటు అనేక ప్రధాన చట్టాలు అమలులో ఉన్నాయనీ, వాటిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగివుండాలని ఎస్ఐ సాదిక్ అన్నారు. స్థానిక కేజీబీవీ స్కూల్ రేఖపల్లి నందు మహిళా చట్టాలు, సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పదవ తరగతి, ఇంటర్మీడియట్ పూర్తయిన తర్వాత ఉండే విద్యా అవకాశాల గురించి ఇంటర్మీడియట్ ప్రిన్సిపాల్ నాగుల్ మీర రేఖపల్లి ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ నీలోఫర్, ఎస్ఐ సాదిక్ అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ నీలోఫర్ మాట్లాడుతూ మారుతున్న వాతావరణం వల్ల డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వీటిని నివారించడానికి పరిసరాల పరిశుభ్రత చాలా ముఖ్యం. కాచి చల్లార్చిన నీటిని తాగడం, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చునని విద్యార్థినిలకు అవగాహన కల్పించారు.

## మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మృతి పట్ల యనమల దిగ్భ్రాంతి.

**తుని (మనసులో మాట) జూలై 14**



మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మృతి పట్ల తెలుగు దేశంపార్టీ పోలిట్ బ్యూరో సభ్యుడు మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసారు.1978లో ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి జనతా పార్టీ తరుపున పోటీ చేసి ఎమ్మెల్యే గా గెలుపొందిన ముద్రగడ పద్మనాభం ఆతర్వాత తెలుగు దేశం పార్టీలో చేరిన శాసనసభ్యుడిగాను, మంత్రి గా కాకినాడ పార్లమెంటు సభ్యుడు గా పని చేసారని గుర్తు చేసిన యనమల రామ కృష్ణుడు, ముద్రగడ హఠాన్మరణం బాధాకరమన్నారు మంత్రిగా,ఎంపీగా ఎమ్మెల్యే గా పనిచేసిన పద్మనాభం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు విశేష సేవలందించారని యనమల తన సంతాప ప్రకటనలో పేర్కొన్నారు.ముద్రగడ మృతి తీరని లోటన్నారు.పద్మనాభం మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసిన రామకృష్ణుడు,,,పద్మనాభం కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

## డ్రోన్ ద్వారా బూరుగువాడ బీట్‌లో సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమం

**వి.ఆర్.పురం(మనసులోమాట) జూలై 14:**



ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీడ్ బాల్స్ కార్యక్రమంలో భాగంగా, మంగళవారం చింతూరు అటవీ డివిజన్ పరిధిలోని వి.ఆర్.పురం రేంజ్, బూరుగువాడ సెక్షన్‌లోని బూరుగువాడ బీట్‌లో డ్రోన్ ద్వారా సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమాన్ని అటవీశాఖ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా డి. రవీంద్రనాథ్ రెడ్డి ఐఎఫ్ఎస్, డివిజనల్ అటవీ శాఖాధికారి, చింతూరు, కె. రాఘవరావు, ఎస్ ఎఫ్ ఎస్, సబ్‌డివిజనల్ అటవీ శాఖాధికారి, కూనవరం, ఎస్. రామకృష్ణ, అటవీ క్షేత్రాధికారి, వి.ఆర్.పురం పాల్గొని డ్రోన్ ద్వారా సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమాన్ని చేపట్టారు. బూరుగువాడ బీట్‌లో 18,000 సీడ్ బాల్స్ మరియు దారపల్లి బీట్‌లో 18,000 సీడ్ బాల్స్, మొత్తం 36,000 సీడ్ బాల్స్ డ్రోన్ ద్వారా వెదజల్లారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో ఆధునిక డ్రోన్ సాంకేతికతను వినియోగించి చేరుకోలేని కొండ ప్రాంతాల్లో సీడ్ బాల్స్‌ను వెదజల్లడం ద్వారా, సహజ వృక్ష సంపదను పెంపొందించడం, పచ్చదనాన్ని విస్తరించడం, జీవ వైవిధ్యాన్ని పరిరక్షించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. వర్షాకాలాన్ని సద్వినియోగం చేసుకొని, స్థానిక పరిస్థితులకు అనుకూలమైన వివిధ జాతుల విత్తనాలతో, తయారు చేసిన సీడ్ బాల్స్‌ను విస్తృత స్థాయిలో వెదజల్లడం ద్వారా, భవిష్యత్తులో అటవీ విస్తీర్ణం పెరిగి పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వి.ఆర్.పురం రేంజ్‌కు చెందిన ఎమ్.శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్, జీడిగుప్ప సెక్షన్, ఎమ్.రాధ, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్, బూరుగువాడ సెక్షన్, ఆర్. హరీష్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, బూరుగువాడ బీట్, పి.భాస్కర్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ , దారపల్లి బీట్, బేస్ క్యాంప్ హెల్పర్లు పాల్గొన్నారు.

## భీమా ప్రీమియం చెల్లింపుపై రైతుల్లో సందిగ్ధం

- గత ఏడాది నష్టపోయిన వారికి పరిహారం అందక ఆందోళన
- కలెక్టర్ కార్యాలయానికి పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదంటున్న కోలంక రైతులు

**కాజులూరు (మనసులో మాట) జూలై 14**

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో పంటల భీమా ప్రీమియం చెల్లింపుపై రైతుల్లో తీవ్ర సందిగ్ధ పరిస్థితి నెలకొంది. గత ఏడాది ప్రకృతి విపత్తులతో పంటలు దెబ్బతిన్న రైతులకు ఇప్పటికీ భీమా పరిహారం అందక పోవడంతో ఈ ఏడాది ప్రీమియం చెల్లించాలా వద్దా అనే అయోమయంలో రైతులు ఉన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతుల కథనం ప్రకారం, గత ఏడాది సంభవించిన 'మొంతా' తుఫాన్ కారణంగా పలు ప్రాంతాల్లో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. నష్టాన్ని అధికారులు నమోదు చేసినప్పటికీ, అర్హులైన రైతులందరికీ భీమా పరిహారం అందలేదని వారు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా కోలంక గ్రామ రైతులు తమకు న్యాయం చేయాలని పలుమార్లు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదులు చేసినా ఆశించిన ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భీమా పరిహారం అందక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు, ఈ ఏడాది భీమా ప్రీమియం చెల్లింపుపై సందిగ్ధంలో ఉన్నారు. గత నష్టాలకు పరిహారం అందించకుండా కొత్త సీజన్‌కు ప్రీమియం చెల్లించాలని కోరడం సమంజసం కాదని వారు అభిప్రాయపడుతున్నారు. వ్యవసాయ రంగంలో భీమా పథకం రైతులకు భరోసాగా నిలవాల్సి ఉండగా, పరిహారం మంజూరులో జాప్యం రైతుల విశ్వాసాన్ని దెబ్బతీస్తోందని రైతు సంఘాల ప్రతినిధులు పేర్కొంటున్నారు. పెరుగుతున్న సాగు ఖర్చులు, వాతావరణ అనిశ్చితి నేపథ్యంలో భీమా పరిహారం సకాలంలో అందడం అత్యంత అవసరమని వారు అంటున్నారు.

ఈ నేపథ్యంలో గత ఏడాది నష్టపోయిన రైతులకు పెండింగ్‌లో ఉన్న భీమా పరిహారాన్ని వెంటనే విడుదల చేయాలని, ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన భీమా ప్రీమియం చెల్లింపు విధానంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

# రైతుల అవసరాల మేరకు ఎరువులు అందిస్తున్నాం

- **జిల్లాలో ఎక్కడా ఎరువుల కొరత లేదు, రైతుల అవసరాల మేరకు ఎరువుల నిల్వలు ఉన్నాయి**
- **ఏపిఏఐఎంఎస్ యాప్ పై ప్రతీ రైతుకు అవగాహన కలిగించాలి**
- **జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్ లో ఎరువుల సరఫరాపై అధికారులకు, సిబ్బందికి జిల్లా కలెక్టర్ దిశా నిర్దేశం**

**ఏలూరు, జూలై 14(మనసులో మాట)**



జిల్లాలో రైతుల అవసరాల మేరకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్ లో ఎరువుల సరఫరాపై కలెక్టర్ వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా ఎరువుల కొరత లేదని,రైతుల అవసరాల మేరకు ఎరువుల నిల్వలు ఉన్నాయన్నారు. భారత ప్రభుత్వ వ్యవసాయ శాఖ మరియు ఎరువుల శాఖ సంయుక్తంగా రూపొందించిన నేషనల్ ఫెర్టిలైజర్ ఫ్రేమ్‌వర్క్ మార్గదర్శకాల మేరకు ఖరీఫ్-2026 సీజన్‌లో సబ్సిడీ యూరియా మరియు డీఏపీ ఎరువుల పంపిణీని మొబైల్ అప్లికేషన్ ద్వారా డిజిటల్ విధానంలో అమలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఏపిఏఐఎంఎస్ యాప్ పై ప్రతీ రైతుకు అవగాహన కలిగించి వినియోగించేలా వ్యవసాయ శాఖ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ఖరీఫ్-2026 సీజన్‌లో ఎరువుల పంపిణీని పారదర్శకంగా, సక్రమంగా నిర్వహించేందుకు రైతులు తమ భూమి, పంట మరియు సాగుదారు వివరాలను ముందుగానే నవీకరించుకునేలా, ఎరువుల విక్రేతలు నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ డిజిటల్ విధానం ద్వారా నిజమైన సాగుదారులకు ఎరువులు సకాలంలో అందడంతో పాటు డిమాండ్ అంచనా, సరఫరా గొలుసు నిర్వహణ మరియు ప్రభుత్వ ప్రణాళికల అమలు మరింత సమర్థవంతంగా జరుగుతుందన్నారు. ఏలూరు జిల్లాలో జూన్ 8, 2026 నుండి ఏపీ ఏఐఎంఎస్ మొబైల్ అప్లికేషన్ ద్వారా యూరియా, డీఏపీ ఎరువుల పంపిణీ విజయవంతంగా కొనసాగుతోందన్నారు. కొత్త డిజిటల్ విధానానికి రైతులు, ఎరువుల విక్రేతల నుంచి మంచి స్పందన లభిస్తున్నదన్నారు. జూన్ 8 నుంచి ఇప్పటివరకు జిల్లాలో ఏపీ ఏఐఎంఎస్ ద్వారా మొత్తం 4,290 మెట్రిక్ టన్నుల యూరియా మరియు 1,069 మెట్రిక్ టన్నుల డీఏపీ విక్రయాలు నమోదయ్యాయని వెల్లడించారు. ఈ విధానం ద్వారా రైతుల భూమి, సాగు పంటలు మరియు అర్హత వివరాల ఆధారంగా అవసరమైన ఎరువులను పారదర్శకంగా, సమర్థవంతంగా పంపిణీ చేయడంతో పాటు అనధికార కొనుగోళ్లను నివారించడం, నిజమైన సాగుదారులకు సకాలంలో ఎరువులు అందించడం, ఎరువుల దుకాణాల వద్ద రద్దీని తగ్గించడం మరియు సరఫరా వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడం లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.

ఖరీఫ్-2025 ఈ పంట వివరాలను ప్రాథమిక డేటాగా తీసుకుని ఖరీఫ్-2026 సాగు వివరాలు నవీకరించబడతాయని, రైతులు తమ గ్రామంలోని సంబంధిత రైతు సేవా కేంద్రం (ఆర్ ఎస్ కె)ను సంప్రదించి భూ వివరాలు, సాగుదారు, పంట, సాగు విస్తీర్ణం వంటి వివరాలను అవసరమైతే తప్పనిసరిగా సరిచేయించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.కొత్త సాగుదారులు లేదా మార్పులు అవసరమైన రైతులు ఆధార్, మొబైల్ నంబర్ ఆధారంగా ఓటిపి ధృవీకరణ అనంతరం తమ వివరాలను నమోదు చేసుకోవచ్చన్నారు. . ఇప్పటికే ఎరువులు కొనుగోలు చేసినట్లయితే మిగిలిన అర్హత మేరకే ఎరువులు పొందగలరన్నారు. ఎరువుల విక్రయ విధానం: చెల్లుబాటు అయ్యే ఎరువుల లైసెన్స్ కలిగిన ప్రైవేట్ రిటైలర్లు, పిఏసిఎస్ మరియు రైతు సేవా కేంద్రాలు (ఆర్ఎస్కెఎస్) మాత్రమే ఏపీ ఏఐఎంఎస్ ద్వారా యూరియా మరియు డీఏపీ ఎరువులను విక్రయిస్తాయన్నారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసే సమయంలో ఆధార్ సంఖ్య నమోదు చేయాలని, ఓటిపి ద్వారా ధృవీకరణ పూర్తి చేయాలని,భూమి,పంట మరియు ఎరువుల అర్హత వివరాలను పరిశీలించాలని,అర్హత మేరకే యూరియా లేదా డీఏపీ ఎరువులను కొనుగోలు చేయాలన్నారు. ఏపీ ఏఐఎంఎస్ లో నమోదైన ప్రతి విక్రయం ఐఎఫ్ఎమ్ఎస్ ఆధారిత పి ఓ ఎస్ యంత్రంలో అదే ఆధార్ సంఖ్యతో పూర్తిచేయడం తప్పనిసరని,రెండు వ్యవస్థల వివరాలు పరస్పరం సరిపోల్చబడతాయని, వ్యత్యాసాలు గుర్తించినట్లయితే సంబంధిత వారిపై చర్యలు తీసుకోబడతాయన్నారు. యూరియా మొత్తం అర్హత మూడు బస్తాలు లేదా అంతకంటే తక్కువగా ఉంటే రైతులు ఒకేసారి లేదా విడతల వారీగా కొనుగోలు చేయవచ్చన్నారు.మూడు బస్తాలకు మించిన అర్హత ఉన్న రైతులకు మూడు విడతల్లో సరఫరా చేయబడుతుందని,ప్రతి విడతలో మొత్తం అర్హతలో మూడవ వంతు లేదా మూడు బస్తాలు, ఏది ఎక్కువైతే అది అందజేయబడుతుందన్నారు. వరి, మొక్కజొన్న, పత్తి మరియు మిరప ప్రధాన పంటలకు ఎకరానికి ఒక బస్తా (50 కిలోలు) డీఏపీ ఎరువుకు అర్హత ఉంటుందని, ఒక్క లావాదేవీలో గరిష్ఠంగా పది బస్తాల వరకు మాత్రమే డీఏపీ కొనుగోలు చేయవచ్చన్నారు.

రైతులు ఎక్కువగా వినియోగించే ఎరువుల దుకాణాలను సంబంధిత రైతు సేవా కేంద్రాలకు అనుసంధానం చేయడం జరిగినదని,అవసరమైతే ఒకే ఎరువుల దుకాణాన్ని ఒకటి కంటే ఎక్కువ రైతు సేవా కేంద్రాలకు అనుసంధానం చేసే అవకాశం ఉందన్నారు. .

ప్రత్యేక భూములు మరియు సంస్థల నమోదు:ePanta లో లేని భూములు, సంస్థల భూములు మరియు ఇతర ప్రత్యేక భూముల వివరాలను సంబంధిత మండల వ్యవసాయ అధికారి (ఎం ఎ ఓ) ద్వారా నమోదు చేయవచ్చన్నారు. నమోదు చేసిన వివరాల ఖచ్చితత్వానికి సంబంధిత మండల వ్యవసాయ అధికారి బాధ్యత వహిస్తారన్నారు. ఎరువుల విక్రయాలను వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తారని, దుకాణాల వారీగా విక్రయాలు, రైతుల వారీ లావాదేవీలు మరియు కాలవ్యవధి వారీ యూరియా, డీఏపీ విక్రయాలపై ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించబడతాయన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన ఎరువుల దుకాణాలపై సస్పెన్షన్‌తో పాటు ప్రభుత్వ నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోబడతాయని కలెక్టర్ హెచ్చరించారు. ఏపీ ఏఐఎంఎస్ సంబంధిత సాంకేతిక సమస్యలు, నమోదు మరియు విక్రయ ప్రక్రియలపై సహాయం అందించేందుకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయబడిందని,జిల్లా స్థాయిలో కూడా సహాయ కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన మార్గదర్శకత్వం అందించబడుతుందన్నారు.

## కాకినాడ బ్యాంక్ ఆఫ్ బరోడాలో భారీ గోల్డ్ గోల్ మాల్

- **కోటి విలువైన బంగారం స్వాహా చేసిన అప్రైజర్ సూరిబాబు**

**కాకినాడ (మనసులో మాట) జూలై 14**




కాకినాడ నగరంలోని ప్రభుత్వ సర్వజన హాస్పటల్ ప్రాంగణం లో ఉన్న బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖలో భారీ మోసం మంగళవారం వెలుగుచూసింది. బ్యాంకులో బంగారం తాకట్టు పెట్టిన ఖాతాదారులను మోసం చేస్తూ దాదాపు రూ. కోటి విలువైన అసలు బంగారాన్ని మాయం చేసి, వాటి స్థానంలో నకిలీ నగలను ఉంచినట్లు తేలింది. బ్యాంకు గోల్డ్ అప్రైజర్‌గా పనిచేస్తున్న నవర సూరిబాబు (కాకినాడ గ్రామీణం, చీడిగ నివాసి) ఈ మాయకు పాల్పడ్డాడు.ఈ బ్యాంకు శాఖలో జీజీహెచ్‌కు చెందిన పలువురు వైద్యులు, నర్సులు, మినిస్టీరియల్ ఉద్యోగులు తదితర ఖాతాదారులు తమ బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి రుణాలు తీసుకున్నారు. సాధారణంగా ఖాతాదారులు తెచ్చిన బంగారాన్ని పరీక్షించి, మేనేజర్ సమక్షంలో లాకర్‌లో భద్రపరచడం అప్రైజర్ సూరిబాబు విధి. అయితే, ఇటీవల కొంతమంది ఖాతాదారులు తమ రుణాలు చెల్లించి బంగారం వెనక్కి తీసుకునేందుకు రాగా, సూరిబాబు పొంతనలేని సమాధానాలు చెబుతూ కాలయాపన చేశాడు. దీనితో అనుమానం వచ్చిన ఖాతాదారులు అతడిని గట్టిగా నిలదీశారు. ఈ విషయం పెద్దది కావడంతో బ్యాంక్ అధికారులు రికార్డులను, లాకర్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో షాకింగ్ నిజాలు బయట పడ్డాయి. రికార్డుల ప్రకారం ఉండాల్సిన 789 గ్రాముల బంగారానికి బదులుగా కేవలం 589 గ్రాముల బంగారమే ఉంది. అంతేకాకుండా, లాకర్‌లో ఉన్న ఆ ఆభరణాలు కూడా నకిలీవని కూడా తేలింది.బ్యాంక్ మేనేజర్ ఇడియాల నరసింహ భాను అభిరామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాకినాడ వన్ టౌన్ (ఒకటో పట్టణ) పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు, అప్రైజర్ నవర సూరిబాబును పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ కుంభకోణంలో ఇంకా ఎవరి హస్తమైనా ఉందా అనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు

## ఎస్ఐఆర్ ప్రక్రియ నూరు శాతం పూర్తి

- **తాహసిల్దార్ జి. రవీంద్రనాథ్ ఠాగూర్**

**కాజులూరు (మనసులో మాట) జూలై 14**



మండలంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నూరు శాతం ఆన్‌లైన్‌లో పూర్తి చేసినట్లు తాహసిల్దార్ జి. రవీంద్రనాథ్ ఠాగూర్ తెలిపారు.

మంగళవారం తాహసిల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మండల పరిధిలోని 26 గ్రామాలకు సంబంధించిన ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు వెల్లడించారు.

ఆన్‌లైన్‌లో నమోదు చేసిన ఓటర్ల వివరాలకు సంబంధించిన దరఖాస్తు ఫారాలు, ఆధార్ కార్డుల ప్రతులు, ఇతర అవసరమైన ధ్రువపత్రాలను కేటగిరీల వారీగా వేరు చేసి తహసిల్దార్ కార్యాలయానికి సమర్పించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు.

మరణించిన ఓటర్ల వివరాలు, గ్రామాంతరం వెళ్లిన వారి వివరాలు, ప్రస్తుతం గ్రామాల్లో నివసిస్తూ ఓటు హక్కుకు అర్హులైన వారి వివరాలను విడివిడిగా గుర్తించి సంబంధిత రికార్డులతో కార్యాలయానికి అందజేయాలని సూచించారు. ఓటరు జాబితా పూర్తిస్థాయిలో పారదర్శకంగా, ఖచ్చితత్వంతో రూపొందించేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తాహసిల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్ ఆదేశించారు.

## పైడి పుట్టలో అల్లూరి రచ్చబండ వద్ద గంగాలమ్మ వారికి పూజలు హోమాలు.



**రంపచోడవరం ,( మనసులో మాట) జూలై 14**

పోలవరం జిల్లా అడ్డతీగల మండలం పైడి పుట్ట గ్రామం లోఅల్లూరి శ్రీరామ రాజు రచ్చబండ ఆవరణంలో కొలువై ఉన్న శ్రీ మాతృ గంగాలమ్మ తల్లి ప్రాంగణంలో మంగళవారం అమావాస్య ను పురస్కరించుకొని పూజలు, హోమాలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ అయ్యప్ప పురోహితులు వేదమంత్రోచ్చారణనడుమ పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. గ్రామంలో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆయన ఆశీస్సులను ఇచ్చారు. ఈ పూజ హోమాధి కార్యక్రమాల్లో అల్లూరి వంశీకులు అల్లూరి మనుమడు అల్లూరి. శ్రీరామరాజు కుటుంబ సమేతంగా పాల్గొని ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతి నెల అమావాస్య రోజున పూజలు, హోమాలు నిర్వహిస్తామని, అల్లూరి శ్రీరామరాజు యువజన సంఘం వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పవన్ గిరి స్వామీజీ తణుకు. వెంకటరామయ్య దంపతులు, వి. నాగార్జున, పరదా. సోమన్న దొర దంపతులు, పరదా. పార్వతీ దంపతులు, గ్రామస్తులు పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# ఎన్టీఆర్ జిల్లా బీజేపీ ఇంచార్జ్‌గా తాతాజీ తొలి పర్యటన:



- **పార్టీ బలోపేతమే లక్ష్యం - నార్ని తాతాజీ**

**తణుకు (మనసులో మాట) జూలై 14:**

ఎన్టీఆర్ జిల్లా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నూతన ఇంచార్జ్‌గా నియమితులైన తాతాజీ జిల్లాలో తన తొలి అధికారిక పర్యటనను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు, స్థానిక నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.
పర్యటనలో భాగంగా నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.
జిల్లా సరిహద్దుకు చేరుకున్న తాతాజీకి పార్టీ కార్యకర్తలు బైక్ ర్యాలీతో ఎదురేగి ఘనంగా స్వాగతించారు. ప్రతి డివిజన్, మండల పరిధిలో బూత్ స్థాయి కమిటీలను బలోపేతం చేయాలని దిశా నిర్దేశం చేశారు. సీనియర్ నాయకులు, యువ కార్యకర్తలు సమన్వయ లోపం లేకుండా కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. స్థానిక ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ, బీజేపీ నిరంతరం గళం విప్పాలని దిశా నిర్దేశం చేశారు. భవిష్యత్తు కార్యాచరణను వివరిస్తూ రాబోయే రోజుల్లో ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించి పటిష్టమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

## జగన్ భీమవరం పర్యటన విజయవంతానికి ఆచంటలో వైసీపీ సమాయత్తం

**ఆచంట, జూలై 14(మనసులో మాట)**



వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈనెల 15న పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో పర్యటించి ఆక్వా రైతులు, రైతు నాయకులతో సమావేశం కానున్న నేపథ్యంలో ఆచంట నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు సమాయత్తమయ్యాయి.
ఈ సందర్భంగా ఆచంట నియోజకవర్గ వైసీపీ కార్యాలయంలో మాజీ మంత్రి, నియోజకవర్గ కోఆర్డినేటర్ చెరుకువాడ శ్రీరంగనాథ రాజు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. చెరుకువాడ నరేష్ రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ ఏపీ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్, మాజీ రుడా చైర్పర్సన్, రాష్ట్ర పార్లమెంట్ కార్యదర్శి, ఆచంట నియోజకవర్గ పరిశీలకురాలు మేడపాటి షర్మిళ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. భీమవరంలో జరిగే వైఎస్ జగన్ పర్యటనను విజయవంతం చేయాలని సమావేశంలో నాయకులు పిలుపునిచ్చారు. నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, ఆక్వా రైతులు పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలని నిర్దేశించారు. పర్యటన విజయవంతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పార్టీ బలోపేతంతో పాటు రైతుల సమస్యలను బలంగా వినిపించే వేదికగా ఈ పర్యటన నిలవాలని నాయకులు అభిప్రాయపడ్డారు.

# ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు: జగ్గిరెడ్డిపై భగ్గుమన్న టీడీపీ శ్రేణులు

- **పోలీసులకు ఫిర్యాదు**

**అమలాపురం(మనసులోమాట) జూలై14:**



వైస్సార్ కాంగ్రెస్ పార్టీ డా||బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డిపై టీడీపీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. సోమవారం కొత్తపేట నియోజకవర్గం పిచ్చుకలంకలో పర్యటించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై, ముమ్మిడివరంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో జగ్గిరెడ్డి చేసిన వ్యాఖ్యలను టీడీపీ తీవ్రంగా ఖండించింది.
రామచంద్రపురం నియోజకవర్గం టీడీపీ పార్టీ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో జిల్లా టీడీపీ అధ్యక్షులు గుత్తుల సాయి మాట్లాడుతూ... జగ్గిరెడ్డి ముఖ్యమంత్రిపై ఆరోపణలు చేస్తూ, బీసీ ఉపకులాలు అయిన సంచార జాతులకు చెందిన "బుడబుక్కల" సామాజిక వర్గాన్ని తీవ్రంగా కించపరిచేలా మాట్లాడారని మండిపడ్డారు. వెనుకబడిన, సంచార జాతుల సామాజిక వర్గాలను అవమానించినందుకు గానూ జగ్గిరెడ్డి వెంటనే బీసీ ఉపకులాలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.
ఈ సమావేశంలో రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు, రాష్ట్ర ఎంబీసీ చైర్మన్ పెంద్ర రమేష్, రామచంద్రపురం ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్ తదితరులు పాల్గొని జగ్గిరెడ్డి వైఖరిని తప్పుపట్టారు.

**పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు**

ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు, బీసీ ఉపకులాలను కించపరిచిన చిర్ల జగ్గిరెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ నాయకులు పోలీసులను ఆశ్రయించారు. రామచంద్రపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్ లను కలిసి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో టీడీపీ జిల్లా అధ్యక్షులు గుత్తుల సాయి, జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు, రాష్ట్ర చైర్మన్ పెంద్ర రమేష్, కోనసీమ జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ & మానిటరింగ్ కమిటీ డైరెక్టర్ వెంట్రు సుధీర్ ఉన్నారు.

# పవర్‌పేట ఆర్వోబీతో నగరాభివృద్ధికి కొత్త దిశ: ఎమ్మెల్యే బడేటి చంటి





**ఏలూరు, జూలై 14 (మనసులో మాట)**

ఏలూరు నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. భవిష్యత్తులో నగర ప్రజలకు రాకపోకల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు పవర్‌పేటలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుతో వ్యాపారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నష్టపోయే వారికి నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు.
మంగళవారం ఏలూరులోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే, వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.
ఈ సందర్భంగా పవర్‌పేట స్టేషన్ రోడ్డుకు చెందిన వ్యాపారులు ఎమ్మెల్యేను కలిసి, ఆర్వోబీ నిర్మాణం వల్ల తమ వ్యాపారాలకు నష్టం కలుగుతుందని, ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే బడేటి చంటి, ఆర్వోబీ నిర్మాణం వల్ల వ్యాపారాలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు. బ్రిడ్జికి ఇరువైపులా సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయనున్నందున ప్రజల రాకపోకలు, వ్యాపార కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు.
పవర్‌పేట లోబ్రిడ్జిలో వర్షాకాలంలో నీరు నిల్వ ఉండడం వల్ల తరచూ రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని, రాబోయే రోజుల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా మారే అవకాశం ఉందన్నారు. ఈ పరిస్థితికి శాశ్వత పరిష్కారంగా ఆర్వోబీ నిర్మాణం అవసరమని పేర్కొన్నారు. నగరంలోని సుమారు మూడు లక్షల మంది ప్రజల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.
అలాగే 2029 నాటికి దేశవ్యాప్తంగా రైల్వే గేట్లను తొలగించాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగానే ఈ ప్రాజెక్టు చేపడుతున్నట్లు వివరించారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నగరాభివృద్ధికి అందరూ సహకరించాలని ఆయన కోరారు. సర్వీస్ రోడ్లతో వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, అవసరమైతే ప్రత్యామ్నాయ ప్రాంతాల్లో కూడా వ్యాపారాలను కొనసాగించుకునే అవకాశాలు ఉంటాయని ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు.

# బీజేపీ నేత కు మాతృ వియోగం... పలువురి పరామర్శ...

**మండపేట (మనసులో మాట) జూలై 14**

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కపిలేశ్వరపురం మండల అధ్యక్షుడు నామాల శ్రీనివాస్ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన మాతృమూర్తి నామాల సత్యవతి (80) మరణించారు. సత్యవతి మరణవార్త తెలియడంతో కపిలేశ్వరపురం మండలంలో విషాద ఛాయలు అలముకున్నాయి. విషయం తెలుసుకున్న పలువురు రాజకీయ, సామాజిక ప్రముఖులు, స్థానిక నాయకులు బీజేపీ శ్రేణులు నామాల శ్రీనివాస్ నివాసానికి చేరుకుని, దివంగత సత్యవతి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ నెక్కంటి శ్రీ రాంజీ,పర్వతిన మురళీ కృష్ణ (చిన్నా), బలవరెడ్డి సత్తిబాబు, నియోజకవర్గం బీజేపీ సీనియర్ నేతలు కోన సత్యనారాయణ, కోటిపల్లి సాయిరాం, లొల్ల రాంబాబు, తదితర నేతలు పరామర్శించి
ఈ కష్టసమయంలో నామాల శ్రీనివాస్ కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని,ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని పలువురు ప్రముఖులు తమ గాఢ సానుభూతిని వ్యక్తం చేశారు



KANCHARLA
# మనసులోమాట
సంచలన తెలుగు దిన పత్రిక

## అమరావతి

| | | |
|---|---|---|
| ఎన్టీఆర్ | పల్నాడు | కృష్ణ |
| గుంటూరు | బాపట్ల | ప్రకాశం |

బుధవారం 15 జూలై 2026 పేజీలు 16






# పల్నాడు చరిత్రలోనే సువర్ణ అధ్యాయం

- ఆధునిక దేవాలయం మెడికల్ కళాశాల
- పిడుగురాళ్ల మెడికల్ కాలేజ్ కి 100 ఎంబిబిఎస్ సీట్లు కేటాయింపు పట్ల హర్షం
- రాష్ట్రంలో అతి పెద్ద ప్రభుత్వ మెడికల్ కళాశాల పిడుగురాళ్లదే
- పల్నాడు ప్రాంతంపై సీఎం చంద్రబాబు కు ఉన్న అభిమానానికి నిదర్శనం
- త్వరలో పిడుగురాళ్ల మెడికల్ కళాశాలలో సీఎం చంద్రబాబు పర్యటన
- మూడు దశాబ్దాలు ఆదరించిన ప్రజల రుణం తీర్చుకునే అవకాశం వచ్చింది
- వ్యక్తిగత నిధులతో 4.50 లక్షల పేపర్ మెడికల్ కవర్ల పంపిణీ

**దాచేపల్లి , జూలై 14: ( మనసులో మాట )**

పల్నాడు చరిత్రలోనే ఈరోజు సువర్ణ అధ్యాయాలతో లిఖించవలసిన రోజని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం సాయంత్రం పిడుగురాళ్ల మెడికల్ కళాశాలలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన నరసరావుపేట ఎంపీ కృష్ణదేవరాయలతో కలసి పాల్గొన్నారు. మొట్టమొదటిసారి 1994లో తాను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పుడు పరిస్థితులు వేరే విధంగా ఉండేవన్నారు. పల్నాడు అభివృద్ధికి నోచుకోక కక్షల కార్పన్యాలతో రగిలిపోతూ ఉండేదన్నారు. అభివృద్ధికి ఆటంకంగా ఉన్న ఫ్యాక్షనిజాన్ని రూపుమాపాలని అప్పుడే నిర్ణయించుకున్నామన్నారు. రోడ్డు ప్రమాదంలో, లేదా ఘర్షణల లో గాయపడిన వ్యక్తులను వైద్యం కోసం తీసుకువెళ్లాలంటే దూరంగా ఉన్న గుంటూరు లేదా నరసరావుపేట తరలించవలసి వచ్చేదన్నారు. ఈ లోపు ఎంతో

..మిగతా6లో



11

## నీటివనరులసద్వినియోగంతోనేనియోజకవర్గ అభివృద్ధి ముడిపడి ఉంది : ప్రత్తిపాటి

- ప్రధాన వాగుల ఆధునికీకరణ, ఎత్తిపోతల పథకాల నిర్వహణ, చెక్ డ్యాముల నిర్మాణంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి
- వాగుల అభివృద్ధి, సాగు..తాగునీటి అవసరాల నిమిత్తం రూ.5కోట్ల ప్రత్యేక నిధులు అందిస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.
- ప్రధాన పంట కాలువలపై డ్రాపుల నిర్మాణం.. షట్టర్ల ఏర్పాటుకు అవసరమైన ఆర్థిక సాయం అందజేతకు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల అంగీకరించారు.
- కొండవీడు పర్యాటకాభివృద్ధికి దోహదపడేలా, నీటి అవసరాలు తీర్చేలా కొండలమధ్య నక్కవాగుపై నిర్మించే చెక్ డ్యామ్ నిర్మాణానికి కేంద్ర నిధులు మంజూరయ్యేలా చూస్తానని మంత్రి పెమ్మసాని భరోసా ఇచ్చారు.





8

## గురుకుల పాఠశాల అధ్యాపకుల నిరాహార దీక్ష

## పొగాకు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి




- ఈనెల 16న కనిగిరి...
- 17న ఒంగోలులో పొగాకు రైతు దీక్ష
- వైసిపి జిల్లా పార్టీ అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి వెల్లడి

8



9

## సింగరాయకొండ లో రైలు కింద పడి నలుగురు సూసైడ్

# కారంపూడి గ్రామ కార్యదర్శి సస్పెన్షన్ పై అనుమానాలు...

**కారంపూడి, జులై 14, ( పల్నాడు జిల్లా ) మనసులో మాట :**

పల్నాడు జిల్లా కారంపూడి మండలం కారంపూడి గ్రామానికి చెందిన గ్రామ కార్యదర్శి కశిన్య నాయక్ ను జిల్లా ఉన్నతాధికారులు సస్పెన్షన్ చేయటంపై గ్రామ ప్రజలు అనేక అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా అవినీతి కార్యకలాపాలపై సస్పెన్షన్ చేస్తే అది వేరుగా ఉంటుందని, ఓటర్ల జాబితా డిజిట్లైజేషన్ చేసే కార్యక్రమంలో కారంపూడి కార్యదర్శి అశ్రద్ధ వహించారని ఇతను పై చర్యలు తీసుకున్నట్లుగా పల్నాడు జిల్లా డిఆర్ఓ తమ ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఈనెల 11, 12 తేదీలలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ఓటర్ల జాబితా సవరణ, డిజిటలైజేషన్ వేగవంతం చేయాలని పలనాడు జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్ల టెలికాన్ఫరెన్స్లో మౌఖిక ఆదేశాలను జారీ చేశారని అధికారులు తెలియజేస్తున్నారు. అయితే ఏ ఈ ఆర్ ఓ మరియు కారంపూడి మండల రెవెన్యూ ఆఫీసర్ వెంకటేశ్వర్లు నాయక్ ఇచ్చిన స్టేట్మెంట్ ఆధారంగా గ్రామ కార్యదర్శి కసిన్యా నాయక్ పై చర్యలు తీసుకున్నట్లుగా డిఆర్ఓ ఉత్తర్వులలో పేర్కొన్నారు. అంతేకాకుండా కార్యదర్శి చేయవలసిన పనిని మండల ఇంజనీరింగ్ అసిస్టెంట్ శేషల్యా తన మొబైల్ ఫోన్ ద్వారా ఓటర్ల జాబితా డిజిట్లైజేషన్ చేశారని,తన విధులలో నిర్లక్ష్యం వహించాడనియు, 11 12 తేదీలలో బిఎల్ఓ ల సమావేశానికి గైరాజరయ్యాడని, కారంపూడి ఏ ఈ ఆర్ వో మరియు తాసిల్దార్ సదరు గ్రామ కార్యదర్శి పై వ్రాత పూర్వకమైన ఫిర్యాదును డిఆర్ఓ కి ఇవ్వటం వలన చర్యలు తీసుకున్నట్లుగా జిల్లా ఆఫీసరు తెలియజేస్తున్నారు. అయితే కారంపూడి ఏఈఆర్ఓ మరియు తాసిల్దారు ఏమి విచారణ చేయకుండా తనకు తోచినట్లుగా తను ఫిర్యాదు చేయడంలో ఔన్నత్యం ఏమిటని గ్రామ ప్రజలకు ప్రశ్నిస్తున్నారు?. ఇక్కడ ఏ ఈ ఆర్ ఓ మరియు తాసిల్దార్ అసలు విషయం మర్చిపోయి, ఎవరి ప్రోత్సాహంతోనో ఈ ఫిర్యాదు చేసినట్లుగా కనిపిస్తుందని విమర్శిస్తున్నారు. పల్నాడు జిల్లా డిఆర్ఓ మాచర్ల నియోజకవర్గం లో మొత్తం 24 మంది బిఎల్వోలు ఓటర్ల జాబితా సవరణ, డిజిట్లైజేషన్ కార్యక్రమంలో తమ విధులను సరిగా నిర్వర్తించడం లేదని షో కాజ్ నోటీసులను ఇవ్వడం జరిగినది. ఈ 24 మందిలో కారంపూడి గ్రామ కార్యదర్శి కసిన్యా నాయక్ కూడా ఉన్నారు. ఈ నోటీసును సీరియస్ గా తీసుకున్న గ్రామ కార్యదర్శి తనకు అసిస్టెంట్ గా ఉన్న తన భార్య శేషల్యా తో కలిసి ఈనెల 10వ తారీఖు నాటికి తనకు కేటాయించిన బూత్ నెంబర్ 289లో ఓటర్ల జాబితా సవరణ, డిజిట్లైజేషన్ కారంపూడి మండలంలో మొట్టమొదటిసారిగా 100% పూర్తి చేసిన వారిలో మూడో వ్యక్తిగా కసిన్యా నాయక్ ఉండటాన్ని కూడా గమనించకుండా కారంపూడి మండల తాసిల్దార్ ఇలా రిపోర్ట్ ఇవ్వడం అక్రమ పద్ధతి ద్వారా ఈ కార్యదర్శి పై చర్యలు తీసుకోవాలని ఆలోచనలో ఉన్నట్లుగా తెలుస్తుందని గ్రామ ప్రజలు విమర్శిస్తున్నారు. ఈనెల 11వ తారీకు బిఎల్ఓ ల సమావేశానికి గ్రామ కార్యదర్శి గైర్హాజర్ కావటం కాదని, సర్ కార్యక్రమంలో తాను 100% డిజిటలైజేషన్ చేశానని, ఈనెల 11 వ తారీకు రెండవ శనివారం మెగా న్యాయ అదాలత్ ఉన్నందున అధికారికంగా, ఈ అదాలత్ కార్యక్రమానికి హాజరైనట్లుగా కార్యదర్శి కసిన్య నాయక్ చెప్పున్నట్లుగా తెలియ వచ్చింది. అసలు నిజానిజాలు తెలుసుకోకుండా గ్రామపంచాయతీ సర్పంచ్ తన షెడ్ ను పడేపించాడనే కోపంతో, ఈ గ్రామ కార్యదర్శి పై కక్ష పెంచుకున్న ఒక వ్యక్తి చూపించిన తప్పుడు సాక్షాలను ఆధారాలు చేసుకొని మండల రెవెన్యూ అధికారి ఇతనిపై చర్యలు తీసుకోవలసినదిగా కోరుతూ డి ఆర్ వో కు ఫిర్యాదు చేయటం పై పలు విమర్శలు ఎదుర్కొంటున్నాడు. ఈనెల 12వ తారీకు ఆదివారం సాయంత్రం వరకు కూడా రెవెన్యూ సిబ్బంది తమ ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం 100% పూర్తి చేయని రెవెన్యూ సిబ్బందిని వదిలివేసి, తన పని తను చేసుకున్న పంచాయతీ రాజ్ సిబ్బందిపై ఈ విధమైన చర్యల కొరకు ఫిర్యాదు చేయటం ఏమిటని మండల ప్రజలు మండలాధికారిని సూటిగా ప్రశ్నిస్తున్నారు. బి ఎల్ వోలు సమావేశానికి ఎందుకు గైరాజరయ్యారని కనీసం సదరు కార్యదర్శి వివరణ తీసుకోకుండా జిల్లా అధికారులు అతనిపై చర్యలు తీసుకోవడంలో ఆంతర్యం ఏమిటని మండల ప్రజలు పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరిగినా సదరు గ్రాము కార్యదర్శిని విధుల నుండి తప్పించవలసిన అధికారులకు ఎటువంటి ఉత్తర్వులు రాకపోవటం ఇక్కడ విశేషం.





[illegible]

Electoral Registration Officer
191- Macherla Assembly Constituency &
District Revenue Officer
Palnadu

[illegible]





## దాచేపల్లి రూరల్ పరిధిలో 41 పోలింగ్ స్టేషన్ లు : తహసిల్దార్ శ్రీనివాస్ యాదవ్

**దాచేపల్లి, జులై 14 :( మనసులో మాట )**

దాచేపల్లి (రూరల్) పరిధిలో మొత్తం 41 పోలింగ్ స్టేషన్ లను గుర్తించినట్లు దాచేపల్లి తహసిల్దార్ జి. శ్రీనివాస్ యాదవ్ మంగళవారం తెలిపారు. మొత్తం 34711 ఓటర్లను గుర్తించగా వారిలో 34711 మందికి అంటే అందరికీ EFs పంచామన్నారు. వీటిలో 31882 ఓట్లను డిజిటలైజ్ చేశామన్నారు. 1174 మంది చనిపోయినట్లు గుర్తించామన్నారు. వీరిలో 1007 మంది మైగ్రేషన్ వెళ్లినట్లు చెప్పారు డబల్ ఓట్లు 353 మంది, ఆబ్సెంట్ 279 మంది, ఇతరులు:1 గా గుర్తించామన్నారు. మొత్తం 2814 ఓట్లను క్లియర్ చేయాల్సి ఉదన్నారు. కాగా 2002నాటి ఓటర్ల లింక్ చూపని వాళ్ళు 1603 మంది ఉన్నట్లు తహసిల్దార్ వివరించారు.

## ముద్రగడ మృతి పట్ల ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ సంతాపం

**వినుకొండ--జులై 14,, (మనసులో మాట)**

మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం తుది శ్వాస విడిచారనే వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు తెలిపారు. 1978లో తొలిసారిగా శాసనసభ్యుడిగా ఎన్నికై ప్రజా జీవితంలో విశిష్ట సేవలందించిన ముద్రగడ పద్మనాభం నాలుగు పర్యాయాలు శాసనసభకు, ఒకసారి కాకినాడ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పార్లమెంట్‌కు ఎన్నికై ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముద్రగడ పద్మనాభం పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. వారి కుటుంబ సభ్యులు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.





## విద్యుత్ శాఖ విజిలెన్స్ తనిఖీలు: రూ. 3.88 లక్షల జరిమానా

**యడ్లపాడుజులై 14 మనసులో మాట**

యడ్లపాడుసెక్షన్ పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం విద్యుత్ శాఖ విజిలెన్స్ మరియు ఆపరేషన్ అధికారులు సంయుక్తంగా విస్తృత తనిఖీలు నిర్వహించారు. 32 బృందాలుగా ఏర్పడిన అధికారులు మొత్తం 1479 విద్యుత్ సర్వీసులను పరిశీలించారు. ఇందులో మీటర్లు లేకుండా డైరెక్టుగా కరెంటు వాడటం, విద్యుత్ చౌర్యం, అక్రమ వినియోగం, మరియు అనుమతించిన దానికంటే అదనపు లోడు వాడుతున్న కేసులను గుర్తించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి మొత్తం రూ. 3.88 లక్షల అపరాధ రుసుము విధించినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సి.హెచ్. వెంకటేశ్వరరావు, వై. ఏడుకొండలు ఒక ప్రకటనలో తెలిపారు.

మీటర్ల సీల్స్ ధ్వంసం చేసినా, విద్యుత్ చౌర్యానికి పాల్పడినా చట్టపరంగా కఠిన చర్యలు (అరెస్ట్ లేదా ఆస్తుల జప్తు) తప్పవని అధికారులు హెచ్చరించారు. ఎవరైనా విద్యుత్ చౌర్యంపై సమాచారం ఇవ్వదలిస్తే 9440812263, 9440812360నంబర్లకు కాల్ లేదా వాట్సాప్ ద్వారా సంప్రదించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని వారు స్పష్టం చేశారు.



## పొలం పిలుస్తుంది కార్యక్రమం

**రేపల్లె జులై 14 మనసులోమాట**

వ్యవసాయ మరియు అనుబంధ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం రేపల్లె మండలంలోని బేతపూడి మరియు గుడ్డికాయలంక గ్రామాల్లో "పొలం పిలుస్తోంది" కార్యక్రమం వ్యవసాయశాఖాఆధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ప్రస్తుత వ్యవసాయ పరిస్థితి ఇఎల్ ఎన్ ఐ ఎన్ ఓ , శాస్త్రీయ సాగు పద్ధతులు, ఆంధ్రప్రదేశ్ ఫార్మర్ రిజిస్ట్రీ (ఏ పి ఎఫ్ ఆర్. ) ప్రాముఖ్యత, నమోదు విధానం, నూతన ఎరువుల విధానం మరియు ఏ పి ఎ ఐ ఏం ఎస్ 2.0 యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు.అదేవిధంగా ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (. పీఎం ఎఫ్ బి వై) ద్వారా వరి పంటకు ఎకరానికి సుమారు రూ.800 ప్రీమియంతో రూ.40,000 వరకు బీమా రక్షణ లభిస్తుందని వివరించారు.అలాగే సాయిల్ హెల్త్ కార్డులు, సి సి ఆర్ సి కార్డులు మరియు ఇతర వ్యవసాయ శాఖ పథకాలపై రైతులకు అవగాహన కల్పించి, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ లు సుమంత్, పావని, గ్రామ వ్యవసాయ సహాయకులు శివకృష్ణ, కొండలు, వీఆర్వోలు మరియు రైతులు పాల్గొన్నారు.





# ఎమ్మెల్యే జీవి జోక్యంతో అయిన పాలెం గ్రామంలో చౌక బియ్యం పంపిణీ

- **గరికపాడు గుమనంపాడు, రేమిడిచర్ల గ్రామాల చౌక డిపోల నుండి నిల్వలు తరలింపు**
- **అయ్యన్నపాలెం ఆన్లైన్లో బియ్యం నిలువలు**
- **క్షేత్రస్థాయిలో ఖాళీ గదులు**

**వినుకొండ -జూలై 14,, (మనసులో మాట )**

బొల్లాపల్లి మండలం లోని పాలెం గ్రామంలో గత మూడు నెలలుగా రేషన్ బియ్యం పంపిణీ జరగటం లేదంటూ ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో సోమవారం రాత్రి శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు జోకింగ్ చేసుకొని అయ్యన్నపాలెం గ్రామంలో తక్షణమే బియ్యం పంపిణీ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు ఆయన ఆదేశాల మేరకు మంగళవారం అయ్యన్న పాలెం గ్రామంలోని చౌక దుకాణానికి వాహనంలో పెద్ద సంఖ్యలు బియ్యం మూటలు తీసుకొచ్చి పంపిణీ కార్యక్రమం మొదలుపెట్టారు దీంతో గ్రామానికి చెందిన లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేశారు ఇదిలా ఉండగా గత మూడు నెలలుగా గ్రామంలో లబ్ధిదారులకు బియ్యం పంపిణీ జరగలేదు స్థానికులు ఆందోళన మీదకు మంగళవారం మండలంలోని గరికపాడు గుమ్మనంపాడు రేమిడిచర్ల గ్రామాల చౌక డిపోల నుండి బియ్యం నిల్వలను తీసుకువచ్చి అయిన పాలెం గ్రామంలో పంపిణీ కార్యక్రమం చేపట్టారు మూడు నెలలుగా పంపిణీ కానీ ఆయన పాలెం చౌక డిపో నిల్వలు ఏమయ్యాయి అనేది ప్రశ్నగా మారింది. లబ్ధిదారులకు పంపిణీ కానందున సదరు స్టాక్ రిజిస్టర్ లో నిలువలు ఉన్నట్లుగా ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తుంది మరి క్షేత్ర పరిశీలనలో బియ్యం నిల్వలు లేవు మరి సదరు బియ్యం నిలువలు ఏమైనట్లు అనేది ప్రశ్న గా మారింది. కాగా మంగళవారం నాడు పంపిణీ చేసిన బియ్యం మూటలు మండలంలోని గరికపాడు గుమ్మంపాడు లేమడిచర్ల గ్రామాల నుండి ఇక్కడికి తరలించినట్లు తెలుస్తుంది వాటిని ఇక్కడి లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లయితే మరి ఆ మూడు గ్రామాల లబ్ధిదారులకు బియ్యం పంపిణీ సంగతి ఎలా చేస్తారు అనేది మరో ప్రశ్నగా మారింది మొత్తం మీద మండలంలో చౌక డిపోల బియ్యం పంపిణీ కార్యక్రమం గూడుపుఠాణిగా మారినట్లు కోచరిస్తుంది ఆచరణలో లబ్ధిదారులకు గుప్పెడు బియ్యపు గింజలు పంపిణీ కావు, పంపిణీ కానీ బియ్యం రేషన్ షాపులో నిల్వలు ఉన్నట్లు యంత్ర పరికరాలలో గోచరిస్తూ ఉంటుంది, కానీ ఆచరణలు మాత్రం షాపులో ఒక గింజ కూడా కనిపించదు. ఇలాంటి విచిత్ర ధోరణి బొల్లాపల్లి మండలంలో దాదాపుగా కనిపిస్తుంది దీనిని బట్టి బొల్లాపల్లి మండలంలో ఈఎం మాఫియా చాప కింద నీరుల జోరుగానే సాగుతుందని అర్థమవుతుంది అయితే సాధారణంగా రేషన్ షాపు డీలర్లు ఇలాంటి అవినీతికి పాల్పడడం సహజం కానీ ప్రస్తుతం అందుకు భిన్నంగా బియ్యం తరలింపులో అధికారులే అగ్రస్థానముగా చేతివాట ప్రదర్శిస్తున్నారు అని స్పష్టమవుతుంది ఇదంతా ప్రజాప్రతినిధులకు తెలిసి జరుగుతుందా లేదా అనేది ఆలోచించాల్సిందే. గరికపాడు, గుమ్మనంపాడు,రేమిడిచర్ల గ్రామ చౌక డిపోల బియ్యం అయ్యన్నపాలెం గ్రామానికి తరలించడంతో పై మూడు గ్రామాలకు బియ్యం పంపిణీ ఉంటుందా లేదా అనేది ఆ గ్రామ లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు దీనిపై ఉన్నతాధికారులు ప్రజాప్రతినిధులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది

# మంత్రిఎస్ సవితాను కలసి న ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ జేఏసీ ప్రతినిధి వర్గం

**చిలకలూరిపేట జులై 14 మనసులో మాట**

గరిటపల్లి మహేంద్ర హత్య కేసు విషయంలో న్యాయం చేయాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ నాయీబ్రాహ్మణ జేఏసీ ప్రతినిధి వర్గం బిసి శాఖ మాత్యులు సవిత ను క్యాంప్ కార్యాలయంలో స్వయంగా కలిసి బాదిత కుటుంబానికి న్యాయం చేయాలని వినతి పత్రం అందజేశారు. మంత్రిసవితా స్పందిస్తూ బాధిత కుటుంబానికి టిట్ కో ఇల్లు ఇవ్వాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తో మాట్లాడగా టిట్ కో ఇల్లు అవకాశం లేదు ఇంటి స్థలం తప్పకుండ ఇద్దాం అని చెప్పారని, ఎక్స్ గ్రేషియా విషయం కూడా మంత్రి సవితా ఎమ్మెల్యేని అడగగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము స్పందిస్తూ ఎక్స్ గ్రేషియా ఇచ్చే బాధ్యత నాది తప్పకుండా ఇస్తాను అని చెప్పారని తెలియజేశారు. అనంతరం బార్బర్ షాపులకు 200 యూనిట్లుఉచితంగా ఇచ్చేవిషయమై సిఎండి తో మాట్లాడుతూ చేనేతలకి 500 యూనిట్లు పైబడి వచ్చిన యూనిట్ కి బిల్లు కట్టే విధంగా ఉన్న పద్ధతి ప్రకారం నాయీ బ్రాహ్మణ బార్బర్ షాపులకి కూడా 200 యూనిట్లు ఉచితంగా ఇచ్చి 200యూనిట్లు కంటే ఎక్కువ కాల్చుకునేటువంటి యూనిట్లకు బిల్లు కట్టే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించటమైనది. ఆదరణ పథకం ద్వారా



పనిముట్లు త్వరలో అందించటం జరుగుతుందని మంత్రి సవితాజేఏసీ ప్రతినిధి వర్గానికి తెలిపారు. మంత్రి సవితా టైం కేటాయించి సానుకూలంగా స్పందించి నాయీబ్రాహ్మణ సమస్యలపై ప్రత్యేకంగా స్పందించటం స్వాగతించ వలసిన అంశం అని అన్నారు. నాయీబ్రాహ్మణజేఏసీ ప్రతినిధి వర్గం సవితా ను ధుశ్యాలువా తో చిరు సత్కారం చేశారు. ఆంధ్రప్రదేశ్ నాయి బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు టి దుర్గారావు ఎమ్ ఎస్ వి సుబ్బారావు తదితరులు ఉన్నారు.

# ఎన్నో ఒడిదుడుకుల మధ్య అన్నదాతలు

**నాదెండ్ల జూలై14 మనసులో మాట**

రైతు లేనిదే రాజ్యం లేదు అన్నదాతలె దేశానికి వెన్నెముక జైకిసాన్ అంటూ జేజేలు పలుకుతూ పల్లకీల మూతలే మాటలు కోటలు దాటుతున్నాయి. చేతులు తంగేళ్లు దాటడం లేదన్నట్టు ఉంది నిజానికి రైతు శ్రమకు తగినంత గుర్తింపు గౌరవం ఇస్తున్నామంటే అది లేదని చెప్పాల్సి వస్తుంది. ఎందుకంటే మన దేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు గడిచిపోయిన వ్యవసాయ రంగం తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతుంది కానీ పారిశ్రామిక సాంకేతిక సేవ రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. జాతీయ స్థూల విలువ జోడింపులు (జీవీవీ) వ్యవసాయం తాను అనుబంధ రంగాలు వాటా తగ్గుతుంది కృత్రం మీద ఏఐ అన్ని రంగాల్లోనూ ప్రవేశించే ప్రగతి పరుగులు పెట్టిస్తుంటే వ్యవసాయ రంగం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందాగా పూనా జరుగుతుంది. రైతుల ఆత్మహత్యలు ఆపలేకపోవడం పాలకుల లోపమా రైతుల శాపమా ఏది ఏమైనా బలిపీఠంపై ఉన్న సాగును బాగుపడేలా చేస్తూ రైతును రాజులు చేసే సంఘటన ఏమో కానీ కనీసం ఆత్మహత్యలను నివారించవలసి ఉంటుందని కాదనలేని నిజం అప్పుడే నేటితరం యువత రంగంలోకి రాగలరు. ఈమధ్య రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కల్పించడం అభినందనీయమే కానీ మనదేశంలో ఎక్కువమందికి జీవనోపాధి కల్పించే సాగును దాన్నే నమ్ముకున్న



రైతాంగం బాగుపడ్డ రోజే వారి జీవితాల్లో ఆనందం. ఏడాది వర్షాలు పడతాయని వాతావరణ శాఖ ప్రకటించింది అలానే జులై నెల దాటిన ఋతుపవనాలు తొలకరి కురిసి మెరిపించింది జూలై అయిపోయిన ఆకాశమేఘాకృతం అయి ఉంటుంది కానీ వర్షాలు పడటం లేదు, తొలకరి వానాలకు నాటిన పత్తి తదితర పంటల కోసం రైతు నో సిటీ నా చేయు పెట్టి ఆకాశం వైపు ఆ ఎదురు చూస్తున్న పరిస్థితులు ఎన్నేళ్లయిన మారనే లేదు. లేదు. మనదేశంలో మనదేశంలో అన్నదాతలకు ఎంతో ముఖ్యమైన కాలం ఇదే, జాతికి మెతుకునిచ్చి బతుకు నిలిపే రైతన్నపడమని పొత్తుచేసి పూతలు పూయించి కోతలు కోయిస్తున్న బురదల మనిషి భువన చేసే పుణ్యపురుషుడు అన్నదాత తొలకరి వానలకు ముందుగా నాలుగు సార్లు దుక్కుతున్న విత్తనాలు వాడుతారు మొక్కలు మొలకెత్తింది మొదలు దానిని పసిబిడ్డలు చూసినట్లు అపురూపంగా చూసుకుంటాడు. కలుపు తీస్తాడు మందులు వేస్తాడు పంటలు చేతికి అందేసరికి అనావృష్టి అతివృష్టి వలన పైరు ఎండిపోవడం కొట్టుకుపోవడం జరుగుతుంది. విత్తనాల ఖర్చులు కూడా తిరిగిరాని దయానియస్థితి వ్యవసాయం పండిన పండకపోయినా రైతు నిరాశ చెందకుండా ముందుకు సాగుతాడు ఈ పరిస్థితి ఈనాటిది కాదు తరతరాలుగా వస్తున్నది స్థితి మనదేశంలో సాగు రంగంలో దండగ పండగ రెండు ఉంటాయి ఈరంగంలో ఒకప్పుడు పడితే మరొకప్పుడు ఉండదు అయినా పండలేదని రైతు కాడి వదిలేస్తే అందరికీ ఆహార వేల ప్రకృతి ఇత్తుత్తులకు తోడు పాలకుల ఉదాసీనత వ్యాపారుల దోపిడీ నాశరకం విత్తనాలు నకిలీ పురుగుమందులు నాణ్యతలేని ఎరువులు ఇలా అనేక విధానాలుగా అష్ట కష్టాలు పాలైన అనుభవిస్తూ అధికమిస్తూ పంట పండిస్తారు చివరకు పండిన పంట అమ్ముకునే నాటికి గిట్టుబాటు ధర ఉండదు. అలా అని రైతులు నిరాశకు నిస్పృహకు నిశుహకు లోనే లోనైతే మనం బతికేది ఎలా, రైతులను ప్రకృతి పాలకులు వ్యాపారులు దగా చేస్తున్న వ్యవసాయాన్ని వదులుకోలేదు, కాడి దించే ప్రసక్తే లేదు రెయిన్బోలు ఎండైనా వానైనా సరే నిత్యం పాడవుతల్లిని వ్యవసాయాన్ని నమ్ముకుని అదేపనిచేస్తుంటాడు. వారి శ్రమ వెలకట్టలేనిది సూర్యుడైన మబ్బులు సాటి కెళ్ళి కాసేపు విశ్రాంతి తీసుకుంటాడేమో గాని రైతుకు మాత్రం ఆ విశ్రాంతికి లేదు దేశానికి పటెదన్నం పెట్టేందుకు ఫలితం మీద ధ్యాస లేకుండా పోరాడుతూనే ఉంటాడు దళారుల వ్యాపారులు దోపిడీ నుంచి విముక్తి కల్పించాలి. రైతులకు పంట గిట్టుబాటు కల్పించున్నాడే ఈ తరం యువత వ్యవసాయం వైపు మల్లుతారు. పట్టణాలకు వలసల సంఖ్య తగ్గుతుంది దేశ సౌభాగ్యానికి పునాదిరాళ్లయిన అన్నదాతలు చల్లగా ఉంటేనే మన కడుపు చల్లగా ఉంటుంది ఈ దేశంలో సాగు రంగాన్ని తరతరాలుగా పట్టి పీడిస్తున్న ఆత్మహత్యలు సామాజిక రుగ్మతలు తరిమివేయ వలసిన ముమ్మాటికి ప్రభుత్వాలదే, ఇదంతా రైతుకు చేయవలసిన అందరి కనీస బాధ్యత పాలకులు ఏమిచ్చిన రైతు రుణం తీర్చుకోలేరు సాగును నమ్ముకున్న అన్నదాతలు ఆత్మహత్యలు నివారించినపుడే వారి జీవితాల్లో వెలుగులు నింపిన రోజు అన్నదాతలకు నిజమైన పండుగ.

# ఈనెల 24వ తేదీ వరకు ఎస్ ఐ ఆర్ గడువు పెంపు

**నాదెండ్ల జూలై 14 మనసులో మాట**



ఆంధ్రప్రదేశ్ ఎన్నికల అధికారి అభ్యర్థన మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ఈనెల 24వ తేదీ వరకు ఎస్ ఐ ఆర్ గడువు పెంచినట్లు తాసిల్దార్ ఎస్ చంద్రశేఖర్ అన్నారు. స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో మంగళవారం చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ గడువు ఈరోజుతో ముగియనుండగా మరికొంత సమయం కావాలని ఏపీ సీఈఓ అభ్యర్థన మేరకు కేంద్ర ఎన్నికల సంఘం మరో 10రోజులు గడువు పొడిగించింది అన్నారు. జులై 24 వరకు కొనసాగనున్న ఎస్ఐఆర్ ప్రక్రియ బిఎల్వోలు ప్రతి ఇంటికి తిరిగి ఈ ప్రక్రియ పూర్తి చేస్తారన్నారు. పోలింగ్ కేంద్రాలు రేష్నలైజేషన్ పూర్తి చేయడానికి జులై 24వ తేదీ వరకు గడువు ఉంది అన్నారు. జులై 31న ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల చేస్తారన్నారు. జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు ఓటర్ల జాబితా పై క్లైములు, అభ్యంతరాలు దాఖలు చేసుకునే అవకాశం ఉంది అన్నారు. దాఖలు అయిన క్లైమ్లు, అభ్యంతరాలను జూలై 31 నుంచి సెప్టెంబర్ 28 లోపు అధికారులు పరిష్కరిస్తారు అన్నారు. అక్టోబర్ మూడవ తేదీ ఓటర్ల తుది జాబితా ప్రచురణ జరుగుతుంది అన్నారు. ఇంకా ఎవరైనా ఎస్ ఐ ఆర్ ఫారం లో అందచేయాలసుకుంటే వెంటనే వారు వారికి కేటాయించిన బిఎల్ఓ లకు అందజేయాలని కోరారు.



# స్వచ్ఛ రథం' నిర్వహణలో నూజెండ్ల మండలం ప్రథమ స్థానం

**వినుకొండ -జూలై 14.,**
**(మనసులో మాట )**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'స్వచ్ఛ రథం' (ప్లాస్టిక్ మరియు పనికిరాని వ్యర్థాల సేకరణ) కార్యక్రమాన్ని నిర్వహించడంలో పల్నాడు జిల్లాలో నూజెండ్ల మండలం ప్రథమ స్థానంలో ఉన్నది. స్వచ్ఛ రథం నిర్వాహకుడు చింతపల్లి సురేష్ ని పంచాయతీరాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణ తేజ అభినందించి ప్రశంశా పత్రం అందజేశారు. అవార్డు పొందిన చింతపల్లి సురేష్ కి మండల పరిషత్ అధికారులు,పంచాయతీ కార్యదర్శులు,కార్యాలయం సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి సింగంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలోని గ్రామాలకు స్వచ్ఛ రథం వచ్చినప్పుడు ఇంటిలోని పనికిరాని ప్లాస్టిక్ లేదా పాత వస్తువులను ఈ రథానికి ఇచ్చి, వాటి విలువకు సమానంగా నిత్యావసర వస్తువులు లేదా ఇతర నిత్యావసరాలు అందచేస్తారని తెలిపారు. ఈఅవకాశాన్ని గ్రామాలలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# భారతిది ఆత్మహత్య కాదు.. ముమ్మాటికీ హత్య..

- **మృతురాలి సోదరుడు ఎర్రం తిరుపతి రెడ్డి ఆరోపణ**

**వినుకొండ జూలై 14.,**
**(మనసులో మాట )**



వినుకొండ మండలం లోని విఠంరాజుపల్లి గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన తల్లి, ఇద్దరు పసిపిల్లలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. ఉదయం ఈ ఘటన ఆత్మహత్యగా ప్రచారంలోకి రాగా, మృతురాలి కుటుంబ సభ్యులు దీనిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇది ముమ్మాటికి ఆత్మహత్య కాదని, భర్త సునీల్ రెడ్డి, అతని తల్లిదండ్రులే పక్కా పథకం ప్రకారం విషప్రయోగం చేసి ముగ్గురినీ దారుణంగా హత్య చేశారని వారు సంచలన ఆరోపణలు చేశారు. ఘటన స్థలంలో లభ్యమైనట్లు చెబుతున్న సూసైడ్ లేఖపై మృతురాలి అన్న యర్రం తిరుపతి రెడ్డి స్పందిస్తూ.. ఆ లేఖలో ఉన్న రాత తన చెల్లి భారతి ది ఎంత మాత్రం కాదని స్పష్టం చేశారు. తన చెల్లె ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని, ముందే ముగ్గురినీ చంపేసి, ఆపై తప్పుదారి పట్టించేందుకు ఉరివేసినట్లు నాటకమాడుతూ ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశారని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘోరంపై నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరిపించాలని, పోస్ట్మార్టం నివేదికలో అసలు నిజాలు నిగ్గు తేలుతాయని మృతురాలి కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.



# తెలుగుదేశం సీనియర్ నాయకులు రాయన్న చౌదరి మృతి పట్ల ఎమ్మెల్యే ప్రత్తిపాటి సంతాపం



**నాదెండ్ల జులై 14 మనసులో మాట**

మండలంలోని చిరుమామిళ్ల గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కోయ రాయన్న చౌదరి అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, మండల పార్టీ అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ కరిముల్లా,చిరుమామిళ్ల గ్రామం వెళ్లి రాయన్న చౌదరి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. వీరు వెంట గ్రామ టిడిపి నాయకులు భువనం శ్రీనివాస్ రెడ్డి, గాదే బ్రహ్మరెడ్డి, గంట హరికృష్ణ, తదితరులు ఉన్నారు.

## నేడు రేపల్లెలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**రేపల్లె జులై 14 మనసులోమాట**

ఈనెల15 వతేదీ బుధవారం ఉదయం 8:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు రేపల్లె టౌన్ లో 33KV నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తున్నందున ఇసుకపల్లి , నిజాంపట్నం రోడ్డుకి ఇరువైపుల, మజీద్ సెంటర్, బస్టాండ్ సెంటర్ మరియు బేతపూడి, ఉయ్యూరువారిపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుంది. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించవలసినదిగా విద్యుత్ శాఖ డిప్యూటీ ఈ ఈ డి శ్యామ్ సుధాకర్ బాబుతెలియజేశారు.

# అధికారంలో ఉన్నప్పుడు అరాచకాలు, అధికారం పోగానే వెంటాడుతున్న కేసులు

**నాదెండ్ల జులై 14 మనసులో మాట**

వైసీపీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు గ్రామంలో అరాచకాలకు పాల్పడి పార్టీ అధికారం పోగానే వైసీపీ నాయకులని చేసిన అరాచకాలపై కేసులు వెంటాడుతున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలు మండలంలోని చిరుమామిళ్ల గ్రామంలో 2007వ సంవత్సరంలో చిరుమామిళ్ల విద్య గ్రామాభివృద్ధి ప్రదాత గోల్కొండ గ్రూప్ సంస్థ చైర్మన్ మొట్టమొదటిగా గ్రామ అభివృద్ధిలో భాగంగా క 1, 60,000,00లక్షలు గ్రామంలో గ్రామస్తుల మంచినీటి సమస్య తీర్చేందుకు రక్షిత మంచినీటి పథకాన్ని చెరువును ఏర్పాటు చేసి దాత రామిరెడ్డి సొంత నిధులు 45 లక్షల రూపాయలు ఖర్చు చేసి 660 గృహాలకు ఉచితంగా మంచినీటి కులాలు ఏర్పాటు చేసి రక్షిత మంచినీటి పథకాన్ని గ్రామ పంచాయతీకి అప్పగించారు. దీనికి తోడు మినరల్ వాటర్ ప్లాంట్ కూడా ఏర్పాటు చేయించారు. 2019 వరకు ఈ పథకం సాఫీగా కొనసాగగా 2019లో రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిని వైసీపీ నాయకులు ఆధీనంలోకి తీసుకున్నారు. 2021 లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో గ్రామ వైసిపి నాయకుడు సింగారెడ్డి కోటిరెడ్డి, భార్య సింగారెడ్డి లక్ష్మి ని సర్పంచ్ గా ఎన్నుకున్నారు. అప్పటి నుండి ఈ పథకం కోటిరెడ్డి చేతుల మీదకి పోయింది. విద్యుత్ శాఖకు చెల్లించవలసిన 28 లక్షలు చెల్లించకుండా సొంతానికి వాడుకున్నారు. దీనికి తోడు 68 లక్షలు ఫ్రాడ్ జరిగింది. పంచాయతీలో కొన్ని నిధులు డ్రా చేశారు. ప్రతి ఇంటికి సంవత్సరానికి ₹1000 చొప్పున 12లక్షలు సంవత్సరానికి, ఐదు సంవత్సరాలకు 60 లక్షల రూపాయలు వసూలు చేసి ఐదు సంవత్సరాలలో 26 లక్షల రూపాయలు కరెంట్ బిల్లులు చెల్లించలేదు, మంచినీటి చెరువుకి సంవత్సరానికి నాలుగు సార్లు నీరు పెట్టామని ప్రతిసారి నీటి ఖర్చు కింద పంచాయతీ నిధి రెండు లక్షల రూపాయలు డ్రా చేశారు. సంవత్సరానికి 8 లక్షల రూపాయలు చొప్పున ఐదు సంవత్సరాలు పంచాయితీ నిధుల నుండి 40 లక్షలు డ్రా చేశారు. అలాగే పంచాయతీ ఎకౌంట్లో నుంచి వాటర్ ట్యాంక్ కి రిపేరు, మోటర్లు కొనడానికి కరెంటు తొలగించినందుకు, కరెంటు లైన్ వేయటానికి పంచాయతీ నుండి28 లక్షల రూపాయలు పంచాయతీ నిధుల నుండి డ్రా చేశారు. మొత్తం దీనికి 68 లక్షల రూపాయలు పంచాయతీ నిధులు ఖర్చు చేసినట్లు ఆరోపణలు వెలివెత్తాయి.2024 నుండి ఇప్పటి వరకు శివరామ కోటిరెడ్డి వాటర్ ట్యాంకి తన ఆధీనంలో తీసుకొని 19 లక్ష రూపాయలు వసూలు చేసి విద్యుత్ బిల్లులు చెల్లించకుండా సొంతానికి వాడుకున్నారు. సింగారెడ్డి కోటిరెడ్డి, అప్పటి సర్పంచి కోటిరెడ్డి భార్య సింగారెడ్డి లక్ష్మి, శివరామ కోటిరెడ్డి పై గ్రామస్తులు జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. స్పందించి ఫిర్యాదును పరిశీలించిన జిల్లా కలెక్టర్ నరసరావుపేట డివిజనల్ పంచాయతీ అధికారి లక్ష్మణరావును విచారణ చేసి నివేదిక అందజేయాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు లక్ష్మణరావు విచారణ జరిపి నివేదికను జిల్లా కలెక్టర్కు అందజేశారు. దీనిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశాలు ఇవ్వటంతో నాదెండ్ల డిప్యూటీ ఎంపీడీవో తోకల వెంకటేశ్వర్లు ముగ్గురిపై ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం సింగారెడ్డి కోటిరెడ్డి, ఆయన సతీమణి అజ్ఞాతంలోకి వెళ్లారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏపీ మోడల్ పాఠశాల ప్రహరీ గోడను అన్యాయంగా పడగొట్టి ఎమ్మెల్యే విడుదల రజిని పేరుతో రహదారి నిర్మించి ఆర్చి ఏర్పాటు చేశారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటాం అనడంతో



మరలా ప్రహరీ గోడను ఏర్పాటు చేశారు. వైసీపీలో నరసరావుపేట ఎంపీగా కొనసాగిన లావు శ్రీకృష్ణదేవరాయలు చిరుమామిళ్ల గ్రామంలో ఒక ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యేందుకు చిరుమామిళ్ల వెళ్ళగా కోటిరెడ్డి వాళ్ల అనుచరులు ఎంపీని ప్రైవేటు కార్యక్రమానికి వెళ్లకుండా గ్రామం మధ్యలో అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఎంపీని ప్రవేట్ కార్యక్రమానికి తీసుకుపోయారు. గత ఏడాది నాదెండ్ల ఎంపీడీవో స్వరూప రాణి గ్రామపంచాయతీలో ఒక ఫిర్యాదు పై విచారణ జరిపేందుకు రాగా కోటిరెడ్డి కులం పేరుతో ఎంపీడీవో స్వరూప రాణిని దూషించడంతో ఎంపీడీవో స్వరూప రాణి నాదెండ్ల పోలీస్ స్టేషన్లో కోటిరెడ్డి తనను కులం పేరుతో దూషించి విధులకు ఆటంకం కలిగించారని ఫిర్యాదు చేయడంతో నాదెండ్ల పోలీసులు ఎస్సీ ఎస్టీ అక్ట్ కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. అధికారం ఉన్నప్పుడు ఉరూతలు ఊగి అరాచకాలకు పాల్పడితే ప్రభుత్వం పోయిన తర్వాత కోటిరెడ్డిని వరస కేసులు వెంటాడుతున్నాయి.

# రైతులను కంటికి రెప్పలా చూసుకొనే ప్రభుత్వం కూటమి ప్రభుత్వం – ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు

**పెదనందిపాడు జులై 14 (మనసులో మాట)**

ప్రత్తిపాడు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఈ సందర్భంగా బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ గత 2నెలలుగా ఎలినినో సమస్యపై ప్రజలలో ఆందోళన నెలకొంది.ఎలినినో సమస్య కొత్తదేమి కాదు 1950,1970,1997,2009లో కూడా ఏలినినో తీవ్రత ఎదురుకున్నాం.ఎలినినో సమస్య ప్రభావం నేడు వేడి గాలులు ఫసిఫిక్ మహాసముద్రం మూలంగా భారతదేశం మొత్తం ఏర్పడింది.ఇప్పటికే నెలరోజులుగా ఎలినినో సమస్య మూలంగా ఖరీఫ్ పంటలకు ఇబ్బందులు కలిగిస్తాయని అన్నారు. రైతాంగం వేసిన పంటలు నాణ్యత తగ్గుతుంది, దిగుబడి తగ్గుతుంది, వర్షాలు సకాలంలో పడవు, నీటి కొరత ఏర్పడుతుంది .రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు తొలిగా ఎలినినో సమస్యను ముందుస్తుగా గుర్తించి జలాశయాలను గతంలోనే నింపుకున్నాయి, అలాగే ప్రత్తిపాడు నియోజకవర్గం పరిధిలోని చెరువులు, కుంటలు నీళ్లతో నింపుకున్నాము.రైతాంగానికి కూడా నీరు ఎక్కువ అవసరమయ్యే పంటలను వేయాలని వ్యవసాయ శాఖ ద్వారా అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేశాం.రైతాంగానికి కావలసిన విత్తనాలు, ఎరువులు కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది.పంట కాలువల ద్వారా నీటిని విడుదల చేయరని కొంతమంది వైసీపీ నేతలు అసత్య ప్రచారాలు చేస్తున్నారు,వాటిని నమ్మవద్దని ఎమ్మెల్యే తెలిపారు. కృష్ణా వెస్ట్రన్ కెనాల్ ద్వారా రేపే ఇరిగేషన్ గౌరవ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గారు నీళ్లను రైతాంగానికి అవసరం కోసం వదులుతున్నారు.ఇప్పటికే పంటకాలువలు, చెరువుల మరమ్మత్తుల కోసం నిధులు వెచ్చించి పనులు పూర్తి చేసి నీటితో నింపుకున్నామని,పెద్దలు, పిల్లలు ఎలినినో సమస్యతో పాఠశాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెప్పారు.విద్యుత్ పొదుపుగా వాడుకోవాలి,నీళ్లను జాగ్రత్తగా వాడుకోవాలి ఎలినినోసమస్యను అధికమించాలని సూచించారు.







# పల్నాడు చరిత్రలోనే సువర్ణ అధ్యాయం

- ఆధునిక దేవాలయం మెడికల్ కళాశాల
- పిడుగురాళ్ల మెడికల్ కాలేజ్ కి 100 ఎంబిబిఎస్ సీట్లు కేటాయింపు పట్ల హర్షం
- రాష్ట్రంలో అతి పెద్ద ప్రభుత్వ మెడికల్ కళాశాల పిడుగురాళ్లదే
- పల్నాడు ప్రాంతంపై సీఎం చంద్రబాబు కు ఉన్న అభిమానానికి నిదర్శనం
- త్వరలో పిడుగురాళ్ల మెడికల్ కళాశాలలో సీఎం చంద్రబాబు పర్యటన
- మూడు దశాబ్దాలు ఆదరించిన ప్రజల రుణం తీర్చుకునే అవకాశం వచ్చింది
- వ్యక్తిగత నిధులతో 4.50 లక్షల పేపర్ మెడికల్ కవర్ల పంపిణీ



**దాచేపల్లి , జూలై 14: మనసులో మాట**

పల్నాడు చరిత్రలోనే ఈరోజు సువర్ణ అధ్యాయాలతో లిఖించవలసిన రోజని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం సాయంత్రం పిడుగురాళ్ల మెడికల్ కళాశాలలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన నరసరావుపేట ఎంపీ కృష్ణదేవరాయలతో కలిసి పాల్గొన్నారు. మొట్టమొదటిసారి 1994లో తాను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పుడు పరిస్థితులు వేరే విధంగా ఉండేవన్నారు. పల్నాడు అభివృద్ధికి నోచుకోక కక్షల కార్పణ్యాలతో రగిలిపోతూ ఉండేదన్నారు. అభివృద్ధికి ఆటంకంగా ఉన్న ఫ్యాక్షనిజాన్ని రూపుమాపాలని అప్పుడే నిర్ణయించుకున్నామన్నారు. రోడ్డు ప్రమాదంలో, లేదా ఘర్షణల లో గాయపడిన వ్యక్తులను వైద్యం కోసం తీసుకువెళ్లాలంటే దూరంగా ఉన్న గుంటూరు లేదా నరసరావుపేట తరలించవలసి వచ్చేదన్నారు. ఈ లోపు ఎంతో మంది ప్రాణాలు కోల్పోవలసి వచ్చేది అన్నారు. సమాజం అభివృద్ధి చెందాలంటే విద్య వైద్యం, అగ్రికల్చరల్, హార్టికల్చర్, టూరిజం రంగాలు అభివృద్ధి చెందవలసిన అవసరం ఎంతైనా ఉందని సీఎం చంద్రబాబు తనకు సూచించారన్నారు. అప్పటి నుండి నిర్విరామంగా కృషి చేస్తూ ఉండటం వలన పల్నాడులో ఫ్యాక్షనిజం రూపుమాసిపోయి అభివృద్ధి పథం లో పయనిస్తుందన్నారు. రాష్ట్రంలో అనేక మెడికల్ కళాశాలలు పి పి పి విధానంలోకి పోయినప్పటికీ పిడుగురాళ్ల మెడికల్ కళాశాల పూర్తిగా ప్రభుత్వ రంగంలోనే నడవబడుతుందన్నారు. దీన్నిబట్టి సీఎం చంద్రబాబుకు పల్నాడు ప్రాంతం పట్ల ఉన్న అభిమానం అర్థం అవుతుందన్నారు. మనిషి ఏ రంగంలో అభివృద్ధి చెందాలన్న ఆరోగ్యం అతి ముఖ్యమైనది అన్నారు. రాష్ట్రంలో తనకు తెలిసి అతిపెద్ద ప్రభుత్వ మెడికల్ కళాశాల పిడుగురాళ్ల మెడికల్ కళాశాలే అన్నారు. త్వరలో సీఎం చంద్రబాబు పిడుగురాళ్ల మెడికల్ కళాశాలలో పర్యటించనున్నారని చెప్పారు. వేలాదిమంది ప్రాణాలను కాపాడే ఆధునిక దేవాలయం పిడుగురాళ్ల ప్రభుత్వ మెడికల్ కళాశాల, జనరల్ హాస్పటల్ అన్నారు. ఇంతటి ప్రాధాన్యత గల మెడికల్ కళాశాలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు పూర్తి చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఇక్కడ ఆర్వో ప్లాంట్ మంజూరు చేశామన్నారు. ఇతర మౌలిక సదుపాయాల కల్పనలో ఎంపీ కృష్ణరాయలతో కలసి నిర్విరామంగా కృషి చేస్తామన్నారు. తనను గత 32 సంవత్సరాలుగా ఆదరించి వరుసగా ఏడుసార్లు పోటీ చేసే అవకాశం కల్పించిన పల్నాడు ప్రజల రుణం తీర్చుకోవడం తన బాధ్యత అన్నారు. నియోజకవర్గంలో ఉన్న దాచేపల్లి, గురజాల, మాచవరం ప్రభుత్వ ఆసుపత్రుల లో ప్రభుత్వ నిధులతో సంబంధం లేకుండా తన వ్యక్తిగత నిధులతో ఆయా ఆసుపత్రులకు అవసరమైన ఏసీ, ఫ్రిజ్ లు, ఫర్నిచర్ ఇతర సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు ఏ మందులు ఎప్పుడు వేసుకోవాలో డాక్టర్లు చెప్పినప్పటికీ గుర్తు ఉండదన్నారు.

ఈ నేపథ్యంలో ఏ టాబ్లెట్స్ ఎప్పుడు వేసుకోవాలో సూచించే 4.50 లక్షల పేపర్ కవర్లను తన వ్యక్తిగత నిధులతో తయారు చేయించినట్లు చెప్పారు. వీటిని త్వరలో ప్రభుత్వ ఆసుపత్రులకు పంపిణీ చేస్తామన్నారు. జనరల్ హాస్పిటల్ లో ఓపీలు మరింత పెరిగే విధంగా వైద్యులు కృషి చేయాలని కోరారు. మెడికల్ కళాశాల పల్నాడు ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అన్ని విధాల ఉపయోగపడే విధంగా ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామని యరపతినేని స్పష్టం చేశారు





## డి ఆర్ సి సమావేశానికి అధికారులందరూ

# హాజరు కావాలి ..

- సరైన నివేదికలతో హాజరై సమాధానాలు చెప్పేందుకు సిద్ధంగా ఉండాలి
- అధికారులకు దిశా నిర్దేశం చేసిన కలెక్టర్ రాజాబాబు

**ఒంగోలు జులై 14 , (మనసులో మాట)**

రేపు కలెక్టరేట్లో జరిగే డి.ఆర్ .సి సమావేశం కు సంబంధించి అధికారులందరూ సరైన నివేదికలతో హాజరయ్యి సమాధానాలు చెప్పుటకు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి. రాజబాబు సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అధికారులతో రేపు నిర్వహించనున్న డిఆర్సి మీటింగ్ కు సంబంధించి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సమీక్షిస్తూ గత నవంబర్ 2025న జరిగిన డిఆర్సి సమావేశంలో ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన పలు అంశాలకు సంబంధించి తీసుకున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. రైతు సమస్యలు అన్నదాత సుఖీభవ ,ఆర్డబ్ల్యూఎస్ తదితర అంశాలను ప్రజా ప్రతినిధులు లేవనెత్తే అవకాశం ఉన్నందున విషయాలను కూలంకుషంగా వివరించే విధంగా సంబంధిత అధికారులు ఉండాలన్నారు. సమస్యలను సమగ్రంగా వివరించాలని అంతేకాకుండా ఆర్థిక అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నకరికల్లు లో రెండు రోజుల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేత: ఏపీసీపీడీసీఎల్ ప్రకటన

**నకరికల్లు, జులై, 14 మనసులో మాట.**

నకరికల్లు ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ (APCPDCL) పరిధిలోని నకరికల్లు గ్రామ పరిధిలో ఆర్డీఎస్ఎస్ (RDSS) పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15/07/2026 మరియు 16/07/2026 తేదీలలో ఉదయం 08:30 గంటల నుండి సాయంత్రం 06:00 గంటల వరకు ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈ పనుల కారణంగా నకరికల్లు పరిధిలోని బి సి కాలనీ, యానాది కాలనీ, రాందాసు బజారు, మరియు కొండ కింద ఇందిరమ్మ కాలనీలలో సరఫరా నిలిపివేయబడుతుందని వివరించారు. ఈ తాత్కాలిక అంతరాయానికి గాను విచారం వ్యక్తం చేస్తూ, గ్రామ ప్రజలు గమనించి సహకరించాలని నకరికల్లు ఏపీసీపీడీసీఎల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (AEE) కోరారు.





# దర్శి టిడిపి ఇన్చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

**దర్శి జులై 14, (మనసులో మాట)** మంగళవారం దర్శి పట్టణం లోని స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నందు "ప్రజా దర్బార్ ప్రజల సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహించిన దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ . ప్రజలు మరియు కార్యకర్తలు నుంచి వినతులను స్వీకరించడం జరిగింది. ప్రతి ఒక్కరి సమస్యను విని... సమస్యలు పరిష్కారానికి సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేస్తూ అర్జీదారులకు భరోసా కల్పించిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ.

# శ్రీ కాశి అన్నపూర్ణేశ్వరి ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

- భక్తి ,సేవాభావంతో 4500 వేల మందికి అన్న ప్రసాదం
- 40 మంది దాతల సహకారంతో నిరంతర అన్నదాన కార్యక్రమం
- ఆకలితో వచ్చే వారికి అన్నప్రసాదం.. భక్తుల ప్రశంసలు అందుకుంటున్న ట్రస్ట్



**మంగళగిరి జూలై 14 (మనసులో మాట )::** మంగళగిరి శివాలయం వద్ద గల శ్రీ పానకాల లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం మెట్ల మార్గం దగ్గర అమావాస్య సందర్భంగా అన్నదాన మహోత్సవ కార్యక్రమం భక్తులతో కిటకిటలాడింది. భక్తుల సందడితో పాటు భక్తి కాంతులు వెదజల్లుతూ శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం మంగళవారం జరిగింది. ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు తో పాటు దుంపల సుబ్బారావు అన్న ప్రసాద వితరణలో పాల్గొని భక్తులకు అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళగిరి పానకాల స్వామి ఆలయ మెట్ల మార్గంలో సాగే ఈ అన్నదాన కార్యక్రమం పరమశివులు ఆశీస్సులతో భక్తుల సహకారంతో ఎలాంటి విరామం లేకుండా కొనసాగుతూనే ఉందని ఆయన అన్నారు. ప్రతి అమావాస్య రోజున 4500 మందికి అన్న ప్రసాదం అందజేస్తున్న ఈ సేవ కార్యక్రమం నిరంతరంగా కొనసాగించేందుకు ట్రస్ట్ సభ్యులు భక్తులు దాతలు ఎంతో ఉత్సాహంగా ముందుకు వస్తున్నారని ఆయన తెలిపారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన అన్నారు.ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలు విశేషమైనవని ఇంతకాలం విరామం లేకుండా ఇంత పెద్ద స్థాయిలో భక్తులకు అన్న ప్రసాదం అందించడం ఆధ్యాత్మికతకు మానవత విలువలకు ప్రతీక అని అభినందించారు..........ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలు గా ఎటువంటి విరామం లేకుండా ప్రతి నెల అమావాస్య సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమం వెనుక 40 మంది దాతల సహకారం ఉందని, వారి ఉదారత వల్లే భక్తులకు ఆహారం అందించే అవకాశం లభిస్తోందని అన్నారు. "భక్తుల సేవే పరమార్థం. ఆకలితో వచ్చే వారు అన్నప్రసాదం స్వీకరించి సంతృప్తిగా వెళ్లడం మాకు ఆనందాన్నిస్తుంది" అని సాంబశివరావు పేర్కొన్నారు. భక్తులు 4 వేల 500 మందికి పైగా పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారని వారు తెలిపారు.. మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ అభివృద్ధికి మంత్రి నారా లోకేష్ ప్రత్యేక కృషి చేస్తున్నారని పలువురు కొనియాడారు.ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఇప్పటికే బస్సు సౌకర్యంతో పాటు వాటర్ ప్లాంట్ను ఏర్పాటు చేయించడం అభినందనీయమని పేర్కొన్నారు. భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు మంత్రి లోకేష్ తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమని తెలిపారు. ..భక్తులకు అన్నదానం చేస్తున్న పందేటి సాంబశివరావుకు వారు అభినందనలు తెలిపారు. భక్తుల సేవలో తరిస్తూ భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తున్న సాంబశివరావును స్థానిక ప్రజలు, భక్తులు కొనియాడారు. సేవాభావంతో ఆయన ప్రతి అమావాస్యనాడు ఆలయానికి వచ్చే భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయడం విశేషం.సమాజంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగాలని వారు ఆకాంక్షించారు... అంగ ఉపేంద్ర వర్మను ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు, సభ్యులు గజమాలవేసి,శాలువాతో సత్కరించారు.. ఈ అన్నదాన కార్యక్రమంలో పుప్పాల కోటేశ్వరరావు, కర్నాటి శివ సత్యనారాయణ, కగ్గ శ్రీను, కోదాటి శ్రీనివాసరావు, పందేటి శ్రీనివాసరావు, రెడ్డి వీరరాఘవులు, నంద్యాల గోపాలకృష్ణ, ముద్ర బోయిన శ్రీనివాసరావు, అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి,ఉద్దంటి మురహరిరావు, శివ ప్రసాద్, రుద్రరాజు పెద్దిరాజు, పంచల శివ, నంగళం ప్రసాద్, దుంపల సోములు, గండికోట అచ్చయ్య, కటారి విష్ణుమూర్తి, చిరుమామిళ్ల రంగారావు, పేరుబోయిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు..



# ఐలవరం అద్దేపల్లి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

**భట్టిప్రోలు,జులై 14 ( మనసులో మాట )** భట్టిప్రోలు మండలంలోని ఐలవరం,అద్దేపల్లి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించడం జరిగినది .ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి మంగళ, బుధవారాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి బి.బ్రహ్మారెడ్డి వివరించారు. వ్యవసాయాధికారి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ పచ్చిరొట్ట పైరుల గురించి రైతులకు అవగాహన కల్పించారు.జనుము, జీలుగ, పిల్లిపెసర జాతి మొక్కలను పూతదశలో మట్టిలో కలియదున్నడం ద్వారా అత్యధికంగా నత్రజని మరియు సేంద్రియ పదార్థాన్ని అందించి భూసారాన్ని అభివృద్ధి పరచుకోవచ్చునన్నారు. అదేవిధంగా రైతులు అందరూ కూడా రైతు సేవ కేంద్రాల సిబ్బందితో వారు సాగు చేసిన పంటలను ఈక్రాప్ నమోదు చేయించుకోవాలని మరియు ఏపీ ఏఐఎంఎస్లో ఎరువులు పంపిణీ విధానం గురించి వివరించారు. ఇకమీదట ఏపీ ఏఐఎంఎస్ ద్వారానే ఎరువులు పంపిణీ జరుగుతుందని వివరించారు. అదేవిధంగా రేపు(బుధవారం) బాపట్లవీ కన్వెన్షన్ హాలు నందు కిసాన్ మేళా కార్యక్రమం జరుగుతుందని, రైతులు ఈ కార్యక్రమంలో హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏవో బ్రహ్మారెడ్డి కోరారు.

# రామాయణం భారతీయ జీవన విధానం జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు




**వేమూరు జులై 14 (మనసులో మాట )** తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో వేమూరు మండలం చావలి గ్రామంలో వేంచేసియున్న శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ వాళేశ్వర స్వామి దేవస్థానం (శివాలయం) లో మంగళవారం నుండి శుక్రవారం వరకు జరుగు ధార్మిక కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామ పురవీధుల్లో గోవింద నామాలతో నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకర రావు ధార్మిక ఉపన్యాసం చెబుతూ రామాయణం భారతీయ జీవన విధానం అని రామాయణంలోని విషయాలు అన్నదమ్ముల అనుబంధాన్ని తండ్రీ కొడుకుల అనుబంధాన్ని భార్యాభర్తల అనురాగాన్ని ఏకపత్నీ వ్రతాన్ని, తనను నమ్ముకున్న వారు ఆంజనేయుడు, సుగ్రీవుడు, విభీషణుడు ఎలా చూసుకోవాలి నీ విషయాలను మన కుటుంబ వ్యవస్థ ఏ విధంగా ఉండాలి అనే విషయాలన్నీ రామాయణంలో మన భారతీయ హిందూ ధర్మ జీవన విధానాన్ని తెలియజేస్తుందని ఉన్నారు ఈ కార్యక్రమంలో టీటీడీ ధార్మిక సేవా సభ్యులు పొన్నపల్లి సత్యనారాయణ, చవ్వాకుల శాంతకుమారి, గ్రామ పెద్దలు పట్టెల లక్ష్మీనారాయణ,సోమరౌతు లక్ష్మీధర్, వెంకటేశ్వరరావు,వెంకయ్య, విష్ణుమొలకల శ్రీరామ్ కోటేశ్వరరావు గుడిపల్లి వెంకటేశ్వర్లు, అర్చకులు చావలి మణికంఠశర్మ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

# పొగాకు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి

- ఈనెల 16న కనిగిరి...
- 17న ఒంగోలులో పొగాకు రైతు దీక్ష
- వైసిపి జిల్లా పార్టీ అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి వెల్లడి



**ఒంగోలు జులై 14, (మనసులో మాట)**

రైతులు పండించిన పొగాకు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి అని వైస్సార్సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 16 న కనిగిరి, 17 న ఒంగోలు లో "పొగాకు రైతు దీక్ష " కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా వైస్సార్సీపీ అధ్యక్షులు ,దర్శి శాసన సభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి అన్నారు. మంగళవారం ఒంగోలు పార్టీ ఆఫీస్ లో విలేకర్ల సమావేశం లో పొగాకు రైతు దీక్ష పోస్టర్ ఆవిష్కరణ చేసి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల పరిస్థితి అగమ్యగొచరంగ వుంది అని పండించిన పంటకి గిట్టుబాటు ధర లేక కనీషం కూలీలకు డబ్బులు కూడా ఇచ్చే పరిస్థితి లేక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వుంది అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే రెండు సార్లు అధికారులతో ,మంత్రులు, ఎమ్మెల్యేలతో లతో సమావేశం ఏర్పాటు చేసి పొగాకు కొనుగోలు చేయాలని చెప్పగా కనీసం కంపెనీ లు పట్టించుకునే పరిస్థితి లేదని అన్నారు. జిల్లాలో వున్న మంత్రులు, ఎమ్మెల్యేలు లు పొగాకు కొనుగోలు కేంద్రాలకు వెళ్లి స్వయంగా రైతుల కష్టాలు తెలుసుకున్న వ్యాపారులనుండి స్పందన లేదని అన్నారు. అందుకే పొగాకు రైతుల కష్టాలు చూసి వైస్సార్సీపీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడుతున్నాము అని అన్నారు. ప్రభుత్వం వెంటనే మార్కెట్ ఫెడ్ ను రంగంలోకి దించి రైతుల నుండి పొగాకు కొనుగోలు చేయాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 1000 కోట్ల రూపాయలు మార్కెట్ ఫెడ్ కు కేటాయించాలి అని డిమాండ్ చేశారు . ఇప్పటికి జిల్లాలో 30% మాత్రమే పొగాకు కొనుగోలు చేశారు అని ఇంకా 70% రైతుల వద్దే పొగాకు వుంది అని అన్నారు. అందులో భాగంగా ఈ నెల 16 వ తేది కనిగిరి లో 17 న ఒంగోలు లో పొగాకు రైతులతో కలిసి దీక్షలు చేసి ప్రభుత్వం పై వత్తిడి తీసుకొస్తాము అని అన్నారు .అప్పటికి రైతులకు న్యాయం జరగకపోతే మాజీ ముఖ్యమంత్రి వైస్ జగన్మోహన్ రెడ్డి గారి దృష్టికి తీసుకెళ్లి ఏ విధంగా పోరుబాట చేయాలో నిర్ణయిస్తాము అన్నారు.కావున జిల్లాలోని రైతులు కనిగిరి ఒంగోలు లో జరిగే పొగాకు రైతు దీక్షలో పాల్గొనవలసిందిగా కోరారు .ఈ కార్యక్రమం లో జిల్లా పరిషత్ ఛైర్మెన్ బూచేపల్లి వెంకాయమ్మ , ఒంగోలు పార్లమెంట్ పరుశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు ఇంచార్జ్ చుండూరు రవి, కనిగిరి ఇంచార్జ్ దద్దాల నారాయణ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి కె. వి. రమణా రెడ్డి,రాష్ట్ర రైతు విభాగ ఉపాధ్యక్షులు మారెడ్డి సుబ్బారెడ్డి, జిల్లా రైతు విభాగ అధ్యక్షులు మారెళ్ల బంగారు బాబు పాల్గొన్నారు





# గురుకుల పాఠశాల అధ్యాపకుల నిరాహార దీక్ష

**తాడేపల్లి జులై 14 (మనసులో మాట )::**

తాడేపల్లి సంఘీక సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యాలయం వద్ద రాష్ట్రంలో గురుకుల పాఠ శాలలో పనిచేస్తున్న అధ్యాపకులు. ఆందోళన. గత వారం రోజులుగా ఇక్కడే నిరాహార దీక్ష చేస్తున్నాం.. కూటమి ప్రభుత్వం తమ సమస్యలు పట్టించుకోకుండా మమ్ములను రోడ్డుపాలు చేసారని మండి పడ్డారు.. ఆందోళన చేస్తే పోలీసులు తమపై దాడిచేసి మహిళలు అని చూడకుండా ఇష్టం వచ్చినట్టు మాపై చెతులు వేసి నెట్టివేస్తున్నారు.. నిన్న జరిగిన పోలీసుల దాడి లో చాలామందికి గాయాపాలైయారు.. ప్రభుత్వం మాకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోక ఇలా దాడిచేస్తారా అని మండిపడ్డారు.. ఇప్పిటికైనా రోడ్డున పడ్డ మాయందు దయ ఉంచి వెంటనే విద్యా శేఖ మంత్రి లోకేష్, మా శాఖ మంత్రి మమ్ములను వెంటనే విధులలోకి తీసుకోవాలని డిమాండ్ చేసారు..

# నమస్తే దినోత్సవం సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం

- ఆరోగ్య పరిరక్షణ, భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం: అదనపు కమిషనర్ కె. వెంకటేశ్వరావు



**మంగళగిరి జులై 14 (మనసులో మాట )::**

నగర పరిశుభ్రత, ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య భద్రత, సంక్షేమం లక్ష్యంగా మంగళగిరి-తాడేపల్లి నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నమస్తే (నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకోసిస్టమ్) దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళగిరిలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కళావేదికలో పారిశుద్ధ్య కార్మికుల కోసం ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ కె.వెంకటేశ్వరావు ముఖ్య అతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివని కొనియాడారు. వారి ఆరోగ్యం, భద్రత, సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. నమస్తే కార్యక్రమం ద్వారా పారిశుద్ధ్య కార్మికులకు గౌరవప్రదమైన జీవనం కల్పించడంతో పాటు యాంత్రీకృత పారిశుద్ధ్య వ్యవస్థను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం పలు సంక్షేమ చర్యలు అమలు చేస్తోందన్నారు.మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మల్లికా మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స పొందే అవకాశం ఉంటుందని సూచించారు.మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూష ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో పారిశుద్ధ్య కార్మికులకు రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలు తదితర ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సలహాలు, మందులు అందజేశారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత, వృత్తిపరమైన ఆరోగ్య జాగ్రత్తలు, భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పించారు.నమస్తే కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులకు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన పథకాల ద్వారా బీమా సదుపాయాలు కల్పించడంతో పాటు, విధి నిర్వహణలో భద్రత కోసం వ్యక్తిగత రక్షణ పరికరాలు (పీపీఈ కిట్లు) అందజేస్తున్నట్లు అధికారులు తెలిపారు.అదేవిధంగా సామాజిక భద్రత, ఆరోగ్య సంరక్షణ, నైపుణ్యాభివృద్ధి శిక్షణ, సురక్షిత పారిశుద్ధ్య విధానాలు, ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం వంటి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ అధికారులు, వైద్య సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# విజయలక్ష్మిపురంలో రేషన్ బియ్యం అక్రమ నిల్వలు.. 56 బస్తాలు స్వాధీనం

**చీరాల జూలై 14: (మనసులో మాట)**

చీరాల మండలం, విజయలక్ష్మిపురంలో రేషన్ బియ్యం అక్రమ నిల్వలపై అధికారులు దాడులు నిర్వహించి 56 బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. డిస్ట్రిక్ట్ సప్లయ్ ఆఫీసర్ ఎ. జగన్మోహన్‌కు అందిన సమాచారంతో అధికారులు తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో షాప్ నంబర్19కు చెందిన డీలర్ ఆవుల శారద వద్ద మొత్తం 56 బస్తాలు గుర్తించారు. రికార్డుల ప్రకారం 13 బస్తాలు మాత్రమే ఉండాల్సి ఉండగా, అదనంగా 43 బస్తాలు నిల్వ ఉంచినట్లు అధికారులు గుర్తించారు. అలాగే ఒక వాహనంలో మరో 15 బస్తాల రేషన్ బియ్యాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ తహసీల్దార్ బి. ఓంకార్, సీఎస్ఆర్ఐ అధికారులు పాల్గొన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యంపై విచారణ చేపట్టిన అధికారులు, అక్రమ నిల్వలు మరియు రవాణాపై సంబంధిత నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.





# సింగరాయకొండ లో రైలు కింద పడి నలుగురు సూసైడ్

**సింగరాయకొండ జూలై 14, (మనసులో మాట)**

ప్రకాశం జిల్లా సింగరాయకొండ రైల్వే స్టేషన్ లో మంగళవారం మధ్యాహ్నం విషాదకర ఘటన జరిగింది. రెండవ ప్లాట్ఫామ్పై అప్పటి వరకు కూర్చుని మాట్లాడుకుంటున్న భార్యాభర్తలు, ఇద్దరు చిన్న పిల్లలు ఆకస్మాత్తుగా గూడ్స్ రైలు రాగానే నలుగురు పట్టాలపై దూకినారు. రైలు కింద పడటంతో నలుగురు అక్కడికక్కడే మరణించారు మృతులు ఒకే కుటుంబానికి చెందినవారు కావడంతో రైల్వే పోలీసులు రంగంలోకి దిగి వీరి మరణానికి గల కారణాలు తెలుసుకునే ప్రయత్నం చేశారు. సంఘటనా స్థలంలో లభించిన డ్రైవింగ్ లైసెన్స్ ఆధారంగా వీరు నెల్లూరు జిల్లా ఆర్వి కండ్రిక గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. ఆత్మహత్యకు గల కారణాలు ఆర్థిక ఇబ్బందుల లేక కుటుంబ కలహాల నేపథ్యంలో జరిగిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



# గుండ్లపల్లిలో 'పొలం పిలుస్తుంది'.. రైతులకు సాగు మెలకువలపై అవగాహన

**నకరికల్లు, జూలై 14, మనసులో మాట.**

నకరికల్లు మండలం గుండ్లపల్లి గ్రామంలో మంగళవారం ఖరీఫ్ 2026 సీజన్‌ను పురస్కరించుకుని "పొలం పిలుస్తుంది" కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి కే. దేవదాసు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో రైతులకు సాగుపై కీలక సూచనలు చేశారు.

**వ్యవసాయ అధికారి దేవదాసు సూచనలు:**

భూసార రక్షణ: ఖరీఫ్ పంటల్లో పచ్చరొట్టె ఎరువుల సాగు వల్ల కలిగే లాభాలను వివరించారు. ఇవి భూమికి సహజమైన బలాన్ని ఇస్తాయని తెలిపారు.

పంటల మార్పిడి: రైతులు కేవలం ఒకే రకమైన పంటలు కాకుండా, అపరాల (పప్పుధాన్యాలు) పంటలు, సిరిధాన్యాల సాగు వైపు మొగ్గు చూపాలని కోరారు.

యాప్ ద్వారా ఎరువులు: యూరియా, డీఏపీ ఎరువులను ప్రభుత్వం కొత్తగా తెచ్చిన iAPAIMS 2.0 యాప్ ద్వారా పారదర్శకంగా ఎలా పొందాలో రైతులకు వివరించి, అవగాహన కల్పించారు.

**హాజరైన ప్రముఖులు:**

ఈ కార్యక్రమంలో నకరికల్లు పీఏసీఎస్ డైరెక్టర్ కరాలపాటి వల్లి, గ్రామ వ్యవసాయ సహాయకురాలు యు. ప్రియదర్శిని, స్థానిక రైతు నాయకులు మరియు గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్టీసీ అధికారుల నిరంకుశత్వంపై కార్మికాగ్రహం

- **జీవోలను అపహాస్యం చేస్తూ లీవ్ పెట్టినా 'ఆబ్సెంట్' వేస్తూ దారుణ వేధింపులు**

**మంగళగిరి జూలై 14 (మనసులో మాట )::**



ఏపీఎస్ఆర్టీసీ మంగళగిరి డిపోలో డ్రైవర్లు, కండక్టర్ల పట్ల యాజమాన్యం వ్యవహరిస్తున్న బానిసత్వ పోకడలపై కార్మిక లోకం నిప్పులు చెరుగుతోంది. చట్టబద్ధమైన హక్కులను, ప్రభుత్వ నిబంధనలను సైతం తుంగలో తొక్కుతూ, రక్తం ధారపోసి పనిచేస్తున్న సిబ్బందిని మానసిక క్షోభకు గురిచేస్తున్న అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకంతో బస్సుల్లో ప్రయాణికుల రద్దీ అమాంతం పెరిగిపోయింది. 'లీన్ అవర్స్' (రద్దీ లేని సమయం) అనేదే లేకుండా నిరంతరం కిక్కిరిసిన ప్రయాణికులతో ఊపిరాడని విధులను నిర్వహిస్తూ, కనీసం శ్వాస తీసుకునే విరామం కూడా లేక సిబ్బంది తీవ్రమైన అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఒకవైపు పని ఒత్తిడి కారణంగా గుండె సంబంధిత మరియు ఇతర తీవ్రమైన అనారోగ్య సమస్యలతో రాష్ట్రవ్యాప్తంగా ఏడాదిలోనే వందలాది మంది ఆర్టీసీ ఉద్యోగులు అకాల మరణం చెందడం కార్మికులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తోంది. ఇలాంటి కష్టకాలంలో విధిలేని పరిస్థితుల్లో నిబంధనల ప్రకారం మెడికల్ లీవ్ లెటర్లు, ప్రభుత్వ వైద్యుల ధృవీకరణ పత్రాలు సమర్పించినప్పటికీ.. అధికారులు దారుణమైన కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. ఆర్టీసీ లీవ్ నిబంధనలు మరియు ప్రభుత్వ జీవోల ప్రకారం మెడికల్ గ్రౌండ్స్‌పై లీవ్ పెడితే అర్హతను బట్టి దానిని 'ఎల్ఓపి' (LOP లాస్ ఆఫ్ పే) లేదా ఇతర లీవ్ కేటగిరీ కింద సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. కానీ, మంగళగిరి డిపో అధికారులు ఆ నిబంధనలను పూర్తిగా అపహాస్యం చేస్తూ, ఆన్‌లైన్ హాజరు వ్యవస్థలో వారిని అన్యాయంగా 'ఆబ్సెంట్' (గైర్హాజరు) గా నమోదు చేస్తున్నారు. కార్మికుల నోటికాడ కూడును లాగేస్తూ, వారి జీవితాలతో ఆడుకుంటున్న అధికారుల ఈ నిరంకుశ వైఖరి వల్ల ఉద్యోగుల సర్వీస్ రికార్డులు నిలువునా దెబ్బతింటున్నాయి. ఆన్‌లైన్ రికార్డుల్లో కావాలనే 'ఆబ్సెంట్' అని చూపించడం వల్ల భవిష్యత్తులో రావాల్సిన సీనియారిటీని, ప్రమోషన్లను (Promotions) మరియు ఇతర సేవా ప్రయోజనాలను తుడిచిపెట్టే ఘోరమైన కుట్ర జరుగుతోందని కార్మికులు నిలదీస్తున్నారు. మేన్యువల్ గా ఇచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌డేట్ చేయకుండా, ఉద్యోగుల క్రమశిక్షణపై కావాలనే మచ్చ తెచ్చేలా ఎందుకు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే తీవ్రమైన సిబ్బంది కొరతతో ఉన్న ఆర్టీసీలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, మంగళగిరి డిపోను ఖాళీ చేయించే ప్రతిపాదనలను విరమించుకోవాలని ఆర్టీసీ జేఏసీ డిమాండ్ చేస్తోంది. ఈ దుర్మార్గపు మరియు ఏకపక్ష తప్పుడు హాజరు విధానాన్ని తక్షణమే సవరించి, జీవో ప్రకారం లీవ్ మంజూరు చేయాలని, లేనిపక్షంలో మంగళగిరి డిపో సాక్షిగా ఉద్యోగ సంఘాల ఉమ్మడి మద్దతుతో యాజమాన్యానికి కనువిప్పు కలిగేలా, డిపోను పూర్తిగా స్తంభింపజేసేలా పెద్ద ఎత్తున ప్రత్యక్ష నిరసనలకు మరియు సమ్మెకు దిగుతామని కార్మిక లోకం తీవ్ర హెచ్చరికలు జారీ చేస్తోంది.

# రీ సర్వేలో అధికారులు అవకతవకలకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగిన రైతులు

**వినుకొండ --జూలై 14,, (మనసులో మాట ):**

రీ సర్వేలో అవకతవకలు జరిగాయంటూ ఈపూరు మండలంలోని కొచ్చర్ల గ్రామంలోని రైతులు మంగళవారం రాత్రి ఆందోళన కార్యక్రమం చేపట్టారు. వినుకొండకారంపూడి రహదారిపై ధర్నాకు కూర్చున్నారు. రెండవ విడత రీ సర్వేలో కొచ్చర్ల గ్రామంలోని భూములను సర్వే చేశారు. అయితే రీ సర్వేసమయంలో సర్వేయర్ల నిర్లక్షంగా వ్యవహరించారంటూ అందువలనే సర్వేలో అన్నీ తప్పులు వచ్చాయని, రెవిన్యూ అధికారులు అక్రమాలకు పాల్పడడం వలనే భూములు వివరాలు సక్రమంగా లేవని అన్నారు. తహాశీల్దారుకు, ఆర్ఎస్ఐకు తమ సమస్యను చెప్పినప్పటికి నిర్లక్షంగా సమాదానం చెప్పారన్నారు. సమస్య తీరేవరకు ఆందోళన విరమించేది లేదంటూ వినుకొండ కారంపూడి ప్రధాన రహదారిపై ధర్నాకు దిగారు. ధర్నాలో గ్రామంలోని రైతులందరూ సంఘటితంగా పాల్గొన్నారు. రెవిన్యూ అధికారుల అక్రమాలకు రైతులు బలైనారంటూ నినాదాలు చేశారు. అధికారులు చేసిన తప్పులు కారణంగా గ్రామంలోని రైతులకు అన్నదాత సుఖీభవ పడలేదన్నారు.రెవిన్యూ అధికారులు వచ్చి తమ సమస్యలను పరిష్కరించే వరకు ధర్నా విరమించేది లేదన్నారు. సాయంత్రం 6 గంటల నుండి ధర్నా చేస్తున్నారు. రోడ్డుకు రెండు వైపుల భారీగా వాహనాలు నిలిచిపోయాయి.క్షేత్ర స్థాయిలో అధికారులు స్వయంగా పరిశీలించి, పాత రికార్డులు, ఫీల్డ్ పరిస్థితులను ఆధారంగా తీసుకుని తప్పులను సవరించాలని రైతులు డిమాండ్ చేశారు. రీసర్వేలో జరిగిన లోపాలను సరిదిద్దకుండా నిర్లక్ష్యం చేస్తే తమకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి బాధిత రైతులకు న్యాయం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



# విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం వారి ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు

**యడ్లపాడు జూలై 14**
**మనసులో మాట**

విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగము మరియు ఆపరేషన్ విభాగము వారు సి ఆర్ డి ఎ పర్యవేక్షక ఇంజనీర్ సి.హెచ్. రమేష్ ఆధ్వర్యములో ఎడ్లపాడు సెక్షన్ పరిధిలోని ఉప్పరపాలెం, గుత్తావారిపాలెం, ఉన్నవ, మర్రిపాలెం, బోయపాలెం, దింతెనపాడు, లింగారావుపాలెం, తిమ్మాపురం గ్రామాలలో విస్తృత తనిఖీలు నిర్వహించారని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సి.హెచ్. వెంకటేశ్వర రావు, డి.పి. ఇ, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై .ఏడుకొండలు సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ తనిఖీలలో 32 మంది అధికారులు, 98 మంది సిబ్బంది, 32 బృందాలుగా ఏర్పడి 1479 సర్వీసులు తనిఖీ చేసి మీటరు లేకుండా డైరెక్టుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 3 మందికి రూ 0.05 లక్షలు,

మీటరు ఉన్నప్పటికీ అక్రమముగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 10 మందికి రూ 1.10 లక్షలు, అనుమతించిన కేటగిరి కాక ఇతర



కేటగిరి లో విద్యుత్ వాడుకుంటున్న ఒక్కరికి రూ 0.05 లక్షలు, అనుమతించిన లోడు కంటే అదనముగా విద్యుత్ వాడుతున్న 68 మందికి రూ 2.68 లక్షలు,మొత్తము రూ. 3.88 లక్షలు అపరాధ రుసుము విధించారు.

విద్యుత్ సర్వీసుల తనిఖీలు భారత విద్యుత్ చట్టం కు లోబడి ఉంటాయన్నారు. వినియోగదారులందరూ వారి ప్రేమిసెస్ లో ఉండే విద్యుత్ మీటర్లకు తప్పనిసరిగా సీలు ఉండేటట్లు నిర్ధారించుకోవాలనీ, ఒక వేళ సీలు లేక పోయినా, తుప్పు పట్టి ఊడి పోయినా, వెంటనే సంభదిత విద్యుత్ సిబ్బందికి రాత పూర్వకంగా తెలియచేయాలి. ముఖ్యంగా సాగర తీర ప్రాంతాలలోని మీటర్లకు ఉన్న సీలు త్వరగా పాడియే పోయే అవకాశం ఉన్నందున అప్పుడప్పుడు పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. ఏ ప్రాంతంలోనైనా విద్యుత్ అధికారుల తనిఖీలలో సీలు లేకపోవుట, ఉద్దేశ పూర్వకంగా వాటిని తొలగించుట, గాట్లు పెట్టుట వంటివి గమనించినచో విద్యుత్ చౌర్యంగా నిర్ధారించి కేసులు నమోదు చేయటం జరుగుతుంది. భారత విద్యుత్ చట్టం సెక్షన్ 135 ప్రకారం పనిచేయని మీటరు నుండి విద్యుత్ వాడుకున్నా, ఉండవలసిన మీటరుకు బదులు వేరే మీటరు పెట్టి సీలు లేకపోయినా విద్యుత్ చౌర్యం నిర్ధారణ అయినట్లే భావించబడుతుంది. మొదటి సారి తప్పిదానికి కాపౌండింగ్ పద్ధతిలో అపరాధ రుసుం చెల్లించినచో కేసు నుండి విడిచి పెడతారు. రెండవసారి తప్పిదానికి అరెస్ట్ చేసి రిమాండ్ కి పంపి కఠినంగా వ్యవహరిస్తారు. అపరాధ రుసుము కట్టలేని పరిస్థితులలోరెవెన్యూ రికవరి చట్టం ఉపయోగించి ఆస్తులు జప్తు చేయాదురు. మొదటి సారికి తప్పిదానికి మూడు రెట్లు, రెండవసారికి తప్పిదానికి ఆరు రెట్లు విధించే అవకాశం విద్యుత్ చట్టంలో ఉన్నది.

విద్యుత్ చౌర్యం సామజిక నేరం అని విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులను పూర్తి వివరాలతో 9440812263, 9440812360,నెంబర్లకు నేరుగా లేదా వాట్సాప్ ద్వార సంప్రదించవచ్చు అని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యముగా ఉంచబడతాయని అన్నారు.

ఈ దాడులలో ఆపరేషన్ విభాగ డి ఈ ఈ అర్ . అశోక్ కుమార్ డి.పి.ఇ (విజిలెన్స్) డి .ఈ ఈ లు కే . రవి కుమార్, ఎన్ మల్లిఖార్జున ప్రసాద్, ఆపరేషన్ విభాగ ఏఈ ఈ కే . వెంకటేశ్వర రావు, డి.పి. ఇ (విజిలెన్స్) ఏ ఈ ఈ లు ఎం . సతీష్ కుమార్, యు . శివశంకర్, మరియు ఆపరేషన్ డి ఈ ఈ, ఏఈ ఈ లు పాల్గొన్నారు.

# వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మీసాల మురళీకృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో జీవి జన్మదిన వేడుకలు

**వినుకొండ -- జూలై 14,**
**(మనసులో మాట )**

వినుకొండ శాసనసభ్యులు, ప్రభుత్వ చీఫ్ విప్ శ్రీ జీవీ ఆంజనేయులు జన్మదిన వేడుకలు నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. వినుకొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ మీసాల మురళీకృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డులో మొక్కలు నాటారు. అనంతరం జీవీ ఆంజనేయులు జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డు చైర్మన్ మీసాల మురళీకృష్ణ యాదవ్ మాట్లాడుతూ, జీవీ ప్రజా సేవకు నిలువెత్తు రూపమని కొనియాడారు. మూడు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ అనుభవంతో, నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తూ వినుకొండ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ఆయన అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. అపర భగీరథుడిగా, పేదల పెన్నిధిగా కష్టాల్లో ఉన్న ప్రతి పేదవాడికి అండగా నిలుస్తూ నియోజకవర్గ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. పదవులకతీతంగా శివశక్తి ఫౌండేషన్ ద్వారా విద్యా, వైద్య, సామాజిక రంగాల్లో వినూత్న కార్యక్రమాలు చేపడుతూ వేలాది కుటుంబాల్లో వెలుగులు నింపిన మహోన్నత వ్యక్తిత్వం ఆయనదన్నారు. ఎల్లవేళలా ప్రజా సేవలోనే తరిస్తూ, భిన్నమైన రాజకీయ వ్యక్తిత్వంతో ముందుకు సాగుతున్న మన ప్రభుత్వ చీఫ్ విప్ శ్రీ జీవి ఆంజనేయులు కి ఈ సందర్భంగా వారు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లగడపాటి వెంకట్రావు, గంగినేని ఆంజనేయులు, యార్డు వైస్ చైర్మన్ కాలింగి శ్రీనివాసరావు , నూజెండ్ల సొసైటీ అధ్యక్షులు బచ్చు అంజిరెడ్డి, నూజెండ్ల మండల పార్టీ అధ్యక్షులు గంగినేని బాబు, సోమేపల్లి బ్రహ్మయ్య, గంగినేని చంద్రశేఖర్, వినుకొండ టౌన్ పార్టీ అధ్యక్షులు బొంకూరు రోశయ్య,,కొమ్మ శ్రీనివాసరావు, యార్డు సెక్రటరీ కృష్ణ నాయక్,సూపర్వైజర్ రాఘవ,,రాష్ట్ర విశ్వబ్రహ్మ కార్పొరేషన్ డైరెక్టర్ మోతడక వీరాచారి,, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు సిద్ధవరపు ఫరీద్,, బికారి నాయక్, గన్నపుడి ఈశ్వరయ్య,, కొరపాటి ప్రసాదు, వార్డు నాయకులు లింగా రామయ్య, కొత్త రవి, ఏగేశ్వరరావు,, యేసు రత్నం, నంబుల పాపారావు, మక్కెన మహేష్, కొత్తపల్లి రవి,మార్కెట్ యార్డ్ సిబ్బంది నాయకులు పాల్గొన్నారు.



# నరసింగపాడు కాశీ విశ్వేశ్వరాలయంలో వైభవంగా ప్రదోష కాల పూజలు

**నకరికల్లు, జూలై 14,**
**మనసులో మాట.**



నకరికల్లు మండలం, నరసింగపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ప్రదోష కాల పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరిగాయి. ఆలయ కమిటీ పర్యవేక్షణలో జరిగిన ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు పవన్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజాధికాలు నిర్వహించారు.

**విశేష అభిషేకాలు - అర్చనలు**

ప్రదోష కాలాన్ని పురస్కరించుకుని కాశీ విశ్వేశ్వరునికి నమక చమకాలతో, పంచామృతాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక ధూప, దీప, నైవేద్యాలను సమర్పించారు. అర్చకులు పవన్ కుమార్ శర్మ ప్రదోష పూజ ప్రాశిస్త్యాన్ని, దాని విశిష్టతను భక్తులకు వివరించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, గ్రామ పెద్దలు మరియు పరిసర ప్రాంతాల నుంచి తరలివచ్చిన శివభక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు ఆలయ కమిటీ వారు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.



# ఈ నెల 17న జిల్లాలో ముఖ్యమంత్రి, కేంద్రమంత్రి పర్యటన ప్రత్తిపాటి

**చిలకలూరిపేట జూలై 14**
**మనసులో మాట**

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డి అర్ సి మీటింగ్ లో జిల్లా ఇంచార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, సహచర ఎమ్మెల్యేలతో కలిసి మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. ఈనెల 17న నరసరావుపేట కేంద్రంగా జరగనున్న భారీ రుణమేళా కార్యక్రమం, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ల సభ ఏర్పాట్లకు సంబందించి అధికారులతో సమీక్షించి కొన్ని సూచనలు ఇచ్చారు.

# వినుకొండ నియోజకవర్గంలో ఘనంగా చీఫ్ విప్ జీవి ఆంజనేయులు పుట్టినరోజు వేడుకలు

- ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి
- వినుకొండలో రోగులకు పండ్లు పంపిణీ అన్నదాన కార్యక్రమాలు
- అంగులూరులో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టిన కార్యకర్తలు





**వినుకొండ జూలై 14, (మనసులో మాట )** రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ మరియు వినుకొండ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు పుట్టినరోజు సందర్భంగా మంగళవారం వినుకొండ నియోజకవర్గంలో పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూజిండ్ల మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శివశక్తి లీల అంజన్ ఫౌండేషన్ మరియు గుంటూరు శంకర్ కంటి ఆసుపత్రి లో సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి శుక్లాల భారీ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పల్నాడు జిల్లా మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి జీవీ ఆంజనేయులు శుభాకాంక్షలు తెలిపారు అనంతరం జ్యోతి ప్రజలను చేసి ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. నూజెండ్ల మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు ఈ శిబిరంలో పాల్గొని వైద్య సేవలు పొందారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కిన మల్లికార్జునరావు, డి ఎల్ డి ఏ చైర్మన్ లగడపాటి వెంకట్రావు, గంగినేని ఆంజనేయులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మీసాల మురళీ కృష్ణ యాదవ్, నాగశ్రీను రాయల్, శివశక్తి మేనేజర్ ఫణి నాయకులు, కార్యకర్తలు ఇతరులు పాల్గొన్నారు.

**వినుకొండ పట్టణంలో సేవా కార్యక్రమాలు**

రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ శాసనసభ్యులు జీవీ.ఆంజనేయులు జన్మదినోత్సవం సందర్భంగా వినుకొండ పట్టణంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో మరియు పురపాలక సంఘం కాంప్లెక్స్ వద్ద భారీ కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భారీగా అన్నదానం మరియు అల్పాహార పంపిణీ కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం వేడుకల్లో భాగంగా ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలో పట్టణ టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శివశక్తి ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ జి వి రమణ రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మీసాల మురళీ కృష్ణ యాదవ్, ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పి. సైదారావు ,మాజీ కౌన్సిలర్ పివి సురేష్ బాబు, బూదాల సాగర్ బాబు , జానీ భాష, దాసరి కోటేశ్వరరావు ,షేక్ అక్బర్ బాషా, షేక్ జానీ,షేక్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

**అంగులూరు గ్రామంలో మొక్కలు నాటిన టిడిపి శ్రేణులు**

వినుకొండ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు జన్మదిన వేడుకలను ఈపూర్ మండలం అంగలూరు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్రామాల్లోని పలు ప్రాంతాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని కార్యకర్తలు చేపట్టారు. తమ నాయకుడి పుట్టినరోజు మొక్కలు నాటడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించాలని మంచి సంకల్పంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రొంపిచర్లలో బీఎస్పీ శ్రేణుల సమరశంఖం

- స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా రాష్ట్ర అధ్యక్షుడు బండెల గౌతమ్ కుమార్ పర్యటన విజయవంతం
- సంతగుడిపాడు గ్రామంలో బీఎస్పీ జెండాను ఆవిష్కరించిన రాష్ట్ర నాయకత్వం.



**నరసరావుపేట, జూలై 14 (మనసులో మాట)::** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) జెండాను ఎగురవేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమాయత్తమవుతున్నాయి. ఇందులో భాగంగా పల్నాడు జిల్లా నరసరావుపేట నియోజకవర్గంలోని రొంపిచర్ల మండలం సంతగుడిపాడు గ్రామంలో బుధవారం బీఎస్పీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించబడింది. బీఎస్పీ పల్నాడు జిల్లా అధ్యక్షులు బూదాల బాబురావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రొంపిచర్ల మండల అధ్యక్షులు నందిగం చక్రవర్తి నిర్వహణ బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఎస్పీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు బండెల గౌతమ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు చీఫ్ జోన్ ఇన్‌చార్జ్ నేరెళ్ల రాజు, రాష్ట్ర కోశాధికారి తెనాలి ప్రకాష్ తదితరులు హాజరయ్యారు. గ్రామ సరిహద్దుకు చేరుకున్న రాష్ట్ర నాయకత్వానికి పార్టీ శ్రేణులు, స్థానిక బహుజన యువత ఘనస్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు బండెల గౌతమ్ కుమార్ పార్టీ నీలి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ బహుజన సమాజ సాధికారత, రాజ్యాధికార లక్ష్య సాధన కోసం ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఎస్పీ సత్తా చాటడమే ధ్యేయంగా పనిచేయాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. బహుజనుల హక్కుల సాధన కేవలం రాజకీయ అధికారంతోనే సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంతగుడిపాడు గ్రామ ప్రజలు, బీఎస్పీ వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సీఐ వై.వీ.యల్ నాయుడు



**జూలై 14కంచికచర్ల(మనసులోమాట)** నందిగామ రూరల్ సీఐ కంచికచర్ల గ్రామంలోని దీక్ష కళాశాలలో నిర్వహించిన సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు సీఐ వై వి ఎల్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు మరియు అధ్యాపకులకు వివిధ రకాల సైబర్ నేరాలు, సాధారణ ఆన్‌లైన్ మోసాలు, అలాగే డిజిటల్ ప్రపంచంలో సురక్షితంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు అదనంగా, ఏదైనా సైబర్ మోసానికి గురైన వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు కాల్ చేసి, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు.ఈ అవగాహనను విద్యార్థుల తల్లిదండ్రులు మరియు కుటుంబ సభ్యులతో కూడా పంచుకొని, వారిని కూడా సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండేలా చేయాలని విద్యార్థులకు సూచించారు. సైబర్ నేరాలకు పాల్పడిన వారికి కఠిన చర్యలు తీసుకుంటామని సి.ఐ వై.వి.ఎల్ నాయుడు పేర్కొన్నారు.

# పశుసంవర్ధక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో పాల ఉత్పత్తిదారులకు శిక్షణా కార్యక్రమం



**పెదనందిపాడు జూలై 14 (మనసులో మాట)** కాకుమాను మండలం రేటూరుగ్రామ పంచాయతీలో, ATMA (అగ్రికల్చరల్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ), BTT పొన్నూరు మరియు పశుసంవర్ధక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో పాల ఉత్పత్తిదారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించబడింది. గుంటూరు జిల్లాలో 'పశుగ్రాస వారోత్సవాల' ముగింపు కార్యక్రమాల్లో భాగంగా జరిగిన ఈ సమావేశానికి పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కె.వి.వి. సత్యనారాయణ, ATMA జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ టి. శ్రీనివాసరావు, ATMA అసిస్టెంట్ డైరెక్టర్ జి. వెంకటేశ్వరరావు, పొన్నూరు వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామకోటేశ్వరి మరియు పశుసంవర్ధక శాఖ సిబ్బంది హాజరయ్యారు. శిక్షణ అనంతరం పాల ఉత్పత్తిదారులకు ధృవీకరణ పత్రాలు పంపిణీ చేశారు. పశుగ్రాస నిర్వహణ మరియు పాల ఉత్పత్తిలో పచ్చి గడ్డి ప్రాముఖ్యతపై ఈ శిక్షణ జరిగింది. ఎల్‌నినో (ElNino) ప్రభావం, కరువును తట్టుకునే పశుగ్రాస రకాలను సాగు చేయడం, పశువులకు తగినంత పచ్చి మరియు ఎండు గడ్డిని అందించడం ద్వారా పాల ఉత్పత్తి పరిమాణం మరియు నాణ్యతను ఎలా కాపాడుకోవాలో జాయింట్ డైరెక్టర్ రైతులకు వివరించారు. పశుగ్రాస నిర్వహణ మరియు పశువుల ఆరోగ్యంపై నిపుణులతో జరిగిన చర్చలో పాల ఉత్పత్తిదారులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

## ఖరీఫ్ సీజన్ 2026 పొలం పిలుస్తుంది కార్యక్రమం ప్రారంభించిన మండల వ్యవసాయ అధికారి ఐ.సుబ్రమణ్యం




**పెదనందిపాడు, జూలై 14 (మనసులో మాట)**

పెదనందిపాడు మండలంలోని రావిపాడు మరియు గోగులమూడి గ్రామాలలో ఖరీఫ్ సీజన్ 2026 సంవత్సరానికి పొలం పిలుస్తుంది కార్యక్రమం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల వ్యవసాయ అధికారి ఐసుబ్రమణ్యంమాట్లాడుతూ..ప్రత్తి పంటలకు పంటల భీమా చేయించుకోటానికి ఈనెల 15వ తారీకు ఆఖరి తేదీ అని మరియు 1900 రూపాయలు ప్రీమియం చెల్లించవలెనని తెలిపినారు.ప్రత్తికి ఇన్సూరెన్స్ అమౌంట్ 95000 వరకు పంటల భీమా వర్తిస్తుందని అలాగే పండు మిరప పైరుకి ఎకరానికి 2700 ప్రీమియం చెల్లించిన యెడల 90 వేల రూపాయలు అలాగే వరి పైరుకి 800 ప్రీమియం చెల్లిస్తే 40 వేల రూపాయల వరకు పంటల భీమా వస్తుందని తెలిపినారు.వరి పైరు కి ఆగస్టు 15 వరకు ప్రీమియం చెల్లించుకోవచ్చునని తెలిపినారు.ఈ వర్షాభావ పరిస్థితుల్లో పంటల భీమా చేసుకొనటం వలన రైతులకు ఆర్థికంగా వెసులుబాటు ఉంటుందని తెలిపినారు. అలాగే ఏపీ ఎయిమ్స్ యాప్ ద్వారానే యూరియా మరియు డిఏపి పంపిణీ జరుగుతుందని తెలిపినారు.ఎల్ నినో ప్రభావం వలన వర్షాలు లేనందువలన ఆరుతడి పంటలు ఐన అపరాలు సాగు చేయాలని తెలియచేశారు.ఈ కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది Enosh మరియు చంద్రశేఖర్ మరియు ఇరు గ్రామాల ప్రజలు పాల్గొన్నార

## ఇంటర్మీడియట్ ఎమ్.పి.సి విద్యార్థులకు

### మ్యాథమెటిక్స్ బుక్స్ బహుకరించిన టి.హనుమంతరావు



**పెదనందిపాడు జూలై 14 (మనసులో మాట)**

పెదనందిపాడు పి.ఎ.ఎస్ కళాశాలలో సీనియర్ ఇంటర్మీడియట్ ఎమ్.పి.సి చదువుతున్న విద్యార్థులకు మ్యాథమెటిక్స్ బుక్స్ ను బహుకరించిన హెడ్ అఫ్ ది డిపార్ట్మెంట్ టి.హనుమంతరావు. ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడెమీ తరుపున మ్యాథమెటిక్స్ బుక్స్ మరియు మెంటల్ ఎబిలిటీ బుక్స్ రైటర్ గా వ్యవహరించుచున్నారు. ఈ కార్యక్రమములో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డా. జి.వీర రాఘవయ్య గారు మాట్లాడుతూ ఎమ్.పి.సి విద్యార్థులకు కళాశాలలో మంచి నిష్ణాతులైన సీనియర్ ఫాకల్టీ మెంబెర్స్ అందుబాటులో ఉన్నారని, విద్యార్థిని విద్యార్థులు చక్కగా కళాశాలకు హాజరై మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించినారు. డా. పాతూరి శ్రీనివాస్ గారు మాట్లాడుతూ విద్యార్థులు స్టాఫ్ మెంబెర్స్ ద్వారా తమకు ఏ విధమైన సబ్జెక్టు పరమైన సందేహాలు ఉన్నను వాటిని నివృత్తి చేసుకొనవలెనని సూచించినారు. ఈ సందర్భముగా హనుమంతరావుమాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుండి ఆసక్తి కల విద్యార్థులకు పోటీ పరీక్షలకు తగిన శిక్షణ ఇస్తామని తెలియజేసినారు. ఈ కార్యక్రమములో మాథమాటిక్స్ డిపార్ట్మెంట్ నుండి శ్రీమతి పి. గ్రేస్ విక్టోరియా పాల్గొన్నారు.

## ఇరువురు చిన్నారులతో సహా తల్లి అనుమానస్పద మృతి

- ఆత్మహత్యగా ప్రచారం
- సూసైడ్ పత్రం లభ్యం
- వరకట్న వేధింపులకు పాల్పడి హత్య చేశారంటూ మృతురాలి బంధు వర్గం ఆరోపణ





**వినుకొండ -- జూలై 14, (మనసులో మాట )**

ఇరువురు చిన్నారులతో సహా తల్లి అనుమానాస్పదంగా మృతి చెందిన హృదయ విధారకర సంఘటన పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలోని విఠం రాజు పల్లి గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. మంగళవారం తెల్లవారిన తర్వాత ఈ దుర్ఘటన వార్త విని గ్రామం ఉలిక్కిపడింది. తీవ్ర విషాదకరమైన ఈ సంఘటనలో గ్రామానికి చెందిన నక్క భారతి(28) తోపాటు ఆమె ఇరువురు పిల్లలు నక్క హేమంత్ నాగిరెడ్డి(5), నక్క తేజేశ్వర్ రెడ్డి (3)లు ముగ్గురు అనుమానాస్పదంగా మృతి చెంది ఉన్నారు. సమాచారం అందుకున్న సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రభాకర్ రావు సారథ్యంలో వినుకొండ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని,ప్రాథమిక విచారణ నిర్వహించారు. సంఘటన ప్రాంతంలో తన మృతికి ఎవరు కూడా కారకులు కాదంటూ మృతురాలు భారతి రాసినట్టుగా పేర్కొన్న సూసైడ్ నోటును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనిని బట్టి తన ఇద్దరు పిల్లలను తనే చంపి తాను స్వయంగా ఉరిపోసుకుని ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని ప్రాథమిక సమాచారంగా తెలుస్తుంది. అయితే మృతురాలి బంధువులు ఈ సంఘటనను వరకట్న వేధింపుల హత్యగా ఆరోపించారు. మృతురాలి మేనమామ నూజెండ్ల మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన నక్క నాగిరెడ్డి కథనం మేరకు భారతికి తల్లిదండ్రులు లేకపోవడంతో ఆమె నాగిరెడ్డి సంరక్షణలో పెరిగిందని, 2019 సంవత్సరం నవంబర్ నెలలో వినుకొండ మండలం విఠమిరాజు పల్లి కి చెందిన నక్క సునీల్ రెడ్డితో వివాహం జరిగినట్లు తెలిపారు. వివాహం జరిగినప్పటి నుంచి అదనపు కట్నం కోసం భర్త నక్క సునీల్ రెడ్డి అత్తమామలు నక్క సరస్వతి నక్క వీరాంజనేయరెడ్డిలు వేధింపులకు గురి చేస్తున్నారని భారతి పలుమార్లు మేనమామ నాగిరెడ్డికి చెప్పుకొని ఆందోళన వ్యక్తం చేసినట్లు నాగిరెడ్డి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులు పేర్కొన్నారు ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి 11 గంటల సమయంలో సునీల్ రెడ్డి ఫోన్ చేసి భారతి ఇంటి తలుపు తీయడం లేదని ఇంట్లో అరుపులు వినిపిస్తున్నాయని తనకు సమాచారం ఇచ్చాడని నాగిరెడ్డి పేర్కొన్నారు. దీంతో తాను కుటుంబ సభ్యులతో కలిసి అక్కడికి వెళ్లి చూడగా భారతి ఉరివేసుకొని ఉండగా ఇద్దరు చిన్నారులు మంచంపై మృతదేహాలుగా కనిపించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇది ముమ్మాటికి వరకట్న వేధింపులతో కూడిన హత్య సంఘటనగా నాగిరెడ్డి ఆరోపించారు. కేసు నమోదు చేసి భర్త అత్తమామలను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని నక్క నాగిరెడ్డి డిమాండ్ చేశారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ మృతురాలి మేనమామ నాగిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సంఘటనపై సమగ్ర విచారణ చేపడతామని అన్నారు. వినుకొండ మండల తహసిల్దార్ సురేష్ నాయక్ సిబ్బందితో కలిసి సేవ పంచనామా నిర్వహించగా, మృతదేహానికి పంచనామా నిర్వహించగా, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను వినుకొండ పట్టణ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## గుండ్లపల్లిలో 'పొలం పిలుస్తోంది'.. రసాయనిక ఎరువులు తగ్గించి, ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలి!



**నకరికల్లు, జూలై 14,**

ఖరీఫ్ సాగులో రైతులు సాంప్రదాయ పద్ధతులతో పాటు ఆధునిక వ్యవసాయ విధానాలను అలవర్చుకోవాలని నకరికల్లు మండల వ్యవసాయ అధికారి (ఏఓ) కె. దేవదాసు పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రామంలో ఖరీఫ్ సీజన్2026కు గాను "పొలం పిలుస్తోంది" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేయాల్సిన మెలకువలపై అవగాహన కల్పించారు.

**పచ్చిరొట్ట ఎరువులతో భూసార పరిరక్షణ**

నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి పచ్చిరొట్ట ఎరువుల సాగు ఎంతో దోహదపడుతుందని ఏఓ దేవదాసు వివరించారు. వీటి సాగు వల్ల భూమికి అవసరమైన నత్రజని సహజసిద్ధంగా అందుతుందని, తద్వారా రసాయనిక ఎరువుల ఖర్చు తగ్గుతుందని రైతులకు సవివరంగా తెలియజేశారు.

**చిరుధాన్యాలు, అపరాల సాగు వైపు అడుగులు**

రైతులు కేవలం ఒకే రకమైన పంటలపై ఆధారపడకుండా, అధిక లాభాలనిచ్చే అపరాలు (పప్పుధాన్యాలు), ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే చిరుధాన్యాల (సిరిధాన్యాలు) సాగు వైపు మొగ్గు చూపాలని ఆయన సూచించారు. వీటి వల్ల పెట్టుబడి ఖర్చులు తగ్గడమే కాకుండా మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందని పేర్కొన్నారు. ఐపామ్స్ (iAPAIMS 2.0) యాప్ ద్వారా ఎరువుల పంపిణీ ఇకపై యూరియా, డీఏపీ వంటి రసాయనిక ఎరువుల పంపిణీ పారదర్శకంగా జరగడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన iAPAIMS 2.0 యాప్ వినియోగంపై రైతులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. దీని ద్వారా ఎరువుల లభ్యత, పంపిణీ సులువవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నకరికల్లు పిఎసిఎస్ డైరెక్టర్ కరాలపాటి వల్లి, గ్రామ వ్యవసాయ సహాయకురాలు (వీఏఏ) యు. ప్రియదర్శినితో పాటు గ్రామ రైతులు, రైతు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కామ్రేడ్ పులుపుల శివయ్య జీవితం స్ఫూర్తిదాయకం




**వినుకొండ జూలై 14,, (మనసులో మాట )**
మార్క్సిజం తత్వవేత్త వినుకొండ మాజీ శాసనసభ్యులు కామ్రేడ్ పులుపుల వెంకట శివయ్య 50వ వర్ధంతి వేడుకలు వినుకొండ పట్టణంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత కామ్రేడ్ శివయ్య గారి స్థూపం వద్ద పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో కూడి ఘనంగా నివాళులర్పించారు. అమర వీరులకు జోహార్లు అర్పించారు. అనంతరం సిపిఐ ఆఫీసులో భూదాల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఏ.మారుతి వరప్రసాద్, పట్టణ ప్రముఖ సీనియర్ న్యాయవాది పీ జె లూకా ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ పేదల హక్కుల కోసం నిరంతరం పాటుపడుతూ, యువజన కార్మిక ఉద్యమాలు నిర్మించడానికి, రాష్ట్రంలో కమ్యూనిజం వ్యాప్తి చెందడానికి తన జీవితకాలం పాటుపడిన మహోన్నత వ్యక్తిగా పులుపుల శివయ్య చరిత్రలో నిలుస్తారు అన్నారు. శాసనసభ్యుడుగా రెండు పర్యాయాలు వినుకొండ నుండి గెలుపొందిన శివయ్య ప్రజల కోసం తప్ప వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఏనాడు ప్రాకులాడని వ్యక్తి గా సాదా జీవితం గడిపిన ఘనుడు శివయ్య అన్నారు. విశాఖ ఉక్కు కోసం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన త్యాగశీలి అని వారు కొనియాడారు. ప్రజల ప్రయోజనం తప్ప వ్యక్తిగత ప్రయోజనాలను ఏనాడు ఆశించని నాయకుడిగా శివయ్య రాజకీయ చరిత్రలో ధ్రువతారగా నిలిచాడు అన్నారు. సభలో సిపిఐ సీనియర్ నాయకులు, మున్సిపల్ మాజీ చైర్మన్ సంధ్రపాటి సైదా మాట్లాడుతూ తనను నమ్ముకున్న ప్రజల కోసం తన వ్యక్తిగత కుటుంబాన్ని త్యాగం చేసిన పులుపుల శివయ్య జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. శివయ్య గారి స్ఫూర్తితో వినుకొండ పట్టణంలో పఠాన్ కాసింఖాన్, జహీరుద్దీన్ ఖాన్, వీరిశెట్టి సీతయ్య, యార్లగడ్డ శేషయ్య,లాంటి వ్యక్తులను ఆదర్శంగా తీసుకొని నేటి యువత సమసమాజ కోసం, అనగారిన పేద వర్గాల కోసం పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు ..ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఉలవలపూడి రాము,పఠాన్ లాల్ ఖాన్, మహంకాళి సుబ్బారావు, రాయబారం వందనం, కొప్పెరపు మల్లికార్జున, ఏ. పవన్ కుమార్ ఊట్ల రామారావు షేక్ మస్తాన్,జల్లి వెంకటేశ్వర్లు,,కే రాజు,నక్క శ్రీదేవి,సుబేదార్ యూనిస్,, తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు నిర్వహించిన జనసేన నాయకులు



**దుర్గి జూలై 14 ( మనసులో మాట)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాసేవలోకి తిరిగి రావాలని ఆకాంక్షిస్తూ, దుర్గి మండలంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, అష్టోత్తర శతనామ పూజలు నిర్వహించి, పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు కోసం భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. అనంతరం కొబ్బరికాయలు కొట్టి, హారతి ఇచ్చి, ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు రవి మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తున్న పవన్ కళ్యాణ్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని ప్రజాసేవలో మరింత ఉత్సాహంగా పాల్గొనాలని ప్రతి జనసైనికుడు కోరుకుంటున్నాడని అన్నారు. ఆయన ఆరోగ్యం పట్ల రాష్ట్ర ప్రజలు, జనసేన శ్రేణులు ఆందోళన చెందుతున్నప్పటికీ, ఆయన త్వరలోనే ఆరోగ్యంగా తిరిగి ప్రజల మధ్యకు వస్తారనే విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే, రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తున్న పవన్ కళ్యాణ్ గారికి ఆంజనేయస్వామి ఆశీస్సులు లభించి, ఆయురారోగ్యాలతో దీర్ఘకాలం ప్రజలకు సేవ చేసే శక్తిని ప్రసాదించాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, మండల నాయకులు, గ్రామ అధ్యక్షులు, వీర మహిళలు, జనసైనికులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని పవన్ కళ్యాణ్ గారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# 'యు' ఆకారం వద్దు.. నేరుగానే నిర్మించాలి

- **రైల్వే గేట్ నెం. 41 వద్ద 'స్ట్రెయిట్ అలైన్‌మెంట్' కోరుతూ ఎంపీకి వినతి**
- **కంకణాలపల్లి రైతులు, విద్యార్థుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోవాలి**
- **నిర్మాణానికి ముందు గ్రామసభ నిర్వహించాలని సిపిఎం డిమాండ్**



**నరసరావుపేట, జూలై 14 (మనసులో మాట)::**
సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి గ్రామ పరిధిలోని రైల్వే గేట్ నెం.41 వద్ద ప్రతిపాదించిన రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) డిజైన్ మార్చాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ప్రతిపాదిత బ్రిడ్జిని యుఆకారంలో కాకుండా, ప్రస్తుతం ఉన్న ప్రధాన రహదారి మీదుగానే నేరుగా (స్ట్రెయిట్ అలైన్ మెంట్) నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలను కంకణాలపల్లి గ్రామ ప్రజలు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం సత్తెనపల్లి మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ మాట్లాడుతూ అధికారులు ప్రతిపాదించిన యుఆకారపు అండర్ బ్రిడ్జి వల్ల గ్రామ ప్రజలు, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. గ్రామ ప్రజల ప్రధాన జీవనాధారం వ్యవసాయమేనని, యుఆకార మార్గం వల్ల పంటలను మార్కెట్లు, కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులకు తరలించేందుకు, చివరకు పొలానికి వెళ్లాలన్నా అదనపు దూరం ప్రయాణించాల్సి వస్తుందని తెలిపారు. దీనివల్ల రైతులపై రవాణా వ్యయం, ఇంధన ఖర్చుతో పాటు సమయ భారం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ వందలాది మంది విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారిని వినియోగిస్తున్నారని, తాజా డిజైన్ వల్ల వారి ప్రయాణ దూరం కూడా పెరుగుతుందన్నారు. వర్షాకాలంలో అండర్ పాస్‌లో నీరు నిలిచిపోయే ప్రమాదం ఉండటంతో రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉందని, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలు ఆలస్యంగా చేరుకునే పరిస్థితి తలెత్తుతుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా అధికారులు ప్రతిపాదనలు రూపొందించకూడదని, నిర్మాణ పనులు చేపట్టే ముందు తక్షణమే గ్రామసభ లేదా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. రైతులు, విద్యార్థులు, గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సాంకేతికంగా అనుకూలమైన డిజైన్‌ను అమలు చేయడంతో పాటు, వర్షాకాలంలో నీరు నిల్వ కాకుండా శాశ్వత డ్రైనేజ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రైల్వే గేట్ నెం.41 వద్ద ప్రతిపాదించిన అండర్ గ్రౌండ్ బ్రిడ్జిని ప్రధాన రహదారిపైనే నేరుగా నిర్మించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని ఎంపీ శ్రీకృష్ణదేవరాయలను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంకణాలపల్లి గ్రామానికి చెందిన మహిళలు, రైతులు సహా 300 మందికి పైగా గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఘనంగా రాష్ట్ర తెలుగు రైతు మీడియా కోఆర్డినేటర్ టీడీపీ నేత గింజుపల్లి వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలు



**పెదనందిపాడు,జూలై 14 (మనసులో మాట)**
ప్రత్తిపాడు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో మంగళవారం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, రాష్ట్ర తెలుగు రైతు మీడియా కోఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకకు ప్రత్తిపాడు నియోజకవర్గ శాసన సభ్యులు బూర్ల రామాంజనేయులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జన్మదిన కేక్ కట్ చేసి వెంకటేశ్వరావుకి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, రైతుల సంక్షేమానికి వెంకటేశ్వరావు గారు చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. రైతుల సమస్యలపై ఎప్పుడూ ముందుండి పోరాడే నాయకుడిగా ఆయన పేరుగాంచారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాహు కేతు పూజలకు పోటెత్తిన భక్తులు



**పెదకాకాని, జూలై 14. మనసులో మాట:** పెదకాకాని శివాలయంలో అమావాస్య మంగళవారము సందర్భంగా ఆలయంలో రాహు కేతు పూజలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. తెల్లవారుజాము గం.5 నుండి నుంచి మధ్యాహ్నం రాహుకాలం 3:00 వరకు 1061 టికెట్లు భక్తులకు విక్రయించినట్లు ఆలయ ఉపకమిషనర్ గోగినేని లీలా కుమార్, పాలకమండలి చైర్మన్ కోసూరి పూర్ణచంద్రరావు తెలిపారు. రాహు కేతు పూజల ద్వారా రూ. 5,30,500/లు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ తెలిపారు. భక్తులకు ఏ విధమైన అసౌకర్యం లేకుండా తగు ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ పూర్ణచంద్రరావు తెలిపారు.

# జుజ్జూరులో ఉజ్వల వెలుగ గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేసిన విప్ తంగిరాల సౌమ్య



**నందిగామ జూలై 14 (మనసులో మాట)** వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామంలో మంగళవారం నాడు ప్రధానమంత్రి ఉజ్వల పథకం కింద 40 మంది అర్హులైన లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ మహిళల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, వారి ఆరోగ్య పరిరక్షణ, ఆర్థిక భారం తగ్గించడమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. మహిళల సంక్షేమాన్ని కేంద్రబిందువుగా చేసుకుని ఉజ్వల పథకం, ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో కూడుకున్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. గ్రామీణ మహిళలు పొగరహిత వంటగదులతో ఆరోగ్యకరమైన జీవనం సాగించేలా ఉజ్వల పథకం ఎంతో దోహదపడుతోందని చెప్పారు.ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి లబ్ధిదారులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓటర్ల సమగ్ర సర్వే గడువు పెంపు: మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరి బాబు



**చిలకలూరిపేట జూలై 14 మనసులో మాట** భారత ఎన్నికల సంఘం ఓటర్ల సమగ్ర సర్వే గడువును మరో 10 రోజులు, అనగా ఈ నెల 24వ తేదీ వరకు పొడిగించినట్లు మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరి బాబు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలో అనివార్య కారణాల వల్ల ఇంకా ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రజలు తమ ఫారాలను పూర్తి చేసి సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్ కు అందజేయడం ద్వారా, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి మ్యాపింగ్ చేయడానికి వీలుంటుందని ఆయన వివరించారు. ఫారాలు నింపడంలో ఏవైనా సందేహాలు ఉంటే, ఆ ఫారంలోనే ముద్రించి ఉన్న బీఎల్ఓ ఫోన్ నెంబర్‌ను సంప్రదించవచ్చని, వారు తగిన సహాయం చేస్తారని సూచించారు. ఇంకా ఎవరైనా ఫారాలు సమర్పించని వారు వెంటనే ఈ అదనపు గడువును ఉపయోగించుకుని తమ ఓటు హక్కును భద్రపరచుకోవాలని కమిషనర్ శ్రీహరి బాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# నరసరావుపేటలో భారీ రుణమేళా - విచ్చేస్తున్న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు!

- రూ.2,500 కోట్ల రుణాల పంపిణీకి సర్వం సిద్ధం
- ఏర్పాట్లను ముమ్మరం చేసిన మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ కృతిక శుక్లా
- నియోజకవర్గ ప్రతిష్ఠగా తీసుకుని విజయవంతం చేస్తాం - ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ




**నరసరావుపేట, జూలై 14** ఈ నెల 17న పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోనే మొదటిసారిగా అత్యంత భారీగా నిర్వహించనున్న "క్రెడిట్ అవుట్ రీచ్" (రుణమేళా) కార్యక్రమానికి సర్వం సిద్ధం చేస్తున్నారు. ఈ పర్యటనను విజయవంతం చేయడం కోసం మంగళవారం జిల్లా ఇన్‌చార్జి మరియు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధ్యక్షతన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, మరియు పల్నాడు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోనే మొదటిసారిగా ఇంతటి భారీ రుణమేళా కార్యక్రమాన్ని పల్నాడు జిల్లాలో నిర్వహించుకోవడం మన అదృష్టమని పేర్కొన్నారు. ఈ సభకు సుమారు 30,000 మంది లబ్ధిదారులు హాజరవుతున్నారని, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల రాకపోకల కోసం సుమారు 500 బస్సులు ఏర్పాటు చేసినట్లు అధికారులు ఈ సందర్భంగా వివరించారు. జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలోనే రూ.2,500 కోట్ల రుణాలను పీఎంఎఫ్ఎంఈ, పీఎంజేపీ, ముద్ర, ఎంఎస్ఎంఈ, వ్యవసాయం, విద్య, కిసాన్ క్రెడిట్ కార్డు తదితర కేంద్ర ప్రభుత్వ పథకాల కింద లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వీటితో పాటు బ్యాంకుల సీఎస్ఆర్ కార్యక్రమాల అనుమతి పత్రాలను కూడా ఇదే వేదికపై అందజేస్తామన్నారు. వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో పరిశ్రమలు, వ్యవసాయం, స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు ఈ రుణమేళా ఎంతో కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. ఇదే సమయంలో పెండింగ్ లోన్లను త్వరగా మంజూరు చేయాలని ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు అధికారులను కోరారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమం నరసరావుపేట నియోజకవర్గంలో జరుగుతున్నందున, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబుపై ప్రత్యేక బాధ్యత ఉందని అధికారులు పేర్కొన్నారు. దీనిపై ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర స్థాయి ప్రముఖులు వస్తున్న ఈ కార్యక్రమం మన నియోజకవర్గ ప్రతిష్ఠకు సంబంధించినదని స్పష్టం చేశారు. అందువల్ల కోడెల శివప్రసాద్ స్టేడియంలోని సభా ప్రాంగణ ఏర్పాట్లను, ఇస్సపాలెంలో హెలిపాడ్ ఏర్పాట్లను తానే స్వయంగా పర్యవేక్షిస్తున్నానని తెలిపారు. సభకు వచ్చే లబ్ధిదారులకు తాగునీరు, షామియానాలు, వైద్య సదుపాయాలు కల్పించడంతో పాటు ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో ఎలాంటి లోటు లేకుండా చూస్తామని, ప్రతి శాఖతో సమన్వయం చేసుకుని ఈ పర్యటనను ఘనంగా విజయవంతం చేస్తామని ఆయన నొక్కి చెప్పారు. ఉన్నత స్థాయి సమీక్ష అనంతరం మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే అరవింద బాబు, ఇతర ప్రజాప్రతినిధులు కలిసి సభా స్థలమైన కోడెల శివప్రసాద్ స్టేడియాన్ని, ఇస్సపాలెంలోని హెలిపాడ్ స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్పీ ఉమా మహేశ్వరరావు, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు (చిలకలూరిపేట), భాష్యం ప్రవీణ్ (పెదకూరపాడు), జూలకంటి బ్రహ్మారెడ్డి (మాచెర్ల), కన్నా లక్ష్మీనారాయణ (సత్తెనపల్లి), యరపతినేని శ్రీనివాసరావు (గురజాల)లతో పాటు జిల్లా అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మోడరన్ పెంటాథ్లాన్ అథ్లెటిక్స్ లో జాతీయస్థాయిలో పాల్గొంటున్న నిర్మల ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థి




**వినుకొండ-- జూలై 14, (మనసులో మాట)** ఈనెల 11,12వ తేదీలలో ఏలూరు జిల్లాలోని అల్లూరి సీతారామ స్టేడియంలో రాష్ట్ర స్థాయి జరిగిన మోడరన్ పెంటన్ అథ్లెటిక్స్ పోటీలలో వినుకొండ పట్టణంలోని నిర్మల ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థి పి. ప్రేమ్ కుమార్ (9 వ తరగతి) లేజర్ షూటింగ్ రన్ అండర్15 విభాగంలో 2 కిలోమీటర్ల పరుగు పందెం పోటీలలో బంగారు పతకం సాధించా డని ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ ఆర్సి తెలిపారు. అదే విధంగా రిలే విభాగంలో ఈ సంతోష్ కుమార్ సిల్వర్ మెడల్,. పి. సంతోష్ కుమార్(9వ తరగతి) లేజర్ షూటింగ్ రన్ లో నాల్గవ స్థానంలో నిలిచాడన్నారు అలాగే. డి. ఈశ్వర్ సాయి అండర్17 విభాగంలో లేజర్ షూటింగ్ రన్ 3 కిలోమీటర్లు పరుగు పందెం పోటీలో.. 04వ స్థానంలో న్నారు. ఏ. వెంకటరెడ్డి లేజర్ షూటింగ్ రన్ 3 కిలోమీటర్లు లో 05వ స్థానం సాధించినట్లు ఆమె తెలిపారు . వచ్చే నెలలో ఒడిస్సాలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పి. ప్రేమ్ కుమార్ పాల్గొంటాడని ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ ఆర్సీ తెలిపారు. ఈ సందర్భంగా సుపీరియర్ సిస్టర్. సిసిలి, సిస్టర్ రోజ్ మేరి, సిస్టర్ బెనడిక్ట.... పోటీల్లో ఎంపికైనా విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా అథ్లెటిక్ కోచ్ డి.అశోక్, పి.ఈ.టి.లు వి. వెంకటేష్ మరియు బి. జ్యోతి మరియు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

# ఈనెల 31న ఆశా వర్కర్ల 'పని బంద్'.. పల్నాడు కలెక్టరేట్ ముట్టడికి సిఐటియు పిలుపు

- రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలి, ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలి
- కోటప్పకొండ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేసిన యూనియన్ నాయకులు



**నరసరావుపేట, జూలై 14 (మనసులో మాట)::** ఆశా వర్కర్లకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, వారి ఉద్యోగాలను రెగ్యులర్ చేయడంతో పాటు ప్రభుత్వ సెలవు దినాలన్నింటినీ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 31వ తేదీన ఆశా వర్కర్లందరూ 'పని బంద్' (సమ్మె) చేయనున్నారు. ఆశా వర్కర్స్ యూనియన్ (CITU) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఆ రోజు ఉదయం 10 గంటలకు పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించనున్నట్లు యూనియన్ ప్రకటించింది. ఈ పోరాట ఉద్ధృతిలో భాగంగా శనివారం కోటప్పకొండ పి.హెచ్.సి ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్‌కు యూనియన్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు డి.శివకుమారి మాట్లాడుతూ ఆశా వర్కర్లకు వేతనాలు పెరిగి ఏడేళ్లు గడుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఐదేళ్లకు ఒకసారి కనీస వేతనాలను సవరిస్తూ చట్టం చేయాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, ఆ ఊసే ఎత్తకపోవడం వల్ల కార్మికులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు జరుగుతున్న ఈ అన్యాయానికి వ్యతిరేకంగా తిరగబడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కనీస వేతనాల సాధన కోసం జరుగుతున్న ఈ పోరాటంలో ఆశా వర్కర్లందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈనెల 31వ తేదీ ఉదయం 10 గంటలకల్లా నరసరావుపేట లోని కలెక్టరేట్ కార్యాలయం వద్దకు ఆశా వర్కర్లందరూ భారీ సంఖ్యలో తరలిరావాలని ఆమె కోరారు. ఈ వినతిపత్రం అందజేసిన వారిలో యూనియన్ నాయకులు గోవిందమ్మ, సుగుణమ్మ, సిఐటియు మండల కన్వీనర్ సిలార్ మసూద్‌లతో పాటు రాహేల్, రాజ్యలక్ష్మి, అనిలా మేరి తదితర ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# రైతులకు పంటకు భద్రత, రైతుకు భరోసా, పంటల భీమా పై అవగాహన సదస్సు

**పెదకాకాని, జూన్ 14 మనసులో మాట:** మండల కేంద్రమైన పెదకాకాని గ్రామంలో పొలం పిలుస్తోందిలో భాగంగా గుంటూరు డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎం. మోహన్ రావు ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం రైతులకు శిక్షణ కార్యక్రమము జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం, గుంటూరు సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ మనోజ్ మరియు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏడిఏ మాట్లాడుతూ ఖరీఫ్ 2026 లో రైతులు వేసిన పంటలన్నిటికీ క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని తెలిపారు . ఈ సంవత్సరం ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఉండటం వలన ప్రతి రైతు తప్పనిసరిగా మీరు సాగు చేయు పంటలను క్రాప్ ఇన్సూరెన్స్ (ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన మరియు పునర్వ్యవస్థీకరించబడిన వాతావరణ ఆధారిత పంటల భీమా) చేయించుకోవాలని అన్నారు. అదే విధంగా ప్రకృతి వైపరీత్యాలు, అధిక వర్షాలు, కరువు, తుఫానులు వంటి కారణాలతో పంట నష్టం జరిగితే రైతుకు ఆర్థిక రక్షణ కల్పించేందుకు పంట భీమా తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని తెలిపారు. దీనిలో భాగంగా ప్రతి సాగు చేయు రైతులందరూ ఎకరానికి 1900 రూపాయలు ప్రీమియం జూలై 15వ తేదీ లోపు, అలానే మిరప ఎకరానికి 2700 ప్రీమియం జూలై 31వ తేదీ లోపు మినుము ఎకరానికి 200 ప్రీమియం జూలై 31 వ తారీకు లోపు మరీ ముఖ్యంగా వరి పంటకు ఎకరానికి 850 రూపాయల చొప్పున ఆగస్టు 15వ తారీకు లోపు ప్రీమియం రైతులు కట్టుకోవాల్సిందిగా తెలిపారు. అలానే ఏపీ ఎయిమ్స్ యాప్ ద్వారా ఎరువుల పంపిణీ పై కూడా శిక్షణ ఇచ్చినారు. జిల్లా వనరుల కేంద్రం సైంటిస్ట్ డాక్టర్ మనోజ్ వరి లో అధిక దిగుబడులకు సమగ్ర యాజమాన్య పద్ధతులు గురించి తెలిపారు. అనగా వరిలో పోషక యాజమాన్యం, విత్తనాల గుర్తుతో నేరుగా విత్తే పద్ధతి, మరియు పురుగులు తెగుళ్ల యాజమాన్యం గురించి తెలిపారు. వరిలో ఎల్నినో ప్రభావం ఉన్నది కనుక స్వల్పకాలిక రకాలను విత్తుకోవాలని తెలిపారు .అలానే తరచుగా నష్టాన్ని కలగజేసే ముఖ్యమైన పురుగులను తెగుళ్లను తట్టుకునే రకాలను సాగు చేయాలని, రైతులందరూ తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసిన తర్వాతనే నాటుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ అధికారి కె రమణకుమార్ మాట్లాడుతూ కౌలు చేయు రైతులందరూ తప్పనిసరిగా కౌలు రైతు కార్డులు తీసుకోవాలని అన్నారు . ఈ కార్యక్రమంలో రైతులు పంటల భీమా గురించి అధికారులను కొన్ని ప్రశ్నలు వేసి జవాబులు తెలుసుకున్నారు. ఈ సస్యరక్షణ శిక్షణలో పాల్గొన్న రైతులకు సర్టిఫికెట్స్ ఇవ్వటం జరిగినది.ఈ కార్యక్రమంలో రైతులు పెండ్యాల శ్రీకాంత్, తోట నారయ్య, బోయపాటి రమేష్ తదితరులు మరియు పెదకాకాని మండల వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# నరసరావుపేటలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి: వైదన వెంకట్



- పైప్‌లైన్ లీకేజీల పేరుతో తరచూ నీటి నిలిపివేతపై ఆగ్రహం
- కలుషిత నీటితో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని ఆవేదన
- మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించాలని వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

**నరసరావుపేట, జూలై 14 (మనసులో మాట)::** పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో ఎదురవుతున్న తాగునీటి సమస్యకు మున్సిపల్ అధికారులు తక్షణమే శాశ్వత పరిష్కారం చూపాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వైదన వెంకట్ డిమాండ్ చేశారు. పట్టణంలో నెలకొన్న తాగునీటి ఇబ్బందులపై ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వైదన వెంకట్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంగా రూపాంతరం చెందిన నరసరావుపేటలో తరచూ తాగునీటి సమస్య తలెత్తడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో వాటర్ పైప్‌లైన్లు పదే పదే లీకేజీలకు గురవుతున్నాయని, లీకేజీల నెపంతో నెలలో కనీసం రెండు సార్లయినా నీటి సరఫరాను పూర్తిగా నిలిపివేస్తున్నారని మండిపడ్డారు. పైప్‌లైన్ల లీకేజీల కారణంగా మురుగునీరు తాగునీటిలో కలిసి సరఫరా అవుతోందని, ఈ కలుషిత నీటిని తాగడం వల్ల పట్టణ ప్రజలు డయేరియా, ఇతర సీజనల్ వ్యాధుల బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారని వెంకట్ ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వాటర్ ప్లాంట్లను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. ఇదే అదునుగా భావించి కొన్ని వాటర్ ప్లాంట్ల యాజమాన్యాలు నీటి క్యాన్ల ధరలను ఇష్టారాజ్యంగా పెంచి సామాన్యులను దోచుకుంటున్నారని విమర్శించారు. అంతేకాకుండా, సదరు ప్లాంట్లలో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా, కెమికల్స్ ఎక్కువగా వాడుతుండటం వల్ల ప్రజల ఆరోగ్యం మరింత క్షీణిస్తోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, ఉన్నతాధికారులు స్పందించి పాతబడిన పైప్‌లైన్ల స్థానంలో నూతనంగా శాశ్వత పైప్‌లైన్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణ ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని, శుద్ధి చేసిన సురక్షితమైన తాగునీటిని నిరంతరాయంగా సరఫరా చేయాలని వైదన వెంకట్ ప్రభుత్వానికి, స్థానిక యంత్రాంగానికి విజ్ఞప్తి చేశారు.

# నీరో చక్రవర్తిలా వ్యవహరించకండి సోనమ్ వాంగ్చుక్ దీక్షను విరమింప చేయండి



- సామాజికవేత్త మాదాసు భాను ప్రసాద్

**చిలకలూరిపేట జూలై 14 మనసులో మాట** రోమ్ నగరం తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేల్ వాయిస్తూ కూర్చున్నట్లుగా, గత 17 రోజులుగా సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్చుక్ దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ లో ఆమరణ నిరాహార దీక్ష చేస్తూ ప్రాణాపాయ స్థితిలో ఉంటే ఈ ప్రభుత్వం ఏమాత్రం పట్టనట్లుగా వ్యవహరించడం సరికాదు అని సామాజికవేత్త,అడ్వకేట్ మాదాసు భాను ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు మీరు ఇచ్చిన హామీలు, ఒక లీటరు పెట్రోల్ ₹. 35/లకు, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు, స్విస్ బ్యాంకు నుంచి నల్లధనాన్ని వెనక్కి తెప్పించడం, ఒక్కొక్క అకౌంట్లో 15 లక్షల నగదు, డాలర్ తో పోల్చినప్పుడు రూపాయి విలువ పడిపోకుండా చూడడం లాంటి హామీలను నెరవేర్చాలని కాక్రోచ్ జనతా పార్టీ సభ్యులు రోడ్డు ఎక్కలేదని ప్రభుత్వంలో పారదర్శకత, జవాబుదారితనం ఉండాలని మాత్రమే కోరుకుంటున్నారని, ఆ రకంగా కోరుకోవడం రాజ్యాంగబద్ధమైనదే గాని, దేశద్రోహానికి పాల్పడినట్లు కాదు అనే విషయాన్ని గుర్తించాలని కోరారు. 23 లక్షల విద్యార్థుల భవితవ్యాన్ని ప్రభావితం చేసే నీట్ పరీక్షల నిర్వహణలో వైఫల్యం చెందుతున్న కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తప్పించాలని భాను ప్రసాద్ కోరారు.

KANCHARLA
# మనసులో మాట

## రాయలసీమ

చిత్తూరు | అన్నమయ్య | అనంతపురం
కర్నూలు | కడప | నెల్లూరు

బుధవారం 14 జులై 2026 పేజీలు 16

## బద్వేలు ప్రజల కోసం...సర్ ప్రక్రియపై నిరంతర పర్యవేక్షణ

**బద్వేలు , మనసులో మాట, జూలై 14:**

బద్వేలు మున్సిపాలిటీలో కొనసాగుతున్న SIR ప్రక్రియ సరళిని మాజీ మున్సిపల్ చైర్మన్ మరియు మైదుకూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు,వాకమల్లరాజ గోపాల్ రెడ్డి పట్టణంలోని తొట్టిగారిపల్లె, ..మిగతా 2లో


02



## పేదలకు వారం
# లేబర్ ఇన్సూరెన్స్

- తెల్ల రేషన్ కార్డు వున్న వారు అర్హులు
- ఉద్యోగస్తులు అనర్హులు
- ఏడాదికి రూ 22 లు 5 సంరాలు ఒకేసారి చెల్లించాలి,
- కేవలం రూ 110 మాత్రమే.

**బాలాయపల్లి (మనుసులో మాట) :-**

పేదలకు లేబర్ ఇన్సూరెన్స్ ఎంతో భరోసాగా ఉంటుంది.18 ఏళ్ళ నుండి 55 ఏళ్ళు ఉన్న స్త్రీ,పురుషులు ఇన్సూరెన్స్ కు అర్హులు. లేబర్ ఇన్సూరెన్స్ కు ఒకసారి రూ110 చెల్లిస్తే 5 సంవత్సరాలు వరకు ఎటువంటి నగదు చెల్లించన క్కర్లేదు.ఒక సంవత్సరానికి రూ 22 అన్న మాట అవగాహన లేక కార్మికులు మాత్రమే వర్తిస్తుందని చాలా మంది అనుకుంటారు.తెల్ల రేషన్ కార్డు కలిగి వున్న ప్రతి కుటుంబం ఈ పథకానికి అర్హులే.ప్రభుత్వ ఉద్యోగులు తప్ప ఎలాంటి కూలీలైన, ఇతరులైన లేబర్ ఇన్సూరెన్స్ కు అర్హులు, రేషన్ కార్డు,ఆధార్ కార్డు జెరాక్స్ జతపరచి.దినితోపాటు చలన జతచేసి లేబర్ కార్యాలయం లో ఇవ్వాలి.

**అధికారులు నిర్లక్ష్యం.... నష్టపోతున్న పేదలు**

లేబర్ ఇన్సూరెన్స్ అంటే తెలియక గ్రామిణ ప్రాంతంలో ..మిగతా 13లో



## జిల్లాలో 99.95 శాతం ఓటరు వివరాల
# డిజిటలైజేషన్ పూర్తి..

- వంద శాతం పూర్తి చేయడమే లక్ష్యం – జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్..

**చిత్తూరు, జూలై14(మనసు లో మాట):**

జిల్లాలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం వేగంగా కొనసాగుతోందని, ఓటరు వివరాల డిజిటలైజేషన్ ఇప్పటికే 99.95 శాతానికి చేరుకుందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ తెలిపారు.మంగళవారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ సమావేశపు మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లాలో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ రోజు వరకు డిజిటలైజేషన్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయడమే లక్ష్యంగా అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు.జిల్లాలో మొత్తం 13,40,126 మంది ఓటర్లకు గాను 13,39,675 ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయగా, 99.97 శాతం పంపిణీ పూర్తయిందన్నారు. ఇప్పటివరకు ..మిగతా09లో

## ఉపాధ్యాయుల సహనాన్ని పరీక్షించవద్దు


10


8

శ్రీ శ్రీ శ్రీ మానసా దేవి అమ్మవారికి
## ప్రత్యేక పూజలు

# బద్వేలు ప్రజల కోసం...సర్ ప్రక్రియపై నిరంతర పర్యవేక్షణ

(మొదటి పేజీ తరువాయి )



కుమ్మరికొట్టాలు ,భావనారాయణ నగర్,గుంతపల్లి వార్డు సచివాలయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు BLO కు సూచించారు. అలాగే ఈ రోజుటికి ఎంత పర్సెంటేజీ జరిగిందని సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.అలాగే ఈ సర్ పక్రియ కార్యక్రమం ఈ రోజు జరుగుతుందని కావున ప్రజలు ఈ విషయాన్ని గమనించి మీ ఓటు సత్వరగా BLO లచే డిజిటైజేసన్ చేయించుకోవాలని కోరారు. బి ఎల్ ఓ వాళ్ళకి ఏవైనా సందేహాలు ఉన్నచో ఉన్నతాధికారుల ద్వారా నివృత్తి చేసుకోవాలని తెలియజేసారు .ఓటు చాలా విలువైనదని ప్రతి పౌరుడు ఓటును కలిగి ఉండాలని తద్వారానే సమర్థవంతమైన ప్రజాస్వామ్యాన్ని కాపాడగలమని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పుత్తా శ్రీరాములు ,మాజీ ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డి ,రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి గుర్రం పాటి రమణారెడ్డి, జిల్లా రైతు విభాగం కార్యదర్శి చెన్న కృష్ణారెడ్డి ,జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ రంగారెడ్డి , మురళీధర్ రెడ్డి ,బీసీ సెల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గోపాల్, బి ఎల్ ఏ లు ఓబులేష్, జయరాం రెడ్డి ,రామచంద్ర రెడ్డి ,వెంకటసుబ్బారెడ్డి, వీరనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జూలై 16న పొదలకూరు మండలంలో పల్లెవీక్షణ

- అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను స్వయంగా పరిశీలించనున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల
- ఈనెల 17న (శుక్రవారం) ఉద్యోగుల ప్రత్యేక గ్రీవెన్స్

**నెల్లూరు జిల్లా బ్యూరో,జులై 14 (మనసులో మాట ):**



గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలును క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే లక్ష్యంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల చేపట్టిన “పల్లె వీక్షణం” కార్యక్రమం జూలై 16న పొదలకూరు మండలంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును కలెక్టర్ పరిశీలించనున్నారు. గ్రామ పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, పారిశుధ్య కార్యక్రమాలు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేయనున్నారు.కలెక్టర్ ఈ నెల 16వ తేదీ (గురువారం)నిర్వహించాల్సిన ఉద్యోగుల ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని పల్లె వీక్షణ కార్యక్రమం కారణంగా 17వ తేదీ (శుక్రవారం) కు వాయిదావేశామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ఉద్యోగులందరూ గమనించి 17 వ తేదీన ఉదయం 11 గంటలకు తిక్కన ప్రాంగణం లో జరిగే ఉద్యోగుల ప్రత్యేక గ్రీవెన్స్ లో తమ సమస్యలను తెలియజేయవచ్చున్నారు.

# ఆందోళనలో యువకుని ఆత్మహత్య

**నెల్లూరు జిల్లా బ్యూరో / మనుబోలు,జూలై 14 (మనసులో మాట):**



మనుబోలు మండలంలో ఓ కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి, పోలీసులు అదుపులోకి తీసుకెళ్లేందుకు వస్తున్నారనే సమాచారం తెలుసుకుని భయాందోళనకు గురై ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన చోటు చేసుకుంది. అందిన వివరాల మేరకు, ఏడుకొండలు అనే వ్యక్తి ఓ కేసులో నిందితుడిగా ఉన్నాడు. పోలీసులు తనను తీసుకెళ్లేందుకు వస్తున్నారనే విషయం తెలిసిన వెంటనే తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన కాలువ గట్టు వద్ద పురుగుమందు తాగినట్లు సమాచారం. ఇదే సమయంలో అక్కడికి చేరుకున్న పోలీసులు, ఆయన పురుగుమందు సేవించిన విషయాన్ని గుర్తించకుండా తీసుకువస్తుండగా మార్గమధ్యంలో ఆయన అపస్మారక స్థితికి చేరుకున్నారు. దీంతో వెంటనే గూడూరు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాతే స్పష్టత వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నివేదిక, దర్యాప్తు వివరాల ఆధారంగా ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలు వెలుగులోకి రానున్నాయి.

# రాపూరులో విషాదం తప్పింది



- తల్లి, ఇద్దరు చిన్నారులను కాపాడిన పోలీసులు

**నెల్లూరు, ప్రతినిధి, జూలై 14, మనసులో మాట:**

కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ తల్లి, ఆమె ఇద్దరు చిన్నారులను రాపూరు పోలీసులు సకాలంలో రక్షించి మూడు ప్రాణాలను కాపాడారు. మంగళవారం రాపూరు గ్రామంలోని అరుంధతివాడకు చెందిన ఓ మహిళ తీవ్ర మనస్తాపంతో తన ఇద్దరు చిన్నారుల చేతులు కట్టి, వారితో కలిసి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించింది. ఈ విషయం గమనించిన స్థానికులు వెంటనే డయల్ 112కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే రాపూరు ఎస్ఐ జె తిరుమలరావు, హెడ్ కానిస్టేబుల్ జగన్నాథం, ఎస్బీ పీసీ పెంచల ప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకుని ఇంటి కిటికీ ద్వారా లోపలికి ప్రవేశించి తల్లి, ఇద్దరు చిన్నారులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. పోలీసుల వేగవంతమైన స్పందనతో పెను విషాదం తప్పింది. ఈ సందర్భంగా విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించి మూడు ప్రాణాలను కాపాడిన రాపూరు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ప్రత్యేకంగా అభినందించారు. ఎస్ఆర్ పురం ఘటనలోనూ ప్రాణం కాపాడిన పోలీసులు ఇటీవల ఎస్ఆర్ పురం మండలం బసినేనిపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురై గడ్డి మందుతో ఆత్మహత్య చేసుకుంటానంటూ ఇంటి నుంచి వెళ్లిపోవడంతో, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు సెల్‌ఫోన్ లోకేషన్ ఆధారంగా దాసరపల్లి హైవే సమీపంలో గుర్తించి అతడిని కాపాడారు. గడ్డి మందును స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనలో విధి నిర్వహణలో చురుకుదనం ప్రదర్శించిన పీసీ ప్రవీణ్ విజయ్, హెచ్‌జీ మల్లయ్యలను కూడా ఎస్పీ అభినందించారు. కుటుంబ కలహాలు లేదా వ్యక్తిగత సమస్యలతో ఎవరూ తీవ్ర నిర్ణయాలు తీసుకోకుండా అవగాహన కల్పించాలని, పోలీస్ పల్లె నిద్ర వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు కౌన్సెలింగ్, మానసిక ధైర్యం అందించే చర్యలను మరింత విస్తృతంగా చేపట్టాలని జిల్లా ఎస్పీ అధికారులను ఆదేశించారు.

# వ్యవసాయ అధికారి శ్రీహరి హత్య కేసులో ప్రధాన నిందితుడు హరికృష్ణ ఆత్మహత్య





**తోటపల్లి గూడూరు జూలై 14 (మనసులో మాట )**

A1నిందితుడు గా ఉన్న హరికృష్ణ కుటుంబం ఆత్మహత్య అభం శుభం తెలియని ఇద్దరు చిన్నారులు బలి నిందితుడు మృతునికి స్వయానా మేనల్లుడు కొద్దిరోజుల క్రితం జరిగిన బుచ్చి మండలానికి వ్యవసాయ అధికారి హత్య కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న కుదుముల హరికృష్ణ మంగళవారం సింగరాయకొండ రైల్వే స్టేషన్ సమీపంలో కుటుంబంతో కలిసి ఆత్మహత్య కు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే గత కొద్దిరోజుల క్రితం మండల వ్యవసాయ అధికారి శ్రీహరి హత్య జరిగిన నేపథ్యంలో తోటపల్లి గూడూరు మండలం వరిగొండ పంచాయతీ పరిధిలోని రాపూరువారికండ్రిగ కు చెందిన తన మేనల్లుడు కుదుముల హరికృష్ణ ఇద్దరు వ్యక్తులకు సుపారీ ఇచ్చి హత్య చేయించాడని పోలీసులు కేసు నమోదు చేసిన నేపథ్యంలో అజ్ఞాతం లోకి వెళ్లిన హరికృష్ణ మంగళవారం వేకువజామున తన భార్య ప్రణీత (29),పిల్లలు మోహాంబిక (5),కౌశిక్ కృష్ణ (3),లను తీసుకొని వెళ్లినట్లు చుట్టుపక్కల వారు ఇచ్చిన సమాచారం. అనంతరం సింగరాయకొండ రైల్వే స్టేషన్ సమీపంలో ఆత్మహత్య చేసుకున్నారు.ఈ హృదయ విధారక ఘటనకు స్థానికులను కలచివేసింది. సింగరాయకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఓటర్ల జాబితా పరిశీలనకు ప్రజలు సహకరించాలి

- శ్రీకాళహస్తి ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి



**శ్రీకాళహస్తి,జూలై 14 (మనసులో మాట) :**

శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో సోమవారం ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మొత్తం 2,00,493 మంది ఓటర్లు ఉండగా, ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (SIR) ప్రక్రియ ముగింపు దశకు చేరుకుందని, ఇప్పటివరకు 99.6 శాతం పరిశీలన పూర్తయిందని తెలిపారు. డ్రాఫ్ట్ రోల్ ప్రకారం మరణించినవారు, వలస వెళ్లినవారు, ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓట్లు ఉన్న డూప్లికేట్ కేటగిరీల కింద మొత్తం 33,156 మందిని గుర్తించామన్నారు. ఇందులో మరణించిన వారు 9,027 మంది, శాశ్వతంగా వలస వెళ్లిన వారు 14,552 మంది, డబల్ ఎంట్రీలు ఉన్నవారు 3,166 మంది, ముఖచిత్రాలు సరిగ్గా లేనివారు 43 మంది ఉన్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా శ్రీకాళహస్తి, రేణిగుంట పట్టణ ప్రాంతాలు కావడంతో మైగ్రేషన్ కారణంగా ఈ రెండు ప్రాంతాల నుంచే 21 వేల మందికి పైగా ఓటర్ల మార్పులు జరిగాయన్నారు. 2002 ఓటర్ల లిస్టుతో సరిపోల్చినప్పుడు 1,90,000 మంది ఓటర్ల వివరాలు నిర్ధారణ అయ్యాయని, మిగిలిన 23,500 మంది వివరాలు అక్షర దోషాలు లేదా ముఖచిత్రాలు సరిపోలకపోవడం వల్ల మ్యాపింగ్ కాలేదని వివరించారు. ఈ నెల 14వ తేదీ గడువు ముగిసిన తర్వాత ఈ 23,500 మందికి నోటీసులు జారీ చేస్తామని, వారు ప్రభుత్వం సూచించిన 11 రకాల గుర్తింపు పత్రాలలో ఏదో ఒకటి సమర్పిస్తే క్షేత్రస్థాయి సిబ్బంది పరిశీలించి, ఆన్‌లైన్‌లో ఫోటో అప్‌లోడ్ చేసి ఓటు హక్కును నిర్ధారిస్తారని స్పష్టం చేశారు. ఒకే కుటుంబానికి చెందిన సభ్యులు వేర్వేరు పోలింగ్ బూత్‌లలో ఉంటే, ఫామ్ నెంబర్ 8 ద్వారా దరఖాస్తు చేసుకుంటే వారం రోజుల్లో ఒకే బూత్ కిందికి మారుస్తామని తెలిపారు. మిగిలిన ఓటర్ల వివరాల పరిశీలనను 45 రోజుల్లో పూర్తి చేసి, సెప్టెంబర్ మాసంలో తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తామని, ఈ ప్రక్రియ విజయవంతం కావడానికి ప్రజలందరూ పూర్తిగా సహకరించాలని ఆర్డీవో కోరారు.

# నాగలగుబ్బ సమీపంలో ఎలుగుబంటి సంచారం.. గ్రామస్తుల్లో భయాందోళన



**ముదిగుబ్బ జూలై 14 :(మనసులో మాట)**

మండలం లోని నాగలగుబ్బ గ్రామ సమీపంలోని అడవి ప్రాంతంలో ఎలుగుబంటి సంచరిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. ఇటీవల పలుమార్లు ఎలుగుబంటి కనిపించడంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. వ్యవసాయ పనుల కోసం పొలాలకు వెళ్లే రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ఒంటరిగా వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు. అటవీ శాఖ అధికారులు వెంటనే స్పందించి ఎలుగు బంటి సంచారాన్ని గుర్తించి, గ్రామ ప్రజల భద్రత కోసం తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. గ్రామ పరిసర ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేసి, ప్రజలకు అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

# వాహన తనిఖీల్లో ఐదు ఇసుక ట్రాక్టర్లు సీజ్



**శ్రీకాళహస్తి, జూలై 14 (మనసులో మాట) :**

శ్రీకాళహస్తి ఆర్టీవో దామోదర్ నాయుడు వాహన తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా ఇసుక రవాణా చేస్తు నిబంధనలు ఉల్లంఘించిన ఐదు ట్రాక్టర్లను సీజ్ చేసి రూ.65,000 టాక్స్, పెనాల్టీ విధించారు. ఈ సందర్భంగా ఆర్టీవో దామోదర్ నాయుడు మాట్లాడుతూ తనిఖీ చేసిన ట్రాక్టర్లలో కొన్ని వాహనాలకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్సీ), టాక్స్, పర్మిట్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ వంటి తప్పనిసరి పత్రాలు లేకపోవడంతో పాటు, కొందరు డ్రైవర్లు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండానే వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించామన్నారు. నిబంధనల లేని ఐదు ట్రాక్టర్లను సీజ్ చేసి రూ.65 వేల టాక్స్, పెనాల్టీ విధించినట్లు తెలిపారు. తనిఖీల సందర్భంగా పలువురు ట్రాక్టర్ యజమానులు వాహనాలపై సరైన రిజిస్ట్రేషన్ నంబర్లు ప్రదర్శించకుండా రోడ్లపై



నడుపుతున్నట్లు కూడా అధికారులు గుర్తించడం జరిగిందన్నారు. అలాగే వ్యవసాయ అవసరాల కోసం నమోదు చేసిన ట్రాక్టర్లను వాణిజ్యపరంగా ఇసుక రవాణాకు వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. వ్యవసాయ ట్రాక్టర్లను బాడుగకు లేదా వాణిజ్యపరంగా ఇసుక రవాణాకువినియోగించాలి అంటే తప్పనిసరిగా సంబంధిత నిబంధనల ప్రకారం ఎల్లో బోర్డు వాణిజ్య వాహనంగా కన్వర్షన్ చేయించుకుని, అవసరమైన టాక్స్, పర్మిట్, ఫిట్‌నెస్ తదితర అనుమతులు పొందిన తర్వాతే వినియోగించాలని స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపితే భవిష్యత్తులో కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాక్టర్ యజమానులు తమ వాహనాలకు సంబంధించిన అన్ని చట్టబద్ధ పత్రాలను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవడంతో పాటు, చెల్లుబాటు అయ్యే లైసెన్స్ కలిగిన డ్రైవర్లతోనే వాహనాలను నడపాలని సూచించారు. నిబంధనలు పాటించడం ద్వారా జరిమానాలు, వాహనాల సీజ్ వంటి చర్యలను నివారించవచ్చని తెలిపారు.

# క్వారీ గుంతలో గల్లంతయిన యువకుని కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



**వరదయ్యపాలెం జూలై14 (మనసులో మాట)**

వరదయ్య పాలెం మండలం లోని మరదవాడ గ్రామం సమీపంలో ఉన్న క్వారీ గుంతలో ఆదివారం ఈతకు వెళ్లిన బుచ్చినాయుడు కండ్రిగ నెలవాయి గ్రామం యువకుడు సుకుమార్ ఆదివారం గల్లంతు అవ్వడంతో పోలీసులు మూడు రోజులుగా శ్రమిస్తున్నారు అక్కడ ఏమి జరుగుతుంది అని సోమవారం నుండి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు , జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు మాట్లాడి ఎప్పటికప్పుడు వివరాలు తెలియజేస్తూ అలాగే పుత్తూరు డీఎస్పీ రవి తగు సూచనలు సత్యవేడు సీఐ, బుచ్చినాయుడు కండ్రిగ సీఐ,వరదయ్య పాలెం, బుచ్చినాయుడు కండ్రిగ ఎస్సై, తహసీల్దార్ లతో మాట్లాడుతూ నిరంతరం ఆ కుటుంబ శోకం తీర్చాలని క్వారీ వద్దకు చేరుకొని పర్యవేక్షించి అవసరం అయితే గజ ఈత గాళ్లనీ తమిళనాడు నుండి అయిన పిలిపించి సుకుమార్ తల్లిదండ్రుల శోకం కాస్త అయిన తగ్గించాలని అధికారులకు సూచించారు..అలాగే సుకుమార్ కుటుంబ సభ్యులకు ప్రభుత్వ యంత్రాంగం మొత్తం కష్టపడుతుంది ఎలాగైనా బిడ్డను వెలికి తీస్తారని తెలుపుతూ ధైర్యంగా ఉండాలని ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని తల్లి దండ్రులకు, కుటుంబ సభ్యులకు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు బుచ్చినాయుడు కండ్రిగ టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, ,కన్నయ్య నాయుడు ,రామనాథ్ వరదయ్య పాలెం మండలం సింగిల్ విండో చైర్మన్ నంద కిషోర్ రెడ్డి, కరుణాకర్ నాయుడు,ఎస్సి సెల్ అంబూరు బాల సుబ్రహ్మణ్యం, యువరాజ్,కోటి,బీజేపీ మండల అధ్యక్షుడు దిల్లీప్ రాయల్, సిద్ధలయ్య, జనసేన శ్రీధర్, పిచ్చాటూరు టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు ఇలంగోవన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు....

# వ్యవసాయ అధికారి శ్రీహరి హత్యకేసులో బిగ్ ట్విస్ట్..

- నిదితుడు హరికృష్ణ భార్య, ఇద్దరు చిన్నారులతో రైలు కిందపడి మృతి





**నెల్లూరు, ప్రతినిధి, జూలై 14, మనసులో మాట:**

బుచ్చిరెడ్డిపాలెం మండల వ్యవసాయ అధికారి శ్రీహరి హత్యకేసులో మరో సంచలన పరిణామం చోటుచేసుకుంది. శ్రీహరి హత్య కేసులో ప్రధాన నిందితుడిగా పోలీసులు పేర్కొన్న కుడుముల హరికృష్ణ, తన భార్య, ఇద్దరు చిన్నారులతో కలిసి మంగళవారం ప్రకాశం జిల్లా సింగరాయకొండ రైల్వే స్టేషన్ సమీపంలో గూడ్స్ రైలు కింద పడి మృతి చెందిన ఘటన కలకలం రేపింది. ఈ కేసులో ఇటీవలే శ్రీహరి హత్యకేసు దర్యాప్తు నేపథ్యంలో 23 మంది పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ బదిలీలు, చేయడం జరిగింది. ఆ తర్వాత ఈ విషాద ఘటన చోటుచేసుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ రెండు ఘటనలకు ఏమైనా సంబంధం ఉందా, కుటుంబం ఈ తీవ్ర నిర్ణయం ఎందుకు తీసుకుంది, ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులు ఏమిటి అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు, దర్యాప్తులో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం కేసు పై పోలీస్ అధికారులు దర్యాప్తు కొనసాగుతోంది.

---

# మంత్రి నారా లోకేష్‌ను కలిసిన సుబ్బయ్య, ఉమ్మడి జిల్లాల గిరిజన సమస్యలపై వినతి



**శ్రీకాళహస్తి, జూలై 14 (మనసులో మాట) :**

ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో సోమవారం సాయంత్రం రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, రియల్ టైమ్ గవర్నెన్స్, ఉన్నత విద్య శాఖ మంత్రి నారా లోకేష్ ను గిరిజన సలహా మండలి సభ్యులు సుబ్బయ్య మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా చిత్తూరు, తిరుపతి ఉమ్మడి జిల్లాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న పలు ప్రధాన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో రహదారులు, తాగునీటి సౌకర్యం, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు, సంక్షేమ పథకాల అమలు, భూ సమస్యలు, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై మంత్రితో సుదీర్ఘంగా చర్చించినట్లు ఆయన తెలిపారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రాధాన్యతగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని వారు కోరారు. సమస్యలను ఓపికగా విన్న మంత్రి నారా లోకేష్, సంబంధిత అంశాలను పరిశీలించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సాధ్యమైన మేరకు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ సమావేశం గిరిజన ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించి కీలకంగా మారుతుందని ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# భారతదేశంలో ఎన్డీఏ ప్రభుత్వం అన్ని విధాల విఫలమయింది



- పేపర్ లీకేజీలు, రామ మందిరం స్కామ్ లు తప్ప అభివృద్ధి శూన్యం
- 2029 ఎన్నికలలో కేంద్రంలో ఇటు రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే
- తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలగురువం బాబు



**సూళ్లూరుపేట, జూలై 14 (మనసులో మాట):**

ప్రపంచంలో అన్ని దేశాలు అభివృద్ధి దిశగా దూసుకుపోతుంటే భారతదేశంలో మాత్రం ఆర్థిక విధ్వంసం, నీట్ పేపర్ లీకులు, రామ మందిరం కుంభకోణాలతో ఆర్థిక విధ్వంసం జరుగుతుందనే విషయం సామాన్య ప్రజల వరకు అర్థమవుతుందని, ఎన్డీఏ ప్రభుత్వాలు లేని రాష్ట్రాలపై కక్ష సాధింపు చర్యలపై రాహుల్ గాంధీ ఎండగడుతూ ముందుకు వెళ్తున్నారని తెలిపారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షులు బాలగురువం బాబు, సూళ్లూరుపేట కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మావుడూరు వెంకటా చలపతి ఆధ్వర్యంలో సూళ్లూరుపేట ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నందు జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ భారతదేశంలో ప్రతి ఒక్క పౌరుడు గళం విప్పాలని లేదంటే మన పిల్లల భవిష్యత్తు అంధకారంలోకి వెళుతుందని తెలిపారు. విద్యా విధానంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన అనేక చట్టాల వల్ల మన పిల్లలు భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని తెలిపారు. విద్యార్థులు చనిపోతే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించవా అని ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చేసిన పనితీరు వల్ల ప్రాథమిక పాఠశాలలు, జిల్లా పరిషత్ హై స్కూల్ లు నిర్వీర్యం అయిపోయాయని తెలిపారు. విద్యా విధానంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యం స్పష్టంగా కనబడుతుందని అధ్యక్షులు తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సర్(SIR) ఓటర్ల డిజిటలైజేషన్ వల్ల ప్రజలలో తిరుగుబాటు మొదలవుతుందని తెలిపారు. సూళ్లూరుపేట కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మావుడూరు వెంకటాచలపతి మాట్లాడుతూ 2029 లో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవ్వడం ఖాయమని కచ్చితంగా ఎర్రకోటపై జెండా ఎగరవేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గం లోని మండల అధ్యక్షులు టౌన్ ప్రెసిడెంట్లు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

---

# కూటమి ప్రభుత్వం పెండింగ్ బకాయిలు చెల్లింపు, ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు

- వైసీపీ పాలనలో వేల కోట్లు బకాయిలు
- వైసీపీ హయాంలో గుండు కొట్టించుకోని వెంకట్రామిరెడ్డి..
- ఇప్పుడు రాజకీయ గుండు డ్రామాలు...
- బీద రవిచంద్ర యాదవ్



**నెల్లూరు, ప్రతినిధి, జూలై 14, మనసులో మాట:**

కూటమి ప్రభుత్వం ఉద్యోగులను వేధిస్తోందంటూ వెంకట్రామిరెడ్డి చేస్తున్న గుండు నిరసన పూర్తిగా రాజకీయ డ్రామా అని ఎమ్మెల్సీ, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు బీద రవిచంద్ర యాదవ్ విమర్శించారు. వైసీపీ పాలనలో ఉద్యోగులకు హామీలు అమలు కాకపోయినా, జీతాలు సకాలంలో చెల్లించక వేల కోట్ల బకాయిలు పేరుకుపోయినా ఉద్యోగ సంఘ నేతగా ఉన్న వెంకట్రామిరెడ్డి ఒక్కరోజైనా గుండు కొట్టించుకోలేదని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉద్యోగుల పెండింగ్ బకాయిల చెల్లింపు, ప్రతి నెల ఒకటో తేదీన జీతాల చెల్లింపు, 10,715 మంది సీపీఎస్ ఉద్యోగులకు ఓపీఎస్‌లోకి మారే అవకాశం కల్పించడం వంటి కీలక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. ఉద్యోగులకు మేలు జరుగుతుండటాన్ని ఓర్చుకోలేక వెంకట్రామిరెడ్డి ప్రభుత్వంపై విషప్రచారం చేస్తూ గుండు డ్రామా ఆడుతున్నారని బీద రవిచంద్ర ఆరోపించారు. వైసీపీ హయాంలో ఉద్యోగుల హక్కులు కాలరాయ బడినప్పుడు మౌనం పాటించిన ఆయనకు ఇప్పుడు కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదని స్పష్టం చేశారు.

---

# ఎమ్మెల్యేను ఆహ్వానించిన రాజీవనగర్ కాలనీ వాసులు

**పలమనేరు జూలై 14(మనసులో మాట) :**



పలమనేరు మండలం మొరం పంచాయతీ రాజీవ్ నగర్ కాలనిలో జరగనున్న గంగమ్మ జాతరకు విచ్చేయాలని శాసన సభ్యులు అమరనాథ రెడ్డిని కాలనీవాసులు మంగళవారం కలసి ఆహ్వానించారు. పట్టణంలోని తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలసి దుస్సాలువ కప్పి సన్మానించి ఆహ్వానం పలికారు. ఈ నెల 16న గురువారం రాత్రి అమ్మ వారి శిరస్సు మెరవణి, 17న జాతర, 18న జలది కార్యక్రమాలు ఉంటాయని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో బయప్పగారిపల్లి సింగిల్ విండో చైర్మన్ వెంకట మునిరెడ్డి, మొరం పంచాయతీ టీడీపీ నాయకులు అనిల్ , సురేష్ బాబు, చిన్నదొరై, రాహుల్, శీనా, శరవణ, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరులో వైసీపీ రౌండ్ టేబుల్ సమావేశం రాజకీయ నిరుద్యోగుల సభ

- రాయలసీమ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం
- రాయలసీమకు నీటి వనరులు అందించడంలో టీడీపీ పాత్ర
- వైసీపీ పాలనలో రాయలసీమలో 102 ప్రాజెక్టులు రద్దు
- ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



**నెల్లూరు/మంగళగిరి, జూలై 14, మనసులో మాట:**

రాయలసీమ అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టులపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, వైసీపీ నేతలు కూడా తాము చేసిన పనులను వివరించే ధైర్యంతో చర్చకు రావాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సవాల్ విసిరారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై 2020లోనే ఎన్జీటీ స్టే విధించబడిందని, అధికారంలో ఐదేళ్లు ఉన్న వైసీపీ ఆ స్టేను ఎత్తివేయించలేకపోయి ఇప్పుడు సమావేశాలు నిర్వహించడం రాజకీయ డ్రామా మాత్రమేనని విమర్శించారు. నెల్లూరులో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నిర్వహించిన రాజకీయ నిరుద్యోగుల సభేనని వ్యాఖ్యానించారు. వైసీపీ ప్రభుత్వం 2019, 24 మధ్య రాయలసీమ అభివృద్ధికి కేవలం రూ.2 వేల కోట్లే ఖర్చు చేసిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 24 నెలల్లోనే రూ.12,484 కోట్ల పనులు చేపట్టి, మరో రూ.10 వేల కోట్లకు పైగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టబోతున్నట్లు తెలిపారు. తెలుగుగంగ, హంద్రీనీవా, గాలేరు, నగరి వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులు టీడీపీ హయాంలోనే రూపుదిద్దుకున్నాయని, రాయలసీమకు నీటి వనరులు అందించడంలో టీడీపీ పాత్ర కీలకమని పేర్కొన్నారు. హంద్రీనీవా సామర్థ్యాన్ని 1,700 క్యూసెక్కుల నుంచి 3,500 క్యూసెక్కులకు పెంచడంతో పాటు రెండో దశ పనులకు కూడా నిధులు కేటాయించినట్లు చెప్పారు. జీఓ నెం 365 పేరుతో రాయలసీమలో 102 ప్రాజెక్టులను జగన్ ప్రభుత్వం రద్దు చేసిందని, దానికి వైసీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇరిగేషన్, వ్యవసాయం, ఆర్ అండ్ బీ శాఖలను వైసీపీ నిర్వీర్యం చేసిందని, బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో 40 శాతం కూడా ఖర్చు చేయలేదని ఆరోపించారు. పోలవరం, వెలిగొండ వంటి ప్రాజెక్టులను వైసీపీ నిర్లక్ష్యం చేసిందని, వెలిగొండ టన్నెల్ పనులు పూర్తి కాకుండానే ప్రారంభించారని విమర్శించారు. ప్రస్తుతం రూ.35,313 కోట్లతో 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారని తెలిపారు. సోమశిల, కండలేరు జలాశయాల నిర్మాణం టీడీపీ ప్రభుత్వ ఘనతేనని, నెల్లూరులో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించే ముందు వైసీపీ నేతలు తాడేపల్లి ప్యాలెస్‌లో ఆత్మపరిశీలన చేసుకోవాలని ఎద్దేవా చేశారు. ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే రాజకీయాలకు బదులుగా ప్రభుత్వానికి నిర్మాణాత్మక సూచనలు చేయాలని, రాయలసీమ హక్కుల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సూచించారు.

# టీసీఎల్ వద్దే బస్సులు ఆగిపోవడంతో గ్రామస్తులు, విద్యార్థుల ఇబ్బందులు

- మర్రిమంద వరకు బస్సులు పొడిగించాలని డిపో మేనేజర్‌కు వినతి

**ఏర్పేడు, జూలై 14 (మనసులో మాట) :**

తిరుపతి నుంచి మడిబాక, చెల్లూరు, కందాడ, ముసలిపేడు, ఏర్పేడు, శ్రీకాళహస్తి వెళ్లే ఆర్టీసీ బస్సులు ప్రస్తుతం పాపానాయుడుపేట-మర్రిమంద రహదారిపై మరమ్మతు పనులు జరుగుతున్న నేపథ్యంలో టీసీఎల్ మార్గం మీదుగా మళ్లించబడ్డాయి. అయితే ఈ బస్సులను టీసీఎల్ సర్కిల్ వరకు మాత్రమే నడపడంతో గ్రామస్తులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టీసీఎల్ సర్కిల్ నుంచి మర్రిమంద వరకు సుమారు మూడు కిలోమీటర్ల దూరం ఉండటంతో విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు ప్రతిరోజూ నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అక్కడి నుంచి ప్రైవేట్ వాహనాల కోసం



వేచి చూడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తిరుపతి డిపో మేనేజర్ స్పందించి, ప్రస్తుతం టీసీఎల్ వరకు మాత్రమే నడుస్తున్న బస్సులను కనీసం మర్రిమంద వరకు పొడిగించాలని వికృతమాల జనసేన నాయకుడు పూల శివశంకర్, గ్రామస్తులు, విద్యార్థులు విజ్ఞప్తి చేశారు. రోడ్డు పనులు పూర్తయ్యే వరకు తాత్కాలికంగా ఈ సౌకర్యం కల్పిస్తే ప్రజల ఇబ్బందులు చాలా వరకు తగ్గుతాయని వారు తెలిపారు.

# ఫ్యాప్టో ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా



**తిరుపతి బ్యూరో, జులై 14 (మనసులో మాట) :**

తిరుపతి జిల్లా ఫ్యాప్టో ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద పికెటింగ్ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఫ్యాప్టో చైర్మన్ ఎస్. సురేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి పరిశీలకుడుగా రాష్ట్ర ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ ఎస్. చిరంజీవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ పిఆర్సి కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని, ఆలస్యం అయ్యే పక్షంలో 30% మధ్యంతరభృతి ప్రకటించాలని, పెండింగ్ ఉన్న 5 డిఏలను వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్ లో ఉన్న 20 వేల కోట్ల ఆర్థిక బకాయిలను విడుదల చేయాలని. 2025లో బదిలీ కబడి రిలీవ్ కాని వారిని వెంటనే రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి పాల్గొని ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని, ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బిటీఏ ట్రెజరర్ రఘునాథ చక్రవర్తి మాట్లాడుతూ జీవో నెంబర్ 342 అనుసరించి ఎస్సి, ఎస్టీలకు నిబంధన లేకుండా స్టడీ లీవ్లను వినియోగించే విధంగా చూడాలి అని తెలిపారు. తదితర అనేక డిమాండ్లను ప్రస్తావించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో చైర్మన్ సురేష్, నాయకులు దండు రామచంద్రయ్య, రవీంద్ర, మునికృష్ణమనాయుడు, సుధాకర్, వెంకటముని, మురళీకృష్ణ, ముత్యాల రెడ్డి, లక్ష్మయ్య, మురళి, జయచంద్ర, నరేంద్ర, మధు సెక్రెటరీ జనరల్ డక్కిలి సిద్దయ్య పాల్గొన్నారు. వందల మంది ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేశారు.

# బ్రహ్మ దేవం లో పొలం పిలుస్తోంది



**ముత్తుకూరు. జూలై.14(మనసులో మాట):**

పొలం పిలుస్తుంది కార్యక్రమం బ్రహ్మదేవం,గోవిందరెడ్డి పాలెం గ్రామంలో మంగళవారం నిర్వహించినట్టు మండల వ్యవసాయ అధికారి జోష్నారాణి తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వరి పొలాలను పరిశీలించడం వరి పంట పొలాలను పరిశీలించడం జరిగిందన్నారు. తమ పరిశీలనలో వరిలో నల్లి బెడద ఎక్కువగా ఉండడం గమనించడం జరిగిందన్నారు. అధిక ఉష్ణోగ్రతలు ఉన్నప్పుడు,నత్రజని ఎరువులు అధికంగా వాడినప్పుడు నల్లి ఉధృతి పెరుగుతుంది కాబట్టి వాటిని నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. ఆకుల అడుగు భాగంలో చిన్న తెల్లటి మచ్చలు ఏర్పడి క్రమంగా బూడిద రంగులోకి మారుతాయని ,దూరం నుండి చూస్తే పొలం అంత ఎండిపోయినట్టు కనిపిస్తుందన్నారు. దీని నివారణకు ప్రొఫెనోపాస్ అనే మందును లీటర్ నీటికి రెండు మిల్లి గ్రాముల చొప్పున 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేసుకోవాలని లేదా స్పైరో మెసిఫెన్ అనేటువంటి మందును ఒక లీటర్ నీటికి 1 మీ.లీ.చొప్పున పిచికారి చేసుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో రైతు సోదరులు , విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ విజయ పాల్గొనడం జరిగింది.

# వైభవంగా శివాల పల్లి శ్రీ వీర భద్ర లక్ష్మీ నరసింహ స్వామి అమావాస్య పూజలు



**చెన్నూరు , మనసులో మాట ,జులై ,14,**

చెన్నూరు మండలం శివాల పల్లి లో జింకల వంక ప్రక్కన వెలసిన శ్రీ వీర భద్ర లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయం నందు ఈ జ్యేష్ఠ బహుళ అమావాస్య మంగళవారం ఉదయం 7:00 గంటలకు స్వామి వారికి పంచామృత పంచాభిషేకము పూజలు వైభవంగా నిర్వహించారు, శ్రీ వీర భద్ర లక్ష్మీ నరసింహ స్వామి వారికి అభిషేక పూజలు ఉభయ దాతలు కీర్తిశేషులు చెన్నూరు మండలం బలిసింగాయపల్లి గ్రామానికి చెందిన దాదిరెడ్డి సుబ్బారెడ్డి గారి జ్ఞాపకార్థం వారి సతీమణి దాదిరెడ్డి భాగ్యమ్మ వారి కుమారుడు దాదిరెడ్డి సుధీర్ రెడ్డి వీరి సతీమణి దాదిరెడ్డి మధు మాలిక వీరి కుమార్తెలు దాదిరెడ్డి వేదాన్షిక ,దాదిరెడ్డి దార్షిక మరియు వారి కుటుంబ సభ్యులు తో పాటు కొండపేట గ్రామానికి చెందిన తమటం నాగిరెడ్డి పత్తి తిరుపతమ్మ కడప నగరానికి చెందిన మోహన ఆచార్య శివాలపల్లె గ్రామానికి చెందిన ఆదిమూలం పెద్ద పుల్లయ్య గన్నేపల్లి గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య పలువురు చే ఆలయం ప్రధాన అర్చక పురోహితులు శ్రీ కిరణ్ కుమార్ శర్మ వేద మంత్రోజ్వాలాల మధ్య స్వామివారికి అభిషేక పూజలు నిర్వహించారు, ఈ కార్యక్రమాన్ని ఆలయ వ్యవస్థాపకులు శ్రీ పొట్టి పాటి ప్రతాప్ రెడ్డి ఏర్పాటు చేయగా ముందుగా వినాయకునికి అభిషేక పూజలు వస్త్ర పూల అలంకరణ నిర్వహించారు, అనంతరం శ్రీ వీరభద్ర లక్ష్మీ నరసింహ స్వామికి అభిషేక పూజలు నిర్వహించారు, వస్త్ర పూల అలంకరణ నిర్వహించారు ,పూజలు అనంతరం ఆలయ ప్రధాన అర్చక పురోహితులు శ్రీ కిరణ్ కుమార్ శర్మ దాదిరెడ్డి భాగ్యమ్మకు స్వామివారి తరపున పూలు పండ్లు తీర్థప్రసాదాలు అందించారు, భక్తులకు తీర్థప్రసాదాలు ఆలయం తరపున ఆలయ వ్యవస్థాపకులు పి ప్రతాప్ రెడ్డి తీర్థ ప్రసాదాలు అందజేశారు,ఈజేష్టబహుళఅమావాస్యమంగళవారం కావడంతో స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు,సమీప ప్రాంతాల గ్రామాల ప్రజలు రైతులు దర్శించుకున్న వారిలో ఉన్నారు

# తొట్టంబేడు గ్రంథాలయం ఆకస్మిక తనిఖీ చేసిన సంస్థ చైర్మన్ డా. రెడ్డివారి గురవారెడ్డి

**తొట్టంబేడు, జూలై 14 (మనసులో మాట) :**



ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డా. రెడ్డివారి గురవారెడ్డి మంగళవారం తొట్టంబేడు శాఖ గ్రంథాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ రికార్డులను పరిశీలించి, పాఠకులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అందుబాటులో ఉన్న పుస్తకాల వివరాలను గ్రంథాలయ అధికారి హరికృష్ణను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.28 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రంథాలయ భవనాన్ని పరిశీలించిన ఆయన, త్వరలోనే భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డా. గురవారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సారథ్యంలో గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. తొట్టంబేడు శాఖ గ్రంథాలయంలో ప్రస్తుతం సుమారు 5,500 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, ముఖ్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాత భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో దాని స్థానంలో రూ.28 లక్షలతో ఆధునిక సౌకర్యాలతో నూతన భవనాన్ని నిర్మించామని తెలిపారు. త్వరలో ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే సమక్షంలో ప్రారంభోత్సవం నిర్వహించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. గ్రంథాలయాలను సరస్వతి నిలయాలుగా, విజ్ఞాన భాండాగారాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జిల్లా కేంద్ర గ్రంథాలయానికి రూ.3.10 కోట్లతో నూతన భవనం నిర్మాణం కొనసాగుతోందని, వరదయ్యపాలెంలో రూ.28 లక్షలతో నిర్మిస్తున్న గ్రంథాలయం కూడా త్వరలో పూర్తికానుందని తెలిపారు. అలాగే ముత్యాలరెడ్డిపల్లి, వడమాలపేట, ఏర్పేడు, యాదమరి, చంద్రగిరి తదితర ప్రాంతాల్లో గ్రంథాలయ భవనాల మరమ్మతులకు అంచనాలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. డిజిటలైజేషన్ దిశగా తిరుపతి, మదనపల్లి, పలమనేరు గ్రంథాలయాలను డిజిటల్ లైబ్రరీలుగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయని, అవసరమైన అనుమతులు కూడా లభించాయని వెల్లడించారు. అలాగే సీఎస్ఆర్ నిధులతో శ్రీకాళహస్తి ప్రథమ శ్రేణి గ్రంథాలయం, సత్యవేడు గ్రంథాలయాలను డిజిటలైజ్ చేసేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఆరు నెలల్లో ఉమ్మడి జిల్లాలో సుమారు 45 గ్రంథాలయాలను సందర్శించి, పాఠకులు, పోటీ పరీక్షల అభ్యర్థులతో సమావేశమై వారి అవసరాలను తెలుసుకుని ప్రభుత్వానికి నివేదికలు పంపుతున్నట్లు చెప్పారు. పోటీ పరీక్షల విద్యార్థుల కోసం రూ.10 లక్షలతో పుస్తకాల కొనుగోలుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, మరో రూ.10 లక్షలతో అదనపు పుస్తకాల కొనుగోలుకు ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు.గ్రంథాలయాలను ప్రజలు, విద్యార్థులు ఎక్కువగా వినియోగించుకోవాలని, పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం, మేధాశక్తి పెంపొందించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అప్పరాచెరువు పాఠశాలలో పరిశీలన

- మందుబాబులకు బీజేపీ నేతల హెచ్చరిక
- పాఠశాల ఆవరణను శుభ్రం చేసిన నాయకులు
- ఇకపై మద్యం సేవించినా, క్రికెట్ ఆడినా కఠిన చర్యలే

**బత్తలపల్లి, జూలై 14 (మనసులో మాట)**



బత్తలపల్లి మండలంలోని అప్పరాచెరువు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణ మందుబాబులకు అడ్డాగా మారిందంటూ ఇటీవల మనసులో మాట దినపత్రికలో ప్రచురితమైన కథనం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో బీజేపీ బత్తలపల్లి మండల అధ్యక్షుడు ఆకులేటి భాస్కర్, మండల కార్యదర్శి ముసుగు రామచంద్ర పాఠశాలను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు.ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడిన బీజేపీ నాయకులు సమస్యలపై ఆరా తీశారు. ప్రతిరోజూ పాఠశాల ముగిసిన అనంతరం గ్రామానికి చెందిన కొందరు యువకులు పాఠశాల ఆవరణలోకి ప్రవేశించి మద్యం సేవిస్తున్నారని, అనంతరం మద్యం సీసాలు, ప్లాస్టిక్ గ్లాసులు, కుర్కురే ప్యాకెట్లు తదితర చెత్తను అక్కడే వదిలివెళ్తుండటంతో మరుసటి రోజు విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారని ఉపాధ్యాయులు వివరించినట్లు తెలిపారు.పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన మద్యం సీసాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర చెత్తను బీజేపీ నాయకులు, స్థానిక కార్యకర్తలతో కలిసి పూర్తిగా తొలగించి పరిశుభ్రం చేశారు. ఇకపై ఎవరైనా పాఠశాల ఆవరణలో మద్యం సేవించినా, క్రికెట్ లేదా ఇతర ఆటలు ఆడి పాఠశాల ఆస్తులకు నష్టం కలిగించినా, వారి వివరాలను పోలీసులకు అందజేసి కఠిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. పాఠశాల ఆవరణలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గ్రామస్తులు, యువత బాధ్యతాయుతంగా వ్యవహరించి విద్యాసంస్థలను పరిరక్షించాలని వారు పిలుపునిచ్చారు. స్థానికులు కూడా పాఠశాల భద్రత కోసం అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# జిల్లాలో మామిడి పంట పండించిన ప్రతి రైతు వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్..

**చిత్తూరు, జూలై 14(మనసులో మాట):**



జిల్లాలో మామిడి పంట పండించిన ప్రతి రైతు పంటకు సంబంధించిన వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హత కలిగిన రైతుల జాబితాను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యానవన, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారులతో మామిడికాయల సేకరణ పురోగతి, ప్రభుత్వం అందించే సబ్సిడీ, అర్హులైన రైతుల గుర్తింపు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఒక్కో అర్హత గల రైతుకు అందించే సబ్సిడీ పారదర్శకంగా, నిజమైన లబ్ధిదారులకు చేరేలా ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా పరిశీలించాలని ఆదేశించారు. ఇందుకోసం మండల స్థాయిలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, రైతు సేవా కేంద్రం (RSK) సిబ్బంది సంయుక్త బృందాలుగా ఏర్పడి ప్రతి గ్రామంలో మామిడి పంట పండించిన రైతులను గుర్తించాలని సూచించారు. మామిడి పంటకు సంబంధించిన ప్రతి నమోదును ఈక్రాప్ వివరాలతో సరిపోల్చి, అవసరమైన చోట భౌతిక పరిశీలన నిర్వహించాలని తెలిపారు. అలాగే ఈక్రాప్‌లో నమోదు ఉండి క్షేత్రస్థాయిలో కూడా పంట ఉన్న రైతులను అర్హులుగా పరిగణించాలని తెలిపారు. ఈక్రాప్‌లో రైతు పేరు నమోదై ఉండి రైతు మరణించిన సందర్భాల్లో, వారి కుటుంబ సభ్యులు పంటను విక్రయించి ఉంటే మరణ ధ్రువీకరణ పత్రం, రెవెన్యూ శాఖ ధ్రువీకరణ, ఆధార్ తదితర ఆధారాలను పరిశీలించి, నిబంధనల మేరకు అర్హత నిర్ణయించాలని అధికారులను ఆదేశించారు. మామిడి పంట పండించిన ఒక్క రైతు కూడా ప్రభుత్వ సహాయానికి దూరం కాకుండా ప్రతి కేసును నిష్పక్షపాతంగా పరిశీలించాలని, అర్హులైన రైతులందరికీ సబ్సిడీ అందేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అదేవిధంగా జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తరించేందుకు రైతులకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, రైతులకు అవసరమైన ఎరువులు ఎలాంటి కొరత లేకుండా అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ వెంకటేష్, జిల్లా వ్యవసాయ అధికారి మురళి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సతీష్, మార్కెటింగ్ శాఖ పరమేశ్వరన్, ఆర్టికల్చర్ అధికారి కోటేశ్వరరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు..

# చిత్తూరు జిల్లాలో ఖర్జూరపు తోటను విధ్వంసం చేసిన ఏనుగులు...



**చిత్తూరు జూలై 14 (మనసు లో మాట):**

చిత్తూరు జిల్లా గుడిపాల మండలం, గుడిపాల పంచాయితీ, వెంగమ నాయుడు కండ్రిగ గ్రామానికి చెందిన, తుమ్మల చంద్రశేఖర్ నాయుడు పొలంలోని, చాలా విలువైన ఖర్జూరపు పంట చెట్లను గత రాత్రి, ఏనుగులు గుంపు ధ్వంసం చేశాయి కారణంగా లక్షల రూపాయలు పట్టుచీనను రైతులు చంద్రశేఖర్ నాయుడు నష్టపోవడం జరిగింది, గతంలో ఇదే ప్రాంతం సరి హద్దుల్లో కొబ్బరి తోటలకు ఏనుగులు గుంపు నష్టం చేశాయి ప్రభుత్వం, అటవీ శాఖ అధికారులు, సదరు రైతుకు నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకుని, భవిష్యత్తులో ఏనుగులు పంట పొలాల పైకి రాకుండా నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు..

# చవటపల్లి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన కమిషనర్....



**చిత్తూరు ,జూలై 14,(మనసులో మాట):**

నగరపాలక పరిధిలో చవటపల్లి వద్ద జరుగుతున్న సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను కమిషనర్ పి నరసింహ ప్రసాద్ పరిశీలించారు. మంగళవారం కమిషనర్, మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి కలిసి సంతపేట ముత్యాలమ్మ గుడి నుండి చవటపల్లి వరకు రూ.2.80 కోట్లతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్లను తనిఖీ చేశారు. నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం రోడ్డు పనులు జరగాలన్నారు. నాణ్యతకు పెద్దపీట వేయాలని అధికారులు, గుత్తేదారులకు సూచించారు. పలు ప్రాంతాల్లో రోడ్డు నిర్మాణం జరిగిన తీరును ఇంజనీరింగ్ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. క్యూరింగ్ పనులు పక్కాగా నిర్దేశించిన సమయం మేరా చేపట్టాలన్నారు. కట్టమంచి సాంబయ్య కండిగ బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు, గుత్తేదారులు పాల్గొన్నారు.

# జిల్లాలో 99.95 శాతం ఓటరు వివరాల డిజిటలైజేషన్ పూర్తి



- వంద శాతం పూర్తి చేయడమే లక్ష్యం – జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్..

**చిత్తూరు, జూలై14(మనసు లో మాట):**

జిల్లాలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం వేగంగా కొనసాగుతోందని, ఓటరు వివరాల డిజిటలైజేషన్ ఇప్పటికే 99.95 శాతానికి చేరుకుందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సమావేశపు మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లాలో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ రోజు వరకు డిజిటలైజేషన్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయడమే లక్ష్యంగా అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో మొత్తం 13,40,126 మంది ఓటర్లకు గాను 13,39,675 ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయగా, 99.97 శాతం పంపిణీ పూర్తయిందన్నారు. ఇప్పటివరకు 13,39,054 ఫారాలను డిజిటలైజ్ చేయడంతో పురోగతి 99.92 శాతానికి చేరిందని తెలిపారు. నియోజకవర్గాల వారీగా నగరిలో 100 శాతం, జి.డి.నెల్లూరులో 100 శాతం, పలమనేరులో 99.99 శాతం, పూతలపట్టులో 99.95 శాతం, చిత్తూరులో 100 శాతం, కుప్పంలో 99.59 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని వివరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఇప్పటివరకు 41,503 మంది మరణించిన ఓటర్లు, 53,694 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, 17,675 మంది ఇతర ప్రాంతాల్లో ఇప్పటికే ఓటర్లుగా నమోదైన వారు, 21,865 మంది గైర్హాజరు, 197 ఇతర కేసులు గుర్తించినట్లు తెలిపారు. మొత్తం 1,34,934 మందిని అన్‌కలెక్టబుల్‌గా గుర్తించామని, తుది పరిశీలన అనంతరం ఈ సంఖ్యలో మార్పులు ఉండే అవకాశం ఉందన్నారు. జిల్లాలో 1,511 మంది బీఎల్ఓలు విధులు నిర్వహిస్తున్నారని, ప్రతి వారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నామని, అలాగే జూలై 21న ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఓటర్ల వివరాల్లో మార్పులు, సవరణలు అవసరమైన వారు ఎన్నికల సంఘం అందుబాటులోకి తీసుకొచ్చిన 'బుక్ ఏ కాల్ విత్ బీఎల్ఓ' సేవను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకటేష్, డిఆర్ఓ కె మోహన్ కుమార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆమ్ ఆద్మీ పార్టీ, చిత్తూరు కె.బాలసుబ్రహ్మణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి, భారతీయ జనతా పార్టీ, చిత్తూరు అట్లూరి శ్రీనివాస్, బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఇంచార్జ్ బి. లోకనాథం, రాష్ట్ర అధికార ప్రతినిధి, తెలుగుదేశం పార్టీ, చిత్తూరు వి.సురేంద్ర కుమార్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యం. విజయ సింహారెడ్డి, స్టేట్ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ వింగ్ వైస్ ప్రెసిడెంట్, కాన్స్టిట్యూఎన్సీ గ్రీవెన్స్ సెల్ ప్రెసిడెంట్, ఎన్.ఉదయ్ కుమార్ రెడ్డి, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ డి సి డి ప్రెసిడెంట్ డి.రమేష్ బాబు, జనసేన పార్టీ దేవినేని యశ్వంత్, చిత్తూరు జిల్లా సెక్రెటరీ, ఎలెక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ రాజేంద్ర, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సీబీఆర్ డ్యాం బాధితులకు వెంటనే పునరావాస పరిహారం చెల్లించాలి

- వెంగమేష్ చౌదరి, చల్లా శ్రీనివాసులు

**ముదిగుబ్బ, జూలై 14: (మనసులో మాట) :**



సత్యసాయి జిల్లా ముదిగుబ్బ, తాడిమర్రి మండలాల సరిహద్దులో కడప జిల్లా పార్లపల్లి వద్ద నిర్మించిన చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్) కారణంగా నివాసాలు కోల్పోయిన బాధితులకు తక్షణమే పునరావాస పరిహారం చెల్లించాలని జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ (ఎన్‌హెచ్ఆర్‌సీ) జాతీయ కన్వీనర్ బాసినేని వెంగమేష్ చౌదరి, సీపీఐ ముదిగుబ్బ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వారు మాట్లాడుతూ, దాదాపు 20 ఏళ్ల క్రితమే నిర్మాణం పూర్తయిన ఈ రిజర్వాయర్ వల్ల సత్యసాయి జిల్లాలోని ముదిగుబ్బ, తాడిమర్రి మండలాల పరిధిలో సుమారు 13 గ్రామాల భూములు, ఇళ్లు ముంపునకు గురయ్యాయని తెలిపారు. ఇప్పటికే పలు గ్రామాల బాధితులకు పునరావాస పరిహారం అందించినప్పటికీ, ముదిగుబ్బ మండలం చిన్నకోట్ల పంచాయతీ పరిధిలోని ఎర్రగుంటపల్లి గ్రామ బాధితులకు ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా పరిహారం అందలేదని ఆరోపించారు. 2005లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఒక్కో ఇంటికి రూ.2.50 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని జీవో జారీ చేశారని గుర్తుచేశారు. ప్రస్తుత మార్కెట్ విలువలను పరిగణనలోకి తీసుకుంటే గ్రామంలోని సుమారు 250 మంది బాధితులకు ఒక్కో ఇంటికి రూ.10 లక్షల నుంచి రూ.13 లక్షల వరకు, మొత్తం రూ.25 కోట్లకు పైగా పరిహారం మంజూరు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. గత 20 ఏళ్లుగా ఎర్రగుంటపల్లి గ్రామస్తులు పరిహారం కోసం ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ధర్మవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌లకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకపోయిందని విమర్శించారు. కాబట్టి ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎర్రగుంటపల్లి గ్రామ బాధితులకు తగిన పునరావాస నష్టపరిహారాన్ని వెంటనే మంజూరు చేయాలని వెంగమేష్ చౌదరి, చల్లా శ్రీనివాసులు ప్రభుత్వాన్ని కోరారు.

# ఉపాధ్యాయుల సహనాన్ని పరీక్షించవద్దు

- ర్యాలీ, పికెటింగ్ లో ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మల్లు రఘునాథరెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా




**కడప జూలై 14 మనసులో మాట:**

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సహనాన్ని పరీక్షించవద్దని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మల్లు రఘునాథరెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా పేర్కొన్నారు. మంగళవారం ఫ్యాప్టో ఉద్యమ పిలుపులో భాగంగా ఫ్యాప్టో జిల్లా అధ్యక్షుడు సంగమేశ్వర్ రెడ్డి అధ్యక్షతన నగరంలో ర్యాలీ, కలెక్టరేట్ ఎదుట పికెటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథ రెడ్డి, లక్ష్మీ రాజా మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యల పట్ల ప్రభుత్వ వైఖరి పై మండిపడ్డారు. సంవత్సరాలు గడుస్తున్న ఆర్థిక ప్రయోజనాల పై ప్రభుత్వం శీతకన్ను ప్రదర్శించడం, ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) మార్గదర్శకాలపై ప్రాతినిధ్యాలపై నిర్ణయ జాప్యం, పాఠశాలలు తెరిచి నెల కూడా కాకమునుపే పదవ తరగతికి మిషన్ 2027 పేరుతో కార్యాచరణ ప్రణాళిక ప్రకటించడం చూస్తుంటే ఉపాధ్యాయుల సహనాన్ని ప్రభుత్వం పరీక్షిస్తున్నటుందని, ఇది మంచిది కాదని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేసి, సమస్యలను పరిష్కరించడాన్ని విస్మరిస్తున్నారన్నారు. 12వ పిఆర్సీ గడువు ముగిసి మూడేళ్లు అవుతున్నా పిఆర్సీని అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులతో పాటు సర్వీసులో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు జరుగుతున్న నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని తక్షణం 12వ పిఆర్సీ కమిషన్ ను ఏర్పాటు చేసి, పిఆర్సీ అమలయ్యే వరకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 29 శాతం మధ్యంతర భృతిని చెల్లించాలన్నారు. ఆర్థిక బకాయిలను కూటమి ప్రభుత్వం కొంతమేరకు చెల్లించినప్పటికీ, ఇంకా రూ.25 వేల కోట్లు పైబడి బకాయిలు పేరుకపోయాయన్నారు. వీటి చెల్లింపులలో నిర్దిష్టమైన కాల వ్యవధి లేకపోవడం వల్ల పూర్తిస్థాయిలో బకాయిల చెల్లింపులు లేవన్నారు. నాలుగు డిఏలు పెండింగ్ ఉన్నా పాలకులు కనీసం స్పందించడం లేదని విమర్శించారు. మూడు సంవత్సరాలుగా సరెండర్ లీవ్ బకాయిల చెల్లింపులు లేవని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను కారణంగా చూపి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు టెట్ ఉత్తీర్ణత సాధించాలనడం తగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో చర్చించి విద్యాహక్కు చట్టం 2009 సెక్షన్ 23(1) సవరించడానికి కృషి చేయాలని కోరారు. పార్లమెంటులో చట్ట సవరణ జరిపే లోపు ఉపాధ్యాయులపై ఒత్తిడి, బోధనకు ఆటంకం లేకుండా ఆఫ్లైన్ విధానంలో ప్రత్యేక టెట్ ఉపాధ్యాయుల కొరకు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సెక్రటరీ జనరల్ రాళ్లపల్లి అబ్దుల్లా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సయ్యద్ ఇక్బాల్,యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ్ కుమార్, పాలెం మహేష్ బాబు, ఏపీటీఎఫ్ 257,ఏపీటీఎఫ్ 1938, ప్రధానోపాధ్యాయుల సంఘం, వ్యాయామ ఉపాధ్యాయుల అసోసియేషన్, రూటా,ఆప్టా, బి టి ఏ సంఘాల నుంచి ఇలియాస్ బాష, వి. వి.వీరాంజుల రెడ్డి, శివశంకర్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, బత్తల రాజు, శ్యామలాదేవి, సుబ్బారెడ్డి, హరి కొండయ్య, విజయకుమార్, మహేష్ బాబు, సాజిద్, ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రామ్మూర్తి నాయుడు, కార్యదర్శి నాగ ముని రెడ్డి, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు పాల్గొన్నారు.

## ఎన్యుమరేషన్, డిజిటలైజేషన్ ప్రక్రియ పరిశీలన



**దుత్తలూరు, జూలై 14 (మనసులో మాట):**

నర్రవాడ గ్రామపంచాయతీ పరిధిలోని 116, 117, 118, 119 పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ఓటర్ల ఎన్యుమరేషన్ ఫారాల స్వీకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను మంగళవారం బీజేపీ కిసాన్ మోర్చా నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు మేకపాటి మాల్యాద్రి నాయుడు పరిశీలించారు. ఆయనతో పాటు టీడీపీ యువ నాయకుడు దారపనేని హరి, టీడీపీ బూత్ కోకన్వీనర్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో మాట్లాడిన వారు, ప్రతి ఓటరు వివరాలను ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా నమోదు చేయాలని సూచించారు. డిజిటలైజేషన్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి చేసి, అర్హులైన ప్రతి ఓటరికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను విజ్ఞప్తి చేశారు.ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు ఎంతో విలువైనదని, ప్రతి ఓటరు వివరాలు ఖచ్చితంగా నమోదు కావడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా మాల్యాద్రి నాయుడు పేర్కొన్నారు.

## అమరావతి ఛాంపియన్‌షిప్ 2026కు అన్నమయ్య జిల్లా సిద్ధం



**మదనపల్లె, (మనసులో మాట) జూలై 14:**

అమరావతి ఛాంపియన్షిప్-2026లో భాగంగా నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల కోసం అన్నమయ్య జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జి. చంద్రశేఖర్ తెలిపారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆదేశాల మేరకు అండర్-17 మరియు అండర్-23 బాలురు, బాలికలకు మొత్తం 12 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని మదనపల్లె, రాయచోటి, తంబళ్లపల్లె, పీలేరు, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గ కేంద్రాల్లో జూలై 20 నుంచి 25 వరకు దశలవారీగా పోటీలు నిర్వహించనున్నారు. వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, ఖోఖో, బాస్కెట్‌బాల్, హాకీ, ఆర్చరీ, వెయిట్‌లిఫ్టింగ్, అథ్లెటిక్స్, కబడ్డీ, యోగా, బాక్సింగ్ విభాగాల్లో పోటీలు జరగనున్నాయి. ప్రతి నియోజకవర్గానికి ఇన్‌చార్జిలను నియమించి, వారి సంప్రదింపు వివరాలను కూడా ప్రకటించినట్లు తెలిపారు. పోటీల నిర్వహణ కోసం ప్రతి నియోజకవర్గంలో సంబంధిత పీ.ఈ.టి లు, పీ.డి లను నియమించి,ఎస్.జి.ఎఫ్ కార్యదర్శులతో సమన్వయం చేస్తూ అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అలాగే జిల్లా విద్యాశాఖ సహకారంతో వేదిక పాఠశాలల్లో పాల్గొనే విద్యార్థులకు మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించే ఏర్పాట్లు కూడా చేసినట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పేర్కొన్నారు.

## గ్రామాల్లో ఎస్ఐఆర్ ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియ వేగవంతం

**ముదిగుబ్బ, జూలై 14: (మనసులో మాట):**



ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు ముదిగుబ్బ మండలంలోని క్లస్టర్-3 పరిధిలో మంగళవారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఓటర్ వెరిఫికేషన్ చేపట్టారు.మలకవేముల, ఎనుములవారిపల్లి, ఎన్ఎస్‌పీ కొట్టాల, మల్లమ్మకొట్టాల గ్రామాలకు చెందిన 82, 83, 84, 85 బూత్‌ల పరిధిలో బీఎల్ఏలు, బీఎల్‌వోలు, సచివాలయ సిబ్బంది, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొని ఓటరు జాబితాల పరిశీలన, దరఖాస్తుల నమోదు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఓటరు జాబితాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పూర్తి చేసిన దరఖాస్తులను వెంటనే బీఎల్‌వోల ద్వారా అప్‌లోడ్ చేయాలని సూచించారు. అలాగే బూత్ కన్వీనర్లు తమ బూత్‌కు సంబంధించిన దరఖాస్తులను మై టీడీపీ యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ముదిగుబ్బ మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి, క్లస్టర్-3 ఇన్‌చార్జి చినగాని నరసింహ యాదవ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు బండి మల్లికార్జున, సీనియర్ నాయకులు రమణా నాయక్, బెల్లం సూరి, రామాంజనేయులు, అల్లా బక్షుతో పాటు పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈతకు వెళ్లి గల్లంతయిన సుకుమార్ మృతదేహం లభ్యం

**వరదయ్యపాలెం జూలై14(మనసులో మాట):**

తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలం మరదవాడ సమీపంలోని క్వారీ గుంటలో మునిగి యువకుడు మృతి చెందిన ఘటన విషాదాన్ని నింపింది. బీఎన్ కండ్రిగ మండలం నెలవాయి గ్రామానికి చెందిన జడ సుకుమార్ (22) అవంతి ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఆదివారం ముగ్గురు స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన సుకుమార్ లోతైన నీటిలో మునిగి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న వరదయ్యపాలెం ఎస్ఐ మల్లికార్జున్ సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకుని, APSDRS భద్రతా దళాలతో కలిసి మూడు రోజుల పాటు గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం మధ్యాహ్నం సుకుమార్ మృతదేహాన్ని నీటి నుంచి వెలికితీశారు. ఘటనపై సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, టీడీపీ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



కాగా, ఈ ఘటనపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేయడంతో పూర్తి స్థాయి విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడిస్తామని సత్యవేడు సీఐ తెలిపారు.

# గర్భిణులకు మూడు రోజుల ఉచిత వైద్య శిబిరం

- **విజయలక్ష్మి హాస్పిటల్‌లో ఉచిత పరీక్షలు, స్కానింగ్ – సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ల పిలుపు**





**ధర్మవరం, జూలై 14 8మనసులో మాట):**

గర్భిణీ స్త్రీల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ధర్మవరం పట్టణంలోని విజయలక్ష్మి హాస్పిటల్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆస్పత్రి అధినేతలు డాక్టర్ ఎల్. మదన్మోహన్, డాక్టర్ ఎల్. లక్ష్మీరమ తెలిపారు. పట్టణంలోని పుట్టపర్తి రోడ్, మాంగల్య షాపింగ్ మాల్ పక్కన, ఆంజనేయస్వామి ఆలయం వెనుక, జోగోని గుంట వీధిలో ఉన్న విజయలక్ష్మి హాస్పిటల్‌లో జూలై 16 నుంచి 18వ తేదీ వరకు ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు.ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు ఉచిత వైద్య పరీక్షలతో పాటు స్కానింగ్ సేవలు అందించనున్నట్లు తెలిపారు. ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఎల్. లక్ష్మీరమ ఆధ్వర్యంలో గర్భిణీలకు అవసరమైన వైద్య పరీక్షలు, సలహాలు, చికిత్సలు పూర్తిగా ఉచితంగా అందజేయనున్నట్లు పేర్కొన్నారు.గర్భధారణ సమయంలో తల్లి, శిశువు ఆరోగ్య పరిరక్షణకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం ఎంతో అవసరమని, ఈ నేపథ్యంలో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల గర్భిణీ స్త్రీలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ మదన్మోహన్, డాక్టర్ లక్ష్మీరమ విజ్ఞప్తి చేశారు.ఈ శిబిరం ద్వారా గర్భిణీల ఆరోగ్య పరిస్థితిని ముందుగానే అంచనా వేసి అవసరమైన వైద్య సూచనలు అందించడం ద్వారా సురక్షిత మాతృత్వానికి తోడ్పాటు అందించడమే తమ లక్ష్యమని వారు తెలిపారు. ఉచితంగా అందిస్తున్న ఈ సేవలను అర్హులైన గర్భిణీ స్త్రీలు వినియోగించుకోవాలని ఆస్పత్రి యాజమాన్యం కోరింది.

# పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించిన వ్యవసాయ శాఖ



**వరికుంటపాడు జూలై 14 (మనసులో మాట) :**

వరికుంటపాడు మండలంలోని వెంపాడు గ్రామంలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో "పొలం పిలుస్తోంది" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు రైతులతో నేరుగా పొలాల్లో సమావేశమై ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో చేపట్టాల్సిన సాగు విధానాలు, నాణ్యమైన విత్తనాల వినియోగం, సమతుల్య ఎరువుల వాడకం, చీడపీడల నివారణ, పంటల సంరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. అలాగే రైతులు పంటలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వ్యాధులు, చీడపీడల లక్షణాలు కనిపించిన వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ పథకాలు, సబ్సిడీలు, పంటల నమోదు, పంట బీమా తదితర అంశాలపై వివరించారు. రైతులు అడిగిన సందేహాలకు అధికారులు సమాధానాలు ఇచ్చి, శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, గ్రామ రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలాల పరిరక్షణకై సంతకాల సేకరణ ఉద్యమం.. పరిరక్షణ కమిటీ



**వెంకటగిరి జూలై 14 (మనసులో మాట):**

తిరుపతి జిల్లా వెంకటగిరి పట్టణ నడిబొడ్డున ఉన్న సమితి స్థలంతో పాటు, జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడామైదానం భూకబ్జాదారుల పరం కాకుండా ప్రజలందరూ అడ్డుకోవాలని ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కమిటీ పిలుపునిచ్చింది.మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న తహసిల్దారుని కలిసి సమితి స్థలం అని తెలిపే అన్ని రకాల డాక్యుమెంట్లు ఉన్నందున వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించాలని కోరారు. సమితి భవనాల నిర్మాణం కొరకై అప్పటి బీడీవో ప్రైవేటు వ్యక్తుల నుంచి స్థలం కొనుగోలు చేసిన డాక్యుమెంట్లు, సమితికి చెందిన స్థలం అని తెలియపరుస్తున్న ఎఫ్ఎంబి స్కెచ్ లు, విశ్వోదయ కళాశాల కొరకై కొనుగోలు చేసిన డాక్యుమెంట్లలో కూడా ఉత్తరపు హద్దు ప్రభుత్వ స్థలంగా పేర్కొనబడిన అంశాలను గతంలో రెవెన్యూ కోర్టులో దృష్టికి తెచ్చామని వీలైనంత త్వరగా రెవెన్యూ రికార్డులలో మార్పులు చేస్తూ సమితి స్థలంగా గుర్తించాలని కోరారు.అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కమిటీ నాయకులు బికె ప్రసాద్ మాట్లాడుతూ సమితి స్థలాలు కానీ, జిల్లా పరిషత్ హై స్కూల్ క్రీడామైదానం కానీ పూర్తిగా ప్రభుత్వానికి చెందినవేనని వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత వెంకటగిరి ప్రజలందరిపై ఉందని గుర్తు చేశారు. అబ్దుల్ కరీం సాహెబ్ నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిందని అప్పటి రెవెన్యూ అధికారుల అలసత్వంతో వారిపేర్లుఅలాగేకొనసాగాయని అన్నిరకాల రికార్డులు ఉన్నందున సమితి స్థలాలుగాపరిగణించాలన్నారు.వారసులుగాచెప్పబడుతున్న వారి వద్ద ఎలాంటి ఆధారాలు లేనట్లు తేలిపోయిందన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం స్థలాన్ని కూడా రికార్డుల్లో ఐదుగురి పేర్లతో నమోదు చేసుకున్నారని ఈ స్థలం ప్రభుత్వానికి చెందినదని జిల్లా పరిషత్ హై స్కూల్ క్రీడా మైదానం కొరకు కేటాయిస్తూ గతంలో అధికారులు ప్రొసీడింగ్స్ కూడా ఇచ్చి ఉన్నారని తెలియజేశారు. తప్పుడు పత్రాలు సృష్టించి ఎవరైనా కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకోబోమని, ప్రజలంతా వీటిని కాపాడుకోవడానికి ముందుకు రావాలన్నారు. త్వరలో పెద్ద ఎత్తున సంతకాల సేకరణ ఉద్యమం చేపడతామని తెలిపారు. పరిరక్షణ సమితి సభ్యులు ఎస్వీ నరసింహులు మాట్లాడుతూ ఈ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న వారంతా ప్రజా సంఘాల నాయకులు గానీ, ప్రభుత్వ ఉద్యోగాలు చేసి విశ్రాంత జీవితం గడుపుతున్న మేము గానీ నిస్వార్థంగా పోరాడుతున్నామని తెలిపారు. వెంకటగిరి పట్టణ ప్రజల భవిష్యత్తు అవసరాల కొరకు క్రీడా మైదానాలు, ప్రభుత్వస్థలాలుకాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ వివి రమణారెడ్డి, విశ్వోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి అల్లం రాజా, ఏపీ టీఎఫ్ సీనియర్ నాయకులు గౌస్ బాషా, రైతు కూలీ సంఘం నాయకులు జి కృష్ణారెడ్డి, వివి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి మత్తులో యువకుల వీరంగం వార్తలు అవాస్తవం



- **మద్యం మత్తులో జరిగిన ఘటనే.. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ప్రచారాన్ని ఖండించిన పోలీసులు**

**ధర్మవరం, జూలై 15 (మనసులో మాట):**

ఇటీవల సోషల్ మీడియా, కొన్ని దినపత్రికల్లో ధర్మవరం పట్టణంలో "గంజాయి మత్తులో యువకులు రోడ్డుపై వీరంగం సృష్టించి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు" అంటూ ప్రచారం జరుగుతున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప, టూ టౌన్ సీఐ జయనాయక్, టూ టౌన్ ఎస్ఐ వీరేష్ స్పష్టం చేశారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు ఘటనకు సంబంధించిన వాస్తవాలను వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం, జూలై 15న ఇందిరమ్మ కాలనీలో రోడ్డు పక్కన ఉన్న సిమెంట్ ఇటుకల బట్టి వద్ద హరీష్, సురేష్, శర్మాస్ వలి, మహేష్, మహబూబ్ బాషా అనే వ్యక్తులు మద్యం మత్తులో ఇటుకల బట్టి యజమాని రియావుద్దీన్‌తో గొడవపడి దాడికి పాల్పడినట్లు ఫిర్యాదు అందిందన్నారు. ఫిర్యాదు మేరకు వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.నిందితులను విచారించగా వారు ముందుగా వైన్ షాపులో మద్యం సేవించి, అనంతరం కల్లు దుకాణంలో కల్లు తాగిన తర్వాత మద్యం మత్తులో గొడవకు పాల్పడినట్లు అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. ఘటనకు సంబంధించిన సీసీ కెమెరా పుటేజ్‌ను పరిశీలించగా కూడా ఇదే విషయం నిర్ధారణ అయినట్లు తెలిపారు. అసత్య ప్రచారాలను నమ్మవద్దని, నిర్ధారించని సమాచారాన్ని సోషల్ మీడియాలో షేర్ చేయకుండా ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పోలీసులు సూచించారు. అలాగే ఎక్కడైనా గంజాయి విక్రయాలు లేదా వినియోగం జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే 100, 112, 1972 లేదా 6305800429 నంబర్లకు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# జెడ్పీ గర్ల్స్ హైస్కూల్‌లో ప్రకృతి వ్యవసాయ అవగాహన కార్యక్రమం



- ఎం.టి. వెంకట రమణ

**లక్కిరెడ్డిపల్లి జూలై 14 (మనసులోమాట):**

లక్కిరెడ్డిపల్లి మండలం, గ్రామంలోని జెడ్పీ గర్ల్స్ హైస్కూల్‌లో ఈరోజు ప్రకృతి వ్యవసాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం.టి. వెంకట రమణ ప్రకృతి వ్యవసాయం ఉపయోగాలు, ప్రయోజనాలు, రసాయన రహిత సాగు ద్వారా ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తి, నేల సారవంతత పెంపు, పర్యావరణ పరిరక్షణ మరియు రైతుల సాగు ఖర్చుల తగ్గింపు వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. జెండర్ ఇంటర్న్ సురేష్ కిచెన్ గార్డెన్ల ప్రాముఖ్యత, వాటి నిర్వహణ విధానాలు, ఇంటి వద్ద సేంద్రీయ కూరగాయల ఉత్పత్తి ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. అలాగే ఏగ్రేడ్, ఏటీఎం మోడల్, పీఎండీఎస్ మోడళ్ల గురించి అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్లను ఏర్పాటు చేసి విద్యార్థులతో మొక్కలు నాటించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కె. శ్రీదేవి, ఎఫ్ఎంటీ గంగిరెడ్డి, ఐసీఆర్పీ సభ్యులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

---

# గోట్లూరులో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం



- ఖరీఫ్-2026 పంటల యాజమాన్యంపై రైతులకు అవగాహన – జూలై 31లోగా పంట బీమా, క్రాప్ రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని సూచన

**ధర్మవరం, జూలై 15 (మనసులో మాట):**

శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం మండలంలోని గోట్లూరు గ్రామంలో ఖరీఫ్-2026 సీజన్‌ను పురస్కరించుకుని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ధర్మవరం సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) లక్ష్మణ్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై రైతులకు పంటల యాజమాన్యంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని శాస్త్రీయ విధానాల్లో సాగు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా వేరుశనగ, చెరకు (చీని) పంటల్లో అనుసరించాల్సిన ఆధునిక సాగు పద్ధతులు, సమతుల్య ఎరువుల వినియోగం, చీడపీడల నివారణ, నీటి యాజమాన్యం తదితర అంశాలపై రైతులకు వివరించారు.అలాగే వరి, మొక్కజొన్న, కందులు, ఆముదం, రాగి పంటలు సాగు చేసే రైతులందరూ తప్పనిసరిగా పంట బీమా చేయించుకోవాలని సూచించారు. పంట బీమా నమోదు చేసుకునేందుకు జూలై 31 చివరి తేదీ అని పేర్కొంటూ, గడువు ముగిసేలోపు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందాలంటే ప్రతి రైతు తమ సాగు చేస్తున్న పంటల వివరాలను ప్రభుత్వ పోర్టల్‌లో క్రాప్ రిజిస్ట్రేషన్ చేయించుకోవడం తప్పనిసరి అని తెలిపారు. పంట నమోదు ద్వారా భవిష్యత్తులో అందించే బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, ప్రకృతి వైపరీత్యాల పరిహారం వంటి ప్రభుత్వ ప్రయోజనాలు సులభంగా అందుతాయని వివరించారు.వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తూ నాణ్యమైన విత్తనాలు, శాస్త్రీయ సాగు పద్ధతులను అవలంబిస్తే దిగుబడులు పెరిగి రైతులకు అధిక ఆదాయం లభిస్తుందని ఏడీఏ లక్ష్మణ్ నాయక్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ముస్తఫా, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాసులు, గోట్లూరు రైతు సేవా కేంద్రం సిబ్బంది ఆశా జ్యోతి, గ్రామ రైతులు, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 'నేతన్న భరోసా' అమలు తేదీని వెంటనే ప్రకటించాలి

- చేనేత జౌళి శాఖ మంత్రి సవితకు ఏపీ చేనేత కార్మిక సంఘం విజ్ఞప్తి
- జూలై 20న ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా



**ధర్మవరం, జూలై 15 (మనసులో మాట)**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన 'నేతన్న భరోసా' పథకాన్ని వెంటనే అమలు చేసి, దానికి సంబంధించిన తేదీని స్పష్టంగా ప్రకటించాలని ఏపీ చేనేత కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం జిల్లా కన్వీనర్ జె.వి. రమణ, జిల్లా నాయకుడు ఎస్.హెచ్. భాష బుధవారం ధర్మవరంలోని చేనేత కార్మిక సంఘం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.వారు మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ప్రతి చేనేత కార్మికుడికి 'నేతన్న భరోసా' పథకం కింద రూ.25 వేల ఆర్థిక సాయం అందజేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా ఇప్పటికీ ఆ పథకం అమలులోకి రాకపోవడం చేనేత కార్మికులను తీవ్ర నిరాశకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుతం చేనేత కార్మికులు ఆర్థిక ఇబ్బందులు, ఉపాధి సంక్షోభంతో తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నారని, ఇలాంటి సమయంలో 'నేతన్న భరోసా' అమలైతే వారికి కొంత ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో చేనేత రంగానికి తగిన నిధులు కేటాయించలేదని, అయితే చేనేత జౌళి శాఖ మంత్రి సవిత త్వరలో పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించడం తప్ప, స్పష్టమైన తేదీని వెల్లడించకపోవడం కార్మికులను మభ్యపెట్టడమేనని విమర్శించారు.కనీసం ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా అయినా 'నేతన్న భరోసా' పథకాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ప్రతి చేనేత కుటుంబానికి మూడు సెంట్ల స్థలంతో పాటు వర్క్‌షెడ్ కలిగిన ఇల్లు నిర్మించి ఇవ్వాలని, ఇప్పటికే సొంత స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణం కోసం రూ.6 లక్షల ఆర్థిక సాయం అందించాలని కోరారు.50 సంవత్సరాలు దాటిన చేనేత కార్మికులకు ప్రభుత్వం ఇప్పటివరకు చేనేత పింఛన్లు మంజూరు చేయలేదని విమర్శించిన వారు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని చేనేత అనుబంధ వృత్తుల వారికి కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జూలై 20న ధర్మవరం ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని చేనేత కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ విలేకరుల సమావేశంలో చేనేత కార్మిక సంఘం పట్టణ అధ్యక్షుడు ఖాదర్‌బాషా, కార్యదర్శి గుంపు హరి, సీఐటీయూ నాయకుడు ఆది నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఇరు పార్టీల సమీక్షంలో ఓటర్లు పరిశీలన



**బాలాయపల్లి (మనుసులో మాట):**

ప్రత్యేక ఓటరు సవరణ (ఎస్ఐఆర్-2026) ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల సహకారం ఇరు పార్టీల సమీక్షంలో ఓటర్లు పరిశీలన మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనువాసులు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఇరు పార్టీల సమీక్షంలో ఓటర్లు పరిశీలన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటి సర్వే ద్వారా అర్హులైన ప్రతి పౌరుడి పేరును ఓటరు జాబితాలో నమోదు చేయడం, మరణించినవారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయినవారి పేర్లను నిబంధనల ప్రకారం తొలగించడం జరుగుతుందన్నారు. ఒకే వ్యక్తి పేర్లు ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదై ఉంటే వాటిని గుర్తించి తొలగించే చర్యలు కూడా చేపడుతున్నామని వివరించారు. ఎన్నిక ల సంఘం లక్ష్యం తప్పుల్లేని, విశ్వసనీయమైన ఓటరు జాబితాను సిద్ధం చేయడమేనని చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలవారీగా ఓటరు జాబితాలను పరిశీలించి, అర్హుల పేర్లు నమోదు కాకపోయినా, అనర్హుల పేర్లు కొనసాగుతున్నా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజలు సహకరించాలని కోరారు.ఈ సందర్భంగా ఓటరు నమోదు, మార్పులు, తొలగింపులకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, అభ్యంతరాల పరి ష్కారంపై అధికారులకు ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులను వివరించారు. సవరణ ప్రక్రియను ఎలాంటి వివాదాలకు తావు లేకుండా పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. కాగా సర్ కార్యక్రమాన్ని ఈ నెల 24వ తేదీ వరకు పొడిగించినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎండీవో నారాయణ. బీఎల్ఓలు, బిఎల్ ఏల్ ఏలు, వివిద రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# అమరావతి చాంపియన్ షిప్ 2026



- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్

**నెల్లూరు, ప్రతినిధి, జూలై 14, మనసులో మాట:**

అమరావతి చాంపియన్షిప్ 2026 క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో అమరావతి చాంపియన్షిప్ 2026 నిర్వహణపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం డీఆర్ఓ విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న అమరావతి చాంపియన్షిప్ 2026లో జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావడానికి అన్ని శాఖలు సమష్టిగా కృషి చేయాలన్నారు. అండర్ 17, అండర్ 23 బాలురు, బాలికల విభాగాల్లో మొత్తం 12 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలను అమలు చేయాలని సూచించారు. జూలై 15 నుంచి 25 వరకు నియోజకవర్గ స్థాయి ఎంపిక పోటీలు, జూలై 26 నుంచి ఆగస్టు 10 వరకు జిల్లా స్థాయి అంతర్ నియోజకవర్గ పోటీలు, ఆగస్టు 20 నుంచి 26 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు, ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. పోటీల నిర్వహణకు అవసరమైన వేదికలు, మౌలిక వసతులు, తాగునీరు, వైద్య సేవలు, పారిశుద్ధ్యం, భద్రత, రవాణా, ప్రచార కార్యక్రమాలు, వాలంటీర్ల నియామకం తదితర అంశాల్లో సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను నిర్దేశిత గడువులో గా పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలోని ప్రతిభావంతులైన క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొనేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని, విద్యా శాఖ, యువజన సేవల శాఖ, క్రీడా శాఖ సంయుక్తంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎం పాండురంగారావు, మున్సిపల్ కార్పొరేషన్ స్వర్ణ అవార్డు స్వర్ణ గ్రామ అధికారి హిమబిందు, డిప్యూటీ సీఈఓ బ్రహ్మయ్య, సెట్నల్ సీఈవో నాగేశ్వరరావు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శులు రమణయ్య, దేవిక, పోలీసు, వైద్యారోగ్య, విద్య, నెహ్రూ యువ కేంద్రం, ఏపీఎస్ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

# ఐ యం ఎల్ షాపులు పై ప్రత్యేక నిఘా



**వాకాడు మనసులో మాట జూలై 14**

ఐ యం ఎల్ షాపులు పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందన్ని నూతనంగా ప్రొహిబిషన్ & ఎక్సైజ్ స్టేషన్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా భాద్యతలు తీసుకొన్న ఏ.వి.ఎస్. సురేష్‌కుమార్ అన్నారు, అనంతరం ఆయన విలేకరుల తో మాట్లాడుతూ. వాకాడు పనిచేస్తున్న ఎక్సై జ్ పి,యు,వి,ఎస్,ప్రసాద్ తిరుపతికి బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో నేను ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టానని తెలిపారు. తన స్టేషన్ పరిధిలోని 17 ఐఎంఎల్ షాపులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి శాంతి భద్రతలు కల్పిస్తానని ప్రకటించారు. వాకాడులో 4, చిట్టమూరులో 5, కోట మండలంలో 7 షాపులతో మొత్తం 17 షాపులు ఉన్నట్లు వివరించారు. సూళ్లూరుపేటలో ఎక్సైజ్ ఎస్ఐగా పని చేసిన అనుభవంతో ఇక్కడ కూడా డ్యూటీ సజావుగా నిర్వహిస్తానని, ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు.

# పీలేరులో విషాదం..

## ఆర్టీసీ బస్సు కిందపడి 17 ఏళ్ల యువతి మృతి



- పాత బస్టాండ్ సమీపంలో ఘోర ప్రమాదం.. ఎంసెట్ అర్హత సాధించిన విద్యార్థిని దుర్మరణం

**పీలేరు జులై 14 మనసులో మాట :**

అన్నమయ్య జిల్లా పీలేరులో మంగళవారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. పీలేరు ప్రభుత్వ ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయురాలు రహీమున్నీసా కుమార్తె అసిన్ తాజ్ (17) ఆర్టీసీ బస్సు కిందపడి దుర్మరణం పాలైంది. సమాచారం ప్రకారం, పీలేరు-సదుం రహదారిలోని ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న తల్లి రహీమున్నీసాను ఇంటికి తీసుకువెళ్లేందుకు అసిన్ తాజ్ అయ్యప్పరెడ్డి కాలనీ నుంచి ద్విచక్ర వాహనంపై పాఠశాల వైపు వెళ్తోంది. ఈ క్రమంలో పీలేరు పాత బస్టాండ్ సమీపానికి చేరుకోగానే ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు కిందపడింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఎంసెట్ పరీక్షలో అసిన్ తాజ్ అర్హత సాధించి, ఉన్నత విద్యలో ప్రవేశం కోసం సర్టిఫికెట్ల ధృవీకరణ (వెరిఫికేషన్) ప్రక్రియలో ఉండగా ఈ విషాదం చోటుచేసుకోవడం కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. చదువులో ప్రతిభ కనబరిచిన కుమార్తెను కోల్పోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఘటనా స్థలంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పీలేరు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ లోకేష్ సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై విచారణ కొనసాగుతోంది.

# పేదలకు వారం లేబర్ ఇన్సూరెన్స్



- తెల్ల రేషన్ కార్డు వున్న వారు అర్హులు
- ఉద్యోగస్తులు అనర్హులు
- ఏడాదికి రూ 22 లు 5 సంరాలు ఒకేసారి చెల్లించాలి,
- కేవలం రూ 110 మాత్రమే.

**బాలాయపల్లి (మనుసులో మాట) :**

పేదలకు లేబర్ ఇన్సూరెన్స్ ఎంతో భరోసాగా ఉంటుంది.18 ఏళ్ళ నుండి 55 ఏళ్ళు ఉన్న స్త్రీ,పురుషులు ఇన్సూరెన్స్ కు అర్హులు. లేబర్ ఇన్సూరెన్స్ కు ఒకసారి రూ110 చెల్లిస్తే 5 సంవ త్సరాలు వరకు ఎటువంటి నగదు చెల్లించన క్కర్లేదు.ఒక సంవత్సరానికి రూ 22 అన్నమాట అవగాహన లేక కార్మికులు మాత్రమే వర్తిస్తుందని చాలా మంది అనుకుంటారు.తెల్ల రేషన్ కార్డు కలిగి వున్న ప్రతి కుటుంబం ఈ పథకానికి అర్హులే. ప్రభుత్వ ఉద్యోగులు తప్ప ఎలాంటి కూలీలైన, ఇతరులైన లేబర్ ఇన్సూరెన్స్ కు అర్హులు, రేషన్ కార్డు,ఆధార్ కార్డు జెరాక్స్ జతపరచి.దినితోపాటు చలన జతచేసి లేబర్ కార్యాలయంలో ఇవ్వాలి.

**అధికారులు నిర్లక్ష్యం.... నష్టపోతున్న పేదలు :**

లేబర్ ఇన్సూరెన్స్ అంటే తెలియక గ్రామిణ ప్రాంతంలో ఉన్న వారు నష్టపోతున్నారు. సంబంధి తాధికారులు పట్టించుకోక పేదలకు నష్టం జరుగు తుంది.మండల కేంద్రంలో ఉన్న ప్రధాన కార్యాల యం వద్ద నోటీసు బోర్డులో పూర్తి సమాచారం అందుబాటులో ఉండాలి...మండల పరిషత్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు మాకు ఎందుకులే అనే ధోరణలో ఉండారు.దింతో పేదలకు పూర్తి అన్యాయం జరుగుతుంది.

**లేబర్ ఇన్సూరెన్స్ ప్రయోజనాలు :**

పాలసీదారుడు సహజ మరణం పొందితే రూ.1,30,000లు ఇన్సూరెన్స్ నగదు వస్తుంది.అలాగే ప్రమాద వశాత్తూ మరణం వల్ల రూ.6,000 00లు వర్తిస్తుంది.ఇక ఒక ఇంట్లో ఇద్దరు ఆడపిల్ల లు వుంటే ఒకొక్కరికి వివాహ నజరానాగా రూ 30 వేలు .ప్రసవ కానుకగా రెండు ప్రసవాలకు రూ 30 చొప్పున వచ్చే అవకాశం ఉంది.పాలసీ పొందిన ఏడాది కి లబ్ధిదారునికి ప్రమాదం జరిగి 50 శాతం వికలాంగులుగా ఉంటే రూ 2.50 లక్షలు,ఇక 100 శాతం ఉంటే రూ 5 లక్షల పరిహారం పొందే అవకాశం ఉంది.మీ మండలంలోని కార్మిక అధికారిని(లేబర్ ఆఫీసర్) ఎంపీడీఓ, ఎమ్మార్ ఓ ను సంప్రదించాలి.

# యువకుడి ఆత్మహత్య..



• ఉరివేసుకుని బలవన్మరణం

**ఉదయగిరి, జూలై 14 (మనసులో మాట):**

నెల్లూరు జిల్లా ఉదయగిరి పట్టణంలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఉదయగిరి పట్టణానికి చెందిన మట్ల మహేష్ (30) అనే యువకుడు తన నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే స్పందించినప్పటికీ అప్పటికే అతడు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న ఉదయగిరి పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. యువకుడు ఆత్మహత్యకు పాల్పడడానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కుటుంబ సభ్యులు, బంధువులు మరియు పరిసర ప్రాంతాల వారిని విచారిస్తూ అన్ని కోణాల్లో కేసును దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో ఉదయగిరి పట్టణంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడి కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

# జానకి మరణం సంగీత లోకానికి తీరని లోటు



• నియోజకవర్గ వైఎస్ఆర్సీపి అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథరెడ్డి.

**బద్వేలు , మనసులో మాట, జూలై14:**

ప్రముఖ సినీ సంగీత గాయిని, గాన కోకిల ఎస్. జానకి మరణం సినీ ప్రపంచానికి తీరని లోటు అని బద్వేల్ నియోజకవర్గం వైఎస్ఆర్సీపి అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథ్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పోరుమామిళ్ల టౌన్ నల్లేరు విశ్వనాథరెడ్డి నివాసంలో ఆమె చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నల్లేరు విశ్వనాథరెడ్డి మీడియాతో మాట్లాడుతూ సినీ ప్రపంచంలో జానకి గొప్ప శక్తిగా వెలుగొందారని, ఆమె తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషలలో పాడిన పాటలు అజరామరంగా నిలిచిపోతాయన్నారు. ముఖ్యంగా తెలుగు గడ్డపై జన్మించిన గాన కోకిల జానకి ప్రజల హృదయాలలో చిరస్మరణీయంగా నిలిచిపోయారని పేర్కొన్నారు. తెలుగు పరిశ్రమతో ఆమెకు మంచి అనుబంధం ఉందని నల్లేరు విశ్వనాథరెడ్డి వెల్లడించారు.

# నాగాలమ్మ ఆలయంలో పవన్ కళ్యాణ్ పేరుపైన హోమం

**పలమనేరు జూలై 14( మనసులో మాట) :**



ఇటీవలే పవన కళ్యాణ్ తన కుడి భుజానికి ముంబాయి కోకిలబెన్ దిరుబాయ్ అంబానీ హాస్పిటల్ లో ఆపరేషన్ చేకున్న విషయం తెలిసిందే ఆయన ఆరోగ్యంగా త్వరగా కోలుకోవాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి జనసేన నాయకుడు పులచైతన్య మోహన్ ఆధ్వర్యంలో జనసేన అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి వర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ పేరు పైన బంగారుపాళ్యంలో ఉన్న నాగులమ్మ వారి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమం అలాగే అన్నప్రసాద వితరణ చేయడం జరుగుతోంది. ఈ కార్యక్రమంలో రూరల్ మండల అధ్యక్షులు నాగరాజు మోతుకూరు, వీరమహిళ విభాగం మురారు, గంగవరం మండల నాయకులు రమేష్, పవన్ నాని, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

# బిఎల్ఓ పై దాడి చేయడం హేయమైన చర్య

• సింగమాల వెంకటేశ్వర్లు.

**బద్వేలు, మనసులో మాట,జూలై 14:**



మాసాపేట పురపాలక సచివాలయం బూత్ లెవెల్ ఆఫీసర్ మీద దాడి చేయడం హేయమైన చర్య అని వైఎస్ఆర్సిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు సింగమాల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం మాసాపేట బిఎల్ఓ మీద మాసాపేట టిడిపి ఇన్చార్జ్ రవి దాడి చేసి కొట్టడం జరిగింది. బి ఎల్ ఓ మురళి తన యొక్క బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తుంటే రవి వచ్చి అతని మీద దాడి చేయడం హేయమైన చర్య అని వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. వైయస్సార్సీపి ఉద్యోగస్తులకు ఎల్లవేళలా అండగా ఉంటుందని దాడి చేసిన వ్యక్తి మీద కేసు పెట్టి అతని కి శిక్ష పడేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్ఆర్సిపి కడప పార్టీ ఆఫీసులో వైఎస్ఆర్సిపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి కే బాబు, త్యాగరాజు, సంపత్ కుమార్, కంచుపాటి బాబు తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు జిల్లా మీడియా ఫెడరేషన్ ఆవిర్భావ కమిటీ ఏర్పాటు

• జూలై 19న ఆవిర్భావ సభ – మీడియా ప్రతినిధులకు ఆహ్వానం

**నెల్లూరు జిల్లా బ్యూరో, జూలై 14(మనసులో మాట ):**




జిల్లాలోని పాత్రికేయుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, వృత్తిపరమైన ఐక్యత లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ (ఏపీఎంఫ్ ) నెల్లూరు జిల్లా ఆవిర్భావ సభ ఈ నెల 19వ తేదీ (ఆదివారం) ఉదయం 10 గంటలకు నెల్లూరులోని రోటరీ క్లబ్, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు ఆవిర్భావ కమిటీ కన్వీనర్ ఎం. మల్లిఖార్జున్ తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర స్థాయి నాయకులు, వివిధ జిల్లాల మీడియా ప్రతినిధులు, సీనియర్ జర్నలిస్టులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. సమావేశంలో జిల్లా కమిటీ ఏర్పాటు, మీడియా రంగంలో ఎదురవుతున్న సమస్యలు, పాత్రికేయుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. సమావేశానికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం 9966497149, 9912221616, 7893461201 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# టీడీపీ యువనాయకుడు కొంకుల రవి జన్మదిన వేడుకలు



బద్వేలు,మనసులోమాట,జూలై14:

బద్వేలు నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ యువనాయకుడు కొంకుల రవి జన్మదిన వేడుకలు మంగళవారం బద్వేలు లో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకలకు బద్వేలు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి మరియు ఉమ్మడి కడప జిల్లా డీసీసీబీ చైర్మన్ మరియు బద్వేలు నియోజకవర్గ ఇన్చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి జన్మదిన కేక్ కట్ చేసి రవి ని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ యువ నాయకులు పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రజా సమస్యలపై పోరాడాలని సూచించారు. కొంకుల రవి రాజకీయంగా మరింత ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని రవి కి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు



- మండల తాసిల్దార్ విజయ్ కుమార్

సిద్ధవటం జూలై 14 (మనసులో మాట ):

ప్రభుత్వ రెవెన్యూ భూములు కబ్జా పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని కడప జిల్లా సిద్ధవటం మండల తాసిల్దార్ విజయ్ కుమార్ హెచ్చరించారు ఈ సందర్భంగా ఆయన మండల కేంద్రమైన సిద్ధవటం తాసిల్దార్ కార్యాలయంలో మంగళవారం తాసిల్దార్ మాట్లాడుతూ జ్యోతి రెవిన్యూ సర్వే నెంబర్ 143/1,143/3పొలంలో 4 ఎకరాల 80 సెంట్లు ప్రభుత్వ రెవిన్యూ పొలాన్ని కబ్జా చేసి నట్లు మా దృష్టికి ఫిర్యాదులు వచ్చాయని అటువంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకొని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని తెలిపారు, సిద్ధవటం మండలంలో ప్రభుత్వ డీకేటీ పొలాలు ఇళ్ల పట్టాలు , ప్రభుత్వ ఆస్తులు కబ్జాకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు

# 40 వ సంవత్సరం నుండి 60 వ సంవత్సరం వరకు ఆరోగ్యం విషయంలో చాల జాగ్రత్తగా ఉండాలి

- డాక్టర్ ఆర్ .శ్రీనివాస్ సలహాలు

బద్వేలు, మనసులో మాట, జూలై 14:

40 దాటేక మన జీర్ణ వ్యవస్థ కొంచెం మందగిస్తుంది దానివలన సరైన అరుగుదల లేకపోవడంతో గ్యాస్, మలబద్దకం, జీర్ణ వ్యవస్థకు సంబంధించిన రోగాలు వస్తాయి. అంతేకాకుండా వయస్సు పెరిగే కొద్ది కంటి సమస్యలు బిపి షుగర్ కీళ్ళ నొప్పులు నడుమ వెన్ను పూస బాధలు ఇలా రక రకాల రోగాలు మనల్ని వేదిస్తాయి ఈ సమయంలోనే మనం ధైర్యం గా ఉండాలి లేదంటే వయస్సుతో పాటు ఈ బాధలు మన శరీరాన్ని మనస్సు ను ఇంకా కృంగదిస్తాయి. ఒకప్పుడు కొన్ని వ్యాధులు బీపీ సుగర్ గుండె నొప్పి ఆస్తమా ఇలాంటి కొన్ని వ్యాధులు వంశపారంపర్యంగా వచ్చేవి కానీ ఇప్పుడు మారిన జీవన శైలి అలవాట్లు వల్ల మనం ఎంత జాగ్రత్తగా వున్నా ఏదో ఒక జబ్బు వచ్చేస్తుంది. మనకు వృద్ధ్యాపం వచ్చేసరికి మనం ఎన్ని మందులు వాడినా ఏదో ఒక రోగం తో మంచం ఎక్కడం ఎలాగూ తప్పదు. అంతవరకు మనం ఆరోగ్యంగా ఎలా ఉండాలో ఎలా కాపాడు కోవాలో చెపుతాను. మీ రోజువారి దినచర్య లో ఉద



యాన్నే లేవడం అలవాటు చేసుకోవాలి ఉదయం లేచిన వెంటనే ఒక లీటర్ నీళ్లు తప్పని సరిగా తాగాలి. తేలికపాటి వ్యాయమాలు వాకింగ్ చెయ్యాలి టి కాఫీలు తగ్గించి రాగి జావా తాగండి. మీ భోజనంలో పీచు పదార్థాలు ఎక్కువగా ఉండేవి తినండి భోజనంలో పెరుగు తీసుకోకుండా ఎక్కువగా మజ్జిగ తీసుకోవలెను ఈ వయస్సులో అరుగుదల తక్కువగా ఉంటుంది కనుక నాన్ వేజ్ తగ్గించండి రాత్రుళ్ళు తొందరగా భోజనం ముగించండి. రాత్రి పూట తేలికగా జీర్ణం అయ్యే ఆహారం లిమిట్ గా తినండి.తిన్నా వెంటనే పడుకోకుండా ఓ అరగంటపాటు అటు ఇటు తిరగండి ఆయా కాలంలో దొరికే ఫ్రూట్స్ తినండి ఆరోగ్యానికి మంచిది. మనస్సు ఎప్పుడూ ఉల్లాసంగా ఉత్సాహంగా ఉంచుకోవాలి బాధలు బెంగలు ఏవేవో మీకు ఉన్న సమస్యలు కోసం ఆలోచిస్తూ మనసు పాడు చేసుకోవద్దు.మీ మనస్సు బాగుంటేనే మీ ఆరోగ్యం బాగుంటుంది అని గ్రహించాలి. మీకు ఏదైనా చెడు వ్యసనాలు ఉంటే సిగరెట్, మందు, ఇలాంటివి మానేస్తే మంచిది చాలా జబ్బులు వీటి వల్లే వస్తాయి మీరు ఎక్కువ కాలం బ్రతకాలి అనుకుంటే వీటి జోలికి మాత్రం అస్సలు వెళ్లకూడదు. కనీసం అరునెలలకు ఒకసారైనా బీపీ సుగర్, గుండె చెక్ చేయించుకోవాలి. అంతకు ముందే మీకేమైనా సమస్యలు ఉంటే వాటికి సంబంధించిన మందులు క్రమం తప్పకుండా వాడుతూ ఉండాలి. ఇవన్నీ మీరు జీవితాంతం **పాటిస్తే ఏ రోగం మన దగ్గరకు రాదు** బ్రతికినంతకాలం సంతోషంగా హాయిగా గడిపేయగలము అని డాక్టర్ ఆర్ శ్రీనివాస్ తెలియజేశారు.

# ఎన్జీవో స్థలాల అక్రమాల్లో రెవెన్యూ అధికారుల పాత్రపై దర్యాప్తు

- యస్.చంద్రశేఖర్- సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు.

బద్వేలు , మనసులో మాట , జూలై 14:

1997, 1982 కాలంలో బద్వేలు ప్రాంతంలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇచ్చిన 600కు పైగా ఐదు సెంట్లు 8 సెంట్లు ఎన్జీవో స్థలాలు మరియు రెండు ఎకరాల పైబడి ఉన్న పబ్లిక్ పర్పస్ స్థలాలలోజరిగిన అక్రమాలు, ఆక్రమణలపై ఉద్యోగుల ఎస్ ఆర్ ప్రకారం విచారణ చేసి నకిలీ పట్టాల కేసులో ఇచ్చిన వాంగ్మూలంలో వెల్లడించిన ప్రకారం ఆయా స్థలాలు ఆక్రమించి లబ్ది పొందిన వారిపై కేసులు నమోదు చేసి నిజమైన లబ్దిదారులు న్యాయం చేయాలని, ఆక్రమణలో ఉన్న పబ్లిక్ పర్పస్ స్థలాలను స్వాధీనం చేసుకుని కంచి వేసి ప్రభుత్వ మరియు ప్రజా అవసరాలకు వినియోగించాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఉదయం స్థానిక బద్వేలు పట్టణం లోని భగత్ సింగ్ నగర్ లో వారి పార్టీ కార్యాలయం నందు పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, బద్వేల్ పట్టణంలోని అత్యంత విలువైన ప్రాంతమైన ఎన్జీవో ప్లాట్లలో వందల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని, ఇందులో కొంతమంది బడానేతల హస్తం, రెవెన్యూ అధికారుల చేతివాటం స్పష్టంగా కనిపిస్తున్నదని ఆయన తెలియజేశారు. 1997 వ సంవత్సరంలో సర్వేనెంబర్ 953, 955 లో 200 ఐదు సెంట్ల ప్లాట్లు, 1982లో సర్వేనెంబర్ 940,941,952,953,955,956,963,965,966 లలో 343 ఎనిమిది సెంట్ల ప్లాట్లు ప్రభుత్వ ఉద్యోగులకు మంజూరు చేశారని, ఈ సర్వే నెంబర్లు అన్నింటికీ కలిపి రెండు ఎకరాల పైబడి భవిష్యత్తు అవసరాల కోసం పబ్లిక్ పర్పస్ స్థలాలు కేటాయించారని ఆయన తెలిపారు. ఈ 600 మంది పైబడి ఉద్యోగులలో 200 మందికి పైగా తమ సొంత జిల్లాలకు బదిలీపై వెళ్లా




రని వారిలో కొంతమంది మరణించారని, వీటిని అవకాశంగా తీసుకున్న కొంతమంది బడా నేతలు రెవిన్యూ రికార్డులలో ఉన్న పేర్ల ప్రకారం నకిలీ పట్టాలు, నకిలీ డాక్యుమెంట్ సృష్టించి ఒక్కో ప్లాట్ ను 30 లక్షల నుండి 50 లక్షల వరకు అమ్మకాలు చేసి వందల కోట్ల రూపాయలు లబ్ది పొంది నిజమైన లబ్దిదారులకు మోసం చేశారని వారు ఆరోపించారు. అలాగే మొత్తం సర్వే నెంబర్లలో రెండు ఎకరాల పైబడి ఉద్యోగుల కుటుంబాల భవిష్యత్తు అవసరాల కోసం కేటాయించగా వాటిని సైతం ఆక్రమించి పెద్దపెద్ద భవనాలు గెస్ట్ హౌస్ లు నిర్మించుకొని విలాసవంతమైన జీవితాలు గడుపుతున్నారని ఆయన ఆరోపించారు. గతంలో ఇక్కడ పనిచేసిన రెవెన్యూ అధికారులు ఈ నాయకులకు వత్తాసు పలుకుతూ దూదూ బసవన్నల మాదిరి తల ఊపుతూ వారి మామూలు మత్తులో ఉంటూ వారు చెప్పిందే వేదంగా పాటిస్తూ ఇష్టం వచ్చినట్లు జీనైన్, ఎండార్స్మెంట్, పొజిషన్ సర్టిఫికెట్లు ఇస్తూ స్వామి భక్తిని చాటుకుంటూ లబ్దిదారులు వచ్చినా రెవెన్యూ సిబ్బంది మధ్యవర్తిత్వం వహిస్తూ పంచాయతీలు చేసి లబ్దిదారులను బెదిరించిన సంఘటనలు అనేకం ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి రెవెన్యూ అధికారులు ఆయా సంవత్సరాల లో ఉన్న సర్వీస్ రికార్డుల ప్రకారం లబ్దిదారులను, వారు లేకపోతే వారి కుటుంబ సభ్యులను పిలిపించి పూర్తిస్థాయి విచారణ జరిపించి వారికి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే నకిలీ పట్టాల కేసులో ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం నకిలీ పట్టాలు పొందిన వారిపై తక్షణమే ఆయా పట్టాలను రద్దుచేసి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. రెండు ఎకరాల పైబడి ఉన్న పబ్లిక్ పర్పస్ స్థలాలను ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి ఆయా స్థలాలలో హెచ్చరిక బోర్డులు వేసి కంచెలు వేసి ప్రభుత్వ మరియు ప్రజా భవిష్యత్తు అవసరాల కోసం వినియోగించాలని వారు కోరారు. ఎన్జీవో కాలనీలతో పాటు మడకలవారిపల్లి గ్రామపొలంలో సుమారు 45 లే ఔట్లలో విస్తారమైన రోడ్లను సైతం ఆక్రమించారని వాటిని సైతం స్వాధీనం చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కే జకరయ్య నియోజకవర్గ పార్టీ నాయకులు కే బాబు రామరాజు విజయరావు నారాయణ జయరామరాజు రేనాటి శీను యువజన సంఘం నాయకులు ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# పొలం గట్టు నుంచి... అమ్మవారి సన్నిధి వరకు!


వేమూరి ముసలయ్య దేవస్థాన ప్రధాన ధర్మకర్త


నూతనంగా 13 కోట్ల రూపాయలతో నిర్మాణం చేపట్టనున్న వెంగమాంబ దేవస్థానం చిత్రపటం


వేమూరి ముసలయ్య కుటుంబం


పురాతన కాలం నాటి శ్రీ వెంగమాంబ దేవస్థానం

- మట్టిలో కష్టాన్ని నేర్చుకున్నాడు... పరాయి నేలలో భవిష్యత్తును నిర్మించుకున్నాడు... ఎదిగినా పుట్టిన ఊరును మరువలేదు... చివరకు శ్రీ వెంగమాంబ సేవలో ధర్మకర్తగా నిలిచాడు... ఇదీ వేమూరి ముసలయ్య జీవనయానం

**దుత్తలూరు జూలై 14 (మనసులో మాట):**

కొన్ని జీవితాలు పుస్తకాల్లో రాయబడవు...
కాలమే వాటిని ఒక్కో అధ్యాయంగా రాస్తుంది.
కొన్ని విజయాలు ఒక్కరోజులో రావు...
వాటి వెనుక ఎన్నో ఏళ్ల చెమట ఉంటుంది.
కొంతమంది ఎంత దూరం వెళ్లినా...
వారి మనసు మాత్రం పుట్టిన ఊరి మట్టిలోనే ఉంటుంది.
వేమూరి ముసలయ్య జీవితం కూడా అలాంటి కథే..!

నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం నర్రవాడ గ్రామపంచాయతీ పరిధిలోని చిన్న పల్లె వడ్డీపాలెం. ఆ ఊరి పొలాల్లో తండ్రి వెనుక నడిచిన ఓ బాలుడు... చేతికి మట్టి అంటినా బాధపడలేదు. ఎండ మండినా వెనుదిరగలేదు. పశువుల మధ్య, పంట పొలాల మధ్య పెరిగాడు. కష్టమే జీవితం అని చిన్న వయసులోనే తెలుసుకున్నాడు. ఆ బాలుడే...నేడు శతాబ్దాల చరిత్ర కలిగిన శ్రీ వెంగమాంబ అమ్మవారి దేవస్థానం ప్రధాన ధర్మకర్తగా సేవలందిస్తున్న వేమూరి ముసలయ్య.

ఆ ఇంట్లో సంపద కంటే... సంస్కారమే ఎక్కువ

వేమూరి గురవయ్య-చిన్నక్క దంపతుల ఇంట్లో 1966 సెప్టెంబర్ 15న ముసలయ్య జన్మించారు. ముగ్గురు సంతానంలో ఆయన మూడో కుమారుడు. పెద్ద కుమారుడు వెంగయ్య, రెండో సంతానం వెంగమ్మ.

ఆ రోజుల్లో గ్రామీణ జీవితం అంటే నేటిలా సౌకర్యాలు కాదు. వ్యవసాయమే జీవితం. పశువులే కుటుంబ సంపద.

వర్షం పడితే ఆనందం... పంట పండితే పండుగ.

గురవయ్య-చిన్నక్క కుటుంబానికి ఆవులు, ఎద్దులు, గొర్రెలు, గేదెలు ఉండేవి. వ్యవసాయపరంగా స్థిరమైన కుటుంబమే అయినా... పిల్లలకు మాత్రం కష్టం విలువ తెలిసేలా పెంచారు.

ముసలయ్య కూడా చదువు ముగిసిన వెంటనే ఇంటికి వచ్చి తండ్రితో కలిసి పొలం పనుల్లో పాలుపంచుకునేవాడు. మట్టిలో నడిచిన ఆ పాదాలే... ఒకరోజు తనను జీవితంలో ఎంతో దూరం తీసుకెళ్తాయని బహుశా అప్పట్లో ఆయనకూ తెలియకపోవచ్చు.

ఒక చేతిలో పుస్తకం... మరో చేతిలో వ్యవసాయ పని

చదువు అంటే ఇష్టం. కుటుంబం అంటే బాధ్యత.

రెండింటినీ సమన్వయం చేసుకుంటూ ముసలయ్య ముందుకు సాగారు. 1982లో పదో తరగతి పూర్తి చేశారు. 1984లో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులయ్యారు.

చదువు పూర్తయింది.

ఇక జీవితం ముందు ఒక ప్రశ్నను ఉంచింది...

"ఇక్కడే ఉండిపోతావా...? లేక నీ భవిష్యత్తును నువ్వే నిర్మించుకుంటావా...?"

ముసలయ్య రెండో దారిని ఎంచుకున్నారు.

పుట్టిన ఊరిని వదిలాడు... కానీ ఊరిపై ప్రేమను కాదు

ఉపాధి కోసం అప్పటి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాల పట్టణం వెళ్లారు.

కొత్త ప్రాంతం...
తెలియని మనుషులు...
కొత్త వ్యాపారం...
కానీ వెంట తీసుకెళ్లింది మాత్రం చిన్ననాటి నుంచి నేర్చుకున్న కష్టపడే గుణం.

మంచిర్యాలలో ఇటుక బట్టీల వ్యాపారాన్ని ప్రారంభించారు. మండే ఎండల్లో ఇటుకల మధ్య గడిచిన రోజులు... వ్యాపారంలో ఎదురైన ఒడిదుడుకులు... ప్రతి రూపాయి వెనుక ఉన్న శ్రమ... ఇవన్నీ ఆయన జీవితాన్ని మరింత దృఢంగా తీర్చిదిద్దాయి.

ఐదేళ్లపాటు మంచిర్యాలలో వ్యాపారం సాగించిన అనంతరం కరీంనగర్ జిల్లాలో స్థిరపడ్డారు. 2007 వరకు ఇటుక బట్టీల వ్యాపారాన్ని కొనసాగించారు.

వడ్డీపాలెం పొలాల్లో మొదలైన కష్టం... తెలంగాణలో ఆయన భవిష్యత్తుకు పునాది వేసింది.

జీవితంలోకి అడుగుపెట్టిన శ్రీకళ

కష్టాల ప్రయాణంలో కుటుంబ జీవితం కొత్త వెలుగును తీసుకొచ్చింది.

1992 ఆగస్టు 19న కావలి పట్టణానికి చెందిన శ్రీకళతో ముసలయ్య వివాహం జరిగింది.

ఆమె రాకతో ఆయన జీవిత ప్రయాణానికి కొత్త తోడు లభించింది. వ్యాపార బాధ్యతలు... కుటుంబ బాధ్యతలు... పిల్లల భవిష్యత్తు... అన్నింటినీ సమన్వయం చేసుకుంటూ దంపతులు ముందుకు సాగారు. వారికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు వెంగళరావు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా స్థిరపడగా, చిన్న కుమారుడు వినయ్ చౌదరి అమెరికాలోని అట్లాంటాలో సాఫ్ట్‌వేర్ రంగంలో తన భవిష్యత్తును నిర్మించుకున్నారు.

ఒకప్పుడు వడ్డీపాలెం పొలాల్లో తండ్రి వెంట నడిచిన ముసలయ్య...
తన పిల్లలను ప్రపంచం నలుమూలలా ఎదిగే స్థాయికి తీసుకెళ్లారు.
తండ్రి ఇచ్చిన కష్టం విలువను తాను నేర్చుకున్నాడు...
తన పిల్లలకు విద్య విలువను అందించాడు.

**హైదరాబాద్‌లో జీవితం... గుండెల్లో మాత్రం వడ్డీపాలెమే**

2007 తర్వాత ముసలయ్య హైదరాబాద్‌లో బిల్డింగ్ మెటీరియల్ సరఫరా రంగంలో స్థిరపడ్డారు.

జీవితం మారింది.
ప్రాంతాలు మారాయి.
వ్యాపారం మారింది.
కానీ పుట్టిన ఊరిపై ప్రేమ మాత్రం మారలేదు.

స్వగ్రామానికి వచ్చిన ప్రతిసారీ ఏదో ఒక మంచి పని చేయాలనే తపన ఆయనలో ఉండేది. అన్నదానాలు నిర్వహించడం... అవసరంలో ఉన్నవారికి చేయూతనివ్వడం... శ్రీ వెంగమాంబకు సంబంధించిన దేవరింటి నిర్మాణాలకు ఆర్థిక సహాయం అందించడం... తనకున్న దాంట్లో పదిమందికి పంచడం ఆయనకు అలవాటైంది.

కొంతమంది సంపాదిస్తారు...
మరికొందరు ఆ సంపాదనలో ఇతరులకూ చోటిస్తారు.
ముసలయ్య రెండో కోవకు చెందిన వ్యక్తి.

తరతరాల బంధం... వెంగమాంబతో అనుబంధం

నర్రవాడ శ్రీ వెంగమాంబ అమ్మవారి ఆరాధనతో పచ్చవ, తుమ్మల, వేమూరి వంశాలకు తరతరాల అనుబంధం ఉందని స్థానిక చరిత్ర, సంప్రదాయం చెబుతున్నాయి.

సుమారు 500 సంవత్సరాలుగా ఈ వంశస్థులు అమ్మవారి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతూ వచ్చారని పెద్దలు పేర్కొంటారు.

ఒకప్పుడు 15½ భాగాల సంప్రదాయ వ్యవస్థ ప్రకారం దేవరిల్లు, పేరంటాలు, పుట్టినిల్లు వంటి కార్యక్రమాలను వంశస్థులు తమ సొంత ఖర్చులతో నిర్వహించేవారు.

కాలం మారింది.
తరాలు మారాయి.
ఆలయ రూపురేఖలు మారాయి.
కానీ అమ్మవారిపై భక్తి మాత్రం తరతరాలుగా కొనసాగింది.

అదే భక్తి వారసత్వం ఇప్పుడు వేమూరి ముసలయ్య భుజాలపై ఒక గొప్ప బాధ్యతగా నిలిచింది.

అది పదవి కాదు... పూర్వీకుల సేవకు కొనసాగింపు

2026 ఏప్రిల్ 1న వేమూరి ముసలయ్యను శ్రీ వెంగమాంబ దేవస్థానం ధర్మకర్తగా ప్రకటించారు. జూన్ 5న ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ఆ క్షణం ఆయనకు కేవలం ఒక పదవి లభించిన సందర్భం కాదు.

తన పూర్వీకులు సేవించిన అమ్మవారి సన్నిధిలో... అదే సేవా పరంపరను కొనసాగించే అవకాశం లభించిన అపూర్వ ఘట్టం.

ఒకప్పుడు అమ్మవారి దేవరిళ్ల నిర్మాణాలకు తనవంతు సహాయం చేసిన వ్యక్తి...
ఇప్పుడు అదే అమ్మవారి దేవస్థానం అభివృద్ధికి నాయకత్వం వహించే స్థానంలో నిలిచారు.
కాలం తిరిగింది...
సేవకు బాధ్యత తోడైంది...
భక్తికి అవకాశం దక్కింది.

బాధ్యతలు చేపట్టిన వేళ... భక్తుల కానుకల జల్లు

ముసలయ్య ధర్మకర్తగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం నిర్వహించిన ఐదు రోజుల బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారని ఆలయ వర్గాలు పేర్కొన్నాయి.

అమ్మవారి దర్శనం కోసం భక్తజనం పోటెత్తింది. కానుకలు వెల్లువెత్తాయి. ఆలయ ఆదాయం విశేషంగా నమోదైనట్లు ఎగ్జిక్యూటివ్ అధికారి ఆలా శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు.

ఇది అమ్మవారి అనుగ్రహమో... కాలం కలిసి వచ్చిన శుభసంకేతమో...

ముసలయ్య బాధ్యతలు చేపట్టిన సమయంలోనే నర్రవాడలో కనిపించిన ఆధ్యాత్మిక సందడి ఆయన జీవితంలో మరపురాని ఘట్టంగా నిలిచింది.

ఇప్పుడు ఆయన ముందున్నది... రూ.13 కోట్ల మహా బాధ్యత

శ్రీ వెంగమాంబ దేవస్థానం చరిత్రలో మరో సువర్ణ అధ్యాయానికి రంగం సిద్ధమవుతోంది.

రూ.13 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఆలయ నిర్మాణానికి 2026 జూలై 23న శంకుస్థాపన జరగనుంది.

శతాబ్దాల విశ్వాసానికి...
తరతరాల భక్తికి...
భవిష్యత్ తరాలకు...
ఒక అద్భుతమైన ఆలయాన్ని అందించాలనే మహత్తర సంకల్పం ముందుంది.
ఆ బాధ్యత ఇప్పుడు ముసలయ్య భుజాలపై ఉంది.

'నాపై ఉంచిన నమ్మకమే నా బాధ్యత'

ఇంతటి చారిత్రక దేవస్థానానికి ధర్మకర్తగా సేవ చేసే అవకాశం రావడాన్ని అమ్మవారి అనుగ్రహంగా భావిస్తున్నానని ముసలయ్య చెబుతున్నారు.

"నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను. ఆలయ అభివృద్ధికి నా వంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తాను. వంశస్థులు, భక్తులు, అధికారులు, దాతలు అందరూ సహకరించాలి. అందరి సహకారంతో అమ్మవారి ఆలయాన్ని మరింత వైభవంగా తీర్చిదిద్దాలి" అన్నది ఆయన ఆకాంక్ష.

మట్టిని మరువని మనిషి...

జీవితంలో మనిషి ఎంత సంపాదించాడన్నది ఒక లెక్క...
కానీ ఎంతమంది మనసుల్లో స్థానం సంపాదించాడన్నది మరో లెక్క.
వడ్డీపాలెంలో జన్మించిన ముసలయ్య...
పొలం గట్టుపై నడిచాడు.
తండ్రితో కలిసి చెమటోడ్చాడు.
చదువుకున్నాడు.
ఉపాధి కోసం ఊరు దాటాడు.
ఇటుక బట్టీల్లో కష్టపడ్డాడు.
వ్యాపారంలో నిలదొక్కుకున్నాడు.
కుటుంబాన్ని ఉన్నత స్థితికి తీసుకెళ్లాడు.
కానీ...
తాను నడిచిన పల్లె దారిని మరువలేదు.
తనను పెంచిన మట్టిని మరువలేదు.
తన వంశం ఆరాధించిన అమ్మవారిని మరువలేదు.
అందుకే కావచ్చు...
ఒకప్పుడు అమ్మవారి ముందు భక్తుడిగా నిలిచిన ముసలయ్యను...
కాలం నేడు అదే అమ్మవారి సేవకు ధర్మకర్తగా నిలబెట్టింది.
పొలం గట్టుపై మొదలైన అడుగులు...
పరాయి నేలపై కష్టంతో ఎదిగిన జీవితం...
సేవతో సంపాదించిన అభిమానం...
చివరకు అమ్మవారి సన్నిధిలో దక్కిన మహా బాధ్యత...
ఇదీ... వేమూరి ముసలయ్య జీవితం.
ఇది కేవలం ఒక వ్యక్తి విజయగాథ కాదు...

# మనసులో మాట

KANCHARLA

నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక








ప్రచురణ : విశాఖపట్నం -పబ్లిషర్ : కంచర్ల ఉపేంద్ర -సంపుటి : 1 -సంచిక : 315-బుధవారం-15 జూలై 2026-ఎడిటర్ : కంచర్ల అచ్యుతరావు- పేజీలు :8+16-వెల రూ.7/-

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం,తూర్పగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణ,గుంటూరు,ప్రకాశం,తిరుపతి,నెల్లూరు,కర్నూలు,కడప,హైదరాబాద్


## భారత్‌లోకి అమెరికా మాజీ సైనికులు!



- మరోసారి అక్రమ చొరబాట్ల కలకలం
- యూపీ సరిహద్దులో మాజీ నేవీ అధికారి అరెస్ట్
- మయన్మార్ మిలిటెంట్లతో సంబంధాలు
- నేపాల్ సరిహద్దు దాటేందుకు యత్నిస్తుండగా అరెస్ట్

3

## బంగ్లాదేశ్‌కు షేక్ హసీనా రాకపై ఉత్కంఠ



- స్వదేశానికి వస్తే చట్టపరమైన చర్యలు తప్పవని బంగ్లాదేశ్ మంత్రి వ్యాఖ్య
- అరెస్టు, జైలు శిక్షకు సిద్ధమేనని షేక్ హసీనా ప్రకటన
- కోర్టు తీర్పు మేరకే తదుపరి చర్యలు ఉంటాయని స్పష్టం

4

ఇరాన్ సైనిక సామర్థ్యం

## పూర్తిగా ధ్వంసం



- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన
- హర్మూజ్ నౌకలపై రక్షణకు 20 శాతం టోల్ బాదుడు

యూఎస్ కాంగ్రెస్‌కు అధికారిక సమాచారం

4



## పెరిగిన ధరలపై కాంగ్రెస్ ఆగ్రహం

- జూన్‌లో 4.38 శాతానికి చేరిన ద్రవ్యోల్బణం
- సామాన్యుడి బడ్జెట్ అతలాకుతలమైంది
- కేంద్ర ప్రభుత్వంపై జైరాం రమేశ్ విమర్శలు
- బీజేపీ పాలనలో ధరల భారమేనని మండిపాటు

**తెలంగాణ బ్యురో జూలై 14 (మనసులో మాట):**

దేశంలో రోజురోజుకూ పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలపై కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. జూన్ నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం మిగతా 2వ పేజీలో..



# ఎగరబోతున్న తెలంగాణ ఆశయాలు

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో సీఎం రేవంత్ రెడ్డి కీలక భేటీ
- ఢిల్లీ పర్యటనలో కేంద్ర మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి వరుస భేటీలు
- తెలంగాణ విమానాశ్రయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ తో చర్చలు సఫలం
- దేశ ఆర్థిక ప్రగతిలో భాగస్వామ్యం కానున్న తెలంగాణ
- రాష్ట్ర జీడీపీ వాటాను 10 శాతానికి పెంచడమే లక్ష్యమన్న సీఎం

**తెలంగాణ బ్యురో జూలై 14 (మనసులో మాట):**

తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక, ఆర్థిక ప్రగతికి విమానాశ్రయాల విస్తరణ ఎంతో అవసరమని గుర్తించిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆ దిశగా వేగంగా అడుగులు వేస్తున్నారు. తన దేశ రాజధాని ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలు నిర్వహిస్తూ అత్యంత బిజీగా గడుపుతున్నారు. రాష్ట్రానికి సంబంధించిన కీలక పెండింగ్ ప్రాజెక్టుల సాధనే లక్ష్యంగా కేంద్ర రహదారి రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై వారితో విస్తృతంగా చర్చించారు.కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, ఉన్నతాధికారులతో జరిపిన చర్చలు అత్యంత సానుకూల వాతావరణంలో ముగిశాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల పునరుద్ధరణ, నిర్మాణ పనులపై ఈ సమావేశంలో ఒక స్పష్టమైన అవగాహన కుదిరిందని మిగతా 2వ పేజీలో..

**2028 జూన్ 2 నాటికి వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుల నిర్మాణం పూర్తి**

## రూ.8.21 లక్షల కోట్ల అప్పుల భారం బీఆర్ఎస్‌దే

- బీఆర్ఎస్ పాలనలో తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టారని విమర్శ
- రెండున్నరేళ్లలో రూ.2.08 లక్షల కోట్ల అసలు, వడ్డీలు చెల్లించిన కాంగ్రెస్ ప్రభుత్వం
- అప్పులు కడుతూనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వెల్లడి
- మల్లమ్మకుంట భూసేకరణ వేగవంతానికి కలెక్టర్‌కు ఆదేశాలు
- రైతులకు పూర్తి న్యాయం.. తగిన పరిహారం అందిస్తామని హామీ
- అలంపూర్ జులేకల్ బహిరంగ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యలు

2



## కాళేశ్వరం వైఫల్యంపై బీఆర్ఎస్‌ను నిలదీసిన పొన్నం

- కాళేశ్వరం సమస్యలకు బీఆర్ఎస్ ప్రభుత్వమే బాధ్యత అని మంత్రి ఆరోపణ
- నిపుణుల సూచనల మేరకే ప్రాజెక్టులో నీటి నిల్వలు చేపడతామని స్పష్టం
- కాంగ్రెస్ ప్రభుత్వం రాకముందే ప్రాజెక్టు కుంగిపోయిందని వ్యాఖ్య
- గత పాలకుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని విమర్శ
- బీఆర్ఎస్ ప్రచారాన్ని ప్రజల ముందు తిప్పికొడతామని వెల్లడి



3



3

## సింగరేణి బొగ్గు గనులపై రాజకీయ రచ్చ

- బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలపై కిషన్‌రెడ్డి తీవ్ర విమర్శలు
- సింగరేణి భరోసా యాత్రలో ప్రభుత్వాలపై విరుచుకుపడ్డ కేంద్ర మంత్రి
- భూపాలపల్లి వేదికగా గత, ప్రస్తుత ప్రభుత్వాల తీరుపై ధ్వజమెత్తిన కిషన్‌రెడ్డి

## బోనాల పండుగలకు నిధులు విడుదల



3

- రాజధానిలో వైభవంగా ఆషాఢ బోనాల జాతర!
- జూలై 16 నుంచి నెల పాటు ఆధ్యాత్మిక శోభ
- ప్రధాన ఆలయాల్లో మొదలైన ఏర్పాట్లు
- భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు
- గోల్కొండతో మొదలై లాల్‌దర్వాజా వరకు
- బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం
- 3,427 ఆలయాలకు రూ.15 కోట్ల నిధుల విడుదల



## కాపు ఉద్యమానికి తీరని లోటు..

3

### ముద్రగడకు బండి సంజయ్ నివాళి

- కాపు జాతి ఆత్మగౌరవ పోరాటానికి ముద్రగడ చిరస్మరణీయ నాయకుడు
- ముద్రగడ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపిన బండి సంజయ్



# కాపు ఉద్యమానికి తీరని లోటు..

- కాపుల హక్కుల కోసం తన జీవితాన్నే పోరాటంగా మార్చుకున్న యోధుడు
- కాపు జాతి ఆత్మగౌరవం కోసం ఆకలిని ఆయుధంగా మార్చుకుని నిరాహార దీక్షలు చేసిన నాయకుడు
- తన ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా కాపుల హక్కుల కోసం పోరాడిన త్యాగశీలి
- లాఠీలు ఎదురైనా... అరెస్టులు ఎదురైనా... ఒత్తిళ్లు వచ్చినా వెనక్కి తగ్గని ధీరుడు ముద్రగడ
- ముద్రగడ పద్మనాభం ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా
- ముద్రగడ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



హైదరాబాద్, మనసులో మాట

పదవుల కంటే ప్రజల పక్షాన నిలబడటమే గొప్పదని చాటిన నేత ముద్రగడ పద్మనాభం అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొనియాడారు. కాపు జాతి ఆత్మగౌరవానికి ప్రతీక ముద్రగడ అని అభివర్ణించారు. కాపుల హక్కుల కోసం తన జీవితాన్నే పోరాటంగా మార్చుకున్న యోధుడు. కాపు జాతి ఆత్మగౌరవం కోసం ఆకలిని ఆయుధంగా మార్చుకుని నిరాహార దీక్షలు చేసిన నాయకుడు ముద్రగడ పద్మనాభం మరణం తనను తీవ్రంగా కలిచి వేసిందని పేర్కొన్నారు. ముద్రగడ పద్మనాభం మరణవార్త తెలుసుకున్న బండి సంజయ్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఏమన్నారంటే..

ఆంధ్రప్రదేశ్ రాజకీయ, సామాజిక చరిత్రలో కాపు ఉద్యమం గురించి ప్రస్తావన వచ్చినప్పుడల్లా ముందుగా గుర్తుకు వచ్చే పేరు ముద్రగడ పద్మనాభం. కాపు సామాజిక వర్గం హక్కులు, ఆత్మగౌరవం, రాజకీయ ప్రాధాన్యం కోసం దశాబ్దాలుగా నిరంతరంగా పోరాడిన నాయకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు.

తూర్పుగోదావరి జిల్లాలోని కిర్లంపూడి కేంద్రంగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన ముద్రగడ పద్మనాభం, ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రజలకు సేవలందించారు. అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే కాకుండా, అధికారానికి దూరంగా ఉన్న సమయంలో కూడా ప్రజా సమస్యలపై తన గళాన్ని వినిపించడం ఆయన ప్రత్యేకత. ముఖ్యంగా కాపు సామాజిక వర్గానికి రిజర్వేషన్లు, సముచిత గుర్తింపు కల్పించాలనే డిమాండ్‌తో చేపట్టిన ఉద్యమాలు రాష్ట్ర రాజకీయాల్లో విశేష ప్రభావం చూపాయి.

కాపు సమాజం ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంలో ముద్రగడ కీలక పాత్ర పోషించారు. తన డిమాండ్ల సాధన కోసం నిరాహార దీక్షలు, నిరసన కార్యక్రమాలు చేపట్టి ఉద్యమానికి కొత్త ఊపును తీసుకువచ్చారు. అనేక సందర్భాల్లో వ్యక్తిగత ఇబ్బందులను, రాజకీయ ఒత్తిడులను ఎదుర్కొన్నప్పటికీ తన లక్ష్యం నుంచి వెనక్కి తగ్గకపోవడం ఆయన సంకల్పబలానికి నిదర్శనం. ముద్రగడ పద్మనాభం వ్యక్తిత్వంలో నిక్కచ్చితనం, ధైర్యం, నిబద్ధత ప్రధానంగా కనిపిస్తాయి. రాజకీయ లాభనష్టాలను పక్కనపెట్టి తాను నమ్మిన అంశంపై చివరి వరకు నిలబడే నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. కాపు సమాజంలోని అనేక మంది ఆయనను ఉద్యమ స్ఫూర్తిగా, ఆత్మగౌరవ ప్రతీకగా భావిస్తారు.

నేటి రాజకీయ పరిస్థితుల్లో కూడా ముద్రగడ పేరు కాపు సమాజంలో విశేష ప్రభావాన్ని కలిగి ఉంది. ఆయన చేసిన పోరాటాలు, ఉద్యమాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి. కాపు జాతి హక్కుల కోసం అంకితభావంతో పనిచేసిన ఉద్యమనేతగా ముద్రగడ పద్మనాభం పేరు ఆంధ్రప్రదేశ్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది.



# హైదరాబాద్‌లో బ్రిక్స్ సదస్సు..

- ఉద్యోగ భద్రతపై మంత్రి వివేక్ కీలక వ్యాఖ్యలు
- హైదరాబాద్‌లో ప్రారంభమైన 15వ బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరమ్ సదస్సు
- ఉద్యోగ భద్రత ఉంటేనే ఉత్పాదకత పెరుగుతుందన్న మంత్రి వివేక్
- పదేళ్లలో 17 కోట్ల ఉద్యోగాలు సృష్టించామని తెలిపిన కేంద్ర మంత్రి మాండవీయ
- 14 దేశాల నుంచి 110 మంది ప్రతినిధులు హాజరు

హైదరాబాద్, మనసులో మాట

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించినప్పుడే వారి నుంచి మెరుగైన ఉత్పాదకతను సాధించగలమని తెలంగాణ కార్మిక, ఉపాధి శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. బ్రిక్స్ దేశాలు సామాజిక భద్రతా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలని, కార్మిక హక్కులను పరిరక్షించడంతో పాటు నైపుణ్యాభివృద్ధిలో పెట్టుబడులు పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని మారియట్ హోటల్‌లో భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) ఆధ్వర్యంలో ప్రారంభమైన 15వ బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరమ్ సమ్మిట్ 2026 ప్రారంభోత్సవంలో మంత్రి వివేక్ ప్రసంగించారు. జులై 14 నుంచి 16 వరకు మూడు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సుకు బ్రెజిల్, రష్యా, చైనా, దక్షిణాఫ్రికా సహా 14 దేశాల నుంచి దాదాపు 110 మంది ప్రతినిధులు హాజరయ్యారు. కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ఈ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సామాజిక భద్రత, నైపుణ్యాభివృద్ధి, కృత్రిమ మేధ (ఏఐ) వంటి రంగాల్లో బ్రిక్స్ దేశాల మధ్య పరస్పర సహకారానికి అపార అవకాశాలు ఉన్నాయని తెలిపారు. గత పదేళ్ల కాలంలో భారత్‌లో సుమారు 17 కోట్ల ఉద్యోగాలను సృష్టించామని, 2017లో 6 శాతంగా ఉన్న నిరుద్యోగిత రేటు 2025 నాటికి 3.1 శాతానికి తగ్గిందని వెల్లడించారు. ఇదే సమయంలో మహిళ ఉపాధి రేటు 22 శాతం నుంచి 38.8 శాతానికి వృద్ధి చెందిందని వివరించారు. రాబోయే రెండేళ్లలో వ్యవస్థీకృత రంగంలో 3.5 కోట్ల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా 'ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన'ను ప్రవేశపెట్టినట్లు మాండవీయ తెలిపారు. మరోవైపు, తెలంగాణలో యువతకు ఆధునిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇచ్చేందుకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేశామని మంత్రి వివేక్ వెల్లడించారు.

# ఎగరబోతున్న తెలంగాణ ఆశయాలు

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు గురించి ప్రస్తావించినా, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తక్షణమే స్పందించి అధికారులను ఆదేశిస్తున్నారని కొనియాడారు. తెలంగాణ ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి కేంద్రం నుంచి సంపూర్ణ సహకారం అందుతోందని రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల నిర్మాణ పనులను ఒక నిర్దిష్ట కాలపరిమితిలోగా పూర్తి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్ణయించాయి. వచ్చే 2028 జూన్ 2 నాటికి, అంటే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నాటికి ఈ రెండు విమానాశ్రయాల పనులను వంద శాతం పూర్తి చేసి, అదే రోజు భక్తులు, ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని ఒక స్పష్టమైన లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు రేవంత్ రెడ్డి ప్రకటించారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సైతం దీనిపై స్పందిస్తూ.. నిర్దేశిత గడువు లోపే విమానాశ్రయాల నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. వరంగల్ (మామునూరు) విమానాశ్రయాన్ని కేవలం ఒక సాధారణ ఎయిర్‌పోర్ట్‌లా కాకుండా అంతర్జాతీయ ప్రమాణాలతో అద్భుతంగా నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఓరుగల్లు వైభవాన్ని ప్రతిబింబించేలా, కాకతీయ సంస్కృతి, కళాఖండాల ఆకృతులతో ఈ విమానాశ్రయం యొక్క ప్రధాన కట్టడాలను డిజైన్ చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు.



దీనివల్ల వరంగల్ ప్రాంత పర్యాటక రంగానికి, పరిశ్రమల స్థాపనకు సరికొత్త ఊపు వస్తుందని, స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. భారత రక్షణ రంగానికి (డిఫెన్స్) వ్యూహాత్మకంగా ఆదిలాబాద్ విమానాశ్రయం ఎంతో అవసరమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాయి. ఈ ఎయిర్‌పోర్ట్ విస్తరణ మరియు పూర్తి స్థాయి నిర్మాణానికి గానూ రాష్ట్ర ప్రభుత్వం తరపున మరో 1500 ఎకరాల భూమిని సేకరించి కేంద్రానికి అప్పగించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సరిహద్దు జిల్లాలో ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే అటు సైనిక అవసరాలకు, ఇటు వెనుకబడిన ఆదిలాబాద్ ప్రాంత ఆర్థిక ప్రగతికి ఎంతో మేలు జరుగుతుందని ఇరుపక్షాలు అభిప్రాయపడ్డాయి. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 'వికసిత్ భారత్' నినాదంతో 2045 నాటికి దేశాన్ని 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని పెద్ద లక్ష్యాన్ని పెట్టుకుందని, ఇందులో తెలంగాణ భాగస్వామ్యం వహిస్తుందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దేశ జనాభాలో కేవలం 2.50 శాతం మాత్రమే ఉన్న తెలంగాణ, దేశ మొత్తం జీడీపీలో 5 శాతం వాటాను కలిగి ఉండటం గర్వకారణమన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు, పరిశ్రమలు రావాలంటే విమానాశ్రయాల అనుసంధానత చాలా ముఖ్యమని, అందుకే తెలంగాణ జీడీపీ వాటాను 5 శాతం నుండి 10 శాతానికి పెంచేలా ప్రణాళికలు రూపొందించామని సీఎం వివరించారు.

కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక 'ఉడాన్' పథకం కింద దేశవ్యాప్తంగా ప్రాంతీయ విమానయాన రంగాన్ని బలోపేతం చేసేందుకు రూ.30 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు కేంద్ర పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు ఈ సందర్భంగా వెల్లడించారు. ఇందులో భాగంగానే తెలంగాణలోని వరంగల్, ఆదిలాబాద్ ప్రాజెక్టులకు అవసరమైన నిధులు, సాంకేతిక అనుమతులు వేగంగా మంజూరు చేస్తామన్నారు. అభివృద్ధి పనుల విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సంపూర్ణంగా సహకరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా కేంద్రమంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.రాజకీయాలు ఎలా ఉన్నా, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధే ఏకైక లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సహకార స్ఫూర్తి (ఫెడరల్ స్ఫూర్తి) నిరంతరం కొనసాగుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేంద్రాన్ని డిమాండ్ చేసి, ఒప్పించి రాష్ట్రానికి రావలసిన నిధులను, ప్రాజెక్టులను సాధించుకుంటామన్నారు. రాబోయే పార్లమెంట్ సమావేశాల సమయంలో తాను మళ్లీ ఢిల్లీకి వస్తానని, ఆ సమయంలో మిగిలిన కేంద్ర మంత్రులను కూడా వ్యక్తిగతంగా కలిసి రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన మరిన్ని అంశాలపై చర్చిస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియా ముఖంగా స్పష్టం చేశారు.

# రూ. 8.21 లక్షల కోట్ల అప్పుల భారం బీఆర్ఎస్‌దే: భట్టి విక్రమార్క

హైదరాబాద్, మనసులో మాట

గత బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని నిలువునా దోపిడీ చేసి, రూ. 8 లక్షల 21 వేల కోట్ల అపారమైన అప్పుల ఊబిలోకి నెట్టేసిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

అలంపూర్ నియోజకవర్గం వడ్డేపల్లి మండలం జులేకల్ గ్రామంలో ఏఐసీసీ సెక్రెటరీ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్సీ సంపత్ కుమార్ అధ్యక్షతన జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నాడు తాము రాష్ట్రాన్ని మిగులు బడ్జెట్‌తో, ధనిక రాష్ట్రంగా అప్పగిస్తే.. గత పాలకుల పదేళ్ల అనాలోచిత నిర్ణయాలు, అవినీతి వల్ల తెలంగాణ అప్పుల కుప్పగా మారిందని మండిపడ్డారు.

**రెండున్నరేళ్లలోనే రూ. 2.08 లక్షల కోట్ల చెల్లింపులు**

గత ప్రభుత్వం తెచ్చిన అప్పుల వల్ల ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆర్థిక భారం పడిందని డిప్యూటీ సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన ఈ రెండున్నర సంవత్సరాల కాలంలోనే బిఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన అప్పులకు సంబంధించి రూ. 2 లక్షల 8 వేల కోట్ల అసలు, వడ్డీలను బ్యాంకులకు చెల్లించాల్సి వచ్చిందని వెల్లడించారు. "రూ. 8 లక్షల 21 వేల కోట్ల భారీ అప్పులు తెచ్చి ఆ నిధులను ఏం చేశారయ్యా? రాష్ట్రంపై పడి దోపిడీ చేశారు తప్ప రాష్ట్ర ప్రజలకు పైసా మేలు చేయలేదు. ఇంత ఆర్థిక సంక్షోభంలోనూ మేము ప్రతినెలా రూపాయి రూపాయి పోగేస్తూ.. పాత అప్పులు కడుతూనే సంక్షేమ పథకాలను విజయవంతంగా కొనసాగిస్తున్నాం" అని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గత ప్రభుత్వ అప్పుల భారాన్ని మోస్తూనే, నాడు ప్రారంభించిన 'షాదీ ముబారక్', 'కల్యాణలక్ష్మి' వంటి పథకాలను ఆపకుండా కంటిన్యూ చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. వీటితో పాటు అదనంగా అనేక విప్లవాత్మక కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు. తమ ప్రభుత్వం పాత పథకాలను కొనసాగిస్తూనే, అదనంగా ప్రతినెలా ఉద్యోగులకు సకాలంలో జీతాలు, రైతులకు ఉచిత కరెంట్ ఇస్తోందని, మహిళల ఉచిత ప్రయాణానికి గానూ రూ. 12 వేల కోట్లను ఆర్టీసీకి చెల్లించిందని వివరించారు. రూ. 22,500 కోట్లతో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు, అంతర్జాతీయ ప్రమాణాలతో 100 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాగిజావతో కూడిన ఉదయం అల్పాహారం వంటి విప్లవాత్మక మార్పులు తెచ్చామని చెప్పారు. రాబోయే నవంబర్‌లో ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా రూ. 5 లక్షల 'ఇందిరమ్మ బీమా' పథకాన్ని ప్రారంభించబోతున్నామని ఆయన ఈ సందర్భంగా ప్రకటించారు.

**మళ్లీ వచ్చి ఏం బంద్ చేస్తారు?**

పదేళ్ల పాటు రాష్ట్రాన్ని నిలువునా దోపిడీ చేసి, ప్రజలను తాకట్టు పెట్టిన వారు ఇప్పుడు మళ్లీ వస్తున్నామంటూ ప్రగల్భాలు పలుకుతున్నారని భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

"మళ్లీ అధికారంలోకి వచ్చి ఏం చేస్తారు?



పేదలకు ఇచ్చే 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కట్ చేస్తారా? ప్రతి కుటుంబానికి ఇస్తున్న సన్న బియ్యాన్ని ఆపేస్తారా? కోటి 15 లక్షల కుటుంబాలకు రక్షణగా నిలిచే రూ. 5 లక్షల ఇందిరమ్మ బీమాను రద్దు చేస్తారా? లేక మహిళల ఉచిత బస్సు ప్రయాణాన్ని, డ్వాక్రా మహిళలకు అందిస్తున్న రూ. 76 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను బంద్ చేస్తారా?" అని బిఆర్ఎస్ నాయకులను నిలదీశారు.

**మల్లమ్మకుంట భూసేకరణకు నేడే ఆదేశాలు**

పాలమూరు జిల్లా వలసల నివారణకు, వెనుకబడిన ప్రాంతాల సాగునీటి అవసరాలు తీర్చడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం పునరుద్ఘాటించారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో నార్లాపూర్ నుంచి ఉద్దండాపూర్ వరకు పెండింగ్ పనులను వేగవంతం చేశామని, భూసేకరణ నిధులన్నింటినీ క్లియర్ చేశామని చెప్పారు. ఆర్డీఎస్ (RDS) పరిధిలోని తుమ్మిళ్ల ప్రాజెక్టులో భాగంగా మల్లమ్మకుంట రిజర్వాయర్ నింపడానికి అవసరమైన 573 ఎకరాల భూసేకరణ ప్రక్రియను యుద్ధప్రతిపాదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఈ రోజే ఆదేశించనున్నట్లు ప్రకటించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా దాదాపు 87,500 ఎకరాలకు సాగునీరు అందుతుందని భరోసా ఇచ్చారు.

**బాలికల కోసం ప్రత్యేక జూనియర్ కళాశాల**

స్థానికంగా బాలికల కోసం ప్రత్యేక జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలన్న ప్రజల విన్నపంపై ఆయన సానుకూలంగా స్పందించారు. ప్రస్తుతం విద్యాశాఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారే పర్యవేక్షిస్తున్నారని చెబుతూ.. మహిళా విద్యపై సీఎంకు ఉన్న ప్రత్యేక శ్రద్ధను గుర్తు చేశారు. బాలికల కాలేజీ ఏర్పాటు అంశాన్ని వెంటనే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, త్వరలోనే అనుమతులు మంజూరు చేయించేందుకు చొరవ చూపుతానని హామీ ఇచ్చారు.ఈ సభలో మంత్రివర్యులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, స్థానిక పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి మాట్లాడారు.

**రైతులకు అన్యాయం జరగనివ్వం**

భూమితో రైతుకు ఉండే భావోద్వేగ బంధం తమ ప్రభుత్వానికి బాగా తెలుసని భట్టి విక్రమార్క అన్నారు. ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా, తక్కువ ధర నిర్ణయించి ఇబ్బంది పెట్టే పరిస్థితి ఉండబోదని స్పష్టం చేశారు.

# పెరిగిన ధరలపై కాంగ్రెస్ ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

ఒక్కసారిగా 4.38 శాతానికి పెరగడంతో మోదీ ప్రభుత్వంపై విమర్శల దాడిని ముమ్మరం చేసింది. గత 12 ఏళ్లుగా కొనసాగుతున్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రభుత్వ పాలనలో ధరల పెరుగుదల కారణంగా దేశంలోని సామాన్య, మధ్యతరగతి కుటుంబాల బడ్జెట్ పూర్తిగా అతలాకుతలమైందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మండిపడ్డారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్) లో ఒక సుదీర్ఘమైన పోస్ట్ చేస్తూ కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగట్టారు.

బీజేపీ ప్రభుత్వ 12 ఏళ్ల పాలనలో దేశ ప్రజలకు తప్పుడు హామీలు ఇవ్వడం మాత్రమే పెరిగిందని జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు. క్షేత్రస్థాయిలో మాత్రం ద్రవ్యోల్బణం, తీవ్రమైన నిరుద్యోగం రూపంలో సామాన్య ప్రజలపై ప్రభుత్వం పెను భారాన్ని మోపిందని విమర్శించారు. ప్రభుత్వ అధికారిక గణాంకాలే జూన్ నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం ఏకంగా 17 నెలల గరిష్ఠ స్థాయికి చేరినట్లు స్పష్టంగా చూపిస్తున్నాయని ఆయన గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా ప్రజలు ధరల పెరుగుదలతో ఇంతలా ఇబ్బందులు పడుతుంటే, ప్రధాని నరేంద్ర మోదీ దీనిపై ఎప్పుడు స్పందిస్తారని, సామాన్యుల కష్టాల గురించి ఎప్పుడు మాట్లాడతారని జైరాం రమేశ్ సూటిగా ప్రశ్నించారు.

జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) తాజాగా విడుదల చేసిన నివేదికల ప్రకారం, మే నెలలో 3.93 శాతంగా నమోదైన వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం, జూన్ వచ్చేసరికి ఒక్కసారిగా 4.38 శాతానికి పెరిగింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నిర్దేశించుకున్న 4 శాతం ద్రవ్యోల్బణ నియంత్రణ లక్ష్య మార్కును ఇది దాటడం గమనార్హం. జనవరి నెల నుంచి అమల్లోకి వచ్చిన 2024 ప్రాతిపదిక సంవత్సరపు కొత్త శ్రేణి లెక్కల ప్రకారం, ద్రవ్యోల్బణం ఈ 4 శాతం మార్కును అధిగమించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం.

దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం ఈ స్థాయిలో పెరగడానికి ప్రధాన కారణం ఆహార వస్తువుల ధరలు విపరీతంగా పెరగడమేనని ప్రభుత్వ అధికారులు సైతం అంగీకరిస్తున్నారు. మే నెలలో 4.78 శాతంగా ఉన్న ఆహార ద్రవ్యోల్బణం, జూన్ నాటికి 5.32 శాతానికి చేరింది. ముఖ్యంగా వెండి, బంగారం, వజ్రాలు వంటి ఆభరణాలతో పాటు వంటింట్లో నిత్యం వాడే అల్లం, టమాటా, కిస్మిస్ వంటి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకాయి. మరోవైపు బంగాళాదుంప, బఠానీలు, జీలకర్రతో పాటు కార్లు, మోటార్‌సైకిళ్లు, స్కూటర్ల ధరల పెరుగుదల వేగం కొంత తక్కువగా నమోదైనట్లు ఎన్ఎస్ఓ తన నివేదికలో వెల్లడించింది.

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాలను పరిశీలిస్తే ధరల పెరుగుదల ప్రభావం పట్టణ ప్రాంతాల కంటే గ్రామీణ ప్రాంతాలపైనే చాలా ఎక్కువగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. దేశవ్యాప్తంగా సగటు రిటైల్ ద్రవ్యోల్బణం 4.38 శాతంగా ఉంటే, పల్లెటూళ్లలో ఇది ఏకంగా 4.74 శాతంగా నమోదైంది. అదే సమయంలో పట్టణ ప్రాంతాలలో ద్రవ్యోల్బణం రేటు 3.92 శాతంగా



ఉంది. ఈ లెక్కలను బట్టి చూస్తే, ఆర్థికంగా వెనుకబడిన గ్రామీణ ప్రజలు నిత్యావసర వస్తువులను కొనుగోలు చేయడానికి పట్టణ వాసుల కంటే ఎక్కువ డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోందని తెలుస్తోంది.

ద్రవ్యోల్బణం గరిష్ఠ స్థాయికి చేరడం వల్ల భవిష్యత్తులో దేశంలో బ్యాంకు వడ్డీ రేట్లు కూడా మరింత పెరిగే ప్రమాదం ఉందని జైరాం రమేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. అదే గనుక జరిగితే, బ్యాంకుల నుంచి గృహ రుణాలు (హోమ్ లోన్స్), వాహన రుణాలు తీసుకున్న మధ్యతరగతి ప్రజల నెలవారీ ఈఎంఐలు మరింత భారం కానున్నాయని హెచ్చరించారు. ఇప్పటికే ధరల దెబ్బకు సతమతమవుతున్న సామాన్యులపై ఈ వడ్డీ రేట్ల పెంపు అనేది కోలుకోలేని అదనపు భారంగా మారుతుందని ఆయన స్పష్టం చేశారు.

దేశంలో ఒకవైపు సామాన్య ప్రజలు రోజువారీ ఖర్చులకే ఇబ్బంది పడుతుంటే, పెద్ద పెద్ద పారిశ్రామిక వర్గాలు మరియు కార్పొరేట్ సంస్థల లాభాలు మాత్రం విపరీతంగా పెరుగుతున్నాయని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఆరోపించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కేవలం బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలకు, వారి లాభాలకు మాత్రమే అండగా నిలుస్తోందని మండిపడ్డారు. ధరల భారాన్ని మాత్రం ఏమీ లేని సామాన్య ప్రజల నెత్తిన రుద్దుతున్నారని, ఇదెక్కడి న్యాయమని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ విధానాలన్నీ సామాన్యుడిని దోచి కార్పొరేట్లకు పెట్టేలా ఉన్నాయని విమర్శించారు.

ద్రవ్యోల్బణంతో పాటు ప్రధాని నరేంద్ర మోదీ అవినీతి వ్యతిరేక వైఖరిని కూడా జైరాం రమేశ్ తీవ్రంగా తప్పుపట్టారు. ప్రధాని పదవి చేపట్టే సమయంలో మోదీ ఇచ్చిన హామీలన్నీ కేవలం బూటకపు మాటలేనని కొట్టిపారేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలో 'కనీస పాలన.. గరిష్ఠంగా నిజాలను కప్పిపుచ్చే ధోరణి' మాత్రమే కనిపిస్తోందని విమర్శించారు. వివాదాస్పద ఎన్నికల బాండ్ల పథకం, రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు, గుజరాత్ పెట్రోలియం కార్పొరేషన్ ఆయిల్ వ్యవహారాలపై కేంద్రం నుంచి ఇప్పటికీ సరైన సమాధానాలు రాలేదన్నారు. అలాగే పీఎం కేర్స్ నిధి నిర్వహణలో ఎలాంటి పారదర్శకత లేదని, అయోధ్య రామమందిర విరాళాల కేసులోనూ పూర్తిస్థాయి పారదర్శకత అవసరమని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ పనితీరుపై కూడా కాంగ్రెస్ పార్టీ తరఫున ఆయన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు.

# సింగరేణి బొగ్గు గనులపై రాజకీయ రచ్చ

- బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలపై కిషన్‌రెడ్డి నిప్పులు
- సింగరేణి భరోసా యాత్రలో కిషన్‌రెడ్డి ఆగ్రహం
- భూపాలపల్లి వేదికగా గత, ప్రస్తుత పాలకులపై విమర్శలు
- కేసీఆర్ చేతుల్లో జేబు సంస్థగా మారిన సింగరేణి
- పదిహేనేళ్లు వెనక్కి నెట్టేసారంటూ కేంద్రమంత్రి ఆరోపణ
- కార్మికుల కష్టార్జితాన్ని లూటీ చేశారంటూ కిషన్‌రెడ్డి మండిపాటు
- సొంత నియోజకవర్గాలకే సింగరేణి నిధుల మళ్ళింపు
- బొగ్గు గనుల ప్రాంతాల నిర్లక్ష్యంపై తీవ్ర ధ్వజం

తెలంగాణ బ్యూరో, మనసులో మాట

తెలంగాణ గుండెకాయ లాంటి సింగరేణి బొగ్గు గనుల రక్షణే ధ్యేయంగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) చేపట్టిన 'సింగరేణి భరోసా యాత్ర' రెండో రోజుకు చేరుకుంది. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన ఈ భారీ బహిరంగ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రగతికి ఊపిరిగా నిలిచిన సింగరేణి సంస్థను గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తమ స్వార్థ రాజకీయాల కోసం ఎలా వాడుకుంటున్నాయో ఆధారాలతో సహా వివరించారు. ఈ రెండు పార్టీల నిర్లక్ష్యం వల్ల సింగరేణి కార్మికులు ఈరోజు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.



గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) సింగరేణి సంస్థను తన సొంత జేబు సంస్థగా మార్చుకున్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఒకనాడు లాభాల బాటలో నడిచిన ఈ ప్రభుత్వ రంగ సంస్థ.. కేసీఆర్ తీసుకున్న తప్పుడు నిర్ణయాలు, అవినీతి విధానాల వల్ల ఏకంగా 15 సంవత్సరాలు వెనక్కి పడిపోయిందని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబ సభ్యులు, వారి అనుచరులు సింగరేణి కాంట్రాక్టులను దక్కించుకుని వేల కోట్ల రూపాయలను నిస్సిగ్గుగా దోచుకున్నారని, దీనివల్ల సంస్థ ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ తిన్నదని కిషన్ రెడ్డి దుయ్యబట్టారు. తెలంగాణ బొగ్గు గనుల్లో రాత్రింబగళ్లు కష్టపడి పని చేస్తున్న కార్మికుల చెమట చుక్కలతో సింగరేణి లాభాలను గడిస్తోందని, కానీ పాలకులు మాత్రం ఆ సంస్థను తమ సొంత ఆస్తిలా భావిస్తున్నారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు గానీ, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పాలకులు గానీ సింగరేణిని తమ 'తాత జాగీరు' లాగా వాడుకుంటున్నారని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. కార్మికుల సంక్షేమాన్ని గాలికొదిలేసి, సంస్థ నిధులను ఇతర అవసరాలకు తరలిస్తూ కార్మికుల నమ్మకాన్ని వమ్ము చేస్తున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం సంస్థకు ఆశించిన స్థాయిలో లాభాలు లేకపోవడంతో కార్మికులు తమ భవిష్యత్తుపై తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. సింగరేణి సంస్థ ద్వారా వచ్చే లాభాలను, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులను చట్టప్రకారం బొగ్గు గనులు ఉన్న ప్రాంతాల అభివృద్ధి కోసమే ఖర్చు చేయాల్సి ఉంటుంది. భూపాలపల్లి, కొత్తగూడెం, మంచిర్యాల వంటి ప్రాంతాల ప్రజల తాగునీరు, రోడ్లు, విద్య, వైద్య అవసరాల కోసం ఈ నిధులు వాడాలి. కానీ, గత కేసీఆర్ ప్రభుత్వం ఈ నిధులను సింగరేణి ప్రాంతంలో ఖర్చు చేయకుండా.. కేసీఆర్ కుటుంబ సభ్యులైన కేటీఆర్, హరీష్ రావు ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల, సిద్ధపేట, గజ్వేల్ వంటి సొంత నియోజకవర్గాలకు చట్టవిరుద్ధంగా మళ్లించారని కిషన్ రెడ్డి ఆరోపించారు. ఇది సింగరేణి ప్రాంత ప్రజలకు చేసిన ద్రోహమని ఆయన అన్నారు. సింగరేణి సంస్థను మరింత విస్తరించి, లాభాల బాటలోకి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో కేంద్రంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం అదనంగా కొత్త కోల్ బ్లాకులను (బొగ్గు గనులు) కేటాయించినప్పటికీ, కేసీఆర్ ప్రభుత్వం వాటిని ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. కేవలం రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే కేంద్రం ఇచ్చిన అవకాశాలను బీఆర్ఎస్ సర్కార్ కాలరాసిందన్నారు. పైగా, సింగరేణి సమస్యలు లేదా అభివృద్ధి ప్రాజెక్టుల గురించి కేసీఆర్ తన పాలనా కాలంలో ఒక్కసారి కూడా కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపలేదని కిషన్ రెడ్డి వెల్లడించారు. కేవలం బీఆర్ఎస్ ప్రభుత్వమే కాకుండా, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తోందని కిషన్ రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ పాలన ముగిసే సమయానికి తెలంగాణ జెన్‌కోకు కేవలం రూ.8,958 కోట్ల అప్పులు ఉంటే, ప్రస్తుతం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన కొన్ని నెలల్లోనే ఆ అప్పులు ఏకంగా రూ.26,875 కోట్లకు చేరుకున్నాయని అధికారిక గణాంకాలను బయటపెట్టారు. ఈ అప్పులను పూడ్చుకోవడానికి, కొత్తగా అప్పులు తెచ్చుకోవడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏకంగా అధికారులను, కేంద్ర సంస్థలను బెదిరించే స్థాయికి దిగజారిందని కిషన్ రెడ్డి విమర్శించారు. సింగరేణి సంస్థను నిర్వీర్యం చేసేందుకు కొందరు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని కిషన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణి గనుల్లో నాణ్యమైన బొగ్గు లభించడం లేదని, ఇక్కడి బొగ్గు వాడకం లాభదాయకం కాదంటూ పనిగట్టుకుని చేస్తున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. ఇలాంటి ప్రచారం చేయడం వల్ల సంస్థ ప్రతిష్ట అంతర్జాతీయంగా దెబ్బతింటుందని, ఇది చాలా ప్రమాదకరమైన విషయమని హెచ్చరించారు. సింగరేణి బొగ్గుకు ఎంతో డిమాండ్ ఉందని, కేవలం ప్రభుత్వాల అసమర్థత వల్లే ఈ విధమైన వదంతులు వ్యాప్తి చెందుతున్నాయని, దీనివల్ల కార్మికుల్లో అభద్రతాభావం పెరుగుతోందని అన్నారు. సింగరేణి సంస్థ మళ్లీ పూర్వ వైభవాన్ని సాధించాలంటే కొత్త బొగ్గు గనుల తవ్వకాలు వేగవంతం కావాలని కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా తాడిచర్ల 2 బొగ్గు బ్లాక్ అందుబాటులోకి వస్తే సింగరేణి సంస్థకు భారీగా లాభాలు చేకూరుతాయని, కార్మికుల ఉద్యోగ భద్రతకు ఢోకా ఉండదని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు విజయవంతం కావడానికి కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సింగరేణి కార్మికుల ప్రయోజనాల కోసం బీజేపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, భరోసా యాత్ర ద్వారా కార్మికుల గొంతుకగా నిలుస్తామని కిషన్ రెడ్డి భరోసా ఇచ్చారు.

# బోనాల పండుగలకు నిధులు విడుదల

- ఆలయాల అభివృద్ధి, నిర్వహణ కోసం భారీగా కేటాయింపులు

తెలంగాణ బ్యూరో, మనసులో మాట

తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి, ఆచార సంప్రదాయాలకు నిలువుటద్దంగా నిలిచే ఆషాఢ మాస బోనాల ఉత్సవాలను ఈ ఏడాది అత్యంత ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లోని ఆలయాలన్నీ భక్తజనంతో కిక్కిరిసిపోనున్నాయి. ఈ మహోత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో, కన్నుల పండుగగా నిర్వహించేందుకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలు కలిసికట్టుగా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాయి.
లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, ఏ ఒక్కరికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ, పోలీస్, దేవాదాయ, రోడ్లుభవనాలు, నీటి సరఫరా, విద్యుత్, ఆర్టీసీ వంటి అన్ని విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి పనులను పర్యవేక్షిస్తున్నారు. ఆలయాల వద్ద క్యూ లైన్ల ఏర్పాటు, తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, రహదారుల మరమ్మతులు, ట్రాఫిక్ నియంత్రణ వంటి పనులను సకాలంలో పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు.
బోనాల ఉత్సవాలు జూలై 16న గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి అమ్మవారికి బోనం సమర్పించడంతో ప్రారంభమవుతాయి. ఆగస్టు 2న సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి బోనాలు, ఆగస్టు 3న రంగం కార్యక్రమం నిర్వహిస్తారు. ఇక ఆగస్టు 9న లాల్‌దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాలతో పాటు, నగరంలోని ప్రధాన ఆలయాల్లో జరిగే వేడుకల కోసం అద్భుతమైన ఏర్పాట్లు చేస్తున్నారు. పూల అలంకరణలు, విద్యుద్దీపాలంకరణలతో నగరం అంతా అమ్మవారి కోవెలలా మెరిసిపోనుంది.
బోనాల పండుగలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన బల్కంపేట శ్రీ ఎల్లమ్మ అమ్మవారి కల్యాణోత్సవాలు జూలై 20, 21, 22 తేదీల్లో అత్యంత వైభవంగా జరగనున్నాయి. జూలై 20న ఎదుర్కోలు ఉత్సవం, 21న అత్యంత ఘనంగా అమ్మవారి కల్యాణం, 22న రథోత్సవం నిర్వహించబడుతుంది. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులు క్రమశిక్షణతో ఉత్సవాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు. ఈ ఏడాది బోనాల పండుగ కోసం ప్రభుత్వం భారీగా నిధులను కేటాయించింది. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో పాత జీహెచ్ఎంసీ పరిధిలోని 3,427 దేవాలయాలకు రూ.15,05,41,150 కోట్లను విడుదల చేశారు. ఈ నిధులతో ఆలయాల మరమ్మతులు, భక్తులకు సౌకర్యాల కల్పనను వేగవంతం చేశారు. అమ్మవారికి సమర్పించే పట్టువస్త్రాలు, ఫలహారం బండ్ల ఊరేగింపు వంటి కార్యక్రమాలను కూడా ప్రభుత్వమే దగ్గరుండి పర్యవేక్షిస్తోంది. ప్రతి భక్తుడికి సురక్షితమైన, సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. అత్యధిక రద్దీ ఉండే ఆలయాల వద్ద ప్రత్యేక క్యూ లైన్లు, వైద్య శిబిరాలు, అంబులెన్స్ సదుపాయం కల్పిస్తున్నాం. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని పోలీస్ శాఖకు సూచించాం. పారిశుద్ధ్య లోపం లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా జీహెచ్ఎంసీ ప్రత్యేక బృందాలను సిద్ధం చేసింది. భక్తిప్రపత్తులతో పండుగను జరుపుకోవాలని కోరుతున్నాం. గోల్కొండ జగదాంబ, ఉజ్జయిని మహంకాళి, కట్ట మైసమ్మ, అక్కన్నమాదన్న దేవాలయం, లాల్‌దర్వాజా సింహవాహిని, భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం వంటి నగరంలోని సుమారు 30 ప్రధాన దేవాలయాల్లో రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రులు, ప్రజాప్రతినిధులు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఈ ప్రక్రియ అంతా అత్యంత సంప్రదాయబద్ధంగా జరుగుతుంది. పట్టువస్త్రాల సమర్పణ అనంతరం అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన ఫలహారం బండ్ల ఊరేగింపును వైభవంగా నిర్వహిస్తాం. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న టీజీఎస్ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యం మహిళలకు గొప్ప వరం. ఈ సౌకర్యం వల్ల రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉంది. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. మహిళా భక్తులు అమ్మవారిని దర్శించుకుని, ఈ మహోత్సవాలను మరింత విజయవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. భక్తులందరూ కలిసి తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటిచెబుదామని ఆకాంక్షించారు.

# భారత్‌లోకి అమెరికా మాజీ సైనికులు!

మనసులో మాట

భారతదేశంలోకి అమెరికా మాజీ సైనికులు ఎలాంటి పత్రాలు లేకుండా అక్రమంగా చొరబడుతుండటం ఇప్పుడు దేశ భద్రతా వర్గాలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. భారత్ నుంచి నేపాల్ దేశంలోకి దొంగచాటుగా ప్రవేశించడానికి ప్రయత్నిస్తున్న ఒక అమెరికా మాజీ నేవీ అధికారిని ఉత్తర్ ప్రదేశ్‌లోని మహారాజ్‌గంజ్ జిల్లా సరిహద్దులో 'సహస్త్ర సీమా బల్' (ఎస్ఎస్‌బీ) బలగాలు వ్యూహాత్మకంగా అడ్డుకుని అరెస్ట్ చేశాయి. విదేశీయులకు సంబంధించిన ఎలాంటి గుర్తింపు కార్డులు లేదా ప్రయాణ పత్రాలు (పాస్‌పోర్ట్, వీసా) లేకుండా అతడు అనుమానాస్పదంగా యూపీ సరిహద్దుల్లో తిరుగుతుండటంతో బలగాలు తనిఖీలు చేపట్టాయి. భద్రతా బలగాల తనిఖీల్లో పట్టుబడిన ఆ విదేశీయుడిని అమెరికాలోని కాలిఫోర్నియా ప్రాంతానికి చెందిన జోర్డాన్ బ్రౌన్‌గా అధికారులు గుర్తించారు. సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద ఎస్ఎస్‌బీ జవాన్లు అతడిని ఆపి నిలదీయగా.. బ్రౌన్ అక్కడి నుంచి తప్పించుకుని పారిపోవడానికి తీవ్రంగా ప్రయత్నించినట్లు పోలీసులు వెల్లడించారు. అయితే అలర్ట్ అయిన జవాన్లు అతడిని చుట్టుముట్టి బంధించారు. అనంతరం అతడిని స్థానిక పోలీసులకు అప్పగించగా.. సరైన పత్రాలు లేకుండా దేశంలో తిరుగుతున్నందుకు ఇమిగ్రేషన్ చట్టాల కింద కేసు నమోదు చేసి లోతుగా విచారణ ప్రారంభించారు.
పోలీసులు, నిఘా వర్గాల ప్రాథమిక విచారణలో జోర్డాన్ బ్రౌన్ తన నేపథ్యానికి సంబంధించి పలు ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. తాను కాలిఫోర్నియా యూనివర్సిటీలో ఉన్నత చదువులు చదువుకున్నానని, ఆ తర్వాత దాదాపు ఆరేళ్ల పాటు అమెరికా సైన్యంలో (నేవీ) పనిచేసినట్లు ఒప్పుకున్నాడు. గత 2025 నవంబర్ నెలలో తాను విమానంలో కాకుండా సముద్ర మార్గం ద్వారా దొంగచాటుగా భారత్‌లోకి ప్రవేశించినట్లు అధికారులు కనుగొన్నారు. దేశంలోకి వచ్చినప్పటి నుంచి అతడు గోవాలో శాశ్వతంగా నివసిస్తున్నాడని, ఈ మధ్య కాలంలో బెంగళూరు, లఖ్‌నవూ, గోరఖ్‌పూర్ వంటి కీలక నగరాలకు కూడా వెళ్లి వచ్చినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి.
అయితే, విచారణ సాగుతున్న కొద్దీ జోర్డాన్ బ్రౌన్ అధికారుల ప్రశ్నలకు పొంతనలేని, పరస్పర విరుద్ధమైన సమాధానాలు చెబుతూ గందరగోళానికి గురిచేస్తున్నాడు. మూడేళ్ల క్రితం తనకు ఉత్తరాఖండ్‌కు చెందిన ఒక భారతీయ మహిళతో పరిచయం ఏర్పడిందని, 2024 అక్టోబర్‌లో తామిద్దరం పెళ్లి చేసుకున్నామని చెప్పాడు. కానీ, అదే సమయంలో తాను ఇటలీ పర్యటనలో ఉన్నానని చెప్పడం అనుమానాలకు తావిచ్చింది. ఆ తర్వాత తాను టూరిస్ట్ వీసాపై థాయ్‌లాండ్ వెళ్లానని, అక్కడ పాస్‌పోర్టు పోవడంతో సముద్ర మార్గంలో భారత్ వచ్చానని అన్నాడు. ఇప్పుడు గోవాలో పరిచయమైన ఒక నేపాల్ వ్యక్తిని కలవడానికి సరిహద్దు దాటుతున్నానని, తన అసలు పాస్‌పోర్ట్ బెంగళూరులోని ఒక స్నేహితుడి దగ్గర ఉందని చెప్పడంతో అధికారులు అతడి మాటలను నమ్మడం లేదు.
జోర్డాన్ బ్రౌన్ అరెస్ట్ వ్యవహారం కేవలం ఒక సాధారణ చొరబాటు కేసు కాకపోవచ్చని నిఘా సంస్థలు భావిస్తున్నాయి. ఎందుకంటే, ఇటీవల పొరుగు దేశమైన మయన్మార్‌లోని మిలిటెంట్లకు అత్యాధునిక యుద్ధతంత్రాలలో ఉగ్రశిక్షణ ఇస్తున్న అమెరికా మాజీ సైనికుడు మాథ్యూ వాన్‌డైక్‌తో పాటు ఐదుగురు ఉక్రెయిన్ పౌరులను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అరెస్ట్ చేసింది. ఈ నేపథ్యంలోనే బ్రౌన్ అరెస్ట్ ప్రాధాన్యత సంతరించుకుంది. అమెరికాకు చెందిన మాజీ సైనికులు టూరిస్ట్ వీసాల పేరుతో భారత్‌కు వచ్చి, ఇక్కడి నుంచి మిజోరాం సరిహద్దు ద్వారా మయన్మార్‌లోకి చొరబడి అక్కడి ఉగ్రవాద, తిరుగుబాటు ముఠాలతో చేతులు కలుపుతున్నట్లు దర్యాప్తులో తేలింది.
విదేశీ కిరాయి సైనికులు ఇతరులకు ఆయుధాలు, డ్రోన్లను చేరవేయడానికి భారత భూభాగాన్ని ఒక సురక్షితమైన రవాణా మార్గంగా (ట్రాన్సిట్ రూట్) వాడుకుంటున్నారా? అనే అనుమానాలకు అవుననే సమాధానాలు లభిస్తున్నాయి. కొన్నాళ్ల క్రితం కోల్‌కతాలో పట్టుబడిన మాథ్యూ వాన్‌డైక్ బృందం ఐరోపా దేశాల నుంచి అత్యాధునిక డ్రోన్లను తీసుకొచ్చి, ఈశాన్య భారత సరిహద్దుల గుండా మయన్మార్‌లోని తిరుగుబాటు ముఠాలకు స్మగ్లింగ్ చేసినట్లు పక్కా సమాచారం అందింది. ఇలా డ్రోన్లను దొంగరవాణా చేయడం, వాటిని అసెంబ్లింగ్ చేయడం, ఎలక్ట్రానిక్ యుద్ధరీతుల్లో మయన్మార్ ముఠాలకు శిక్షణ ఇవ్వడమే ఈ అంతర్జాతీయ ముఠాల పని అని రష్యా కూడా గతంలో తీవ్ర ఆరోపణలు చేసింది.
భారతదేశ భద్రతా నిబంధనల ప్రకారం విదేశీయులు ఎవరైనా సరే మిజోరాం వంటి సున్నితమైన ఈశాన్య సరిహద్దు రాష్ట్రాల్లో ప్రయాణించాలంటే ఖచ్చితంగా కేంద్ర ప్రభుత్వం జారీ చేసే 'రక్షిత ప్రాంత పర్మిట్' (ప్రొటెక్టెడ్ ఏరియా పర్మిట్ PAP) కలిగి ఉండాలి. కానీ, ఇప్పుడు అరెస్టయిన అమెరికా మాజీ సైనికులు మరియు విదేశీయులు ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించారు. స్థానిక శక్తుల సహాయంతో రహస్యంగా ఈశాన్య భారతం నుంచి మయన్మార్‌లోకి ప్రవేశిస్తూ సరిహద్దు భద్రతకు పెద్ద సవాలుగా మారారు. ఇంతకీ ఈ వ్యవహారంలో కీలక సూత్రధారిగా ఉన్న మాథ్యూ వాన్‌డైక్ సాదాసీదా వ్యక్తి కాదు. 'సన్స్ ఆఫ్ లిబర్టీ ఇంటర్నేషనల్' అనే అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ ముసుగులో అతడు ఒక కిరాయి సైన్యాల ముఠాను నడుపుతున్నాడు. గతంలో లిబియా అంతర్యుద్ధం జరిగిన సమయంలో అక్కడి పాలకుడు గడాఫీకి వ్యతిరేకంగా స్వయంగా తుపాకీ పట్టి పోరాడటం ద్వారా ప్రపంచవ్యాప్తంగా వార్తల్లోకెక్కాడు. ఆ తర్వాత సిరియా అంతర్యుద్ధంలోనూ పాల్గొని అక్కడి తిరుగుబాటుదారులకు శిక్షణ ఇచ్చాడు. మోటార్ సైకిల్‌పై ఉత్తర ఆఫ్రికా, పశ్చిమాసియా దేశాల్లో విస్తృతంగా పర్యటించిన చరిత్ర ఇతనికి ఉంది.

# కాళేశ్వరం వైఫల్యంపై బీఆర్ఎస్‌ను నిలదీసిన పొన్నం

- కాళేశ్వరం సమస్యలకు బీఆర్ఎస్ ప్రభుత్వమే బాధ్యత అని మంత్రి ఆరోపణ
- నిపుణుల సూచనల మేరకే ప్రాజెక్టులో నీటి నిల్వలు చేపడతామని స్పష్టం
- కాంగ్రెస్ ప్రభుత్వం రాకముందే ప్రాజెక్టు కుంగిపోయిందని వ్యాఖ్య
- గత పాలకుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని విమర్శ
- బీఆర్ఎస్ ప్రచారాన్ని ప్రజల ముందు తిప్పికొడతామని వెల్లడి

హైదరాబాద్, మనసులో మాట

తెలంగాణలో నీటి పారుదల ప్రాజెక్టులు, కరవు పరిస్థితులపై అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ వేడి ముదిరింది. మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.. విపక్ష బీఆర్ఎస్ పార్టీ తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కరవు పరిస్థితులు, రైతుల ఇబ్బందులను ఆసరాగా చేసుకుని బీఆర్ఎస్ నాయకులు చౌకబారు రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. రక్తం ప్యాకెట్లతో డ్రామాలు ఆడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించాల్సిన అవసరం తమకు లేదని, కేవలం ఉనికిని కాపాడుకోవడానికే విపక్షాలు ఇలాంటి చీప్ పాలిటిక్స్ చేస్తున్నాయని తీవ్రంగా ఆక్షేపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక ముందే కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందన్న పచ్చి నిజాన్ని ప్రతిపక్షాలు కావాలనే దాస్తున్నాయని పొన్నం ప్రభాకర్ విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఈ పరిస్థితికి రావడానికి, పిల్లర్లు కుంగిపోవడానికి పూర్తిగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి, అలసత్వమే కారణమని ఆరోపించారు. నాసిరకం నిర్మాణాలు, ఇంజినీరింగ్ లోపాల వల్లనే ఆ ప్రాజెక్టు దెబ్బతిన్నదని, ఆ పాపాన్ని ఇప్పుడు తమ ప్రభుత్వంపై నెట్టేందుకు గులాబీ నేతలు ప్రయత్నించడం హాస్యాస్పదంగా ఉందన్నారు.
కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలను, బీఆర్ఎస్ నాయకులు చేసిన మోసాలను తాము ఊరూరా తిరిగి ప్రజలకు వివరిస్తామని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల సొమ్మును ఎలా వృథా చేశారో, ప్రాజెక్టు పేరిట ఏ విధంగా దోపిడీకి పాల్పడ్డారో వాస్తవాలతో సహా ప్రతి గ్రామంలోనూ ఎండగడతామన్నారు. ప్రజలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తున్న ప్రతిపక్షాల కుట్రలు ఇకపై సాగవని హెచ్చరించారు.
జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ తుది నివేదిక వచ్చిన తర్వాతే కాళేశ్వరం ప్రాజెక్టులో నీటిని నింపే విషయమై ప్రభుత్వం ఒక నిర్ణయానికి వస్తుందని మంత్రి వివరించారు. ఎన్‌డీఎస్ఏ నిపుణులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, ప్రాజెక్టు సురక్షితంగా ఉందని చెబితే వెంటనే నీటిని నింపుతామన్నారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా, శాస్త్ర సాంకేతిక నిపుణులు, అనుభవజ్ఞులైన ఇంజినీర్లు ఇచ్చే సలహాలను పాటిస్తూ బాధ్యతాయుతంగా ముందుకు సాగుతామన్నారు. ప్రాజెక్టు మళ్లీ పూర్తి స్థాయిలో ఉపయోగంలోకి రావడానికి ఏం చేయాలో నిపుణులు సూచిస్తే వాటిని తూచా తప్పకుండా అమలు చేస్తామని ప్రకటించారు.
ప్రస్తుత కరవు పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రజలలో ఆందోళన కలిగించేలా బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడిగడ్డ, కన్నెపల్లి పంప్‌హౌస్ విషయాల్లో కావాలనే రాజకీయం చేస్తూ రచ్చ సృష్టిస్తున్నారని విమర్శించారు. కరవు అనేది ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన సమస్య అని, దానిని అందరం కలిసి ఎదుర్కోవాలే తప్ప.. శవాల మీద పేలాలు ఏరుకున్న చందంగా రాజకీయం చేయడం తగదని హితవు పలికారు.
ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు, పర్యావరణ నిపుణులు ఇప్పటికే హెచ్చరించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. తీవ్రమైన ఎల్‌నినో ప్రభావం వల్ల దేశవ్యాప్తంగా కరవు పరిస్థితులు నెలకొంటున్నాయని చెప్పారు. ఈ భయంకరమైన ప్రకృతి సవాలును ఎదుర్కోవడానికి ప్రభుత్వం వైపు నుంచి అన్ని రకాల ముందస్తు చర్యలు, నివారణ సూచనలు చేస్తున్నామని వెల్లడించారు. తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తుగా నిధులు కేటాయించి పనులను పర్యవేక్షిస్తున్నామన్నారు.
తక్కువ నీటి వనరులతో పండే ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గు చూపాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ప్రస్తుత నీటి లభ్యత, కరవు తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ అధికారులు ఇచ్చే సలహాలను పాటించాలన్నారు. నీటి వినియోగం తక్కువగా ఉండే పంటల సాగు ద్వారా నష్టాల నుంచి బయటపడవచ్చని, వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని నిలబడేలా రైతాంగాన్ని చైతన్యపరుస్తున్నామన్నారు.
రాజకీయ పార్టీల మధ్య అంతర్గతంగా ఎన్ని విభేదాలు, సమస్యలు ఉన్నప్పటికీ.. కరవు వంటి సంక్షోభ సమయాల్లో అందరూ ఏకతాటిపైకి వచ్చి ప్రజలను ఆదుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా ప్రభుత్వానికి మంచి సలహాలు, సూచనలు ఇవ్వాలే తప్ప.. అనవసరపు రాద్ధాంతం చేయవద్దని హితవు పలికారు. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడానికి ప్రభుత్వం అన్ని శక్తులతో సిద్ధంగా ఉందని, ప్రజా ప్రయోజనాలే తమ ప్రథమ ప్రాధాన్యత అని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.



# మన కాలపు మనస్సాక్షి

మలయాళ కవిత్వాన్ని ఒక విశాల నదిగా ఊహిస్తే, సచ్చిదానందన్ సుదూర మానవ అనుభవాల నుంచి సంద్రాల నుంచి ఆ నదిలో కలిసే ప్రవాహంలా కనిపిస్తాడు. చరిత్రలోని చేదు, ప్రవాసాల ధూళి, అనేక భాషల మాధుర్యం...

మలయాళ కవిత్వాన్ని ఒక విశాల నదిగా ఊహిస్తే, సచ్చిదానందన్ సుదూర మానవ అనుభవాల నుంచి సంద్రాల నుంచి ఆ నదిలో కలిసే ప్రవాహంలా కనిపిస్తాడు. చరిత్రలోని చేదు, ప్రవాసాల ధూళి, అనేక భాషల మాధుర్యం, మానవత్వపు అశాంత స్వప్నాలను వెంట తెచ్చుకునే కవితా ప్రవాహం అది. ఆయన కవిత్వ హృదయంలో మానవ స్వేచ్ఛ పట్ల అచంచలమైన నిబద్ధత ధ్వనిస్తుంది. రాజకీయ, సామాజిక, మత, భాషా, సాంస్కృతికాల్లో ఏ రూపంలో వచ్చిన అణచివేతనైనా ఆయన కవిత్వం ప్రశ్నిస్తుంది, ప్రతిఘటిస్తుంది. అయితే ఆ ప్రతిఘటన కేవలం నినాదంగా ఉండదు. కవిత్వంగా రూపాంతరం చెందుతుంది. మౌన నైతిక శక్తితో, లోతైన మానవీయతతో పాఠకుని మనసు తాకుతుంది.సచ్చిదానందన్ ఊహాజగత్తులో ప్రకృతిది కేంద్రస్థానం. చెట్లు, నదులు, పక్షులు, వర్షాలు, విత్తనాలు, ఋతువులు ఆయన కవితల్లో అలంకార వస్తువులు కావు. జీవంతో నిండిన రూపాలు. అవి మనుషులతో సంభాషిస్తాయి. వారి విధుల్లో భాగస్వాములవుతాయి. ఆయన కవిత్వంలో ప్రకృతి భూమితో విడిపోయిన మన బంధాన్ని గుర్తుచేసే జీవశక్తి. రవీంద్రనాథ్ ఠాగూర్ మానవ ఆత్మ వికాసంలో అనంతాన్ని అన్వేషించాడు. పాబ్లో నెరూడా సంఘర్షణలో చరిత్రను, ఆకలిలో విప్లవాన్ని కనుగొన్నాడు. ఆక్టావియో పాజ్ భాషా-ఏకాంతాల చిక్కుముడుల్లో దాగి ఉన్న ఆత్మను వెతికాడు. సచ్చిదానందన్ ఈ మూడు సంప్రదాయాలతో సంభాషిస్తూనే తన దైన ప్రత్యేక స్వరం నిలబెట్టుకున్నాడు.

సచ్చిదానందన్ కవిత్వ చూపు భూమి వైపు, ఎడారులు దాటుతున్న శరణార్థుల వైపు, కనిపించని భారాలు మోస్తున్న కార్మికుల వైపు, దురాశ ఫలితంగా ముప్పులో ఉన్న అడవుల వైపు, యుద్ధ ఛాయల కింద చిక్కిన పిల్లల వైపు చూస్తుంది. నెరూడాలాగే అన్యాయాల పట్ల కవిత్వం మౌనంగా ఉండకూడదని సచ్చిదానందన్‌కు తెలుసు. అయితే ఆయన మంద్ర స్వరంలోని శక్తిని ఎంచుకుంటాడు. సచ్చిదానందన్ కవిత్వంలో ప్రతిఘటన బిగించిన పిడికిలి కాదు, తెరిచి ఉన్న గాయం. ఆయన అరిచి ఒప్పించడు, నిశ్శబ్దాన్నే మాట్లాడిస్తాడు.సచ్చిదానందన్ కవిత్వ ప్రత్యేకత 'నైతికతను' శ్రద్ధగా మలచడంలో ఉంది. ప్రతి జీవికి వినిపించే హక్కు ఉందన్న భావంతో రాస్తాడు. ఆయన కవితల్లో పక్షులు ప్రకృతి అలంకారాలు కావు, అవి స్వేచ్ఛ గల పౌరులు. చాలామంది కవులు ప్రపంచం గురించి రాస్తారు. సచ్చిదానందన్ ప్రపంచాన్ని వింటాడు. అదే ఆయనను ప్రత్యేకంగా నిలబెడుతుంది. నేటి ప్రపంచం ఒక మహా విమానాశ్రయంలా కనిపిస్తే దానినుండి లక్షలాది మంది ప్రయాణిస్తున్నారు. కానీ చాలా కొద్దిమంది మాత్రమే నిజంగా గమ్యాన్ని చేరుకుంటున్నారు. దేశాలు తమ చుట్టూ కంచెలు కట్టుకుంటున్నాయి. మతాలేమో గోడల్ని నిర్మిస్తున్నాయి. మార్కెట్లు ప్రతిదాన్నీ వస్తువుగా మారుస్తున్నాయి. ఈ గందరగోళాల నడుమ సచ్చిదానందన్ కవిత్వం రాజకీయాల సరిహద్దుల్ని దాటి పలకరిస్తుంది పలవరిస్తుంది. కేరళ నుంచి పాలస్తీనాకు, లాటిన్ అమెరికా నుంచి ఆఫ్రికాకు, ఒక గ్రామీణ దారి నుంచి ప్రపంచ సంక్షోభాల వరకూ ప్రయాణిస్తూ మానవ గౌరవం అవిభాజ్యమన్న సందేశాన్ని మోస్తుంది. ఆయన కవితలు బాధకు జాతీయత ఉండదని గుర్తుచేస్తాయి. అందుకే అవి భాషల సరిహద్దులను దాటి ప్రతిధ్వనిస్తాయి.

ఆయన కవిత్వమంతటా లోతైన పర్యావరణ చైతన్యం ప్రవహిస్తుంది. ప్రపంచంలో పర్యావరణ విపత్తు ముఖ్యమైన ప్రమాదంగా దేశాలు గుర్తించకముందే ప్రకృతి విధ్వంసమంటే మానవ విధ్వంసమే అని ఆయన గ్రహించాడు. ఆయన కవిత్వంలో ఒక చెట్టు నరికివేత కేవలం పర్యావరణ సంఘటన కాదు. భూమి మనిషి చరిత్రలో ఒక అధ్యాయం చెరిపివేయడమే. ఆ సున్నితత్వమే ఆయన కవిత్వానికి అరుదైన నైతిక స్పృహను స్పర్శను అందిస్తుంది. ఆయన మనిషిని ప్రకృతి నుంచి వేరుగా చూడడు, ప్రకృతిలో భాగంగానే చూస్తాడు. మానవ నాగరికతలో భాగంగా పక్షులు, నదులు, అడవులు, మన చుట్టూ నిశ్శబ్దంగా జీవించే అనేక జీవులతో మనం మరచిపోయిన బంధాన్ని పునరుద్ధరించడంలోనే మనిషి మనుగడ వుందని ఆయన కవితలు సూచిస్తాయి. ఆయన రచనల్లో - చెట్లు జ్ఞాపకాల భాండాగారాలు. నదులు కాలంలో ప్రవహించే జీవిత చరిత్రలు.

స్థానికతకూ విశ్వజనీనతకూ మధ్య, వేర్లకూ వృక్షానికీ మధ్య, సాంస్కృతిక అస్తిత్వానికీ ప్రపంచ చైతన్యానికీ మధ్య నిరంతర సంభాషణ జరిపిన అరుదైన భారతీయ రచయితల్లో ఆయన ఒకరు. ఆయన కవిత్వం - విభజనలతో నిండిపోతున్న ఈ కాలంలో ఆతిథ్యంగా నిలుస్తుంది, గోడలు కడుతున్న చోట కిటికీలు తెరుస్తుంది, ఎడారులు విస్తరిస్తున్న చోట చెట్లను నాటుతుంది, పంజరాలు పెరుగుతున్న చోట పక్షులను విడుదల చేస్తుంది - బహుశా ఇదే కె. సచ్చిదానందన్ రచనల శాశ్వత ప్రాసంగికత. గడిచిపోయిన ప్రతి కాలం రాతి, ఉక్కులపై రాతల్ని, స్మారకాలను నిర్మిస్తుంది. కానీ కొద్ది కాలాల్లోని సృజనకారులే సజీవమైన మనస్సాక్షిని సృష్టిస్తారు. తమ భాషకే కాకుండా తమ కాలపు మనస్సాక్షిగా ఎదుగుతారు. అలాంటి అరుదైన మనస్సాక్షులలో కె. సచ్చిదానందన్ ఒకరు. సాహిత్యానికి నిజమైన మాతృభూమి దేశమో భాషో కాదని, మానవ హృదయమేనని నిరంతరం మనకు బోధిస్తున్న కవి సచ్చిదానందన్.

డాక్టర్ కంచర్ల
అచ్యుతరావు
ఎడిటర్, మనసులో మాట దినపత్రిక



# బంగ్లాదేశ్‌కు షేక్ హసీనా రాకపై ఉత్కంఠ

- స్వదేశానికి వస్తే చట్టపరమైన చర్యలు తప్పవని బంగ్లాదేశ్ మంత్రి వ్యాఖ్య
- అరెస్టు, జైలు శిక్షకు సిద్ధమేనని షేక్ హసీనా ప్రకటన
- కోర్టు తీర్పు మేరకే తదుపరి చర్యలు ఉంటాయని స్పష్టం
- చట్టం ముందు అందరూ సమానమేనని మంత్రి షామా ఒబైద్ వ్యాఖ్య
- హసీనా భవిష్యత్తుపై న్యాయవ్యవస్థే తుది నిర్ణయం తీసుకుంటుందని వెల్లడి
- రాజకీయ సందేశం కోసమే హసీనా వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శ



**మనసులో మాట**

బంగ్లాదేశ్ రాజకీయాల్లో మరోసారి తీవ్ర ఉత్కంఠ రేపుతూ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా స్వదేశానికి తిరిగి వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఈ పరిణామంపై బంగ్లాదేశ్ ప్రస్తుత ప్రభుత్వం అత్యంత ఘాటుగా స్పందించింది. షేక్ హసీనా గనుక తిరిగి బంగ్లాదేశ్‌లో అడుగుపెడితే ఆమెను వెంటనే అరెస్ట్ చేసి జైలుకు తరలిస్తామని ఆ దేశ విదేశాంగ శాఖ సహాయ మంత్రి షామా ఒబైద్ ఇస్లాం చాలా స్పష్టంగా ప్రకటించారు. ఆమె ఎక్కడ లొంగిపోయినా సరే, దేశ సరిహద్దుల్లోకి రాగానే చట్టపరమైన నిబంధనల ప్రకారం తక్షణమే అరెస్ట్ ప్రక్రియ అమలవుతుందని వెల్లడించారు.

మాజీ ప్రధాని షేక్ హసీనా లొంగిపోవడానికి సిద్ధపడితే, ప్రస్తుతం దేశంలో అమలులో ఉన్న సాధారణ చట్టాల ప్రకారమే తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి షామా ఒబైద్ వివరించారు. చట్టం ఎవరికైనా ఒకేలా ఉంటుందని, తన పని తాను చేసుకుపోతుందని అన్నారు. హసీనా ఇప్పటికే కోర్టు ద్వారా దోషిగా తేలిన వ్యక్తి అని గుర్తుచేసిన ఆయన.. ఈ విషయంలో ప్రభుత్వం ప్రత్యేకంగా విచారించాల్సిన లేదా మినహాయింపులు ఇవ్వాల్సిన అవసరమేమీ లేదని తేల్చి చెప్పారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారు ఎవరైనా సరే శిక్ష అనుభవించాల్సిందేనని స్పష్టం చేశారు.

షేక్ హసీనా ఒకవేళ పొరుగు దేశమైన భారత్‌లో ఉన్న బంగ్లాదేశ్ రాయబార కార్యాలయంలో లొంగిపోయినా, లేదా నేరుగా బంగ్లాదేశ్ వచ్చి కోర్టులో లొంగిపోయినా సరే.. ముందుగా ఆమె జైలు గడప తొక్కాల్సిందేనని విదేశాంగ సహాయ మంత్రి స్పష్టం చేశారు. ఆమె దేశానికి తిరిగి వచ్చిన తర్వాత చట్టపరమైన విచారణ ఏ విధంగా సాగాలి, తదుపరి చర్యలు ఎలా ఉండాలనే అత్యంత కీలకమైన అంశాలను పూర్తిగా దేశ న్యాయవ్యవస్థే నిర్ణయిస్తుందని చెప్పారు. ఇందులో ప్రభుత్వ జోక్యం ఏమీ ఉండబోదని వివరించారు.

షేక్ హసీనాను తిరిగి దేశానికి రప్పించే చట్టపరమైన ప్రక్రియ గత తాత్కాలిక ప్రభుత్వ హయాంలోనే మొదలైందని, ప్రస్తుతం అధికారంలో ఉన్న బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) నేతృత్వంలోని ప్రభుత్వం కూడా అదే పంథాను కొనసాగిస్తోందని మంత్రి తెలిపారు. విదేశాల్లో తలదాచుకుంటూ తాను త్వరలోనే బంగ్లాదేశ్‌కు తిరిగి వస్తానంటూ హసీనా చేస్తున్న ప్రకటనలు కేవలం రాజకీయ సంకేతాల కోసమేనని ఆయన అభిప్రాయపడ్డారు. దేశం విడిచి పారిపోయిన లేదా అజ్ఞాతంలో ఉన్న అవామీ లీగ్ నాయకులు, కార్యకర్తల్లో తిరిగి ధైర్యం నింపేందుకే ఆమె ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని, లొంగిపోవడం ఆమె అసలు ఉద్దేశం కాకపోవచ్చని విమర్శించారు.

బంగ్లాదేశ్‌లో 2024 జులై నెలలో ప్రభుత్వ ఉద్యోగాల రిజర్వేషన్లకు వ్యతిరేకంగా విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టిన సంగతి తెలిసిందే. ఆ నిరసనలు క్రమంగా తీవ్రరూపం దాల్చి, చివరకు హసీనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమంగా మారాయి. ఆగ్రహించిన ఆందోళనకారులు ఏకంగా ప్రధానమంత్రి అధికారిక నివాసాన్ని ముట్టడించడంతో.. 2024 ఆగస్టు 5న షేక్ హసీనా తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ప్రాణభయంతో ఆమె హుటాహుటిన ఢాకా నగరాన్ని విడిచి భారత్‌కు చేరుకున్నారు. అప్పటి నుంచి ఆమె ఢిల్లీలోని ఒక సురక్షిత, రహస్య ప్రదేశంలో నివసిస్తున్నారు.

విద్యార్థుల నిరసనలను ఉక్కుపాదంతో అణచివేసే క్రమంలో మానవత్వానికి వ్యతిరేకంగా కఠిన నేరాలకు, హింసకు పాల్పడ్డారనే ఆరోపణలపై హసీనాపై బంగ్లాదేశ్‌లో అనేక కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత ఏర్పాటైన యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం ఈ ఘోరాలపై ప్రత్యేక న్యాయ విచారణకు ఆదేశించింది. దీనిపై విచారణ జరిపిన బంగ్లాదేశ్ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్ (ఐసీటీ) గతేడాది హసీనాకు మరణశిక్ష విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. అయితే, ఈ తీర్పుతో పాటు తనపై వచ్చిన ఆరోపణలన్నీ పూర్తిగా రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగమేనని షేక్ హసీనా మొదటి నుంచి కొట్టిపారేస్తున్నారు.

ఇదిలా ఉండగా, ఇటీవల ఒక అంతర్జాతీయ వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో షేక్ హసీనా ఎంతో భావోద్వేగంగా మాట్లాడారు. తాను త్వరలోనే బంగ్లాదేశ్‌కు వెళ్లే ఆలోచనలో ఉన్నానని స్పష్టం చేశారు. స్వదేశానికి తిరిగి వెళ్లి కోర్టు ముందు లొంగిపోయేందుకు తనకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. రాజకీయాల కోసం తాను అరెస్టు కావడానికైనా, లేదా చావడానికైనా సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. ఒకవేళ తనకు మరణం సంభవించాల్సి వస్తే, అది పరాయి దేశంలో కాకుండా తన కన్న సొంత గడ్డపైనే జరగాలని కోరుకుంటున్నట్లు హసీనా ఆవేదన వ్యక్తం చేశారు.

కోర్టు తీర్పు వెలువడినప్పటి నుంచి షేక్ హసీనాను తమకు అప్పగించాలంటూ బంగ్లాదేశ్ ప్రభుత్వం భారత అధికార వర్గాలకు నిరంతరం లేఖలు రాస్తోంది. ఇప్పటికే పలుమార్లు అధికారిక లేఖలు పంపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే హసీనా ఒక కీలక నిర్ణయానికి వచ్చారు. భారత ప్రభుత్వానికి తన వల్ల ఎలాంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతోనే తాను స్వదేశానికి వెళ్లాలని నిశ్చయించుకున్నట్లు తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్ నెలలోనే తనతో పాటు అవామీ లీగ్ పార్టీకి చెందిన కీలక సీనియర్ నాయకులంతా కలిసి బంగ్లాదేశ్‌కు వెళ్లి అక్కడి న్యాయస్థానాల ముందు లొంగిపోవాలని ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నట్లు షేక్ హసీనా వెల్లడించారు.

# అయోధ్య విరాళాల చోరీ కేసు.. నేడు సిట్ ఫైనల్ రిపోర్ట్..?

దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన అయోధ్య రామమందిర విరాళాల చోరీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తన నివేదికను బుధవారం(జూలై 15)న రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించే అవకాశం ఉంది. ముగ్గురు సభ్యులతో కూడిన సిట్ విరాళాల చోరీని దర్యాప్తు చేసింది. సిట్‌కు ఇచ్చిన అదనపు 15 రోజుల గడువు జూలై 15తో ముగియనుంది. దీంతో ఈ నివేదికను యూపీ అదనపు ప్రధాన కార్యదర్శి(హోం) సంజయ్ ప్రసాద్‌కు సమర్పించే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే, దర్యాప్తులో మరిన్ని అంశాలను పూర్తి చేసేందుకు సిట్ మరింత సమయం కోరుతుందా లేదా అనే దానిపై ఇంకా స్పష్టత లేదు. ఈ దర్యాప్తులో భాగంగా ఆర్థిక లావాదేవీలు, బ్యాంకు ఖాతాలు, సీసీటీవీ ఫుటేజ్, ఎలక్ట్రానిక్ ఆధారాలు, పత్రాలు, సాక్షులు, నిందితుల వాంగ్మూలాన్ని సిట్ పరిశీలించింది. ఈ నివేదికలో దోపిడీకి పాల్పడిన వ్యక్తులనే కాకుండా, పరిపాలనా లోపాలు, పర్యవేక్షణ వైఫల్యాలు, బాధ్యులైన అధికారుల్ని గుర్తించే అవకాశం ఉంది. విరాళాల సేకరణ, భద్రపరిచే విధానం, నగదు లెక్కింపు, బ్యాంకులో జమ, ఆడిట్, పర్యవేక్ష వ్యవస్థల్లో సంస్కరణలను సూచించే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే ఈ కేసులో అక్రమంగా మళ్లించిన నిధుల ఆనవాళ్లు గుర్తించేందుకు అయోధ్య పోలీసులు ఇన్‌కమ్ ట్యాక్స్(ఐటీ) డిపార్ట్మెంట్ సహాయం కోరారు. ఇప్పటివరకు అరెస్టయిన 8 మంది నిందితులు, వారి కుటుంబ సభ్యులకు సంబంధించిన దాదాపు 50



బ్యాంక్ ఖాతా లావాదేవీలను 2022 నుంచి పరిశీలిస్తారు. దోచుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నిధుల్ని బంధువుల ఖాతాల ద్వారా బదిలీ చేశారా? స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుటు పెట్టారా? స్థిరాస్తులు కొనుగోలు చేశారా? ఇతర ఆర్థిక సాధనాల్లో పెట్టుబడి పెట్టారా? అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ దర్యాప్తులో మరికొందరు వ్యక్తుల ప్రమేయం ఉంటే వారి అరెస్టులు, ఆస్తుల స్వాధీనం వంటి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# ఇరాన్ సైనిక సామర్థ్యం పూర్తిగా ధ్వంసం

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన
- హర్మూజ్ నౌకలపై రక్షణకు 20 శాతం టోల్ బాదుడు
- యూఎస్ కాంగ్రెస్‌కు అధికారిక సమాచారం
- జూలై 7 నుంచే మళ్లీ యుద్ధ రంగంలోకి దిగినట్లు లేఖ
- శాంతి ఒప్పందాన్ని ఉల్లంఘించిన ఇరాన్
- దౌత్య ప్రయత్నాలను పక్కనబెట్టి నౌకలపై దాడులు
- వాణిజ్య నౌకలపై 20 శాతం టోల్ రక్షణ పన్ను
- ఓవల్ ఆఫీస్ నుంచి ట్రంప్ హెచ్చరికలు



**పశ్చిమాసియ, మనసులో మాట**

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మరింత ముదిరాయి. ఇరాన్‌కు సంబంధించిన సైనిక సామర్థ్యాన్ని తాము పూర్తిగా ధ్వంసం చేశామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. హర్మూజ్ జలసంధి ప్రాంతంలో ఇరాన్ ఉనికి లేకుండా చేసేందుకు, వారి సైనిక శక్తిని పూర్తిగా నిర్వీర్యం చేసే దిశగా అమెరికా బలగాలు భీకర దాడులు కొనసాగిస్తున్నాయని ఆయన వెల్లడించారు. శత్రుదేశం కోలుకోలేని విధంగా అమెరికా సైన్యం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోందని, ఇరాన్ దాడుల ఆటకట్టించేందుకు తాము వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ట్రంప్ స్పష్టం చేశారు.

ఇరాన్ దేశంపై తాము తిరిగి సైనిక చర్యలను ప్రారంభించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారికంగా యూఎస్ కాంగ్రెస్‌కు తెలియజేశారు. ఈ మేరకు కాంగ్రెస్‌కు ఒక లేఖ పంపిన ఆయన, జూలై 7 నుంచే ఇరాన్‌పై దాడులను పునరుద్ధరించినట్లు స్పష్టం చేశారు. హర్మూజ్ జలసంధి గుండా వెళ్తున్న అంతర్జాతీయ నౌకలపై ఇరాన్ వరుస దాడులకు తెగబడటంతో, అంతర్జాతీయ నిబంధనల ప్రకారం నౌకల రక్షణ కోసం తాము ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ట్రంప్ ఆ లేఖలో విడమరిచి చెప్పారు.

ఇటీవల కాలంలో అమెరికా, ఇరాన్ దేశాల మధ్య దౌత్యపరమైన చర్చలు జరిగి ఒక శాంతి ఒప్పందం కుదిరినప్పటికీ.. ఇరాన్ దాన్ని ఏమాత్రం గౌరవించలేదని ట్రంప్ ఆరోపించారు. ఒప్పందం కుదిరిన కొద్ది రోజులకే ఇరాన్ దాన్ని ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించిందన్నారు. తాము ఎంతో చిత్తశుద్ధితో శాంతి కోసం ప్రయత్నించినప్పటికీ, గతవారమే ఇరాన్ ఏకంగా మూడు అంతర్జాతీయ నౌకలపై దాడులు చేసిందని మండిపడ్డారు. ఒప్పందంలో తమకు నచ్చని అంశాలు ఉన్నాయనే నెపంతో వారు దాన్ని రద్దు చేసుకున్నారని, ఇటువంటి పిచ్చి చేష్టలను తాము ఎంతమాత్రం సహించబోమని ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే ఇతర దేశాల వాణిజ్య నౌకల నుంచి భారీగా 20 శాతం టోల్ పన్ను వసూల్ చేయనున్నట్లు ట్రంప్ కుండబద్దలు కొట్టారు. ఇరాన్ ముఠాల దాడుల నుంచి అంతర్జాతీయ వాణిజ్య నౌకలకు అమెరికా సైన్యం పూర్తి రక్షణ కల్పిస్తోందని, ఇందుకు గాను తమకు భారీగా ఆర్థిక ఖర్చులు అవుతున్నాయని వివరించారు. ప్రపంచంలోనే అత్యంత సంపన్నమైన ఈ ప్రాంతానికి తాము ఉచితంగా రక్షణ కల్పించలేమని, రక్షణ కోసం అమెరికా పెడుతున్న ఖర్చులను ఆయా దేశాల నుంచే తిరిగి వసూల్ చేసుకుంటామని ఆయన తేల్చిచెప్పారు.

వైట్‌హౌస్‌లోని ఓవల్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడిన ట్రంప్, ఇరాన్‌పై ఈ రాత్రి మరింత భీకరమైన దాడులు చేయబోతున్నట్లు హెచ్చరించారు. ఇప్పటికే ఆ దేశాన్ని అన్ని రంగాల్లోనూ దెబ్బతీశామని, వారి ఆర్థిక వనరులను కట్టడి చేశామని చెప్పారు. ఇందులో భాగంగా ఇరాన్ ఓడరేవులపై తాము మళ్లీ పూర్తి స్థాయిలో దిగ్బంధనం విధిస్తున్నట్లు ప్రకటించారు. అయితే ఈ దిగ్బంధనం కేవలం ఇరాన్ నౌకలకే పరిమితమని, హర్మూజ్ జలసంధిలో ఇతర దేశాల వాణిజ్య నౌకల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు, ఆటంకాలు ఉండబోవని ఆయన హామీ ఇచ్చారు.

చమురు అవసరాల కోసం అమెరికా ఎవరిపైనా ఆధారపడటం లేదని, ముఖ్యంగా గల్ఫ్ దేశాల చమురు తమకు అస్సలు అవసరం లేదని ట్రంప్ స్పష్టం చేశారు. ప్రపంచంలోనే అత్యధిక చమురు నిల్వలు ప్రస్తుతం అమెరికా వద్దే ఉన్నాయని ఆయన గర్వంగా ప్రకటించారు. ఒకవేళ వెనెజువెలా నిల్వలను కూడా కలిపితే.. ప్రపంచ చమురు సరఫరాలో 50 శాతానికి పైగా వాటా తమ పరిధిలోనే ఉంటుందన్నారు. తమ స్వంత అవసరాల కోసం కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్థిరత్వం కోసం మరియు మిత్రదేశాల ప్రయోజనాల కోసమే తాము ఈ ప్రాంతంలో జోక్యం చేసుకుంటున్నామని వివరించారు.

పశ్చిమాసియాలో తమకు అత్యంత నమ్మకమైన మిత్ర దేశాలైన ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ (యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్)ల భద్రతను కాపాడేందుకే అమెరికా ఈ సైనిక చర్యలకు పూనుకుందని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ దూకుడు కారణంగా ఈ దేశాల ఉనికికి, ఆర్థిక ప్రయోజనాలకు ముప్పు వాటిల్లకుండా అమెరికా సైన్యం ఒక కవచంలా నిలబడుతుందని చెప్పారు. మిత్రపక్షాల రక్షణ బాధ్యతను తాము ఎంతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని, ఈ ప్రాంతంలో శాంతిభద్రతలను కాపాడటంలో అమెరికా పాత్ర ఎల్లప్పుడూ అగ్రగామిగానే ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

అమెరికా జరిపిన మెరుపు దాడుల్లో ఇరాన్ సైన్యానికి చెందిన టాప్ కమాండర్లలో అత్యధిక మంది అంతమొందించబడ్డారని ట్రంప్ సంచలన విషయాలు వెల్లడించారు. ఇరాన్ అగ్రనేత అలీ ఖమేనీ ఇప్పటికే చనిపోయాడని, సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ కూడా 90 శాతం చనిపోయినట్లేనని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఇరాన్ వద్ద ఎలాంటి నౌకాదళం గానీ, వైమానిక దళం గానీ మిగలలేదని.. అంతా సర్వనాశనమైందని చెప్పారు. వారి గగనతల రక్షణ వ్యవస్థలను సైతం అమెరికా క్షిపణులు పూర్తిగా ధ్వంసం చేశాయని, అత్యున్నత నాయకత్వం మొత్తం హతమవడంతో ఇరాన్ సైన్యం ఇప్పుడు నాయకుడు లేని నౌకలా మారిందని ట్రంప్ విశ్లేషించారు.

# అణు ముప్పును తప్పించిన ప్రధాని మోడీ!

- 2022లో ఉక్రెయిన్‌పై అణు దాడిని మోడీనే అడ్డుకున్నారు.
- పుతిన్ మోడీ మాటకు విలువనిస్తారు.
- భారత్, చైనా నాయకుల మాటకు రష్యా ప్రాధాన్యం.
- సంచలన వ్యాఖ్యలు చేసిన పోలాండ్ మంత్రి.



రష్యాఉక్రెయిన్ యుద్ధంలో భారత ప్రధాని నరేంద్రమోడీ కీలక పాత్ర పోషించాలని పోలాండ్ ఉప విదేశాంగ మంత్రి వ్లాడిస్లావ్ టియోఫిల్ బార్టోషెవ్స్కీ సంచలన వ్యాఖ్యలు చేశారు. 2022లో ఉక్రెయిన్‌పై వ్యూహాత్మక అణ్వాయుధాలను ప్రయోగించకుండా పుతిన్‌ను మోడీ అడ్డుకున్నారని చెప్పారు. మోడీ జోక్యంతోనే అణు యుద్ధంగా మారలేదని వెల్లడించారు. ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రపంచంలో కొద్ది మంది నేతల మాటలే వింటారని, అందులో ప్రధాని మోడీ ఒకరని అన్నారు. భారత్‌రష్యాల మధ్య దశాబ్దాల స్నేహ సంబంధాలు ఉన్నాయని, శాంతి చర్చల్లో భారత్ ప్రత్యేక స్థానం సంపాదించుకుందని ఆయన తెలిపారు. ప్రధాని మోడీ ప్రపంచవ్యాప్తంగా గౌరవం పొందిన నేత అని, ఆయన అభిప్రాయాలను పుతిన్ సీరియస్‌గా పరిగణిస్తారని పోలాండ్ మంత్రి అన్నారు. భారత్‌తో పాటు చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ కూడా పుతిన్‌తో మాట్లాడగలితే నాయకుడని తెలిపారు. రష్యా శత్రవులుగా భావించని దేశాల నుంచి వచ్చే సూచనల్ని పుతిన్ ప్రాధాన్యం ఇస్తారని ఆయన అభిప్రాయపడ్డారు. గతంలో రష్యా నుంచి భారత్ ముడి చమురు కొనుగోలు చేయడాన్ని విమర్శించిన విషయాన్ని మంత్రి గుర్తు చేసుకున్నారు. అయితే తక్కువ ధరల కారణంగా భారత్ ఈ నిర్ణయం తీసుకుందని ఇప్పుడు అర్థమైందని, ఈ అంశంపై భారత్‌పోలాండ్ మధ్య విభేదాలు తగ్గాయని అన్నారు. ఇటీవల సెయింట్ పీటర్స్ బర్గ్ అంతర్జాతీయ ఆర్థిక వేదికపై పుతిన్ మోడీని కొనియాడారు. ఆయనపై ఒత్తిడి తీసుకురావడం ఎవరి వల్ల సాధ్యం కాదని అన్నారు.

# ప్రధాని మోడీపై మరోసారి బేర్ గ్రిల్స్ ప్రశంసల జల్లు!

- మోడీ ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన నాయకుడు
- మరోసారి ప్రధాని మోడీపై బేర్ గ్రిల్స్ ప్రశంసలు
- 2019లో "మ్యాన్ వర్సెస్ వైల్డ్"లో మోడీతో సాహసయాత్ర



బ్రిటిష్ అడ్వెంచరర్, ప్రముఖ టెలివిజన్ వ్యాఖ్యాత బేర్ గ్రిల్స్ మరోసారి ప్రధాని మోడీపై ప్రశంసలు కురిపించారు. ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన నాయకుల్లో మోడీ ఒకరు అంటూ సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ప్రస్తుతం వైరల్‌గా మారింది. మాజీ అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా, బ్రిటన్ యువరాజు ప్రిన్స్ విలియంతో పాటు ప్రధాని మోడీతో కలిసి దిగిన ఫొటోలను పంచుకున్న బేర్ గ్రిల్స్.. నిజమైన గొప్ప నాయకులు ఎప్పుడూ గట్టిగా మాట్లాడేవారు కాదని వ్యాఖ్యానించారు. బేర్ గ్రిల్స్ తన పోస్ట్‌లో.. "ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన నాయకుల్లో కొందరిని కలిశాను. కానీ నిజంగా గొప్ప నాయకులు ఎప్పుడూ పెద్దగా హడావుడి చేయరు." అని రాశారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశమయ్యాయి.

"మ్యాన్ వర్సెస్ వైల్డ్"లో మోడీతో సాహసయాత్ర 2019లో ఉత్తరాఖండ్‌లోని జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్‌లో చిత్రీకరించిన 'మ్యాన్ వర్సెస్ వైల్డ్' ప్రత్యేక ఎపిసోడ్‌లో ప్రధాని మోడీ, బేర్ గ్రిల్స్ కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అడవుల్లో ట్రెక్కింగ్ చేయడం, భారీ వర్షంలో ప్రయాణించడం, గడ్డి, వెదురు సహాయంతో తాత్కాలిక తెప్ప తయారు చేయడం వంటి సాహస కార్యక్రమాలు చేపట్టారు. అదే సమయంలో పర్యావరణ పరిరక్షణ అవసరంపై ఇద్దరూ చర్చించారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ.. యువకుడిగా హిమాలయాల్లో గడిపిన రోజులు తన జీవితాన్ని పూర్తిగా మార్చాయని, ప్రకృతితో తనకు ప్రత్యేక అనుబంధాన్ని ఏర్పరిచాయని చెప్పారు. మనిషి ప్రకృతిని శత్రువుగా కాకుండా మిత్రుడిగా భావించాలని.. మనిషి ప్రకృతికి సహకరిస్తే.. ప్రకృతి కూడా మనిషికి సహకరిస్తుంది." అని పేర్కొన్నారు.

ఇక అడవిలో ప్రయాణించే సమయంలో పులుల నుంచి రక్షణ కోసం బేర్ గ్రిల్స్ ఒక తాత్కాలిక ఈటె తయారు చేశారు. అయితే దానిని ఆయుధంగా ఉపయోగించేందుకు ప్రధాని మోడీ నిరాకరించారు. "నా పెంపకం ఏ ప్రాణినైనా చంపడానికి అనుమతించదు. కానీ మీరు పట్టుకోమంటున్నారు కాబట్టి దీన్ని చేతిలో ఉంచుకుంటాను." అంటూ మోడీ చెప్పిన మాటలు అప్పట్లో ట్రెండింగ్‌గా మారాయి. ఈ కార్యక్రమంలో ప్రధాని మోడీ స్వచ్ఛ భారత్ అభియాన్ గురించి కూడా ప్రస్తావించారు. వ్యక్తిగత పరిశుభ్రత భారతీయ సంస్కృతిలో భాగమని.. అదే విధంగా సమాజ పరిశుభ్రతపై కూడా ప్రతి ఒక్కరిలో బాధ్యత పెరగాల్సిన అవసరం ఉందని చెప్పారు.

కార్యక్రమం ప్రసారమైన తర్వాత.. బేర్ గ్రిల్స్‌కు హిందీ రాకపోయినా మోడీతో ఎలా మాట్లాడారనే సందేహం పలువురిలో వ్యక్తమైంది. దీనిపై తర్వాత 'మన్ కీ బాత్' కార్యక్రమంలో స్పందించిన ప్రధాని మోడీ.. షూటింగ్ మొత్తం సమయంలో ఇద్దరూ రియల్ టైమ్ ట్రాన్స్‌లేషన్ ఇయర్‌పీస్ టెక్నాలజీని ఉపయోగించినట్లు వెల్లడించారు.

**గతంలోనూ మోడీపై ప్రశంసలు**

'మ్యాన్ వర్సెస్ వైల్డ్' కార్యక్రమం తర్వాత కూడా బేర్ గ్రిల్స్ పలు సందర్భాల్లో ప్రధాని మోడీని ప్రశంసించారు. ఆయనను "గొప్ప క్రీడాస్ఫూర్తి కలిగిన వ్యక్తి", "అసాధారణ ప్రపంచ నాయకుడు" అంటూ అభివర్ణించారు.

# పర్షియన్ గల్ఫ్‌లో ఉద్రిక్తతలు: చిక్కుకున్న భారత నౌకలు!

అమెరికాఇరాన్‌ల మధ్య మళ్లీ యుద్ధ వాతావరణం నెలకొనడంతో వ్యూహాత్మక హర్మ్యూజ్ జలసంధిలో నౌకల రవాణాకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో భారత జెండాతో ఉన్న 7 నౌకలు, అందులోని 148 మంది భారతీయ సిబ్బంది పర్షియన్ గల్ఫ్‌లోనే చిక్కుకుపోయినట్లు తాజాగా కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అలాగే, భారత్‌కు వస్తున్న ఎరువులు, ఇతర సరుకులతో కూడిన మరో 11 విదేశీ నౌకలను సురక్షితంగా తరలించేందుకు (ఎవాక్యుయేషన్) ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలిసింది. ప్రస్తుతం గల్ఫ్ రీజియన్‌లో చిక్కుకున్న భారతీయ నావికులను రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం భారత నౌకాదళంతో (ఇండియన్ నేవీ) నిరంతరం సమన్వయం చేసుకుంటున్నట్లు సమాచారం.

**మిస్సైల్ దాడుల్లో భారతీయుడి మృతి..**

ఇటీవల ఇరాన్‌అమెరికాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం రద్దయ్యాక గల్ఫ్ ప్రాంతంలో దాడులు ముదిరాయి. హర్మ్యూజ్ జలసంధి గుండా వెళ్తున్న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (UAE) కు చెందిన 'మొంబాసా', 'అల్ బహియా' అనే రెండు ఆయిల్ ట్యాంకర్లపై మిస్సైల్ దాడులు జరిగాయి. ఈ ప్రమాదంలో ఒక భారతీయ నావికుడు మరణించగా, ఆరుగురు గాయపడ్డారు. తమ హెచ్చరికలను బేఖాతరు చేయడం వల్లే ఈ దాడులు చేసినట్లు ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (IRGC) ప్రకటించింది. తాజా ఘటనతో కలిపి ఈ ఏడాది ఫిబ్రవరి 28 నుంచి మొదలైన ఈ పశ్చిమాసియా ఘర్షణల్లో ఇప్పటివరకు ప్రాణాలు కోల్పోయిన భారతీయ నావికుల సంఖ్య 14కు చేరినట్లు జాతీయ మీడియా స్పష్టం చేస్తోంది.

**మార్గాల వివాదం..**

**పట్టుబడుతున్న అమెరికా, ఇరాన్**

హర్మ్యూజ్ జలసంధిని దాటడానికి రెండు మార్గాలు ఉన్నాయి. ఒమన్ సరిహద్దుల గుండా వెళ్లే దక్షిణ మార్గాన్ని అమెరికా, అంతర్జాతీయ నౌకాయాన సంస్థ (IMO) సమర్థిస్తుండగా, తమ జలాల గుండా వెళ్లే ఉత్తర మార్గాన్నే వాడాలని ఇరాన్ పట్టుబడుతోంది. ఇరాన్ దాడుల భయంతో దక్షిణ మార్గంలో నౌకల రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. కొన్ని నౌకలు తమ లొకేషన్ ట్రాకర్లను (ట్రాన్స్‌పాండర్లు) నిలిపివేసి రహస్యంగా ప్రయాణిస్తున్నట్లు సమాచారం.



**భద్రతా ఛార్జీలపై ట్రంప్ ప్రకటన**

ఇరాన్ ఈ జలసంధిని మూసివేస్తామని హెచ్చరించడంతో, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. హర్మ్యూజ్ జలసంధి ఎప్పటికీ తెరిచే ఉంటుందని, దానికి అమెరికా సైన్యమే సంరక్షకుడిగా ఉంటుందని స్పష్టం చేశారు. అయితే, ఈ మార్గం గుండా వెళ్లే అన్ని రకాల సరుకు రవాణాపై 20 శాతం భద్రతా రుసుము (ఛార్జీ) వసూలు చేస్తామని ట్రంప్ ప్రకటించడం అంతర్జాతీయంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ ప్రతిపాదనను అంతర్జాతీయ నౌకాయాన సంస్థ (IMO) తో పాటు ఇరాన్ కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.



## విడిపోతుంది, కలుస్తుంది, వస్తువులను మింగేస్తుంది.. కొరియా శాస్త్రవేత్తల అద్భుత ఆవిష్కరణ!

- జీవకణంలా ఆకారం మార్చుకునే లిక్విడ్ మెటల్ రోబో ఆవిష్కరణ
- దక్షిణ కొరియాలోని సియోల్, గచోన్ యూనివర్సిటీ శాస్త్రవేత్తల విజయం
- అయస్కాంత క్షేత్రాలతో నియంత్రణ.. ఇరుకు ప్రదేశాల్లోకి సులభంగా ప్రయాణం
- విడిపోవడం, తిరిగి కలవడం, వస్తువులను మింగేయడం దీని ప్రత్యేకతలు
- వైద్యం, పరిశ్రమలు, విపత్తు సహాయక చర్యల్లో వినియోగించే అవకాశం

టెక్నాలజీ రంగంలో మరో అద్భుతం ఆవిష్కృతమైంది. దక్షిణ కొరియా శాస్త్రవేత్తలు జీవకణంలా ప్రవర్తించే, తన ఆకారాన్ని మార్చుకోగల ఒక వినూత్నమైన లిక్విడ్ మెటల్ రోబోను అభివృద్ధి చేశారు. సియోల్ నేషనల్ యూనివర్సిటీ, గచోన్ యూనివర్సిటీ పరిశోధకులు సంయుక్తంగా రూపొందించిన ఈ రోబో, సాఫ్ట్ రోబోటిక్స్ రంగంలో ఒక మైలురాయిగా నిలవనుంది. ఈ అధ్యయన వివరాలు ప్రముఖ సైన్స్ అడ్వాన్సెస్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈ రోబోను ద్రవరూప లోహం (లిక్విడ్ మెటల్), అయస్కాంత కణాలతో తయారుచేశారు. దీని బయటి పొరపై నీటిని వికర్షించే (సూపర్ హైడ్రోఫోబిక్) కణాలతో కవచంలా ఏర్పాటు చేశారు. దీనివల్ల ఇది తన ఆకారాన్ని కోల్పోకుండా స్థిరంగా ఉంటుంది. బయటి నుంచి అయస్కాంత క్షేత్రాలను ఉపయోగించి బ్యాటరీలు లేదా మోటార్లు లేకుండానే దీనిని నియంత్రించవచ్చు. ఈ రోబో తన పరిమాణం కన్నా చిన్నవైన, ఇరుకైన ప్రదేశాల్లోకి కూడా సులభంగా దూరిపోయి, బయటకు వచ్చాక తిరిగి తన అసలు ఆకారాన్ని సంతరించుకోగలదు. అంతేకాదు, అవసరమైనప్పుడు చిన్నచిన్న రోబోలుగా విడిపోవడం, మళ్లీ అన్నీ కలిసి ఒకే రోబోగా మారిపోవడం దీని ప్రత్యేకత. శరీరంలోని కణాలు బాహ్య పదార్థాలను మింగేసినట్టుగా (ఫాగోసైటోసిస్), ఈ రోబో కూడా చిన్న వస్తువులను తనలో ఇముడ్చుకుని ఒకచోటి నుంచి మరోచోటికి రవాణా చేయగలదు. ఈ టెక్నాలజీ భవిష్యత్తులో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా రక్తనాళాల్లో ఏర్పడిన అడ్డంకులను తొలగించడానికి, శరీరంలోని నిర్దిష్ట భాగాలకు మందులను చేరవేయడానికి, అతి సూక్ష్మమైన సర్జరీలు చేయడానికి దీనిని ఉపయోగించవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ప్రస్తుతం ప్రయోగశాల దశలో ఉన్న ఈ రోబో, భవిష్యత్తులో పరిశ్రమలు, విపత్తు సహాయక చర్యల్లో కూడా కీలకపాత్ర పోషించగలదని అంచనా వేస్తున్నారు.

## ఫిఫా నాకౌట్ మ్యాచ్‌లు: బెంగళూరు హోటళ్లకు అర్ధరాత్రి దాటాక కూడా అనుమతి

- తెల్లవారుజామున 3:30 గంటల వరకు తెరిచి ఉంచేందుకు ప్రభుత్వ అనుమతి
- జులై 14, 15, 19 తేదీలకు మాత్రమే ఈ వెసులుబాటు వర్తింపు
- అభిమానుల సౌకర్యార్థం, ప్రజా భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ ఈ నిర్ణయం

నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి శివకుమార్ ప్రకటన ఫిఫా ప్రపంచకప్ 2026 పోటీల నేపథ్యంలో ఫుట్‌బాల్ అభిమానులకు కర్ణాటక ప్రభుత్వం తీపి కబురు అందించింది. సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లను పురస్కరించుకుని బెంగళూరు నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లను తెల్లవారుజామున 3:30 గంటల వరకు తెరిచి ఉంచేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ వెసులుబాటుతో అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగే మ్యాచ్‌లను క్రీడాభిమానులు ప్రత్యేక స్క్రీనింగ్‌ల ద్వారా వీక్షించే అవకాశం లభించింది. నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (NRAI) చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మంగళవారం వెల్లడించారు. జులై 14, 15, 19 తేదీల్లో ఈ ప్రత్యేక మినహాయింపు అమలులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. వివిధ దేశాల మధ్య ఉన్న సమయ వ్యత్యాసం కారణంగా, ఈ మ్యాచ్‌లు భారత కాలమానం ప్రకారం అర్ధరాత్రి దాటిన తర్వాతే ప్రసారం కానున్నాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి డీకే శివకుమార్ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, "ఫుట్‌బాల్ క్రీడ ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మందికి స్ఫూర్తినిస్తుంది. అభిమానుల అభ్యర్థన మేరకు బెంగళూరులో ఆహార సేవల సమయాన్ని అర్ధరాత్రి 1 గంట నుంచి 3:30 గంటల వరకు పొడిగిస్తున్నాం. ప్రజా భద్రత, శాంతిభద్రతలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూనే ఈ నిర్ణయం తీసుకున్నాం" అని తెలిపారు. కర్ణాటక పోలీస్ చట్టం నిబంధనల ప్రకారం ఇందుకు సంబంధించి తక్షణ ఉత్తర్వులు జారీ చేయాలని బెంగళూరు పోలీస్ కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

# విషాదంలోనూ రాజకీయమేనా..!

(మనసులో మాట ప్రత్యేక ప్రతినిధి)

రాష్ట్రంలో విషాదకర సంఘటనలు జరిగినప్పుడు వాటిని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం అధికార, ప్రతిపక్షాలకు అలవాటుగా మారిపోయింది.తాజాగా చోటు చేసుకున్న బోటు ప్రమాదం విషయంలో కూడా పార్టీలు ఇంచుమించు ఇదే ధోరణిని అవలంబించడం దురదృష్టకరం.కూటమి ప్రభుత్వం సరే.. బోటు ప్రమాదం జరిగిన తర్వాత కాస్త అటు ఇటుగా ఆలస్యం జరిగినా స్పందించి గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం ప్రయత్నాలు చేసింది.అలాగే ప్రమాదం నుంచి బయటపడిన మత్స్యకారుడు చిన్నా వైద్య సహాయం కోసం ఏర్పాట్లు చేసింది.మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడంలో కూడా ప్రభుత్వం తనవంతు చర్యలు తీసుకోండి ఈ సహాయం ఇప్పటికీ తక్కువే అనిపించవచ్చేమో గాని రానున్న రోజుల్లో మరింత సాయం అందించేదో లేదో ఈలోగా ప్రతిపక్ష వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రంగంలోకి దిగిపోయి ఈ విషాద ఘటనను రాజకీయ ప్రయోజనం కోసం వాడుకునే ప్రయత్నాన్ని విస్తృతంగా చేసింది..చేస్తోంది! ప్రభుత్వం తన పని తాను చేస్తుండగానే వైసిపి నాయకులు విమర్శల దాడి ప్రారంభించారు.ఈరోజంటే జగన్ విశాఖ వచ్చి హడావిడి చేశారు గాని వైసిపి నాయకులు ఒకరి తర్వాత విశాఖపట్నం వచ్చి హడావిడి చేస్తూనే ఉన్నారు.ఇప్పటికే జగన్మోహన్ రెడ్డి ఆసుపత్రిలో కోలుకుంటున్న చిన్నాని ఫోన్లో పరామర్శించారు..ఈరోజు ప్రత్యక్షంగా వచ్చారు.ఇలా రావడం తప్పు కాదు కాని ఇప్పటికే ఆందోళనలో..ఆవేదనతో ఉన్న మత్సకార కుటుంబాలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడడం విమర్శలకు గురైంది. ఈ విషయంలో స్వయంగా మత్స్యకారులే వైసిపి తీరుపై విరుచుకుపడుతున్నారు. వారి ఆవేదనలో అర్థం లేకపోలేదు. ఐదేళ్లు అధికారంలో ఉన్న జగన్మత్సకారుల్ని ఏనాడూ పట్టించుకోలేదు.అప్పట్లో రైతుభరోసా..వాహనమిత్ర వంటి పథకాలను అమలు చేసిన జగన్ ప్రభుత్వం మత్స్యకార భరోసా విషయంలో మొహం చాటేసింది. జగన్ ఐదేళ్ళ పాలనలో ఇలాగే అరవై మూడు మంది మత్స్యకారులు గల్లంతయితే ఒక్క కుటుంబానికి కూడా సాయం అందలేదు సరి కదా మరణ ధృవీకరణ సర్టిఫికెట్లు కూడా సకాలంలో అందలేదన్న విమర్శ ఉంది. ఓటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 63 మంది మత్స్యకారులకు కుటుంబానికి ఐదు లక్షలు రూపాయల చొప్పున బీమా సొమ్ము అందింది. ఇకపోతే.. 2023లో విశాఖ హార్బర్లో అగ్ని ప్రమాదం జరిగి సుమారు 45 మరబోట్లు పూర్తిగా,మరో 15 పడవలు పాక్షికంగా కాలిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు 50 కోట్ల రూపాయల మేరకు నష్టం జరిగినా జగన్ ప్రభుత్వం పెద్దగా సాయం అందించలేదని విమర్శలు ఉన్నాయి. అప్పట్లోనే చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ మత్స్యకారులకు వ్యక్తిగతంగా సహాయం అందించారు. అంతేకాదు.. అప్పట్లో మత్స్యకారుల చెరువులు, రిజర్వాయర్లను ఒక జీవో ద్వారా సొంత మనుషులకు కట్టబెట్టే ప్రయత్నాన్ని జగన్ సర్కార్ చేసిందని విమర్శలు ఉన్నాయి.ఇప్పుడు ఆ జీవో రద్దయింది.వైసీపీ ప్రభుత్వం హయాంలోనే ఆక్వా రంగం పూర్తిగా దెబ్బ తినేసింది. ఆనాడు మత్స్యకారులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిన జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు విశాఖపట్నం వచ్చి మత్స్యకార కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సానుభూతి పొందడమే కాకుండా కూటమి ప్రభుత్వాన్ని అస్థిర పరిచే ప్రయత్నాలు చేస్తుందన్న విమర్శలు పెద్ద ఎత్తున మొదలయ్యాయి.




# భగ్గుమన్న చమురు

పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా మార్కెట్లు ఒడుదొడుకులను ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో దేశీయ మార్కెట్లు మంగళవారం నష్టాల్లో ప్రారంభయ్యాయి. హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలతో చమురు మంటలు భగ్గుమంటున్నాయి. దాంతో సూచీలపై ప్రతికూల ప్రభావం పడింది. హర్మూజ్‌ను దిగ్బంధిస్తున్నాం.. టోల్ వసూలు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో మరోసారి చమురు ధరలు భారీగా పెరిగాయి. నెలరోజుల గరిష్ఠానికి చేరాయి. బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ ఒక బ్యారెల్‌కు రెండు శాతం పెరిగి 85 డాలర్లకు చేరింది. యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ క్రూడ్ రెండు శాతం పెరిగి 80 డాలర్లకు పెరిగింది. గత సెషన్‌లో 9.6 శాతం పెరిగింది. 2020 మే తర్వాత ఒకేరోజు ఈ స్థాయి పెరుగుదల నమోదైంది. ఈ పరిణామాల నేపథ్యంలో.. ఉదయం 9.39 గంటల సమయంలో సెన్సెక్స్ 412 పాయింట్లు పడిపోయి, 77,203 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 107 పాయింట్లు నష్టపోయి, 24,103 వద్ద కదలాడుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 42 పైసలు పడిపోయి, 96.10కి కుంగింది. నిఫ్టీ సూచీలో హిందాల్కో, సిప్లా, భారతీ ఎయిర్‌టెల్, నెస్లె, టీసీఎస్ షేర్లు లాభాల్లో ఉండగా.. శ్రీరామ్ ఫైనాన్స్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎంఅండ్ఎం షేర్లు నష్టపోతున్నాయి. ఇక, సోమవారం అమెరికా మార్కెట్లు నష్టపోగా.. ఆసియా మార్కెట్లు అదే బాటలో ఉన్నాయి.

# పాత vs కొత్త ట్యాక్స్: ఏది బెస్ట్?




ఆదాయపు పన్ను దాఖలు చేసే సీజన్ వచ్చిందంటే చాలా మంది పన్ను చెల్లింపుదారుల ముందు కొచ్చే పెద్ద సందేహం.. పాత ట్యాక్స్ విధానం ఎంచుకోవాలా? లేక కొత్త ట్యాక్స్ విధానం తీసుకోవాలా? ఈసారి మాత్రం ఎక్కువ మంది ఉద్యోగులకు కొత్త ట్యాక్స్ విధానమే లాభదాయకంగా ఉండొచ్చని తాజా విశ్లేషణలు చెబుతున్నాయి. అయితే భారీ మొత్తంలో పన్ను మినహాయింపులు క్లెయిమ్ చేసే వారికి పాత విధానం ఇంకా ప్రయోజనకరంగా ఉండే అవకాశముందని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం కొత్త ట్యాక్స్ విధానమే డిఫాల్ట్‌గా అమల్లో ఉంది. పన్ను చెల్లింపుదారులు ప్రత్యేకంగా పాత విధానాన్ని ఎంపిక చేయకపోతే వారి ఆదాయపు పన్ను రిటర్న్ కొత్త విధానం ప్రకారమే ప్రాసెస్ అవుతుంది. అందువల్ల రిటర్న్ దాఖలు చేసే ముందు రెండు విధానాల్లో పన్ను లెక్కలు వేసుకుని నిర్ణయం తీసుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. గ్రాంట్ థార్న్టన్ భారత్ 202526 ఆర్థిక సంవత్సరానికి చేసిన విశ్లేషణ ప్రకారం.. 60 ఏళ్లలోపు జీతభత్యాలు తీసుకునే వ్యక్తి పాత విధానంలో సెక్షన్ 80C కింద రూ.1.5 లక్షలు, సెక్షన్ 80D కింద రూ.25 వేల ఆరోగ్య బీమా, రూ.2 లక్షల HRA, రూ.50 వేల స్టాండర్డ్ డిడక్షన్ కలిపి మొత్తం రూ.4.25 లక్షల డిడక్షన్లు క్లెయిమ్ చేసినా, రూ.25 లక్షల వార్షిక ఆదాయంపై పన్ను సుమారు రూ.4,52,400 చెల్లించాల్సి ఉంటుంది. అదే కొత్త ట్యాక్స్ విధానంలో రూ.75 వేల స్టాండర్డ్ డిడక్షన్‌తో పన్ను రూ.3,19,800 మాత్రమే ఉంటుంది. అంటే దాదాపు రూ.1,32,600 వరకు ఆదా అవుతుంది. ఇదే విధంగా రూ.50 లక్షల వార్షిక ఆదాయం ఉన్నవారికి కూడా కొత్త విధానంలో దాదాపు రూ.1.32 లక్షల వరకు పన్ను ఆదా అవుతుందని చెబుతున్నారు. రూ.75 లక్షలు, రూ.1 కోటి ఆదాయం ఉన్నవారికి 10 శాతం సర్‌చార్జ్ వర్తించినప్పటికీ కొత్త ట్యాక్స్ విధానంలో సుమారు రూ.1.46 లక్షల వరకు ఆదా అవుతుందని ఈ నివేదిక పేర్కొంది.

అయితే పాత ట్యాక్స్ విధానం పూర్తిగా ఉపయోగం లేకుండా పోయిందని భావించాల్సిన అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా సెక్షన్ 24(b) కింద హోమ్ లోన్ వడ్డీపై రూ.2 లక్షల వరకు మినహాయింపు, మెట్రో నగరాల్లో అధిక HRA, 80CCD(1B) కింద NPSలో అదనపు పెట్టుబడులు, సీనియర్ సిటిజన్ తల్లిదండ్రుల ఆరోగ్య బీమాపై అధిక 80D డిడక్షన్లు వంటి ప్రయోజనాలు పొందే వారికి పాత విధానం ఇంకా లాభదాయకంగా ఉండే అవకాశం ఉందని వెల్లడించారు. మొత్తం డిడక్షన్లు రూ.8 లక్షలకు పైగా ఉంటే రెండు విధానాలను తప్పనిసరిగా పోల్చి చూసి నిర్ణయం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. "పాత, కొత్త ట్యాక్స్ విధానాల్లో ఏది ఎంచుకోవాలన్నది అందరికీ ఒకేలా ఉండదు. కొత్త విధానం తక్కువ పన్ను రేట్లు, సులభమైన విధానాన్ని అందిస్తున్నప్పటికీ, ఎక్కువ డిడక్షన్లు, మినహాయింపులు పొందే వారికి పాత విధానం మెరుగైన ఫలితాలు ఇవ్వొచ్చు. కాబట్టి కేవలం పన్ను రేట్లను చూసి కాకుండా, వ్యక్తిగత ఆదాయం, డిడక్షన్లు, మినహాయింపుల ఆధారంగా పన్ను లెక్కలు వేసుకుని నిర్ణయం తీసుకోవాలి" అని నిపుణులు సూచిస్తున్నారు. జీతభత్యాలు పొందే ఉద్యోగులకు ప్రతి ఏడాది ట్యాక్స్ విధానాన్ని మార్చుకునే అవకాశం ఉంటుంది. కంపెనీ TDS కొత్త విధానం ప్రకారం కట్ చేసినా, ఐటీఆర్ దాఖలు చేసే సమయంలో పాత విధానాన్ని ఎంచుకుని అదనంగా చెల్లించిన పన్నును రీఫండ్ రూపంలో పొందే అవకాశం ఉంటుంది. అయితే వ్యాపార లేదా వృత్తి ఆదాయం ఉన్న వారు మాత్రం ట్యాక్స్ విధానం ఎంపికలో మరింత జాగ్రత్తగా ఉండాల్సి ఉంటుందని చెబుతున్నారు. నిపుణుల సూచన ప్రకారం.. ఐటీఆర్ ఫైల్ చేసే ముందు ఆదాయపు పన్ను శాఖ అందుబాటులో ఉంచిన ట్యాక్స్ కాలిక్యులేటర్ ద్వారా రెండు విధానాల్లో పన్ను లెక్కలు వేసుకోవాలన్నారు. డిడక్షన్లు తక్కువగా ఉంటే కొత్త విధానం ఎక్కువ ప్రయోజనం ఇవ్వొచ్చని, భారీ డిడక్షన్లు ఉంటే రెండు విధానాలను పోల్చి చూసి తమకు ఏది లాభదాయకమో నిర్ణయం తీసుకోవడం ఉత్తమమని సూచిస్తున్నారు.



# వన్‌ప్లస్‌కు పశ్చిమ మార్కెట్ల గుడ్‌బై!

ఒకప్పుడు "ఫ్లాగ్‌షిప్ కిల్లర్" గా మార్కెట్లోకి అడుగుపెట్టి, సగం ధరకే ప్రీమియం ఫీచర్లను అందిస్తూ గ్లోబల్ మొబైల్ రంగంలో సంచలనం సృష్టించిన ప్రముఖ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ 'వన్‌ప్లస్' తన సుదీర్ఘ ప్రయాణాన్ని ముగించే దిశగా అడుగులు వేస్తోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. వన్‌ప్లస్ బ్రాండ్ అమెరికా, యూరప్ మార్కెట్ల నుండి మొబైల్ విక్రయాలను పూర్తిగా నిలిపివేయడానికి సిద్ధమవుతోంది. జర్మనీకి చెందిన ప్రముఖ మీడియా సంస్థ 'విన్‌ఫ్యూచర్' కథనం ప్రకారం.. వన్‌ప్లస్, దాని మాతృ సంస్థ 'ఒప్పో'తమ వ్యాపార వ్యూహంలో భాగంగా ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన రెండు పశ్చిమ దేశాల మార్కెట్ల నుండి వన్‌ప్లస్ బ్రాండ్ పూర్తిగా నిష్క్రమించబోతోంది. ఇప్పటికే దీనికి సంబంధించి రహస్య ప్రెస్ మీటింగ్‌లు కూడా పూర్తయ్యాయని, అయితే ఈ నిర్ణయం వెనుక గల ఖచ్చితమైన కారణాలను వెల్లడించడానికి కంపెనీ ప్రతినిధులు నిరాకరించినట్లు సమాచారం.

**భారత్, చైనా మార్కెట్లలో యథాతథం**

ఈ నిష్క్రమణ వార్తల్లో భారత్, చైనా మార్కెట్ల ప్రస్తావన ఎక్కడా రాలేదు. ఒప్పో(Oppo) గొడుగు కింద వన్‌ప్లస్ బ్రాండ్ కేవలం ఒక సబ్‌ప్రొడక్ట్ లైన్‌గా మాత్రమే ఈ రెండు దేశాల్లో కొనసాగే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. అంటే తక్కువ బడ్జెట్ ఫోన్లు, టాబ్లెట్‌ల విక్రయాలకే పరిమితం కానుందని సమాచారం. నిజానికి వన్‌ప్లస్ బ్రాండ్ ఇప్పటికీ మనుగడ సాగించడానికి ప్రధాన కారణం భారతదేశమే. వన్‌ప్లస్ గ్లోబల్ సేల్స్‌లో సగానికి పైగా వాటా భారత్ నుంచే వస్తోంది. ముఖ్యంగా ఇక్కడి మిడ్‌రేంజ్ మార్కెట్లో వన్‌ప్లస్ 'నార్డ్' (Nord) సిరీస్ ఫోన్లకు విపరీతమైన డిమాండ్ ఉంది.

**పాత ఫోన్ల యూజర్ల పరిస్థితి ఏంటి?**

అయితే, ఇప్పటికే వన్‌ప్లస్ ఫోన్లు వాడుతున్న కస్టమర్ల విషయంలో కంపెనీ సానుకూలంగా స్పందించింది. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న మరియు ఇప్పటికే విక్రయించిన డివైజ్‌లకు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌లు, ఆఫ్టర్‌సేల్స్ సర్వీస్ యథావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేసింది. కాకపోతే.. ఇకపై కొత్త ఫోన్ల లాంచ్ ఉండదు, కొత్త స్టాక్ రాదు, ఎలాంటి మార్కెటింగ్ ప్రచారాలు జరగవు. ప్రస్తుతం అమెరికా, యూరప్‌లలో మిగిలి ఉన్న స్టాక్‌ను రాబోయే కొద్ది వారాల్లో విక్రయించి క్లియర్ చేయనున్నారు. ఇప్పటికే జర్మనీ, ఫ్రాన్స్, స్పెయిన్ దేశాల్లోని వన్‌ప్లస్ ఆన్‌లైన్ స్టోర్స్ దాదాపు ఖాళీ అయ్యాయి.

యూరప్ మార్కెట్లో వన్‌ప్లస్ వదిలిన స్థానాన్ని ఒప్పో భర్తీ చేయాలని చూస్తోంది. కానీ, ఒప్పో ఫోన్ల ధరలు వన్‌ప్లస్ కంటే చాలా ఎక్కువ. ఒక వాల్యూఫర్‌మనీ బ్రాండ్ స్థానాన్ని ప్రీమియం బ్రాండ్‌తో భర్తీ చేయాలనుకోవడం పెద్ద మైనస్ అని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఒప్పో నుండి దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నప్పటికీ.. ఇటీవల విడుదలైన 'వన్‌ప్లస్ 15' (OnePlus 15) పాశ్చాత్య దేశాలలో ఈ బ్రాండ్ నుండి వచ్చిన చివరి ఫ్లాగ్‌షిప్ ఫోన్‌గా మిగిలిపోనుంది.

# క్రెడిట్ కార్డులతో ఎల్ఐసీ ప్రీమియంల బంద్!




ప్రముఖ ప్రభుత్వరంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(LIC) తమ పాలసీదారులకు ఊహించని షాక్ ఇచ్చింది. తన అధికారిక వెబ్‌సైట్ అంటే కస్టమర్ పోర్టల్, మొబైల్ యాప్‌లో క్రెడిట్ కార్డ్ (Credit Card) ద్వారా ప్రీమియం చెల్లించే ఆప్షన్‌ను పూర్తిగా నిలిపివేసింది. గత 15 రోజుల క్రితమే గుట్టుచప్పుడు కాకుండా ఈ నిర్ణయం అమలులోకి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఎల్ఐసీ అధికారిక వేదికలపై కేవలం నెట్ బ్యాంకింగ్, డెబిట్ కార్డ్, యూపీఐ (UPI) ఆప్షన్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

**ఎందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు?**

సాధారణంగా గూగుల్ పే, ఫోన్ పే వంటి ఇతర థర్డ్ పార్టీ ప్లాట్‌ఫామ్‌లలో క్రెడిట్ కార్డుతో ఎల్ఐసీ ప్రీమియం చెల్లిస్తే కస్టమర్లపై అదనపు రుసుములు పడేవి. కానీ, ఎల్ఐసీ అధికారిక యాప్‌లో క్రెడిట్ కార్డుతో చెల్లించినప్పుడు ఆ కార్డ్ గేట్‌వే ఛార్జీలను వినియోగదారుల తరఫున ఎల్ఐసీనే భరించేది. అయితే, ఇటీవల కాలంలో క్రెడిట్ కార్డుల ద్వారా ప్రీమియం చెల్లించే వారి సంఖ్య భారీగా పెరిగింది. దీనివల్ల బ్యాంకులు, పేమెంట్ గేట్‌వేలకు ఎల్ఐసీ చెల్లించాల్సిన ఫీజుల భారం కోట్లాది రూపాయలకు చేరింది. ఈ అదనపు ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడానికే ఎల్ఐసీ తన పోర్టల్ నుండి క్రెడిట్ కార్డ్ చెల్లింపుల ఆప్షన్‌ను శాశ్వతంగా తొలగించినట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

**ఇప్పుడు చెల్లింపులు ఎలా?**

ఒకవేళ ఖచ్చితంగా క్రెడిట్ కార్డునే ఉపయోగించి ఎల్ఐసీ ప్రీమియం చెల్లించాలనుకుంటే, ఈ క్రింది ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవచ్చు. గూగుల్ పే (Google Pay), ఫోన్ పే (PhonePe), పేటీఎం (Paytm), అమెజాన్ పే (Amazon Pay) వంటి యాప్స్ ద్వారా క్రెడిట్ కార్డు ఉపయోగించి ప్రీమియం చెల్లించవచ్చు. అయితే, ఈ యాప్స్ ద్వారా చెల్లించేటప్పుడు వర్తించే ట్రాన్సాక్షన్, కన్వీనియన్స్ ఫీజుల భారాన్ని వినియోగదారులే స్వయంగా భరించాల్సి ఉంటుంది. ఎలాంటి అదనపు రుసుములు (Extra Charges) లేకుండా ఉచితంగా ప్రీమియం చెల్లించాలనుకుంటే ఎల్ఐసీ అధికారిక యాప్‌లో UPI, డెబిట్ కార్డ్, నెట్ బ్యాంకింగ్ మార్గాలను ఎంచుకోవాల్సి ఉంటుంది.

### కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డ్ యూజర్ల అసంతృప్తి

యాక్సిస్ బ్యాంక్ (Axis Bank), ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ (IDFC First Bank) వంటి సంస్థలతో కలిసి ఎల్ఐసీ జారీ చేసిన కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డులకు కూడా ఈ కొత్త నిబంధన వర్తిస్తుంది. ఇతర ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ప్రీమియం చెల్లించినప్పుడు రివార్డు పాయింట్లు లభించినప్పటికీ, గేట్‌వే ఛార్జీల భారం పడటంతో ఈ కో-బ్రాండెడ్ కార్డుల వల్ల అసలు ప్రయోజనం ఏముందని పాలసీదారులు సామాజిక మాధ్యమాల్లో పెదవి విరుస్తున్నారు.

# ధ్రువ స్పేస్‌కు ₹60 కోట్లు

**హైదరాబాద్:**

భారత అంతరిక్ష రంగం అభివృద్ధికి ప్రత్యేకించిన 'అంతరిక్ష వెంచర్ క్యాపిటల్ ఫండ్' నుంచి పెట్టుబడులు అందుకున్న దేశీయ తొలి సంస్థగా హైదరాబాద్‌కు చెందిన ధ్రువ స్పేస్ నిలిచింది. ఈ సంస్థకు రూ.60 కోట్లు లభించాయి. భారత ప్రభుత్వానికి చెందిన ఇన్‌స్పేస్ ఆధ్వర్యంలోని అంతరిక్ష వెంచర్ వద్ద రూ.1,000 కోట్లు ఉండగా, సిడ్బీ పూర్తి అనుబంధ సంస్థ సిడ్బీ వెంచర్ క్యాపిటల్ లిమిటెడ్ ఈ మొత్తాన్ని నిర్వహిస్తోంది. స్వదేశీ ఉపగ్రహాల తయారీ సామర్థ్యాలను బలోపేతం చేసుకోవడం, సరికొత్త ఉత్పత్తుల ఆవిష్కరణను వేగవంతం చేయడం, మౌలిక వసతులను అంతర్జాతీయ స్థాయికి విస్తరించేందుకు ఈ నిధులు వినియోగిస్తామని ధ్రువస్పేస్ సహ వ్యవస్థాపకుడు, సీఎఫ్ఓ చైతన్య దొర సూరపరెడ్డి పేర్కొన్నారు.

సిడ్బీ వెంచర్ క్యాపిటల్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ అరూప్ కుమార్ స్పందిస్తూ.. ఆవిష్కరణలు, తయారీ సామర్థ్యం, అంతరిక్ష ప్రయోగాల నిర్వహణ, వాణిజ్య విస్తరణను ఒకే చోట అందించే సంస్థలే రేపటి తరం అంతరిక్ష దిగ్గజాలుగా వృద్ధి చెందుతాయన్నారు. తమ తొలి పెట్టుబడి ఆ నమ్మకాన్ని ప్రతిబింబిస్తోందని తెలిపారు.

# తగ్గిన బంగారం ధరలు..

మంగళవారం బంగారం ధరలు మరింత తగ్గాయి. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై 110 రూపాయలు.. 22 క్యారెట్ల బంగారంపై 100 రూపాయలు.. 18 క్యారెట్ల బంగారంపై 80 రూపాయలు తగ్గింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం.. ఉదయం 10 గంటల ప్రాంతంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,42,800 రూపాయల వద్ద.. 22 క్యారెట్ల బంగారం ధర 1,30,900 రూపాయల వద్ద.. 18 క్యారెట్ల బంగారం ధర 1,07,100 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది.



# మార్కెట్ అంచనాలను మించిన హెచ్‌సీఎల్ టెక్!

- **వార్షికాదాయ వృద్ధి 1-4 శాతంగా అంచనా**
- **ఒక్కో షేరుకు రూ.12 మధ్యంతర డివిడెండ్**
- **సంస్థ ఉద్యోగుల సంఖ్యలో 3,292 తగ్గుదల**
- **క్యూ1 లాభంలో 20% వృద్ధి**
- **రూ.4,624 కోట్లుగా నమోదు**
- **రూ.34,579 కోట్లకు ఆదాయం**




**న్యూఢిల్లీ:**

దేశీయ ఐటీ సేవల సంస్థ హెచ్‌సీఎల్ టెక్ ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాలను మించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (202627)లో జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి (క్యూ1) కంపెనీ రూ.4,624 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం (202526)లో ఇదే కాలానికి నమోదైన రూ.3,843 కోట్ల లాభంతో పోలిస్తే 20 శాతం వృద్ధి కనబరిచింది. ఈ క్యూ1లో కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 14 శాతం పెరిగి రూ.34,579 కోట్లకు చేరుకుంది. ఈ ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఆదాయ వృద్ధి అంచనాను గతంలో ప్రకటించిన 14 శాతంగా కొనసాగిస్తున్నట్లు సంస్థ వెల్లడించింది. కాగా, వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.12 మధ్యంతర డివిడెండ్ చెల్లించనున్నట్లు హెచ్‌సీఎల్ టెక్ బోర్డు ప్రకటించింది. డివిడెండ్‌కు అర్హులైన వాటాదారుల ఎంపికకు రికార్డు తేదీని ఈ నెల 17గా నిర్ణయించిన కంపెనీ.. 27న చెల్లింపులు చేపట్టనున్నట్లు తెలిపింది. మరిన్ని ముఖ్యాంశాలు.. ఏప్రిల్‌జూన్ త్రైమాసికంలో సంస్థ.. జర్మనీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ నుంచి 114 కోట్ల డాలర్ల విలువైన మెగా ఏఐ డీల్‌తో సహా మొత్తం 240 కోట్ల డాలర్ల విలువైన కొత్త ఆర్డర్లను దక్కించుకుంది. సంస్థ చరిత్రలో ఇవే అత్యధిక క్యూ1 ఆర్డర్లని హెచ్‌సీఎల్ టెక్ సీఈఓ, ఎండీ సీ విజయ్ కుమార్ తెలిపారు. అడ్వాన్స్‌డ్ ఏఐ సేవల ద్వారా సంస్థకు గడిచిన మూడు నెలల్లో 17.1 కోట్ల డాలర్ల ఆదాయం సమకూరింది. ఈ విషయంలో త్రైమాసిక ప్రాతిపదికన 10.6 శాతం, వార్షిక ప్రాతిపదికన ఏకంగా 62.1 శాతం వృద్ధిని నమోదు చేసింది. జూన్ త్రైమాసికంలో హెచ్‌సీఎల్ టెక్ మొత్తం ఉద్యోగుల సంఖ్య 3,292 తగ్గి 2,23,889కి పరిమితమైంది. మూడు నెలల్లో కంపెనీ సిబ్బంది ఈ స్థాయిలో తగ్గడం గడిచిన రెండేళ్లలో ఇదే మొదటిసారి.

**రూ.3,500 కోట్లతో ఏఐ డేటా సెంటర్ల ఏర్పాటు**

దేశంలో 50 మెగావాట్ల వరకు సామర్థ్యంతో ఏఐ డేటా సెంటర్ల ఏర్పాటు కోసం రూ.3,500 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు బోర్డు ఆమోదం తెలిపిందని హెచ్‌సీఎల్ టెక్ సోమవారం ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా వెల్లడించింది. డేటా సెంటర్ల ఏర్పాటు కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్న కొత్త అనుబంధ విభాగాల ద్వారా ఈ పెట్టుబడులు పెట్టనున్నట్లు సంస్థ తెలిపింది. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల నుంచి ఏఐ ఆధారిత సేవలు, పరిష్కారాలకు గిరాకీ పెరుగుతున్న తరుణంలో ఈ విభాగం పూర్తి స్థాయి వ్యాపార అవకాశాలను చేజిక్కించుకునేందుకు ఫుల్ స్టాక్ ఏఐ మార్కెట్లోకి ప్రవేశిస్తున్నట్లు కంపెనీ ప్రకటించింది.

గత త్రైమాసికంలో 1,059 మంది ఫ్రెషర్లను ఉద్యోగంలో చేర్చుకున్నట్లు సంస్థ తెలిపింది. కాగా, ఉద్యోగుల వలసల (అట్రిషన్) రేటు 12.7 శాతానికి పెరిగింది.

# సీఎస్కే కొత్త కోచ్ రేసులో ముగ్గురు.. భారత్ నుంచి ఇద్దరు క్రికెట్ దిగ్గజాలు!

- సీఎస్కే కొత్త కోచ్ రేసులో ముగ్గురు.. భారత్ నుంచి ఇద్దరు క్రికెట్ దిగ్గజాలు!
- 18 ఏళ్ల అనుబంధానికి స్టీఫెన్ ఫ్లెమింగ్ ముగింపు
- సీఎస్కే కొత్త కోచ్ రేసులో ముగ్గురు పేర్లు
- చెన్నై యాజమాన్యం ఎవరిని ఎంపిక చేస్తుందో




ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) చరిత్రలో అత్యంత విజయవంతమైన కోచ్‌లలో ఒకరిగా గుర్తింపు పొందిన స్టీఫెన్ ఫ్లెమింగ్.. చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే)తో తన 18 ఏళ్ల అనుబంధానికి ముగింపు పలికాడు. 2008లో ఐపీఎల్ ప్రారంభ సీజన్‌లో సీఎస్కే తరపున ఆటగాడిగా బరిలోకి దిగిన ఫ్లెమింగ్.. 2009 నుంచి హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టి ఫ్రాంచైజీని విజయాల బాటలో నడిపించాడు. ఫ్లెమింగ్ మార్గదర్శకత్వంలో సీఎస్కే ఐదు ఐపీఎల్ టైటిళ్లు, రెండు చాంపియన్స్ లీగ్ టీ20 ట్రోఫీలను గెలుచుకుంది. అంతేకాదు 10 ఐపీఎల్ ఫైనల్స్, 12 సార్లు ప్లేఆఫ్స్‌కు చేరి లీగ్‌లో అత్యంత స్థిరమైన జట్టుగా నిలిచింది. దాదాపు రెండు దశాబ్దాల పాటు సీఎస్కే విజయాల వెనుక ప్రధాన శక్తిగా ఫ్లెమింగ్ నిలిచాడు.

**స్వయంగా తప్పుకున్న ఫ్లెమింగ్:**

అయితే గత మూడు సీజన్లుగా సీఎస్కే ఆశించిన స్థాయిలో రాణించలేదు. 2023లో టైటిల్ గెలిచిన తర్వాత 2024లో ఐదో స్థానం, 2025లో పదో స్థానం, 2026లో ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలోనే న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ స్టీఫెన్ ఫ్లెమింగ్ జట్టు నుంచి స్వయంగా తప్పుకున్నాడు. పరస్పర అంగీకారంతోనే వైదొలిగినట్లు ఫ్లెమింగ్ సహా చెన్నై యాజమాన్యం కూడా తెలిపింది. ఫ్లెమింగ్ వైదొలగడంతో ఇప్పుడు అతడి స్థానాన్ని భర్తీ చేసే కోచ్ ఎవరు అనే చర్చ సోషల్ మీడియాలో మొదలైంది. సీఎస్కే కొత్త కోచ్ రేసులో ముగ్గురు పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. అందులో ఇద్దరు భారత దిగ్గజాల పేర్లు ఉన్నాయి.

**రాహుల్ ద్రవిడ్:**

టీమిండియాకు 2024 టీ20 ప్రపంచ కప్‌ను అందించిన మాజీ హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ సీఎస్కేకు ప్రధాన ఎంపికగా కనిపిస్తున్నాడు. ప్రస్తుతం ఏ జట్టుకూ కోచ్‌గా వ్యవహరించని ద్రవిడ్‌కు ఎంతో అనుభవం ఉంది. 2018లో భారత అండర్19 జట్టును ప్రపంచ ఛాంపియన్‌గా నిలబెట్టిన ఆయన.. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు కూడా కోచ్‌గా పనిచేశాడు. ద్రవిడ్ ప్రశాంత స్వభావం, యువ ఆటగాళ్లను తీర్చిదిద్దే నైపుణ్యం సీఎస్కే సంస్కృతికి బాగా సరిపోతాయని క్రికెట్ వర్గాలు అంటున్నాయి. మంచి అవకాశం వస్తే మళ్లీ కోచింగ్ బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు ద్రవిడ్ ఇటీవలే వెల్లడించాడు.

**మార్క్ బౌచర్:**

దక్షిణాఫ్రికా మాజీ వికెట్ కీపర్‌బ్యాటర్ మార్క్ బౌచర్ కూడా సీఎస్కే పరిశీలనలో ఉన్న మరో బలమైన అభ్యర్థి. 2019 నుంచి 2022 వరకు దక్షిణాఫ్రికా జాతీయ జట్టుకు హెడ్ కోచ్‌గా పనిచేసిన బౌచర్.. ఆ తర్వాత ముంబై ఇండియన్స్‌కు కూడా కోచ్‌గా సేవలందించాడు. అతని నాయకత్వంలో ముంబై 2023 సీజన్‌లో ప్లేఆఫ్స్‌కు చేరింది. అంతకుముందు దక్షిణాఫ్రికా దేశవాళీ జట్టు 'టైటాన్స్'ను నడిపించిన అనుభవం కూడా బౌచర్‌కు ఉంది. అంతర్జాతీయ, ఫ్రాంచైజీ క్రికెట్‌లో అతని అనుభవం సీఎస్కేకు ఉపయోగపడే అవకాశం ఉంది.

**ఎంఎస్ ధోనీ:**

చెన్నై అభిమానులు ఎక్కువగా కోరుకునే పేరు ఎంఎస్ ధోనీ. ప్రస్తుతం అధికారికంగా ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ప్రకటించకపోయినా.. 2026 సీజన్‌లో కాలి కండరాల గాయం కారణంగా ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. ఇటీవలే 45 ఏళ్లు పూర్తి చేసుకున్న ధోనీ.. త్వరలో ఆటకు వీడ్కోలు పలికే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే సీఎస్కే హెడ్ కోచ్‌గా ధోనీ బాధ్యతలు చేపట్టే అవకాశం కూడా ఉందని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జట్టుతో అతనికి ఉన్న అనుబంధం, ఆటగాళ్లపై ప్రభావం, వ్యూహాత్మక ఆలోచనలు సీఎస్కేను మళ్లీ విజయాల బాటలో నడిపించగలవు.

**సీఎస్కే ముందు పెద్ద సవాలు:**

స్టీఫెన్ ఫ్లెమింగ్ వంటి దిగ్గజ కోచ్ స్థానాన్ని భర్తీ చేయడం అంత తేలికైన విషయం కాదు. కొత్త కోచ్ జట్టును మళ్లీ టైటిల్ పోరులో నిలబెట్టడమే కాకుండా.. ఆధునిక టీ20 క్రికెట్‌కు తగ్గట్టుగా సీఎస్కే ఆటతీరును మార్చాల్సిన బాధ్యత కూడా ఉంటుంది. కోచ్ రేసులో ప్రస్తుతం రాహుల్ ద్రవిడ్, మార్క్ బౌచర్, ఎంఎస్ ధోనీ పేర్లు బలంగా వినిపిస్తున్నా.. చివరికి చెన్నై యాజమాన్యం ఎవరిని ఎంపిక చేస్తుందో అనేది ఆసక్తికరంగా మారింది.




## రీఎంట్రీ మ్యాచ్‌లో రికార్డుల వర్షం..
# చరిత్ర సృష్టించిన బుమ్రా..

భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా వన్డే క్రికెట్‌లో ఘనంగా రీఎంట్రీ ఇచ్చాడు. 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్ తర్వాత 968 రోజుల విరామం అనంతరం ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి వన్డేలో బరిలోకి దిగిన బుమ్రా, రీఎంట్రీ మ్యాచ్‌లోనే రెండు అరుదైన రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరుగుతున్న తొలి వన్డేలో టాస్ గెలిచిన ఇంగ్లండ్ బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి స్పెల్‌లో నాలుగు ఓవర్లు వేసిన బుమ్రాకు వికెట్ దక్కలేదు. అయితే పవర్‌ప్లే అనంతరం రెండో స్పెల్‌లో తొలి బంతికే ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్‌ను ఔట్ చేసి తన సత్తా చాటాడు. రోహిత్ శర్మ ఫస్ట్ స్లిప్‌లో అద్భుత క్యాచ్ అందుకోవడంతో బుమ్రా ఖాతాలో కీలక వికెట్ చేరింది.. ఈ వికెట్‌తో బుమ్రా.. ఇంగ్లండ్ గడ్డపై వన్డేల్లో 31 వికెట్లు పూర్తి చేసి కొత్త చరిత్ర సృష్టించాడు. దీంతో ఇంగ్లండ్‌లో అత్యధిక వన్డే వికెట్లు తీసిన భారత బౌలర్‌గా నిలిచాడు. ఈ జాబితాలో ఇప్పటివరకు రవీంద్ర జడేజా 30 వికెట్లతో అగ్రస్థానంలో ఉండగా, బుమ్రా అతడిని అధిగమించాడు. భువనేశ్వర్ కుమార్ (28), మదన్ లాల్ (27), మహ్మద్ షమీ (26) తదుపరి స్థానాల్లో ఉన్నారు. అంతేకాకుండా హ్యారీ బ్రూక్ వికెట్ బుమ్రా వన్డే కెరీర్‌లో 150వ వికెట్ కావడం మరో విశేషం. దీంతో వన్డేల్లో 150 వికెట్లు పూర్తి చేసిన భారత బౌలర్ల జాబితాలో చోటు దక్కించుకున్నాడు. కేవలం 4,605 బంతుల్లోనే ఈ ఘనత సాధించిన బుమ్రా, అత్యంత వేగంగా 150 వన్డే వికెట్లు తీసిన భారత బౌలర్ల జాబితాలో మహ్మద్ షమీ (4,070 బంతులు), కుల్దీప్ యాదవ్ (4,513 బంతులు) తర్వాత మూడో స్థానంలో నిలిచాడు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే, ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్నాడు. అయితే భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కూడా తాము ముందుగా బౌలింగ్ చేయాలనే ఆలోచనతోనే ఉన్నామని వెల్లడించాడు. టీ20 సిరీస్ అనంతరం జట్టులో మంచి వాతావరణం ఉందని, అందరూ బాగా సన్నద్ధమయ్యారని గిల్ తెలిపాడు. బుమ్రా రీఎంట్రీతో భారత బౌలింగ్ దళానికి మరింత బలం చేకూరిందని అభిమానులు భావిస్తున్నారు.



## ఫ్లెమింగ్ ఔట్..CSK కోసం
# రంగంలోకి ద్రావిడ్ ?

చెన్నై సూపర్ కింగ్స్ హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన కోచ్ పదవికి రాజీనామా చేస్తూ, చెన్నై సూపర్ కింగ్స్ జట్టుతో బంధం తెంపుకున్నారు. దాదాపు 18 సంవత్సరాలుగా ఆ జట్టుకు సేవలు అందించిన స్టీఫెన్ ఫ్లెమింగ్... 2008లో ప్లేయర్ గా కూడా ఆడారు. అనంతరం హెడ్ కోచ్ బాధ్యతలు తీసుకున్నారు. వరుస సీజన్లలో చెన్నై ప్రదర్శన సరిగ్గా లేకపోవడంతో, స్టీఫెన్ ఫ్లెమింగ్ తప్పుకున్నట్లు సమాచారం.

**స్టీఫెన్ ఫ్లెమింగ్ స్థానంలో ఎవరంటే ?**

చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు దూరమైన స్టీఫెన్ ఫ్లెమింగ్ స్థానంలో కొత్త హెడ్ కోచ్ కోసం ప్రయత్నాలు మొదలు పెట్టింది యాజమాన్యం. ఈ క్రమంలోనే హేమంగ్ బదానీ, బ్రెండన్ మెక్‌కల్లమ్, రవిచంద్రన్ అశ్విన్ లాంటి వాళ్ళ పేర్లు తెరపైకి వచ్చాయి. కానీ రాహుల్ ద్రావిడ్ కు కోచింగ్ బాధ్యతలు ఇవ్వాలని చెన్నై సూపర్ కింగ్స్ జట్టు నిర్ణయం తీసుకున్నట్లు నేషనల్ మీడియాలో సరికొత్త కథనం వైరల్ గా మారింది. ఈ మేరకు రాహుల్ ద్రావిడ్ తో చర్చలు కూడా జరుగుతున్నాయట.




## భారత్‌తో జరుగుతున్న తొలి వన్డేలో
# 258 పరుగులకు ఇంగ్లండ్ ఆలౌట్

ఇంగ్లండ్ పర్యటనలో భాగంగా బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరుగుతున్న తొలి వన్డేలో భారత బౌలర్లు సత్తా చాటారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆతిథ్య ఇంగ్లండ్ జట్టును 47.5 ఓవర్లలో 258 పరుగులకే ఆలౌట్ చేశారు. భారత స్పిన్నర్ అక్షర్ పటేల్ నాలుగు వికెట్లతో ఇంగ్లండ్ పతనాన్ని శాసించగా, మాజీ కెప్టెన్ జో రూట్ (76 నాటౌట్) ఒంటరి పోరాటం చేశాడు. అతనికి తోడుగా లియామ్ డాసన్ (68) అర్ధ శతకంతో రాణించాడు. దీంతో టీమిండియా ముందు 259 పరుగుల లక్ష్యం నిలిచింది. ఇన్నింగ్స్ ఆరంభంలో ఇంగ్లండ్ ఓపెనర్లు బెన్ డకెట్ (43), జాకబ్ బెథెల్ (14) తొలి వికెట్‌కు 61 పరుగులు జోడించి శుభారంభం అందించారు. అయితే, ఈ దశలో భారత బౌలర్లు పుంజుకున్నారు. కేవలం 19 పరుగుల వ్యవధిలోనే ఇంగ్లండ్ 4 కీలక వికెట్లు కోల్పోయి 80/5 స్కోరుతో కష్టాల్లో పడింది. కెప్టెన్ హ్యారీ బ్రూక్ (1), జోస్ బట్లర్ (5), సామ్ కరన్ (0) సింగిల్ డిజిట్‌కే పరిమితమై పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో క్రీజులో నిలిచిన జో రూట్, లియామ్ డాసన్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ ఏడో వికెట్‌కు 121 పరుగుల విలువైన భాగస్వామ్యం నెలకొల్పి జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించడంలో కీలక పాత్ర పోషించారు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని అక్షర్ పటేల్ విడదీశాడు. డాసన్ ఔటయ్యాక, ఇంగ్లండ్ ఇన్నింగ్స్ మళ్లీ తడబడింది. చివర్లో జోఫ్రా ఆర్చర్ (12) వేగంగా ఆడినా, అక్షర్ తన స్పిన్‌తో టెయిలెండర్లను చుట్టేశాడు. భారత బౌలర్లలో అక్షర్ పటేల్ 4 వికెట్లతో అద్భుత ప్రదర్శన చేయగా, ప్రసిద్ధ్ కృష్ణ, అరంగేట్ర బౌలర్ గుర్నూర్ బ్రార్ చెరో 2 వికెట్లు తీశారు.






# మనదే లార్డ్స్

క్రికెట్ మక్కాగా పేరున్న లార్డ్స్‌లో, ఇంగ్లాండ్ లాంటి మేటి జట్టుతో భారత మహిళలకు టెస్టు మ్యాచ్. ఇటీవలే టీ20 ప్రపంచకప్‌లో పేలవ ప్రదర్శన చేసిన హర్మన్‌ప్రీత్ సేన పెద్దగా అంచనాల్లేకుండా ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగింది. మైదానంలోకి దిగాక కసితో కదిలిన అమ్మాయిలు.. ఫేవరెట్‌గా మ్యాచ్‌లో అడుగుపెట్టిన ఆతిథ్య జట్టుకు పెద్ద షాకే ఇచ్చారు. తొలి ఇన్నింగ్స్‌లో క్రాంతి గౌడ్ అయిదు వికెట్ల ప్రదర్శన.. రెండో ఇన్నింగ్స్‌లో యాస్తిక భాటియా అద్భుత శతకం.. రెండు ఇన్నింగ్స్‌ల్లో స్మృతి మంధాన సూపర్ అర్ధశతకాలు.. ఇంకా మిగతా అమ్మాయిల కృషీ తోడై లార్డ్స్‌లో భారత్ ఏకంగా 270 పరుగుల భారీ విజయాన్నందుకుని చరిత్ర సృష్టించింది. లాంఛనం పూర్తయింది. ఇంగ్లాండ్‌తో లార్డ్స్‌లో ఏకైక టెస్టులో మూడో రోజే విజయాన్ని ఖాయం చేసుకున్న భారత మహిళల జట్టు.. నాలుగో రోజు ప్రత్యర్థిని చుట్టేసి 270 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఏడు వికెట్లు తీసిన పేసర్ క్రాంతి గౌడ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. 457 పరుగుల భారీ ఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 130/6తో ఆఖరి రోజైన సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లాండ్.. మరో 56 పరుగులు జోడించి 186 పరుగులకే ఆలౌటైంది. అమీ జోన్స్ (54) ఓవర్‌నైట్ వ్యక్తిగత స్కోరుకు కేవలం రెండు పరుగులే జత చేసి ఔటైయింది. ఒక పరుగుతో బ్యాటింగ్ కొనసాగించిన ఎకిల్‌స్టోన్ (50) పోరాడింది. ఇసీ వాంగ్ (33 బంతుల్లో 1), లారెన్ ఫైలర్ (22 బంతుల్లో 4 నాటౌట్)తో కలిసి భారత విజయాన్ని ఆలస్యం చేసింది. వాంగ్, లారెన్ బెల్ (0) వికెట్లను దీప్తి శర్మ పడగొట్టడంతో ఇంగ్లాండ్ 159/9తో ఓటమికి అడుగు దూరంలో నిలిచింది. అర్ధసెంచరీ తర్వాత ఎకిల్‌స్టోన్‌ను స్నేహ్ రాణా (4/42) బౌల్డ్ చేసి ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌కు తెరదించింది. స్నేహ్‌తో పాటు సయాలి (2/24), క్రాంతి గౌడ్ (2/54), దీప్తి శర్మ (2/36) విజయంలో కీలకపాత్ర పోషించారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 285, ఇంగ్లాండ్ 170 పరుగులు చేశాయి.

మనసులో మాట



# అలా ఏ నాయికనీ విమర్శించొద్దు!

అందం.. అభినయంతో మెప్పించినా.. ప్రతిభావంతురాలైన నటిగా పేరు తెచ్చుకున్నా కానీ గత చిత్రాల విషయంలో విజయానికి అడుగు దూరంలోనే నిలిచిపోయారు నటి భాగ్యశ్రీ బోర్సే. ఇప్పుడామె 'లెనిన్' చిత్రంతో విజయాన్ని రుచి చూశారు. అఖిల్ అక్కినేని కథానాయకుడిగా నటించిన ఈ చిత్రం ఇటీవల విడుదలైన నేపథ్యంలో సోమవారం 'ఈనాడు సినిమా'తో ముచ్చటించారు భాగ్యశ్రీ.

అందుకే ఆ రోజు కన్నీళ్లు ఆగలేదు..

''తొలి విజయం ఎప్పుడూ మనసుకు దగ్గరగా ఉంటుంది. నేనీ పరిశ్రమలో స్థిరపడాలని వచ్చా. దాని కోసం నేను మరింత బాగా కష్టపడేలా ప్రోత్సాహాన్నిచ్చేది.. స్ఫూర్తినిచ్చేది సక్సెసే. అందుకే 'లెనిన్'తో నాకొచ్చిన ఈ తొలి విజయం చాలా ప్రత్యేకం. అందుకే ఆ రోజు వేదికపై భావోద్వేగానికి గురయ్యా. దీని తర్వాత నాకు మళ్లీ మరో విజయం దక్కొచ్చు. కానీ, నేను మళ్లీ ఇలా ఏడవకపోవచ్చు (నవ్వుతూ). తొలి విజయాన్ని అందుకున్నప్పుడు పొందినంత స్వచ్ఛమైన ఆనందం మళ్లీ కలగకపోవచ్చు. ఈ ప్రయాణంలో వ్యక్తిగతంగా నేను తెలుసుకుంది ఒకటే. ఈ పరిశ్రమలో జయాపజయాలు సహజం. కొన్నిసార్లు విజయం దక్కుతుంది. కొన్నిసార్లు పరాజయాలు పలకరిస్తాయి. ఫలితమేదైనా..పరిస్థితులు ఎలాంటివైనా ధైర్యంగా అనుకున్నది చేసుకుపోవడమే నాకు చిన్నప్పటి నుంచీ అలవాటు''.

అమ్మానాన్నలకి అదే నిజమైన విజయం

''జయాపజయాల విషయంలో మా అమ్మానాన్న ఆలోచనలు వేరుగా ఉంటాయి. ఓ నటిగా నా విషయంలో వాళ్లెప్పుడూ చాలా గర్వపడుతుంటారు. వాళ్లకి సక్సెస్ అంటే నేను నా పాత్రకి పరిపూర్ణంగా న్యాయం చేయడమే. వాళ్లు సినిమా చూడటానికి వెళ్లినప్పుడు తెరపై భాగ్యశ్రీ కనిపించకూడదు. ఓ కుమారి, ఓ మహాలక్ష్మి, భారతి.. ఇలా ఆ పాత్రలే కనిపించాలనుకుంటారు. అదే వాళ్లకి నిజమైన సక్సెస్. సమాజం దృష్టిలో విజయం అంటే అది ఆ సినిమా సాధించే వసూళ్లు. కానీ, నేను, మా ఫ్యామిలీ దానికిచ్చే నిర్వచనం తెరపై భాగ్యశ్రీని చూశామన్న ఫీల్ కలగకూడదు. అలాగే ఒక్క తప్పునీ ఎత్తి చూపించలేని రీతిలో నా నటన ఉండాలి. అదే నాకు అసలైన సక్సెస్. ఒకవేళ రేపెవరైనా నాతో.. 'నువ్వు ఈ సీన్ ఇంకా బాగా చేయాల్సింది, ఫలానా సీన్‌లో ఓ యాక్టర్‌గా నువ్వు నాకు నచ్చలేదు.. నీ నటనతో కనెక్ట్ అవ్వలేకపోయా' అని చెప్తే అప్పుడు నటిగా ఫెయిలయ్యానని ఒప్పుకుంటా. ఆ తప్పుని నా మీద వేసుకుంటా. అంతే కానీ, బాక్సాఫీస్ నంబర్స్ సరిగా రాలేదని... 'ఇది నీ ఫెయిల్యూర్' అని చెప్పడం, హీరోయిన్స్‌ని తప్పుపట్టడం సరికాదని నేను నమ్ముతా''

నా విషయంలోనూ అలాంటి మాటలే..

''అగ్రతారలు అమితాబ్ బచ్చన్ కావొచ్చు.. ప్రస్తుతం నేను కలిసి పని చేస్తున్న నా సహ నటుడు శివ కార్తికేయన్ కావొచ్చు.. వాళ్లంతా తమ సినీ ప్రయాణంలో కష్ట కాలాన్ని దాటొచ్చిన వాళ్లే. వాళ్లందరికీ ఫ్లాప్స్ వచ్చాయి. కింద పడ్డారు. ఒకానొక సమయంలో జనాలు 'అమితాబ్ పని అయిపోయింద'నీ అన్నారు. కానీ, ఆయన 'కౌన్ బనేగా కరోడ్‌పతి'తో మళ్లీ స్టార్ట్ చేసి.. జీవితంలో అన్నింటిని తిరిగి సాధించారు. ఈ పరిశ్రమలో నాకు నా సీనియర్స్ చెప్పిందొకటే. 'సక్సెస్ ఎంత ఫాస్ట్‌గా వస్తే.. నీ రన్ అంత షార్ట్‌గా ఉంటుంది. విజయం ఎంత ఆలస్యంగా వస్తే.. నీ కెరీర్ అంత సుదీర్ఘంగా సాగుతుంది'. నేను దీన్నే నమ్ముతా. ఓ నటిగా ప్రతి సినిమాకీ ప్రాణం పెట్టే పని చేయాలనుకుంటా. అలా ఉండగలిగినప్పుడే ఈ పరిశ్రమలో సుదీర్ఘ ప్రయాణం చేయగలను అనుకుంటున్నా. వరుసగా రెండు మూడు పరాజయాలు ఎదురవగానే 'ఐరెన్ లెగ్', 'అన్ లక్కీ' అనే మాటలు వినిపిస్తుండటం సహజం. 'కాంత', 'ఆంధ్ర కింగ్ తాలూకా' చిత్రాల తర్వాత నేనూ అలాంటి మాటలు విన్నా. కానీ, అలా ఏ నాయికనీ విమర్శించడం సరికాదు. ఎందుకంటే ఎడిటింగ్‌లో ఆఖరి నిర్ణయం మనది కాదు. కథ విషయంలో తుది నిర్ణయం మనదవ్వదు. ఆఖరికి స్టోరీ మారుతుందా? లేదా? అనేదీ స్పష్టత ఉండదు. ప్రేక్షకులకి ఇవ్వన్నీ తెలియాలి. ఒకవేళ రేపటిరోజున ఎడిటింగ్ రూమ్‌లో దర్శకుడు, నిర్మాత, హీరోతో పాటు నేనూ ఉంటే అలాంటి విమర్శల్ని సమానంగా తీసుకుంటా''.

ఆ దేవుడి దయతో..

''నేను ఏ కథనైనా ఓ సగటు ప్రేక్షకుడిలా వినడానికే ఇష్టపడతా. ఈ కథని ఓ ప్రేక్షకుడైతే ఎలా స్వీకరిస్తాడు.. అది వాళ్ల మనసుల్ని తాకేలా ఉందా? లేదా? అలాగే ఓ ప్రేక్షకుడిలా ఇది నా మనసుకు దగ్గరైందా? లేదా? అనేదానిపై తొలుత దృష్టిపెడతా. దాని తర్వాత ఆ పాత్ర ఎలా ఉంది.. అది సినిమాకి ఎంత ముఖ్యం.. ఆ పాత్ర లేకపోతే సినిమా ఉందా? లేదా? అనే అంశాల్ని గమనిస్తా. ఇవన్నీ చక్కగా కుదిరి.. ఆ కథ మనసుకు నచ్చిందంటే మరో ఆలోచన లేకుండా రంగంలోకి దిగిపోతా. నిజానికి 'లెనిన్' కథని తొలుత నాకే వినిపించారు.



## మార్పునకు నాంది
# ఈ విజయం!

సమంత ప్రధాన పాత్రధారిగా రూపొందిన 'మా ఇంటి బంగారం' ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల వసూళ్ల మైలురాయిని అందుకుని అరుదైన ఘనతని సొంతం చేసుకుంది. భారతదేశంలోనే అత్యధిక వసూళ్లని సాధించిన మహిళా ప్రధానమైన చిత్రాల్లో 'మా ఇంటి బంగారం' ఆరో స్థానాన్ని దక్కించుకుందని సినీ వర్గాలు తెలిపాయి. నందినీరెడ్డి దర్శకత్వంలో సమంత ప్రధాన పాత్రధారిగా నటిస్తూనే, తన భర్త రాజ్ నిడిమోరు, హిమాంక్‌రెడ్డి దువ్వూరుతో కలిసి నిర్మించిన చిత్రమిది. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో విడుదలైంది. హాస్యం, యాక్షన్ మేళవింపుగా రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకుల మెప్పు పొందింది. రూ.100 కోట్ల మైలురాయిని చేరుకోవడంపై ఆనందం వ్యక్తం చేస్తూ ఇన్‌స్టాలో ఓ పోస్ట్‌ని పంచుకున్నారు సమంత. ''ఈ చిత్రం గురించి ప్రేక్షకులు మాట్లాడుకుంటున్నారా? మేం చేస్తున్న ప్రచారం వాళ్లకు చేరువవుతోందా? అసలు ఈ సినిమా అంటూ ఒకటి ఉందని వాళ్లకి తెలుసా? అని విడుదలకు ముందు తీవ్రంగా ఆలోచించడం నాకు బాగా గుర్తుంది. అప్పుడే నా స్నేహితుడు ఒక ప్రదర్శనకారుడికి ఫోన్ చేసి మాట్లాడాడు. ఆ సంభాషణని నేనూ వింటున్నానని అతనికి తెలియదు. ఈ సినిమా గురించి మీరేం అనుకుంటున్నారని అడగ్గానే ఏమాత్రం సంకోచించకుండా 'ఒక హీరోయిన్ సినిమాని ఎవరైనా ఎందుకు చూస్తారు? ఆమె ఒక పెద్ద హీరో సినిమాలో నటిస్తే పర్వాలేదు. ఎందుకంటే గ్లామర్ వల్లే ఆమె ప్రేక్షకులకు తెలుసు. కానీ ఒక నాయికా ప్రధానమైన పాత్రలో ఎవరు చూస్తారు?' అన్నారు. ఎవరైనా ఒక సాహసం చేయడానికి సిద్ధపడినప్పుడే నిజమైన మార్పు వస్తుందని అనుకుంటున్నా. చాలాసార్లు ఆ సాహసాలు ఫలించవు. కానీ అప్పుడప్పుడు, అవి ఫలిస్తాయి. మా విషయంలోనూ అది ఫలించింది. ఇది గొప్ప మార్పునకు నాంది అవుతుందని ఆశిస్తున్నా. తదుపరి ఏ ప్రదర్శనకారుడికైనా ఫోన్ చేసి మహిళా ప్రధాన చిత్రం గురించి అడిగితే సమాధానం వెంటనే 'కాదు...' అని రాకూడదని నేను ఆశిస్తున్నా'' అంటూ ఆ పోస్ట్‌లో రాసుకొచ్చారు. సినిమా విజయోత్సాహంలో ఉన్న ఆమె త్వరలోనే పండంటి బిడ్డకు స్వాగతం పలకనున్నారు. 'మా ఇంటి బంగారం' సినిమా రూ.100 కోట్ల వసూళ్లు సాధించడంపై పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు ఆమెకు శుభాకాంక్షలు చెప్పారు.





# కొత్త ఇంట్లోకి అడుగుపెట్టిన శృతి హాసన్..

ప్రముఖ హీరోయిన్ శృతి హాసన్ తన జీవితంలో మరో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. చెన్నైలో నిర్మించిన తన కొత్త ఇంట్లోకి ఇటీవల ఆమె గృహప్రవేశం చేశారు. కుటుంబ సభ్యులు, సన్నిహిత బంధువుల సమక్షంలో సంప్రదాయ పద్ధతిలో ఈ హౌస్‌వార్మింగ్ పూజా కార్యక్రమం నిర్వహించారు. నిజానికి గతంలో ఈ ముద్దుగుమ్మ ముంబైలో ఉండే వారు. ప్రస్తుతం అక్కడి నుంచి చెన్నైకి షిఫ్ట్ అయ్యి కొత్త ఇంట్లోకి అడుగుపెట్టారు. హౌస్‌వార్మింగ్ కార్యక్రమం సందర్భంగా ఇంటిని పూలతో అందంగా అలంకరించి, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ప్రస్తుతం శృతి హాసన్ కొత్త ఇంట్లో జరిగిన గృహప్రవేశ వేడుకకు సంబంధించిన కొన్ని ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోల్లో సంప్రదాయ దుస్తుల్లో కనిపించిన శృతి చాలా సంతోషంగా, ప్రశాంతంగా కనిపించారు. ఈ సందర్భంగా ఆమె అభిమానులు కంగ్రాట్స్ తెలియజేస్తూ సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు. హీరో కమల్ హాసన్ కుమార్తెగా సినీ రంగంలో అడుగుపెట్టిన శృతి, ప్రస్తుతం దక్షిణాది, బాలీవుడ్ చిత్రాల్లో బిజీగా ఉన్నారు. నటిగా మాత్రమే కాకుండా గాయనిగా, సంగీత దర్శకురాలిగా కూడా ఆమె తన ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. శృతి హాసన్ చెన్నైకి షిఫ్ట్ కి కావడం వెనక తన సింగింగ్ కెరీర్‌పై పూర్తి స్థాయిలో ఫోకస్ చేయడానికే అని అంటున్నారు.

# విజయ్ సేతుపతి 'ట్రైన్' వచ్చేస్తోంది.. రిలీజ్ ఆగస్టులోనే

'మక్కల్ సెల్వన్' విజయ్ సేతుపతి కథానాయకుడిగా, ప్రముఖ దర్శకుడు మిస్కిన్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'ట్రైన్'. ఈ చిత్రాన్ని 2026 ఆగస్టులో థియేటర్లలో విడుదల చేయనున్నట్లు ప్రముఖ నిర్మాత కలైపులి ఎస్. థాను అధికారికంగా ప్రకటించారు. చెన్నైలో ఇటీవల జరిగిన టీజర్ లాంచ్ కార్యక్రమంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. ఇటీవల విడుదలైన 43 సెకన్ల నిడివి గల టీజర్, చిత్రంపై అంచనాలను భారీగా పెంచింది. వేగంగా దూసుకెళ్తున్న 'బ్లూ మౌంటెన్ ఎక్స్‌ప్రెస్' రైలును కొంతమంది సాయుధులు తమ అధీనంలోకి తీసుకోవడం, ఆపదలో ఉన్న ప్రయాణికులను కాపాడేందుకు విజయ్ సేతుపతి చేసే వీరోచిత పోరాటం వంటి ఉత్కంఠభరిత సన్నివేశాలతో టీజర్‌ను ఆకట్టుకునేలా రూపొందించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత మాట్లాడుతూ, "ఈ సినిమాను ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తాం" అని పేర్కొనగా, దర్శకుడు మిస్కిన్ సరదాగా జోక్యం చేసుకుంటూ కచ్చితమైన తేదీని ప్రకటించాలని కోరారు. ఆగస్టు 14న మరో సినిమా ఉందంటూ ఆయన చమత్కరించడంతో సభలో నవ్వులు పూశాయి. ఈ చిత్రానికి కథ అందించడమే కాకుండా, మిస్కిన్ స్వయంగా సంగీతాన్ని సమకూర్చడం విశేషం. ఈ కథను ప్రత్యేకంగా విజయ్ సేతుపతి కోసమే సిద్ధం చేశానని, ఆయన తరహా నటనను కమల్ హాసన్, అమీర్ ఖాన్ వంటి దిగ్గజ నటులు సైతం ప్రదర్శించలేరని మిస్కిన్ ప్రశంసల వర్షం కురిపించారు. 2023లో ప్రారంభమైన ఈ చిత్రంలో శ్రుతి హాసన్, నాజర్, యుగి సేతు, నరైన్, కేఎస్ రవికుమార్, సంపత్ రాజ్



వంటి భారీ తారాగణం నటిస్తోంది. ఇందులో నరైన్ పోలీస్ అధికారిగా కనిపిస్తుండటంతో, ఇది మిస్కిన్ గత చిత్రం 'అంజాదే'కు కొనసాగింపు కావచ్చని, తద్వారా 'మిస్కిన్ సినిమాటిక్ యూనివర్స్'కు అంకురార్పణ జరుగుతోందని సినీ వర్గాల్లో ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఆగస్టులో చిత్ర విడుదల తేదీని త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు.

CHIEF EDITOR BY KANCHARLA ATCHUTA RAOPUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/A2169. PRINTED BY CHAITANYAVARADHI PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 08914540746

మనసులో మాట
KANCHARLA
తెలంగాణ
హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ
నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం
బుధవారం 15 జులై 2026 పేజీలు 16



# హైదరాబాద్‌కు నాలుగు కొత్త ట్యాంక్‌బండ్‌లు

**హైదరాబాద్, జూలై 14 (మనసులో మాట):**
హుస్సేన్‌సాగర్ తరహాలో నగరంలోని నాలుగు పెద్ద చెరువులను సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేసే ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఐఐటీ హైదరాబాద్ భాగస్వామ్యంతో హైడ్రా, హెచ్‌ఎండీఏ అధికారులు ఇటీవల ఫాక్స్‌సాగర్, అమీన్‌పూర్, అంబీర్‌చెరువు, సరూర్‌నగర్ చెరువుల అభివృద్ధికి రూ.536 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. చెరువు కట్టను బలోపేతం చేయడం, రోడ్ల నిర్మాణం, ఇతరత్రా ప్రధాన పనులను మొదటి దశలో, పార్కులు, ఇతర అభివృద్ధి పనులను రెండో దశలో, సుందరీకరణ పనులను మూడో దశలో చేపట్టాలని పూర్తిస్థాయి నివేదికను సిద్ధం చేశారు. పురపాలకశాఖ నివేదికను పరిశీలించి.. రూ.227 కోట్లతో చేపట్టాల్సిన ప్రధానమైన మొదటి దశ పనులకు పరిపాలన అనుమతి ఇస్తూ సోమవారం ఉత్తర్వు జారీ చేసింది. వెంటనే కార్యాచరణ చేపట్టాలని హైడ్రాను ఆదేశించింది. ప్రాజెక్టు వ్యయాన్ని హెచ్‌ఎండీఏ భరించాలని ప్రభుత్వం ఉత్తర్వులో స్పష్టం చేసింది.

**సీఎం ఏమన్నారంటే..**
"నగరం నలువైపులా హుస్సేన్‌సాగర్ లాంటి నాలుగు ట్యాంక్‌బండ్‌లను అభివృద్ధి చేస్తే.. ఆయా ప్రాంతాల ప్రజలు సెలవు రోజుల్లో కుటుంబ సమేతంగా ఆయా జలవనరులను సందర్శిస్తారు. చుట్టుపక్కల ప్రాంతాలకు పర్యాటకంగా ఆదరణ పెరుగుతుంది" అంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఏడాది కిందట హైడ్రాను ఆదేశించారు. అందులో భాగంగా ఎంపిక చేసిన నాలుగు చెరువులకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఐఐటీ హైదరాబాద్ భాగస్వామ్యంతో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించారు. అదే సమయంలో.. ఫాక్స్‌సాగర్ ఎగువన 40 ఎకరాల భూములకు సంబంధించిన భూ వినియోగ మార్పిడి ఉత్తర్వులను ప్రభుత్వం రద్దు చేసింది.

- హుస్సేన్‌సాగర్ తరహాలో నాలుగు చెరువుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం
- ఫాక్స్‌సాగర్, అమీన్‌పూర్, అంబీర్‌చెరువు, సరూర్‌నగర్ చెరువులు ప్రాజెక్టులో భాగం
- మొత్తం రూ.536 కోట్లతో అభివృద్ధి ప్రతిపాదనలు సిద్ధం
- మొదటి దశలో చెరువు కట్ట బలోపేతం, రోడ్ల నిర్మాణానికి రూ.227 కోట్లు
- ఐఐటీ హైదరాబాద్ భాగస్వామ్యంతో హైడ్రా, హెచ్‌ఎండీఏ ప్రణాళికలు
- పర్యాటకం, ప్రజా వినోదం, పరిసర ప్రాంతాల అభివృద్ధికి ప్రాజెక్టు తోడ్పాటు



# గోదావరి-నల్లమలసాగర్‌పై నిర్లక్ష్యం బట్టబయలు

- కోర్టులో నిలవొద్దనే లోపభూయిష్ఠంగా వ్యాజ్యం
- సీఎంకు తెలంగాణ నీటి వాటాలపై శ్రద్ధ లేదు: హరీశ్‌రావు ఆరోపణ

**సంగారెడ్డి టౌన్జులై 14 (మనసులో మాట):**
గోదావరిబనకచర్ల, గోదావరినల్లమలసాగర్‌పై భారాస మొదటి నుంచీ హెచ్చరిస్తూనే ఉందని, తమ పార్టీ నిలదీయడంతోనే ప్రభుత్వం పాత తేదీలతో లేఖలు రాసిందన్నారు. సుప్రీంకోర్టులో తాజాగా గోదావరినల్లమలసాగర్‌పై తీర్పు వచ్చిందని, వ్యాజ్యం సరిగా ఫైల్ చేయలేదని రాష్ట్ర ప్రభుత్వానికి న్యాయస్థానం మొట్టికాయలు వేసిందని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. సోమవారం సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో, అంతకు ముందు ఖేడ్‌లో సర్, భారాస సభ్యత్వ నమోదుపై మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. 'కోర్టులో నిలవొద్దనే లోపభూయిష్ఠంగా దావా వేశారు. ముఖ్యమంత్రి ఆదేశం లేకుండా ఇంత బలహీనమైన దావా వేయడం సాధ్యం కాదు. కోర్టులో వాదనల కంటే ముందే ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించాల్సి ఉన్నా ఎందుకు

..మిగతా2లో



2

జీహెచ్ఎంసీ నోటీసులపై హైకోర్టును ఆశ్రయించిన ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్

# రూ.40 వేల కోట్ల బకాయి పెట్టి వెళ్లారు!

- పదేళ్లలో రూ.8 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసి రూ.40 వేల కోట్ల రోడ్ల బకాయిలు మిగిల్చారని భారాసపై మంత్రి కోమటిరెడ్డి విమర్శ
- నారాయణపేట, జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో రూ.1,271.48 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



2



2

# లంచం తీసుకుంటూ.. అనిశాకు చిక్కిన పెద్దపల్లి మున్సిపల్ ఏఈ

- ఇంటి సోదాల్లో రూ.32.31 లక్షల నగదు స్వాధీనం

# గోదావరి-నల్లమలసాగర్‌పై నిర్లక్ష్యం బట్టబయలు

(మొదటి పేజీ తరువాయి)



పట్టించుకోలేదు? భారాసను తిట్టడంపై ఉన్న శ్రద్ధ తెలంగాణ నీటి వాటాల రక్షణపై లేదు. రాష్ట్ర ప్రయోజనాల కంటే చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించేందుకే ప్రాధాన్యం ఇస్తున్నారు. రేవంత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమ ద్రోహి మాత్రమే కాదు జలద్రోహి కూడా. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ సహా ఏపీ అక్రమ ప్రాజెక్టులపై భారాస ప్రభుత్వ హయాంలో ఎన్నో స్టేలు తెచ్చాం. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఏపీకి పరోక్షంగా సహకరిస్తూ తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతోంది. ఆదిత్యనాథ్‌దాస్‌ను నీటి పంపకాల కమిటీ సలహాదారుగా నియమించారు. తెలంగాణకు వెన్నుపోటు పొడిచిన వ్యక్తి ఆదిత్యనాథ్. కర్ణాటకలో ముగ్గురు సీఎంల సమావేశంలో ఏం చర్చించారో ప్రజలకు చెప్పాలి. 80 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెబుతున్నారు. మా ప్రభుత్వ హయాంలో 202021లోనే 90 లక్షల టన్నుల ధాన్యం కొన్నాం. దేవాదుల ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోంది.

**త్వరలోనే పాదయాత్ర చేస్తా**

సంగారెడ్డి జిల్లాలోని సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పనులను చేపట్టాలని డిమాండ్ చేస్తూ త్వరలోనే పాదయాత్ర చేపడతా. నారాయణఖేడ్, జహీరాబాద్, అందోలు నియోజకవర్గాల్లో పంటలు పండాలని కేసీఆర్ ఆయా ఎత్తిపోతల పథకాలకు ఖేడ్‌లో శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పనులు నిలిపివేసింది. సింగూరులో నీళ్లున్నా మరమ్మతుల కోసమంటూ ఖాళీ చేయడంతో తాగు, సాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు పట్టించుకోకపోవడంతోనే షాబాద్‌లో సైకో రాజ్‌కుమార్ ఆరుగురిని చంపాడు. పోక్సో కేసు నమోదైనా 45 రోజులపాటు అరెస్టు కాకుండా సీఎం సన్నిహితుడు రూ.20 లక్షలు తీసుకుని కాపాడినందునే హత్యలకు తెగబడ్డాడు. విలేకరుల సమావేశంలో సంగారెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.40 వేల కోట్ల బకాయి పెట్టి వెళ్లారు!



మహబూబ్‌నగర్ (మనసులో మాట) జూలై 14:

'పదేళ్ల పాలనలో రూ.8 లక్షల కోట్లకు పైగా అప్పులు చేశారు. అయినా ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లకు రూ.40 వేల కోట్లు బకాయిలు పెట్టి వెళ్లారు' అని రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గత భారాస ప్రభుత్వాన్ని విమర్శించారు. సోమవారం ఆయన నారాయణపేట, జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో పర్యటించారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలతో కలిసి రూ.1,271.48 కోట్ల హ్యామ్ రోడ్లు, వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. 'భారాస పాలనలో రాష్ట్రంపై అప్పుల భారం మోపడంతో ప్రస్తుతం ఆర్థికంగా క్లిష్టపరిస్థితుల్లో ఉన్నాం. గత ప్రభుత్వం నాటి బిల్లుల కోసం ఇప్పటికీ గుత్తేదారులు తిరుగుతున్నారు. ప్రజలకు సురక్షితమైన రవాణా వ్యవస్థ అందించడమే లక్ష్యంగా మేం ముందుకెళ్తున్నాం. పదవి కోసం పగటి కలలు కంటున్న కేసీఆర్ ఫాంహౌస్ దాటి బయటికి రావడం లేదు. వచ్చే రెండేళ్లలో ఎస్ఎల్‌బీసీ, పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టులను పూర్తిచేస్తాం' అని తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్‌లో హ్యామ్ రోడ్ల శిలాఫలకంపై తనపేరు లేదని గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య ఛైర్‌పర్సన్ సరిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి.. సొంబ వద్దకు రాకుండానే వెనుదిరిగారు.

# లంచం తీసుకుంటూ.. అనిశాకు చిక్కిన పెద్దపల్లి మున్సిపల్ ఏఈ

పెద్దపల్లి (మనసులో మాట) జూలై 14:



బిల్లులు చెల్లించేందుకు గుత్తేదారు నుంచి లంచం తీసుకుంటూ పెద్దపల్లి మున్సిపల్ ఏఈ సతీశ్‌ను అవినీతి నిరోధక శాఖ అధికారులకు దొరికిపోయాడు. పథకం ప్రకారం సతీశ్ కుమార్ నివాసం సమీపంలో మాటు వేసిన ఏసీబీ అధికారులు.. రూ.2 లక్షల లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయానికి తీసుకెళ్లి ప్రత్యేక గదిలో విచారణ నిర్వహించారు. ఈ మేరకు అనిశా డీఎస్పీ మహేందర్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. పెద్దపల్లి పురపాలిక పరిధిలోని కూనారం రోడ్డు, తెనుగువాడ స్మశాన వాటిలో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులు రూ.12.20 లక్షల చెల్లించేందుకు గుత్తేదారును గత కొన్ని రోజులుగా ఏఈ సతీశ్ తన చుట్టూ తిప్పుకుంటున్నాడు. ఈ క్రమంలో రూ.4.5 లక్షల లంచం ఇస్తేనే బిల్లులను ప్రాసెస్ చేస్తానని చెప్పాడు. కానీ అంతమొత్తం చెల్లించేందుకు ఇష్టపడని గుత్తేదారు అనిశా అధికారులను సంప్రదించాడు. వారిచ్చిన సూచనల ప్రకారం రూ.2 లక్షలు ఇచ్చేందుకు ఏఈతో కాంట్రాక్టర్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం రంగంపల్లిలోని సతీశ్ కుమార్ నివాసానికి వెళ్లిన గుత్తేదారు.. రూ. 2లక్షల నగదును ఇస్తుండగా అక్కడే మాటు వేసిన అనిశా అధికారులు ఏఈని పట్టుకున్నారు. ఈ సందర్భంగా సతీశ్ నివాసంలో అధికారులు సోదాలు నిర్వహించగా రూ.32 లక్షల నగదు లభ్యమైనట్లు డీఎస్పీ వెల్లడించారు. అనంతరం ఏఈ సతీశ్‌ను అరెస్టు చేసి, ఏసీబీ కోర్టుకు తరలించారు.

## హైడ్రా యాక్షన్.. రామంతాపూర్ పెద్దచెరువులో భారీ ఆక్రమణల కూల్చివేత



హైదరాబాద్ (మనసులో మాట) జూలై 14:

ఉప్పల్ నియోజకవర్గంలోని రామంతాపూర్ పెద్ద చెరువు ఆక్రమణలను హైడ్రా మంగళవారం తొలగించింది. రామంతాపూర్ పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ విస్తీర్ణం 30 ఎకరాలు కాగా.. 16 ఎకరాల వరకూ కబ్జాకు గురైంది. ఇందులో 12 ఎకరాల్లో శాశ్వత కట్టడాలు వచ్చాయి. వీటి జోలికి వెళ్లకుండా మరో 4 ఎకరాల మేర తాత్కాలిక షెడ్లు, గుడిసెలుంటే వారికి డబుల్‌బెడ్ రూం ఇళ్లు మంజూరుకు హైడ్రా సిఫారసు చేసింది. ఇలా మొత్తం 18 ఎకరాల మేర చెరువును అభివృద్ధి చేస్తున్న క్రమంలో 1900 గజాల మేర జీ ప్లస్ 2 నిర్మాణంలో ఉన్న వాణిజ్య భవనంతో పాటు.. 280 గజాల మేర ఉన్న ఆటో గ్యారేజీని కూడా హైడ్రా మంగళవారం తొలగించింది. వర్షాకాలం చెరువు నిండితే గుడిసెలు మునిగిపోయేవి.. అక్కడ నివసిస్తున్న వారు ప్రతి ఏటా చాలా అవస్థలు పడుతుండేవారు. చెత్త సేకరణతో పాటు.. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే వారికి డబుల్‌బెడ్‌రూం ఇళ్ల మంజూరికి హైడ్రా సిఫారసు చేయగా.. ప్రభుత్వం సానుకూలంగా స్పందించిన విషయం విదితమే. ప్రభుత్వం కూడా కేటాయింపులో ప్రాధాన్యం ఇళ్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంది. దాదాపు రూ.19 కోట్లతో రామంతాపూర్ పెద్దచెరువును అభివృద్ధి చేస్తున్న క్రమంలో ఎఫ్‌టీఎల్ విస్తరణ పనులకు ఆటంకాలు తొలగాయి. రామంతాపూర్ చెరువు అభివృద్ధి పనుల్లో ఎలివేషన్‌కు ఈ ఆక్రమణలు తొలగింపు ఉపయోగపడనుంది.

# జీహెచ్ఎంసీ నోటీసులపై హైకోర్టును ఆశ్రయించిన ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్

హైదరాబాద్ (మనసులో మాట) జూలై 14:

జీహెచ్ఎంసీ నోటీసులపై ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ హైకోర్టును ఆశ్రయించింది. ఈనెల 7న జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు చేపట్టారని ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్‌కు జీహెచ్ఎంసీ నోటీసులు జారీ చేసింది. హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ ప్రాథమికంగా నిర్ధరించలేదని ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ పిటిషన్‌లో పేర్కొంది. ఎలాంటి చర్యలు చేపట్టకుండా జీహెచ్ఎంసీని ఆదేశించాలని హైకోర్టును కోరింది.



# కరువును కాళేశ్వరంతో ముడిపెట్టి రాజకీయాలు చేయడం సరికాదు: ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణరావు

- ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకే కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటి ఎత్తిపోతల నిలిపివేత

పెద్దపల్లి (మనసులోమాట) జూలై 14:



కరువును కాళేశ్వరం ప్రాజెక్టుతో ముడిపెట్టి రాజకీయ లబ్ధి పొందాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యుడు చింతకుంట విజయరమణరావు విమర్శించారు. కరీంనగర్ ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కరీంనగర్ పర్యటనలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని అన్నారు. ముఖ్యమంత్రిని విమర్శించే ముందు వాస్తవాలను తెలుసుకోవాలని, వరుస రాజకీయ వైఫల్యాలే బీఆర్ఎస్ నాయకత్వ పనితీరుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో భారీ ఎత్తున ప్రచారం చేసుకున్న బీఆర్ఎస్, ఇప్పుడు అదే ప్రాజెక్టును కరువు రాజకీయాలకు వేదికగా మార్చే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. మాజీ మంత్రి హరీష్‌రావు మరో మూడు నెలలు మంత్రి పదవి ఇస్తే కాళేశ్వరం సమస్యలను పరిష్కరిస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన మంత్రిగా ఉన్న కాలంలోనే కాళేశ్వరం నిర్మాణంలో లోపాలు బయటపడ్డాయని, ప్రస్తుతం చేస్తున్న వ్యాఖ్యలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని విమర్శించారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించి ఉంటే మరింత ప్రయోజనం కలిగేదని, కానీ అప్పటి ప్రభుత్వం ఇతర నిర్ణయాలతో గోదావరిపై కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించిందని అన్నారు. నిర్మాణం పూర్తయి కొద్ది కాలానికే మూడు బ్యారేజీల్లో సమస్యలు తలెత్తడంపై బీఆర్ఎస్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన శ్రీరాంసాగర్, ఎల్‌ఎండీ, శ్రీపాద ఎల్లంపల్లి వంటి ప్రాజెక్టులు ఇప్పటికీ రైతాంగానికి ప్రయోజనం చేకూరుస్తున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి దూరదృష్టితో నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్టు ఉత్తర తెలంగాణకు జీవనాడిగా నిలిచిందని అన్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని నిపుణుల కమిటీ, ఎన్‌డీఎస్‌ఏ సూచించినందునే ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరిస్తోందని విజయరమణరావు తెలిపారు. నిపుణుల నివేదికల ఆధారంగానే ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. రైతు సంక్షేమంపై చిత్తశుద్ధి లేని బీఆర్ఎస్ ఇప్పుడు కాళేశ్వరం పేరుతో ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ సూడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య, కార్పొరేటర్లు పడాల అజయ్ గౌడ్, చెల్లోజు రాజు, అజయ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గౌడ జాతి, పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్‌పై వ్యాఖ్యలను ఖండిస్తూ ఎల్బీనగర్‌లో బీసీ గౌడ సంఘాల నిరసన

ఎల్బీనగర్ (మనసులోమాట) జూలై 14:



గౌడ జాతి, యాదాద్రి దేవాలయ ట్రస్ట్ బోర్డు సభ్యురాలు పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్‌పై తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, ఆయన తండ్రి జక్కిడి ప్రభాకర్ రెడ్డి చేసినట్లు ఆరోపించబడుతున్న అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ బీసీ, గౌడ సంఘాల ఆధ్వర్యంలో ఎల్బీనగర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. నిరసనకు ముందు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అఖిల భారత గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూరెళ్ల వేములయ్య గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు బీసీ, గౌడ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జక్కిడి శివచరణ్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ పదవుల నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. బడుగు, బలహీన వర్గాలపై అవమానకర వ్యాఖ్యలు సహించబోమని, బీసీల జోలికి వస్తే సంఘటితంగా ఎదుర్కొంటామని హెచ్చరించారు. ఇటువంటి ఘటనలు పునరావృతమైతే తీవ్ర ఆందోళనలు చేపడతామని తెలిపారు. "రాజ్యాధికారమే దిశగా - మేమెంతో మాకంత" అనే నినాదంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ రాష్ట్ర అధ్యక్షుడు అంబాల మల్లేష్ గౌడ్, కల్లు గీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఐలి వెంకన్న గౌడ్, బీసీ సామైక్య రాష్ట్ర అధ్యక్షుడు దుర్గయ్య గౌడ్, ఉద్యమ వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు దేశగాని సాంబశివ గౌడ్, టీఆర్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టి జానయ్య యాదవ్, అఖిల భారత గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దగోని నగేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బత్తిని సురేందర్ గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బందారం అనిల్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి చౌట బాలరాజ్ గౌడ్ తదితరులతో పాటు గౌడ, బీసీ, ఎస్సీ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాసబ్ ట్యాంక్ రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



హైదరాబాద్ (మనసులోమాట) జూలై 14:

మాసబ్ ట్యాంక్ ఎన్ఎండిసీ రోడ్డు మార్గంలో మంగళవారం తెల్లవారుజామున ఒక గుర్తుతెలియని వ్యక్తి కేబుల్ వైర్‌తో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం సుమారు 4:00 నుంచి 5:00 గంటల మధ్య కాలంలో స్థానికులు దీనిని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి సుమారు 35 నుంచి 40 ఏళ్లు ఉండవచ్చు. హిందూ సంప్రదాయానికి చెందిన వ్యక్తిగా కనిపిస్తున్నారు. పసుపు, నలుపు రంగు చారల టీషర్ట్, నల్లటి ప్యాంట్ ధరించి ఉన్నారు. ఘటన స్థలంలో మృతుని చేతిలో ఒక హెల్మెట్ లభించింది. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న మెహదీపట్నం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఇబ్రహీంపట్నంలో వైద్య సేవల మెరుగుదలపై మంత్రి దామోదర, ఎమ్మెల్యే మల్‌రెడ్డి సమీక్ష



**ఇబ్రహీంపట్నం (మనసులోమాట) జూలై 14:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేసి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి నియోజకవర్గంలోని వైద్యారోగ్య పరిస్థితులు, ఆస్పత్రుల పనితీరు, మౌలిక సదుపాయాలపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది కొరత, మౌలిక వసతులు, వైద్య సేవలపై మంత్రి ఆరా తీశారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల పరిస్థితులపై సమగ్ర నివేదికను శనివారంలోగా సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని, అవసరమైన నిధులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ ఇబ్రహీంపట్నంలో పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా సూపర్ స్పెషాలిటీ స్థాయి ఆస్పత్రి అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. తాత్కాలికంగా కొనసాగుతున్న ఆస్పత్రిలో మరిన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని, పేద రోగులు బయట మందులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి రాకూడదని అధికారులను ఆదేశించారు. డాక్టర్లు, నర్సులు, సిబ్బంది విధులకు సమయానికి హాజరు కావాలని, బస్తీ దవాఖానాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. అత్యవసర సమయాల్లో, ముఖ్యంగా రాత్రి వేళల్లో డ్యూటీ వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, సీజనల్ వ్యాధుల నివారణపై ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు, గర్భిణులకు పోషకాహారం, ఇతర సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలయ్యేలా చూడాలని, రోగుల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. సమావేశంలో వైద్యారోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ సంగీత సత్యనారాయణ, డీహెచ్ రవీంద్ర నాయక్, డీఎంఈ నరేందర్ కుమార్, రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌ఓ స్వర్ణకుమారి రెడ్డి, డీసీహెచ్ఎస్ అనురాగిణి రెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

# 18న 'చలో గాంధీభవన్' కు బీసీ సంఘాల పిలుపు




**ఎల్బీనగర్ (మనసులోమాట) జూలై 14:** యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ బోర్డు సభ్యురాలు పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్‌పై యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్ రెడ్డి చేసినట్లు ఆరోపిస్తున్న వ్యాఖ్యలను నిరసిస్తూ ఈ నెల 18న 'చలో గాంధీభవన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీసీ సంఘాల జేఏసీ ప్రతినిధులు ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈశ్వరమ్మ యాదవ్‌కు శివచరణ్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని, ఆయనను పార్టీ పదవి, ప్రాథమిక సభ్యత్వం నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. శాంతియుత నిరసనకు వెళ్లిన బీసీ, యాదవ సంఘాల నాయకులపై దాడులు జరిగాయని ఆరోపించిన జేఏసీ నేతలు, ఈ ఘటనపై కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం స్పందించాలని డిమాండ్ చేశారు. బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు, ఘటనలను తీవ్రంగా ఖండించారు. ఈ అంశంపై రాష్ట్రవ్యాప్తంగా వారం రోజుల పాటు ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జూలై 15న అన్ని జిల్లాల్లో విలేకరుల సమావేశాలు నిర్వహించి, వివిధ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు అందజేస్తామని చెప్పారు. జూలై 16న రాష్ట్రవ్యాప్తంగా శివచరణ్ రెడ్డి దిష్టిబొమ్మల దహనం, జూలై 17న మండల, జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, ధర్నాలు నిర్వహిస్తామని వెల్లడించారు. అప్పటికీ స్పందన లేకుంటే జూలై 18న రాష్ట్ర నలు మూలల నుంచి పెద్ద ఎత్తున హైదరాబాద్‌కు చేరుకుని గాంధీభవన్ వద్ద 'చలో గాంధీభవన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలోని బీసీ, యాదవ, ఇతర కుల సంఘాలు, మహిళా సంఘాలు ఈ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని బీసీ సంఘాల జేఏసీ ప్రతినిధులు పిలుపునిచ్చారు.

# ఉపాధ్యాయులకు షీ టీమ్ అవగాహన సదస్సు

- **మహిళల భద్రత, బాలల రక్షణ, సైబర్ నేరాలపై అవగాహన కల్పించిన అధికారులు**



**పెద్దపల్లి (మనసులోమాట) జూలై 14:** రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి షీ టీమ్ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో మహిళల భద్రత, బాలల రక్షణ, సైబర్ నేరాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ సభ్యురాలు స్నేహలత మాట్లాడుతూ, మహిళల భద్రతతో పాటు బాలల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. చిన్నారులకు గుడ్ టచ్-బ్యాడ్ టచ్, యుక్తవయస్సులో వచ్చే శారీరక, మానసిక మార్పులు, టీనేజ్ దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. అలాగే మహిళలపై జరిగే వేధింపులు, ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై వివరించారు. మహిళల భద్రత కోసం షీ టీమ్ సిబ్బంది ప్రతిరోజూ బస్టాండ్లు, ప్రధాన కూడళ్లు, విద్యాసంస్థల పరిసర ప్రాంతాల్లో నిరంతరం గస్తీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా మహిళలు లేదా విద్యార్థినులు వేధింపులకు గురైతే భయపడకుండా 6303923700 నంబర్‌కు సంప్రదించాలని, ఫిర్యాదు చేసిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, లోన్ యాప్‌లు, ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఒకవేళ ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని కోరారు. మహిళలకు ఎలాంటి ప్రమాదం, బెదిరింపులు లేదా అత్యవసర పరిస్థితులు ఎదురైనా వెంటనే 100 లేదా 112 అత్యవసర సేవల నంబర్లకు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు షీ టీమ్ సభ్యులు సురేష్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# తలపై దాడితో వృద్ధుడి దారుణ హత్య

**కొడిమ్యాల (మనసులోమాట) జూలై 14:** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం డబ్బు తిమ్మాయపల్లి గ్రామంలో మంగళవారం వృద్ధుడి హత్య స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. డబ్బు తిమ్మాయపల్లి గ్రామానికి చెందిన కాంపెల్లి హనుమయ్య (70)పై అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తలపై బలంగా దాడి చేసినట్లు సమాచారం. తీవ్ర గాయాల పాలైన హనుమయ్య అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న మల్యాల సీఐతో పాటు స్థానిక ఎస్సై నరేష్ కుమార్ ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. హత్యకు గల కారణాలపై పోలీసులు వివిధ కోణాల్లో విచారణ చేపట్టారు. ప్రాథమిక సమాచారం మేరకు భూ వివాదాల నేపథ్యంలో ఈ ఘటన జరిగినట్లు గ్రామస్థులు చర్చించుకుంటున్నప్పటికీ, దీనిపై అధికారికంగా పోలీసులు ఎలాంటి నిర్ధారణ చేయలేదు. నిందితుడి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.



# ఉద్యోగాల భర్తీకి వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేయాలి సీపీఎం



**ఎల్బీనగర్ (మనసులోమాట) జూలై 14:**

నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ ఆరోపించారు. ఖాళీ పోస్టుల భర్తీకి వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. జూలై 15న హైదరాబాద్ లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే సీపీఎం మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం దిల్‌సుఖ్‌నగర్‌లోని పలు కోచింగ్ సెంటర్లలో కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లు గడిచినా జాబ్ క్యాలెండర్ విడుదల చేయక పోవడంతో పాటు రెండు లక్షల ఉద్యోగాల భర్తీ హామీ కూడా నెరవేర్చలేదన్నారు. సమగ్ర జాబ్ క్యాలెండర్ ప్రకటించి వెంటనే ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేయాలని కోరారు. ఉద్యోగాలు కల్పించే వరకు నిరుద్యోగ యువతకు నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇవ్వాలని, రాజీవ్ యువ వికాస్ పథకం కింద అర్హులైన యువతకు స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పోలీస్ శాఖలో సుమారు 20 వేల ఖాళీలు ఉన్నాయని డీజీపీ ప్రకటించినప్పటికీ కేవలం 7 వేల పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులను నిరాశకు గురిచేస్తోందన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని, కేంద్ర మంత్రిత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను కూడా వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జూలై 15న ఇందిరాపార్క్ వద్ద జరిగే మహాధర్నాకు నిరుద్యోగ యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చంద్రమోహన్, సరూర్‌నగర్ సర్కిల్ కార్యదర్శి సీహెచ్ వెంకన్న, మల్లెపాక వీరయ్య, జి. మనోహర్, కట్ట శ్రీనివాస్, కె. రాములు, సీహెచ్ మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

# గుర్తుతెలియని మహిళకు అండగా జిల్లా సంక్షేమ శాఖ



- **ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఆశ్రమానికి సురక్షిత తరలింపు**

**పెద్దపల్లి (మనసులోమాట) జూలై 14:**

పెద్దపల్లి జిల్లా కేంద్ర శివారులో మానసిక ఆరోగ్య సమస్యతో సంచరిస్తూ, భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న గుర్తుతెలియని మహిళకు జిల్లా సంక్షేమ శాఖ అధికారులు తక్షణ సహాయం అందించి, సురక్షితంగా ఆశ్రమంలో చేర్పించారు. స్థానికుల సమాచారం మేరకు స్పందించిన జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, జిల్లా సంక్షేమ అధికారి ఆదేశాలపై ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి శ్రీమతి స్వర్ణలత వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మహిళను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యుల పర్యవేక్షణలో అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. వైద్యుల సూచనల మేరకు మహిళ భద్రత, సంరక్షణ, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఆమెను నల్గొండ జిల్లా చౌటుప్పల్‌లోని 'అమ్మానాన్న' ఆశ్రమంలో సురక్షితంగా చేర్పించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, నిరాశ్రయులు, అనాథలు, వృద్ధులు, దివ్యాంగులు లేదా మానసిక ఆరోగ్య సమస్యలతో ఆపదలో ఉన్న వ్యక్తులు ఎవరైనా కనిపించినట్లయితే వెంటనే జిల్లా సంక్షేమ శాఖకు సమాచారం అందించాలని కోరారు. ఇటువంటి వారికి అవసరమైన రక్షణ, వైద్య సహాయం, పునరావాస సేవలు అందించేందుకు శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు.

# వంగా మధుసూదన్ రెడ్డి విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న ఎంపీలు ఈటల రాజేందర్ కొండ విశ్వేశ్వర్ రెడ్డి

**ఎల్బీనగర్ (మనసులోమాట) జూలై 14:**

ఎల్బీనగర్ నియోజకవర్గంలోని చంపాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ దివంగత వంగా మధుసూదన్ రెడ్డి జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు ఆచార్య, వంగా సిద్ధార్థ రెడ్డిలు హాజరై, ఆయనకు ఘన నివాళులు అర్పించి, విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంగా మధుసూదన్ రెడ్డి ప్రజల అభిమాన నాయకుడని, అభివృద్ధి పనుల కోసం వందల కోట్ల రూపాయల నిధులు తీసుకువచ్చిన సేవాభావి అని కొనియాడారు. అతి చిన్న వయసు లోనే పరిణితి చెందిన నాయకుని లాగా ఎంతో అభివృద్ధి చేశారని కొనియాడారు. ఆధ్యాత్మికత, దాతృత్వం, ప్రజాసేవ పట్ల అంకిత భావం ఆయన ప్రత్యేకతలని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా కావాలన్న ఆయన కోరిక నెరవేరకుండానే అకాల మరణం చెందడం బాధాకరమన్నారు. ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు. వంగా మధుసూదన్ రెడ్డి ఆశయాలను ఆయన కుమారుడు సిద్ధార్థ్ ముందుకు తీసుకెళ్లారని విశ్వాసం వ్యక్తం చేస్తూ, కుటుంబానికి పార్టీ సంపూర్ణ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రజాసేవే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అర్బన్ బిజెపి అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, రూరల్ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మాజీ అధ్యక్షులు సామ రంగారెడ్డి, మాజీ కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్ రెడ్డి, కొప్పుల నరసింహారెడ్డి, పవన్ కుమార్, చంపాపేట్ డివిజన్ అధ్యక్షులు పోరెడ్డి రవీందర్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు లింగాల దశరథ గౌడ్, కళ్లెం రవీందర్ రెడ్డి, దాసరి మల్లేష్, అశోక్ గౌడ్, రవీందర్ గౌడ్, వివిధ కాలనీల అధ్యక్షులు, బిజెపి కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొని, వారికి ఘన నివాళులు అర్పించారు.



# ఏబీవీపీ రాష్ట్ర పిలుపు మేరకు కమాన్‌పూర్‌లో కళాశాలల బంద్



- **ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల విడుదలకు డిమాండ్**

**కమాన్‌పూర్ (మనసులోమాట) జూలై 14:**

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కమాన్‌పూర్ మండలంలో మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల బంద్ నిర్వహించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జంగపల్లి అభి మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన సుమారు రూ.11 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిధుల విడుదలలో జాప్యం కారణంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే పెండింగ్ బకాయిలను విడుదల చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు బుర్ర యశ్వంత్, మల్యాల వర్షిత్, జంగపల్లి శివాజీ, మడిశెట్టి అనీష్‌తో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొని బంద్‌ను విజయవంతం చేశారు.

# పోక్సో కేసుల్లో దర్యాప్తు వేగవంతంగా పూర్తిచేయాలి: పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ఖమ్మం (మనసులోమాట) జూలై 14:**



పోక్సో కేసుల్లో దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేసి అభియోగపత్రాన్ని నిర్ణీత గడువులోగా న్యాయస్థానంలో సమర్పించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీస్ అధికారుల నేరసమీక్ష సమావేశం పోలీస్ కాన్ఫిరెన్స్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... నేర విచారణలో నిందితులకు శిక్షల శాతం పెరగడం అత్యంత ముఖ్యమని, దీనికోసం పకడ్బందీ దర్యాప్తు, శాస్త్రీయ ఆధారాల సేకరణ, పోలీసుప్రాసిక్యూషన్ సమన్వయం అవసరమన్నారు. కొత్త చట్టాల ప్రకారం నిర్ణీత గడువులోగా ట్రయల్ పూర్తి చేయాలని, సాక్షులు భయపడకుండా భరోసా కల్పిస్తూ... న్యాయస్థానానికి హాజరయ్యేలా చూడాలన్నారు. ఎన్డీపీఎస్ కేసులో న్యాయస్థానంలో నేరాన్ని రుజువు చేయడానికి ఆయా కేసుల్లో స్వాధీనం చేసుకున్న గంజాయి, మాదకద్రవ్యాల స్వభావం, పరిమాణాన్ని శాస్త్రీయంగా నిర్ధారించే ఫోరెన్సిక్ సైన్స్ లేబరేటరీ నివేదిక ప్రధాన ఆధారమని అన్నారు. అదేవిదంగా జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలను అరికట్టడానికి స్పెషల్ దృష్టి పెట్టాలని, ఈగల్ బృందాలు, టాస్క్ ఫోర్స్, స్థానిక పోలీసుల సమన్వయంతో మూలలను కనిపెట్టాలని అన్నారు.

**రికవరీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని...**

వారిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిఘా వ్యవస్థను బలోపేతం చేస్తూ నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. చోరీల నివారణకు, దొంగిలించబడిన సొత్తును బాధితులకు తిరిగి అప్పగించడానికి పోలీసులు సాంకేతికతను ఉపయోగిస్తూ రికవరీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నిందితుల గుర్తింపు, రికవరీ వేగవంతం చెయాలన్నారు. విచారణలో భాగంగా ప్రతి కేసును సాంకేతిక ఆధారాలు, ఫోరెన్సిక్ సాక్ష్యాలు, డిజిటల్ సాక్ష్యాలను సమర్థవంతంగా వినియోగించి దర్యాప్తు చేపట్టాలని సూచించారు. శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేస్తూ... నేరాలు జరిగిన తరువాత స్పందించడం కంటే..ముందస్తు నివారణ చర్యలు తీసుకోవడమే సమర్థవంతమైన పోలీసింగ్ అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.

**ప్రాణనష్టాన్ని నివారించడానికి...**

శాంతిభద్రతలు,నేరాల ధోరణి, పోలీస్ స్టేషన్ల పనితీరు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ నేరాల నివారణ, మాదక ద్రవ్యాల నిర్మూలన, కమ్యూనిటీ పోలీసింగ్, పోలీసింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి అవసరమైన సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే హాట్‌స్పాట్‌లు లేదా బ్లాక్ స్పాట్‌లలో ప్రాణనష్టాన్ని నివారించడానికి రోడ్డు భద్రతా చర్యలు, ఇంజనీరింగ్ మార్పులు, కఠినమైన ట్రాఫిక్ నియంత్రణలు చాలా ముఖ్యమన్నారు.ప్రమాదకర మలుపులు, కూడళ్ల వద్ద స్పష్టమైన సైన్‌బోర్డులు, బ్లింకర్స్, స్పీడ్ బ్రేకర్లు, రంబిల్ స్ట్రిప్స్, గరిష్ఠ వేగపరిమితి సూచికలు పెట్టడం, రాత్రి సమయంలో స్పష్టత కోసం సోలార్ లైట్లు, వీధి దీపాలు మెరుగుపరచడం. గుంతలను పూడ్చడం, జారుడు రోడ్లకు తగిన గుర్తులు వేయడం వంటి చర్యలు సంబంధిత అధికారుల సమన్వయంతో ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఏసీపీలు వసుందర యాదవ్, రమణమూర్తి, తిరుపతి రెడ్డి, సారంగపాణి, ఫణిందర్, నర్సింహారావు, సర్వర్, సత్యనారాయణ, సాంబరాజు పాల్గొన్నారు.

# కల్వచర్లలో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు శ్రీకారం



- **మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం : సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి**

**కమాన్‌పూర్ (మనసులోమాట) జూలై 14:**

రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి గ్రామపంచాయతీ ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగా 10వ వార్డులో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ వరలక్ష్మితో కలిసి గ్రామ సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి మంగళవారం ప్రతిపాదిత ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక అంశాలను పరిశీలించిన అధికారులు, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని సర్పంచ్ తెలిపారు. అదే విధంగా గ్రామంలోని 7వ వార్డు కోమట్లవాడలో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో కొత్త డ్రైనేజీ నిర్మాణ పనులకు కూడా శ్రీకారం చుట్టారు. అసిస్టెంట్ ఇంజనీర్ వరలక్ష్మితో కలిసి డ్రైనేజీ నిర్మాణానికి అనువైన ప్రాంతాలను పరిశీలించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి మాట్లాడుతూ, గ్రామంలో ఎక్కడా మురుగునీరు నిల్వ లేకుండా సమర్థవంతమైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే తమ లక్ష్యమని అన్నారు. గ్రామాభివృద్ధిలో భాగంగా అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ వరలక్ష్మి, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీధర్, వార్డు సభ్యురాలు చిందం కవిత, వార్డు సభ్యుడు కొట్టే నాగరాజు, గ్రామపంచాయతీ సిబ్బంది, స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.

# భూ రీ-సర్వే కార్యక్రమానికి ప్రజలు, రైతులు సహకరించాలి: జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

- **జూలై 15 నుంచి మరో ఎనిమిది గ్రామాల్లో భూ రీ-సర్వే ప్రారంభం**

**పెద్దపల్లి (మనసులోమాట) జూలై 14:**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న భూ రీసర్వే కార్యక్రమానికి ప్రజలు, రైతులు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కోరారు. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన జిల్లాలో కొనసాగుతున్న భూ రీసర్వే పనుల పురోగతిని వివరించారు. జిల్లాలో తొలి విడతగా ధర్మారం మండలం పైడిచింతలపల్లి, పెద్దపల్లి మండలం నిమ్మన్‌పల్లి, సుల్తానాబాద్ మండలం రెబ్బల్‌దేవ్‌పల్లి, రామగిరి మండలం పన్నూర్, మంథని మండలం మల్లాపల్లి గ్రామాల్లో భూ రీసర్వే కార్యక్రమం ప్రారంభమై కొనసాగుతోందని తెలిపారు. ఆయా గ్రామాల్లో గ్రామ సరిహద్దుల నిర్ధారణ పూర్తికాగా, ప్రస్తుతం గ్రామకంఠం సర్వే పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అలాగే జూలై 15 నుంచి అంతర్గాం మండలం సోమనపల్లి, ఎలిగేడు మండలం లోకపేట, పెద్దపల్లి మండలం రంగంపల్లి, పాలకుర్తి మండలం గూడిపల్లి, శ్రీరాంపూర్ మండలం మంగపేట, ఓడెల మండలం గూడెం, మంథని మండలం అంగులూరు, ముత్తారం (మంథని) మండలం శుక్రవారంపేట గ్రామాల్లో భూ రీసర్వే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ గ్రామాల్లో ఇప్పటికే గ్రామసభలు నిర్వహించి, ప్రజలకు కార్యక్రమంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో రీసర్వే ప్రారంభానికి ముందు గ్రామసభ నిర్వహించి, భూ యజమానులకు కార్యక్రమం ఉద్దేశ్యం, విధివిధానాలను వివరించిన అనంతరమే సర్వే చేపడుతున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. సర్వే అండ్ బౌండరీస్ చట్టం-1923 నిబంధనలకు అనుగుణంగా పూర్తిస్థాయి పారదర్శకతతో ఈ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. భూ రీసర్వే ద్వారా భూముల హద్దులు ఖచ్చితంగా నిర్ధారణ కావడంతో పాటు భూ రికార్డుల నవీకరణ, భూ వివాదాల పరిష్కారానికి ఇది దోహదపడుతుందని కలెక్టర్ వివరించారు. సర్వే సమయంలో భూ యజమానులు తమ భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించుకోవడంతో పాటు అవసరమైన పత్రాలతో అందుబాటులో ఉండాలని సూచించారు. భూ రీసర్వే కార్యక్రమం విజయవంతం కావాలంటే సంబంధిత గ్రామాల ప్రజలు, రైతులు గ్రామసభల్లో పాల్గొని అధికారులు, సర్వేయర్లు, లైసెన్స్‌డ్ సర్వేయర్లకు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష విజ్ఞప్తి చేశారు.

# మొక్కజొన్న కొనుగోళ్లలో "సహకార" దోపిడి



**ఇల్లెందు (మనసులోమాట) జూలై 14:**

రైతులకు అండగా నిలవాల్సిన సహకార సంఘమే కొందరి చేతుల్లో ఆదాయ వనరుగా మారిందన్న ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. మొక్కజొన్న కొనుగోళ్లలో భారీ అక్రమాలు జరిగాయని, రైతులను అనేక రకాలుగా దోచుకుంటూ లక్షలాది రూపాయలు అక్రమంగా సంపాదించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతులకు పూర్తి మద్దతు ధర కల్పించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, దళారులతో కుమ్మక్కై తక్కువ ధరలకు మొక్కజొన్నను కొనుగోలు చేసి, ప్రభుత్వ ధరకు విక్రయించడం ద్వారా భారీ లాభాలు ఆర్జించారని రైతులు మండిపడుతున్నారు.

**ఆన్‌లైన్ పేరిట ఒక్కో రైతు నుంచి రూ.1,000 వసూళ్లు**

ప్రభుత్వం రైతుల కోసం పూర్తిగా ఉచితంగా అందించే ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను సైతం ఆదాయ మార్గంగా మార్చుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో రైతు నుంచి రూ.1,000 వరకు వసూలు చేసినట్లు బాధిత రైతులు చెబుతున్నారు. ఆన్‌లైన్ సేవకు ఎలాంటి రుసుము లేకపోయినా, "ఇలా చేయకపోతే కొనుగోలు జరగదు" అంటూ రైతులను భయపెట్టి డబ్బులు వసూలు చేశారని ఆరోపిస్తున్నారు.

**బస్తాలకు సైతం డబ్బులు కటింగ్ చేసి**

ఇక్కడితో ఆగకుండా ప్రతి బస్తాపై వివిధ పేర్లతో పైసలు కట్ చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో రైతు నుంచి వందల రూపాయలు కోత విధించడం ద్వారా వేలాది బస్తాలపై భారీ మొత్తంలో అక్రమ వసూళ్లు జరిగినట్లు సమాచారం. ఈ కోతలకు ఎలాంటి అధికారిక రసీదులు ఇవ్వలేదని రైతులు చెబుతున్నారు.

**రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు**

మార్కెట్‌లో మంచి ధర ఉన్నప్పటికీ, రైతుల నుంచి క్వింటాలుకు రూ.500 నుంచి రూ.600 వరకు తక్కువ ధరకు మొక్కజొన్న కొనుగోలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దళారులతో కుమ్మక్కై రైతుల నిర్బంధ పరిస్థితిని ఆసరాగా చేసుకుని తక్కువ ధరకు సరుకును తీసుకుని, అనంతరం ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించి భారీగా లాభాలు గడించారని రైతులు ఆరోపిస్తున్నారు.

**ప్రభుత్వ ధరకు విక్రయించి రూ.లక్షల్లో లాభాలు**

తక్కువ ధరకు కొనుగోలు చేసిన మొక్కజొన్నను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా పూర్తి ధరకు విక్రయించడం వల్ల లక్షలాది రూపాయల అక్రమ లాభాలు వచ్చినట్లు సమాచారం. రైతుల చెమటను కొందరు తమ ఆదాయంగా మార్చుకున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**విక్రయించిన మొక్కజొన్న పైసల్లో సైతం కోత**

మొక్కజొన్న విక్రయించిన తర్వాత కూడా రైతులకు పూర్తిస్థాయి చెల్లింపులు జరగలేదని ఆరోపణలు ఉన్నాయి. "తేమ ఎక్కువగా ఉంది", "గింజలు పాడయ్యాయి", "నాణ్యత తక్కువగా ఉంది" వంటి కారణాలు చూపుతూ ఒక్కో రైతు నుంచి 10 నుంచి 20 కిలోల వరకు తగ్గించి చెల్లింపులు చేసినట్లు రైతులు చెబుతున్నారు. దీంతో ఇప్పటికే నష్టాల్లో ఉన్న రైతులు మరింత ఆర్థికంగా దెబ్బతిన్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అవినీతి సొమ్ము పంపకాల్లో పలు అధికారుల అసహనం..?**

ఈ మొత్తం వ్యవహారంలో అక్రమంగా వచ్చిన సొమ్ము పంపకాల విషయంలో అంతర్గత విభేదాలు నెలకొన్నాయని, కొందరు అధికారులు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారనే ప్రచారం సాగుతోంది. ఈ పరిణామం వ్యవహారం మరింత వివాదాస్పదంగా మారడానికి కారణమైందని స్థానికంగా చర్చ జరుగుతోంది. అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు.

**అసహనం వ్యక్తం చేస్తున్న రైతన్నలు**

ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు సరైన ధర రాకపోవడం, కొనుగోలు ప్రక్రియలో అనేక రకాల కోతలు విధించడం, ఆన్‌లైన్ పేరిట డబ్బులు వసూలు చేయడం వంటి ఘటనలతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతుల సంక్షేమం కోసం ఏర్పాటైన సహకార వ్యవస్థే తమను దోచుకుందని పలువురు రైతులు వాపోతున్నారు.

**ఆందోళనకు సిద్ధమవుతున్న రైతులు**

తమకు జరిగిన అన్యాయంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదులు ఇవ్వడంతో పాటు, అవసరమైతే పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టేందుకు కూడా సిద్ధమవుతున్నట్లు సమాచారం. మొత్తం కొనుగోలు ప్రక్రియపై స్వతంత్ర దర్యాప్తు నిర్వహించి, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# పుష్కరాలతో ధర్మపురి ఆలయాల వైభవాన్ని ప్రపంచానికి చాటుతాం

**ధర్మపురి (మనసులోమాట) జూలై 14:**



2027 జూలైలో జరగనున్న గోదావరి పుష్కరాల సందర్భంగా ధర్మపురి ఆలయాల చారిత్రక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పడంతో పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. మంగళవారం ధర్మపురిలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్తో కలిసి వివిధ శాఖల అధికారులతో పుష్కరాల ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న ప్రధాన ఆలయాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. పుష్కరాలకు వచ్చే భక్తుల సౌకర్యాల కోసం ప్రభుత్వం రూ.1,000 కోట్లు కేటాయించిందని, ఇందులో భాగంగా ధర్మపురి, కోటిలింగాల క్షేత్రాల అభివృద్ధికి తొలి విడతగా రూ.117 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ధర్మపురిలో శ్రీ ఉగ్ర నరసింహస్వామి దేవాలయ అభివృద్ధితో పాటు వీఐపీ ఘాట్ల నిర్మాణం చేపడతామని, కోటిలింగాల దేవస్థానం అభివృద్ధి, వెల్గటూరు ప్రధాన రహదారి నుంచి కోటిలింగాల వరకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే ధర్మపురిలో అమ్మ ఫంక్షన్ హాల్ నుంచి రాజారం రోడ్డు వరకు ప్రత్యేక రహదారి నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. పుష్కరాల ఏర్పాట్ల కోసం ధర్మపురికి మరో రూ.60 కోట్ల అదనపు నిధులు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలకు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొచ్చే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని, బాసర, కాళేశ్వరం, ధర్మపురి, భద్రాచలం వంటి పుణ్యక్షేత్రాలను మాస్టర్ ప్లాన్‌తో అభివృద్ధి చేసి టెంపుల్ సిటీలుగా తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు. ధర్మపురి మాస్టర్ ప్లాన్ను కూడా త్వరలో అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుతో కలిసి ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో పనిచేస్తున్న అర్చకులకు వేతనాల పెంపు ఉత్తర్వులను అందజేశారు. అనంతరం కోటిలింగాల క్షేత్రాన్ని సందర్శించి కోటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ పుష్కరాల ఏర్పాట్లకు చేపట్టాల్సిన పనులను అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాజగౌడ్, ఆర్డీవో మధుసూదన్ గౌడ్, తహసీల్దార్ శేఖర్, ఎంపీడీవో కృపాకర్, ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనభట్ల దినేష్, ఆలయ చైర్మన్ పూదరి రమేష్, ఈవో శ్రీనివాస్, కాంతారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సీపీ చేతుల మీదుగా హుజురాబాద్ పోలీసులకు 'ఉత్తమ సేవా' ప్రశంసా పత్రాలు




**హుజురాబాద్ (మనసులోమాట) జూలై 14:**

విధుల పట్ల అంకితభావంతో ఉత్తమ సేవలు అందించిన హుజురాబాద్ పోలీసులకు ఉన్నతాధికారుల నుంచి అరుదైన గుర్తింపు లభించింది. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి అందించే **"ఉత్తమ సేవా ప్రశంసా పత్రాలు"** హుజురాబాద్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వరరావు, కానిస్టేబుల్ మహేందర్‌కు ప్రదానం చేశారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ (సీపీ) గౌస్ ఆలం చేతుల మీదుగా వారు ఈ గుడ్ సర్వీస్ సర్టిఫికెట్లను అందుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, విధి నిర్వహణలో కనబరిచిన ప్రతిభ, కర్తవ్యనిర్వహణలో అంకితభావాన్ని గుర్తిస్తూ ఈ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ గౌస్ ఆలం అవార్డు గ్రహీతలను అభినందిస్తూ, ఇదే నిబద్ధతతో భవిష్యత్తులోనూ ప్రజలకు సేవలందించి పోలీసు శాఖకు మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సీపీ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్న హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వరరావు, కానిస్టేబుల్ మహేందర్‌లకు స్థానిక పోలీసు అధికారులు, సహచర సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

# డిమాండ్లు నెరవేర్చకపోతే ఉద్యమం ఉధృతం చేస్తాం

**కామారెడ్డిటౌన్ (మనసులోమాట) జూలై 14:**

తపస్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు టీపీయుఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఉద్యోగ ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున ధర్నా చేశారు. వారి ప్రధాన డిమాండ్లు 1. 51% ఫిట్మెంట్‌తో పీఆర్సీ రిపోర్ట్ ప్రకటించాలి. పెండింగ్ 6 డీఏలు, బిల్లులు వెంటనే చెల్లించాలి. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలి. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలి. ఎస్ఎస్ఎ, కేజీబీవీ, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి. ప్రమోషన్లు, బదిలీలకు ప్రతి ఏటా షెడ్యూల్ విడుదల చేయాలి. 2008 డీఎస్సీ కాంట్రాక్టు ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు భూనేకర్ సంతోష్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, రాష్ట్ర నేతలు రవీంద్రనాథ్ ఆర్య, పుల్లం రాఘవరెడ్డి, మహిళా కార్యదర్శి ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.



# జేపల్లిలో విషాదం..అనారోగ్యంతో విద్యుత్ లైన్ మెన్ మృతి



**చారకొండ (మనసులోమాట) జూలై 14:**

జేపల్లి గ్రామానికి చెందిన విద్యుత్ లైన్ మెన్ మల్లేపాకుల శ్రీనివాసులు అనారోగ్యంతో చికిత్స పొందుతూ మంగళవారం కన్నుమూశారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. 2006లో ఉద్యోగం పొందిన ఆయన రంగారెడ్డి జిల్లా, ఇర్విన్, వంగూర్, చారకొండ, రాచూరు ప్రాంతంలో 20సంవత్సరాల పాటు ఉత్తమ లైన్ మెన్ ఉద్యోగిగా సేవ లందిస్తూ గ్రామ ప్రజలు, రైతుల మన్ననలను పొందారు. ఆయన చివరిగా వెల్దండ మండల పరిధిలోని రాచూరు గ్రామంలో లైన్మెన్ విధులు నిర్వహిస్తూ ఉత్తమ సేవ లందించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ లోని కేర్ హాస్పిటల్ లో మంగళవారం ఉదయం 8.30 గంటలకు తుదిశ్వాస విడిచారు. శ్రీనివాసులు మృతి వార్తతో జేపల్లి గ్రా మంలో విషాదఛాయలు అలు ముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు, సహచర ఉద్యోగులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

**శ్రీనివాసులు ఆకస్మిక మరణం తీవ్రంగా గ్రామస్తుల సంతాపం..**

విద్యుత్ శాఖలో తన కర్తవ్యాన్ని నిబద్ధతతో, నిజాయితీతో నిర్వర్తించిన లైన్ మెన్ శ్రీనివాసులు ఆకస్మిక మరణం మమ్మల్ని తీవ్రంగా కలచివేసిందని పలువురు ఉద్యోగులు, రాజకీయ నాయకు లు, గ్రామ ప్రజలు, యువత, పలువురు ప్రముఖులు కన్నీటి పర్యంతమయ్యారు. ఆయన సేవాభావం, సహోద్యోగుల పట్ల చూపిన ఆప్యాయత, ప్రజల పట్ల ఉన్న అంకిత భావం ఎప్పటికీ మరువలేనిము అని, శ్రీనివాస్ మరణం విద్యుత్ శాఖకే తీరని లోటు, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని పలువురు సంతాపం ప్రకటించారు.

# చిరుత పులుల మృతి పై అటవీ అధికారుల విచారణ..

**ధర్పల్లి (మనసులోమాట) జూలై 14:**



ధర్పల్లి, భీంగల్ మండలాల్లోని రెండు చిరుత పులుల మృతి పై అటవీశాఖ అధికారులు దర్యాప్తు వేగవంతం చేశారు. చిరుత పులుల కళేబరాలు ధర్పల్లి మండల కేంద్రంలోని ఓ పాడుబడిన బావిలో లభించడంతో లోతుగా దర్యాప్తు జరుపుతున్నారు. కమ్మర్పల్లి రేంజ్ పరిధిలో చిరుత పులి మృతి పై విచారణలో తీగలాగితే ధర్పల్లిలో డొంక కదిలింది. జంతువులను పట్టేందుకు వల వేసిన వేటగాళ్లకు వలలో చిరుతతో పాటు అడవి పంది చిక్కిందని సమాచారం. రామడుగు అటవీ ప్రాంతంలో కొందరు వేటగాళ్లు వల వేయడంతో చిరుత పులి, అడవి పంది వలలో చిక్కింది. చిరుతను చంపేసి దాని గోర్లు, దంతాలు, చర్మంను ఉంచుకొని దానికలేబరాన్ని తమ్మలోడి బాగులో ఓ పాడుబడిన బావిలో పడేశారు. పులిచర్మంను సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో మరొక పాడుబడిన బావిలో పడేసినట్లు నిందితులు వివరించినట్లు తెలిసింది. చిరుత పులిని చంపి కళేబరాన్ని పడేసిన ధర్పల్లికి చెందిన ముగ్గురు ఎరుకల కులానికి చెందిన వారని తెలిసింది. చిన్నా చితక వ్యాపారాలు చేసుకోవడానికి వచ్చి మాల గుట్ట పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్నట్లు సమాచారం. రెండు రోజుల క్రితం ఈ ముగ్గురు నిందితులను అటవీ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మరొక నిందితుడు రామారెడ్డికి చెందిన వ్యక్తిగా అటవీ అధికారులు గుర్తించారు. నిందితుడి కోసం వెతకగా పరారీలో ఉన్నట్టు తెలిసింది. నిందితులు అడవి పందిని అమ్ముకున్నట్లు తెలిసింది. చిరుత పులిని చంపి మూడు నెలలు గడిచినా అటవీ అధికారులు గుర్తించకపోవడం నిర్లక్ష్యంను తెలియజేస్తుంది. కమ్మర్పల్లి రేంజి పరిధిలోని ఓ చిరుతను చంపి పూడ్చివేసిన ఘటన పై విచారణ జరుపుతుండగా మరొక సంఘటన ధర్పల్లిలో చిరుత మృతి బయటపడడం అటవీ అధికారులను ఆశ్చర్యానికి గురిచేసింది. ధర్పల్లి మండలంలో అడవి పందులు, జింకలు, మనుబోతులు, కుందేళ్ళ, వంటి జీవరాసులకు ఉచ్చులు వేసి చంపుతున్నారు. వీటి మాంసానికి బాగా గిరాకి ఎక్కువగా ఉండటంతో గ్రామంలో నడిబొడ్డున అమ్ముతున్న అటవీ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం, అప్పటికప్పుడు స్మగ్లర్ వద్ద డబ్బులు నొక్కెయడం, లేదంటే కేసులు చేస్తామని బెదిరించడం వంటి అవినీతి సంఘటనలతో వన్యమృగాల వేట యదేచ్ఛగా సాగుతుంది. నిందితులను పట్టుకొని విచారించగా పులి మృతి కేసు పై క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. సంఘటన ఎలా జరిగిందో నిందితులు చెప్పిన విషయాలను బట్టి అటవీ అధికారులు జాగిలాలతో విచారణ జరిపారు. చిరుత పులి ఎక్కడ వలవేసి పట్టుకున్నారో ఎలా చంపారు ఎక్కడ పడేశారు అనే విషయం పై ఇందల్ వాయి రేంజి ఆఫీసర్ రవి మహేష్ బట్ అటవీ సిబ్బందితో క్షేత్రస్థాయిలో పరిశీలించి పాడుబడిన బావుల చుట్టూ రిబ్బన్ చుట్టి గుర్తులు పెట్టారు. వివరాలు వెల్లడించడానికి ఆయన నిరాకరించారు. పూర్తి విచారణ తర్వాత వివరాలు వెల్లడిస్తామని ఆయన తెలిపారు.

# ఒడిశా నుంచి గంజాయి తెప్పించి విక్రయాలు.. యువకుడు అరెస్ట్

**మేడ్చల్ (మనసులోమాట) జూలై 14:**



ఒడిశా నుంచి గంజాయిని తెప్పించి అక్రమంగా విక్రయిస్తున్న ఓ యువకుడిని మేడ్చల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మేడ్చల్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన అలోక్ సర్కార్(20) ప్రస్తుతం కిస్టాపూర్ నివాసం ఉంటూ ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. తన స్నేహితుడు సోహైల్(22) సహకారంతో ఒడిశా నుంచి 2 కిలోల ఎండు గంజాయిని విక్రయాల కోసం తెప్పించినట్లు విచారణలో వెల్లడైంది. విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించిన పోలీసులు అలోక్ సర్కార్‌ను అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి సుమారు రూ.లక్ష రూపాయల విలువైన 2 కిలోల ఎండు గంజాయితో పాటు ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన సహచరుడు సోహైల్ ప్రస్తుతం పరారీలో ఉండగా, అతని కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు మేడ్చల్ సీఐ సత్యనారాయణ వెల్లడించారు.

# ప్రభుత్వ ఉపాధ్యాయులు పాఠాల కంటే.. పక్క వ్యాపారాలకే పెద్దపీట?

**ఖమ్మం (మనసులోమాట) జూలై 14:**



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి, వారి భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు పాఠశాల బాధ్యతల కంటే పక్క వ్యాపారాలపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా రియల్ ఎస్టేట్, జీవిత బీమా పాలసీలు, చిట్‌ఫండ్లు, పెట్టుబడి పథకాలు, ఇతర ప్రైవేట్ వ్యాపారాల్లో కొందరు ఉపాధ్యాయులు చురుకుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు స్థానికంగా చర్చకు దారితీశాయి. ప్రభుత్వం ఉపాధ్యాయుల వ్యాపారం ఖమ్మం రూరల్ మండలం తో పాటు ఏదులాపురం మున్సిపాలిటీ పాలేరు నియోజకవర్గం లోని మిగతా మూడు మండలాల్లో కూడా విరివ్యాపారం బాగా విస్తరించి ఉందని ఆరోపణలు సైతం బలంగా ఉన్నాయి. ఏ వ్యాపారం ప్రారంభించాలన్న ఉపాధ్యాయులను సంప్రదిస్తే అది 100% సక్సెస్ ఫుల్ గా విజయవంతం అవుతుందని ప్రైవేట్ వ్యాపార వర్గాల చర్చ. జపాన్ దేశానికి చెందిన ఒక వాటర్ డివైస్ " కంగాన్ " అనే పేరుతో మార్కెట్లోకి వచ్చిన ఆ డివైస్ను విస్తృతంగా వ్యాపారం చేసింది కూడా ఉపాధ్యాయులే, దీనిపై కమిషన్ కూడా భారీ స్థాయిలో ఉపాధ్యాయులకు వస్తుండడంతో తోటి ఉపాధ్యాయులతో పాటు ఇతర ప్రముఖులతోనూ కొనిచ్చే పంతుళ్లు పనిలో నిమగ్నమయ్యారు. గ్రామాల్లో ప్రజలను కలిసే అవకాశాన్ని ఉపయోగించుకుని కొందరు ఉపాధ్యాయులు స్థలాల కొనుగోలు-అమ్మకాలకు మధ్యవర్తిత్వం చేయడం, బీమా పాలసీల కోసం ప్రచారం చేయడం, సెలవు రోజుల్లోనే కాకుండా విధి సమయాల్లో కూడా వ్యక్తిగత వ్యాపారాలకు ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో విద్యార్థుల బోధనపై ప్రభావం పడుతోందని పలువురు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**పాఠశాలలపై ప్రభావం?**

ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోవడం, తరగతులకు ఆలస్యంగా హాజరు కావడం, విద్యార్థుల సందేహాల నివృత్తికి తగిన సమయం కేటాయించకపోవడం వంటి అంశాలు కొన్ని చోట్ల వినిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తుంటే, కొందరు ఉపాధ్యాయుల నిర్లక్ష్య వైఖరి వల్ల ప్రభుత్వ విద్యపై ప్రజల్లో నమ్మకం దెబ్బతింటోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**సేవా ధర్మం మరిచిపోతున్నారా?**

ఉపాధ్యాయ వృత్తి సమాజంలో అత్యంత గౌరవనీయమైనది. విద్యార్థులకు విజ్ఞానం మాత్రమే కాకుండా విలువలు, క్రమశిక్షణ, బాధ్యతలను నేర్పాల్సిన గురువులే వ్యక్తిగత లాభాల కోసం ఇతర వ్యాపారాల్లో నిమగ్నమవడం సమాజానికి మంచి సంకేతం కాదని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

**నిబంధనలు ఏమంటున్నాయి?**

ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వ సేవా నియమావళికి లోబడి ఉండాలి. ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రైవేట్ వ్యాపారాలు నిర్వహించడం లేదా వ్యక్తిగత లాభాపేక్షతో వాణిజ్య కార్యకలాపాల్లో పాల్గొనడం సేవా నియమాలకు విరుద్ధమయ్యే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. అలాంటి ఆరోపణలు ఉంటే సంబంధిత అధికారులు విచారణ జరిపి వాస్తవాలు నిర్ధారించాల్సిన బాధ్యత ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**పర్యవేక్షణ ఎక్కడ?**

పాఠశాలలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాల్సిన ఉన్నతాధికారులు ఈ అంశంపై దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదులు వచ్చినా సమగ్ర విచారణ జరగడం లేదని, దీంతో కొందరు నిర్భయంగా పక్క వ్యాపారాలు కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**తల్లిదండ్రుల డిమాండ్**

ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న ఈ సమయంలో, విధి నిర్వహణను నిర్లక్ష్యం చేసి ఇతర వ్యాపారాల్లో నిమగ్నమయ్యే ఉపాధ్యాయులపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, ప్రజా సంఘాలు కోరుతున్నాయి. విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రభుత్వ యంత్రాంగం కఠిన పర్యవేక్షణ చేపట్టాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు..



**ఖమ్మం (మనసులోమాట) జూలై 14:**

హత్య కేసులో వరంగల్ జిల్లా, ధర్మసాగర్ మండలం, పెద్ద పెండ్యాల గ్రామానికి చెందిన రాప్రోలు వెంకటేశ్వర్లు @ రాజు(32)కు జీవిత ఖైదు, 10 వేలరూపాయలు జరిమానా విధిస్తూ నాలుగోవ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు గౌరవ న్యాయమూర్తి డా. జి.వి. మహేష్ నాథ్ తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2021 ఫిబ్రవరి 13 న రాత్రి సమయంలో ఖమ్మం నగరంలో వినోద్ థియేటర్ వద్ద ఓ వివహితతో మాట్లాడుతున్న శీలం వెంకటేష్ అనే వ్యక్తిపై రాప్రోలు వెంకటేశ్వర్లు అనే వ్యక్తి పాత కక్ష పెంచుకొని హత్య చేసేందుకు కత్తితో పొడిచి పారిపోయాడు. బాధితుడి బంధువు అయిన ఇచ్చిన ఫిర్యాదుతో ఖమ్మం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాపు పూర్తి చేసి అభియోగ పత్రాన్ని న్యాయం స్థానంలో సమర్పించగా.. వాదోపవాదనలు విన్న న్యాయమూర్తిపై విధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్‌కు సహకరించిన పోలీసు అధికారులకు, ఇన్వెస్టిగేషన్ అధికారులు ఇన్స్పెక్టర్ చిట్టిబాబు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి. స్వప్న, కోర్టు కానిస్టేబుల్ యం. రామకృష్ణ, కోర్టు లైజన్ ఎస్సై శ్రీకాంత్, హోంగార్డ్ శ్రీనివాస్ ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కేరళ మోడల్ హై స్కూల్ విద్యార్థుల ఎంపిక

**పెద్దపల్లి (మనసులోమాట) జూలై 14:**

పెద్దపల్లి అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సుల్తానాబాద్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కేరళ మోడల్ హై స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. అండర్-16 బాలబాలికల విభాగంలో నిర్వహించిన ఒక కిలోమీటర్ పరుగుపందెంలో కె. యశ్వంత్, ఎ. వైశాలి ద్వితీయ స్థానం సాధించారు. అదే విభాగంలో రెండు కిలోమీటర్ల పరుగుపందెంలో టి. సాయి విష్ణు, పి. ఆరాధ్య రెండో స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో నిర్వహించిన 600 మీటర్ల పరుగుపందెంలో కె. వినూత్న ప్రథమ స్థానం సాధించగా, జి. చరిత ద్వితీయ స్థానం దక్కించుకొని రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ నెల 18వ తేదీన మెదక్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఎంపికైన విద్యార్థులు జిల్లా తరఫున పాల్గొనను న్నట్లు పెద్దపల్లి అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కె. గట్టయ్య తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను కేరళ మోడల్ హై స్కూల్ ప్రిన్సిపాల్ సీజ్జు ఎస్. నాయర్, వైస్ ప్రిన్సిపాల్ స్మిత ఎస్. నాయర్, ఉపాధ్యాయులు రాజయ్య, కిరణ్, పీటీ ఉపాధ్యాయులు అజయ్, రాజుతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్రస్థాయిలోనూ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.




# ప్రచారయాత్రనా.. దండయాత్రనా...

**కొత్తగూడెం (మనసులోమాట) జూలై 14:**

శాసనసభ ఎన్నికల ఫలితాల తర్వాత మరోసారి కొత్తగూడెం నియోజకవర్గం వార్తల్లోకి ఎక్కింది. ఆనాడు కాంగ్రెస్ సీపీఐ పొత్తులో అ భాగంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుకు టిక్కెట్ కేటాయించడం భారీ మెజారిటీతో గెలవడం జరిగిపోయింది. అప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగూడెం నియోజకవర్గం గురించి చర్చ జరిగింది. మళ్ళీ రెండున్నర సంవత్సరాల తర్వాత కొత్తగూడెం ప్రాంతం గురించి చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఈ నియోజకవర్గానికి ఎటువంటి ఎన్నికలు లేవు. కానీ రాజకీయపార్టీలు మాత్రం ప్రచారంతో హోరెత్తిస్తున్నాయి. ఒకరి తర్వాత ఒకరు వారం రోజుల వ్యవధిలోనే పార్టీల అగ్రనాయకులు, కేంద్రమంత్రి, రాష్ట్ర మంత్రి, ఎంపీలు, మాజీ మంత్రులు భద్రాద్రికొత్తగూడెం జిల్లా కేంద్రంలో పర్యటించి తమ పార్టీలు చేస్తున్న, చేసిన అభివృద్ధి, సంక్షేమంపై చెబుతూ పట్టును నిలుపుకునేందుకు ప్రయత్నాలను చేస్తున్నారు.

**సింగరేణి అంశమే ప్రధాన ఎజెండా**

కేంద్ర, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్, నూతనంగా ఆవిర్భవించిన తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) సింగరేణి అంశమే ప్రధాన ఎజెండాగా పెట్టుకొని ముందుకుపోతున్నారు. తొలుత బీఆర్ఎస్ శాసనసభ పక్ష ఉపనేత, మాజీ మంత్రి హరీష్ రావు కొత్తగూడెంలో సింగరేణి కార్మికులతో ఆత్మీయ సమ్మేళనం' పేరిట సింగరేణిలో జరుగుతున్న అవినీతిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. లేనిబొగ్గును ఉన్నట్లు చూపెడుతున్నట్లు, సంస్థను దివాళ తీసేలా, నష్టం చేకూర్చేలా వ్యవహరిస్తున్నారని చెబుతూ తాము సంస్థకు, కార్మికులకు ఏ విధంగా లబ్ధి చేకూర్చామో వివరించి ఓటు బ్యాంకును పదిలపరుచుకునే ప్రయత్నం చేశారు. ఇక ఆ తర్వాత ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ ఆగ్రనాయకులు బీఆర్ఎస్ చేస్తున్న విష ప్రచారాన్ని తీవ్రంగా ఖండించి తాము సింగరేణి సంస్థ కోసం ఏం చేస్తున్నామో చెప్పారు.

**సందట్లో సడేమియాలా 'జనసేన' ఎంట్రీ**

బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, టీఆర్ఎస్ పార్టీలు తమ ఉనికిని కాపాడుకునేందుకు, ఓటు బ్యాంకును సుస్థిరం చేసుకునేందుకు పావులు కదుపుతుంటే సందట్లో సడేమియాలాగా ''జనసేన' పార్టీ ఆగ్రనాయకులు కొత్తగూడెంలో ఎంట్రీ ఇచ్చారు. ఇటీవల పార్టీలో చేరిన మాజీ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు జిల్లా కేంద్రంలో తొలిసారి పర్యటించి భారీ ర్యాలీ నిర్వహించి, పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. రానున్న ఎన్నికల్లో కొత్తగూడెం నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని చెప్పకనే చెప్పాడు. పార్టీ కార్యాలయాన్ని అట్టహాసంగా ప్రారంభించడంతో పాటు గతంలో తాను జీఎస్ఆర్ ట్రస్టు ద్వారా చేసిన సేవలను సమావేశంలో వివరించి తనకు క్యాడర్ ఉందని ఆగ్రనాయకుల ముందు సెలవిచ్చాడు.

**మంత్రి వివేక్ ప్రచారం...**

రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పనశాఖా మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి కొత్తగూడెం, భద్రాచలం ప్రాంతాలలో పర్యటించి తన సామాజికవర్గ నాయకులతో సమావేశవడం, అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం, పార్టీ చేస్తున్న కార్యక్రమాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమపథకాలను వివరించే ప్రయత్నం చేశారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలను, నాయకుల ను కొంతమేర ఉత్సాహపరిచే కార్యక్రమాన్ని మంత్రి చేపట్టారు. ఇలా అన్నీ పార్టీల నాయకులు రెండువారాల వ్యవధిలోనే కొత్తగూడెం కేంద్రంగా చేసుకొని పర్యటించి వార్తల్లో ఉండేలా చేశారు.

**అభివృద్ధి, పార్టీ బలోపేతంపై దృష్టి సారించిన ఎమ్మెల్యే**

కొత్తగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పార్టీల నాయకుల ప్రచారాలను, యాత్రలను ఏమాత్రం పట్టించుకున్నట్లుగా కనిపించడంలేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు పనిచేసుకుంటూ పోవడమే మన ముందున్న కర్తవ్యంగా సాగుతున్నట్లుగా కనిపిస్తోంది. అందుకే ఇటీవల సమావేశాల పేరిట బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, టీఆర్ఎస్, జనసేన నాయకులు భారీ కటౌట్లు, ర్యాలీలు, ప్రదర్శనల పేరిట హంగూ ఆర్భాటం చేసిన, ఎంతోమంది నాయకులు కొత్తగూడెం పర్యటనకు వచ్చినా ఎమ్మెల్యే వీటిని ఖతారు చేయకుండా నియోజకవర్గ అభివృద్ధితో పాటు, సీపీఐ కార్యకర్తల శిక్షణ తరగతులను నిర్వహించారు. ఒకవైపు అభివృద్ధి, సంక్షేమం, మరోవైపు పార్టీ బలోపేతంపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

**ప్రచారయాత్రనా.. దండయాత్రనా...**

కేంద్రమంత్రి, రాష్ట్ర మంత్రి, ఎమ్మెల్యేలు, ఎంపీలు కేవలం కొత్తగూడెం జిల్లా కేంద్రంలో పర్యటిస్తూ ఎన్నికల వాతావరణాన్ని మరిపించేలా ప్రచారాస్త్రాలు, విమర్శనాస్త్రాలు సంధించుకున్నారు. పార్టీల కార్యక్రమాల పేరు భరోసా యాత్ర, ఆత్మీయ సమ్మేళనం, బాయిబాట ఏదైనా కానీ మొత్తానికి ఈ కొత్తగూడెం గడ్డపై ఒకరి తర్వాత ఒకరు యాత్రలు, సమ్మేళనాల పేరిట ఒక మాదిరిగా దండయాత్ర చేసినట్లుగానే ఉందంటూ సగటు ప్రజానీకం అభిప్రాయపడుతున్నారు. భవిష్యత్ లో జరగబోయే ఎన్నికలకు ఇప్పటి నుంచే పార్టీలు తమ పట్టును నిలుపుకునేందుకు, క్యాడర్ ను పెంచుకునేందుకు అవసరమైన ఆస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకునేందుకు ఇది ఒక ట్రయల్ గా ఉపయోగించుకుంటున్నట్లుగా కార్యకర్తలు చెబుతున్నారు. కొత్తగూడెం అంటేనే రాష్ట్రంలోనే ఒక ప్రత్యేకత సంతరించుకున్నదని చెప్పవచ్చు.

**మొత్తంగా కొత్తగూడెం నియోజకవర్గం సీటును..**

చాలా రాజకీయ చైతన్యవంతమైన నియోజకవర్గంగా దీనికి పేరుంది. అందుకే కాబోలు తెలంగాణ ఏర్పాడ్డాక ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆనాడు రెండుసార్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీకి ఒక్క కొత్తగూడెం, ఖమ్మంలో ఒక్కొక్క సీటకు పరిమితం చేయగా, ప్రస్తుతం రాష్ట్రంలోనే పోటీ చేసి, గెలిచిన ఏకైక కమ్యూనిస్టు ఎమ్మెల్యే ఉన్న నియోజకవర్గంగా కొత్తగూడెంను చెప్పుకోవచ్చు. మొత్తంగా కొత్తగూడెం నియోజకవర్గం సీటును సుస్థిరం చేసుకునేందుకు, పాగా వేసేందుకు రాజకీయపార్టీల నాయకులు ఇప్పటి నుంచే పావులు కదపడంలో బహుశా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని పార్టీ అభిమానులు, కార్యకర్తలు చెబుతున్నారు. పార్టీల అగ్రనాయకులు ప్రచారం చేసిన, దండయాత్ర చేసిన, భరోసా ఇచ్చిన, ఆత్మీయత చూపించిన సరే ఎవరికి లొంగము, అభివృద్ధి విషయంలో రాజీ పడతమేమో కానీ ఆత్మగౌరవం పై దెబ్బ కొడితే మాత్రం సహించమని మొదటినుంచి చెబుతూ వస్తున్నారు. అందుకే కొత్తగూడెం ఓటర్ ఎంతైనా డిఫరెంట్ అని చెప్పక తప్పదు.



## విద్యార్థులను అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి



**ఆదిలాబాద్ క్రీడావిభాగం (మనసులో మాట) జూలై 14:**

పాఠశాల విద్యార్థులను అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని జిల్లా యువజన క్రీడల అధికారి దయానంద రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని క్రీడా ప్రాధికారిక సంస్థ కార్యాలయంలో క్రీడా పాఠశాల శిక్షకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోనే ఆదిలాబాద్ క్రీడా పాఠశాలను క్రీడాపోటీల్లో అగ్రగామిగా నిలపాలని సూచించారు. క్రీడా పరికరాలు అవసరం ఉన్నవారు ఇండెంట్ పంపాలని తెలిపారు. ఈ సమావేశంలో జూడో, బాక్సింగ్, అథ్లెటిక్స్, స్విమ్మింగ్, షటిల్, బ్యాడ్మింటన్ శిక్షకులు పాల్గొన్నారు.

## అక్కడ ముందుకు.. ఇక్కడ యథాతథం



**మెట్‌పల్లి (మనసులో మాట) జూలై 14:**

ఆర్మూర్‌జగిత్యాలమంచిర్యాల 63వ జాతీయ రహదారిని విస్తరించే ప్రక్రియకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 131.894 కిలోమీటర్ల మేర జాతీయ రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించాలని నిర్ణయించారు. రోడ్డు పనులు ప్రారంభించడానికి కావాల్సిన భూసేకరణకు గతంలోనే నోటిఫికేషన్ ఇచ్చారు. కోరుట్ల, జగిత్యాల డివిజన్లలో భూసేకరణ ప్రక్రియ జరుగుతుండగా.. మెట్‌పల్లి డివిజన్‌లో మాత్రం హైకోర్టు స్టేతో ముందుకు సాగడం లేదు.జిల్లాలో 69.300 కిలోమీటర్లు రహదారి విస్తరించనున్నారు. ఈ మార్గంలో మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి వంటి పట్టణాలుండటంతో వాహనాల రద్దీ అధికంగా ఉంటోంది. ఈ సమస్య అధిగమించడానికి పలు ప్రాంతాల్లో బైపాస్ రహదారుల నిర్మాణానికి ప్రతిపాదించారు. మెట్‌పల్లి శివారు నుంచి కోరుట్ల శివారు గ్రామాల మీదుగా సుమారు 17 కిలోమీటర్ల మేర బైపాస్ రహదారి కోసం ప్రతిపాదనలు పంపారు. ఆ తర్వాత 15 కిమీల రోడ్డు విస్తరణ అనంతరం 11 కిమీలు బైపాస్ నిర్మించనున్నారు.

# మొరాయించిన సర్వర్.. నిలిచిన రేషన్ బియ్యం పంపిణీ

**నిర్మల్ పట్టణం (మనసులో మాట) జూలై 14:**

వేసవి తీవ్రత దృష్ట్యా ఏప్రిల్, మే, జూన్ మాసాలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఏప్రిల్‌లోనే పంపిణీ చేశారు. జులైలో మళ్లీ పంపిణీ మొదలైంది. మొదటి వారంలో జనాలు ఎక్కువగా ఉంటారు. కాస్త ఆలస్యంగా తీసుకుందామని చాలామంది భావించారు. దీనికి తోడు రెండో శనివారం, ఆదివారం సెలవుదినాలుగా ఉంటాయనుకున్నారు. సోమవారం రేషన్ దుకాణాలకు వెళ్లి బియ్యం తెచ్చుకుందామనుకున్నారు. కానీ, వీలుపడలేదు. వెళ్లినవారు వెళ్లినట్లుగా తిరిగి రావాల్సిన పరిస్థితి. కారణం.. సర్వర్ పనిచేయకపోవడమే.

**ఉదయం నుంచి..**

ప్రస్తుతం రేషన్ బియ్యం పంపిణీ ఎలక్ట్రానిక్ పీఓఎస్ (పాయింట్ ఆఫ్ సేల్) పరికరాల ద్వారా జరుగుతోంది. లబ్ధిదారులు తమ రేషన్‌కార్డు నంబరు ఆధారంగా ఆధార్‌తో అనుసంధానించిన వేలిముద్రలు, ఐరిష్ స్కాన్‌ను ఉపయోగించి ఈ పరికరాల్లో తమ గుర్తింపును ధ్రువీకరిస్తారు. ప్రభుత్వ డేటాబేస్ నుంచి కుటుంబ సభ్యుల వివరాలను ధ్రువీకరించుకొని, పంపిణీ చేసిన వస్తువుల ఖచ్చితమైన పరిమాణాన్ని అక్కడ నమోదు చేస్తారు. దీనివల్ల నకిలీ రేషన్ కార్డుల నివారణకు, ఆహార ధాన్యాల దారి మళ్లింపును నిరోధించేందుకు మార్గం సుగమమైంది.ఆధునిక విధానంలో చేపట్టిన ఈ పంపిణీ ప్రక్రియ కొన్నేళ్లుగా సజావుగా సాగుతోంది. గతంలో ఎన్నడూ లేనిరీతిలో తొలిసారిగా సర్వర్ మొరాయింపు చోటుచేసుకుంది. ఉదయం 9.04 గంటల నుంచి ఈ పాస్ యంత్రాలు పనిచేయలేదు. ఆధార్‌తో అనుసంధానమైన సర్వర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతోనే ఈ పరిస్థితి నెలకొందని రేషన్ డీలర్లు చెబుతున్నారు. ఆదివారం రోజున కూడా ఇదే తరహా సమస్య తలెత్తిందని, దీనివల్ల పంపిణీకి ఇబ్బంది ఏర్పడిందన్నారు.సాయంత్రం వరకు సమస్య పరిష్కారం కాక బియ్యం పంపిణీ చేపట్టలేకపోయారు. ప్రతినెలా 15వ తేదీలోపు బియ్యం పంపిణీ ప్రక్రియ పూర్తిచేయాల్సి ఉంటుంది. సర్వర్ మొరాయింపుతో రెండు రోజులుగా ఇబ్బందులు ఏర్పడటంతో లబ్ధిదారులు చాలామంది బియ్యం పొందలేకపోయారు. గడువు ముగింపునకు రెండురోజులే ఉండటంతో, అందరికీ అందుతాయా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వం గడువు తేదీ పెంచితే ఇబ్బంది దూరమవుతుందని చెబుతున్నారు.




**జిల్లాలో ఇలా..**

మండలాలు : 19
రేషన్ దుకాణాలు : 412
లబ్ధిదారులు : 2,47,831.

## అంతా ఏకమయ్యారు.. అందినంత దండుకుంటున్నారు



- **అధికారుల అండతో ఇసుక అక్రమ రవాణా**

**శంకరపట్నం, చిగురుమామిడి, (మనసులో మాట) జూలై 14:**

జిల్లాలోని శంకరపట్నం, చిగురుమామిడి మండలాల్లో ఉన్న వాగులు, చెక్‌డ్యాం ప్రాంతాల్లోని ఇసుకను పెద్దఎత్తున అక్రమంగా తరలిస్తున్నారు. పగలు నిల్వలు చేస్తూ, రాత్రి వేళల్లో ట్రాక్టర్లలో రవాణా చేస్తున్నారు. కేశవపట్నం, గద్దపాక, తాడికల్, మక్త, ఎరడపల్లి, అర్కండ్ల, ముత్తారంతోపాటు పలు గ్రామాల్లో ఈ అక్రమ వ్యాపారం చేస్తూ అందినంత సొమ్ము చేసుకుంటున్నారు. అడుగంటిన వాగులు, వంతెనల ప్రాంతాల్లో ఇసుక కనిపిస్తే చాలు.. ఇసుకాసురులు కుప్పలుగా మలుచుకొంటున్నారు. ఇంత జరుగుతున్నా.. పోలీస్, రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

**నిల్వలు కనిపిస్తున్నా పట్టదా!**

ఇళ్లు, ఇతర నిర్మాణాలు పెరిగిపోవడంతో అక్రమ ఇసుక వ్యాపారాన్ని రెట్టింపు చేసుకొని ముందుకు సాగుతున్నారు. దీనిని నియంత్రించాల్సిన అధికారులు సహకరిస్తున్నారని ఆరోపణలున్నాయి. గ్రామాల్లో ఆ శాఖల అధికారులు సందర్శనలకు వెళ్లినప్పుడు వాగుల్లో ఇసుక నిల్వలు కనిపిస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

**ఒకే ఓటీపీతో అదనంగా..**

చిగురుమామిడి మండలం రామంచ గ్రామ వాగు ఇసుకకు మాత్రమే మైనింగ్ శాఖ అనుమతి ఉండగా.. ఆ శాఖకు సంబంధించిన ఒక అధికారి ఓటీపీ వచ్చిన క్రమంగా ట్రాక్టర్‌తో ఇసుక తరలించేందుకు అనుమతి ఇస్తున్నారు. మీసేవ కేంద్రంలో ఇసుక అవసరం ఉన్నవారు స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. స్లాట్ బుక్ అయిన తర్వాత ఓటీపీ నంబరు వస్తుంది. అయితే ఒకే నంబరుతో అదనంగా ఇసుకను ట్రాక్టర్ యజమానులు గ్రామాల దూరాన్ని బట్టి ధర నిర్ణయించి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రాత్రి వేళల్లో అయితే దీనికి హద్దే లేకుండా పోతుంది. ఇందుర్తి వాగు నుంచి ఎలాంటి అనుమతి లేకున్నా తరలిస్తున్నారు.

**పోలీసులు ఉంటే సమాచారం**

చిగురుమామిడి వైపు వెళ్లే ఇసుక ట్రాక్టర్ ముందు ఒకరు ద్విచక్ర వాహనంపై వెళతారు. మరొకరు చిన ముల్కనూర్ గ్రామంలో ఉంటాడు. పోలీసులు రామంచ వైపు వెళితే వెంటనే డ్రైవర్‌కు ఫోన్ చేసి సమాచారం అందిస్తారు. వెంటనే దారి మళ్లించి పోలీసుల కంట పడకుండా వెళతారు. మరొకరు చిగురుమామిడి ఠాణా సమీపంలో ఉంటూ.. పోలీసులు ఎటువైపు వెళ్తున్నారని గమనించి సమాచారం ఇస్తారు. ఎవరికి ఇసుక అవసరం ఉందో వారి ఇంటికి చేర్చుతారు.

# 60 వేల కేసుల పరిష్కారం పై కిషోర్ మక్వానా

సికింద్రాబాద్ (మనసులో మాట) జూలై 14:



గత రెండేళ్లలో రికార్డు స్థాయిలో 60 వేలకుపైగా కేసులను పరిష్కరించి జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ (ఎన్‌సీఎస్‌సీ) చరిత్ర సృష్టించిందని కమిషన్ ఛైర్మన్ కిషోర్ మక్వానా తెలిపారు. హైదరాబాద్ కవాడిగూడలోని సీజీవో టవర్స్‌లో ఆధునికీకరించిన ఎన్‌సీఎస్‌సీ రాష్ట్ర కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలు, రాజ్యాంగంలోని 338వ అధికరణకు అనుగుణంగా అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణకు కమిషన్ కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. ప్రతి ఫిర్యాదుదారుడికి సకాలంలో న్యాయం అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ మాట్లాడుతూ.. బాధితులకు న్యాయం చేయడంలో కమిషన్‌కు సమన్లు, నోటీసులు జారీ చేసే పూర్తి చట్టపరమైన అధికారాలు ఉన్నాయని తెలిపారు. ఎస్సీ పారిశ్రామికవేత్తల అభివృద్ధికి విధాన రూపకర్తలు తగిన ప్రాధాన్యతనివ్వాలని కోరారు. కమిషన్ కార్యదర్శి గుడే శ్రీనివాస్ మాట్లాడుతూ, డిజిటల్ సాంకేతికతతో ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యాన్ని తగ్గిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయ డైరెక్టర్ డాక్టర్ జీ. సునీల్ కుమార్ బాబు మాట్లాడుతూ, 20242026 మధ్య 10,853 ఫిర్యాదులను పరిష్కరించి, అట్రాసిటీ నిరోధక చట్టం కింద బాధితులకు రూ.33.80 కోట్ల నష్టపరిహారం అందించినట్లు తెలిపారు. అలాగే 177 సుమోటో కేసులు నమోదు చేసి, 127 చట్టబద్ధ విచారణలు నిర్వహించినట్లు వెల్లడించారు.

# రేవంత్, ఉత్తమ్‌లకు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సవాల్



కాళేశ్వరం (మనసులో మాట) జూలై 14:

కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య మాటల యుద్ధం మరింత ముదిరింది. పరస్పర విమర్శలతో రాష్ట్ర రాజకీయం అమాంతం వేడెక్కుతున్న తరుణంలో.. సీఎం రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు.

**బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సవాల్:**

ఎల్ నినో ఎఫెక్ట్ రైతులపై ఉండకుండా ఉండేందుకు కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీటిని వెంటనే ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రక్రియలో అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు ఏ చిన్న సమస్య వచ్చినా దానికి పూర్తి బాధ్యత బీఆర్ఎస్ ఎమ్మెల్యేలదే అని తెలిపారు. ఒకవేళ ఏదైనా సమస్య తలెత్తితే.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలమంతా తమ పదవులకు రాజీనామా చేస్తామని అన్నారు. అంతేకాకుండా మళ్లీ ఎన్నికల్లో కూడా పోటీ చేయబోమని స్పష్టం చేశారు. మా సవాల్‌ను స్వీకరించే దమ్ము ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఉందా అని ఆయన ప్రశ్నించారు.

**మా రక్తం తీసుకోండి.. రైతులకు నీళ్లివ్వండి:**

రేవంత్ సర్కార్ తీరుపై మండిపడ్డ కౌశిక్ రెడ్డి, రైతుల కోసం తాము ఎంతటి త్యాగానికైనా సిద్ధమని ప్రకటించారు. "ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ముఖ్యమంత్రి ఎదురుదాడికి దిగుతున్నారు. అవసరమైతే మా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్యకర్తల రక్తం తీసుకోండి.. కానీ రైతులకు మాత్రం వెంటనే నీళ్లు ఇవ్వండి" అని పాడి కౌశిక్ రెడ్డి కోరారు. కాళేశ్వరం విషయంలో ఇన్నాళ్లూ కాంగ్రెస్ చెప్పిన అబద్ధాలు ప్రజలకు ఎక్కడ తెలిసిపోతాయోనన్న భయంతోనే కన్నెపల్లి పంప్ హౌస్‌లను రన్ చేయడం లేదని కౌశిక్ రెడ్డి ఆరోపించారు. ఉత్తర తెలంగాణ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని మండిపడుతూ.. "కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి, మిమ్మల్ని అధికార పీఠంపై కూర్చోబెట్టడమే రైతులు చేసిన తప్పా?" అని నిలదీశారు. రైతులకు నీళ్లిస్తే ఎరువులు ఇవ్వాల్సి వస్తుందని, పండిన పంటను కొనుగోలు చేయాల్సి వస్తుందనే నెపంతోనే.. రేవంత్ రెడ్డి చిల్లర రాజకీయాలకు పాల్పడుతూ సాగునీరు విడుదల చేయడం లేదని తీవ్ర విమర్శలు గుప్పించారు. రైతుల ఆవేదనను చూసి కడుపు మంటతోనే తాను ఈ వ్యాఖ్యలు చేస్తున్నట్లు కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు.

# కేపీహెచ్‌బీ లులు మాల్‌లో గన్ కలకలం




హైదరాబాద్ (మనసులో మాట) జూలై 14:

కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లులు మాల్‌లో ఓ వ్యక్తి గన్‌తో కనిపించడం కలకలం రేపింది. మాల్ పార్కింగ్ వద్ద రెండు కుటుంబాల మధ్య ఘర్షణ జరగడంతో సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఇరువర్గాలను విచారిస్తుండగా పాతబస్తీకి చెందిన సిద్ధిఖీ జేబులో గన్ గుర్తించారు. పోలీసులు ఆయుధాన్ని స్వాధీనం చేసుకుని పరిశీలించగా.. దానికి చెల్లుబాటయ్యే లైసెన్స్ ఉన్నట్లు తేలింది. గన్‌తో వచ్చిన వ్యక్తిని మాల్‌లోకి అనుమతించే సమయంలో భద్రతా సిబ్బంది సరైన తనిఖీలు నిర్వహించలేదని గుర్తించిన పోలీసులు.. నిర్లక్ష్యంగా వ్యవహరించిన లులు మాల్ యాజమాన్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# రాజ్‌కుమార్ మృతదేహం మాకొద్దు.. కుటుంబసభ్యుల నిరాకరణ

చేవెళ్ల, షాబాద్, (మనసులో మాట) జూలై 14:



రాజ్‌కుమార్ మృతదేహాన్ని తీసుకెళ్లడానికి కుటుంబసభ్యులు నిరాకరించారు. పోలీసులు చేవెళ్ల మున్సిపాలిటీ సిబ్బంది సహకారంతో స్థానిక శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. రాజ్‌కుమార్ తల్లిదండ్రులు, సోదరుడు అయిష్టంగానే ఆసుపత్రి వద్దకు వచ్చారు. అంబులెన్స్‌లో ఉంచిన శవాన్ని చూసి వెనుతిరిగారు.

**పోస్టుమార్టం చేయడానికి ముందుకు రాని వైద్యులు..**

రాజ్‌కుమార్ మృతదేహానికి చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం రాత్రి పోస్టుమార్టం నిర్వహించారు. అంతకు ముందు డ్యూటీలో ఉన్న వైద్యులు ముందుకు రాకపోవడంతో మూడు గంటల పాటు పోలీసులు వేచి ఉండాల్సి వచ్చింది. వికారాబాద్ జిల్లా ఆస్పత్రి నుంచి వైద్యులను రప్పించడానికి ప్రయత్నించారు. సాధ్యం కాకపోవడంతో చేవెళ్ల ఆసుపత్రికి చెందిన వైద్యులు లక్ష్మీకాంత్ రెడ్డి, ప్రణీత్‌ను పిలిపించారు. ఎట్టకేలకు రాత్రి 9.30 తర్వాత పోస్టుమార్టం ప్రక్రియ ప్రారంభించారు.

**దివ్యాంగురాలికి రూ.10 లక్షల చెక్కు అందజేత**

బాధిత కుటుంబంలోని దివ్యాంగురాలికి అన్నిరకాలుగా అండగా నిలుస్తామని కలెక్టర్ నారాయణరెడ్డి, చీఫ్ విప్ మహేందర్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే యాదయ్యతో కలిసి బాధిత కుటుంబాన్ని కలిసి రూ.10 లక్షల చెక్కును బాలికకు అందజేశారు. ముఖ్యమంత్రి.. పరిహారం రెట్టింపు చేసినట్లు వారు తెలిపారు. ఇందిరమ్మ ఇంటితో పాటు ఆమె సంరక్షణ కోసం పునరావాస కేంద్రంలో చేర్పిస్తామని తెలిపారు. తండ్రి ప్రభుత్వ ఉద్యోగి అయినందున.. ఆయనకు అందే పింఛను ఆమెకు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ఈ డెక్క.. మా లెక్కలో లేనట్లే!



• కలుపు మొక్కలతో దోమల కర్మాగారంలా మారిన మూసీ

**హైదరాబాద్ (మనసులో మాట) జూలై 14:**

రాష్ట్ర ప్రభుత్వం మూసీ నదిని సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేయాలని యోచిస్తోంది.. మూసీ నది పరివాహక ప్రాంత అభివృద్ధి సంస్థ (ఎంఆర్‌డీసీఎల్) మాత్రం నదీ గర్భాన్ని దోమల కర్మాగారంలా మార్చింది. గుర్రపుడెక్క తొలగింపు పనుల పేరుతో రూ.కోట్లు ఖర్చవుతున్నా.. నదిలోని మొక్క చెక్కు చెదరట్లేదు. కలుపు మొక్కలు రోజురోజుకు మరింత విస్తరిస్తున్నాయి. దోమల సంతానోత్పత్తికి ఆలవాలమైన గుర్రపుడెక్కతో.. నదికి ఇరువైపులా ఉన్న జనావాసాలు నిత్యం నరకం చూస్తున్నాయి.

**నది పొడవునా సమస్యే..**

మూసీ నది నగరంలో 55 కి.మీ.. పొడవున ప్రవహిస్తుంది. జంట జలాశయాల నుంచి బాపూఘాట్ వరకు 21 కి.మీ.., బాపూఘాట్ నుంచి అత్తాపూర్ వరకు 1.9 కి.మీ. పొడవున గుర్రపుడెక్క విపరీతంగా పెరిగింది. దీనివల్ల నదిలో వ్యర్థాలను నిలువరించేందుకు ఎంఆర్‌డీసీఎల్ ఇంజినీర్లు ఏర్పాటు చేసిన జాలీలు (ఫ్లోటింగ్ ట్రాష్ కలెక్టర్లు) పని చేయట్లేదు. మురుగు, ప్లాస్టిక్, జంతు వ్యర్థాలు ఎక్కడికక్కడ పేరుకుపోతున్నాయి. ఇటీవల వర్షాల వల్ల.. మూసీ పరివాహక ప్రాంతాల్లో దోమల సమస్య క్రమంగా పెరుగుతోంది. అత్తాపూర్, లంగర్‌హౌస్, జియాగూడ, నాగోల్‌లో డెంగీ, మలేరియా జ్వరాలు పెరుగుతున్నాయి. సమస్యను పరిష్కరించాల్సిన ఎంఆర్‌డీసీఎల్, జీహెచ్‌ఎంసీ అధికారులు.. ఒకరిపై ఒకరు చెప్పుకొంటూ బాధ్యతను విస్మరిస్తున్నారు.

**సమస్య యథాతథం**

గతంలో మూసీ పొడవునా ఎంటమాలజీ బృందాలు దోమల మందును పిచికారీ చేసేవి. గుర్రపుడెక్క తొలగింపు పనులు చేపట్టేవారు. దోమ లార్వాను గుర్తించే సర్వే కూడా జరిగేది. ఏడాదిగా బల్దియా ఆధ్వర్యంలో అలాంటి కార్యక్రమాలు జరగట్లేదు. అయితే మూలాలను వదిలేసి దోమల నియంత్రణకు నగరవ్యాప్తంగా ఏటా రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు వెచ్చిస్తున్నారు. అలాగే గుర్రపుడెక్క తొలగింపునకు రూ. 35నాలుగు కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఎంఆర్‌డీసీఎల్ ఆధ్వర్యంలోనూ రూ.కోటి వరకు వెచ్చిస్తుండటం గమనార్హం. ఇన్ని కోట్లు వ్యయమైపోతున్నా సమస్య అదేవిధంగా కొనసాగడం విశేషం.

# రైలు ఉంది.. స్టేషన్‌కు బస్సే లేదు




**హైదరాబాద్ (మనసులో మాట) జూలై 14:**

నగరంలోని సబర్బన్ రైల్వేస్టేషన్లకు నేరుగా ఆర్టీసీ బస్సు కనెక్టివిటీ లేకపోవడం ప్రయాణికులకు సమస్యగా మారింది. ప్రధాన రహదారులకు దూరంగా ఉండటంతో కిలోమీటర్ల మేర నడవాల్సి వస్తోంది. ఈ స్టేషన్ల నుంచి బస్సులు నడపాలన్న డిమాండ్ ఉన్నా ఇప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంపై ప్రయాణికుల సంఘాలు గుర్రుగా ఉన్నాయి. రైల్వేస్టేషన్ నుంచి మెట్రోస్టేషన్లకు లేదా బస్‌స్టాప్‌లకు మినీ బస్సులు, షటిల్ సర్వీసులు నడపాలని డిమాండ్ చేస్తున్నాయి.

**ఈ స్టేషన్లకు అవసరం..**

హైటెక్‌సిటీ స్టేషన్ ఈ స్టేషన్ ప్రధాన రహదారికి చాలా దూరంలో ఉంటుంది. ఐటీ కారిడార్‌లోని మైండ్‌స్పేస్, సైబర్ టవర్స్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వైపు వెళ్లడానికి రెగ్యులర్ సిటీ బస్సులు నేరుగా స్టేషన్ లోపలికి రావడం లేదు. ప్రయాణికులు ప్రైవేటు వాహనాలపై ఆధారపడాల్సి వస్తోంది.బోరబండ, భరత్‌నగర్ స్టేషన్లు: ఇవి నివాస ప్రాంతాల మధ్య ఉన్నాయి. ఇక్కడి నుంచి అంతర్గత కాలనీలకు, సమీప మెట్రోస్టేషన్లకు ఆర్టీసీ ఫీడర్ లేదా షటిల్ సర్వీసులు లేవు.ఫలక్‌నుమా, ఉందానగర్: పాతనగరం, శంషాబాద్ పరిసర ప్రాంతాల్లోని ఈ స్టేషన్ల నుంచి విమానాశ్రయం వైపు లేదా సమీప కాలనీలకు వెళ్లేందుకు నేరుగా నడిచే బస్సులు అరుదు.సనత్‌నగర్, జేమ్స్ స్ట్రీట్: పారిశ్రామిక ప్రాంతం, కమర్షియల్ హబ్‌లకు దగ్గరగా ఉన్నప్పటికీ నిరంతరంగా బస్సు సర్వీసులు లేవు.

# ఆషాఢ బోనాల

## జాతరకు సర్వం సిద్ధం



**హైదరాబాద్ (మనసులో మాట) జూలై 14:**

బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోందని హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జులై 16 నుంచి ఆగస్టు 13 వరకు జంటనగరాల్లో బోనాల ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో భక్తులకు అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. పాత జీహెచ్‌ఎంసీ పరిధిలోని 3,247 ఆలయాలకు రూ.15.05 కోట్లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు.ఆలయాల వద్దఅన్ని ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. బోనాల సందర్భంగా గోల్కొండ, ఉజ్జయిని మహంకాళి, చిలకలగూడ కట్టమైసమ్మపోచమ్మ, హరిబౌలిలోని అక్కన్నమాదన్న ఆలయం, కార్వాన్ దర్బార్ మైసమ్మ, లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి, చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం, మీరాలంమండి శ్రీమహంకాళి ఆలయాలతో పాటు దాదాపు 30 ప్రధాన ఆలయాల్లో ప్రభుత్వం తరఫున మంత్రులు, ముఖ్య నేతలు, అధికారులు పట్టువస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. నగరంలో ఆషాఢ మాసం బోనాల సందడి మొదలు కానుంది. తెలంగాణలోని ప్రఖ్యాత లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయానికి నిర్వాహకులు రంగులు వేసి ముస్తాబు చేస్తున్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు.

# అక్రమంగా తరలిస్తున్న

## 3 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



**తాండూరు గ్రామీణ (మనసులో మాట) జూలై 14:**

తాండూరు మండలం వీర్ శెట్టిపల్లిలోని కాగ్న నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణానికి చెందిన ఇమ్రాన్, వీరిశెట్టిపల్లికి చెందిన మరో ఇద్దరు వ్యక్తులు మూడు ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని కోనాపూర్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని నిందితులను అదుపులోకి తీసుకొని, వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

# దర్యాప్తును పరిగెత్తిస్తూ తప్పించుకునే దారులు మూసేస్తూ

- కీలక పాత్ర పోషిస్తున్న ఇన్వెస్టిగేషన్ మానిటరింగ్ సెల్

హైదరాబాద్ (మనసులో మాట) జూలై 14:



నగరంలో ఏటా 20 వేలకుపైగా కేసులు నమోదవుతున్నాయి. వాటితోపాటు పెండింగ్ కేసులు పెరిగిపోతున్నాయి. తగినంత సమయం లేకపోవడం, బందోబస్తుల కారణంగా పోలీసు అధికారులు దర్యాప్తుపై పూర్తిస్థాయి దృష్టి సారించలేకపోయేవారు. సాక్ష్యాల సేకరణలో విఫలమవడంతో నిందితులు తేలికగా తప్పించుకునేవారు. ఈ సమస్యను అధిగమించి నేరస్థులకు శిక్షలుపడేలా చేయాలనే సంకల్పంతో నగర సీపీ వీసీ సజ్జనర్ పర్యవేక్షణలో 'ఇన్వెస్టిగేషన్ మానిటరింగ్ సెల్' ఏర్పాటు చేశారు. దర్యాప్తు అధికారులకు అవసరమైన తోడ్పాటును అందించటం, సాంకేతిక ఆధారాల సేకరణలో సహకరించటం ద్వారా ప్రతి కేసునూ పకడ్బందీగా దర్యాప్తు చేసే వాతావరణం కల్పించారు. ఫలితంగా 6 నెలల వ్యవధిలో 2,469 కేసుల్లో నిందితులకు న్యాయస్థానాలు శిక్షలు ఖరారు చేశాయి. 18 కేసుల్లో నిందితులకు 20 ఏళ్లకు పైగా కారాగార శిక్షలు పడ్డాయి. 12 కేసుల్లో జీవితఖైదు, ఒక కేసులో ఉరిశిక్ష విధించారు. సనత్‌నగర్ ఠాణా పరిధిలో బాలుడి హత్య కేసులో నిందితుడికి మరణశిక్ష పడేందుకు అవసరమైన సాక్ష్యాలు, సాంకేతిక ఆధారాల సేకరణలో మానిటరింగ్ సెల్ చురుకైన పాత్ర పోషించింది. దర్యాప్తు పూర్తయి విచారణ ప్రారంభమైన తరువాత కేసులను సమర్థంగా పర్యవేక్షించేందుకు 'కోర్టు మానిటరింగ్'ను 'ఇన్వెస్టిగేషన్ మానిటరింగ్ సెల్' కట్టుదిట్టంగా అమలు చేస్తోంది. ప్రతి న్యాయస్థానానికి ప్రత్యేక లైజన్ ఆఫీసర్‌ను నియమించారు.

**అధికారులకు వెన్నుదన్ను**

బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగినపుడే పోలీసింగ్ వ్యవస్థకు సార్థకత చేకూరుతుందని సీపీ వీసీ సజ్జనర్ అన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు దర్యాప్తు అధికారులకు ఇన్వెస్టిగేషన్ మానిటరింగ్ సెల్ వెన్నుదన్నుగా నిలుస్తుందని స్పష్టంచేశారు. సంప్రదాయ పద్ధతులతోపాటు ఆధునిక శాస్త్రీయ ఆధారాలను మేళవించటం ద్వారా న్యాయస్థానాల్లో నేర నిరూపణ సాధ్యమవుతుందన్నారు. రాబోయే రోజుల్లో సాంకేతిక సవాళ్లను సమర్థంగా ఎదుర్కొంటూ శాంతిభద్రతలను పరిరక్షిస్తామని వివరించారు.

# పుర పాలకులకు.. ముడుపుల మరక!

- నిర్మాణాల పేరిట ప్రజాప్రతినిధుల అక్రమ దందా
- ఫిర్యాదు చేస్తే పదవికే ఎసరు

కామారెడ్డి (మనసులో మాట) జూలై 14:



ఇందిరమ్మ ఇంటి మంజూరుకు రూ.లక్ష డిమాండ్ చేస్తున్నాడంటూ రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల మున్సిపల్ వైస్ చైర్మన్‌పై ఓ మహిళ అక్కడి కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా పోలీసులు వైస్ ఛైర్మన్‌పై కేసు నమోదు చేశారు. అధికారులే కాదు.. ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు వసూళ్లకు పాల్పడినా ఫిర్యాదు చేయొచ్చని, అలాంటి వారిపై చర్యలు తప్పవని ఈ ఉదంతం రుజువు చేస్తోంది. జిల్లాలోని పురపాలికల్లోనూ కొందరు ప్రజాప్రతినిధులు పనులకు డబ్బులు దండుకుంటూ అవినీతికి పాల్పడుతున్నారు. ప్రజలకు నిస్వార్థంగా సేవ చేస్తామని ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిన కొందరు ప్రజాప్రతినిధులు.. చేయి తడపనిదే పనులు చేయడంలేదు. ప్రధానంగా పురపాలక సంఘాల్లోని కొందరు కౌన్సిలర్లు అధికారాన్ని అడ్డుపెట్టుకుని అడ్డగోలు వసూళ్లకు పాల్పడుతున్నారు. వెంచర్ల ఏర్పాటు, భవన నిర్మాణ అనుమతులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు తదితరాల్లో రూ.వేలల్లో దండుకుంటున్నారు. నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోతే ఇబ్బందులు ఎదురవుతాయని కొందరు యజమానులు.. ప్రజాప్రతినిధులు అడిగినంత ముట్టజెప్పుతున్నారు. తమపై ఎవరూ ఫిర్యాదు చేయబోరని, తమపై చర్యలు తీసుకునే అధికారం అధికారులకు ఉండదు అన్న ధోరణితోనే చాలా మంది రాజకీయ నాయకులు అమాయకుల నుంచి వసూళ్లకు తెగబడుతున్నారు. కానీ, అధికారులకు బాధితులు ఫిర్యాదు చేస్తే తమ పదవికి ఎసరు వస్తుందన్న విషయాన్ని గుర్తించకపోవడం గమనార్హం.

**సొమ్ములిస్తే సక్రమం..**

కొందరు భవన యజమానులు పురపాలికలో తీసుకున్న అనుమతుల ప్రకారం కాకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నారు. అడ్డుకోవాల్సిన ప్రజాప్రతినిధులు ముడుపులు తీసుకుని అక్రమ కట్టడాలకు వత్తాసు పలుకుతున్నారన్న విమర్శలున్నాయి. మొదట కౌన్సిలర్లు, తమ అనుచరులు యజమానుల వద్దకు వెళ్లి అక్రమంగా ఎలా నిర్మాణాలు చేపడతారని ప్రశ్నిస్తారు. తర్వాత డబ్బులు ఇవ్వగానే మిన్నకుండిపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందిస్తూ అక్రమ నిర్మాణాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. బాధితులు ఫిర్యాదు చేస్తే తమ కౌన్సిలర్ పదవి ప్రమాదంలో పడే అవకాశం ఉంటుందన్న విషయాన్ని గుర్తించాలని అభిప్రాయపడుతున్నారు.

**డబ్బులు ఇస్తేనే అనుమతి**

కామారెడ్డి పురపాలికలో ఓ వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణం చేపట్టారు. ఆయనను బెదిరించి కొందరు కౌన్సిలర్లు ఇటీవల రూ. లక్ష వరకు డబ్బులు వసూలు చేశారు. ఎల్లారెడ్డి పురపాలికలో ఓ వ్యక్తి అన్ని అనుమతులు తీసుకుని భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. వెంటనే అక్కడ వాలిపోయిన కౌన్సిలర్ రూ.20 వేలు డిమాండ్ చేశాడు. తర్వాత ఇబ్బందులు వస్తాయేమో అన్న బెంగతో ఆ యజమాని.. కౌన్సిలర్ అడిగినంత డబ్బు ముట్టజెప్పారు. నూతన పురపాలికగా ఏర్పడిన బిచ్కుందలో ఎన్నికైన కొందరు కౌన్సిలర్లు వసూళ్లకు తెరలేపారు. గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో జీ+1 నిర్మాణాలకు అనుమతులు తీసుకున్న యజమానులు ఇప్పుడు మరో అంతస్తులో నిర్మాణాలు చేపడుతున్నారు. తమకు డబ్బులు ఇస్తేనే అనుమతి ఇస్తామంటూ యజమానుల నుంచి రూ. 20 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారు. బాన్సువాడ పురపాలికలోని కొందరు కౌన్సిలర్లు సైతం కొన్ని వాణిజ్య భవనాల నిర్మాణాలకు ఎక్కువ మొత్తంలో డబ్బులు గుంజుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

# శబ్దం.. శ్రుతి తప్పుతోంది



జనగామ టౌన్ (మనసులో మాట) జూలై 14:

బుల్లెట్ బైకులతో ఇతర అత్యాధునిక ద్విచక్ర వాహనాలను ఇటీవల యువత ఎక్కువగా వాడుతున్నారు. అయితే కొందరు ఆకతాయి యువకులు తమ వాహనాలకు ఉన్న సైలెన్సర్లను తొలగించి, అనధికారికంగా బయట విపరీతమైన శబ్ద కాలుష్యం చేసే సైలెన్సర్లను వినియోగిస్తున్నారు. ఇటీవల జనగామ జిల్లా కేంద్రంలో పోలీసులు 40 మందికి చెందిన అనధికారికంగా బిగించుకున్న సైలెన్సర్లను స్వాధీనం చేసుకుని రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు.

**అనుమతించదగిన సామర్థ్యం..**

కేంద్ర రవాణా నిబంధనల ప్రకారం ద్విచక్ర వాహనాల నుంచి వచ్చే శబ్దం నిర్దేశిత డెసిబెల్ పరిమితి దాటకూడదు. సాధారణంగా ద్విచక్ర వాహనాల తయారీ కంపెనీలు అందించే సైలెన్సర్లు 80 డెసిబెల్ నుంచి 85 డెసిబెల్ లోపు ధ్వనిని మాత్రమే విడుదల చేస్తాయి. ద్విచక్ర వాహనాల రిజిస్ట్రేషన్ కంపెనీ ఫిట్ చేసిన సైలెన్సర్లు మాత్రమే చట్టబద్ధం. కానీ కొందరు అత్యాధునిక ద్విచక్ర వాహనాలు వాడే వారు షార్ట్ బాటిల్, ఇండోర్, పటాకా శబ్దాలు వచ్చేలా మార్కెట్లో అనధికారికంగా దొరుకుతున్న సైలెన్సర్లను బిగిస్తున్నారు. ఇవి 100 నుంచి 110 డెసిబెల్ ధ్వనిని విడుదల చేస్తాయి. దీంతో నివాస ప్రాంతాల్లో తీవ్రమైన అలజడితోపాటు వృద్ధులు, పిల్లలకు ఇబ్బందితో పాటు గుండె జబ్బులు ఉన్నవారికి గుండెపోటుకు దారితీసే ప్రమాదం ఉంది. అలాగే వాయు కాలుష్యంతో ప్రమాదకరమైన కార్బన్ మోనాక్సైడ్, హైడ్రో కార్బన్ల వంటి విష వాయువులను విడుదల చేస్తాయి. దీంతో గాలి విషపూరితంగా మారుతుంది.

**వాహనాలకూ నష్టమే..**

శబ్దం విపరీతంగా వచ్చే సైలెన్సర్లను వాడటం వల్ల వాహనాలకు కూడా తీవ్ర నష్టం ఏర్పడుతుంది. ఇంజిన్ దెబ్బతింటుంది. అందులో వాల్వ్‌లు త్వరగా పాడవుతాయి. మైలేజీ కూడా పడిపోతుంది. బుల్లెట్ వంటి బైకులకు ఈ అదనపు వేడి వల్ల త్వరగా ఆయిల్ చిక్కదనాన్ని కోల్పోతుంది.

**చట్టపరంగా కఠిన నిబంధనలు..**

అనధికారికంగా అధిక శబ్దాలను విడుదల చేసే సైలెన్సర్లను వినియోగిస్తూ పట్టుబడే వాహనదారులకు చట్టపరంగా భారీ జరిమానాలు విధిస్తున్నారు. తనిఖీల్లో మొదటిసారి పట్టుబడితే మోటారు వాహన చట్టం ప్రకారం రూ.1000 నుంచి రూ.2వేల వరకు జరిమానా విధిస్తారు. రెండోసారి అంతకంటే ఎక్కువగా పట్టుబడితే రూ.5వేల జరిమానా/3నెలల వరకు జైలుశిక్ష, లేకుంటే రెండూ విధించే అవకాశం ఉంది. అలాగే కొన్ని సందర్భాల్లో పోలీసులు అనధికారి సైలెన్సర్లను వాడే ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేస్తారు. సైలెన్సర్లను అక్కడికక్కడే తొలగించడమే కాకుండా వాటిని రోడ్డు రోలర్లతో తొక్కిస్తూ ధ్వంసం చేస్తున్నారు. ఈ విషయమై వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్ మాట్లాడుతూ.. నిబంధనలు ఉల్లంఘిస్తూ బైకులకు అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# శేరిలింగంపల్లిలో ఎస్ఐఆర్ వేగవంతం



**శేరిలింగంపల్లి (మనసులో మాట) జూలై 14:**

ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి వజ్రాయుధం. కానీ, ఆ ఓటరు జాబితాలో తప్పులుంటే? ఒకే వ్యక్తికి రెండు, మూడు చోట్ల ఓట్లు ఉంటే? ఇలాంటి అక్రమాలకు చెక్ పెడుతూ, అత్యంత పారదర్శకమైన, నిజమైన ఓటరు జాబితాను రూపొందించేందుకు ఎన్నికల సంఘం ఒక మహాక్రతువుకు శ్రీకారం చుట్టింది. అదే స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూ (సర్ - SIR). శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఈ 'సర్' ప్రక్రియ ప్రస్తుతం శరవేగంగా కొనసాగుతోంది. అసలు ఈ 'సర్' అంటే ఏమిటి? బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి ఏయే వివరాలు సేకరిస్తున్నారు? దశాబ్దాల క్రితం నాటి ఓట్ల వివరాలను ఎందుకు ఆరా తీస్తున్నారు, స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూ (Special Intensive Review) అనగా ఓటరు జాబితాను సమగ్రంగా, లోతుగా పరిశీలించి తప్పులు లేని పారదర్శక జాబితాను రూపొందించడం. శేరిలింగంపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అన్ని పోలింగ్ బూత్‌ల పరిధిలో ఈ కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. నకిలీ ఓటర్ల ఏరివేత, వలస వెళ్లిన వారి వివరాల తొలగింపు, అర్హులైన కొత్త ఓటర్ల నమోదు తదితర అంశాలను ఇందులో ప్రధానంగా పరిగణనలోకి తీసుకుంటున్నారు.

---

# ఆడిపాడిస్తూ.. అక్షరాలు నేర్పిస్తూ



**హైదరాబాద్ (మనసులో మాట) జూలై 14:**

నగరంలో సర్కారు బడుల్లో ప్రవేశాలు పెంచాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రీప్రైమరీ విభాగాలకు చిన్నారులు వచ్చేలా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. హైదరాబాద్ జిల్లాలోని 275 సర్కారు బడుల్లో ప్రీప్రైమరీ విభాగాలను ప్రారంభించి ఇన్‌స్ట్రక్టర్లను, ఆయాలను తాత్కాలికంగా నియమించనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక వారు పిల్లలకు ఆటపాటలతోపాటు తెలుగు, ఇంగ్లిష్ పదాలను నేర్పనున్నారు. గతేడాది 28 పాఠశాలల్లో ప్రీప్రైమరీ సెక్షన్లను ప్రారంభించగా.. పదుల సంఖ్యలో చిన్నారులు చేరారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాలు విద్యార్థులతో ఉండి.. మధ్యాహ్నం భోజనం తినిపించి ఇళ్లకు పంపుతున్నారు. రాజ్‌భవన్, చిలకలగూడ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగడంతో సెక్షన్లను కూడా పెంచారు. ప్రీప్రైమరీ విభాగాల బాధ్యత పూర్తిగా ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాలదేనని విద్యాశాఖ అధికారులు వారికి స్పష్టం చేశారు. ఇన్‌స్ట్రక్టర్‌కు రూ.8వేలు, ఆయాకు రూ.6 వేల జీతం నిర్ణయించారు. వీరు ఉదయం 7.45 గంటలకు బడులకు రావాలని, పిల్లలు వచ్చేలోపు ఆటవస్తువులు, పెన్నులు, పెన్సిళ్లు సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. తెలుగు, ఆంగ్ల పద్యాలు, పాటలను వారితో పాడిస్తూ.. అక్షరాలు నేర్పిస్తూ.. బడిలో ఉన్నామన్న ఆలోచన చిన్నారులకు రాకుండా చూసుకోవాలని ఉన్నతాధికారుల సూచించారు.

# రేవంత్ రెడ్డిది అవగాహన లేని పాలన.. సీఎం వ్యాఖ్యలపై ఈటల ఫైర్

**హైదరాబాద్ (మనసులో మాట) జూలై 14:**



సీఎం రేవంత్ రెడ్డి తనపై చేసిన విమర్శలకు బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఘాటుగా సమాధానమిచ్చారు. రేవంత్ రెడ్డి నీచమైన భాషను పక్కనపెట్టి రాష్ట్రంలో సాగునీరు, తాగునీరు అందించే చర్యలపై దృష్టి సారించాలని హితవు పలికారు. కేవలం వార్తా పత్రికల్లో హెడ్‌లైన్స్ కోసం, రాజకీయ కోణంలో మాట్లాడే అలవాటును సీఎం మానుకోవాలని ఆయన మండిపడ్డారు. సుందిళ్ల, అన్నారం బ్యారేజీలకు 2024లోనే మరమ్మతులు పూర్తయినట్లు జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ (NDSA) నివేదిక స్పష్టం చేస్తోందని ఈటల గుర్తుచేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, తాగునీటి ఎద్దడి కూడా తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఎన్డీఎస్ఏ నివేదికను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం వెంటనే సుందిళ్ల, అన్నారం బ్యారేజీల్లో నీటిని నిల్వ చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. చిత్తశుద్ధి ఉంటే 'ఎల్ నినో' ప్రభావంపై సీఎం వెంటనే ఇంజనీర్లతో అత్యవసర సమావేశం నిర్వహించాలని సూచించారు.ఖిలాడీ ఎవరో తెలంగాణ సమాజమే తేలుస్తుంది!: బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులతో కూడిన "ఖిలాడీ కమిటీ"లో ఈటల చేరారంటూ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా ధ్వజమెత్తారు. అసలైన 'ఖిలాడీ' ఈటల రాజేందరా లేక రేవంత్ రెడ్డా అనేది తెలంగాణ సమాజమే నిర్ణయిస్తుందని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై స్పందిస్తూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అక్కడ అవినీతి జరిగినట్లు రుజువైతే, బాధ్యులపై చట్టపరంగా తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అంతేకానీ దానిని రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవద్దని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.

# యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ నిర్మాణ పనుల్లో జాప్యం..డీజీపీ ఆగ్రహం

- తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేసిన డీజీపీ సీవీ ఆనంద్
- నిర్లక్ష్యం, ఆలస్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరిక
- మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం
- దేశంలోనే ఆదర్శ విద్యాసంస్థగా తీర్చిదిద్దాలి
- పరిపాలన బలోపేతానికి వివిధ కమిటీల ఏర్పాటు
- డీజీపీ అధ్యక్షతన స్కూల్ సొసైటీ కమిటీ సమీక్ష సమావేశం

**హైదరాబాద్ సిటీబ్యూరో (మనసులో మాట) జూలై 14:**

ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ నిర్మాణ పనుల్లో జాప్యంపై డీజీపీ సీవీ ఆనంద్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం, ఆలస్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులను ఆయన కఠినంగా ఆదేశించారు. ప్రతి పనిని నిరంతరం పర్యవేక్షిస్తూ నాణ్యతతో పాటు వేగానికి కూడా అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దేశంలోనే తొలిసారిగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక విద్యాసంస్థలో పోలీస్ కుటుంబాల పిల్లలతో పాటు సాధారణ కుటుంబాల పిల్లలకు కూడా ప్రపంచ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో అత్యాధునిక మౌలిక వసతులు, బోధనా విధానాలు, విలువలతో కూడిన విద్య, క్రీడలు, సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యత కల్పిస్తూ విద్యాబోధన కొనసాగుతోంది. ఈమేరకు సోమవారం తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా మంచిరేవుల గ్రామంలో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ (వైఐపీఎస్) అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు, మౌలిక వసతుల విస్తరణ, భవిష్యత్ కార్యాచరణపై డీజీపీ, యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ సొసైటీ అధ్యక్షుడు సీవీ ఆనంద్ అధ్యక్షతన సొసైటీ కమిటీ సమావేశం జరిగింది. పాఠశాల రెండో విద్యా సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఇప్పటివరకు సాధించిన పురోగతిపై డీజీపీ ఆరా తీశారు. 202526 విద్యా సంవత్సరంలో 345 మంది విద్యార్థులు అడ్మిషన్ తీసుకోగా, 202627 విద్యా సంవత్సరానికి 360 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందినట్లు అధికారులు వివరించారు. గత విద్యా సంవత్సరంలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు తరగతులు నిర్వహించగా, ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఆరో తరగతిని ప్రారంభించారు. ప్రస్తుతం నర్సరీ నుంచి ఆరో తరగతి వరకు బోధన కొనసాగుతున్న ఈ పాఠశాలలో 202627 విద్యా సంవత్సరంలో మొత్తం 360 మంది విద్యార్థుల్లో 184 మంది పోలీస్ కుటుంబాలకు చెందినవారు, 176 మంది నాన్‌పోలీస్ కుటుంబాలకు చెందినవారు ఉన్నట్లు సమావేశంలో వెల్లడించారు. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో అందిస్తున్న



నాణ్యమైన విద్యపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి ఇది నిదర్శనమని సభ్యులు అభిప్రాయపడ్డారు. పాఠశాల విస్తరణలో భాగంగా నూతనంగా 17 తరగతి గదులతో కూడిన నూతన అకాడమిక్ బ్లాక్ నిర్మాణ నమూనాను డీజీపీకి వివరించారు. అనంతరం డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను దేశంలోనే అత్యుత్తమ విద్యాసంస్థలలో ఒకటిగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, నైతిక విలువలు, సామాజిక బాధ్యత, సృజనాత్మకతను పెంపొందించేలా ప్రపంచ స్థాయి విద్యను అందించాలని పేర్కొన్నారు. విద్యతో పాటు అత్యాధునిక మౌలిక వసతులు, సురక్షితమైన విద్యా వాతావరణం, ఆధునిక బోధనా పద్ధతులను కల్పించడంతో పాటు క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని డీజీపీ సూచించారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో శారీరక, మానసిక దృఢత్వం, క్రమశిక్షణ పెంపొందడంతో పాటు మాదకద్రవ్యాలు వంటి సామాజిక దురలవాట్లకు దూరంగా ఉండే అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.

# అనుకున్నంతా అయ్యింది



- మూడు పాల శీతలీకరణ కేంద్రాలు మూసివేత

**ఖమ్మం వ్యవసాయం (మనసులో మాట) జూలై 14:**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ రంగ సంస్థ విజయ డెయిరీ మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. డెయిరీని బలోపేతం చేస్తామని రాష్ట్ర స్థాయి అధికారులు ప్రకటనలు చేస్తున్నా అందుకు విరుద్ధంగా అడుగులు పడుతున్నాయి. ఖమ్మం జిల్లాలోని కల్లూరు, కామేపల్లి, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం మినీ పాల శీతల కేంద్రాల(బీఎంసీయూ)ను రద్దు చేస్తూ తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ జనరల్ మేనేజర్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. వీటిలో కల్లూరులో రోజుకు 500 లీటర్లు, కొత్తగూడెంలో 400 లీటర్లు, కామేపల్లిలో 400 లీటర్ల పాల సేకరణ చేస్తున్నారు. మినీ కేంద్రాల మూసివేతతో దశాబ్దాల తరబడి వీటిపై ఆధారపడిన పాడి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది.

**ఏడులో ఐదు ఖతం..**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొత్తం 7 మినీ పాలశీతల కేంద్రాలు(బీఎంసీయూ) ఉన్నాయి. వీటిలో ఇప్పటికే రోజుకు 500 లీటర్ల పాల సేకరణ మూసివేశారు. తాజాగా రద్దు చేసిన వాటితో కలిపి వీటి సంఖ్య ఐదుకు చేరింది. ఎర్రుపాలెం బీఎంసీయూను ఇందిరా డెయిరీ మహిళాశక్తి సంఘానికి కేటాయించారు. ఇప్పుడు ఖమ్మంలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాలో ఇల్లెందు బీఎంసీయూలు మాత్రమే మిగిలాయి. వీటిలో ఖమ్మంలో రోజుకు 1,500 లీటర్లు, ఇల్లెందులో 500 లీటర్ల పాల సేకరణ జరుగుతోంది.

**పొంతన లేని మాటలు..**

పాడి రైతులకు ఉపయోగకరంగా ఉన్న బీఎంసీయూలను రద్దు చేసి, భవిష్యత్తులో విజయ డెయిరీని బలోపేతం చేస్తామని అధికారులు ప్రకటించటం పట్ల రైతులు ఆగ్రహంగా ఉన్నారు. బీఎంసీయూల రద్దుతో ప్రత్యామ్నాయం లేక ప్రైవేటు డెయిరీలను రైతులు ఆశ్రయిస్తారు. అలాంటప్పుడు డెయిరీని ఎలా అభివృద్ధి చేస్తారో అధికారులకే తెలియాలి. బీఎంసీయూల మూసివేతతో డెయిరీ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని, జిల్లాకు చెందిన మంత్రులు జోక్యం చేసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# అక్రమాలు కొండంత.. వసూళ్లు గోరంత

- ఉపాధి హామీ పనుల్లో అవినీతి
- సామాజిక తనిఖీలో వెల్లడి

**పాల్వంచ గ్రామీణం (మనసులో మాట) జూలై 14:**

వలసలు తగ్గించి, పనులు కల్పించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఈజీఎస్ పనులు కొందరు అక్రమార్కులకు వరంగా మారాయి. కొందరు క్షేత్రసహాయకులు కూలీలు పనులకు రాకున్నా వచ్చినట్లు హాజరు వేసుకొని కూలీల నుంచి డబ్బులు వసూల్ చేస్తున్నారు. ఇంకొందరు పనులు చేసినా హాజరు వేయకపోవడంతో చాలా మంది నష్టపోయారు. నిబంధనల ప్రకారం పనులు చేయకుండా సోషల్ ఆడిట్‌లో అడ్డంగా దొరికిపోయారు. అన్నపురెడ్డిపల్లి మండలంలో రూ.లక్షలు వెచ్చించి పెంచిన మొక్కల్లో 30 శాతం మొక్కల్లేవని సామాజిక తనిఖీ బృందం ఇటీవల తేల్చింది. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేశారని ఈజీఎస్ సిబ్బందిపై రూ.4 వేలు రికవరీకి అధికారులు ఆదేశించారు.
పాల్వంచ మండలంలోని బంద్రుగొండ పంచాయతీలో చనిపోయిన వారి పేర్లతో, ఊర్లో లేని వారి పేర్లతో నిధులు కాజేశారని సామాజిక తనిఖీ బృందానికి గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. కొందరు పనులు చేయకున్నా చేసినట్లు మస్టర్లు సృష్టించారని తెలిపారు. గతేడాది సుమారు రూ.40 వేలు రికవరీకి ఆదేశించారు.

**నోటీసులు ఇస్తూ..**

202526 సంవత్సరంలో జిల్లాలో రూ.70,97,016 నిధులు దుర్వినియోగమైనట్లు తేల్చారు. కానీ వీటికి ఇంకా బాధిత అధికారులు ఆధారాలు సమర్పిస్తున్నారు. ఈ ప్రక్రియ అనంతరం కలెక్టర్ నుంచి రాష్ట్ర స్థాయికి వెళ్తే అక్కడ పరిశీలించి రికవరీ చేయనున్నారు. వీటిల్లో రూ.లక్షల్లో తేలే అవకాశముంది. దీనిపై ఈజీఎస్ అధికారులు మాట్లాడుతూ.. దుర్వినియోగం చేసిన అధికారులకు నోటీసులు ఇచ్చామని, వీరి నుంచి రికవరీ చేస్తున్నామన్నారు.



**2025-26లో ఉపాధి హామీ సామాజిక తనిఖీ వివరాలు (రూ.లలో):**

అక్రమాలు జరిగినట్లు తేల్చిన నగదు: 2,20,85,359
ఆధారాల సమర్పణ తర్వాత తేలింది: 66,09,640
రికవరీ సొమ్ము: 16,48,440
ఇంకా రావల్సిన మొత్తం: 49,61,200

**జిల్లాలో:**

జాబ్ కార్డులు: 2,22,471
కూలీల సంఖ్య: 4,43,901
క్రియాత్మక కార్డులు: 1,30,789
పనుల్లో పాల్గొన్న కూలీలు: 2,16,686

**రికవరీలో వెనుకబాటు:**

కూలీలు ఎర్రటి ఎండల్లో సరైన వసతులు లేకున్నా పనులు చేశారు. కానీ కొందరు అధికారుల తప్పిదాలు, మస్టర్ల తప్పులతో కూలీలు నష్టపోయారు. సోషల్ ఆడిట్ అధికారులు (ఎస్సార్పీ, డీఆర్పీలు) గ్రామీణ ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిల్లో తనిఖీలు నిర్వహించి నిజాలను నిగ్గు తేల్చినప్పటికీ రికవరీల్లో వెనుకబడ్డారు. నాలుగేళ్లలో రూ.66 లక్షలు అక్రమం జరిగినట్లు గుర్తించినా కేవలం రూ.16 లక్షలు మాత్రమే వసూళ్లు చేయడం గమనార్హం.

# మత్తు సూదిమందు విక్రయ ముఠా గుట్టురట్టు



**ఆదిలాబాద్ నేర విభాగం (మనసులో మాట) జూలై 14:**

వైద్యులు శస్త్ర చికిత్సల సమయంలో ఉపయోగించే మత్తు సూదిమందు విక్రయ ముఠా గుట్టును ఆదిలాబాద్ పోలీసులు రట్టు చేశారు. ఎస్పీ అఖిల్ మహాజన్ సోమవారం రాత్రి పాత్రికేయులకు వివరాలు వెల్లడించారు. గంజాయి తదితర మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారిన వారికి ఈ ముఠా మత్తు మందు సీసాలు, సిరంజీలను సరఫరా చేస్తోందన్నారు. ఆదివారం రాత్రి ఆర్టీసీ బస్టాండ్ వద్ద పోలీసులను చూసి ఆర్ఎంపీ వైద్యుడు షిండె జగన్నాథ్ ద్విచక్ర వాహనంపై పారిపోయేందుకు యత్నించారు. పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా ముఠా గుట్టు వెలుగులోకి వచ్చిందన్నారు. నిందితులు మెడికల్ ఏజెన్సీల నుంచి రూ.390 ధర ఉన్న సూది మత్తు మందును కొని రూ.1,500 వరకు విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో తేలిందన్నారు.ఈ వ్యవహారంలో ఆదిలాబాద్ పట్టణం శాంతినగర్‌కు చెందిన ఆర్ఎంపీ వైద్యుడు షిండె జగన్నాథ్, జగదాంబ ఫార్మసీ, సర్జికల్స్ యజమాని రమేష్‌గౌడ్, పాత బస్టాండ్‌లోని గెట్‌వెల్ మెడికల్ యజమాని సయ్యద్ ఖమర్‌ఉద్దీన్, ముషారఫ్(ప్రస్తుతం జైలులో ఉన్నాడు), సమీర్, ఇర్ఫాన్‌ఖాన్, ముఖీద్‌లపై కేసులు నమోదు చేశారు. నిందితులు షిండె జగన్నాథ్, సయ్యద్ ఖమర్‌ఉద్దీన్‌లను అరెస్టు చేశామన్నారు. వారి నుంచి 190 ఇన్సులిన్ సిరంజీలు, 50 మత్తు మందు సీసాలు, ద్విచక్రవాహనం, రెండు చరవాణులు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో నలుగురి కోసం గాలిస్తున్నామన్నారు. ఈ కేసును ఛేదించిన డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, టూటౌన్ ఇన్‌స్పెక్టర్ కే.నాగరాజు, ఎస్ఐలు అఖిల్, ప్రణయ్‌కుమార్‌లను ఎస్పీ అభినందించారు.

# రైల్వే స్టేషన్‌ను సందర్శించిన డీఆర్ఎం



**కారేపల్లి (మనసులో మాట) జూలై 14:**

ఖమ్మం జిల్లాలోని కారేపల్లి రైల్వే స్టేషన్‌ను డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్ఎం) గోపాలకృష్ణ సందర్శించారు. అక్కడ జరుగుతున్న రైల్వే రెండో లైన్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు అందుతున్న సేవలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. గతంలో రద్దైన రైళ్లను పునరుద్ధరించాలని గ్రామస్థులు ఈ సందర్భంగా ఆయనను కోరారు.

# ఆక్రమించి అద్దెకిచ్చారు

- బీదర్ చౌరస్తాలో యథేచ్ఛగా భూదందా

**జహీరాబాద్ (మనసులో మాట) జూలై 14:**

జహీరాబాద్ శివారులోని బీదర్ చౌరస్తా పరిసరాల్లో భూముల విలువలు భారీగా పెరిగాయి. ముంబయిహైదరాబాద్ జాతీయ రహదారి, బీదర్‌హైదరాబాద్ ప్రధాన రహదారులు అనుసంధానమైన ఈ కూడలి, పరిసర ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. దీంతో కొందరు అక్రమార్కులు రహదారి పక్కన, లోపలి వైపున్న ప్రభుత్వ స్థలాలపై కన్నేశారు. షెడ్లు నిర్మించి.. దర్జాగా వ్యాపారాలు చేసుకుంటూ జేబులు నింపుకొంటున్నారు. కొన్ని షెడ్లను వ్యాపారాల నిర్వహణకు అద్దెకిచ్చారు. ఈ రహదారి మీదుగా నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు రాకపోకలు సాగిస్తున్నా.. ఆక్రమణలు పట్టించుకోవడం లేదనే విమర్శ లొస్తున్నాయి. క్రమంగా ప్రభుత్వ స్థలాలు కనుమరుగవుతున్నాయి.



**కళ్లెదుటే పరాధీనమవుతున్నా పట్టింపేది?**

మహీంద్రా పరిశ్రమ ప్రహరీ నుంచి కాశీంపూర్‌నకు వెళ్లే మార్గంలో నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమి ఉండేది. ఇందులో కొంత భాగంలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించారు. ఇంకొంత భాగంలో పేదలు గుడిసెలు వేసుకున్నారు. మిగతా ఖాళీ స్థలాన్ని కొందరు క్రమంగా ఆక్రమించుకుంటున్నారు. ప్రధాన రహదారి వెంట ఉన్న ఈ స్థలంలో కొందరు తాత్కాలిక రేకుల షెడ్లతో మడిగెలు నిర్మించారు. వాటిని అద్దెకిచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. మరికొందరు ఆక్రమించుకున్న స్థలాలను లీజుకిచ్చారు. కాశీంపూర్ రహదారికి ఇరువైపులా ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి.

**ఇకనైనా అధికారులు దృష్టి సారించాలి**

ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో పలు డివిజనల్ స్థాయి ప్రభుత్వ కార్యాలయాలు జహీరాబాద్ పట్టణంలోని ఇరుకైన అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఇప్పటికే బీదర్ చౌరస్తాకు సమీపంలో ఆబ్కారీ శాఖ, పశుసంవర్ధక శాఖ డివిజనల్ కార్యాలయాలు ఉన్నాయి. ఇక్కడి ఆక్రమణలు పూర్తిగా తొలగించి మరికొన్ని ప్రభుత్వ కార్యాలయాలు నిర్మిస్తే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని పలువురు సూచిస్తున్నారు.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం**

బీదర్ చౌరస్తాలో ఆక్రమణలపై గతంలో ఫిర్యాదులు వచ్చాయి. త్వరలోనే అధికారులతో పూర్తిస్థాయి విచారణ చేయిస్తాం. నివేదిక ఆధారంగా ఆక్రమణలకు అడ్డుకట్ట వేస్తాం. ప్రభుత్వ స్థలాలను కాపాడుతాం.

## కళ్లకు గంతలు కట్టుకుని వినూత్న నిరసన



**సంగారెడ్డి గ్రామీణం (మనసులో మాట) జూలై 14:**

మైక్రో బాక్స్ ఫ్యాక్టరీలో విధుల నుంచి తొలగించిన తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కార్మికులు వినూత్నంగా నిరసన తెలిపారు. సంగారెడ్డిలో సీఐటీయూ ఆధ్వర్యంలో వారు కళ్లకు గంతలు కట్టుకుని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. తమ తప్పు లేకున్నా విధుల నుంచి తొలగించడం అన్యాయమని, ఎనిమిది నెలలుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామని సీఐటీయూ నాయకులు హెచ్చరించారు.

## సిబ్బంది చేతివాటం చెల్లదిక



**హైదరాబాద్ (మనసులో మాట) జూలై 14:**

పేదల కార్పొరేట్ ఆసుపత్రిగా పేరొందిన నిమ్స్‌లో రోగుల సేవల్లో జరుగుతున్న జాప్యం.. సిబ్బంది నిర్లక్ష్య ధోరణిపై చర్యలు షురూ అయ్యాయి. ఇప్పటికే నిమ్స్‌లో ఓ ఔషధ దుకాణ నిర్వాహకుడి ఆగడాలపై డైరెక్టర్ ప్రొఫెసర్ రాహుల్‌దేవ్‌రాజ్ దృష్టిపెట్టారు. తర్వాత రోగులకు అందుతున్న సేవలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఇప్పటికే ప్రకటించిన ఆయన తాజాగా తీరు మార్చుకోని ఓ ఉద్యోగిపై చర్యలకు ఉపక్రమించారు. రోగుల పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించడంతో సదరు ఉద్యోగిని వారంపాటు విధులకు దూరంగా ఉండాలని ఆదేశించారు. నిమ్స్ అత్యవసర విభాగంలో పడక దొరకాలంటే గగనమే. నిరంతం వచ్చే అత్యవసర కేసుల్లో 30 శాతం వెనక్కి వెళుతుంటారు. ఇక్కడ 100 పడకలున్నా వివిధ కారణాలతో అత్యవసర రోగులకు వైద్యం అందక ఇబ్బందులు తప్పడం లేదు. ఎన్నిసార్లు చర్యలు తీసుకుంటున్నా పరిస్థితి మొదటికే వస్తోంది. పడకలు లభించక స్ట్రెచర్లపై పెట్టి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో నిరంతర పర్యవేక్షణతో వెనక్కి పంపే కేసులను 5 శాతానికి తగ్గించారు. అత్యవసర విభాగానికి వచ్చిన రోగుల పరిస్థితి కొంత కుదుటపడ్డాక వెంటనే ఆయా విభాగాలకు తరలించి ఇక్కడ పడకలు ఖాళీగా ఉండేలా చర్యలు తీసుకున్నట్లు డాక్టర్ రాహుల్‌దేవ్‌రాజ్ తెలిపారు. అత్యవసర పడక కోసం వచ్చిన వారిని తిరిగి పంపకుండా చేర్చించుకునేలా ప్రణాళిక తయారు చేస్తున్నట్లు తెలిపారు.

## అనుమతి కొమ్మలకైతే.. తొలగించేది వృక్షాలనే..!



- అనుమతి కొమ్మలకైతే.. తొలగించేది వృక్షాలనే..!

**తూప్రాన్, శివ్వంపేట, (మనసులో మాట) జూలై 14:**

శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్క వద్ద ప్రధాన రహదారిపై భారీ వృక్షాలతో విద్యుత్తు తీగలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, కేవలం కొమ్మలను తొలగించడానికి గుత్తేదారుకు పని అప్పగించారు. సదరు గుత్తేదారు నిబంధనలను ఉల్లంఘించి యంత్రాలతో వాటిని నరికివేయించాడు. లారీలలో తరలించి విక్రయించేశాడు. ప్రధాన రహదారిపై ఇంత తతంగం జరుగుతున్నా పట్టించుకునే వారే కరవయ్యారు. తూప్రాన్ మండల పరిషత్ కార్యాలయం సమీపంలో 20 ఏళ్ల కింద నాటిన మొక్కలు పెరిగి పచ్చదనం సంతరించుకుంది. సదరు కార్యాలయంలో కోర్టు భవనం ఏర్పాటు చేస్తుండగా, అడ్డంగా ఉన్న కొమ్మలను తొలగించాలని ఓ గుత్తేదారుకు పని అప్పగించారు. 15 రోజుల కిందట గుత్తేదారు భారీ వృక్షాలను నామరూపాలు లేకుండా నరికేసి, సామిల్లుకు తరలించారు. అధికారులు మాత్రం మాకేమీలే అన్నట్లుగా వ్యవహరించారు. జిల్లాలో పచ్చదనంపై అక్రమార్కుల గొడ్డలి వేటు పడుతోంది. గతంలో ఎప్పుడో నాటిన విత్తనాలు పెరిగి భారీ వృక్షాలుగా ఎదిగాయి. నలుగురికి నాలుగు రకాలుగా ఉపయోగపడుతున్న ఆ చెట్లపై అక్రమార్కుల కన్ను పడింది. కొందరు రహస్యంగా రాత్రివేళ నరికేస్తుండగా మరికొందరు పట్టపగలే నామరూపాలు లేకుండా చేస్తున్నారు. ప్రధాన రహదారులు, పొలాల వద్ద ఏళ్ల నాటి చెట్లను యంత్రాలతో కోస్తూ అక్రమంగా వ్యాపారం చేస్తున్నారు. పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా పచ్చని చెట్లపై వేటు వేస్తున్నారు.

**అడ్డంగా ఉన్నాయన్న సాకుతో..**

ప్రధాన రహదారుల వెంట కరెంట్ తీగలకు భారీవృక్షాల కొమ్మలు తగిలి తెగిపోతుంటాయి. గాలిదుమారం వీచినప్పుడల్లా విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. అందుకే ఏటా వర్షాకాలం ముందు కొమ్మలు తొలగిస్తుంటారు. ఈ పనిని గుత్తేదారులకు అప్పగిస్తుంటారు. కూలీలను నియమించి గొడ్డళ్లతో వాటిని నరికివేయించాలన్నది నిబంధన. కానీ గుత్తేదారులకు ఇవేమీ పట్టవు. ఏకంగా చెట్లనే నేలకూలుస్తున్నారు. కొందరు నాయకులు అండగా ఉంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇందుకు మరో కారణం.

**సమన్వయలేమి..**

ప్రధాన రహదారుల వెంట ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలంటే అటవీ అధికారుల అనుమతి తప్పనిసరి. కానీ ఇరు శాఖల మధ్య సమన్వయలేమితో చెట్లు నేలకూలుతున్నాయి. పలువురు అటవీ అధికారులు కలప వ్యాపారులతో కలిసి ఇదంతా చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సామిళ్ల యజమానుల వద్ద వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.